ప్రతి గురువారం సాక్షితో ఉచితం 2-8-2012

Online Edition
www.sakshieducation.com/bhavitha.aspx

సాక్షి

# భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

Sakshi Bhavita TV Program on Facebook facebook.com/sakshibhavita




డీఎస్సీకి..25 రోజుల గడువు మాత్రమే మిగిలి ఉంది.. అందుబాటులో ఉన్న ఈ సమయంలో.. తుది అడుగులు పకడ్బందీగా ఉంటేనే లక్ష్యాన్ని విజయ వంతంగా ఛేదించవచ్చు. ఈ నేపథ్యంలో అభ్యర్థులు అనుసరించాల్సిన వ్యూహాలు..

2

## CAMPUS Placements



క్యాంపస్ ప్లేస్‌మెంట్స్.. ఎలాంటి స్కిల్స్ ఉన్న విద్యార్థులకు కంపెనీలు జాబ్ ఆఫర్ చేస్తున్నాయి.. రిక్రూట్‌మెంట్‌లో సబ్జెక్ట్ నాలెడ్జ్‌కు ప్రాధాన్యత ఇస్తున్నాయా? స్కిల్స్‌కు పెద్ద పీట వేస్తున్నాయా? వంటి అంశాలతో రాష్ట్ర వ్యాప్తంగా ఈ విద్యా సంవత్సరంలో జరిగిన 'క్యాంపస్ రిక్రూట్‌మెంట్' తీరుపై విశ్లేషణ...

3

4 స్వల్పకాలిక కోర్సులు.. స్వయం ఉపాధికి మార్గాలు

6 ఐఐటీ, నిట్‌లలో ప్రవేశానికి నిర్వహించే జేఈఈ పరీక్షపై అనాలిసిస్

7 నీట్+ఇంటర్మీడియెట్ జాయింట్ ప్రిపరేషన్

గ్రూప్-1 మెయిన్స్
ఇంపార్టెంట్ కొశ్చన్స్
టిప్స్ టు స్కోర్ మోర్
హిస్టరీ-ఎకానమీ

8,9

## CAT 2012



ప్రతిష్టాత్మక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)ల నుంచి పీజీ డిగ్రీ పూర్తి చేస్తే అవకాశాలకు ఆకాశమే హద్దు. ఇలాంటి ఇన్‌స్టిట్యూట్‌లలో ప్రవేశం పొందాలంటే మాత్రం కామన్ అడ్మిషన్ టెస్ట్ (క్యాట్)ను విజయవంతంగా దాటాలి. క్యాట్-2012 నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో..ప్రిపరేషన్ వ్యూహాలు.

5



ప్రతి ఆదివారం ఉదయం 9-30 నుంచి 10గంటల వరకు.. మీ సాక్షి టీవీలో

మీరు ఉద్యోగావకాశాల కోసం ఎదురు చూస్తున్నారా? ఏపీపీఎస్సీ గ్రూప్స్, సివిల్స్, బ్యాంక్స్ వంటి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారా? అయితే సాక్షి భవిత టీవీ ప్రోగ్రాం చూడండి

సాక్షి SAKSHI TV

వివిధ రంగాల్లో ఉపాధి.. కెరీర్ ఎంపికలో మెలకువలు.. తాజా ఉద్యోగాల సమాచారం.. అడ్మిషన్ల వివరాలు.. విద్యా సమాచారం.. స్కాలర్‌షిప్పుల వివరాలు... ఇంకా మరెన్నో...

భవిత

కెరీర్ ఎంపికలో దిక్సూచి.. భవిత! ఇకపై మీ సాక్షి టీవీలో
ప్రతి ఆదివారం ఉదయం 9-30 నుంచి 10గం.. వరకు



# డీఎస్సీ.. తుది అడుగులు ఇలా..

**ఆంధ్రా సివిల్స్‌గా వ్యవహరించే డీఎస్సీ.. నిర్వహణకు రంగం సిద్ధమైంది.. వివిధ కేటగిరీల్లో కలిపి భర్తీ చేయనున్న మొత్తం 21,343 పోస్టులకు దాదాపు.. మూడున్నర లక్షల మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు.. టెట్ స్కోర్‌కు వెయిటేజీ.. సిలబస్‌లో మార్పులు చేర్పులు.. వెరసి నూతన విధానంలో నిర్వహించే డీఎస్సీకి.. 25 రోజుల గడువు మాత్రమే మిగిలి ఉంది.. అందుబాటులో ఉన్న ఈ సమయంలో.. తుది అడుగులు పకడ్బందీగా ఉంటేనే లక్ష్యాన్ని విజయవంతంగా ఛేదించ వచ్చు. ఇందుకోసం అభ్యర్థులు అనుసరించాల్సిన వ్యూహాలు..**



నూతన విధానంలో టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్)కు వెయిటేజీ ప్రకారం 20 మార్కులు కేటాయిస్తుండడంతో.. డీఎస్సీని 80 మార్కులకే పరిమితం చేశారు (గతంలో 100 మార్కులు ఉండేవి). మొత్తం 160 ప్రశ్నలు ఉంటాయి. ఒక్కొక్క ప్రశ్నకు అర మార్కు కేటాయించారు. పరీక్ష సమయాన్ని కూడా రెండున్నర గంటలకు (150 నిమిషాలు) కుదించారు. అంతే స్థాయిలో సిలబస్‌లో మార్పులు చేశారు.

## పోటీ తీవ్రత ఇలా:

డీఎస్సీ దరఖాస్తు చేసుకున్న వివరాలను పరిశీలిస్తే..నోటిఫికేషన్‌లో ప్రకటించిన స్కూల్ అసిస్టెంట్ ఖాళీలు 5,695. వీటి కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సంఖ్య 3,35,004. అంటే ఒక్క పోస్టుకు సగటున 59 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. కేవలం డీఈడీ అభ్యర్థులనే ఎస్‌జీటీ పోస్టులకు అర్హులుగా పేర్కొనడంతో ఈ పోస్టులకు పోటీ పడేవారి సంఖ్య గణనీయంగా తగ్గింది. 11,602 పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సంఖ్య 41,716. అంటే ఒక్క పోస్టుకు సగటున 3.6 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఈ వివరాలను బట్టి డీఈడీ అభ్యర్థులు కొద్దిగా కష్టపడితే ఉద్యోగం ఖాయం. స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు మాత్రం సబ్జెక్ట్, జిల్లాల వారీగా విపరీతమైన పోటీ నెలకొంది.

## సిలబస్‌లో మార్పులు:

డీఎస్సీ ఎగ్జామ్ ప్యాట్రన్‌లో పలు మార్పులు చోటు చేసుకున్నాయి. సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్‌జీటీ), స్కూల్ అసిస్టెంట్(ఎస్ఏ) రెండు విభాగాల్లోనూ సిలబస్ పరంగా చాలా మార్పులు చేశారు. కొత్తగా కొన్ని విభాగాలను ప్రవేశపెట్టగా.. మరికొన్నింటిని తొలగించారు. గతంలో ఎస్‌జీటీకి సంబంధించి జనరల్ నాలెడ్జ్, ఇంగ్లిష్, కంటెంట్-మెథడాలజీ (మ్యాథ్స్, సోషల్, సైన్స్), ఎడ్యుకేషనల్ సైకాలజీ అంశాల్లో ప్రశ్నలు ఉండేవి. నూతన విధానంలో సైకాలజీ స్థానంలో పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్ అనే విభాగాన్ని ప్రవేశపెట్టారు. ఇంగ్లిష్‌తోపాటు తెలుగు భాషను కూడా చేర్చారు. ఎస్ఏలో కూడా.. జనరల్ నాలెడ్జ్, ఇంగ్లిష్, కంటెంట్-మెథడ్, ఎడ్యుకేషనల్ సైకాలజీ అంశాలపై ప్రశ్నలు ఉండేవి. ప్రస్తుతం ఎడ్యుకేషన్ సైకాలజీ స్థానంలో పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్ అనే విభాగాన్ని ప్రవేశపెట్టారు.

## కంటెంట్‌తోపాటు:

సిలబస్‌ను ఒక్కసారి పరిశీలిస్తే కంటెంట్‌కు పెద్ద పీట వేసినట్లు తెలుస్తుంది. కంటెంట్‌కు కేటాయించిన మార్కులు ఎక్కువగా ఉండటంతో చాలా మంది అభ్యర్థులు ఈ విభాగంపైనే ఎక్కువ దృష్టి పెట్టే అవకాశం ఉంది. ఇదే సమయంలో మిగిలిన టాపిక్స్ పట్ల నిర్లక్ష్యం తగదు. అభ్యర్థుల విజయాన్ని నిర్దేశించడంలో 'మెథడాలజీ', 'పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్' పాత్ర కూడా కీలకం. కాబట్టి ఈ అంశాల్లో సాధ్యమైనన్ని ఎక్కువ మార్కులు స్కోర్ చేసేలా ప్రయత్నించాలి. స్కూల్ అసిస్టెంట్ కంటెంట్ 6 నుంచి10 తరగతుల అంశాలకు సంబంధించినవే కాబట్టి అందరూ సులభంగానే ప్రిపేర్ అవుతుంటారు (ప్రశ్నల క్లిష్టత ఇంటర్మీడియెట్ స్థాయిలో ఉంటుంది). మిగిలిన అభ్యర్థుల కంటే పోటీలో ముందుండాలంటే మాత్రం మెథడాలజీ, పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్, జనరల్ నాలెడ్జ్ అంశాల్లో ఎక్కువ స్కోర్ చేయాలి.

## మెథడాలజీ:

ఈ సారి డీఎస్సీ-స్కూల్ అసిస్టెంట్‌లో మెథడాలజీ ప్రాధాన్యత పెరిగింది. కేటాయించిన 16 మార్కులకుగాను 32 ప్రశ్నలు వస్తాయి. ఏ సబ్జెక్ట్ మెథడాలజీ అయినా తెలుగు అకాడమీ పుస్తకాన్ని ప్రతిపాదికగా తీసుకోవాల్సి ఉంటుంది. గతంతో పోల్చితే డీఎస్సీలో ప్రశ్నల కాఠిన్యత స్థాయి పెరిగింది. ఇంతకుముందు ప్రశ్నలు డైరెక్ట్‌గా ఉండేవి (జ్ఞాన సంబంధ ప్రశ్నలు). కానీ ఇటీవల నిర్వహించిన టెట్ ప్రశ్నాపత్రాలను పరిశీలిస్తే..ప్రశ్నల సరళి మారుతుందనే అంశాన్ని గమనించవచ్చు. కాబట్టి మొదట మెథడాలజీలోని భావనలను అవగాహన చేసుకుంటే ఈ అంశంపై పట్టు సాధించవచ్చు. ఆ భావనల ఆధారంగా అన్వయ పద్ధతిలో ప్రశ్నలు ఇచ్చినా..సమాధానం ఇచ్చే విధంగా ప్రాక్టీస్ చేయాలి. ప్రశ్నల తీరును గమనిస్తే.. మెథడాలజీ భావనలను సన్నివేశాలకు జోడించిన అప్లికేషన్ బిట్స్ ఎక్కువగా అడుగుతున్నారు. ఇప్ప టికే అభ్యర్థులు మెథడాలజీ భావనలను చదివి ఉంటారు. కాబట్టి ప్రతి రోజూ వివిధ మాదిరి ప్రశ్నపత్రాలను, గత డీఎస్సీ, టెట్ ప్రశ్నపత్రాలను ప్రాక్టీస్ చేయడం మంచిది. దీని వల్ల ప్రశ్నల సరళి తెలుస్తుంది. అప్లికేషన్ బిట్స్‌ను ఆన్సర్ చేసేటప్పుడు సరైన రీతిలో ఆలోచించటం అలవాటవుతుంది. మరో కీలకాంశం.. ప్రశ్నలను క్షుణ్నంగా చదవాలి. ప్రశ్నను పాజిటివ్‌గా ఇచ్చారా? నెగిటివ్‌గా ఇచ్చారా? అనేది గమనించాలి. నెగిటివ్ అంటే కింది వాటిలో లక్ష్యానికి 'సంబంధించని' ప్రవచనం అని అడిగితే తొందరలో 'సంబంధించిన' అని అర్థం చేసుకుని తప్పు సమాధానాన్ని ఎంచుకొనే అవకాశం ఉంది. ఇలాంటి ప్రశ్నలను ఎంచుకొని ప్రాక్టీస్ చేయడం మంచిది.

ఏ సబ్జెక్ట్ మెథడాలజీలోనైనా దాదాపుగా 10 అధ్యాయాలుంటాయి. అప్లికేషన్ తరహా ప్రశ్నలు అడిగే అవకాశం ఉన్న అధ్యాయాల్లోంచి ప్రశ్నలు ఎక్కువగా ఇవ్వడాన్ని గమనించవచ్చు. అదేవిధంగా లక్ష్యాలు, స్పష్టీకరణలు, బోధన పద్ధతులు, పాఠ్యప్రణాళిక, మూల్యాంకనం, బోధనోపకరణాలు వంటి అధ్యాయాల్లోని బిట్స్‌ను ప్రాక్టీస్ చేయాలి. మెథడాలజీలో ఒక్కొక్క కఠినమైన యూనిట్‌ను ఎంచుకుని గ్రూప్ డిస్కషన్ చేయడం వల్ల కూడా అవగాహన సులభమవుతుంది.

## కంటెంట్:

అభ్యర్థులందరికీ ప్రిపరేషన్‌లో సులభమైన విభాగం కంటెంట్.అభ్యర్థులందరికీ డిగ్రీ స్థాయి నాలెడ్జ్ ఉంటుంది. కాబట్టి 6-10 తరగతుల పాఠ్యపుస్తకాలకు సంబంధించి కంటెంట్ సులభంగా అర్థం అవుతుంది. పాఠ్యపుస్తకాల్లో ప్రతి పాఠాన్ని ఏ వాక్యం వదిలి పెట్టకుండా ఇప్పటికే పూర్తి చేసి ఉండాలి. కంటెంట్ ప్రిపరేషన్ సమయంలో ఎక్కువగా తెలిసిన అంశాలు ఉంటాయి కాబట్టి మానసిక శ్రమ అంతగా ఉండదు. కాబట్టి ఈ కంటెంట్ ప్రిపరేషన్‌కు రోజు వారీ షెడ్యూల్‌లో చివరి దశ కేటాయించాలి. బిట్స్ పదే పదే గ్రూప్ డిస్కషన్ చేయటం వల్ల రివిజన్ అవుతుంది. సారుప్యత ఉన్న పాఠ్యాంశాలను అన్నింటిని ఒక చోట రాసుకుని ప్రిపేర్ కావాలి.

## పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్:

విజయాన్ని నిర్దేశించే కీలక విభాగం పర్‌స్పెక్టివ్ ఇన్ ఎడ్యుకేషన్ అని చెప్పొచ్చు. విద్యను చారిత్రక, తాత్విక, మనోవైజ్ఞానిక, సామాజిక, సమకాలీన దృక్పథంతో పరిశీలించడమే పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్. ఇందులో ఐదు యూనిట్లు ఉన్నాయి. ఇందులో విద్య చారిత్రక నేపథ్యం, ఉపాధ్యాయ సాధికారత, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, పర్యావరణ విద్య, జనాభా విద్య, సహిత విద్య, ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం, సమాచార హక్కు చట్టం, బాలల హక్కులు, మానవ హక్కులు, నేషనల్ కరిక్యులం ఫ్రేమ్ వర్క్-2005కు సంబంధించిన అంశాలు ఉంటాయి. ఎస్‌జీటీ/ఎస్ఏలకు ఒకే రకమైన సిలబస్ నిర్దేశించినప్పటికీ.. ప్రశ్నల క్లిష్టతలో తేడా ఉంటుంది. డీఈడీ అభ్యర్థులకు పేపర్-4 లో, బీఈడీలో కూడా ఫౌండేషన్స్ ఆఫ్ ఎడ్యుకేషన్, స్కూల్ అడ్మినిస్ట్రేషన్ పుస్తకాల్లో సంబంధిత అంశాల ప్రస్తావన కొంత వరకు ఉంటుంది. మిగిలిన సిలబస్ కోసం.. అంశాల వారీగా మార్కెట్లో లభించే స్టాండర్డ్ పుస్తకాల నుంచి నోట్స్ ప్రిపేర్ చేసుకోవాలి.

## ఎస్‌జీటీ:

ఎస్ఏతో పోల్చితే.. ఎస్‌జీటీ పోస్టులకు పోటీ తక్కువగా ఉండటం డీఈడీ అభ్యర్థులకు కలిసొచ్చే అంశం. మ్యాథ్స్, సైన్స్, సోషల్ మూడు సబ్జెక్టులుగా ఉండే కంటెంట్.. అత్యంత సులభమైన విభాగం. ఇక్కడ కీలకాంశం.. తమ నేపథ్యానికి చెందని పాఠ్యాంశాలు (ఉదాహరణకు.. బయాలజీ అభ్యర్థులు గణితం, సోషల్ స్టడీస్ చదవడం) చదివేటప్పుడు కొంత ఇబ్బందికి గురవడం సహజం. అభ్యర్థులు ఇప్పటికే కనీసం డిగ్రీ స్థాయి అవగాహన కలిగుంటారు కాబట్టి ప్రాథమిక, ప్రాథమికోన్నత తరగతుల పాఠ్యాంశాల విషయంలో సిలబస్‌ను అనుసరిస్తూ.. ప్రతి పాఠ్యాంశం వెనుక ఇచ్చిన బిట్స్‌ను ఔపోసన పడితే సులభంగానే ఈ సమస్యను అధిగమించొచ్చు. సోషల్, సైన్స్ అభ్యర్థులు మాత్రం గణితం విషయంలో కొంత జాగ్రత్తగా ఉండాలి. వీరు స్కూల్ ఎడ్యుకేషన్ తర్వాత ఎక్కువ గా మ్యాథ్స్‌ను ఫాలో కాకపోవడమే దీనికి కారణం. దీనికి ఏకైక పరిష్కారం.. ప్రాక్టీస్‌కు ఎక్కువగా ప్రాధాన్యత ఇవ్వడం. సూత్రాలు, మౌలికాంశాలపై ప్రధానంగా దృష్టి సారించాలి. అప్లికేషన్ మెథడ్‌ను పెంచుకోవాలి. ఇంపార్టెంట్ అంటూ కొన్ని పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా అన్ని పాఠ్యాంశాల మీద దృష్టి సారించాలి. మెథడాలజీ విషయానికొస్తే.. డీఈడీ సిలబస్ నుంచి ప్రశ్నలు ఉంటాయి.

బోధనా లక్ష్యాలు, అభ్యసనానుభవాలు, మూల్యాంకనం, బోధనా పద్ధతులు, బోధనోపకరణాలు అంశాలను కంటెంట్‌లోని పాఠ్యాంశాలకు అన్వయించుకుని ప్రిపరేషన్ సాగించాలి. ఏయే సబ్జెక్ట్‌కు ఏ పద్ధతి సరిపోతుందనే అంశంపై అవగాహన పెంచుకోవాలి. లాంగ్వేజెస్‌లో చేర్చిన తెలుగు, ఇంగ్లిష్ భాషలు కంటెంట్ బేస్డ్ కాదు. ఆయా భాషల్లో అభ్యర్థుల సామర్థ్యాన్ని పరీక్షించే విధంగా ప్రశ్నలు ఉండే అవకాశం ఉంది. టెట్‌లో లాంగ్వేజెస్ కోసం ఏ విధంగా ప్రిపేరేషన్ సాగించారో.. ఆ ప్రిపరేషన్ సరిపోతుంది.

## జనరల్ నాలెడ్జ్:

స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జీటీ రెండు పేపర్లలోను ఈ విభాగానికి 10 మార్కుల చొప్పున కేటాయించారు. గత ప్రశ్నపత్రాలను పరిశీలిస్తే.. కరెంట్ అఫైర్స్‌తోపాటు స్టాండర్డ్ జీకేకు కూడా పెద్ద పీట వేశారు. కరెంట్ అఫైర్స్ కోసం.. పరీక్ష తేదీకి ఏడాదికి ముందు జాతీయ, అంతర్జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో చోటు చేసుకున్న పరిణామాలు, వార్తల్లోని వ్యక్తులు, సమావేశాలు, క్రీడలు-విజేతలు, వివిధ సర్వేలు, జనాభా గణాంకాలు వంటి అంశాలపై ప్రశ్నలుంటాయి. స్టాండర్డ్ జీకే కోసం.. వివిధ చారిత్రక కట్టడాలు, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, వివిధ తెగలు-సంస్కృతి, రాజధానులు, కరెన్సీ, సముద్రాలు-నదులు, హైకోర్టు, సుప్రీంకోర్టు, స్వాతంత్ర్యోద్యమం, సైన్స్ అండ్ టెక్నాలజీ తదితర అంశాలపై ప్రశ్నలు ఉంటాయి.

### జనరల్ టిప్స్

- సాధ్యమైనన్నీ మాక్ టెస్ట్‌లను రాయాలి. వీటి ఫలితాలను విశ్లేషించుకోవాలి.
- వీలైతే అధ్యాయాల వారీగా ప్రాక్టీస్ టెస్ట్ రాయడం కూడా లాభిస్తుంది.
- గతంలో నిర్వహించిన డీఎస్సీ, టెట్ ప్రశ్నపత్రాలను విధిగా సాల్వ్ చేయాలి.
- ఇప్పటికే ప్రిపరేషన్ పూర్తి చేసి ఉంటారు కాబట్టి రివిజన్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి.
- రివిజన్‌ను కూడా గ్రూప్ డిస్కషన్ తరహాలో చేయడం లాభిస్తుంది. మెథడాలజీ విషయంలో ఇది చక్కగా ఉపకరిస్తుంది.
- కొత్త టాపిక్స్‌ను ఎట్టి పరిస్థితుల్లోను చదవకూడదు.
- వివిధ మెటీరియల్స్‌పై ఆధారపడకుండా తెలుగు అకాడమీ పుస్తకాలకే పరిమితం కావాలి.
- తెలుగు అకాడమీ రూపొందించిన బిట్ బ్యాంక్‌ను కూడా అధ్యయనం చేయాలి.
- పాఠ్యపుస్తకాల్లో పాఠ్యాంశాల చివరన ఇచ్చిన బిట్స్‌ను ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి.
- కంటెంట్‌లోని ప్రశ్నలకు సమాధానాలను తక్కువ సమయంలో గుర్తించేలా ప్రాక్టీస్ చేయాలి. దీని వల్ల కొద్దిగా కష్టంగా ఉండే పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్, మెథడాలజీ విభాగాల్లో ఆలోచనతో ఆప్షన్‌ను ఎంచుకునే వెసులుబాటు లభిస్తుంది.
- కీలకమైన ఈ చివరి దశలో ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ఆత్మవిశ్వాసంతో ఉండాలి.

# ప్లేస్‌మెంట్స్... కోరినట్టుంటేనే కొలువు

- ప్రొఫెషనల్ అటిట్యూడ్.. ఆప్టిట్యూడ్.. సబ్జెక్టులపై పట్టు.. కమ్యూనికేషన్ స్కిల్స్.. హై ఎనర్జీ.. ఇవి నేటి ఇంజనీరింగ్ స్టూడెంట్‌కు సాటిలేని సక్సెస్ సూత్రాలు.! కోరుకున్న కంపెనీలో కొలువు కట్టబెట్టే ఫార్ములాలు..
- బ్రాంచ్ ఏదైనా.. మార్కులు ఎన్నున్నా.. విద్యార్థుల్లో కంపెనీలు చూసే కోణాలివే..
- వీటిని వంటబట్టించుకున్న ఇంజనీరింగ్ విద్యార్థికి క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో ఎదురుండదు..
- హైదరాబాద్ నుంచి అమెరికా వరకు.. బెంగ ళూరు నుంచి జపాన్ వరకు.. అవకాశాలకు హద్దులుండవు!!

**ఐటీ, నాన్ ఐటీ.. కంపెనీ ఏదైనా సరే..! కోరుకున్న లక్షణాలను అందిపుచ్చుకున్న వాళ్లకు లక్షలకు లక్షల ప్యాకేజీలు ఇవ్వడానికి కంపెనీలు ఏమాత్రం వెనుకంజ వేయడంలేదు. దీనికి ప్రత్యక్ష నిదర్శనమే.. ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా జరిగిన క్యాంపస్ ప్లేస్‌మెంట్ల తీరు. గతేడాది అక్టోబర్‌లో ప్రారంభమైన క్యాంపస్ ప్లేస్‌మెంట్లు ఈ నెలాఖరుతో ముగిశాయి. ఈ నేపథ్యంలో... క్యాంపస్ ప్లేస్‌మెంట్లు జరిగిన తీరు, కంపెనీలు విద్యార్థుల నుంచి ఆశిస్తున్న లక్షణాలు.. ఎలాంటి విద్యార్థులకు కొలువులు లభిస్తున్నాయి? ప్యాకేజీలు ఎలా ఉన్నాయి.. కంపెనీలు ఉద్యోగాలివ్వడానికి, సబ్జెక్ట్ నాలెడ్జ్‌ను పరిగణనలోకి తీసుకుంటాయా.. కమ్యూనికేషన్ స్కిల్స్ మాటేంటి.. ఇలా ఈ ఏడాది క్యాంపస్ ప్లేస్‌మెంట్ తీరుతెన్నులను పరిశీలించిన నిపుణుల విశ్లేషణ...**

### ఐటీదే హవా:

గతంతో పోల్చితే ఈ ఏడాది ఇంజనీరింగ్ కాలేజీల్లో క్యాంపస్ ప్లేస్‌మెంట్లకు వచ్చే కంపెనీల సంఖ్య పెరిగింది. రాష్ట్రంలో జేఎన్‌టీయూ, ఉస్మానియా, ఏయూ వంటి ప్రముఖ క్యాంపస్‌లలో 2010వరకు సుమారు 40 కంపెనీలు ప్లేస్‌మెంట్ డ్రైవ్స్ నిర్వహిస్తే.. ఈ ఏడాది ఆ సంఖ్య 55 నుంచి 60కిపైగా ఉంది. వీటిలో చాలా కంపెనీలు మొదటిసారి ప్లేస్‌మెంట్స్‌కు హాజరయ్యాయి. గతేడాది ప్రధానంగా మైక్రోసాఫ్ట్, విప్రో, టీసీఎస్, ఒరాకిల్, ఎసెంచర్, మోర్గాన్ స్టాన్లీ, హెచ్‌సీఎల్, ఎల్ అండ్ టీ, భారత్ పెట్రోలియం, అమెజాన్, డెలాయిటీ, ఎన్‌విడియా, హెచ్‌పీ, మహీంద్రా అండ్ మహీంద్రా, ఫ్లిప్‌కార్ట్, ఎమ్‌ఫిసో, ఫ్యూచర్స్‌ఫస్ట్ కంపెనీలు రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో పాల్గొంటే... ఈసారి బహుళజాతి సంస్థలైన గోల్డ్‌మెన్ సాచ్స్, క్వాల్‌కాం వంటి కంపెనీలు సైతం క్యాంపస్ ప్లేస్‌మెంట్‌కు రావడం విశేషం. వీటిలో ఎక్కువ కంపెనీలు కంప్యూటర్ సైన్స్ విద్యార్థులను తీసుకోవడానికే పోటీపడ్డాయి. దాంతో ఈ బ్రాంచ్ విద్యార్థులకు డిమాండ్ పెరిగింది. గతేడాది ఉస్మానియా, జేఎన్‌టీయూ, ఏయూ క్యాంపస్‌ల్లో నిర్వహించిన ప్లేస్‌మెంట్లలో రూ.10 లక్షల వార్షిక వేతనం కేవలం కొన్ని కంపెనీలే ఆఫర్ చేయగా.. ఈ ఏడాది ఆ స్థాయి వేతనం ఇవ్వడానికి 20 కుపైగా కంపెనీలు ముందుకు వచ్చాయి. ఐటీ రంగం విస్తరిస్తుండడం.. కొత్త ప్రాజెక్టులు వస్తుండడం.. విదేశాల్లోను కంపెనీల విస్తరణ.. పోటీని తట్టుకునేందుకు ముందస్తు ప్రణాళికలు వంటి కారణాలతో ముందుగానే రిజర్వ్‌బెంచ్‌ను పటిష్టం చేసుకోవడానికి దాదాపు అన్ని కంపెనీలు ప్రయత్నించాయి.దాంతో ఎప్పుడూ అక్టోబరులో ప్రారంభమై.. ఏప్రిల్‌లో ముగిసే ప్లేస్‌మెంట్ ప్రక్రియ ఈ ఏడాది జులై వరకు కొనసాగింది.

### గరిష్ట ప్యాకేజీ.. ఫేస్‌బుక్ 45 లక్షలు:

ఈ ఏడాది ప్లేస్‌మెంట్స్‌లో వరంగల్ ఎన్‌ఐటీలో హరివినయ్ అనే సీఎస్‌ఈ విద్యార్థికి ఫేస్‌బుక్ అత్యధికంగా రూ.45 లక్షల వార్షిక వేతనం ఆఫర్ చేసింది. బిట్స్ క్యాంపస్ నుంచి అరుణ్ చైతన్య అనే సీఎస్‌ఈ విద్యార్థికి జపాన్‌లోని టోక్యోకు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీ నుంచి రూ.35 లక్షల వార్షిక వేతనం లభించింది. ఆ తర్వాత మోర్గాన్‌స్టాన్లీ అనే ఐటీ కంపెనీ బిట్స్ క్యాంపస్‌లో సీఎస్‌ఈ విద్యార్థికి రూ.11.5లక్షల ఆఫర్ చేయగా.. జేఎన్‌టీయూ, సీబీఐటీల్లో ఇద్దరు సీఎస్‌ఈ విద్యార్థులకు మైక్రోసాఫ్ట్ నుంచి 10.5 లక్షల శాలరీ ఆఫర్ అందింది.

ఐటీ తర్వాత ఈసీఈ, మెకానికల్, సివిల్ బ్రాంచ్ విద్యార్థులకు అత్యధికంగా అవకాశాలు లభించాయి. ఈ బ్రాంచ్ విద్యార్థులను సైతం ఐటీ కంపెనీలే మంచి ఆఫర్లతో రిక్రూట్ చేసుకున్నాయి. ప్రధానంగా కోర్ బ్రాంచ్‌ల విద్యార్థులను హెచ్‌సీఎల్, ఎల్ అండ్ టీ, భారత్ పెట్రోలియం, అమెజాన్, డెలాయిటీ, హెచ్‌పీ, మహీంద్రా అండ్ మహీంద్రా వంటి కంపెనీలు జాబ్ ఆఫర్స్ ఇచ్చాయి. ఐటీ సర్వీసులందించే టీసీఎస్, విప్రో, కాగ్నిజెంట్, అమెజాన్ వంటి చాలా కంపెనీలు బ్రాంచ్‌తో సంబంధం లేకుండా విద్యార్థి స్కిల్స్‌ను చూసి నియమించుకున్నాయి. టాలెంట్ హంటింగ్‌లో కంపెనీల మధ్య పోటీ.. విద్యార్థులు ఆకర్షణీయమైన ప్యాకేజీలు దక్కించుకునేందుకు దోహదం చేసింది. అంతేకాకుండా భవిష్యత్ అవసరాలకోసం సగటు నైపుణ్యం కలిగి, మంచి అటిట్యూడ్ ఉన్న విద్యార్థులకు సైతం కంపెనీలు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చాయి. దాదాపు అన్ని ప్రముఖ ఇంజనీరింగ్ క్యాంపస్‌లలోనూటికి 90 శాతానికిపైగా విద్యార్థులు ఉద్యోగాలు దక్కించుకున్నారు.

### మార్కులు.. సాఫ్ట్‌స్కిల్స్:

క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో కంపెనీలు అందరికీ ఉద్యోగాలిచ్చేస్తున్నాయా? ఇంగ్లిష్ బాగా వస్తే చాలు..లక్షలకు లక్షల ప్యాకేజీలు ఆఫర్ చేస్తున్నాయా..?! పోటీ కారణంగా విద్యార్థి నైపుణ్యాలెలా ఉన్నా.. మార్కుల పర్సంటేజీ తక్కువగా ఉన్నా... అవకాశం ఇస్తున్నాయా? అంటే కాదనే చెప్పాలి. ఎందుకంటే.. విద్యార్థిలో తాము కోరుకున్న స్కిల్స్ విషయంలో కంపెనీలు చాలా స్పష్టంగా వ్యవహరిస్తున్నాయి. అన్నిరకాలుగా ఒకటికి రెండుసార్లు పరీక్షించిన తర్వాతే అవకాశాలిస్తున్నాయని ఆయా క్యాంపస్‌ల ప్లేస్‌మెంట్ ఆఫీసర్లు పేర్కొంటున్నారు. ఉద్యోగం ఇచ్చే ముందు విద్యార్థుల మార్కుల విషయంలో ఒక్కో కంపెనీ ఒక్కోరకమైన పాస్ పర్సంటేజీని కోరుకుంటోంది. ఉస్మానియా, జేఎన్‌టీయూ, ఆంధ్రా, సీబీఐటీ, బిట్స్, ఎన్‌ఐటీ, ఐఐటీ క్యాంపస్‌ల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ల అనుభవాలు, వారి విశ్లేషణలను చూస్తే.. మంచి పర్సంటేజ్‌తోపాటు సాఫ్ట్ స్కిల్స్ కూడా ఉద్యోగ సాధనలో కీలకపాత్ర పోషిస్తున్నాయి.

### ఈ ఏడాది... ఆచితూచి:

కంపెనీల అవసరాలు, కొత్తగా రానున్న ప్రాజెక్టులు, విదేశాల్లో బ్రాంచ్‌ల విస్తరణ, పోటీ.. కారణం ఏదైనా ఇటీవల ముగిసిన క్యాంపస్ డ్రైవ్‌లలో 2012 ఇంజనీరింగ్ విద్యార్థులు పోటాపోటీ అవకాశాలు అందుకున్నారు. ఇదే పరిస్థితి ప్రస్తుతం నాలుగో ఏడాదిలోకి వచ్చిన ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉంటుందా? అంటే పలువురు ప్రముఖ క్యాంపస్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్లు, ఐటీ కంపెనీల ప్రతినిధులు ఆచితూచి స్పందిస్తున్నారు. ఎందుకంటే... ప్రస్తుతం డాలర్‌తో రూపాయి మారకం విలువ బాగా క్షీణిస్తుండడం.. ఫలితంగా ఐటీ కంపెనీల ఆదాయంలో తగ్గుదల కనిపించడం.. కొత్త ప్రాజెక్టులు ఆశించినంత మేరకు

**2011-12 వివిధ కళాశాలలో రిక్రూట్‌మెంట్ వివరాలు**

| యూనివర్సిటీ | మొత్తం ప్లేస్‌మెంట్లు (బీటెక్, ఎంటెక్) | పాల్గొన్న కంపెనీలు | అత్యధిక వేతనం రూ. లక్షలలో |
|---|---|---|---|
| ఐఐటీహెచ్ (సీఎస్‌ఈ) | 205 | 65 | 74 |
| ఐటీ-హైదరాబాద్ | 161 | 40 | 35 |
| ఉస్మానియా (సీఎస్‌ఈ) | 728 | 38 | 8.5 |
| ఆంధ్రా వర్సిటీ (సీఎస్‌ఈ) | 870 | 20 | 9 |
| జేఎన్‌టీయూహెచ్ (సీఎస్‌ఈ) | 457 | 40 | 10.5 |
| బిట్స్ హైదరాబాద్ (సీఎస్‌ఈ) | 429 | 25 | 11.5 |
| సీబీఐటీ (సీఎస్‌ఈ) | 1055 | 56 | 10.5 |

వచ్చే అవకాశాలు తక్కువగా ఉండటం-మున్ముందు జరగబోయే క్యాంపస్ ప్లేస్‌మెంట్లపై కొంతమేర ప్రభావం చూపించవచ్చంటున్నారు. 2013 ఇంజనీరింగ్ పాస్‌అవుట్ విద్యార్థులకు ఎప్పుడు ప్లేస్‌మెంట్స్ నిర్వహించేది చెప్పడానికి సంసిద్ధత వ్యక్తంచేయడంలేదని కొందరు ప్లేస్‌మెంట్ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే ఐటీ కంపెనీల్లో రిజర్వ్‌బెంచ్ పెరిగిపోవడం కూడా ఇందుకు మరో కారణం. ప్రస్తుత పరిస్థితులు దీర్ఘకాలం కొనసాగినా.. 2013 పాసవుట్ బ్యాచ్ విద్యార్థులపై పెద్దగా ప్రభావం చూపకపోవచ్చని మరికొంతమంది అంచనా. రిక్రూట్‌మెంట్‌లో ఐటీ కంపెనీలు విద్యార్థులను తీసుకునే సంఖ్య కొంత తగ్గితే తగ్గొచ్చని.. కోర్ కంపెనీల ప్లేస్‌మెంట్లు మాత్రం పెద్దగా మారవన్నది క్యాంపస్ వర్గాల అభిప్రాయం. ఈలోగా పరిస్థితులు మెరుగుపడితే తిరిగి ప్లేస్‌మెంట్లు పుంజుకోవచ్చు.

### ప్రొఫెషనల్ అటిట్యూడ్ పెంచుకోవాలి:

ప్రధానంగా చాలామంది విద్యార్థుల్లో ప్రొఫెషనల్ అటిట్యూడ్ ఉండడంలేదని... సాఫ్ట్‌స్కిల్స్, ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్ బాగా మెరుగుపరచుకోవాలని కంపెనీలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో... విద్యార్థులు కంపెనీలు కోరుతున్న లక్షణాలను ఇప్పటినుంచే మరింతగా మెరుగుపరచుకునేందుకు ప్రయత్నించడం మేలు చేస్తుంది. మొదటి రెండేళ్ల సబ్జెక్ట్ ఫండమెంటల్స్‌పై దృష్టి సారించి.. ఏం అడిగినా చెప్పగలిగేలా ఉండాలి. అదేవిధంగా ల్యాబ్‌లో ప్రోగ్రామింగ్‌ను బాగా ప్రాక్టీస్ చేయాలి. స్టడీలో రెగ్యులారిటీ అవసరం. అలాగే వెర్బల్ ఎబిలిటీ, కమ్యూనికేషన్ స్కిల్స్‌కు తప్పనిసరిగా సాన పెట్టాలి. రెజ్యూమె తయారీలో నైపుణ్యం సాధించాలి. కోర్ కంపెనీ ప్లేస్‌మెంట్స్‌కు వెళ్లాలనుకునేవాళ్లు ఫండమెంటల్స్, వెర్బల్ ఎబిలిటీస్‌లో గట్టి పట్టుసాధించాలి. వీటితోపాటు చాలా కంపెనీలు ఇప్పుడు విద్యార్థుల్లో ఎనర్జీ లెవెల్స్‌ను కూడా పరిగణనలోకి తీసుకుంటున్నాయి. ఎందుకంటే.. దాదాపు విద్యార్థులంతా ఇంటర్‌లో కార్పొరేట్ కాలేజీల నుంచి రావడం.. అక్కడ నిరంతర చదువుల మధ్య ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్ లేకపోవడంతో బీటెక్ తర్వాత కంపెనీలోకి చేరి 8 గంటలు కూడా ఉత్సాహంగా పనిచేయలేకపోతున్నారని కంపెనీలు ప్రస్తావిస్తున్నాయి. కాబట్టి విద్యార్థులు స్టడీతోపాటు ఎక్స్‌ట్రాకరిక్యులర్ యాక్టివిటీస్ ద్వారా తమ ఎనర్జీలెవల్స్‌ను పెంచుకోవడం.. పాజిటివ్ థింకింగ్‌ను అలవాటు చేసుకుంటే.. క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో జాబ్ ఆఫర్ సొంతం చేసుకోవచ్చు. కెరీర్‌లోనూ ఉన్నతంగా రాణించొచ్చు!!

### పరిశీలిస్తున్న అంశాలివే

- ప్రొడక్ట్‌బేస్డ్ కంపెనీలైన మైక్రోసాఫ్ట్, ఎంఏక్యూ, డెలాయిటీ, గూగుల్, యాహూ కంపెనీలు 70 నుంచి 75 శాతం పాస్ పర్సంటేజ్ ఉంటేనే ప్లేస్‌మెంట్‌కు అనుమతిస్తున్నాయి. ఒక్క సబ్జెక్ట్ బ్యాక్‌లాగ్ ఉన్నా అనుమతించడంలేదు.
- ఇన్ఫోసిస్ 68 శాతం, టీసీఎస్, కాగ్నిజెంట్ 60 శాతం.. కోర్ కంపెనీలు 65 శాతం పర్సంటేజ్ ఉంటేనే ప్లేస్‌మెంట్‌కు అంగీకరిస్తున్నాయి.
- పాస్ పర్సంటేజీతోపాటు కామన్‌గా కొన్ని నైపుణ్యాలున్న వారివైపే మొగ్గుచూపుతున్నాయి.
- కంపెనీలు కోరుకునే అన్నిరకాల స్కిల్స్ ఉన్నవాళ్లకు రూ.10 లక్షలకుపైగా.. మధ్యస్థంగా ఉన్నవారికి రూ.3లక్షల నుంచి రూ.4 లక్షలు ఇవ్వడానికి ఆసక్తి కనబరుస్తున్నాయి.
- కంపెనీలన్నీ ప్రధానంగా సీ ప్రోగ్రామింగ్, డాటా స్ట్రక్చర్స్, ఆపరేటింగ్ సిస్టమ్స్ బాగా వచ్చినవాళ్లకే అవకాశాలిస్తున్నాయి. వీటికి సంబంధించి తమ ప్రతిభను ప్రదర్శించిన వాళ్లకే ఆఫర్ లెటర్స్ సిద్ధం చేస్తున్నాయి.
- విద్యార్థులందరిలో అటిట్యూడ్, ఆప్టిట్యూడ్‌ను తప్పనిసరిగా పరిశీలిస్తున్నాయి.
- గ్రూప్ డిస్కషన్‌లో సదరు విద్యార్థికి నాయకత్వ లక్షణాలున్నాయా.. లేదా ఎగ్రసివ్‌గా వ్యవహరిస్తున్నాడా? లాజికల్‌గా మాట్లాడుతున్నాడా? అనలిటికల్ అప్రోచ్ ఉందా... అనేవి కూడా చూస్తున్నారు. అసలేమాత్రం మాట్లాడకుండా మౌనంగా ఉన్నవారిని ఎంపికచేసుకోవడానికి ఇష్టపడటంలేదు.
- ఇంగ్లిష్‌లో మాట్లాడటం వస్తే చాలనుకుంటారు చాలామంది విద్యార్థులు. కాని ఇంగ్లిష్‌లో ఎంత అనర్గళంగా మాట్లాడినా.. ఎదుటివారికి సరిగా కమ్యూనికేట్ చేయగలుగుతున్నాడా? కన్విన్స్ చేయగలుగుతున్నాడా, లేదా అనేవి తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకుంటున్నాయి.
- బ్రాంచ్‌తోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్, ఫిజికల్ అపీరియన్స్, లాంగ్వేజ్ నైపుణ్యాలు, లాజికల్ స్కిల్స్, ప్రాబ్లం సాల్వింగ్ స్కిల్స్, టెక్నికల్ నాలెడ్జ్, క్రిటికల్ థింకింగ్ వంటి అంశాలను కూడా కంపెనీలు చూస్తున్నాయి.
- మొదటి రెండేళ్ల సబ్జెక్టుల్లో ఫండమెంటల్స్‌పై విద్యార్థికున్న పట్టును పరీక్షించడానికే కంపెనీలు ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నాయి. లీడర్‌షిప్ క్వాలిటీస్, బృంద చర్చల్లో సానుకూలంగా స్పందిస్తున్నారా లేదా జాబ్ వచ్చిన తర్వాత 8గంటలపాటు నిరంతరాయంగా హై లెవెల్ ఎనర్జీతో పనిచేయగలిగే సామర్థ్యం ఉందా? అనేవి కూడా ప్లేస్‌మెంట్స్‌లో కీలకపాత్ర పోషిస్తున్నాయి. ఈ లక్షణాలున్న వాళ్లే తాజా ప్లేస్‌మెంట్స్‌లో ఉద్యోగాలు దక్కించుకున్నారు.

పోటీ పరీక్షార్థులకు సమాచార స్ఫూర్తి... భవిత! ఇకపై మీ సాక్షి టీవీలో
ప్రతి ఆదివారం ఉదయం 9-30 నుంచి 10గం.. వరకు



# స్వల్పకాలిక కోర్సులు.. స్వయం ఉపాధికి మార్గాలు!!

**అందరికీ ఉద్యోగాలు అసాధ్యమైన ప్రస్తుత పరిస్థితుల్లో వివిధ సంస్థలు అందిస్తున్న స్వల్పకాలిక కోర్సులు నిరుద్యోగులకు ఎంతో తోడ్పడుతున్నాయి. వీటిని పూర్తి చేస్తే వెంటనే ఉద్యోగావకాశాలు పొందొచ్చు.. లేదా స్వయంఉపాధిని పొందుతూ, మరో నలుగురుకి చేయూతనందించవచ్చు. ఈ నేపథ్యంలో వివిధ సంస్థలందించే స్వయం ఉపాధి కోర్సులపై ఫోకస్..**

## సెట్విన్

స్వయం ఉపాధితో నిరుద్యోగ సమస్యను చాలా వరకు తగ్గించే ఉద్దేశంతో 1978లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంస్థ సెట్విన్ (సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ ఆఫ్ ప్రమోషన్ అండ్ ట్రెనింగ్ ఇన్ ట్విన్ సిటీస్). స్వయం ఉపాధి పేరుచెప్పగానే టక్కున గుర్తొచ్చేది సెట్విన్. నిరుద్యోగ యువత మొదలు వ్యాపార రంగంపై అవగాహన, ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించడంలో ఈ సంస్థ ఎనలేని పాత్ర పోషిస్తోంది. ఎప్పటికప్పుడు మార్కెట్ అవసరాలకు అనుగుణంగా కొత్త కోర్సులకు రూపకల్పన చేస్తూ.. పది, ఇంటర్.. అంతకంటే తక్కువ చదువుకున్న వారికి అనేక స్వయం ఉపాధి మార్గాలు చూపుతోంది.

**శిక్షణ... ఆపై ఉపాధి:**
సెట్విన్ నిరుద్యోగులకు అనేక రకాల వినూత్న కోర్సులను అందుబాటులోకి తెచ్చింది. వికలాంగులు, మహిళలు, విద్యార్థులు, ఉన్నత చదువులు చదువుకున్న వారికి సైతం ప్రయివేటు రంగంలోని పలు విభాగాల్లో అవకాశాలు కల్పించే విధంగా కృషి చేస్తోంది. ముఖ్యంగా యువత, విద్యార్థుల్లో నైపుణ్యాల అభివృద్ధికి శిక్షణ, మినీబస్ ట్రాన్స్‌పోర్టు పథకాలు, కంప్యూటర్ శిక్షణ, వేజ్ ఎంప్లాయిమెంట్ ట్రెనింగ్, ఉత్పాదక పథకాలు, ట్రేడింగ్, స్వయం ఉపాధి పథకాలతోపాటు ఇక్కడ కోర్సులు పూర్తిచేసిన వారికి పలు ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు ఇచ్చేవిధంగా ప్రత్యేకంగా ప్లేస్‌మెంట్ సెల్ నిర్వహిస్తోంది.

**అందిస్తోన్న కోర్సులు:**

- **మూడు నెలల కంప్యూటర్ కోర్సులు:** ఎంఎస్ ఆఫీస్, డెస్క్‌టాప్ పబ్లిషింగ్, మల్టీమీడియా,వెబ్ డిజైనింగ్, సర్టిఫికెట్ కోర్స్ ఇన్ కంప్యూటర్ హార్డ్‌వేర్, కంప్యూటర్ ఎయిర్‌లైన్ టికెటింగ్, సర్టిఫికెట్ కోర్స్ ఇన్ కంప్యూటర్ అకౌంటెన్సీ(అడ్వాన్స్‌డ్), యూనిక్స్, సీ, సీ++ మొదలైనవి.
- **45 రోజుల కోర్సులు:** కాల్‌సెంటర్ ట్రెనింగ్, కంప్యూటర్ అవేర్‌నెస్ ప్రోగ్రాం, ఆఫీస్ ఆటోమేషన్ ప్రోగ్రాం.
- **అరు నెలల టెక్నికల్ కోర్సులు (ఏడో తరగతి విద్యార్థులకు):**ఆటో ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రీషియన్, డీజిల్ మెకానిక్, గోల్డ్ పాలిషింగ్ (3 నెలలు), ఆరు నెలల సర్టిఫికెట్ కోర్స్ ఇన్ మెషినరీ వర్క్, ప్లంబింగ్, కార్పెంటరీ కోర్సులకు ఏడో తరగతి పాస్ లేదా ఫెయిల్ అయినా అర్హులే.
- **పదో తరగతి అర్హతతో:** రేడియో అండ్ టీవీ(బ్లాక్ అండ్ వైట్, కలర్), (9 నెలలు); రేడియో, టీవీ కలర్ బ్లాక్ అండ్‌వైట్ (6 నెలలు); కలర్ టీవీ (3 నెలలు), రిఫ్రిజిరేషన్ (6 నెలలు)... ఈ కోర్సులకు టెన్త్ పాస్, లేదా ఫెయిల్ అయినా అర్హులే. టైప్ రైటింగ్ (6 నెలలు); టెలిఫోన్ ఆపరేటర్ (45 రోజులు); సెల్‌ఫోన్ రిపేరింగ్ (6 నెలలు); షార్ట్‌హ్యాండ్(6 నెలలు); సివిల్ డ్రాఫ్ట్‌మెన్‌షిప్ (6 నెలలు); ఆర్కిటెక్చురల్ డ్రాఫ్ట్‌మెన్‌షిప్(6 నెలలు); స్పోకెన్ ఇంగ్లిష్ (3 నెలలు); జ్యువెలరీ మేకింగ్ (6 నెలలు); సర్టిఫికేట్ కోర్సు ఇన్ డ్రాఫ్ట్‌మెన్ సివిల్ (ఏడాది) మొదలైన కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

**మహిళల కోసం:** మహిళలకు స్వయంఉపాధి కల్పించే విధంగా కటింగ్ అండ్ టైలరింగ్, బ్యూటీషియన్, జిగ్‌జాగ్, బంజారా అండ్ మిర్రర్ వర్క్, ఫ్యాషన్ డిజైనింగ్, డిప్లొమా ఇన్ బ్యూటీకేర్ వంటి ఎన్నో కోర్సులు ఉన్నాయి.

**జీతాలు భారీగానే:** వివిధ విభాగాల కింద సెట్విన్ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 140 కోర్సుల వరకు నిర్వహిస్తోంది. వీటిలో అత్యధిక శాతం ప్రైవేటు రంగంలో అవకాశాలు కల్పించడంతోపాటు సొంతంగా ఉపాధి ఏర్పాటు చేసుకోవడానికి కూడా వీలుకల్పిస్తాయి. సెట్విన్ కోర్సుల్లో అధిక శాతం మెడికల్, హోటల్ రంగాలకు సంబంధించినవే. ముఖ్యంగా ఈ కోర్సులు పూర్తిచేస్తే దాదాపు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో నర్సుల నుంచి ఆస్పత్రి నిర్వహణ, కంప్యూటర్ ఆపరేటర్లు, ఎక్స్‌రే, ఇతర అవయవాల స్కానింగ్ విభాగాల్లో తక్షణం ఉపాధి పొందే అవకాశం ఉంది. దీనికి తోడు మహిళల కోసం ప్రవేశపెట్టిన బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సుల ద్వారా ఇంట్లోనే తక్కువ ఖర్చుతో సొంతంగా వ్యాపారం చేయడంతోపాటు ఇతరులకు శిక్షణనందించి అదనపు ఆదాయాన్ని సైతం పొందొచ్చు. చివరకు ఏడో తరగతి పూర్తి చేసిన వాళ్లు సైతం కార్పెంటర్లు, మేస్త్రీలుగా అవకాశాలు దక్కించుకోవచ్చు. అంతేకాదు... ఫైర్ సర్వీసులో డిప్లొమా, సర్టిఫికేట్ కోర్సులు పూర్తి చేస్తే బహుళ అంతస్తుల భవనాలు, వాణిజ్య సముదాయాలు, ప్రయివేటు పారిశ్రామిక సంస్థల్లో అవసరం మేరకు మంచి జీతంతో ఉపాధి లభిస్తుంది.

**స్వయం ఉపాధి:**
కోర్సు పూర్తిచేసిన తర్వాత ఉద్యోగానికి బదులు స్వయంగా వ్యాపారం చేసుకోవాలనుకునేవారికి గైడెన్స్‌ను కూడా సెట్విన్ అందిస్తోంది. దీని ద్వారా వివిధ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్లు, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అసెంబ్లీ యూనిట్లు, ఫుడ్ ప్రొడక్ట్స్, సర్వీస్ యూనిట్లు, బిజినెస్ యూనిట్లపై అవగాహన లభిస్తుంది. తద్వారా స్వయం ఉపాధి పొందొచ్చు.
వెబ్‌సైట్: www.setwinapgov.org

## ఎంఎస్‌ఎంఈ-డీఐ (హైదరాబాద్)

దేశంలో సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలను ప్రోత్సహించే ఉద్దేశంతో కేంద్రంలోని చిన్నతరహా పరిశ్రమల శాఖ మైక్రో స్మాల్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ (ఎంఎస్‌ఎంఈ-డీఐ)ని ఏర్పాటు చేసింది. ఈ సంస్థ చిన్నతరహా వ్యాపార, పారిశ్రామికవేత్తలకు వేదోడువాదోడుగా నిలుస్తోంది. పలు సెమినార్లు, వర్క్‌షాప్స్ నిర్వహించి భవిష్యత్తు వ్యాపారవేత్తలకు మెళకువలు నేర్పుతోంది. ఇందుకోసం ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్, మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్‌ను నిర్వహిస్తోంది.

**ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్:**
ఈ కార్యక్రమం ద్వారా చదువుకున్న నిరుద్యోగులైన యువతీయువకులకు, మహిళలకు, ఎస్సీ, ఎస్టీ వర్గాలవారికి వివిధ స్వయం ఉపాధి పథకాల గురించి వివరిస్తారు. ఈ ప్రోగ్రామ్ వ్యవధి ఆరు వారాలు. ఫుడ్ ప్రాసెసింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీ థెరపీ, స్క్రీన్ ప్రింటింగ్, మోటార్ రీవైండింగ్ అండ్ ట్రాన్స్‌ఫార్మర్ వైండింగ్, మ్యానుఫ్యాక్చర్ ఆఫ్ లెదర్‌గూడ్స్, కెమికల్-దాని సంబంధిత ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్స్, రిపేర్ అండ్ సర్వీసింగ్ ఆఫ్ టూవీలర్స్, మొబైల్ ఫోన్స్ రిపేరింగ్ వంటి స్వయం ఉపాధి పథకాల గైడెన్స్ ఇస్తారు.

**మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్:**
చిన్నతరహా యూనిట్‌ను స్థాపించాక ఎదురయ్యే సమస్యలను అధిగమించే స్కిల్స్‌ను నేర్పడానికి ఉద్దేశించిందే మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్. దీని వ్యవధి వారం నుంచి 2 వారాలు. ఇందులో ఫైనాన్షియల్, మార్కెటింగ్, ఇండస్ట్రియల్, ప్రొడక్షన్, మెటీరియల్స్, క్వాలిటీ, కాస్ట్ మేనేజ్‌మెంట్‌ల గురించి శిక్షణనిస్తారు. ఇవేకాకుండా ఇంజనీరింగ్/ఐటీఐ/ఎంబీఏ కళాశాలల విద్యార్థులు, మహిళలకు, ఎస్సీ, ఎస్టీలకు ఇంటెన్సివ్ మోటివేషన్ కాంపైన్ కార్యక్రమాన్ని కూడా ఎంఎస్‌ఎంఈ అందిస్తోంది.
మరిన్ని వివరాలకు http://msmehyd.ap.nic.in/ వెబ్‌సైట్ చూడొచ్చు.

## గ్రామీణ యువతకు స్వయం ఉపాధి
## రామానంద తీర్థ రూరల్ ఇన్‌స్టిట్యూట్

జాతిపిత గాంధీ 'పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు' అన్నారు. అలాంటి పల్లె ప్రజల్లో నైపుణ్యాలు మెరుగుపరచి ఉపాధి పొందేలా.. స్వయం సమృద్ధి సాధించేలా చూసే లక్ష్యంతో ఏర్పాటైందే... శ్రీ స్వామి రామానంద తీర్థ రూరల్ ఇన్‌స్టిట్యూట్ (ఎస్ఆర్‌టీఆర్ఐ). నల్గొండ జిల్లా భూదాన్ పోచంపల్లి వద్ద జలాల్‌పూర్ గ్రామంలో 1995 లో ఈ సంస్థను ఏర్పాటు చేశారు. వంద ఎకరాల క్యాంపస్‌లో అధునాతన పరిశోధనశాలలు, కంప్యూటర్స్, క్లాస్‌రూమ్స్, మహిళలకు, పురుషులకు ప్రత్యేక హాస్టళ్లు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న నిరుద్యోగ యువతీ, యువకులకు స్వయం ఉపాధిని అందించడమే ధ్యేయంగా ఈ సంస్థ పనిచేస్తోంది. ఇందుకోసం వారం వ్యవధి ఉన్న కోర్సుల నుంచి 3 నెలల వ్యవధి ఉన్న కోర్సులను సంస్థ అందిస్తోంది. ఎప్పటికప్పుడు మార్కెట్‌లో వస్తున్న మార్పులకనుగుణంగా, కంపెనీల అవసరాలను దృష్టిలో పెట్టుకుని 26 రకాల కోర్సులను అందిస్తోంది. అంతేకాకుండా వివిధ చిన్నతరహా పరిశ్రమలలో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌ను కల్పించడమే కాకుండా.. స్వయం ఉపాధిని కోరుకునేవారికి గైడెన్స్‌ను కూడా ఇస్తోంది. వీటితోపాటు పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌తోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్‌లో కూడా శిక్షణనిస్తోంది.

**కోర్సులన్నీ ఉచితమే..**
ప్రవేశం పొందిన విద్యార్థులందరికీ కోర్సులన్నీ ఉచితమే. అంతేకాకుండా హాస్టల్ సదుపాయం కూడా కల్పిస్తారు. మెస్ ఛార్జీల కింద ఎస్సీ, ఎస్టీలు నెలకు ₹ 700, ఇతర కేటగిరీలవారు నెలకు ₹1000 సంస్థకు చెల్లించాలి.

**ప్రవేశాల క్యాలెండర్:**
2012-13 సంవత్సరానికిగానూ మొత్తం ఐదుసార్లు ప్రవేశాలు కల్పిస్తారు. అవి ఏప్రిల్-మే, జూన్-జూలై, ఆగస్టు-సెప్టెంబర్, అక్టోబర్-నవంబర్, డిసెంబర్-జనవరి. ప్రస్తుతం ఆగస్టు 21 నుంచి కోర్సుల ప్రవేశాలు ప్రారంభమవుతాయి.

**ఇతర సంస్థల సహకారంతో..**
ఈ క్రమంలో ఇన్‌స్టిట్యూట్ ఇతర సంస్థల సహకారాన్ని సైతం తీసుకుంటుంది. ఇందుకోసం వివిధ ప్రభుత్వ సంస్థలు, ఎన్‌జీవోలతో కలిసి పనిచేస్తోంది. వాటిలో మినిస్ట్రీ ఆఫ్ న్యూ అండ్ రెన్యుబల్ ఎనర్జీ, న్యూఢిల్లీ, ఎంఎస్‌ఎంఈ-హైదరాబాద్, ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ అండ్ మార్కెటింగ్ మిషన్-హైదరాబాద్, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ రూరల్ ఇన్‌స్టిట్యూట్స్-హైదరాబాద్ వంటి సంస్థలున్నాయి.

**కోర్సులు:**
**ఐదో తరగతి :** కటింగ్ అండ్ టైలరింగ్ (వ్యవధి: 3 నెలలు), అడ్వాన్స్‌డ్ గార్మెంట్ మేకింగ్ (వ్యవధి: 3 నెలలు), డిజైనర్ బ్లౌజ్ మేకింగ్ (వ్యవధి: 2 నెలలు), ఎంబ్రాయిడరీ (హ్యాండ్ అండ్ మెషీన్) (వ్యవధి: 2 నెలలు), డైయింగ్ అండ్ ఫ్యాబ్రిక్ పెయింటింగ్ (వ్యవధి: 2 నెలలు), జర్దోసి అండ్ ఆరి వర్క్స్(వ్యవధి: 2 నెలలు), క్విల్ట్ ఆర్టికల్స్ ఆండ్ ఫ్యాన్సీ బ్యాగ్స్ (వ్యవధి: 2 నెలలు). ఈ కోర్సులన్నీ కేవలం మహిళలకు మాత్రమే అందిస్తున్నారు. బేసిక్ ఫుడ్ ప్రాసెసింగ్, మ్యాంగో అండ్ మిక్స్‌డ్ ఫ్రూట్స్ బార్స్, డొమెస్టిటిక్ డిటర్జెంట్స్ అండ్ క్లీనర్స్ కోర్సులను మహిళలతోపాటు పురుషులకు కూడా ఆఫర్ చేస్తున్నారు. ఈ కోర్సుల వ్యవధి వారం రోజులు.

**పదో తరగతి (పాస్/ఫెయిల్):**
డేటా ఎంట్రీ ఆపరేటర్ (వ్యవధి: 2 నెలలు), ఎలక్ట్రీషియన్ ట్రేడ్ (వ్యవధి: 3 నెలలు), ఎలక్ట్రానిక్ మెకానిజం (వ్యవధి: 2 నెలలు), సెల్‌ఫోన్ రిపేరింగ్ (వ్యవధి: 1 నెల), ఆటోమొబైల్ మెకానిజం (వ్యవధి: 3 నెలలు), ఫార్మ్ మెషినరీ మెకానిజం అండ్ ట్రాక్టర్ డ్రైవింగ్ (వ్యవధి: 2 నెలలు), సోలార్ ఎనర్జీ (ఎస్‌పీవీ అండ్ సోలార్ థర్మల్) (వ్యవధి: 2 నెలలు) కోర్సులను అందిస్తున్నారు. వీటిల్లో ఎలక్ట్రీషియన్ ట్రేడ్, ఆటోమొబైల్ మెకానిజం, ఫార్మ్ మెషినరీ మెకానిజం ఆండ్ ట్రాక్టర్ డ్రైవింగ్ కోర్సులకు పురుషులు మాత్రమే అర్హులు. వీటితోపాటు మహిళలకు 3 నెలల వ్యవధి ఉన్న ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సును ఆఫర్ చేస్తున్నారు.

**ఇంటర్మీడియెట్:**
ఎంఎస్ ఆఫీస్, డెస్క్‌టాప్ పబ్లిషింగ్, వెబ్ డిజైనింగ్, కంప్యూటరైజ్‌డ్ అకౌంటింగ్ (ట్యాలీ), కంప్యూటర్ హార్డ్‌వేర్ మెకానిజం, కంప్యూటర్ నెట్‌వర్కింగ్, 2డీ యానిమేషన్ (ఇంటర్‌తోపాటు డీటీపీ) కోర్సులను అందిస్తున్నారు. ఈ కోర్సులన్నిటి వ్యవధి 2 నెలలు. అదేవిధంగా డిగ్రీ అర్హతతో టెస్టింగ్ టూల్స్‌ను ఆఫర్ చేస్తున్నారు.
వెబ్‌సైట్: www.srtri.in

స్వశక్తితో సంపాదన పొందాలనుకునేవారికి సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ ఆపర్చునిటీస్ ఎన్నో ఉన్నాయి. వాటి గురించి తెలుసుకుని నైపుణ్యాలు పెంచుకుంటే స్వయం ఉపాధికి ఢోకా లేదు. మా సంస్థలో వివిధ స్వయం ఉపాధినందించే కోర్సులతోపాటు భవిష్యత్‌లో వ్యాపారంలో సమర్థంగా రాణించేందుకు అవసరమైన కమ్యూనికేషన్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్‌పై శిక్షణనిస్తున్నాం. కోర్సులు పూర్తిచేసుకున్నవారికి వివిధ కంపెనీలతో మాట్లాడి ప్లేస్‌మెంట్స్ కూడా అందిస్తున్నాం. స్వయం ఉపాధి కోసం రుణాలు పొందడానికి గల అవకాశాలపైనా అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పటివరకు దాదాపు 1,30,000 మంది విద్యార్థులు వివిధ కోర్సుల్లో శిక్షణ పొందారు. మా సంస్థ కింద 12 జిల్లాలో ఎక్స్‌టెన్షన్ సెంటర్స్ ఉన్నాయి. సంబంధిత గ్రామ పంచాయతీ సర్పంచ్, మండల అధికారులు వసతి సౌకర్యం కల్పిస్తే ఆయా ప్రాంతాలలో కూడా వివిధ స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణనిస్తాం. ఇందుకు సంబంధించిన మిషనరీ, ఎక్విప్‌మెంట్స్ మేమే సమకూరుస్తాం. రాజీవ్ యువకిరణాలు, ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ఆండ్ మార్కెటింగ్ మిషన్, మినిస్ట్రీ ఆఫ్ రెన్యుబల్ ఎనర్జీ వంటివాటితో పనిచేస్తున్నాం.

డాక్టర్ డి.హన్మంతరావు,
క్యాంపస్ ట్రెనింగ్ ప్రోగ్రామ్ ఇన్‌ఛార్జ్,
స్వామి రామానంద తీర్థ రూరల్ ఇన్‌స్టిట్యూట్,
భూదాన్‌పోచంపల్లి.

# కార్పొరేట్ ప్రపంచంలో ఉజ్జ్వల కెరీర్‌కు.. క్యాట్

**ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)లలో చేరితే..కోర్సు పూర్తి కాకముందే కార్పొరేట్ దిగ్గజాలు రెడ్ కార్పెట్ పరుస్తాయి. కార్పొరేట్ ప్రపంచంలో ఉజ్జ్వల కెరీర్‌కు పునాది ఐఐఎంలు. అలాంటి ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్‌లలో ప్రవేశానికి మార్గం కామన్ అడ్మిషన్ టెస్ట్ (క్యాట్).. అందుకే 'క్యాట్' పరీక్ష అంటే యువతకు ఎంతో క్రేజ్. 2012 సంవత్సరానికి క్యాట్ నోటిఫికేషన్ విడుదలైంది.**



ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)లలో పీజీ పట్టా పొందడమంటే.. అవకాశాలకు ఆకాశమే హద్దు. దేశ వ్యాప్తంగా 13 నగరాల్లో ఐఐఎం క్యాంపస్‌లు ఉన్నాయి. వీటిల్లో అడ్మిషన్ పొందడం ద్వారా ఉన్నత కెరీర్‌కు బాటలు వేసుకోవాలనుకునే విద్యార్థులు ఎందరో. దాదాపు 3000 సీట్ల కోసం పోటీ లక్షల్లోనే ఉంటుంది. కాబట్టి పకడ్బందీ ప్రిపరేషన్‌తో విజయం సాధ్యం.

### గతేడాది మాదిరిగానే:

క్యాట్ పరీక్షను ఈ ఏడాది ఐఐఎం-కోజికోడ్ కో-ఆర్డినేట్ చేస్తుంది. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ పద్ధతిలో పరీక్షను నిర్వహిస్తారు. అన్ని రకాల అకడెమిక్ బ్యాక్‌గ్రౌండ్లకు చెందిన విద్యార్థులను ప్రోత్సహించడానికి వీలుగా గతేడాది ప్రారంభించిన ఎగ్జామ్ ప్యాట్రన్‌నే ఈ ఏడాది కూడా అమలు చేస్తున్నారు. ఇందులో రెండు విభాగాలు ఉంటాయి. అవి.. క్వాంటిటేటివ్ ఎబిలిటీ అండ్ డేటా ఇంటర్ ప్రిటేషన్; వెర్బల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్. పరీక్షలో..ఈ రెండు విభాగాలకు ప్రత్యేకమైన సమయ పరిమితి ఉంటుంది. ప్రతి విభాగానికి 70 నిమిషాల చొప్పున మొత్తం 140 నిమిషాల సమయాన్ని సమాధానాలను గుర్తించడానికి కేటాయించారు. ప్రతి సెక్షన్లో 30 ప్రశ్నలకు సమాధానం రాయాలి. ప్రతి సెక్షన్‌కు కౌంట్‌డౌన్ టైమర్ నిబంధన ఉంటుంది. నిర్దిష్ట సెక్షన్‌కు కేటాయించిన సమయం పూర్తయితే సమాధానలివ్వడం పూర్తి కాకున్నా మరో సెక్షన్‌కు వెళ్లాలి.

### ట్యుటోరియల్-ప్రాక్టీస్ టెస్ట్:

పరీక్ష ప్రారంభానికి ముందు.. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ సమయంలో ఎలా వ్యవహరించాలి అనే విషయంలో అభ్యర్థులకు అవగాహన కల్పించే ఉద్దేశంతో సూచనలు, సలహాలతో కూడిన 15 నిమిషాల ట్యుటోరియల్ అందుబాటులో ఉంటుంది. రిపోర్టింగ్ టైమ్ విషయానికొస్తే.. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు గంటన్నర ముందు రిపోర్ట్ చేయాలి. వెబ్‌సైట్‌లో క్యాట్-2012 ప్రాక్టీస్ టెస్ట్ అందుబాటులో ఉంది. క్యాట్ టెస్ట్ సైట్స్ వివరాలు రిజిస్ట్రేషన్ ప్రారంభమైన తర్వాత అందుబాటులోకి వస్తాయి.

### ప్రవేశ విధానం:

క్యాట్ స్కోర్ ఆధారంగా అభ్యర్థులు.. దేశ వ్యాప్తంగా ఉన్న 13క్యాంపస్‌లలో.. తమకు నచ్చిన ఇన్‌స్టిట్యూట్‌లలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలి. ఎంపిక ఇన్‌స్టిట్యూట్‌లను బట్టి వేర్వేరుగా ఉంటుంది. సాధారణంగా క్యాట్ స్కోర్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు.. రిటెన్ ఎబిలిటీ టెస్ట్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ వంటి పద్ధతుల ద్వారా అడ్మిషన్ కల్పిస్తారు. షార్ట్‌లిస్ట్ సమయం లో.. ప్రీవియస్ అకడెమిక్ రికార్డు, వర్క్ ఎక్స్‌పీరియెన్స్ తదితర అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. వివరాల కోసం ఆయా ఇన్‌స్టిట్యూట్‌ల వెబ్‌సైట్లను చూడొచ్చు.

### క్యాట్-2012 సమాచారం

**అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి 50 శాతం (ఎస్సీ/ఎస్టీ/డిఫెరెంట్లీ ఎబుల్డ్‌లకు 45 శాతం) మార్కులతో ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ లేదా తత్సమానం.

**దరఖాస్తు విధానం:** ఎంపిక చేసిన యాక్సిస్ బ్యాంక్ శాఖల నుంచి క్యాట్ వోచర్‌ను కొనుగోలు చేయాలి. తర్వాత ఆన్‌లైన్‌లో ఎగ్జామ్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. www.catiim.in వెబ్‌సైట్ ఓపెన్ చేసి 'రిజిస్టర్ ఫర్ క్యాట్ 2012' అనే ఆప్షన్ మీద క్లిక్ చేయాలి. ఆ వెంటనే ఓ ప్రత్యేక స్క్రీన్ ఓపెన్ అవుతుంది. అందులో వోచర్ నెంబర్ అనే ఆప్షన్‌లో సంబంధిత వోచర్ నెంబర్‌ను ఎంటర్ చేయడంతో పాటు.. దానికింద సెక్యూరిటీ కోడ్ బాక్స్‌లో నెంబర్లను ఎంటర్ చేయాలి. సెక్యూరిటీ కోడ్ బాక్స్‌పైన అప్పటికే కనిపించిన నెంబర్లనే రాయాలి. ఈ రెండు ప్రక్రియలు పూర్తయ్యాక 'సబ్మిట్' బటన్ మీద క్లిక్ చేస్తే.. క్యాట్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఈ క్రమంలో తొలుత లాగిన్ విండో ఓపెన్ అవుతుంది. రిజిస్ట్రేషన్ క్రమంలో అభ్యర్థులు ఐఐఎంలు, కోర్సుల వివరాలను ఎంటర్ చేసేటప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలి. రిజిస్ట్రేషన్ సంబంధిత వివరాల కోసం www.catiim.in చూడొచ్చు.

**వోచర్ల అమ్మకం:** జూలై 30-సెప్టెంబర్ 17, 2012
**రిజిస్ట్రేషన్ షెడ్యూల్:**జూలై 30-సెప్టెంబర్19, 2012
**టెస్ట్ షెడ్యూల్:** అక్టోబర్ 11 - నవంబర్ 6, 2012
**ఫలితాల విడుదల:** జనవరి 9, 2013
**వివరాలకు:** www.catiim.in

## ప్రిపరేషన్ టిప్స్

### అవగాహన:

ముందుగా పరీక్షలో అడిగే నాలుగు సబ్జెక్ట్‌లు.. క్వాంటిటేటివ్, వెర్బల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్, డేటా ఇంటర్‌ప్రిటేషన్‌పై అవగాహన పెంచుకోవాలి. క్వాంటిటేటివ్ ఎబిలిటీలో.. అల్జీబ్రా, జామెట్రీ, ట్రిగ్నోమెట్రీ, మెన్సురేషన్ వంటి అంశాలు ఉంటాయి. వెర్బల్ ఎబిలిటీలో రీడింగ్ కాంప్రెహెన్షన్, గ్రామర్, వొకాబులరీ వంటి అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి. డేటా ఇంటర్‌ప్రిటేషన్‌లో గ్రాఫ్స్, చార్ట్స్ సంబంధ ప్రశ్నలు అడుగుతారు.

### బేసిక్స్‌పై పట్టు:

అందరూ భావిస్తున్నట్లు క్యాట్ క్లిష్టంగా ఉండదు. మ్యాథమెటిక్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులలోని నాలెడ్జ్‌ను టెస్ట్ చేసే విధంగా ఉంటుంది. ఇవి కూడా స్కూల్ స్థాయికి అటుఇటుగా ఉంటాయి. కాబట్టి క్యాట్‌కు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులు సంబంధిత అంశాల్లోని బేసిక్స్‌పై పట్టు సాధించే విధంగా కృషి చేయాలి అంటున్నారు క్యాట్-2011లో 99.99 పర్సంటైల్‌తో టాపర్‌గా నిలిచిన శేఖర్ ఆనంద్. కాబట్టి ప్రాథమిక దశ నుంచి ప్రిపరేషన్ సాగించడం మంచిది. అంశాల వారీగా.. సీబీఎస్ఈ/ ఐసీఎస్ఈ పదో తరగతి మ్యాథమెటిక్స్, ఇంగ్లిష్ గ్రామర్ పుస్తకాలు చదవాలి. టైమ్స్ ఆఫ్ ఇండియా, హిందూ, ఎకనామిక్ టైమ్స్ వంటి దిన పత్రికలను క్రమం తప్పకుండా చదవాలి. వీటిల్లో ఉపయోగించే పదాల కోసం ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీని రిఫర్ చేయడం కూడా ఇంగ్లిష్ ఇంప్రూవ్ అవ్వడానికి దోహదం చేస్తుంది.

### బలాలు-బలహీనతలు:

క్యాట్ ప్రిపరేషన్ క్రమంలో అభ్యర్థులు ముందుగా స్వీయ విశ్లేషణ చేసుకోవాలి. అంశాల వారీగా తమ అవగాహన స్థాయి తెలుసుకోవాలి. ఇందు కోసం మాక్ టెస్ట్‌లకు హాజరవ్వాలి. తమ అవగాహన స్థాయిని రివ్యూ చేసుకోవాలి. దీన్ని ఆధారంగా చేసుకుని ప్రిపరేషన్ ప్లాన్ రూపొందించుకోవచ్చు. ఒక సెక్షన్లో తక్కువ స్కోర్ చేయడానికి గల కారణాలను విశ్లేషించుకోవాలి. కాన్సెప్ట్‌పై పట్టు లేకపోవడమా లేదా ప్రాక్టీస్ లేకపోవడమా? ఏది కారణమనే విషయాన్ని సమీక్షించుకోవాలి. ప్రతి విభాగంలో తప్పు చేస్తున్న అంశాలపై దృష్టి సారించి వాటికి ప్రత్యేక స్ట్రాటజీ రూపొందించుకోవాలి. వీక్‌గా ఉన్న సెక్షన్లో స్ట్రాంగ్ అయ్యే విధంగా పట్టు ఉన్న విభాగాలపై మరింత పట్టు సాధించేలా ప్రిపరేషన్ స్ట్రాటజీ ఉండాలి.

### టైమ్ మేనేజ్‌మెంట్:

పరీక్ష కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న తేదీ, అందుబాటులో ఉన్న సమయం, వ్యక్తిగత ప్రతిభ ఆధారంగా సెక్షన్ల వారీగా అందుబాటులో ఉన్న సమయాన్ని విభజించుకుని టైమ్ టేబుల్ రూపొందించుకోవాలి. మంచి స్కోర్ చేసిన సబ్జెక్టుకు ఎక్కువ సమమం కేటాయించాలి. అదే సమయంలో తక్కువ స్కోర్ చేసిన సెక్షన్లను విస్మరించకూడదు. వారానికి కనీసం రెండు మాక్ టెస్ట్‌లు రాసే విధంగా ప్రణాళిక రూపొందించుకోవాలి. తర్వాత వీటి సంఖ్య మూడుకు పెంచాలి. తర్వాత ఫలితాలను విశ్లేషించుకుని అవసరమైతే బేసిక్స్‌పై దృష్టి సారించాలి. ప్రతి అభ్యర్థి సెప్టెంబర్ చివరి నాటికి వీలైనంత ఎక్కువ అంశాల్లో ప్రతిభను మెరుగుపరుచుకునేలా లక్ష్యం ఏర్పరచుకోవాలి. ఆ తర్వాత నుంచి పరీక్ష రోజు వరకు అందుబాటులో ఉన్న సమయంలో నేర్చుకున్న అంశాల పునశ్చరణకు కేటాయించాలి. పునశ్చరణ వల్ల కాన్సెప్ట్‌లపై మరింత పట్టుకు వీలవుతుంది. ఈ సమయంలో కొత్త అంశాలను ప్రయత్నించడం సరికాదు.

ఇటు ప్రిపరేషన్, అటు పరీక్ష సమయంలో టైం మేనేజ్‌మెంట్ ఎంతో ప్రధానం. ముఖ్యంగా గత ఏడాదే మొదలు పెట్టిన ఆన్‌లైన్ టెస్ట్ విధానంతో టైం మేనేజ్‌మెంట్ ఆవశ్యకత ఎంతో పెరిగింది. రీజనింగ్ ఎబిలిటీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్ విభాగాల్లో కష్టమైన ప్రశ్నలకు సమాధానం ఇవ్వడానికి ఎక్కువ సమయం తీసుకుంటుంది. అందువల్ల చివర్లో సమయం చాలక మార్కులు కోల్పోయే ప్రమాదం ఉంది. సులువైన, ఎక్కువ మార్కులు వచ్చే విభాగాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రిపరేషన్ సాగిస్తే విజయం సాధించవచ్చు. ఈ విషయంలో పరీక్ష సమయంలో నిర్ణీత విభాగంలో సామర్థ్యం, కేటాయించాల్సిన సమయాలను పరిగణనలోకి తీసుకోవాలి.

### ప్రశ్నల ఎంపిక:

క్యాట్ మాత్రమే కాకుండా ఇతర పరీక్షల్లోనూ విజయానికి దోహదం చేసే వ్యూహం ప్రశ్నల ఎంపిక. నిర్ణీత సెక్షన్‌కు కేటాయించిన సమయంలో ముందుగా బాగా వచ్చిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చిన తర్వాతే మిగతా ప్రశ్నలవైపు దృష్టి సారించాలి. దీనికి ఎలాంటి ప్రిపరేషన్, టెక్నిక్స్ ఉండవు. ప్రతి విద్యార్థి స్వయంగా తమ అవగాహన స్థాయి ఆధారంగానే దీన్ని గుర్తించాలి.

## సబ్జెక్టుల వారీగా

### రీడింగ్ కాంప్రహెన్షన్:

ఇందులో రాణించాలంటే సునిశిత పరిశీలన, ఏకాగ్రత అవసరం. రీడింగ్ ప్రాక్టీస్ చేయాలి. దినపత్రికలు, మేగజీన్లు, ఇంటర్నెట్ బ్లాగ్స్ చక్కటి మార్గాలు. గ్రామీణ స్థాయి నుంచి అంతర్జాతీయం వరకు ఆర్థిక, సామాజిక, రాజకీయ, సమకాలీన అంశాలపై అవగాహన మేలు చేస్తుంది. ఒక అంశం సారాంశాన్ని సంక్షిప్తంగా రాసే నైపుణ్యం సొంతం చేసుకోవాలి.

### క్వాంటిటేటివ్ ఎబిలిటీ:

ఇందులో మంచి మార్కులకు బేసిక్స్‌పై పట్టు ప్రధాన మార్గం. ఒక చాప్టర్‌లోని అంశాలను విభజించుకుని ప్రాక్టీస్ చేయడం సముచితం. ముఖ్యంగా నంబర్స్, జామెట్రీ, అల్జీబ్రా విభాగాల్లో ఈ విదానం ఎంతో అవసరం. ప్రాక్టీస్ కూడా ఎంతో ముఖ్యం. నేరుగా సమాధానాలను ఆలోచించకుండా నిర్ణీత సమస్యకు సంబంధించి ఫార్ములా ఆధారంగా దశల వారీగా సమాధానం పొందే విధంగా నైపుణ్యం సాధించాలి.

### లాజికల్ రీజనింగ్:

అభ్యర్థులు తమ స్వీయ ఆలోచనతో రాణించగలిగే విభాగమిది. ఒక సమాచారం ఇచ్చి దాని ఆధారంగా అడిగే ప్రశ్నలకు సమాధానాలివ్వాల్సి ఉంటుంది. కాబట్టి ప్రశ్నల్లోని స్టేట్‌మెంట్లను ఇతర స్టేట్‌మెంట్లతో పోల్చి 'కీ'లక పరిష్కారాన్ని గుర్తించే నైపుణ్యం అవసరం.

### డేటా ఇంటర్‌ప్రిటేషన్:

ఇతర సబ్జెక్టులతో పోల్చితే అభ్యర్థులకు క్లిష్టంగా భావించే విభాగం డేటా ఇంటర్‌ప్రిటేషన్. పైచార్ట్‌లు, గ్రాఫ్‌లు, టేబుల్స్‌ను విశ్లేషిస్తూ ప్రిపరేషన్ సాగించాలి. అంతేకాకుండా.. సూక్ష్మ పరిశీలన, కాలిక్యులేషన్, లాజికల్ రీజనింగ్ ఆధారిత ప్రశ్నలు కూడా ఉంటాయి. ఈ విభాగంలో పట్టు కోసం సాధనం నిరంతర ప్రాక్టీస్. ఒక నిర్ణీత అంశాన్ని వేగంగా విశ్లేషించే సామర్థ్యం సొంతం చేసుకోవాలి. ముఖ్యంగా పర్సంటేజీ, యావరేజెస్‌పై పట్టు సాధించాలి.

NEET + INTERMEDIATE Joint Preparation

# సబ్జెక్టివ్.. ప్లస్ ఆబ్జెక్టివ్.. 'నీట్' గా విజయం



**ఎంబీబీఎస్.. బీడీఎస్.. లక్షల మంది విద్యార్థులకు లక్ష్యంగా మారిన మెడికల్ కోర్సులు. అందుకే ఇంటర్మీడియెట్‌లో బైపీసీ గ్రూపులోకి అడుగులు. ఆ అడుగులకు తోడుగా అనునిత్యం అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకుంటూ సాగుతూ.. పకడ్బందీ ప్రణాళికతో పట్టు బిగిస్తేనే.. మెడికల్ ఎంట్రెన్స్‌లలో సక్సెస్ సొంతం. ముఖ్యంగా మెడికల్ యూజీ కోర్సులు ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశానికి జాతీయ స్థాయిలో 'నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ (నీట్)-యూజీ'కి రంగం సిద్ధం కావడంతో.. విద్యార్థులు ఇంటర్మీడియెట్‌లో చేరిన తొలిరోజు నుంచే ఆ దిశగా దృష్టి సారించాల్సిన అవశ్యకత ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఇంటర్మీడియెట్ చదువుతోపాటు.. నీట్ ప్రిపరేషన్‌కు అనుసరించాల్సిన వ్యూహాలపై నిపుణుల సలహాలు..**

ఒక వైపు జాతీయ స్థాయిలో నీట్ నిర్వహణ ఖాయం అయింది. మరోవైపు ఈ ఏడాది నుంచి ఇంటర్మీడియెట్ (మొదటి సంవత్సరం) సిలబస్ మారింది. ఈ రెండిటినీ అనుసంధానం చేసుకుంటూ.. సమయం ఆదా చేసుకునే విధంగా ప్రిపరేషన్ సాగించడం ఎలా? అనే విషయంలో బైపీసీ విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఒకరకంగా మారిన సిలబస్‌ను విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చే అంశంగానే పేర్కొనవచ్చు. ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశానికి మార్గం వేసే 'నీట్' మాత్రమే కాకుండా... ఐఐటీ, ఎన్ఐటీ వంటి ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లలో ప్రవేశానికి కూడా జాతీయ స్థాయిలో ఉమ్మడి ప్రవేశ పరీక్ష జరగనుంది. వీటిని దృష్టిలో పెట్టుకుని మన రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ సిలబస్‌లో మార్పులు చేశారు. ఇప్పటికే జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల నిర్వహణకు ప్రామాణికంగా భావించే సీబీఎస్ఈ సిలబస్‌ను ఆధారంగా కొత్త సిలబస్ రూపకల్పన చేశారు. ఇది మన రాష్ట్ర విద్యార్థులకు కలిసొచ్చే అంశం. అంతేకాకుండా మన రాష్ట్ర విద్యార్థులకు 'నీట్-2013'కు మినహాయింపునిచ్చి.. 'నీట్-2014'కు సిద్ధం చేసే అవకాశాలు కనిపించడం కూడా మరో ప్రయోజనకర అంశం. ఈ క్రమంలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో మొదటి సంవత్సర సిలబస్‌లో మార్పులు చేసిన విధంగానే.. 2013లో ద్వితీయ సంవత్సర సిలబస్‌లో కూడా మార్పులు జరగనున్నాయి. కాబట్టి విద్యార్థులు నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఇక.. ప్రస్తుత విద్యా సంవత్సరంలో మొదటి సంవత్సరంలో అడుగు పెట్టిన విద్యార్థులు 'నీట్', ఇంటర్మీడియెట్ పరీక్షల ప్రిపరేషన్‌ను అనుసంధానం చేసుకుంటూ సాగేందుకు మెళకువలు...

## సబ్జెక్టివ్ + ఆబ్జెక్టివ్:

ఇంటర్మీడియెట్ పబ్లిక్ ఎగ్జామ్స్: నీట్‌లో సక్సెస్ క్రమంలో విద్యార్థులు ముందుగా అలవర్చుకోవాల్సిన లక్షణాలు రెండు. అవి.. సబ్జెక్టివ్ అప్రోచ్; ఆబ్జెక్టివ్ అప్రోచ్. బోర్డ్ పరీక్షలు సబ్జెక్టివ్ విధానంలో వాక్యాల రూపంలో సమాధానాలు ఇవ్వాల్సినవిగా ఉంటాయి. నీట్, ఇతర ప్రవేశ పరీక్షలు ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటాయి. కాబట్టి విద్యార్థులు ఒక చాప్టర్‌ను చదివేటప్పుడు ముందుగా బోర్డ్ ఎగ్జామ్‌ను దృష్టిలో పెట్టుకుని పూర్తి పాఠ్యాంశాన్ని అధ్యయనం చేయాలి. ఆ తర్వాత అందులోని ముఖ్యాంశాలను పాయింట్ల రూపంలో పొందుపర్చుకోవాలి. ఈ ముఖ్యాంశాలను రూపొందించుకునే క్రమంలో నీట్ సిలబస్‌ను పరిగణనలోకి తీసుకోవడం మరింత ప్రయోజనం చేకూర్చుతుంది. అనవసరమైన అంశాలపై సమయం వృథాను తప్పించవచ్చు. ఉదాహరణకు బయాలజీని పరిశీలిస్తే జీవ స్వరూప శాస్త్రం, ఆంతర్ నిర్మాణ శాస్త్రం, వృక్ష వర్గీకరణం వంటి పాఠ్యాంశాలకు సీబీఎస్ఈ సిలబస్‌లో స్వల్ప ప్రాధాన్యం ఉంది. విద్యార్థులు దీన్ని దృష్టిలో పెట్టుకుని ఆబ్జెక్టివ్ అప్రోచ్ కోణంలో పాయింట్లు రూపొందించుకోవాలి. ఇలా సాగితే.. ఒకే సమయంలో రెండు లక్ష్యాల సాధనకు అవకాశాలు మరింత మెరుగవుతాయి.

## క్లిష్టం.. ఇష్టంగా మారాలంటే:

ఇంటర్మీడియెట్‌లో ముఖ్యంగా బైపీసీ గ్రూపులో అధిక శాతం పాఠ్యాంశాలు క్లిష్టమైనవి... అదే సమయంలో పలు పరీక్షల కోణంలో ముఖ్యమైనవి. చాలామంది విద్యార్థులు వీటిని గుర్తుంచుకునే విషయంలో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటారు. దీన్ని అధిగమించాలంటే క్లిష్టంగా భావించే పాఠ్యాంశాలకు సంబంధించి ముఖ్యాంశాలతో సినాప్సిస్, వాటికి సంబంధించి ఫ్లోచార్ట్స్, మెమొరీ క్యాప్స్యూల్స్ (ఉదాహరణకు నాలుకతో సంబంధం కలిగిన కపాల నాడులు/ శాఖలకు సంబంధించి HYLIMCA టెక్నిక్), యాంగ్రానిమ్స్ వంటి చిన్నపాటి చిట్కాలు మేలు చేస్తాయి. ఈ టెక్నిక్స్ అకడెమిక్ పరీక్షలకే కాకుండా పోటీ పరీక్షల సమయంలో రివిజన్ కోణంలోనూ ఎంతో లాభిస్తాయి. క్లిష్టమైన, ముఖ్యమైన అంశాలను గుర్తుంచుకునే విషయంలో అత్యంత విలువైన టెక్నిక్ మెమొరీ క్యాప్స్యూల్స్. .

## ప్రతి చాప్టర్‌కు.. ప్రాక్టీస్ టెస్ట్‌లు:

విద్యార్థులు బోర్డ్ సిలబస్‌కు అనుగుణంగా తమ ప్రిపరేషన్ పూర్తి చేసిన ప్రతి చాప్టర్‌కు సంబంధించి ఏఐపీఎంటీ, ఎయిమ్స్, జిప్‌మర్ వంటి జాతీయస్థాయి పరీక్షల గత ప్రశ్న పత్రాలను ప్రాక్టీస్ చేయాలి. ఈ మూడు పరీక్షలకు ప్రధాన ప్రాతిపదిక సీబీఎస్ఈ సిలబస్. ఆదే సిలబస్ ఆధారంగా నీట్ కూడా జరగనుంది. ఇలా ప్రతి చాప్టర్ పూర్తయిన వెంటనే దానికి సంబంధించి ప్రాక్టీస్ టెస్ట్‌ల వల్ల మరింత సత్ఫలితాలు సాధ్యమవుతాయి. అంతేకాకుండా విద్యార్థులు సంబంధిత పాఠ్యాంశంలో తమకున్న పరిజ్ఞానంపై స్పష్టమైన అవగాహన ఏర్పడుతుంది. బలహీనంగా ఉన్న అంశాలను గుర్తించి వాటికి మరికొంత సమయం కేటాయించుకోవాలి.

## సిలబస్ మారినా.. నో టెన్షన్:

'బోర్డ్ సిలబస్ మారింది. క్లిష్టంగా ఉంటుందేమో'.. వంటి అనవసర ఆందోళనలకు విద్యార్థులు దూరంగా ఉండాలి. సిలబస్ మారినా అధిక శాతం అంతకుముందు మన అకాడెమీ పుస్తకాల్లో ఉన్న అంశాలే. జాతీయ ఉమ్మడి పరీక్షల కోణంలో విద్యార్థుల సౌలభ్యం కోసం కొన్ని మార్పు, చేర్పులు చేశారు. ఉదాహరణకు సీబీఎస్ఈ 12వ తరగతిలో ఉన్న పర్యావరణం, పర్యావరణ సమస్యలు, జీవ శాస్త్రం, మానవ సంక్షేమం తదితర అంశాలను మన రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో పొందుపర్చారు. అంతేకాకుండా సిలబస్‌లో సమతుల్యం సాధించేలా కూడా కొత్త సిలబస్ ఉంది. ఈ క్రమంలో తెలుగు అకాడెమీ బోటనీ, జువాలజీ పుస్తకాల్లోనుంచి ఇప్పటికే ఎన్‌సీఈఆర్‌టీ బయాలజీలో ఉండే అన్ని అంశాలను జూనియర్ ఇంటర్మీడియెట్‌లో యధాతథంగా చేర్చారు.

## కామన్ ఎంట్రెన్స్.. కంపేరిటివ్ అప్రోచ్:

బోర్డ్ సిలబస్‌లో ఆసాంతం పట్టు సాధించడంతోపాటు నీట్‌లో సక్సెస్ సాధించాలంటే విద్యార్థులు కంపేరిటివ్ అప్రోచ్‌పై దృష్టి సారించాలి. అంటే మన రాష్ట్ర స్థాయిలో నిర్వహించే ఎంసెట్ పాత ప్రశ్న పత్రాలను, జాతీయ స్థాయిలోని ఏఐపీఎంటీ, ఎయిమ్స్, జిప్‌మర్, ఏఎఫ్ఎంసీ తదితర ప్రశ్న పత్రాలతో పోల్చి చూడాలి. ఒకే అంశానికి సంబంధించి ఈ రెండు రకాల పరీక్షల మధ్య ప్రశ్నలు అడిగే తీరులోని తేడాను గమనించాలి. ఉదాహరణకు ఎంసెట్‌లో ప్రశ్నలు ఆరు రకాలుగా ఉంటాయి. అదే ఏఐపీఎంటీలో మూడు రకాలుగానే ప్రశ్నలుంటాయి. ఇలా తేడాను గమనించాలి. ప్రస్తుతం మొదటి సంవత్సరం విద్యార్థులు ఏఐపీఎంటీ కోణంలో సాగడం సముచితం. ఎందుకంటే ఏఐపీఎంటీ నిర్వహణను సీబీఎస్ఈ చేపడుతోంది. నీట్ నిర్వహణ బాధ్యతలు కూడా సీబీఎస్ఈకే కేటాయించారు. ఎంట్రెన్స్ కోణంలోనే కాకుండా బోర్డ్ సిలబస్ అధ్యయనం కోణంలో కూడా కంపేరిటివ్ అప్రోచ్ కలిసొస్తుంది. సమయం ఆదా అవుతుంది. ఉదాహరణకు బోటనీ 'ప్లాంట్స్'ను పరిగణనలోకి తీసుకుంటే వేరులోని ట్యాప్‌రూట్ మోడిఫికేషన్, లీఫ్, స్టెమ్, రూట్ మోడిఫికేషన్స్ వంటివి ఇతర అంశాల్లోనూ కనిపిస్తాయి. ఆలాంటి వాటిని గుర్తించి చార్ట్స్ రూపంలో పొందుపర్చుకుంటే బోర్డ్ పరీక్షల సమయంలో, నీట్ విషయంలో రివిజన్‌కు ఉపకరిస్తాయి.

## బుక్స్ ఎంపికలో అప్రమత్తం:

సిలబస్ మారడం, నీట్ జరగనుండటం వంటి కారణాల నేపథ్యంలో విద్యార్థులు పుస్తకాల ఎంపికలో తికమకపడుతుంటారు. ఎక్కువ సమాచార సేకరణ అనే దృష్టితో ఆలోచించి మార్కెట్లో లభించే అన్ని పుస్తకాలను సేకరిస్తారు. అయితే.. ప్రస్తుతం మారిన కొత్త సిలబస్ మొత్తం జాతీయ ఉమ్మడి ప్రవేశ పరీక్షలను దృష్టిలో పెట్టుకుని రూపొందించిందే కాబట్టి ముందుగా అకాడెమీ పుస్తకాలను ప్రామాణికంగా తీసుకోవాలి. ఆ తర్వాత ఇతర పుస్తకాలపై దృష్టి సారించాలి. లేకుంటే ఒకే అంశం కోసం రెండు, మూడు పుస్తకాలను రిఫర్ చేయడం ఇంటర్మీడియెట్ స్థాయిలో సరి కాదు. బోర్డ్ పుస్తకాల్లోని అన్ని పాఠ్యాంశాలను పూర్తి చేశాక.. స్వీయ విశ్లేషణ కోసం ఇతర మెటీరియల్‌ను వినియోగించుకోవాలి. ప్రామాణిక మెటీరియల్ అయి ఉండాలి.

### సబ్జెక్ట్‌ల వారీగా ప్రిపరేషన్ టెక్నిక్స్

**బయాలజీ.. ఈజీ:**

బోర్డ్ సిలబస్, నీట్ సిలబస్‌ను తులనాత్మక విశ్లేషణ చేస్తే.. కెమిస్ట్రీ, ఫిజిక్స్‌లతో పోల్చినప్పుడు 'నీట్'లో పేర్కొన్న బయాలజీ సిలబస్ పరిధి కొంత తక్కువగానే ఉంది. బోటనీ (వృక్షశాస్త్రం) విషయంలో.. ప్రస్తుతం జరుగుతున్న జాతీయ ప్రవేశ పరీక్షల్లో వృక్ష శరీర ధర్మ శాస్త్రం, కణ జీవ శాస్త్రం, జీవ సాంకేతిక శాస్త్రం, వృక్ష రాజ్యం, సూక్ష్మ జీవ శాస్త్రాల నుంచే మూడొంతుల ప్రశ్నలు వస్తున్నాయి. స్వరూప శాస్త్రం, అంతర నిర్మాణ శాస్త్రాలు, వృక్ష వర్గీకరణం అంశాలకు తక్కువ ప్రాధాన్యం కనిపిస్తోంది. దీన్ని దృష్టిలో పెట్టుకుంటే బోర్డ్ సిలబస్‌ను ఆసాంతం ఔపోసన పట్టిన విద్యార్థికి 'నీట్' బయాలజీ విభాగంలో పైచేయి సాధించడానికి ఎక్కువ అవకాశాలున్నాయి.

**జంతు శాస్త్రం:**

ఇందులో మానవ శరీర ధర్మ శాస్త్రం, సంబంధిత పాఠ్యాంశాలు అతి ముఖ్యమైనవి. అదే విధంగా జీవ శాస్త్రం, జీవ పరిణామం, మానవ పరిణామాలు, కణజాలాలు కూడా ముఖ్యమైనవే. అటు ఎంట్రెన్స్‌లలోనూ వీటికి ప్రాముఖ్యం ఎక్కువే. కాబట్టి వీటిపై మరింత దృష్టి సారించాలి. సాధారణంగా విద్యార్థులు జంతువర్గాలు, విభాగాలు, వాటి విశిష్ట లక్షణాలు అనే అంశాలను 'బోరింగ్'గా ఫీలవుతారు. వాటిపై అంతగా ఆసక్తి చూపరు. బోర్డ్ పరీక్షల పరంగా ఛాయిస్ కోణంలో కొంత వెసులుబాటు ఉన్నా.. ప్రతి మార్కు కీలకమైన ఎంట్రెన్స్ విషయంలో అన్ని అంశాలు ముఖ్యమే. కాబట్టి ఆసక్తి లేకున్నా వాటిపై పట్టు సాధించాల్సిందే.

**ఫిజిక్స్ ఫోబియా.. పోవాలంటే:**

ఇంటర్మీడియెట్‌లో అధిక శాతం మంది విద్యార్థులు ముఖ్యంగా బైపీసీ విద్యార్థులకు ఫిజిక్స్ అంటే భయపడతారు. కారణం ఈ సబ్జెక్ట్ పరిధి విస్తృతంగా ఉండటం; ప్రతి అంశానికి భావనలు, సూత్రాలు, నిర్వచనాలు, అప్లికేషన్స్ అవసరమవడమే. వీటిపై పట్టు సాధించాలంటే గణిత శాస్త్రంలోని ప్రాథమిక అంశాలు ట్రిగ్నోమెట్రీ, ఇంటిగ్రేషన్, డిఫరెన్షియేషన్స్ పాఠ్యాంశాలలోని ప్రాథమిక అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి. దీనివల్ల అప్లికేషన్ స్కిల్స్ సొంతమవుతాయి. దీంతోపాటు అత్యంత కీలకమైన అంశం 'వెక్టార్స్'పై పట్టు సాధిస్తే ఫిజిక్స్ అధ్యయనం నల్లేరుపై నడకే అని గుర్తించాలి.

**కెమిస్ట్రీ.. అధికమైనా స్కోరింగ్‌కు ఆస్కారం:**

బోర్డ్, నీట్ సిలబస్‌లను పరిగణనలోకి తీసుకుని మిగతా సబ్జెక్ట్‌లతో పోల్చితే కెమిస్ట్రీ సిలబస్ అధికం. అదే సమయంలో స్కోరింగ్‌కు ఆస్కారమిచ్చేది కూడా. అందువల్ల ప్రారంభం నుంచే కర్బన రసాయన శాస్త్రం, భావనలు, వివిధ కర్బన్ కాంపౌండ్స్ మధ్య రసాయన చర్యలపై పట్టు సాధించాలి. పూర్తిగా జ్ఞాపక శక్తి ఆధారిత అంశాలతో కూడిన ఆకర్బన శాస్త్రాన్ని తులనాత్మకంగా (కంపేరిటివ్) అధ్యయనం చేయాలి. తరచుగా రివిజన్ చేసుకోవాలి. ఉదాహరణకు కెమిస్ట్రీలోని బయో మాలిక్యూల్స్ అనే అంశం వృక్ష, జంతు శాస్త్రాల్లో చాలా వరకు ఒకే మాదిరిగా ఉంటుంది. కాబట్టి ఇలాంటి అంశాలను చదివేటప్పుడు రెండు సబ్జెక్ట్‌లలోని నిర్దేశిత సిలబస్‌ను పరిశీలిస్తూ చదివితే సమయం ఆదా అవుతుంది.

సాక్షి Eamcet Mock Counselling
www.sakshieducation.com



# భారత్‌లో పంచవర్ష ప్రణాళికలు... సమీక్ష



డా॥ తమ్మా కోటిరెడ్డి
ప్రొఫెసర్, ఐబీఎస్ హైదరాబాద్

**భారత్‌లో జాతీయ, తలసరి ఆదాయ వృద్ధి ధోరణులను వివరించండి?**

ఒక దేశ ఆర్థికాభివృద్ధిని అంచనా వేయడానికి.. అభివృద్ధి లక్ష్యాలను సమీక్షించడానికి.. జాతీయాదాయంలోని వివిధ రంగాల వాటాను అంచనా వేసి.. ఆయా రంగాల ప్రగతిని సమీక్షించడానికి జాతీయ, తలసరి ఆదాయాల పెరుగుదల ధోరణులను పరిశీలించాలి.

20వ శతాబ్దం ప్రథమార్థంలో తలసరి ఆదాయ వృద్ధిలో స్తంభన ఏర్పడగా, జాతీయాదాయ వృద్ధి కనిష్ఠంగా ఉంది. ద్వితీయార్థంలో మాత్రం జాతీయ, తలసరి ఆదాయాలు స్థిరమైన వృద్ధిని కనబరిచాయి. శివ సుబ్రమణియన్ అంచనాల ప్రకారం 1900-01 నుంచి 1946-47 మధ్య కాలంలో Real Termsలో (వాస్తవ రూపంలో) జాతీయాదాయ వార్షిక సగటు వృద్ధి ఒక శాతం. కాగా, తలసరి ఆదాయ సగటు వార్షిక వృద్ధి 0.2 శాతం మాత్రమే. ఇదే కాలానికి సంబంధించి జాతీయాదాయ వృద్ధి రేటును 0.8 శాతంగా, తలసరి ఆదాయ వృద్ధి రేటు 0.04 శాతంగా మాడిసన్ అంచనా వేశారు.

1950-51 నుంచి 1979-80 మధ్య కాలంలో జీడీపీ సగటు వృద్ధి 3.5 శాతం. కాగా, తలసరి జీడీపీ వృద్ధి 1.4 శాతం. వలస ఆర్థిక వ్యవస్థగా ఉన్న కాలంతో పోల్చితే.. స్వాతంత్ర్యానంతరం మొదటి మూడు దశకాల్లో వృద్ధి రేటులో పెరుగుదల ఆధారంగా దేశంలో ఆర్థికాభివృద్ధి ప్రక్రియ ప్రారంభమైందని చెప్పొచ్చు. శివ సుబ్రమణియన్ అంచనాల ప్రకారం అదే వృద్ధి రేటు కొనసాగినట్లయితే జాతీయాదాయం 70 సంవత్సరాల కాలంలో, తలసరి ఆదాయం 35 సంవత్సరాల కాలంలో రెట్టింపయ్యేవి. మాడిసన్ అంచనా వృద్ధి అదే విధంగా కొనసాగితే జాతీయాదాయం 1750 సంవత్సరాల్లో రెట్టింపయ్యేది.

ఆరో ప్రణాళిక (1980-85)లో సాధించిన అభివృద్ధి కారణంగా జాతీయ, తలసరి ఆదాయాలు 5.5 శాతం, 3.2 శాతం చొప్పున పెరిగాయి. 1990-91 తర్వాత నూతన ఆర్థిక విధానాల నేపథ్యంలో ద్రవ్యోల్బణాన్ని అరికట్టి, జాతీయ తలసరి ఆదాయ పెరుగుదల దిశగా ప్రభుత్వం కృషి చేసింది. 1980-81 నుంచి 1990-91తో పోల్చినప్పుడు 1991-92 నుంచి 2004-05 మధ్య కాలంలో ప్రాథమిక రంగం, ద్వితీయ రంగం వృద్ధిలో కొంత క్షీణత సంభవించినా.. సేవా రంగ వృద్ధి రేటు అధికమైంది. 1991-92 నుంచి 2004-05 మధ్య కాలంలో జీడీపీ సగటు 5.9 శాతం వృద్ధిని నమోదు చేసుకోగా.. తలసరి జీడీపీ వృద్ధి సగటు 4.1 శాతం మాత్రమే. పెట్రోల్ ధరల పెరుగుదల కారణంగా పదో పంచవర్ష ప్రణాళికలో స్థూల జాతీయోత్పత్తి పెరుగుదల స్వల్పంగా తగ్గి.. తలసరి నికర జాతీయాదాయ పెరుగుదల నిలకడగా ఉంది. తొమ్మిదో ప్రణాళికలో ఆర్థిక వ్యవస్థలో ప్రగతి సంతృప్తికరంగా లేకపోవడంతో ఈ ప్రణాళికలో జాతీయాదాయ వృద్ధి సగటు 5.3 శాతంగా నమోదైంది. పదో ప్రణాళికలో ఆర్థిక వ్యవస్థ పుంజుకున్న నేపథ్యంలో జాతీయాదాయ వృద్ధి 7.8 శాతం, తలసరి ఆదాయ వృద్ధి సగటు 6.1 శాతంగా నమోదయ్యాయి. 1950-51 నుంచి 2009-10 మధ్య కాలంలో జాతీయాదాయ వృద్ధి రేటు 4.9 శాతం, తలసరి ఆదాయ వృద్ధి రేటు మూడు శాతంగా నమోదైంది.

**ఆర్థిక వృద్ధి, ఆదాయం, పేదరికం, అసమానతలు- విశ్లేషించండి?**

భారత్‌లో అభివృద్ధి ప్రణాళిక ప్రారంభమైన తర్వాత ఉత్పాదకతతో కూడిన ఉపాధి అందించి.. పేద ప్రజల ఆదాయ స్థాయి పెంచడానికి అధిక వృద్ధి అవసరమని గుర్తించిన ప్రభుత్వం అనేక విధానాలను అవలంబించింది. ప్రణాళికలు ప్రారంభమైన తర్వాత 20 సంవత్సరాల కాలాన్ని పరిశీలిస్తే ఇటు ఆర్థిక పెరుగుదలలో, అటు ఆదాయ పేదరికం తగ్గుదలలోనూ ప్రగతి కనిపించలేదు. 1970ల చివరి కాలంలోనే ఆర్థిక వ్యవస్థలో వృద్ధి కొంతమేర మెరుగైంది. 1970ల చివర్లో నాలుగు శాతం, 1980ల ప్రారంభంలో అయిదు శాతం వృద్ధిని నమోదు చేసుకోగా 1980ల మధ్య కాలం నుంచి వృద్ధి గణనీయమైన పెరుగుదల సంభవించింది.

1970ల మధ్య సమయం నుంచి ఆర్థిక వృద్ధి రేటు, వాస్తవిక తలసరి ఆదాయంలో పెరుగుదల సంభవించగా పేదరిక నిష్పత్తిలో తగ్గుదల కనిపించింది. సంస్కరణల ముందు కాలంతో పోల్చితే సంస్కరణల అనంతర కాలంలోనే ఆర్థిక వృద్ధి, వాస్తవిక తలసరి ఆదాయంలో పెరుగుదల తక్కువగా ఉంది. మరోవైపు పేదరిక నిష్పత్తిలో తగ్గుదల కూడా స్వల్పంగా ఉంది. 1973-74 నుంచి 2004-05 మధ్య కాలంలో ఆర్థిక వృద్ధి, పేదరిక నిష్పత్తి మధ్య రుణాత్మక సేవా సంబంధం కనిపిస్తుంది. వివిధ ప్రాంతాలు, సామాజిక వర్గాలు, వివిధ వృత్తులపై ఆధారపడిన వారు, స్త్రీ-పురుష, వివిధ మతాల ప్రజలలోనూ పేదరిక నిష్పత్తిలో తేడాలు పెరిగాయి. స్వాతంత్ర్యానంతరం ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక అంశాల్లోని అసమానతలే వివిధ వర్గాల ప్రజల మధ్య పేదరిక నిష్పత్తి అధికమవడానికి కారణమయ్యాయి.

1993-94 నుంచి 2004-05 మధ్య కాలంలో అస్సాంలో పేదరిక నిష్పత్తిలో తగ్గుదల సంభవించగా ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో పేదరికంలో తగ్గుదల స్వల్పంగా నమోదైంది. దీనికి కారణంగా ఆయా రాష్ట్రాల్లో తలసరి ఆదాయంలో అవసరమైన మేర పెరుగుదల లేకపోవడమే. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో 1973-74లో పేదరిక నిష్పత్తి 53.3 శాతం. కాగా, 2004-05 నాటికి 19.5 శాతానికి తగ్గింది. దీనికి ప్రధాన కారణంగా ఆయా రాష్ట్రాల్లో తలసరి ఆదాయంలో పెరుగుదల, జనాభా వృద్ధి రేటులో తగ్గుదల వంటి అంశాలను పేర్కొనొచ్చు. 1973-74లో దేశంలోని మొత్తం పేద ప్రజల్లో 24 శాతం మంది ఈ రాష్ట్రాల్లోనే ఉండగా.. ఈ శాతం 2004-05లో 15.24 శాతానికి తగ్గడం విశేషం.

పేదరిక నిర్మూలన విషయంలో ఆర్థిక సంస్కరణల ప్రభావం కొన్ని రాష్ట్రాల్లో కనిపించలేదు. తలసరి ఆదాయ వృద్ధిలో పెరుగుదల, పేదరిక నిష్పత్తిలో తగ్గుదల సంస్కరణ కాలంలో బీహార్, మధ్య ప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, ఒడిస్సా వంటి రాష్ట్రాల్లో సంభవించలేదు. సంస్కరణల ముందు కాలంలో ఆదాయ వృద్ధిలో పెరుగుదల, పేదరిక తగ్గుదల అనుభవాలను ఎదుర్కొన్న గుజరాత్‌లో.. సంస్కరణల కాలంలో Anti Poverty Effectiveness తగ్గింది. అన్ని రాష్ట్రాల్లోనూ 1983-84 నుంచి 2004-05 మధ్య కాలంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పేదరికంలో తగ్గుదల సాధ్యమవగా మరోవైపు అసమానతలు పెరిగాయి. ముఖ్యంగా అన్ని రాష్ట్రాల్లోని పట్టణ ప్రాంతాల్లో అసమానతలు పెరిగాయి. ఈ విషయంలో గుజరాత్ ప్రథమ స్థానంలో నిలిచింది. తమిళనాడు చివరి స్థానంలో ఉంది. దీర్ఘకాలంగా పేదరికం ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో గ్రామీణ అసమానతలు కొంతమేర తగ్గాయి. సంస్కరణల ముందు కాలంలో గ్రామీణ అసమానతల్లో తగ్గుదల సంభవించగా సంస్కరణల అనంతర కారణంలో అనేక రాష్ట్రాల్లో గ్రామీణ ప్రాంతాల్లో అసమానతలు పెరగడం గమనార్హం.

## టిప్స్ టు స్కోర్ మోర్



- ముందుగా సిలబస్‌లో పేర్కొన్న ప్రతి చాప్టర్‌లోని అన్ని అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.
- గణాంకాల ఆధారంగా విశ్లేషణ అవసరమైన ప్రశ్నలను మరింత జాగ్రత్తగా పరిశీలించాలి.
- ఫ్యాక్ట్స్‌ను అప్రమత్తంగా అధ్యయనం చేయాలి.
- ప్రశ్నపత్రంలో ఇచ్చిన ప్రతి ప్రశ్నను క్షుణ్నంగా చదివి అర్థం చేసుకోవాలి. ఆ తర్వాతే సమాధానం రాయడానికి ఉపక్రమించాలి.
- సమాధానాలను పూర్తిగా అంకెలు, గణాంకాలు శాతాలతో పూర్తిచేయకుండా.. నిర్దేశిత సమయంలో వీలయ్యే విధంగా విశ్లేషణలు, ఆచరణాత్మక సూచనలతో పూర్తి చేయాలి.
- కంపేరిటివ్ అనాలిసిస్ అవసరమైనప్పుడు మాత్రమే గణాంకాలు పేర్కొనడం సమంజసం.
- ఎకానమీ విషయంలో తెలుగు అనువాదానికి వీల్లేని ఇంగ్లిష్ పదజాలంపైనా పట్టు సాధించాలి. దీనివల్ల తెలుగులో ప్రశ్న అర్థం కాకున్నా.. ఇంగ్లిష్‌లో ప్రశ్నను అవగతం చేసుకుని సరైన సమాధానం ఇచ్చేందుకు ఆస్కారం ఏర్పడుతుంది.

**దేశంలో అమలైన పంచవర్ష ప్రణాళికలను సమీక్షించండి?**

భారతదేశంలో 1951 ఏప్రిల్ 1 నుంచి ప్రణాళికబద్ధమైన ఆర్థికాభివృద్ధి ప్రారంభమైంది. మొదటి నాలుగు పంచవర్ష ప్రణాళికల కాలంలో ఆర్థిక వ్యవస్థలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రైవేటు యాజమాన్యంలో ఉన్న లైఫ్ ఇన్సూరెన్స్, ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్, బొగ్గు గనులు, బ్యాంకుల జాతీయీకరణ వంటి విప్లవాత్మక చర్యలు చోటు చేసుకున్నాయి. ఇక.. ఆయా ప్రణాళికలను విశ్లేషిస్తే..

- మొదటి రెండు పంచవర్ష ప్రణాళికల్లో ఆర్థిక వ్యవస్థ అనేక సమస్యలను ఎదుర్కొన్నప్పటికీ వాటిని పరిష్కరించుకోగలిగింది. ఉక్కు ఉత్పత్తి పలు రెట్లు పెరిగింది. నిరుద్యోగ సమస్య నివారణకు అనేక చర్యలు తీసుకున్నారు. రివర్ వ్యాలీ ప్రాజెక్ట్‌ల నిర్మాణాలు పూర్తయ్యాయి. విద్యుత్ ఉత్పాదన సామర్థ్యం పెరిగింది.
- మూడో పంచవర్ష ప్రణాళికలో ఎదురైన అనేక సవాళ్లను దేశం సమర్థవంతంగా ఎదుర్కొంది. రుతుపవనాల అననుకూలత కారణంగా ఆహార ధాన్యాల కొరత, శక్తి సంక్షోభం వంటి సమస్యలు ఎదురయ్యాయి. దీంతో జాతీయ, తలసరి ఆదాయాల్లో వృద్ధి రేటు మందగించింది. ఆర్థిక ఒడిదుడుకుల నేపథ్యంలో నాలుగో ప్రణాళికను వెంటనే ప్రకటించకుండా వార్షిక ప్రణాళికలను అమలు చేశారు. వార్షిక ప్రణాళికల కాలంలో వ్యవసాయం, కుటుంబ సంక్షేమం, సాంఘిక సేవలపై దృష్టి కేంద్రీకరించారు.
- నాలుగో పంచవర్ష ప్రణాళిక కాలంలో అనేక భారీ ఇంజనీరింగ్ పరిశ్రమలు, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలను ఏర్పాటు చేశారు. అప్పటికే ఉన్న పరిశ్రమల్లో ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించారు. ప్రణాళికల లక్ష్యాలను సాధించడానికి విదేశీ మారక నిల్వల ఆవశ్యకత ఏర్పడింది. ఇదే సమయంలో దేశంలోని రాజకీయ సుస్థిరతపై విదేశాల్లో విశ్వాసం సన్నగిల్లింది. పర్యవసానంగా విదేశీ తోడ్పాటు తగ్గింది. ఇలా అనేక సమస్యలు ఎదురైనప్పటికీ ఈ ప్రణాళికలో ప్రధానంగా ఆహార సమస్యను పరిష్కరించడం గమనించాల్సిన అంశం. కుటుంబ సంక్షేమ కార్యక్రమాల అమ ల్లో ప్రగతి చోటు చేసుకుంది. పంచదార ఉత్పత్తి పెరుగుదలతోపాటు అనేక పరిశ్రమలు ఏర్పాటయ్యాయి.
- అయిదో ప్రణాళిక పూర్తయ్యేనాటికి భారత్ టేకాఫ్ దశకు చేరువై స్వయం సమృద్ధి గల ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందగలదని ప్రణాళిక రచయితలు భావించారు. అధికారంలోకి వచ్చిన జనతా ప్రభుత్వం ప్రణాళిక అమలును నిలిపేసిన కారణంగా ముఖ్య ఉత్పత్తులకు కొరత ఏర్పడింది.
- ఆరో ప్రణాళికలో విద్యుత్ ఉత్పాదన, గ్రామీణ విద్యుదీకరణ, సిమెంట్, ఉక్కు, ఇతర ముఖ్య ఉత్పత్తుల పెంపుదలకు ప్రాధాన్యమిచ్చారు. ఈ ప్రణాళికలో ధరల నియంత్రణ విధానాన్ని తొలగించారు. తద్వారా ఆహార ధాన్యాల ధరల్లో పెరుగుదలతోపాటు జీవన వ్యయం కూడా పెరిగింది. అధిక జనాభాను నియంత్రించే దిశగా కుటుంబ నియంత్రణ పథకాన్ని విస్తృతంగా అమలు చేశారు. మొత్తంమీద ఈ ప్రణాళికలో 5.4 శాతం వృద్ధి నమోదైంది.
- ఏడో ప్రణాళిక కాలంలో.. '2000 సంవత్సరం నాటికి స్వయం సిద్ధ వృద్ధి సాధన ప్రధాన లక్ష్యం'గా నిర్ణయించి.. అందుకు అవసరమైన అంశాలపై దృష్టి కేంద్రీకరించడం జరిగింది. విద్యుత్ ఉత్పత్తిని పెంచడానికి ఈ ప్రణాళికలో ఎంతో కృషి చేశారు. ఈ ప్రణాళికలో వాస్తవ వృద్ధి 5.7 శాతం.
- సరళీకృత విధానాల నేపథ్యంలో ఎనిమిదో ప్రణాళిక ప్రారంభమైంది. ఈ ప్రణాళికలో వ్యవసాయ ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించడంతోపాటు ఉపాధి పెంపు, పేదరిక నిష్పత్తిలో తగ్గుదల చోటుచేసుకున్నాయి.
- తొమ్మిదో ప్రణాళికలో వ్యవసాయ, పారిశ్రామిక రంగాలపై ప్రభుత్వ రంగ పెట్టుబడులు తగ్గిన కారణంగా ఈ ప్రణాళికలో వృద్ధి రేటు తగ్గింది. లక్షిత వృద్ధి జీడీపీలో 6.5 కాగా వాస్తవ వృద్ధి 5.35 శాతం మాత్రమే.
- పదో ప్రణాళికలో వృద్ధిరేట్లను నిర్ణయించడం ద్వారా ప్రాంతీయ వికేంద్రీకరణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. అంతర్జాతీయ మార్కెట్ విస్తరణకు.. విస్తృతంగా ఉన్న అంతర్గత మార్కెట్‌లను పటిష్టం చేయడం, అల్పాదాయ వర్గాల ప్రజల కొనుగోలు శక్తిని పెంచడం ద్వారా ఆదాయ పునఃపంపిణీ చర్యలు చేపట్టారు.
- పదకొండో ప్రణాళికలో తొమ్మిది శాతం వృద్ధిని లక్ష్యంగా నిర్ణయించగా వాస్తవంగా 7.9 శాతం వృద్ధి నమోదైంది.

# 1857 తిరుగుబాటుకు కారణాలు, ఫలితాలు...



కె. యాకూబ్ బాష
డైరెక్టర్ - జీసీ స్టడీ సర్కిల్, గుంటూరు.

**భక్తి ఉద్యమ స్వభావాన్ని తెలిపి, సమకాలీన భారతదేశంలోని వివిధ రంగాలపై దాని ప్రభావాన్ని తెలపండి?**

హిందూమతంలోని దురాచారాలు, మూఢ నమ్మకాల నుంచి దానిని సంస్కరించి, సులువైన మోక్ష మార్గంగా భక్తిని ప్రచారం చేస్తూ మధ్య యుగాల్లో బయలుదేరిన మత ఉద్యమమే భక్తి ఉద్యమం.

**భక్తి ఉద్యమ ఆవిర్భావానికి కారణాలు:**

సామాజిక కారణాలు: చాతుర్వర్ణ వ్యవస్థ, కుల వ్యవస్థలతోపాటు నిమ్న కులాల పట్ల తీవ్రమైన వివక్షలతో కూడిన హిందూ సమాజాన్ని సంస్కరించేందుకు భక్తి ఉద్యమం ఆవిర్భవించింది.

మత కారణాలు: సూఫీల బోధనల వల్ల ఇస్లాం వైపు ఆకర్షితులవుతున్న హిందువులను ఆపాల్సిన అవసరం.

రాజకీయ కారణాలు: హిందూ మత పోషకులైన రాజపుత్ర రాజుల ఓటమి వల్ల ఇస్లాం రాజ్యం ఆవిర్భవించడమే కాకుండా హిందూ మతం నిరాదరణకు, దాడులకు గురైంది.

**భక్తి ఉద్యమ స్వభావం:**

- యజ్ఞయాగాది క్రతువులు, కర్మకాండలకు బదులు భక్తిని మోక్ష మార్గంగా బోధించడమే కాకుండా మోక్షానికి అందరూ అర్హులే అని చాటారు.
- నిర్గుణ భక్తి ఉద్యమకారులు ఇస్లాంలాగే విగ్రహారాధనను వ్యతిరేకించగా సగుణ భక్తి ఉద్యమకారులు విగ్రహారాధనను కొనసాగించారు. భక్తి ఉద్యమకారులందరూ ఏకేశ్వరోపాసనను బోధించారు.
- కుల వ్యవస్థలోని అసమానతలను వ్యతిరేకించారు. సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని ప్రచారం చేశారు.
- ప్రజలతో మమేకమై వారి భాషలోనే బోధనలు చేశారు.
- ప్రతి భక్తి ఉద్యమకారుడు కూడా గురువు ప్రాధాన్యతను చాటి చెప్పడంతోపాటు నైతిక విలువలకు ప్రాధాన్యమిచ్చారు.

**ముఖ్యమైన భక్తి ఉద్యమకారులు:** రామానందుడు, కబీర్, నామదేవుడు, గురునానక్, వల్లభాచార్యులు, చైతన్యుడు, ఏకనాథ్, తుకారాం మొదలైనవారు.

**భక్తి ఉద్యమ ఫలితాలు:**

మతం: ఇస్లాం దాడి నుంచి హిందూ మతాన్ని రక్షించింది. హిందూ మతాన్ని సంస్కరించడం ద్వారా ఇస్లాం మత వ్యాప్తిని అరికట్టకలిగింది. రెండు మతాల మధ్య ఘర్షణను నివారించి సఖ్యతను సాధించింది.

సామాజిక రంగం: ఎక్కువ మంది భక్తి ఉద్యమకారులు నిమ్నకులాల నుంచి వచ్చినవారే. ఈ ఉద్యమం దిగువ కులాల స్థాయిని పెంచింది.

ఆర్థిక రంగం: కులవృత్తులకున్న గౌరవాన్ని పెంచి హీన వృత్తులను కూడా భక్తి ఉద్యమకారులు గౌరవించారు. వీరిలో అత్యధికులు కులవృత్తులను అనుసరిస్తున్నవారే.

రాజకీయ రంగం: భారతదేశాన్ని పాలించిన ముస్లిం రాజులైన షేర్షా, అక్బర్ వంటివారు కూడా ఉదారభావాలతో హిందువులను, ముస్లింలను సమానంగా ఆదరించారు.

సాంస్కృతిక రంగం: ఎక్కువమంది ప్రాంతీయ భాషల్లో బోధనలు చేయడంతో ప్రాంతీయ భాషలు సుసంపన్నమ య్యాయి. మరాఠీ, భోజ్‌పురి, అస్సామీ, మైథిలీ, బెంగాలీ, తెలుగు భాషల్లో అత్యున్నత సాహిత్యం వెలువడింది.

**శాతవాహనుల కాలం నాటి ప్రాచీనాంధ్ర దేశంలోని సామాజిక, ఆర్థిక, మత పరిస్థితుల్ని చర్చించండి?**

శాతవాహనులు యావదాంధ్ర దేశాన్ని ఏకం చేసి దాదాపు 4 శతాబ్దాలకుపైగా సుస్థిర పాలన అందించారు. వీరి కాలంలో సామాజిక, ఆర్థిక, మత పరిస్థితుల్లో అనేక కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి.

సామాజిక పరిస్థితులు: ఉత్తర భారతదేశంలో స్థిరపడిన వర్ణవ్యవస్థ ఆంధ్ర దేశంలోనూ ప్రవేశించింది. అయితే అది కఠినంగా లేదు. అనేక విదేశీ, స్వదేశీ తెగలూ ఇందులో కొత్తగా చేరారు. వర్ణ సంకరం కూడా తరచూ జరుగుతున్నట్లు తెలుస్తుంది. కులవ్యవస్థ ఈ కాలంలో ఇంకా ఏర్పడలేదు. ఒకే కుటుంబంలోని వారు భిన్నవృత్తులు చేపట్టినట్లు దిమిక అనే చర్మకారుడు వేయించిన అమరావతి శాసనం తెలుపుతుంది. ఈ వృత్తుల నుంచే తర్వాత కులాలు ఏర్పడ్డాయి. సమాజంలో స్త్రీకి ఉన్నతస్థానం ఉంది. పూర్తి స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలున్నట్లు తెలుస్తుంది. నాగానిక, బాలశ్రీ వంటి రాణులు పాలనలోనూ చురుగ్గా పాల్గొన్నారు. తమ భర్తల మతంతో సంబంధం లేకుండా శాతవాహన స్త్రీలు బౌద్ధాన్ని ఆదరించారు. విద్యా, సంగీత, సాహిత్యాల్లోనూ నాటి స్త్రీలకు ప్రవేశముంది. గాథాసప్తశతిలోని పలు రచనలు స్త్రీలే చేశారు. కొందరు చరిత్రకారుల ప్రకారం ఈ కాలంలో మాతృస్వామిక వ్యవస్థ అమల్లో ఉంది. స్త్రీలకు ఆస్తిహక్కులు కూడా ఉండేవి.

ఆర్థిక పరిస్థితులు: వ్యవసాయానికి శాతవాహనులు గొప్ప ప్రోత్సాహాన్ని అందించారు. నీటిపారుదల వసతులను కల్పించారు. వ్యవసాయాన్ని విస్తరించే చర్యల్లో భాగంగా, కొత్త భూములను సాగులోకి తెచ్చేందుకు బ్రాహ్మణులకు భూదానాలు చేశారు. సాగునీటి కోసం ఉదక యంత్రాలను ప్రవేశపెట్టారు. వీరికాలంలో 1/6వ వంతు భూమి శిస్తుగా ఉంది. ఈ కాలంలో ఆగ్నేయాసియా నుంచి తమలపాకులు, కొబ్బరి వంటి కొత్త పంటలు వచ్చి చేరాయి. ఈ కాలంలో దేశ, విదేశీ వ్యాపారం విస్తృత స్థాయిలో కొనసాగింది. వ్యవసాయాభివృద్ధి వల్ల ఏర్పడిన మిగులుకు తోడు శాతవాహన రాజులు ఇచ్చిన ప్రోత్సాహం వల్ల వర్తక, వాణిజ్యాలకు గొప్ప ఊతం లభించింది. ఈ కాలంలో 18 చేతివృత్తులవారు ఉన్నారు. వ్యాపారులు శ్రేణులు అనే వర్తక సంఘాలుగా ఏర్పడ్డారు. వీరు బ్యాంకుల వలే డిపాజిట్లు స్వీకరించడం వంటి పనులు చేసేవారు. ఈ కాలంనాటి విదేశీవ్యాపారం ప్రధానంగా రోమ్‌తో జరిగింది. టాలమీ, పెరిప్లస్, ప్లినీ మొదలగువారి రచనల్లో అనేక రేవు పట్టణాల ప్రస్తావన ఉంది. యజ్ఞశ్రీ శాతకర్ణి ఓడగుర్తు గల నాణేలు వీరు విదేశీవ్యాపారానికి అందించిన ప్రోత్సాహానికి నిదర్శనం. ముఖ్యమైన ఎగుమతులు మస్లిన్ వస్త్రాలు, సుగంధ ద్రవ్యాలు, ముత్యాలు మొదలైనవి. కాగా ముఖ్య దిగుమతులు బంగారం, వెండి, రాగి, సీసం, గుర్రాలు తదితరాలు. విదేశీ వ్యాపారం భారతదేశానికి అనుకూలంగా ఉండేదని ప్లినీ రచనలు తెలుపుతున్నాయి.

మత పరిస్థితులు: వీరి కాలంలో వైదికమతంతోపాటు బౌద్ధ, జైనాలు ప్రాచుర్యంలో ఉన్నాయి. పౌరాణిక హిందూ మతం కూడా ప్రారంభమైంది.

వైదిక మతం: శాతవాహన రాజుల్లో అత్యధికులు ఈ మతాన్ని ఆదరించారు. మొదటి శాతకర్ణి చేసిన అనేక యుద్ధాల గురించి నానాఘాట్ శాసనం వివరిస్తుంది. గౌతమీపుత్ర శాతకర్ణికున్న ఏక బ్రాహ్మణ, ఆగమ నిలయ వంటి బిరుదులు వీరి వైదిక మతాభిమానానికి సూచికలు.

భాగవతమతం: హాలుని గాథాసప్తశతిలోనూ, నానాఘాట్ శాసనంలోనూ దీనికి సంబంధించిన ప్రస్తావనలున్నాయి. గౌతమీపుత్ర శాతకర్ణిని రామకేశవులతో పోల్చారు.

శైవ మతం: గుడిమల్లంలోని ప్రాచీన శివాలయాన్ని వీరి కాలంలోనే నిర్మించారు. గాథాసప్తశతి శివస్తోత్రంతో ప్రారంభమై గౌరీ స్తుతితో ముగుస్తుంది. వీటినిబట్టి చూస్తే శైవం కూడా బాగా ప్రాబల్యంలో ఉన్నట్లుగా తెలుస్తుంది.

బౌద్ధమతం: ఒక్క హాలుడు తప్ప మిగిలిన రాజులంతా వైదికాన్ని ఆదరించినా, రాణులు, ప్రజల ఆదరణతో ఈ మతం ఉచ్ఛదశకు చేరుకుంది. ఆంధ్రదేశ వ్యాప్తంగా అనేక బౌద్ధ క్షేత్రాలు, గుహాలయాలు, స్థూపాలను వీరి కాలంలో నిర్మించారు. అమరావతి స్థూపం, నాగార్జున కొండలోని యజ్ఞశ్రీ నిర్మించిన విహారం ఆనాటి కట్టడాల్లో ముఖ్యమైనవి. ఈ కాలంలోనే ఆచార్య నాగార్జునుడు బౌద్ధమత సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తూ అనేక గ్రంథాలు రాశాడు. మహాయాన బౌద్ధానికి ఎనలేని సేవ చేశాడు.

జైనం: శాతవాహనరాజు శ్రీముఖుడు జైనాన్ని ఆదరించినట్లు భావిస్తారు. ఈ కాలంలో కొండకుందాచార్యుడనే ప్రముఖ జైన సన్యాసి కొనకండ్ల కేంద్రంగా జైనమతాన్ని ప్రచారం చేశాడు. జైనంలో సరస్వతీగచ్ఛం అనే ఒక నూతన శాఖను ఇతను ప్రారంభించాడు.

పౌరాణిక హిందూ మతం: పై మతాలతోపాటు దానిలో, తీర్థయాత్రల ద్వారా మోక్షసాధన ప్రసాదించే పౌరాణిక హిందూ మతాన్ని కూడా ప్రజలు ఆదరించారు.

**టిప్స్**

- ముందుగా ఎగ్జామినర్ కచ్చితంగా ఎలాంటి సమాధానం ఆశిస్తున్నారో గుర్తించి దానికి అనుగుణంగా తమ ప్రజెంటేషన్ ఉండేలా చూసుకోవాలి. ప్రశ్న అడిగిన కోణంలో 'కీ'లక పదాలు పొందుపర్చుకోవాలి. ఉదాహరణకు: భక్తి ఉద్యమాలపై ఇస్లాం ప్రభావం? అనే ప్రశ్నను పరిశీలిస్తే.. భక్తి ఉద్యమాలే కాకుండా సామాజిక, ఆర్థిక, సాహిత్యం, నృత్యం, కళలు వంటి అనేక ఇతర అంశాలపైనా ఇస్లాం ప్రభావం ఉంది. ప్రశ్నకు సమాధానం ఇచ్చే కోణంలో భక్తి ఉద్యమానికే సమాధానాన్ని పరిమితం చేసుకోవాలి.
- ఎంత సమాచార పరిజ్ఞానం ఉన్నా టైం దృష్టిలో పెట్టుకోవాలి. 10 నిమిషాల వ్యవధిలో రెండు పేజీల్లో 200 పదాల్లో సమాధానం పూర్తి చేయాలి.
- ప్రశ్న ఆధారంగా ప్రజెంటేషన్ పాయింట్లు, లేదా వ్యాస రూపం అనేది నిర్ణయించుకోవాలి. ఉదా: భారతీయ కళలు, వాస్తు శిల్పానికి మొఘలుల సేవలు? అనే ప్రశ్నకు ఒక్కో చక్రవర్తి పేరును ఉప శీర్షికగా పేర్కొంటూ.. ఆ శీర్షిక కింద పాయింట్ల రూపంలో వారందించిన సేవలను ప్రస్తావించాలి.
- చాలామంది తాజాగా జరిగిన పరీక్షలో అడిగిన ప్రశ్నలు మళ్లీ రావు అనే ఆలోచనతో ఉంటారు. ఇది సరికాదు. శాతవాహనుల గురించి 2008, 2010 లలో అడిగారు. కాబట్టి అన్నిటిపై పట్టు సాధించాలి.

**1857 తిరుగుబాటు కారణాలు, ఫలితాల గురించి రాయండి?**

బ్రిటిషర్ల రాజ్యకాంక్ష, ఆర్థిక దోపిడీ, జాతి వివక్షతతో కూడిన విధానాలతోపాటు క్రైస్తవ మిషనరీల మత కార్యకలాపాలకు వ్యతిరేకంగా 1857లో భారతదేశంలోని వివిన్న వర్గాలు చేపట్టిన మహా ఉద్యమం 1857 తిరుగుబాటు.

**తిరుగుబాటుకు కారణాలు:**

రాజకీయ కారణాలు: వెల్లస్లీ సైన్యసహకార పద్ధతి వల్ల స్వదేశీ సంస్థానాల రాజులు తమ సార్వభౌమాధికారాన్ని కోల్పోయి బ్రిటిష్ ఆధిపత్యానికి దాసోహమయ్యారు. డల్హౌసీ రాజ్య సంక్రమణ సిద్ధాంతం ద్వారా జైతపుర, సంబల్‌పూర్, ఝాన్సీ వంటి అనేక స్వదేశీ రాజ్యాలు బ్రిటిష్ సామ్రాజ్యంలో విలీనమయ్యాయి. దుష్పరిపాలన నెపం మీద అవధ్‌ను ఆక్రమించారు. బహదూర్‌షాకున్న భారత చక్రవర్తి అనే బిరుదును తొలగించడంతో రాజకీయ అసంతృప్తి చెలరేగింది.

ఆర్థిక కారణాలు: బ్రిటిషర్ల శాశ్వత శిస్తు నిర్ణయం, రైత్వారీ, మహల్వారీ విధానాలు అనేక లోపాలతో ఉన్నాయి. ఇవి స్వయంసమృద్ధమైన గ్రామీణ ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేశాయి. వివక్షా పూరిత సుంకాల వల్ల కుటీర పరిశ్రమలు, చేతివృత్తుల వారు నష్టపోగా, స్వదేశీ సంస్థానాల్లోని ఉద్యోగులు, సైనికులు ఉపాధి కోల్పోయారు.

సాంఘిక, మత కారణాలు: సతీసహగమన నిషేధం, వితంతు పునర్వివాహం, కుల అసమానతల నిషేధం, స్త్రీ, శిశువుల హత్యల నిషేధం వంటివి సాంప్రదాయవాదులను కలవరపరిచాయి. 1813 చార్టర్ చట్టం మిషనరీ మత కార్యకలాపాలకు అనుమతించడం, బ్రిటిష్ ప్రభుత్వం మత మార్పిడి చేసుకున్నవారికి ఆస్తి హక్కు కల్పించడంతో హిందూ మతస్థుల్లో అభద్రతా భావం పెరిగింది.

సైనిక కారణాలు: భారత సిపాయిలకు, కంపెనీ సైనికులకు మధ్య జీతభత్యాలు, పదోన్నతులు, అలవెన్సులు వంటి విషయాల్లో ఉన్న తీవ్రమైన జాతిపరమైన వివక్ష సిపాయిల్లో అసంతృప్తి పెంచింది. 1838-42 మొదటి ఆఫ్ఘన్ యుద్ధం, 1845-49 పంజాబ్ యుద్ధం, 1854-56 క్రిమియా యుద్ధాలలో బ్రిటిష్‌వారి పరాజయాలు సిపాయిల్లో ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంచాయి.

తక్షణ కారణం: 1856లో కంపెనీ ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన రాయల్ ఎన్‌ఫీల్డ్ తుపాకులకు వాడే తూటాలలో ఆవు, పందికొవ్వులను వాడారనే వదంతి వల్ల సిపాయిలు దీన్ని మత విశ్వాసానికి భంగకర చర్యగా భావించారు. ఈ తూటాలు వాడేందుకు నిరాకరించి పై అధికారిని చంపేందుకు ప్రయత్నించడంతో 1857 మార్చి 29న బారక్‌పూర్‌లోని 34వ పటాలానికి చెందిన మంగళ్‌పాండేను ఉరితీశారు. 1857 ఏప్రిల్ 24న మీరట్ సిపాయిలు నూతన తూటాలను వాడేందుకు నిరాకరించడంతో పదేళ్ల శిక్షకు గురయ్యారు. దీంతో మే 10న మీరట్‌లోని సిపాయిలు చలో ఢిల్లీ నినాదంతో తిరుగుబాటు ప్రారంభించారు.

తిరుగుబాటు ఫలితాలు: దేశంలోని పలు రంగాల్లో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి.

- భారత్‌లో కంపెనీ పాలన రద్దయి..బ్రిటిష్ రాణి పాలన ప్రారంభమైంది. పాలనా వ్యవహారాలు పర్యవేక్షించేందుకు రాజ్య కార్యదర్శి పదవి ఏర్పడింది. గవర్నర్ జనరల్ పదవిని వైస్రాయ్‌గా మార్చారు.
- 1858 నవంబర్ 1 విక్టోరియా రాణి ప్రకటన ద్వారా రాజ్య సంక్రమణ సిద్ధాంతం రద్దు కాగా స్వదేశీ రాజ్యాల ఆక్రమణకు ముగింపు పలికారు. భారతీయులకు ఉద్యోగ నియామకాల్లో, సమానావకాశాలకు హామీ లభించింది.
- సైనిక కూర్పులో సమూల మార్పులు చేశారు. తిరుగుబాటు ప్రభావిత ప్రాంతాల్లో బ్రిటిష్ సైనికులు-స్వదేశీ సిపాయిల నిష్పత్తిని 1:2గా మార్చారు. విధేయ వర్గాలకు చెందిన సిక్కులు, జాట్‌లు, గూర్ఖాలకు సైన్యంలో స్థానం కల్పించారు.
- బ్రిటిష్ ప్రభుత్వం సంస్కరణవాద చట్టాలకు స్వస్తి పలికి సామాజికాంశాల్లో తటస్థతను పాటించింది.
- తిరుగుబాటు సమయంలో హిందూ-ముస్లిం ఐక్యతతో భయపడిన ప్రభుత్వం దాన్ని భగ్నం చేసేందుకు విభజించు పాలించు విధానాన్ని అనుసరించడంతో ఇది తర్వాత కాలంలో హిందూ-ముస్లిం ఐక్యతను దెబ్బతీయడంతోపాటు భారతదేశ విభజనకు దారితీసింది.
- తిరుగుబాటును అణచివేసినా తిరుగుబాటు నాయకులు నానాసాహెబ్, ఝాన్సీ లక్ష్మీబాయ్ మొదలగువారు తర్వాత కాలంలో జాతీయ నాయకులుగా కీర్తికెక్కి, జాతీయోద్యమానికి స్ఫూర్తినిచ్చారు.
- తిరుగుబాటులో ఆస్తుల విధ్వంసం జరిగి, దీన్ని అణచివేసేందుకు జరిగిన భారీ వ్యయాన్ని తిరిగి రాబట్టుకునేందుకు ప్రభుత్వం మరింత పెద్ద ఎత్తున పటిష్టవంతంగా తన దోపిడీ విధానాన్ని కొనసాగించింది.

భవిత
Now Bhavita Also on Sakshi TV
Every Sunday9-30am to 10am

4 Years Engineering

# నాలుగేళ్ల ఇంజనీరింగ్‌లో రాణించేదెలా?

డా॥ ఎస్.ఉదయకుమార్
ప్రిన్సిపాల్, ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీ, హైదరాబాద్

'తెలంగాణలో హైదరాబాద్ తర్వాత ముఖ్య పట్టణం'?
సమాధానం: విజయవాడ.
'ఐఐటీ పూర్తిపేరు చెప్పండి'
సమాధానం: ఇండియన్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ.
'మన రాష్ట్ర గవర్నర్' సమాధానం: జేసీ దివాకర్ రెడ్డి.
ఏంటివి స్కూల్ పిల్లలు క్విజ్‌లో చెప్పిన సమాధానాలనుకుంటున్నారా? కాదు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ కోసం ఒక ఇంజనీరింగ్ కళాశాలకెళ్లిన కంపెనీ ప్రతినిధులకు ఇంటర్వ్యూలో ఇంజనీరింగ్ విద్యార్థులు చెప్పిన సమాధానాలు.

'ఏటా దాదాపు 2 లక్షల మంది విద్యార్థులు ఇంజనీరింగ్ పట్టాతో బయటకొస్తున్నారు. వారిలో 90 శాతం మందికి వారు చదివిన సబ్జెక్టులపై బేసిక్ నాలెడ్జ్, వర్తమాన వ్యవహారాలపై కనీస పరిజ్ఞానం కూడా ఉండటం లేదు. కమ్యూనికేషన్ స్కిల్స్ గురించి ఎంత తక్కువగా చెప్పుకుంటే అంతమంచిది' - ఇవీ వివిధ కంపెనీలు ఇంజనీరింగ్ విద్యార్థులపై వెలిబుచ్చిన అభిప్రాయాలు.. మరి ఈ లోపాలను ఎలా అధిగమించాలి? ఏఏ నైపుణ్యాలను పెంపొందించుకోవాలి? వాటికి సమాధానమే వ్యాసం..

**మరికొద్ది రోజుల్లో నాలుగేళ్ల ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ జరగనుంది. భవిష్యత్‌లో తామెంచుకున్న బ్రాంచ్‌లో అత్యుత్తమంగా రాణించాలన్నా.. మంచి కెరీర్‌ను సొంతం చేసుకోవాలన్నా ఈ నాలుగేళ్ల ఇంజనీరింగ్ కోర్సులో విద్యార్థులు ముందు నుంచీ పక్కా ప్లానింగ్‌తో అడుగులు వేయాల్సిందే. ఈ నేపథ్యంలో విద్యార్థులు బీటెక్‌లో ఎలాంటి స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకుంటే అటు అకడెమిక్‌గా.. ఇటు కెరీర్‌పరంగా విజయకేతనం ఎగురవేస్తారో తెలుసుకుందాం..**

## అకడెమిక్ గోల్

నాలుగేళ్ల ఇంజనీరింగ్ కోర్సులో ప్రవేశం పొందిన విద్యార్థులందరూ ముందుగా తమ అకడెమిక్ లక్ష్యం ఏమిటో నిర్ణయించుకోవాలి. బీటెక్‌లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులవ్వాలనుకుంటున్నారా? లేదా 75 శాతం ఉత్తీర్ణతతో డిస్టింక్షన్ సాధించాలనుకుంటున్నారో లేదా అంతకంటే ఎక్కువ పర్సంటేజీని సొంతం చేసుకోవాలనుకుంటున్నారో తెలుసుకోవాలి. అందుకనుగుణంగా మొదటి నుంచీ సిద్ధమవ్వాలి. ఇందుకోసం ఏమి చేయాలంటే..

### అకడెమిక్ గోల్స్‌ను సాధించండిలా..

**నూటికి నూరుశాతం హాజరు సాధించండి:**
కళాశాలలో చేరిన మొదటి రోజు నుంచి ప్రతి రోజూ కళాశాలకు హాజరుకావడంతోపాటు అన్ని క్లాసులకు అందుబాటులో ఉండండి. క్లాస్‌కు హాజరుకాకపోవడం వల్ల సంబంధిత సబ్జెక్టుకు సంబంధించిన విలువైన సమాచారాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది. కళాశాల ప్రారంభమయ్యే సమయానికి ఠంచనుగా క్లాసులో ఉండి, క్లాసులో జరిగే వివిధ డిస్కషన్స్‌లో పాలుపంచుకోండి. దీంతోపాటుగా ఇతర కోకరిక్యులర్ యాక్టివిటీస్‌లోనూ చురుగ్గా పాల్గొనండి. ప్రొఫెసర్ చెప్పే ముఖ్యాంశాలను నోట్స్ రూపంలో రాసుకోండి. సంబంధిత పాఠ్యపుస్తకాలను క్షుణ్నంగా అధ్యయనం చేయండి. మీకొచ్చే సందేహాలను ప్రొఫెసర్లను అడిగి నివృత్తి చేసుకోండి.

**ఎప్పటి పని అప్పుడే చేయండి:**
ఎప్పటికప్పుడు మీరు సమర్పించాల్సిన ఎసైన్‌మెంట్లు, ల్యాబ్ వర్క్‌ను సకాలంలో పూర్తి చేయండి. అదేవిధంగా క్లాసు ప్రారంభమయ్యే పది నిమిషాల ముందుగా అంతకముందు రోజు తరగతిలో ఏమి చెప్పారో ఒక సారి గుర్తుకు తెచ్చుకోండి. ఆ రోజు చెప్పబోయే పాఠ్యాంశాన్ని అధ్యయనం చేసి మీకొచ్చే ఆలోచనలను గుర్తించండి. మీరు గుర్తించిన అంశాలన్నీ ప్రొఫెసర్ బోధనలో కవర్ అయ్యాయో లేదో చూడండి. ఏవైనా ముఖ్యాంశాలు ప్రొఫెసర్ బోధనలో రిపీట్ అవుతుంటే వాటిని బాగా గుర్తుంచుకోండి. అదేవిధంగా మొదటి నుంచి చివర వరకు ప్రతి పాఠ్యాంశం సారాంశాన్ని చదవండి. తరగతిలో రాసుకున్న నోట్స్, అసైన్‌మెంట్లు, ల్యాబ్ వర్క్‌తో రూపొందించుకున్న ప్రాజెక్టులన్నింటినీ ఒక మెటీరియల్‌లా సిద్ధం చేసుకోండి. ఈ కార్యక్రమం అంతా మిడ్ ఎగ్జామ్స్ వచ్చేటప్పటికి పూర్తవ్వాలి. ఇలా చేస్తే పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించడానికి అవకాశం ఉంటుంది.

**రొటీన్ చదువులొద్దు.. ఎఫెక్టివ్ స్టడీస్ ముద్దు:**
ఇంజనీరింగ్ విద్యార్థులు గుర్తుంచుకోవాల్సిన ముఖ్య విషయం ప్రతి అంశాన్ని బట్టీ పట్టొద్దు. ముందుగా చదువుకోవడానికి ప్రశాంతంగా ఉన్న ప్రదేశాన్ని ఎంచుకోవాలి. చదువుకోవడానికి తగిన విధంగా మంచి వ్యూహాలను సిద్ధం చేసుకోవడంతోపాటు పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించాలంటే.. మంచి స్టడీ స్కిల్స్‌ను కూడా అలవర్చుకోవాలి. అవసరమైతే ఇంటర్‌నెట్ సదుపాయాన్ని ఉపయోగించుకోవాలి. తరగతి బయట కనీసం రెండు గంటలన్నా వేగంగా చదివి..అర్థం చేసుకోగల సామర్థ్యాన్ని సొంతం చేసుకోవాలి. ఉదాహరణకు వారంలో 25 గంటలు క్లాసులు జరుగుతాయనుకుంటే.. క్లాసు బయట వారంలో కనీసం 50 గంటలు చదవాల్సి ఉంటుంది. క్లాస్‌రూంలో సహచర విద్యార్థులు, ప్రొఫెసర్లు చెప్పే మంచి విషయాలను వినాలి. మీకు తెలియని విషయాలను అడిగి నేర్చుకోవడానికి వెనుకాడొద్దు.

**మీ ప్రతిభను అంచనా వేసుకోండి:**
నెలరోజులకొకసారి స్వీయ పరిశీలన చేసుకోండి. ఈ నెల రోజుల్లో మీరు ఏఏ కొత్త విషయాలను నేర్చుకొన్నారు? కొత్త స్కిల్స్‌ను వేటిని పెంపొందించుకున్నారు? ఇలా స్వీయ పరిశీలన సాగాలి. దీనివల్ల బలాలు, బలహీనతలు తెలుస్తాయి. దానికనుగుణంగా లోపాలను గుర్తించి.. అధ్యాపకులతో చర్చించండి. వారిచ్చే సలహాలను, మార్గదర్శకత్వాన్ని స్వీకరించండి. తరగతి బయట కూడా అధ్యాపకులతో ఇంటరాక్ట్ అవుతుండాలి. దీనివల్ల లోపాలను అధిగమించి విజేతగా నిలవొచ్చు.

**సహాధ్యాయిలతో చదువు.. మీకెంతో మేలు:**
మీ ఇంటికి దగ్గరగా ఉన్న మీ క్లాస్‌మేట్స్ ఎవరో గుర్తించి.. వారితో స్నేహాన్ని పెంపొందించుకోండి. దీనివల్ల మీకెన్నో ప్రయోజనాలు ఉంటాయి. మీరెప్పుడైనా కళాశాలకు హాజరవకుంటే.. మీ స్నేహితుల వద్ద నుంచి నోట్స్ తీసుకుని రాసుకోవచ్చు. ఆ రోజు క్లాసు ముఖ్యాంశాలను వారితో చెప్పించుకుని వినొచ్చు. వారి నోట్స్‌తో మీ నోట్స్‌ను పోల్చి చూసుకోవడం ద్వారా మీ లోటుపాట్లు ఏమిటో తెలుస్తాయి. అంతేకాకుండా మీకు సందేహాలున్న సబ్జెక్టులలో సందేహాలు నివృత్తి చేసుకోవచ్చు. ఇలా ఒకరికున్న సందేహాలను మరొకరి ద్వారా నివృత్తి చేసుకోవచ్చు. పరీక్షల టైంలో అందరూ ఒక బృందంగా ఏర్పడి చదువుకుంటూ.. వివిధ ముఖ్యాంశాలపై బృంద చర్చలు నిర్వహించుకోవడం, మెటీరియల్‌ను క్విజ్ రూపంలో ప్రశ్నించుకోవడం ద్వారా పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించడం తేలికవుతుంది.

**ఇతర స్కిల్స్‌ను అలవర్చుకోండి:**
కేవలం మీ తరగతికి సంబంధించిన చర్చలే కాకుండా ఇతర కార్యకలాపాల్లోనూ చురుగ్గా పాలుపంచుకోండి. ఉదా: పర్యావరణ పరిరక్షణపై స్కూల్ చిన్నారులకు అవగాహన కల్పించడం, మురికివాడల చిన్నారులకు కంప్యూటర్ క్లాసులను నిర్వహించడం, సేవ్ ఎనర్జీ మొదలైనవాటిపై దృష్టి పెట్టండి. దీనివల్ల నిర్వహణా నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు, ఇంటర్‌పర్సనల్ స్కిల్స్ అలవడతాయి. ఇవి మీ భావి జీవితానికి ఎంతో మేలు చేస్తాయి. దాంతోపాటు సమాజానికి ఎంతో కొంత చేశామన్న ఆత్మ సంతృప్తి లభిస్తుంది.

**నిండైన ఆత్మవిశ్వాసంతో పరీక్ష హాల్లోకి:**
అకడెమిక్ గోల్‌ని సాధించే లక్ష్యంలో.. చివరి మజిలీ పరీక్షలు. పరీక్ష రాసే ముందుగానే వివిధ టెస్టులకు ప్రిపేరై ఉండాలి. ఉదాహరణకు ఆబ్జెక్టివ్ టైప్ ప్రశ్నలు, మల్టిపుల్ చాయిస్ కొశ్చన్స్, వైవా-వాయిస్. ఎలాంటి నోట్స్.. టెక్స్ట్ బుక్స్ లేకుండా ఒక ప్రశ్నను గుర్తుకు తెచ్చుకుని ఆ ప్రశ్నకు సమాధానాన్ని, దానికవసరమైన ప్రాజెక్ట్ వర్క్‌ను మననం చేసుకోవాలి. విఫలమైతే మరింత కృషి చేసి పట్టు సాధించాలి. నిండైన ఆత్మవిశ్వాసంతో పరీక్ష హాల్లోకి అడుగుపెట్టాలి. ముందుగా ప్రశ్నపత్రాన్ని ఆసాంతం చదవాలి. అందులో ఉన్న సూచనలను ముఖ్యంగా ఒకటికి రెండుసార్లు మననం చేసుకోవాలి.

ముందుగా మీరు బాగా రాయగలననుకున్న ప్రశ్నలకు సమాధానాలు రాసి.. కొంచెం కష్టమైన ప్రశ్నలను ఆ తర్వాత రాయాలి. చివరకు అత్యంత కష్టమైన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలి. మీకు తెలిసిన ప్రశ్నలకు ముందుగా సమాధానాలు ఇవ్వడం వల్ల మీ ఆత్మవిశ్వాసం స్థాయి పెరుగుతుంది. ఇలా చేస్తే మంచి మార్కులు సాధించొచ్చు.

## కెరీర్ గోల్

కోర్సు ప్రారంభంలోనే ఏ కెరీర్‌ను ఎంచుకోవాలనుకుంటున్నారో, దేనిపై మీకు అత్యంతాసక్తి ఉందో తెలుసుకోండి. ఉదాహరణకు బీటెక్ పూర్తికాగానే ఎంటెక్/ఇంజనీరింగ్ సర్వీసెస్/సివిల్స్/గ్రూప్స్/విదేశీ విద్య/ఎంబీఏ. వీటిలో మీకు దేనిపై ఆసక్తి ఉందో గమనించండి. అందుకనుగుణంగా మొదటి ఏడాది నుంచే సిద్ధమవ్వండి.

### కెరీర్ గోల్‌ను సాధించండిలా...

**భాషపై పట్టు సాధించండి:**
నేటి కార్పొరేట్ ప్రపంచంలో ఇంగ్లిష్‌కున్న ప్రాధాన్యత చెప్పనలవి కాదు. చాలా మంది విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూల్లో వెనుదిరిగేది భాషపై పట్టు లభించకే. కాబట్టి ఇంగ్లిష్‌లో ఒకాబ్యులరీ, లిజనింగ్ స్కిల్స్, రైటింగ్ స్కిల్స్, ఎనలిటికల్ స్కిల్స్, లాజికల్, రీజనింగ్ స్కిల్స్ వంటి వాటిని పెంపొందించుకోవాలి. అదేవిధంగా భాషపై పట్టుకోసం ఇంగ్లిష్ సాహిత్యం, ఆంత్రోపాలజీ, హిస్టరీ మొదలైన పుస్తకాలను చదవాలి. దీనివల్ల సంబంధిత భాషపై పట్టు పెరగడంతోపాటు అనర్గళంగా ఉపన్యసించగలిగే సామర్థ్యం అలవడుతుంది. వీటితోపాటుగా వివిధ దినపత్రికలు, ఇండియా టుడే, బిజినెస్ టుడే, బిజినెస్ ఇండియా, అవుట్ లుక్ మొదలైనవాటిని చదువుతుండాలి. రోజులో కనీసం రెండు లేదా మూడు కొత్త ఇంగ్లిష్ పదాలను నేర్చుకోవడంతోపాటు సంభాషణల్లో వాటిని వాడుతుండాలి. అదేవిధంగా వారంలో నాలుగు గంటలు లాజికల్ రీజనింగ్, వెర్బల్ రీజనింగ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ పుస్తకాలలో ప్రశ్నలను సాధన చేయాలి. ఇలా చేయడం వల్ల భవిష్యత్‌లో జీఆర్ఈ, జీమ్యాట్, క్యాట్ వంటి పరీక్షల్లో ప్రయోజనం కలుగుతుంది.

**బృంద చర్చలతో పెంపొందే విషయ పరిజ్ఞానం:**
వివిధ పత్రికలు, మ్యాగజీన్లు చదవడంతోపాటు న్యూస్ చానెళ్లలో వచ్చే చర్చా కార్యక్రమాలను వీక్షించాలి. అందులో పాలుపంచుకున్న నిపుణులు ఏఏ అంశాలను స్పృశిస్తున్నారో.. వాటిలోని మంచిచెడులను నిశితంగా గమనించి నోట్ చేసుకోవాలి. దీంతోపాటుగా రోజూ దినపత్రికల్లో చోటు చేసుకునే వివిధ అంశాలను మిత్రులతో చర్చిస్తే అర్థవంతంగా మాట్లాడే నైపుణ్యాన్ని పెంపొందించుకోవచ్చు. వివిధ అంశాలపై మీకున్న పరిజ్ఞానాన్ని అంచనా వేసుకునే అవకాశం కలుగుతుంది. ఇవేకాకుండా డిస్కవరీ, నేషనల్ జియోగ్రాఫిక్, యానిమల్ ప్లానెట్, హిస్టరీ చానెళ్లను చూస్తుండండి. ఈ ప్రోగ్రామ్స్ మిమ్మల్ని ఆశ్చర్యచకితుల్ని చేయడమే కాకుండా మీకు తెలియని చాలా సమాచారాన్ని తెలియజేస్తాయి.

**ఫారెన్ స్టడీస్:**
ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థుల్లో చాలా మంది లక్ష్యం విదేశీ చదువులు. బీటెక్ పూర్తవగానే టోఫెల్, జీఆర్ఈ, జీమ్యాట్ వంటి పరీక్షలు రాసి ఎంఎస్ లేదా మేనేజ్‌మెంట్ కోర్సుల్లోనో చేరిపోవచ్చు. విదేశీ చదువులే మీ లక్ష్యమైతే ఇంజనీరింగ్ మొదటి ఏడాది నుంచే అందుకనుగుణంగా సిద్ధమవ్వాలి. ఇందుకోసం కోచింగ్ తీసుకోవడంతోపాటు విదేశీ విద్య ప్రవేశపరీక్షలపై ఇంటర్నెట్‌లో లభ్యమయ్యే విస్తృత సమాచారాన్ని అందిపుచ్చుకోవాలి. వీటితోపాటు గుర్తింపున్న కన్సల్టెన్సీలను సందర్శించి ఫారెన్ ఎడ్యుకేషన్ గురించి, అక్కడి యూనివర్సిటీలు అందించే కోర్సులు, వసతి సౌకర్యాలు, ఉద్యోగావకాశాలు వంటివాటిని తెలుసుకోవాలి.

**ఆరోగ్యంపై శ్రద్ధ వహించండి:**
ఎవరేం చేయాలన్నా.. శారీరక, మానసిక ఆరోగ్యం చాలా అవసరం. ఇవి లేకపోతే ఎవరూ ఏమీ చేయలేరు. కాబట్టి దురలవాట్లకు దూరంగా ఉండండి. కళాశాలలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వంటి వాటిలో చేరండి. మీకు ఆసక్తి ఉన్న గేమ్/స్పోర్ట్స్‌లో చురుకుగా పాల్గొనండి. వీటితోపాటు యోగా, మెడిటేషన్, ప్రాణాయామం వంటి వాటిలో శిక్షణ పొందండి. మంచి ఆహార అలవాట్లను పెంపొందించుకోవాలి. ప్రతి రోజూ వాకింగ్, సైక్లింగ్, రన్నింగ్ చేస్తుండాలి. వీటివల్ల మీ మానసిక, శారీరక ఆరోగ్యాలు మెరుగుపడి రెండింటిలోనూ దృఢంగా తయారవుతారు. ఇది అటు చదువు, కెరీర్‌లో రాణించడానికి దోహదం చేస్తుంది.

# గగన్ నారంగ్‌కు ఒలింపిక్స్ పతకం



ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి
కరెంట్ అఫైర్స్ నిపుణులు

## క్రీడలు

### ప్రారంభమైన లండన్ ఒలింపిక్స్



30వ ఒలింపిక్ క్రీడలు జూలై 27న లండన్‌లోని ప్రధాన స్టేడియం స్ట్రాట్‌ఫోర్డ్‌లో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. 19 రోజులపాటు 26 రకాల క్రీడల్లో జరిగే ఈ ఒలింపిక్స్‌లో 204 దేశాల నుంచి 10,500 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. 302 విభాగాల్లో పతకాలు బహూకరిస్తారు. భారత్ నుంచి 81 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. షూటింగ్, బాక్సింగ్, ఆర్చరీ, బ్యాడ్మింటన్, టెన్నిస్‌లతో సహా 13 రకాల క్రీడల్లో భారత క్రీడాకారులు పోటీ పడుతున్నారు. ప్రారంభ కార్యక్రమంలో భారత్ బృందానికి రెజ్లర్ సుశీల్ కుమార్ నేతృత్వం వహించాడు. లండన్ వేదికగా ఒలింపిక్స్ జరగడం ఇది మూడోసారి. ఇంతకుముందు 1948లో లండన్‌లో జరిగాయి. ఆసియాలో జపాన్(1964), దక్షిణ కొరియా(1988), చైనా(2008) మాత్రమే ఒలింపిక్స్‌కు ఆతిథ్యమిచ్చాయి. ఆధునిక ఒలింపిక్ క్రీడలు 1896లో గ్రీస్ రాజధాని ఏథెన్స్‌లో ప్రారంభమయ్యాయి.

**చైనాకు తొలి స్వర్ణం**

లండన్ ఒలింపిక్స్‌లో తొలి స్వర్ణ పతకం చైనా షూటర్ యిసిలింగ్‌కు దక్కింది. జూలై 28న జరిగిన 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో ఈ స్వర్ణ పతకం సాధించింది.

### భారత్‌కు తొలి పతకం అందించిన గగన్ నారంగ్



హైదరాబాద్‌కు చెందిన గగన్ నారంగ్ 2012 ఒలింపిక్స్‌లో భారత్‌కు తొలి పతకం అందించాడు. జూలై 30న నిర్వహించిన 10మీ. ఎయిర్ రైఫిల్ విభాగంలో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం గెలిచాడు. ఈ పోటీలో రుమేనియాకు చెందిన ఆలిన్ జార్జి మాల్డోవిను స్వర్ణం, ఇటలీకి చెందిన నికోలో కాంప్రియాని రజతం సాధించారు. ఫైనల్‌లో మాల్డోవినుతోపాటు నారంగ్ 103.1 పాయింట్లు సాధించినా.. అర్హత పోటీల్లో పొందిన పాయింట్స్‌ను కూడా కలపడంతో నారంగ్ కాంస్యంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

### హామిల్టన్‌కు హంగేరి గ్రాండ్ ప్రి

మెక్‌లారెన్ జట్టు డ్రైవర్ లీవిస్ హామిల్టన్ ఫార్ములా వన్ హంగేరీ గ్రాండ్ ప్రి టైటిల్ సాధించాడు. బుడాపెస్ట్‌లో జూలై 29న జరిగిన పోటీలో హామిల్టన్ మొదటి స్థానంలో నిలవగా, రైకోనెన్ రెండోస్థానం దక్కించుకున్నాడు.

## జాతీయం

### బ్రహ్మోస్ 32వ పరీక్ష



ఒడిశా తీరంలోని చాందీపూర్ ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ నుంచి జూలై 29న నిర్వహించిన బ్రహ్మోస్ క్షిపణి పరీక్ష విజయవంతమైంది. బ్రహ్మోస్‌ను పరీక్షించడం ఇది 32వ సారి. ఈ క్షిపణి 290 కి.మీ. దూరంలోని లక్ష్యాన్ని ఛేదించగలదు. సరికొత్త ఉప వ్యవస్థల పనితీరును పరిశీలించేందుకు ఈ పరీక్ష జరిపారు. ఈ క్షిపణిని ఇప్పటికే సైనిక, నౌకా దళంలో చేర్చారు.

### రాష్ట్రపతిగా ప్రణబ్ ప్రమాణం



భారత 13వ రాష్ట్రపతి (పదవీ పరంగా 14వ, వ్యక్తుల పరంగా 13వ)గా ప్రణబ్ ముఖర్జీ జూలై 25న పార్లమెంట్ సెంట్రల్‌లో హాల్లో ప్రమాణ స్వీకారం చేశారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సరోష్ హోమీ కపాడియా ప్రణబ్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి పలువురు కేంద్రమంత్రులు, విదేశీ ప్రతినిధులు కూడా హాజరయ్యారు.

### దక్షిణాదిలో పెరుగుతున్న వాయు కాలుష్యం

దక్షిణాది రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడుతోపాటు ఒరిస్సా రాష్ట్రాల్లో అధిక స్థాయిలో వాయు కాలుష్యం ఉందని కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు (సీపీసీబీ) నివేదిక తెలిపింది. అత్యధిక కాలుష్యం కలిగించే పరిశ్రమల్లో 35.5 శాతం ఈ ఐదు రాష్ట్రాల్లో ఉన్నాయి. ఈ జాబితాలో 450 అత్యధిక కాలుష్య కారక పరిశ్రమలతో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉండగా, 161 పరిశ్రమలతో కర్ణాటక మూడో స్థానంలో ఉంది. ఈ తరహా పరిశ్రమలు ఒడిశాలో 65, కేరళలో 49 ఉన్నాయి.

### కూచిపూడి నాట్యాచార్యుడు వెంపటి మృతి



ప్రముఖ కూచిపూడి నాట్యాచార్యుడు వెంపటి చిన సత్యం (83) జూలై 29న చెన్నైలో మరణించారు. కూచిపూడి నాట్యానికి అంతర్జాతీయ ఖ్యాతి తీసుకువచ్చిన ఆయన కృష్ణా జిల్లాలోని కూచిపూడి గ్రామంలో 1929 అక్టోబర్ 25న జన్మించారు. 18 ఏళ్ల వయసులో కూచిపూడి నృత్యాన్ని అభ్యసించారు. 1963లో కూచిపూడి ఆర్ట్ అకాడెమీని నెలకొల్పారు. శ్రీ కృష్ణ పారిజాతం, శ్రీనివాస కళ్యాణం, రుక్మిణీ కళ్యాణం, చండాలిక, హరవిలాసం వంటి అనేక నృత్య రూపకాలను రూపొందించారు. 2008 జూన్‌లో అమెరికాలో 300 మంది కళాకారులతో ఏకకాలంలో 'జతిస్వరం' ప్రదర్శించి గిన్నిస్‌బుక్ రికార్డు సాధించారు. 100 కుపైగా తెలుగు చిత్రాలకు కూడా నృత్య దర్శకత్వం వహించారు. రేఖ, హేమమాలిని వంటి ప్రముఖ నటీమణులకు కూచిపూడి నృత్యంలో శిక్షణనిచ్చారు. కూచిపూడి నృత్యం ద్వారా కళారంగానికి ఆయన చేసిన సేవలకుగాను 1967లో సంగీత అకాడెమీ ఫెలోషిప్, 1968లో పద్మభూషణ్ పురస్కారాలు లభించాయి.

### అసోం అల్లర్లలో 44 మంది మృతి

అసోంలోని కోక్రాజార్, చిరాంగ్, దుబ్రి జిల్లాల్లో చెలరేగిన ఘర్షణ, హింసాత్మక సంఘటనల్లో అనేక మంది మృతి చెందారు. రెండు లక్షల మంది నిరాశ్రయులయ్యారు. కోక్రాజార్ జిల్లాలో బోడోలు, మరో వర్గానికి చెందిన వలసవాదుల మధ్య వైరమే ఈ అల్లర్లకు కారణం.

### ఇస్రో చైర్మన్‌కు ఎస్కేయూ గౌరవ డాక్టరేట్



భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చైర్మన్ డాక్టర్ కె. రాధాకృష్ణన్‌కు శ్రీ కృష్ణదేవరాయ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ బహూకరించింది. జూలై 30న నిర్వహించిన యూనివర్సిటీ స్నాతకోత్సవంలో ఈ పురస్కారాన్ని అందించారు.

## అంతర్జాతీయం

### రామన్ మెగసెసె అవార్డులు

2012 సంవత్సరానికి రామన్ మెగసెసె అవార్డులను మనీలా (ఫిలిప్పైన్స్)లోని రామన్ మెగసెసె అవార్డ్ ఫౌండేషన్ జూలై 25న ప్రకటించింది.



సామాజిక సేవ విభాగంలో తమిళనాడులోని కృష్ణగిరికి చెందిన కులండే ఫ్రాన్సిస్‌కు ఈ అవార్డు లభించింది. కృష్ణగిరిలో ఇంటిగ్రేటెడ్ విలేజ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(ఐవిడి) అనే స్వచ్ఛంద సంస్థను నిర్వహిస్తున్న ఫ్రాన్సిస్ గ్రామాల్లో మహిళలు, వారి కుటుంబాల ఆర్థిక సాధికారత కోసం కృషి చేస్తున్నారు. మూడు జిల్లాల్లో 7000 స్వయం సహాయక బృందాలను ఏర్పాటు చేశారు. కులండే ఫ్రాన్సిస్(భారత్)తోపాటు చెన్ షు-చు(తైవాన్), రాములో డేవిడ్(ఫిలిప్పైన్స్), యాంగ్ సెయిన్ కోమా(కాంబోడియా), అంబోసిస్ రువింద్రి జర్బో(ఇండోనేషియా), సారా రిజ్వానా హసన్(బంగ్లాదేశ్)లు అవార్డుకు ఎంపికయ్యారు.

ఫిలిప్పైన్స్ మూడో అధ్యక్షుడు పేరిట 1957లో ఏర్పాటైన ఈ అవార్డు ఆసియాలో అత్యున్నతమైందిగా ఆసియా నోబెల్‌గా దీనిని భావిస్తారు. తాజా విజేతలతో కలిపి ఇప్పటివరకు 296 మందికి మెగసెసె పురస్కారాలు లభించాయి. వీరిలో అత్యధికులు భారత్‌కు చెందిన వారే (48 మంది) కావడం విశేషం. భారత్ తర్వాత 36 మందితో ఫిలిప్పైన్స్ రెండో స్థానంలో ఉంది.ప్రభుత్వ సేవ, ప్రజాసేవ, సామాజిక నాయకత్వం, జర్నలిజం-సాహిత్యం-సృజనాత్మక కళలు, శాంతి, అంతర్జాతీయ అవగాహన, ఎదుగుతున్న నాయకత్వం వంటి ఆరు రంగాల్లో కృషి చేసిన వారికి ఈ అవార్డు బహూకరిస్తారు.

### ఉగాండాలో 'ఇబోలో' వైరస్

ప్రాణాంతక 'ఇబోలో' వైరస్ సోకి ఉగాండాలో ఒక్క జూలైలోనే 14 మంది మరణించారు. ఇబోలో వైరస్‌కు వ్యాక్సిన్, చికిత్స లేదు. ఉగాండాలో 2000లో ఈ వ్యాధి బారిన పడి 224 మంది మరణించారు. ఈ వ్యాధితో జ్వరం సోకిన వారు త్వరగా మృతి చెందుతారు. ఇది త్వరగా వ్యాపించే అంటువ్యాధి.

### యూఎస్ ప్రెసిడెన్షియల్ అవార్డు



యువ శాస్త్రవేత్తలకిచ్చే అమెరికా అత్యున్నత యూఎస్ ప్రెసిడెన్షియల్ అవార్డు భారత సంతతికి చెందిన నలుగురికి దక్కింది. వీరిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన శ్రీదేవి వేదుల శర్మతో పాటు పవన్ సిన్హా, పరాగ్ ఎ పాఠక్, బిజు పర్కెదాన్ ఉన్నారు. ప్రెసిడెంట్ ఎర్లీ కెరీర్ అవార్డ్స్ ఫర్ సైంటిస్ట్స్ అండ్ ఇంజనీర్స్‌గా పిలిచే ఈ అవార్డును 1996లో ఏర్పాటు చేశారు. ఇంజనీరింగ్, శాస్త్ర సాంకేతిక రంగాల్లో వ్యక్తిగతంగా సాధించిన విజయాలకు ఈ అవార్డు బహూకరిస్తారు.

**నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఆర్ట్స్‌లో భారత సంతతి మహిళ**

అమెరికా నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఆర్ట్స్‌లో భారత సంతతికి చెందిన నాట్యకారిణి రాణీ రామస్వామిని అమెరికా అధ్యక్షుడు ఒబామా నియమించారు.

### ఘనా అధ్యక్షుడిగా జాన్ డ్రమాని మహామా



రిపబ్లిక్ ఆఫ్ ఘనా కొత్త అధ్యక్షుడిగా జాన్ డ్రమాని మహామా జూలై 25న ప్రమాణ స్వీకారం చేశారు. మహామా 2009 జనవరి నుంచి ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. అధ్యక్షుడు జాన్ అట్టా మిల్స్ జూలై 24న మరణించడంతో మహామా అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు.

### హై స్పీడ్ ఇంటర్నెట్

అత్యంత వేగవంతమైన ఇంటర్నెట్ కనెక్షన్ ఆవిష్కరించినట్లు గూగుల్ సంస్థ జూలై 28న ప్రకటించింది. దీనికి 'గూగుల్ ఫైబర్ సర్వీస్'గా పేరు పెట్టింది. సెకనుకు ఒక గిగాబైట్(1 జీబీ) వేగంతో పనిచేసే ఈ వ్యవస్థ ప్రపంచంలోనే వేగవంతమైన ఇంటర్నెట్ సర్వీస్. దీని ద్వారా సెకనుకు ఒక సినిమా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఒకే సమయంలో 8 టీవీ చానళ్ల ప్రదర్శనలను రికార్డు చేయొచ్చు. 500 గంటల కార్యక్రమాలను భద్రపరచుకోవచ్చు. ఈ వ్యవస్థను మొదటిసారిగా మిస్సోరి రాష్ట్రంలోని కాన్సాస్ సిటీలో ఆవిష్కరించారు. సెప్టెంబర్ నుంచి ఈ నగరంలో ఇన్‌స్టాలేషన్‌లు ప్రారంభించి, తర్వాత ఇతర నగరాలకు విస్తరిస్తారు.

### మరో సౌర కుటుంబం!

మన సౌర కుటుంబం మాదిరిగానే గ్రహాలు క్రమపద్ధతిలో, సమాంతర కక్ష్యల్లో తిరుగుతున్న మరో సౌర వ్యవస్థను యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా ఖగోళ శాస్త్రవేత్తలు కనుగొన్నారు. సూర్యుడి చుట్టూ తిరుగుతున్న మన గ్రహాల వ్యవస్థ మాదిరిగానే అక్కడి గ్రహాల వ్యవస్థ కూడా ఏర్పడిందని వెల్లడించారు.

భూమికి 10 వేల కాంతి సంవత్సరాల దూరంలో కెప్లర్-30 అనే భారీ నక్షత్రం చుట్టూ ఇలాంటి గ్రహ వ్యవస్థ ఉన్నట్లు కనుగొన్నామని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా పరిశోధకులు ప్రకటించారు. నాసాకు చెందిన కెప్లర్ స్పేస్ టెలిస్కోప్‌ను ఉపయోగించి ఈ వ్యవస్థను గుర్తించారు. మన సౌర కుటుంబం ఆవల ఇలాంటి గ్రహ వ్యవస్థ ఉన్నట్లు కనుగొనడం ఇదే తొలిసారి. మన సూర్యుడి భ్రమణానికి సమాంతరంగా ఇక్కడ గ్రహాల మార్గాలున్నాయని, ఈ కొత్త అధిగ్రహ వ్యవస్థలోని మూడు గ్రహాల మార్గాలు కూడా అక్కడి సూర్యుడి భ్రమణానికి సమాంతరంగా ఉన్నాయని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

send your feedback to: sakshieducation@gmail.com

Ask the expert

# ఆర్మీలో డాక్టర్‌గా కెరీర్ ప్రారంభించాలంటే?



టి. మురళీధరన్
టి.ఎం.ఐ. నెట్‌వర్క్

**స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నిర్వహించే కంబైన్డ్ మెట్రిక్ లెవల్ పరీక్షకు సంబంధించిన వివరాలు తెలపండి?** కృష్ణ, విజయవాడ.

స్టాఫ్ సెలెక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ).. దేశ వ్యాప్తంగా నిర్వహించే కంబైన్డ్ మెట్రిక్ లెవల్ ఎగ్జామినేషన్ ద్వారా కేంద్ర ప్రభుత్వంలోని వివిధ విభాగాల్లో స్టెనో గ్రాఫర్లు గ్రేడ్-'సి', గ్రేడ్-'డి', లోయర్ డివిజన్ క్లర్క్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులను భర్తీ చేస్తుంది. ఇటీవలి కాలంలో ఈ ఎగ్జామ్‌ను 'హయ్యర్ సెకండరీ లెవల్ ఎగ్జామినేషన్'గా పేరు మార్చారు. ఈ పరీక్ష ద్వారా ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా, సీవీసీ, విదేశీ మంత్రిత్వ శాఖ, ఆర్మ్‌డ్ ఫోర్సెస్ హెడ్ క్వార్టర్స్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ టూరిజం, కస్టమ్స్‌తోపాటు పలు కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు/విభాగాలు/ఆఫీసులలో గ్రేడ్-'సి', గ్రేడ్-'డి', లోయర్ డివిజన్ క్లర్క్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టుల భర్తీ ఉంటుంది.

**అర్హతలు:** ఇంటర్మీడియెట్ లేదా తత్సమానం.

**వయోపరిమితి:** 18 నుంచి 27 ఏళ్లు. రిజర్వ్‌డ్ అభ్యర్థులకు నిబంధనలమేరకు వయోసడలింపు ఉంటుంది.

రెండు దశల్లో.. ఎంపిక ఉంటుంది. మొదటి దశలో రాత పరీక్ష ఉంటుంది. ఆబ్జెక్టివ్ విధానంలో జనరల్ ఇంటలిజెన్స్, ఇంగ్లిష్, క్వాంటిటేటివ్ ఎబిలిటీ, జనరల్ అవేర్‌నెస్ విభాగాల నుంచి ప్రశ్నలు వస్తాయి. రాత పరీక్షలో క్వాలిఫై అయిన వారికి రెండో దశలో పోస్టును బట్టి స్కిల్ టెస్ట్ నిర్వహిస్తారు. రాత పరీక్ష, స్కిల్ టెస్ట్ ఆధారంగా మెరిట్‌లిస్ట్ రూపొందిస్తారు. దాని ఆధారంగా నియామకం ఖరారు చేస్తారు.

వివరాలకు: htpp://ssc.nic.in

**యూఎస్‌లో ఏరోనాటికల్ ఇంజనీరింగ్‌లో ఎంఎస్ చేయాలనుకుంటున్నాను? వివరాలు తెలపండి?** - లక్ష్య, హైదరాబాద్.

యూఎస్‌లో ఎంఎస్ చేయాలంటే ముందుగా అక్కడి పరిస్థితులపై అవగాహన పెంచుకోవాలి. సంబంధిత ప్రిపరేషన్‌ను దాదాపుగా ఏడాదిన్నర ముందుగానే ప్రారంభించాలి. ఈక్రమంలో అక్కడి యూనివర్సిటీలు, వాటి అడ్మిషన్ ప్రక్రియను తెలుసుకోవాలి. సాధారణంగా ఏ దేశంలోనైనా అడ్మిషన్ విధానం ఏ రెండు ఇన్‌స్టిట్యూట్‌ల మధ్య ఒకే మాదిరిగా ఉండదు. ఇన్‌స్టిట్యూట్‌ల స్థాయి, పూర్వ చరిత్ర ఆధారంగా నిబంధనలు వేర్వేరుగా ఉంటాయి. కాబట్టి యూఎస్‌లో ఏరోనాటికల్ కోర్సును ఆఫర్ చేస్తున్న యూనివర్సిటీలు, అడ్మిషన్ కోసం అవి పాటించే ప్రమాణాలను తెలుసుకోవాలి. ఈ క్రమంలో దాదాపు 10 నుంచి 12 టాప్ యూనివర్సిటీలను షార్ట్ లిస్ట్ చేసుకోవాలి. విద్యార్థులు తాము ఎంచుకున్న కళాశాలలతో ఏడాది ముందుగా సంప్రదింపులు మొదలుపెట్టాలి. కోర్సు అప్లికేషన్, ఇతర సమాచారం కోసం ఆయా ఇన్‌స్టిట్యూట్‌లకు ఈ సమయంలోనే వినతి పత్రాలు సమర్పించాలి. ఆ సమాచారం పొందాక.. రికమెండేషన్ లెటర్లు సిద్ధం చేసుకోవడం ఎంతో ముఖ్యమైన దశ. ఇందుకోసం విద్యార్థులు తమకు బాగా తెలిసిన ప్రొఫెసర్లు లేదా ప్రొఫెషనల్స్‌ను సంప్రదించడం మంచిది. దీంతోపాటు తాము చదువుతున్న విద్యా సంస్థల నుంచి సంబంధిత డాక్యుమెంట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలి. సాధారణంగా ప్రతి ఇన్‌స్టిట్యూట్ ప్రవేశ సమయానికి 4.5 నెలల ముందే తుది జాబితా రూపొందిస్తుంది. ఈ క్రమంలో విద్యార్థులకు సమాచారం కూడా పంపుతుంది. ప్రవేశం కల్పించిన ఇన్‌స్టిట్యూట్‌లు అందించే ఐ-20 ఫామ్‌తో వీసా కోసం దరఖాస్తు చేయాలి. ఇందుకోసం సంబంధిత కాన్సులేట్ లేదా ఎంబసీ అధికారుల్ని సంప్రదించాలి. దరఖాస్తు సమయంలోనే.. అందుబాటులో ఉన్న తేదీల్లో తమకు అనుకూలమైన తేదీలను వీసా ఇంటర్వ్యూ కోసం ఎంచుకోవడం మంచిది.

యూఎస్‌లో దాదాపు అన్ని యూనివర్సిటీలు టోఫెల్/ జీఆర్‌ఈ స్కోర్ ఆధారంగా ఎంఎస్‌లో ప్రవేశం కల్పిస్తున్నాయి. ఇంజనీరింగ్ విద్యార్థులు చివరి సంవత్సరంలోనే ఈ పరీక్షలకు హాజరవుతున్నారు. అలా కాకుండా మూడో సంవత్సరంలోనే వీటిని పూర్తి చేసుకోవడం మంచిది. ఒకవేళ మొదట్లో నిరాశపరిచే ఫలితాలు వచ్చినా సరిదిద్దుకునే వీలుంటుంది. అంతేకాకుండా.. చివరి సంవత్సరంలో ఉండే ప్రాజెక్ట్ వర్క్ ఒత్తిడివల్ల ఈ పరీక్షలకు ప్రిపేరయ్యే సమయం లభించకపోవచ్చు.

**ఉపయోగపడే వెబ్‌సైట్లు:**

www.msinus.com
http://studyusa.com
www.vfsusa.co.in
www.studyusa.in
www.usnews.com

**ఆర్మీలో డాక్టర్‌గా కెరీర్ ప్రారంభించాలనుకుంటున్నాను. దీనికి సంబంధించిన వివరాలను తెలపండి?** - వర్షన్, కరీంనగర్.

ఆర్మీలో డాక్టర్‌గా కెరీర్ ప్రారంభించడానికి రెండు మార్గాలు.. ఒకటి ఆర్మ్‌డ్‌ఫోర్సెస్ మెడికల్ కాలేజ్ నుంచి ఎంబీబీఎస్ చేయడం, ఎంప్లాయ్‌మెంట్ నోటిఫికేషన్ ఆధారంగా ఆర్మీలో డాక్టర్ చేరడం. ఆర్మీలో డాక్టర్‌గా సేవలు అందించడానికి వేదికగా నిలుస్తోంది ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ కాలేజ్(ఏఎఫ్ఎంసీ)-పుణే. ఈ ఇన్‌స్టిట్యూట్ నుంచి ఎంబీబీఎస్ చేయడం ద్వారా ఆర్మీలో డాక్టర్‌గా కెరీర్ ప్రారంభించవచ్చు. ఎంబీబీఎస్‌లో ప్రవేశం కోసం ఏఎఫ్ఎంసీ జాతీయ స్థాయిలో ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహిస్తుంది. ఏఎఫ్ఎంసీలో ప్రవేశానికి ప్రతి ఏటా ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహిస్తారు. ఈ ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా ఏటా 130 మంది విద్యార్థులను చేర్చుకుంటారు. ఎంట్రెన్స్ టెస్ట్ 200 ప్రశ్నలకు, 200 మార్కులకు ఆబ్జెక్టివ్ రూపంలో ఉంటుంది. ఇందుకోసం 2 గంటల సమయం కేటాయిస్తారు. బయాలజీ (బోటనీ, జువాలజీలను కలిపి), ఫిజిక్స్, కెమిస్ట్రీల నుంచి 50 ప్రశ్నల చొప్పున వస్తాయి. ఇంటెలిజెన్స్, లాజికల్ రీజనింగ్‌లపై 25 ప్రశ్నలు, ఇంగ్లిష్ లాంగ్వేజ్, కాంప్రహెన్షన్‌లపై 25 ప్రశ్నలుంటాయి. ప్రతి తప్పు సమాధానానికి 0.25 నెగెటివ్ మార్కులు ఉంటాయి. రాత పరీక్షలో ఉత్తీర్ణులకు తర్వాతి దశల్లో ఇంటర్వ్యూ, మెడికల్ టెస్ట్ ఉంటుంది. వీటి ఆధారంగా సీటు ఖరారు చేస్తారు. సంబంధిత నోటిఫికేషన్ జనవరి/ఫిబ్రవరిలలో వెలువడుతుంది. పరీక్ష మే నెలలో ఉంటుంది.

**అర్హత:** 60 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్(ఇంగ్లిష్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ సబ్జెక్టులతో) ఉత్తీర్ణత. భారతీయులై ఉండాలి. అవివాహితులు మాత్రమే అర్హులు. మెడికల్‌గా ఫిట్‌గా ఉండాలి.

**కనీస వయసు:** 17 సంవత్సరాలు, **గరిష్ట వయసు:** 22 సంవత్సరాలు మించకూడదు.

ఏఎఫ్ఎంసీ కాకుండా.. ఆర్మీ నేరుగా విడుదల చేసే ఎంప్లాయ్‌మెంట్ నోటిఫికేషన్ ద్వారా మెడికల్ కాప్స్‌ను రిక్రూట్ చేసుకుంటుంది. ఈ విధంగా కూడా ఆర్మీలో డాక్టర్‌గా కెరీర్ ప్రారంభించవచ్చు. సంబంధిత నోటిఫికేషన్ల కోసం ఎంప్లాయ్‌మెంట్ న్యూస్ లేదా ఆర్మీ వెబ్‌సైట్ చూడొచ్చు.

వివరాలకు: htpp://afmc.nic.in,
htpp://indianarmy.nic.in

## జాబ్స్ ఇన్ఫో

### ఎస్‌బీఐ అసోసియేట్ బ్యాంక్స్‌లో 7740 క్లరికల్ పోస్టులు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), అసోసియేట్ బ్యాంక్స్‌లో క్లరికల్ కేడర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది.

మొత్తం పోస్టుల సంఖ్య: 7740

మన రాష్ట్రానికి కేటాయించిన పోస్టులు: 1002

**అర్హత:** 60 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ లేదా ఏదైనా గ్రాడ్యుయేషన్.

**వయసు:** ఆగస్టు 1, 2012 నాటికి 18- 28 ఏళ్లు.

**ఎంపిక విధానం:**
రాత పరీక్ష ద్వారా. ఇందులో జనరల్ అవేర్‌నెస్, జనరల్ ఇంగ్లిష్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్ ఎబిలిటీ, మార్కెటింగ్ ఆప్టిట్యూడ్ / కంప్యూటర్ నాలెడ్జ్ అంశాల్లో ప్రశ్నలు వస్తాయి. ఆబ్జెక్టివ్ టైప్‌లో ప్రశ్నపత్రం ఉంటుంది.

**రాత పరీక్ష తేదీలు:** అక్టోబర్ 7, 14, 2012.

**దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

**ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభం:** జూలై 30, 2012.

**ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ముగింపు:** ఆగస్టు 13, 2012.

వివరాలకు: www.sbi.co.in

### ఏపీపీఎస్సీ-పాలిటెక్నిక్ లెక్చరర్స్ నోటిఫికేషన్

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ), ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో ఇంజనీరింగ్-నాన్ ఇంజనీరింగ్ విభాగాల్లో లెక్చరర్ల నియామకం కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా 20 విభాగాల్లో మొత్తం 869 ఖాళీలను భర్తీ చేయనుంది.

**భర్తీ చేసే పోస్టులు:**

| విభాగాలు | ఖాళీలు |
|---|---|
| సివిల్ ఇంజనీరింగ్ | 133 |
| మెకానికల్ ఇంజనీరింగ్ | 138 |
| ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ | 138 |
| ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ | 130 |
| కంప్యూటర్ ఇంజనీరింగ్ | 49 |
| టెక్స్‌టైల్ టెక్నాలజీ | 8 |
| ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ | 4 |
| ఆటోమొబైల్ ఇంజనీరింగ్ | 5 |
| ఫుట్‌వేర్ టెక్నాలజీ | 3 |
| ప్యాకింగ్ టెక్నాలజీ | 2 |
| ఆర్కిటెక్చరల్ ఇంజనీరింగ్ | 1 |
| గార్మెంట్ టెక్నాలజీ | 1 |
| సిరామిక్ టెక్నాలజీ | 1 |
| లిథోగ్రఫీ(Lithography) | 1 |
| టన్నెరీ (Tannery) | 2 |
| ఇంగ్లిష్ | 60 |
| మ్యాథమెటిక్స్ | 55 |
| ఫిజిక్స్ | 60 |
| కెమిస్ట్రీ | 60 |
| కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్ | 18 |

**వయసు:** జూలై 1, 2012 నాటికి 18-35 ఏళ్లు. నిర్దేశిత అభ్యర్థులకు నిబంధనల మేరకు వయో సడలింపు ఉంటుంది.

**ఎంపిక విధానం:** రెండు దశలుగా ఉంటుంది. మొదటి దశలో రాత పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో క్వాలిఫై అయిన వారు తర్వాతి దశ ఇంటర్వ్యూకు హాజరు కావాలి. రాత పరీక్ష, ఇంటర్వ్యూ రెండు దశలకు కలిపి మొత్తం 500 మార్కులు కేటాయించారు.

**రాత పరీక్ష:** ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహించే రాత పరీక్షను మొత్తం 450 మార్కులు కేటాయించారు. ఇందులో రెండు పేపర్లు ఉంటాయి. మొదటి పేపర్‌కు 150 మార్కులు కేటాయించారు. ఈ పేపర్ అన్ని బ్రాంచ్ అభ్యర్థులకు కామన్‌గా ఉంటుంది. ఈ పేపర్‌లో జనరల్ స్టడీస్, మెంటల్ ఎబిలిటీ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. మొత్తం 150 ప్రశ్నలకు 150 నిమిషాల్లో సమాధానాలను గుర్తించాలి. రెండో పేపర్‌లో సంబంధిత సబ్జెక్ట్‌పై ప్రశ్నలు ఉంటాయి. ఈ పేపర్‌కు 300 మార్కులు కేటాయించారు. మొత్తం 150 ప్రశ్నలకు 150 నిమిషాల్లో సమాధానాలను గుర్తించాలి.

**ఇంటర్వ్యూ:** రాత పరీక్షలో క్వాలిఫై అయిన అభ్యర్థులకు 50 మార్కులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.

**దరఖాస్తు విధానం:** నవంబర్ 6 నుంచి డిసెంబర్ 6, 2012 మధ్య ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

**ఫీజు చెల్లించడానికి చివరి తేదీ:** డిసెంబర్ 4, 2012.

**పరీక్ష తేదీ:** జనవరి 6, 2013.

వివరాల కోసం: www.apspsc.gov.in/

### ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ ఎగ్జామినేషన్




యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) - న్యూఢిల్లీ. సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్‌లలో అసిస్టెంట్ కమాండెంట్ కేడర్ ఉద్యోగాల భర్తీ కోసం నిర్వహించే ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ ఎగ్జామినేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

ఎగ్జామ్ ద్వారా భర్తీ చేసే పోస్టుల సంఖ్య: 401

**భర్తీ చేసే విభాగాల వారీగా ఖాళీలు:**

| | |
|---|---|
| బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ | 94 |
| సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ | 233 |
| సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ | 44 |
| ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్ | 26 |
| సశస్త్ర సీమా బల్ | 14 |

**అర్హత:** ఏదైనా గ్రాడ్యుయేషన్. నిర్దేశించిన విధంగా శారీరక ప్రమాణాలు ఉండాలి.

**వయసు:** 20-25 ఏళ్లు. నిర్దేశిత అభ్యర్థులకు నిబంధనల మేరకు వయో సడలింపు ఉంటుంది.

**ఎంపిక విధానం:** రాత పరీక్ష, ఫిజికల్ టెస్ట్, మెడికల్ టెస్ట్ ఆధారంగా ఉంటుంది.

**రాత పరీక్ష తేదీ:** నవంబర్ 11, 2012.

**దరఖాస్తు:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

**ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** ఆగస్టు 27, 2012.

వివరాలకు: www.upsc.gov.in

ప్రతి గురువారం సాక్షితో ఉచితం 9-8-2012
Online Edition
www.sakshieducation.com/bhavitha.aspx
సాక్షి

# భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
7740 క్లరికల్ పోస్టుల
భర్తీ కోసం నోటిఫికేషన్
విడుదల చేసిన నేపథ్యంలో..
పరీక్ష వివరాలు..ప్రిపరేషన్ ప్లాన్..
11

Sakshi Bhavita TV Program on Facebook facebook.com/sakshibhavita

ఉద్యోగాలు..ఇంజనీరింగ్, మెడిసిన్, మేనేజ్‌మెంట్ కోర్సులు చదివినవారికేనా? ఈ కోర్సుల స్థాయిలో మిగతా కోర్సుల్లో జీతభత్యాలు అందుకోవడం అసాధ్యమా? ఎంతమాత్రం కాదు. ఇటీవల కాలంలో ఎక్కువ మంది విద్యార్థులు దూరమవుతున్న సోషల్ సైన్సెస్ కోర్సులు సైతం లక్షల్లోనే జీతభత్యాలు అందిస్తున్నాయి. సోషల్ సైన్సెస్ కోర్సులు అందించడంలో జాతీయస్థాయిలో పేరొందిన టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టిస్) హైదరాబాద్ క్యాంపస్‌లోనూ కోర్సులు ప్రారంభించింది. ఈ నేపథ్యంలో టిస్ కోర్సులపై ఫోకస్...

## టిస్



సోషల్ సైన్సెస్ కోర్సుల్లో మేటి
3

## టీఆర్‌పీఎస్..
## యువతకు 'ఇన్‌కం' ట్యాక్స్ చేయూత

2

ఆదాయ మార్గాల అన్వేషణలో ఉన్న యువతకు.. స్వయం ఉపాధి దిశగా ఆలోచించే ఉత్సాహవంతులకు..అదనపు ఆదాయం కోరుకునే వారికి..చేయూతనందించేందుకు ఇన్‌కం ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ ప్రవేశ పెట్టిన పథకం.. టీఆర్‌పీఎస్. బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్కరికీ అర్హత గలిగిన టీఆర్‌పీఎస్ తాజా నోటిఫికేషన్, ఈ సర్టిఫికెట్ ద్వారా కలిగే ప్రయోజనాలపై ఫోకస్..



4 'మెడిసిన్ అబ్రాడ్'పై ఫోకస్



ప్రతిష్టాత్మక క్యాట్ పరీక్షకు ఈ ఏడాది కన్వీనర్‌గా వ్యవహరించే అరుదైన గౌరవం తెలుగు వ్యక్తికి దొరికింది. మన రాష్ట్రంలోని గుంటూరు నుంచి ప్రస్థానం ప్రారంభించి.. తన ప్రతిభతో ఐఐఎం-కోజికోడ్‌లో మంచి ఫ్యాకల్టీగా గుర్తింపు పొందిన ఎస్ఎస్ఎస్ కుమార్.. మరో గౌరవం సొంతం చేసుకున్నారు. ఈ ఏడాది ఐఐఎం-కోజికోడ్ కో-ఆర్డినేట్ చేసే క్యాట్-2012కు కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. సహచరులు.. ట్రిపుల్ 'ఎస్(ఎస్ఎస్ఎస్)'గా సంబోధించే కుమార్..క్యాట్ నోటిఫికేషన్ విడుదలైన సందర్భంగా సాక్షి భవితకు ఎక్స్‌క్లూజివ్ ఇంటర్వ్యూ ఇచ్చారు. అందులోని ముఖ్యాంశాలు..
6

- సివిల్స్ మెయిన్స్-జీఎస్ ప్రిపరేషన్ గైడెన్స్
- గ్రూప్-1 మెయిన్స్-పేపర్-4 ప్రశ్నలు.. టిప్స్ టు స్కోర్ మోర్.

8,9

- కోర్సులో నిష్ణాతులుగా మారితే అవకాశాలకు కొదవుండదు.
- డిప్లొమా స్థాయిలో పాలిటెక్నిక్‌లను పటిష్టం చేసేందుకు పకడ్బందీ చర్యలు.
- కోర్సులో భాగంగా ఆరు నెలల ఇండస్ట్రీ ఎక్స్‌పోజర్ తప్పనిసరి.
- ఇంజనీరింగ్ కాలేజీలలోనూ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్స్.
- పరిశ్రమ వర్గాల భాగస్వామ్యంతో కొత్త సిలబస్‌కు రూపకల్పన.

రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ అజయ్‌జైన్‌తో ప్రత్యేక ఇంటర్వ్యూ
7





ప్రతి ఆదివారం ఉదయం 9-30 నుంచి 10గంటల వరకు.. మీ సాక్షి టీవీలో

మీరు ఉద్యోగావకాశాల కోసం ఎదురు చూస్తున్నారా? ఏపీపీఎస్సీ గ్రూప్స్, సివిల్స్, బ్యాంక్స్ వంటి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారా? అయితే సాక్షి భవిత టీవీ ప్రోగ్రాం చూడండి

వివిధ రంగాల్లో ఉపాధి.. కెరీర్ ఎంపికలో మెలకువలు.. తాజా ఉద్యోగాల సమాచారం.. అడ్మిషన్ల వివరాలు.. విద్యా సమాచారం.. స్కాలర్‌షిప్పుల వివరాలు... ఇంకా మరెన్నో...

భవిత

కెరీర్ ఎంపికలో దిక్సూచి.. భవిత! ఇకపై మీ సాక్షి టీవీలో
ప్రతి ఆదివారం ఉదయం 9-30 నుంచి 10గం.. వరకు

Tax Returns Preparers Scheme

# టీఆర్‌పీఎస్.. యువతకు 'ఇన్‌కం' ట్యాక్స్ చేయూత



**బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేశారా?**
**ఆదాయ మార్గాల కోసం అన్వేషిస్తున్నారా?**
**మీకు నచ్చిన సమయంలో పని చేయాలని అభిలషిస్తున్నారా?**
అయితే మీలాంటి వారికి ఆహ్వానం పలుకుతోంది ఆదాయం పన్ను శాఖ.
దేశానికి ప్రధాన ఆదాయ వనరులైన ఇన్‌కం ట్యాక్స్, సర్వీస్ ట్యాక్స్ రిటర్న్స్‌ను దాఖలు చేసే విషయంలో ఆయా వ్యక్తులు, సంస్థలకు ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని సరికొత్త పథకానికి రూపకల్పన చేసింది ఆదాయం పన్ను శాఖ. అదే ట్యాక్స్ రిటర్న్స్ ప్రిపేరర్స్ స్కీం (టీఆర్‌పీఎస్). అటు పన్ను చెల్లింపుదారులకు, ప్రభుత్వానికి.. ఇటు ఆదాయ అన్వేషణలో ఉన్న యువతకు ప్రయోజనకరంగా మారుతున్న టీఆర్‌పీఎస్ తాజా నోటిఫికేషన్, విధివిధానాలపై విశ్లేషణ..

'ఇన్‌కం ట్యాక్స్ రిటర్న్స్ ఫైల్ చేయడమా? అదో పెద్ద వ్యవహారం.'

– పన్ను చెల్లింపుదారుల్లో నెలకొన్న అభిప్రాయం.

'చార్టర్డ్ అకౌంటెంట్ల సంఖ్య తక్కువగా ఉంటోంది. వ్యక్తులు తమ ఆదాయం పన్ను మదింపులో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో పన్ను రాబడి తగ్గుతోంది'

– ఇది ప్రభుత్వ అభిప్రాయం.

ఈ రెండు కోణాలకు పరిష్కార మార్గంగా కేంద్ర ప్రభుత్వం తొలిసారి 2006లో ప్రవేశ పెట్టిన పథకమే ట్యాక్స్ రిటర్న్స్ ప్రిపరేర్స్ స్కీం. ఈ స్కీం ద్వారా దేశవ్యాప్తంగా అయిదు వేల మందికి ఇన్‌కం ట్యాక్స్, సర్వీస్ ట్యాక్స్ విధివిధానాలపై, పన్ను మదింపుపై శిక్షణనిస్తారు. శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికేట్‌తోపాటు గుర్తింపు నెంబర్ కేటాయిస్తారు. అప్పట్నుంచి ఆ అభ్యర్థులకు వ్యక్తులు, సంస్థల తరఫున ఇన్‌కం ట్యాక్స్, సర్వీస్ ట్యాక్స్ రిటర్న్స్ దాఖలు చేసే అర్హత లభిస్తుంది.

2006లో తొలి బ్యాచ్‌లో దేశవ్యాప్తంగా అయిదు వేల మందికి టీఆర్‌పీఎస్ ద్వారా శిక్షణనిచ్చిన ఆదాయం పన్ను శాఖ.. తాజాగా రెండో బ్యాచ్‌కు నోటిఫికేషన్ జారీ చేసింది.

## NIIT.. ట్యాక్స్‌మన్‌లతో ఒప్పందం:

దేశవ్యాప్తంగా అయిదువేల మందికి శిక్షణనిచ్చే క్రమంలో ప్రభుత్వం.. ప్రముఖ శిక్షణ సంస్థ NIIT, పన్నుల చట్టాల పరిశోధనలు, ప్రచురణల్లో పేరుగాంచిన ట్యాక్స్‌మన్ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుంది. ఆదాయం పన్ను శాఖ అవసరాలకు తగిన విధంగా కోర్సు కరిక్యులం రూపకల్పన జరుగుతుంది. దేశవ్యాప్తంగా ఉన్న NIIT శిక్షణ కేంద్రాల్లో ఎంపిక చేసిన సెంటర్లలో శిక్షణ తరగతులు నిర్వహిస్తారు.

### కమ్యూనికేషన్ స్కిల్స్ ఉంటే మరింత ఆదాయం

టీఆర్‌పీ సర్టిఫికెట్ పొందిన అభ్యర్థులు తమలోని కమ్యూనికేషన్ స్కిల్స్, మార్కెటింగ్ స్కిల్స్‌ను ఎంత మెరుగుపరచుకుంటే అంతలా ఆదాయం లభిస్తుంది. నేను ఎమ్మెస్సీ మ్యాథ్స్ చేసినా అదనపు ఆదాయం పొందే క్రమంలో 2006 బ్యాచ్‌లో శిక్షణ తీసుకున్నాను. ఇందుకోసం నిర్వహించే ప్రవేశ పరీక్ష కూడా ఏమంత కష్టంగా ఉండదు. శిక్షణ కోర్సు కూడా సులభంగానే ఉంటుంది. అయితే పన్నులు, చట్టాలకు సంబంధించి నిరంతర మార్పులను గమనించే నైపుణ్యం పెంచుకోవాలి. కేవలం వ్యక్తిగతంగా క్లయింట్లను అన్వేషించడమే కాకుండా ఇన్‌కం ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ ప్రతి ఏటా నిర్వహించే ప్రత్యేక క్యాంపుల వద్ద కూడా సేవలు అందించి ఆదాయం పొందొచ్చు.

–బి.వి. రమణారెడ్డి,
సర్టిఫైడ్ టీఆర్‌పీ (2006 బ్యాచ్), హైదరాబాద్.

## రాష్ట్రంలో ఆరు సెంటర్లు.. 350 అభ్యర్థులు:

దేశంలో మొత్తం 107 టీఆర్‌పీ శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయగా.. మన రాష్ట్రంలో ఆరు సెంటర్ల ద్వారా 350 మంది అభ్యర్థులకు శిక్షణనివ్వాలని నిర్ణయించారు.

అవి..

| | |
|---|---|
| హైదరాబాద్ (మెహిదీపట్నం) | 50 |
| హైదరాబాద్ (దిల్‌సుఖ్ నగర్) | 50 |
| సికింద్రాబాద్ | 50 |
| విజయవాడ | 100 |
| విశాఖపట్నం | 50 |
| వరంగల్ | 50 |

## అర్హత.. బ్యాచిలర్ డిగ్రీ:

ట్యాక్స్ రిటర్న్స్ ప్రిపేరర్స్ స్కీం ద్వారా అయిదు వేల మందికి శిక్షణనిచ్చే క్రమంలో ముందుగా ప్రవేశ పరీక్ష ఉంటుంది. ఔత్సాహిక అభ్యర్థులు దీనికి దరఖాస్తు చేసుకోవాలి. ఎల్‌ఎల్‌బీ, ఎకనామిక్స్ సబ్జెక్ట్‌గా బీఏ/బీఎస్సీ, స్టాటిస్టిక్స్‌లో బీఏ/బీఎస్సీ, మ్యాథమెటిక్స్‌తో బీఏ/బీఎస్సీ, బీకాం, బీబీఎం, బీబీఏ ఉత్తీర్ణులు ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. ఏప్రిల్ 1, 2012 నాటికి 21 నుంచి 35 ఏళ్ల మధ్య వయసుండాలి. దరఖాస్తుదారుల అకడెమిక్ పర్సంటేజీల ఆధారంగా ఒక్కో సెంటర్‌కు కేటాయించిన సీట్లకు పదిరెట్ల అభ్యర్థులను (అంటే ఒక్కో సీటుకు పది మందిని) ప్రవేశ పరీక్షకు ఎంపిక చేస్తారు. ఈ ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులై మెరిట్ లిస్ట్‌లో నిలిచిన అభ్యర్థులకు టీఆర్‌పీఎస్ శిక్షణ మొదలవుతుంది.

## ప్రవేశ పరీక్ష ఇలా:

టీఆర్‌పీఎస్ శిక్షణ కోసం నిర్దేశించిన ప్రవేశ పరీక్ష రెండు గంటల వ్యవధిలో నాలుగు విభాగాలు (మ్యాథమెటిక్స్, రీజనింగ్, ఇంగ్లిష్ కాంప్రహెన్షన్, జనరల్ అవేర్‌నెస్)గా ఉంటుంది. ఆబ్జెక్టివ్ విధానంలో మొత్తం 160 ప్రశ్నలు అడుగుతారు. సాధారణంగా ఈ ప్రశ్నలు సగటు అభ్యర్థి కూడా సమాధానం ఇవ్వగలిగేవిగా ఉంటాయని, పదిమందిలో ఒకరిగా నిలవాలంటే మాత్రం వేగం, విశ్లేషణాత్మక నైపుణ్యాలు కీలక పాత్ర పోషిస్తాయని 2006 బ్యాచ్ టీఆర్‌పీఎస్ ఎంట్రెన్స్ విజేతలు చెబుతున్నారు.

## పరీక్ష తర్వాత ఉచితంగా శిక్షణ:

ప్రవేశ పరీక్షలో ప్రతిభ చూపిన తర్వాత అభ్యర్థులకు నిర్దేశిత NIIT శిక్షణ కేంద్రాల్లో పదిహేను రోజుల పాటు సెల్ఫ్‌స్టడీ, పదకొండు రోజులపాటు క్లాస్ రూం శిక్షణ ఉంటుంది. ఇది కూడా ఉచితమే. ఎలాంటి ఫీజు చెల్లించక్కర్లేదు. అయితే శిక్షణ ప్రారంభంలో వేయి రూపాయల కాషన్ డిపాజిట్ చెల్లించాలి. శిక్షణ పూర్తయ్యాక ఆ మొత్తం మళ్లీ అభ్యర్థికి తిరిగిచ్చేస్తారు. ఇక.. శిక్షణ ఆసాంతం ఆదాయం పన్ను చట్టాలు, ప్రభుత్వ విధానాలు, మార్పులను తెలియజేసే విధంగా సాగుతుంది. శిక్షణ తరగతులు పూర్తయ్యాక అప్పటివరకు బోధించిన అంశాలపై పరీక్ష నిర్వహించి అందులో నిర్దేశిత ఉత్తీర్ణత మార్కులు పొందిన వారికి సర్టిఫికెట్, గుర్తింపు నెంబర్ కేటాయిస్తారు. దీంతో ఆ అభ్యర్థులు టీఆర్‌పీలుగా అర్హత పొందినట్లే.

## రిఫ్రెష్‌మెంట్ తరగతులు కూడా:

ప్రతి ఏటా బడ్జెట్ కారణంగా, ఇతర చట్టాల్లో సవరణల కారణంగా మార్పులు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వాటిపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ప్రతి ఏటా నిర్దేశిత రోజుల్లో రిఫ్రెష్‌మెంట్ తరగతులను కూడా నిర్వహిస్తారు. 2006 బ్యాచ్ టీఆర్‌పీలకు రెండేళ్లపాటు ఒక్కో విడత చొప్పున రెండుసార్లు రిఫ్రెష్‌మెంట్ శిక్షణనిచ్చారు. అంతేకాకుండా టీఆర్‌పీ వెబ్‌సైట్‌లో ఎప్పటికప్పుడు తాజా మార్పులను పొందుపర్చి.. పన్నులు- విధివిధానాల్లో మార్పులపై సర్టిఫైడ్ టీఆర్‌పీలు అప్‌డేటెడ్ నాలెడ్జ్ పొందేలా ఇన్‌కం ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ చర్యలు చేపడుతోంది.

## లాభమేంటి?

'టీఆర్‌పీ పథకం ఉద్దేశం బాగానే ఉంది. కానీ లాభమేంటి? ఆదాయం ఎలా వస్తుంది?' ఔత్సాహిక దరఖాస్తుదారుల్లో మెదిలే ప్రశ్న ఇదే. ఒకసారి టీఆర్‌పీ సర్టిఫికెట్ పొంది వ్యక్తులు, సంస్థల తరఫున రిటర్న్స్ దాఖలు చేసే అర్హత పొందిన అభ్యర్థికి.. మొదటి సంవత్సరంలో తన తరఫున దాఖలైన ప్రతి రిటర్న్ ద్వారా చెల్లించిన పన్ను మొత్తంలో మూడు శాతం; రెండో సంవత్సరంలో రెండు శాతం కమిషన్; మూడో సంవత్సరం నుంచి ఒకశాతం కమిషన్‌ను ఆదాయం పన్ను శాఖ చెల్లిస్తుంది. మరోవైపు క్లయింట్ల నుంచి కూడా ఒక్కో రిటర్న్‌కు రూ. 250 వసూలు చేసుకోవచ్చు. ఇలా రెండు మార్గాల ద్వారా ఆదాయం లభిస్తుంది. అంతమాత్రాన.. పూర్తిస్థాయిలో ఈ వ్యవహారంలో నిమగ్నమవ్వాల్సిన ఆవసరం లేదు. అదనపు ఆదాయం కోరుకునే వారు పార్ట్ టైం విధానంలో కూడా తమకు నచ్చిన సమయాన్ని ఈ విధుల కోసం కేటయించుకోవచ్చు. స్వయం ఉపాధి కోరుకునే వారికి కూడా ఇది ఎంతో చక్కని మార్గం.

## ఆదాయపు పన్ను శాఖ నుంచి తోడ్పాటు:

సర్టిఫైడ్ టీఆర్‌పీలు తమ తరఫున ఇన్‌కం ట్యాక్స్ రిటర్న్స్ అప్లికేషన్స్ సంఖ్యను.. తద్వారా ఆదాయాన్ని పెంచుకునేందుకు కూడా ఆదాయం పన్ను శాఖ మార్గం చూపుతుంది. ఎవరైనా ఒక వ్యక్తి తాను రిటర్న్ దాఖలు చేసేందుకు ఇబ్బంది పడుతున్నట్లు టీఆర్‌పీ వెబ్‌సైట్ ద్వారా లేదా హెల్ప్‌లైన్ సెంటర్ ద్వారా ఆదాయం పన్ను శాఖకు తెలియజేస్తే.. ఆ వ్యక్తి నివాసానికి సమీపంలోని టీఆర్‌పీలను గుర్తించి వారికి సమాచారం అందిస్తుంది.

## రుణ సదుపాయం:

టీఆర్‌పీ సర్టిఫికెట్ పొందాక.. పూర్తిస్థాయిలో ఇదే బాధ్యతలు నిర్వర్తించాలని అభిలషించే అభ్యర్థులకు.. ఆఫీస్, ఇతర మౌలిక సదుపాయాలు సమకూర్చునేందుకు వీలుగా రుణ సదుపాయం కూడా అందుబాటులో ఉంది. ఇందుకోసం కెనరా బ్యాంక్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. దీని వల్ల 15 శాతం మార్జిన్ మనీతో రూ. అరవై వేల రుణం పొందొచ్చు. అంతేకాక రుణం మంజూరైన తర్వాత నెల నుంచే తిరిగి చెల్లించాల్సిన అవసరం లేదు. మూడు నెలల పాటు రీపేమెంట్ హాలిడే సౌకర్యం కూడా అందుబాటులో ఉంది. ఇలా టీఆర్‌పీలకు అన్ని రకాలుగా తోడ్పాటునందిస్తోంది ఆదాయం పన్ను శాఖ.

### సర్వీస్ ట్యాక్స్ రిటర్న్స్ కూడా అవకాశం



తొలి బ్యాచ్ (2006)లో సర్టిఫైడ్ టీఆర్‌పీలకు తొలుత ఇన్‌కం ట్యాక్స్ రిటర్న్స్ ఫైల్ చేసేందుకే అర్హత ఉండేది. తర్వాత వారికి సర్వీస్ ట్యాక్స్ రిటర్న్స్ ఫైల్ చేసే అవకాశం కూడా కల్పించారు. దీంతో వీరు ఆదాయం పరంగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. తొలి బ్యాచ్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న మన రాష్ట్ర అభ్యర్థుల్లో కొందరు.. తమ ద్వారా సంవత్సరానికి రెండువేలకు పైగా రిటర్న్స్ దాఖలు చేస్తున్నారంటేనే.. దీని ద్వారా లభించే ఆదాయం ఎంతో అర్థం చేసుకోవచ్చు. వ్యక్తులు, హిందూ అవిభాజ్య కుటుంబాలు తరఫున ఆదాయం, సర్వీస్ పన్నుల రిటర్న్‌లు దాఖలు చేసే అర్హత ఉంటుంది. అంతేకాకుండా ఇటీవల కాలంలో టీడీఎస్ (ట్యాక్స్ డిడక్షన్ ఎట్ సోర్స్) పత్రాల దాఖలు చేయడం కూడా నిరంతర ప్రక్రియగా మారుతోంది. దీనికి కూడా టీఆర్‌పీలు అర్హులే. మరోవైపు సర్వీస్ ట్యాక్స్ రిటర్న్స్‌ను నెలవారీ, త్రైమాసిక, అర్ధ సంవత్సర, వార్షిక కాల పరిమితుల్లో దాఖలు చేస్తుండటం, దానికోసం మార్గం తెలియక చాలామంది ఇబ్బందులు ఎదుర్కొంటుండటం కూడా టీఆర్‌పీలకు కలిసొచ్చే అంశమే. మొత్తంగా ట్యాక్స్ రిటర్న్స్ ప్రిపేరర్స్ స్కీంను ఒక ప్రత్యామ్నాయ కెరీర్‌గా పేర్కొనొచ్చు.

–సాధు నరసింహా రెడ్డి, ఐఆర్‌ఎస్, డిప్యూటీ కమిషనర్,
సెంట్రల్ ఎక్సైజ్ అండ్ సర్వీస్ ట్యాక్స్.

### టీఆర్‌పీఎస్ నోటిఫికేషన్ షెడ్యూల్

ఆన్‌లైన్ దరఖాస్తు లభ్యత: ఆగస్టు 3- ఆగస్టు 20
ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: ఆగస్టు 20
షార్ట్‌లిస్ట్ అభ్యర్థుల జాబితా వెల్లడి: సెప్టెంబర్ 5 (ఈ తేదీ నుంచి అభ్యర్థులు తమ అడ్మిట్ కార్డ్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు)
పరీక్ష తేదీ: సెప్టెంబర్ 16, 2012.

### దరఖాస్తు ఇలా

టీఆర్‌పీ ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ విధానాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు.

ఆన్‌లైన్ విధానం:
- టీఆర్‌పీఎస్ వెబ్‌సైట్ (www.trpscheme.com)లో లాగిన్ అవ్వాలి.
- నిర్దేశిత నమూనాలోని వివరాలను పూర్తి చేయాలి.
- పే ఆన్‌లైన్ బై క్రెడిట్ / డెబిట్ కార్డ్ బటన్‌పై క్లిక్ చేసి రూ. 100 చెల్లించాలి. ఆ ప్రక్రియ పూర్తవగానే ట్రాన్సాక్షన్ ఐడీ నెంబర్ వస్తుంది. దాన్ని ప్రింట్ తీసుకోవాలి.

ఆఫ్‌లైన్ విధానం:
- ఈ విధానంలో అభ్యర్థులు పే ఆఫ్‌లైన్ బై బ్యాంక్ చలాన్ బటన్‌పై క్లిక్ చేయాలి.
- ఆ చలాన్‌ను ప్రింట్ తీసుకుని, వివరాలు పూర్తి చేసి నిర్దేశిత రూ.100 ఫీజు, రూ.50 బ్యాంకు ఛార్జీలను చెల్లించాలి.

ఏ విధానంలో ఫీజు చెల్లించినప్పటికీ.. ఆ తర్వాత మళ్లీ వెబ్‌సైట్‌లో లాగిన్ అవ్వాలి. అప్లయ్ ఆన్‌లైన్ బటన్‌పై క్లిక్ చేసి అందులో కనిపించే అప్లికేషన్‌ను పూర్తి చేయాలి. నిర్దేశిత ప్రదేశంలో ఫోటో అప్‌లోడ్ చేయాలి.

# సోషల్ సైన్సెస్ కోర్సుల్లో మేటి.. 'టిస్'

**భిన్న సంస్కృతులకు, విభిన్న ఆచార వ్యవహారాలకు నిలయం భారతావని. ఓ వైపు విపరీతంగా పెరుగుతోన్న జనాభా.. మరో వైపు అంతకంతకు రెట్టింపవుతున్న సమస్యలు దేశాభివృద్ధిని అడ్డుకుంటున్నాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 65 ఏళ్లవుతున్నా ఎక్కడి సమస్యలు అక్కడే. సామాజిక అసమానతలకు కారణమవుతున్న వివిధ సమస్యలను అధ్యయనం చేసి, వాటిని పరిష్కరించే దిశలో ఆవిర్భవించిన సంస్థ.. టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్‌సైన్సెస్ (టిస్). ఇందుకోసం సోషల్ సైన్సెస్‌లో వివిధ స్థాయిల్లో పలు కోర్సులను ఆఫర్ చేస్తోంది. ఇటీవల హైదరాబాద్ క్యాంపస్‌లో కూడా కోర్సులు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో టిస్ కోర్సులపై ఫోకస్..**

భారతదేశంలో సోషల్ వర్క్‌లో ఏర్పాటైన మొట్టమొదటి స్కూల్ టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్. 20 మంది విద్యార్థులతో 1936లో సర్ దొరాబ్జీ టాటా గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ సోషల్ వర్క్‌గా ఉన్న ఈ సంస్థ 1946 నాటికి టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌గా అవతరించింది. 1964లో ఈ సంస్థను యూజీసీ డీమ్డ్ యూనివర్సిటీగా గుర్తించింది. ఈ క్రమంలో 2011లో 75 సంవత్సరాల మైలురాయిని అధిగమించింది. టిస్ ఆధ్వర్యంలో ఆరు స్కూళ్లు, 4 సెంటర్లు, 3 రిసోర్స్ సెంటర్లున్నాయి. ముంబై ప్రధాన క్యాంపస్‌గా తుల్జాపూర్ (మహారాష్ట్ర), హైదరాబాద్, గువహటి (అసోం)లో టిస్ క్యాంపస్‌లున్నాయి. సుశిక్షితులైన మానవ వనరులను అందించడానికి సమ్మిళిత వృద్ధి (సస్టైనబుల్ డెవలప్‌మెంట్), సామాజిక సంక్షేమం, సామాజిక న్యాయం, మానవ హక్కులు, గ్రామీణ, పట్టణాభివృద్ధి, సోషల్ వర్క్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌లతోపాటు సమాజంలోని వివిధ వర్గాల అభ్యున్నతికి అవసరమైన కోర్సులను అందిస్తోంది.

### టిస్ అందిస్తోన్న కోర్సులు:

#### ఇంటిగ్రేటెడ్ కోర్సులు

**బీఏ ఇన్ సోషల్ సైన్సెస్ అండ్ మాస్టర్ ఇన్ ఆర్ట్స్**
**వ్యవధి:** ఐదేళ్లు
**అర్హత:** ఏదైనా స్ట్రీమ్‌లో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత.
**వయోపరిమితి:** జనరల్ కేటగిరీ విద్యార్థులకు 23 ఏళ్ల కంటే తక్కువ ఉండాలి. ఎస్సీ/ఎస్టీ కేటగిరీ విద్యార్థులకు 27 ఏళ్ల కంటే తక్కువ ఉండాలి.
**మొత్తం సీట్లు:** 180 (తుల్జాపూర్-60, హైదరాబాద్-60, గువహటి-60)
**ఎంపిక విధానం:**ఆన్‌లైన్‌లో జరిగే ప్రవేశపరీక్ష ఆధారంగా.
**ఆన్‌లైన్ ప్రవేశపరీక్ష విధానం:** గంట వ్యవధిలో జరిగే ఆన్‌లైన్ ప్రవేశపరీక్షలో 60 మార్కులకు 60 ప్రశ్నలుంటాయి. ఇందులో ఇంగ్లిష్ లాంగ్వేజ్ ప్రొఫిషియన్సీ-20 ప్రశ్నలు, లాజికల్ అండ్ ఎనలిటికల్ రీజనింగ్-20, కరెంట్ ఈవెంట్స్-20 ప్రశ్నలుంటాయి. ఒక్కో ప్రశ్నకు ఒక్కో మార్కు.

#### బ్యాచిలర్ డిగ్రీ కోర్సులు

**బీఏ (హానర్స్) ఇన్ సోషల్ వర్క్ విత్ స్పెషలైజేషన్ ఇన్ రూరల్ డెవలప్‌మెంట్**
**వ్యవధి:** మూడేళ్లు
**అర్హత:** 50 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత.
**ఎంపిక విధానం:**
ప్రవేశపరీక్ష (100 మార్కులు), బృందచర్చ (40 మార్కులు), మౌఖిక పరీక్ష (50 మార్కులు)ల ఆధారంగా.

#### ఇంటర్‌డిసిప్లినరీ మాస్టర్స్ ప్రోగ్రామ్స్

- ఎంఏ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ గవర్నెన్స్
- ఎంఏ ఎకాలజీ, ఎన్విరాన్‌మెంట్ అండ్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్
- ఎంఏ సోషల్ వర్క్
- మాస్టర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ (ఎంఎల్‌ఐఎస్సీ)

**వ్యవధి:** రెండేళ్లు
**అర్హత:** మూడేళ్ల వ్యవధి ఉన్న బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణత. ఎంఏ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ గవర్నెన్స్‌కు ఒకే ప్రయత్నంలో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
**ఎంపిక:** ప్రవేశపరీక్ష, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ

#### మాస్టర్స్ డిగ్రీ ప్రోగ్రామ్స్

**ఎంఏ సోషల్ వర్క్ విత్**
- చిల్డ్రన్ అండ్ ఫ్యామిలీస్
- క్రిమినాలజీ అండ్ జస్టిస్
- కమ్యూనిటీ ఆర్గనైజేషన్ అండ్ డెవలప్‌మెంట్ ప్రాక్టీస్
- డిజాబిలిటీ స్టడీస్ అండ్ యాక్షన్
- దళిత్ అండ్ ట్రైబల్ స్టడీస్ అండ్ యాక్షన్
- లైవ్లీహుడ్స్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్
- మెంటల్ హెల్త్
- పబ్లిక్ హెల్త్
- ఉమెన్ సెంటర్డ్ ప్రాక్టీస్

#### ఇతర మాస్టర్స్ డిగ్రీ ప్రోగ్రామ్స్

- గ్లోబలైజేషన్ అండ్ లేబర్
- హ్యూమన్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్ అండ్ లేబర్ రిలేషన్స్
- సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్
- కౌన్సెలింగ్
- డెవలప్‌మెంట్ స్టడీస్
- ఉమెన్స్ స్టడీస్
- మీడియా అండ్ కల్చరల్ స్టడీస్
- సోషల్ వర్క్ ఇన్ రూరల్ డెవలప్‌మెంట్
- ఎలిమెంటరీ (ఎడ్యుకేషన్)
- మాస్టర్ ఆఫ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్
- మాస్టర్ ఆఫ్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్
- మాస్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ఇన్ హెల్త్ పాలసీ, ఎకనామిక్స్ అండ్ ఫైనాన్స్
- మాస్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ఇన్ సోషల్ ఎపిడమాలజీ

#### ఎంఏ/ఎంఎస్సీ కోర్సులు

- హ్యాబిటట్ పాలసీ అండ్ ప్రాక్టీస్
- డిజాస్టర్ మేనేజ్‌మెంట్

ఈ కోర్సులతోపాటు వివిధ సబ్జెక్టులలో టిస్ డిప్లొమా, సర్టిఫికెట్, ఎంఫిల్, పీహెచ్‌డీ కోర్సులను ఆఫర్ చేస్తోంది.

### మాస్టర్స్ డిగ్రీ ప్రోగ్రామ్స్ అర్హత:

పబ్లిక్ హెల్త్ పాలసీ, మెంటల్ హెల్త్, ఎకనామిక్స్ అండ్ ఫైనాన్స్, పబ్లిక్ హెల్త్ ఇన్ ఎపిడమాలజీ కోర్సులకు ఏదైనా పీజీ కోర్సు ఉత్తీర్ణత సాధించి ఉండాలి, లేదా నాలుగేళ్ల బీఫార్మసీ, బీవీఎస్సీ, ఇంజనీరింగ్; బ్యాచిలర్ డిగ్రీ స్థాయిలో ఎంబీబీఎస్, పారామెడికల్ కోర్సుల ఉత్తీర్ణత. మిగతా అన్ని మాస్టర్ డిగ్రీ కోర్సులకు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత.
**ఎంపిక విధానం:** ప్రవేశపరీక్ష, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూల ఆధారంగా ప్రవేశం ఉంటుంది.
**రాతపరీక్ష:** కొన్ని కోర్సులకు 100 మార్కులకు, మరికొన్ని కోర్సులకు 70 మార్కులకు ప్రవేశపరీక్ష నిర్వహిస్తారు. ఇందులో 2 పార్టులు ఉంటాయి. అవి పార్ట్-1,పార్ట్-2.
**పార్ట్-1:** 45 నిమిషాల వ్యవధిలో ఉండే పార్ట్-1 ఏ కోర్సు ఎంచుకున్నవారికైనా కామన్‌గా ఉంటుంది. ఇందులో 3 సెక్షన్లు ఉంటాయి. సెక్షన్-1లో ప్రస్తుత, వర్తమాన సామాజిక విషయాలపై అభ్యర్థి జనరల్ ఎవేర్‌నెస్/నాలెడ్జ్‌ను పరీక్షించేలా ప్రశ్నలడుగుతారు. సెక్షన్-2లో ఎనలిటికల్/లాజికల్ రీజనింగ్/క్వాంటిటేటివ్ ఎబిలిటీలపై ప్రశ్నలుంటాయి. సెక్షన్-3లో వెర్బల్ రీజనింగ్‌పై ప్రశ్నలడుగుతారు. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటాయి.
**పార్ట్-2:** అభ్యర్థి ఎంచుకున్న కోర్సు ఆధారంగా ఆబ్జెక్టివ్ టైప్/వ్యాసరూప/డిస్క్రిప్టివ్ ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష వ్యవధి ఒక గంట. విద్యార్థుల అవగాహన కోసం వెబ్‌సైట్ చూడొచ్చు. అందులో మోడల్ పేపర్లు లభ్యమవుతాయి.
**గ్రూప్ డిస్కషన్:** ఎంచుకున్న కోర్సును బట్టి కనీసం 15 నిమిషాల వ్యవధి నుంచి 30 నిమిషాల వరకు గ్రూప్ డిస్కషన్ ఉంటుంది. దీనికి 30 మార్కులుంటాయి. ఇందులో విద్యార్థి కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్‌పర్సనల్ స్కిల్స్‌ను పరీక్షిస్తారు. కొన్ని కోర్సులకు ఏదైనా అంశంపై రైటప్ రాయమని కూడా అడుగుతారు.
**పర్సనల్ ఇంటర్వ్యూ:** 70 మార్కులకు ఉండే మౌఖిక పరీక్షలో విద్యార్థి ఎంచుకున్న కోర్సుపై ప్రశ్నలడుగుతారు. ఉదాహరణకు సోషల్ వర్క్ ఎంచుకున్న విద్యార్థికి వివిధ సామాజికాంశాలు, ప్రస్తుత సామాజిక సమస్యలు మొదలైనవాటిపై ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది. వీటితోపాటు విద్యార్థి హాబీస్, కెరీర్ గోల్స్, అంతకుముందు ఎక్కడైనా పనిచేసి ఉంటే దాని పూర్వానుభవం, సబ్జెక్ట్ నాలెడ్జ్ మొదలైన అంశాలపై ప్రశ్నిస్తారు.

### క్యాంపస్ ప్లేస్‌మెంట్స్:

సోషల్ సైన్సెస్‌ను అందించడంలో ఈ సంస్థకున్నంత మంచి పేరు మరే సంస్థకు లేదంటే అతిశయోక్తి కాదు. ఈ సంస్థలో ఏ కోర్సులు అభ్యసించినా నూటికి నూరు శాతం ప్లేస్‌మెంట్స్ కచ్చితంగా లభిస్తాయి. పెద్ద పెద్ద కార్పొరేట్ సంస్థలు సమాజ సేవలో చురుకుగా పాల్గొంటుండడంతో అవకాశాలు పుష్కలం అని చెప్పొచ్చు. ఎన్‌జీవోలతోపాటు పెద్ద వ్యాపార సంస్థలు, గవర్నమెంట్ ఆర్గనైజేషన్స్, విద్యా సంస్థలు, మీడియా హౌస్‌లు, హెల్త్‌కేర్, పరిశోధన సంస్థల్లో వీరికి అవకాశాలు లభిస్తాయి.

## టిస్ హైదరాబాద్ క్యాంపస్

శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం దగ్గర మహబూబ్‌నగర్ జిల్లా కొత్తూరు మండలంలో 100 ఎకరాల విస్తీర్ణంలో టిస్ హైదరాబాద్ క్యాంపస్ రూపుదిద్దుకుంటోంది. ఇది 2014లో అకడమిక్ ప్రోగ్రామ్స్ మొదలయ్యేనాటికి అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం రాజేంద్రనగర్ (హైదరాబాద్)లో ఆంధ్రప్రదేశ్ అకాడెమీ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (అపార్డ్) నుంచి తన కార్యకలాపాలను నిర్వహిస్తోంది. వివిధ రంగాల్లో నిపుణులైన ఫ్యాకల్టీ, వివిధ అంశాల్లో పరిశోధన చేసే బృందాలు,అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన గ్రంథాలయం టిస్ క్యాంపస్ ప్రత్యేకత.

**టిస్-హైదరాబాద్ అందిస్తోన్న కోర్సులు:**
- బీఏ ఇన్ సోషల్ సైన్సెస్ అండ్ మాస్టర్స్ ఇన్ ఆర్ట్స్ (ఇంటిగ్రేటెడ్ కోర్సు) **వ్యవధి:** ఐదేళ్లు
- ఎంఏ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ గవర్నెన్స్

**వ్యవధి:** రెండేళ్లు
ప్రస్తుతం ఈ కోర్సుల్లో ప్రవేశాల ప్రక్రియ ముగిసి తరగతులు కూడా ప్రారంభమయ్యాయి.
రానున్న రోజుల్లో బీఈడీ-ఎంఈడీ, మాస్టర్స్ డిగ్రీలో సోషల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ అండ్ లేబర్ రిలేషన్స్, పబ్లిక్ హెల్త్, సోషల్ పాలసీ, ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్, నేచురల్ రిసోర్సెస్ అండ్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ వంటి కోర్సులను టిస్ ప్రారంభించనుంది.

**'టిస్' హైదరాబాద్ చిరునామా:**
ఎస్.శంకరన్ బ్లాక్, ఏఎంఆర్-ఏపీ అకాడెమీ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్,రాజేంద్రనగర్,
హైదరాబాద్-500 030.
**వెబ్‌సైట్:** http://tiss.edu

### ఎంఏ విద్యార్థికి రూ.12లక్షల వార్షిక వేతనం

సోషల్ కోర్సులంటే చాలామందిలో చులకనభావం ఉంది. ఇవి ఉద్యోగం సాధించడానికి పనికిరావని భావిస్తారు. ఈ అపవాదును తుడిచిపెట్టడమే టిస్ లక్ష్యం. మిగిలిన కోర్సులతో పోల్చితే ప్రస్తుత సమాజ అవసరాలకు సరిపడే సిలబస్‌తో రూపొందించే సోషల్‌సైన్సెస్ కోర్సులకు ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది. టిస్‌కు దేశంలో ఇప్పటికే ముంబైతోపాటు పలుచోట్ల క్యాంపస్‌లున్నా.. హైదరాబాద్ క్యాంపస్ కొత్తది. ఇక్కడ ప్రస్తుతం రెండుకోర్సులు నిర్వహిస్తుండగా, ఇప్పటికే 100 మందికిపైగా విద్యార్థులు చేరారు. రాష్ట్రంలో అన్ని డిగ్రీ, ఇతర కాలేజీల్లో ప్రస్తుతం బీఏలో సోషియాలజీ, హిస్టరీ వంటి పలు ఆర్ట్స్ సబ్జెక్టుల్లో బోధిస్తున్న సిలబస్ పూర్తిగా పాతది. బోధన ప్రస్తుత అవసరాలకు సరిపోయేలా లేదు. టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌లో ప్రవేశపెట్టిన బీఏ హిస్టరీ కోర్సుల్లో సంప్రదాయ చరిత్ర సిలబస్‌కు బదులు ఎన్విరాన్‌మెంట్ హిస్టరీ, బేసిక్ సైన్స్ సిలబస్ బోధిస్తున్నాం. ఇక్కడ చేరిన 100మంది విద్యార్థుల్లో ఏపీ విద్యార్థులతోపాటు బీహార్, బెంగాల్, ఒరిస్సా, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, కేరళ, ఢిల్లీ తదితర ప్రాంతాలకు చెందిన వారు చాలామంది ఉన్నారు. ఆర్ట్స్ కోర్సులకు వన్నె తగ్గదని నిరూపించడానికి ఈ కొత్త క్యాంపస్‌లో చేరిన విద్యార్థులే నిదర్శనం. టిస్‌లో ఎంఏ రూరల్ డెవలప్‌మెంట్ కోర్సు చదివిన ఒక విద్యార్థికి గెయిల్ సంస్థ రూ.12 లక్షల వార్షిక వేతనంతో గతేడాది క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో జాబ్ ఆఫర్ ఇచ్చింది. దీంతో హైదరాబాద్ క్యాంపస్‌లో రూరల్ డెవలప్‌మెంట్ అండ్ గవర్నెన్స్ కోర్సుకు డిమాండ్ ఎక్కువగా ఉంది. భవిష్యత్తులో ఈ క్యాంపస్ నుంచి బయటకు వచ్చే ప్రథమ బ్యాచ్ విద్యార్థులకు క్యాంపస్ రిక్రూట్‌మెంట్ నిర్వహించి మంచి అవకాశాలు వచ్చేలా ప్రయత్నాలు ప్రారంభించాం.

-ఎస్.శ్రీనివాస్,
అసిస్టెంట్ ప్రొఫెసర్, టిస్, హైదరాబాద్

పోటీ పరీక్షార్థులకు సమాచార స్ఫూర్తి... భవిత! ఇకపై మీ సాక్షి టీవీలో
ప్రతి ఆదివారం ఉదయం 9-30 నుంచి 10గం.. వరకు



# డాక్టర్ కలకు మరో ప్రత్యామ్నాయం.. మెడిసిన్ అబ్రాడ్



**బైపీసీ విద్యార్థుల మధుర స్వప్నం.. డాక్టర్ ప్రొఫెషన్. సీట్ల సంఖ్య పరిమితంగా ఉండడం.. విపరీతమైన పోటీ ఫలితంగా.. ఎంసెట్‌లో ఆశించిన ర్యాంకు రాకపోవడంతో.. నిరుత్సాహపడే విద్యార్థులకు విదేశీ వైద్య విద్య ఓ ప్రత్యామ్నాయంగా మారుతోంది. తక్కువ వ్యయంతో మెడికల్ డిగ్రీని అందిస్తున్న చైనా, రష్యా, ఉక్రెయిన్ తదితర దేశాలవైపు మన విద్యార్థులు అధికంగా దృష్టి సారిస్తున్నారు. ఈ నేపథ్యంలో విదేశీ వైద్య డిగ్రీపై ఫోకస్..**

రాష్ట్రం నుంచి వైద్యవిద్య కోసం విదేశాలకు వెళుతోన్న విద్యార్థుల సంఖ్య ఏటేటా అంతకంతకూ పెరుగుతోంది. రాష్ట్రంలో మేనేజ్‌మెంట్ సీటుకు చెల్లించే ఫీజు కంటే తక్కువ వ్యయంతో విదేశాల్లో వైద్యవిద్య పూర్తి చేసే అవకాశం ఉంది. దీంతో చాలా మంది విద్యార్థులు.. డాక్టర్ కలను సాకారం చేసుకునేందుకు విదేశీ బాట పడుతున్నారు. ఈ క్రమంలో చైనా, ఉక్రెయిన్, రష్యా, ఫిలిప్పీన్స్, కిర్గిజిస్థాన్ వంటి దేశాలు అబ్రాడ్ అవెన్యూస్‌గా నిలుస్తున్నాయి.

## ఎంసీఐ సర్టిఫికెట్ తప్పనిసరి:

విదేశీ యూనివర్సిటీల్లో మెడిసిన్ చేయడానికి ముందు మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ) నుంచి అర్హత సర్టిఫికెట్ పొందాల్సి ఉంటుంది. కనీసం 50 శాతం మార్కులతో (ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ) ఇంటర్మీడియెట్ పూర్తి చేసి, 17 ఏళ్లు నిండినట్లు నిర్ధారించుకున్నాకే ఎంసీఐ అర్హత సర్టిఫికెట్‌ను జారీ చేస్తుంది. విదేశీ వర్సిటీలు కూడా ఇదే అర్హతతో ప్రవేశం కల్పిస్తున్నాయి. అవి.. భారతీయ పౌరుడై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులతో గుర్తింపు పొందిన బోర్డు/ కౌన్సిల్ నుంచి ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ ఎలెక్టివ్ సబ్జెక్టులుగా ఇంగ్లిష్ కంపల్సరీ సబ్జెక్ట్‌గా ఇంటర్మీడియెట్ పూర్తి చేసి ఉండాలి. వయసు: కనీసం 17 ఏళ్లు ఉండాలి.

## రెండు-మూడు నెలల ముందే:

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ ఫలితాలు మేలో వెలువడుతాయి. విదేశాల్లో సెప్టెంబర్‌లో అకడెమిక్ సెషన్ ప్రారంభమవుతుంది. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని ప్లాన్ చేసుకోవాలి. ఎంసీఐ సర్టిఫికెట్, వీసా త్వరగానే లభిస్తుంది. పాస్‌పోర్ట్ లభించడానికి ఎక్కువ సమయం పడుతుంది. కాబట్టి రెండు-మూడు నెలల ముందు సన్నాహకాలు ప్రారంభించాలి. ఆసక్తి, చేయాలనుకుంటున్న కోర్సుకు సంబంధించి ఏ దేశంలో నాణ్యమైన విద్య లభిస్తుందో ముందే ఒక అవగాహనకు రావడం మంచిది.

## ఆరేళ్లు.. ఐదేళ్లు:

కోర్సు కాల వ్యవధి దేశాన్ని బట్టి మారుతుంది. రష్యా, ఉక్రెయిన్ వంటి దేశాల్లో ఆరేళ్లు+ఏడాది(ఇంటర్న్‌షిప్), చైనాలో మాత్రం ఐదేళ్లు+ఏడాది (ఇంటర్న్‌షిప్ ) ఉంటుంది. రష్యా, ఉక్రెయిన్, చైనా ఏ దేశంలోనైనా బోధన (మీడియం ఆఫ్ ఇన్‌స్ట్రక్షన్) ఆంగ్ల భాషలోనే ఉంటుంది. కోర్సులో భాగంగా ప్రతి రోజు స్థానిక భాష నేర్చుకోవడానికి కొంత సమయం కేటాయించాల్సి ఉంటుంది. ఎందుకంటే రెండేళ్ల తర్వాత ఉండే క్లినికల్ ప్రాక్టీస్‌లో భాగంగా స్థానికులతో మాట్లాడాలి..ట్రీట్‌మెంట్ చేయాల్సి ఉంటుంది. కాబట్టి స్థానిక భాష తప్పకుండా నేర్చుకోవాలి. చైనాలో భారతీయ విద్యార్థులకు ప్రత్యేక తరగతి గది ఉంటుంది. ఇందులోభారతీయులకు మాత్రమే బోధన చేస్తారు. రష్యా, ఉక్రెయిన్ తదితర దేశాల్లో అందరూ విద్యార్థులతో కలిసిన తరగతి గది ఉంటుంది.

## టాప్ చైనా:

గతంలో మెడిసిన్ కోసం రాష్ట్ర విద్యార్థుల చూపు రష్యా, ఉక్రెయిన్, ఫిలిప్పీన్స్, కిర్గిజిస్థాన్, జార్జియా, బెలారస్, రుమేనియా దేశాలపై ఉండేది. 2004లో భారత ప్రభుత్వ అనుమతిలో మెడిసిన్ అబ్రాడ్ దేశాల జాబితాలో చైనా చేరింది. అప్పటి నుంచి మెడిసిన్ కోసం విదేశాలకు వెళుతున్న విద్యార్థుల్లో దాదాపు 60 నుంచి 70 శాతం మంది చైనాకు ప్రాధాన్యతనిస్తున్నారు. రష్యా, ఉక్రెయిన్ వంటి దేశాలలోని చల్లటి వాతావరణంతో పోల్చితే చైనా వాతావరణం మన దేశానికి సరిపోయే విధంగా ఉండడం, తక్కువ ఖర్చుతో, త్వరగా కోర్సు పూర్తికావడం వంటి అంశాలను ఇందుకు కారణాలుగా పేర్కొనవచ్చు.

## ఖర్చు:

మన దేశంలో.. మేనేజ్‌మెంట్ సీటుకు చెల్లించే ఫీజుతో పోల్చితే రష్యా, ఉక్రెయిన్, ఫిలిప్పీన్స్, కిర్గిజిస్థాన్, జార్జియా, బెలారస్, రుమేనియా, చైనా దేశాలలో తక్కువ ఖర్చుతోనే కోర్సు పూర్తి చేయవచ్చు. చైనాలో.. ట్యూషన్ ఫీజు, హాస్టల్ ఫీజు, రోజు వారీ ఖర్చులు, అన్నీ కలిపి సంవత్సరానికి దాదాపు రూ. 2-2.50 లక్షల వ్యయం అవుతుంది. మిగిలిన దేశాల్లో రూ.3-4 లక్షల వరకు ఉంటుంది.

## అకడెమిక్ ఇయర్:

రష్యా, ఉక్రెయిన్, చైనా ఏ దేశంలోనైనా సాధారణంగా సెప్టెంబర్/అక్టోబర్‌లలో విద్యా సంవత్సరం ప్రారంభమవుతుంది. జూన్‌తో ముగుస్తుంది. ఏడాదికి రెండు విడతల సెలవులు ఉంటాయి. మొదటి విడతలో వింటర్‌లో వారం నుంచి పది రోజులు ..తర్వాత జూలై, ఆగస్ట్ రెండు నెలలు సెలవులు ఇస్తారు. అన్ని దేశాల్లో కూడా నివాస వసతి సౌకర్యం యూనివర్సిటీ/ కాలేజీకు అనుబంధంగా ఉన్న హాస్టల్‌లో ఏర్పాటు చేస్తారు. అత్యాధునిక లైబ్రరీ, ల్యాబ్ సౌకర్యాలు కూడా అందుబాటులో ఉంటాయి. గతంలో భద్రత పరంగా భారతీయ విద్యార్థులకు ఎదురైన సమస్యలు ప్రస్తుతం లేవు. ఇక్కడి నుంచి వెళ్లిన విద్యార్థులను మానిటరింగ్ చేయడానికి ప్రత్యేకమైన వ్యవస్థ ఉంటుంది.

## కోర్సు.. ఇంటర్న్‌షిప్:

కోర్సు తర్వాత చేయాల్సిన ఇంటర్న్‌షిప్ విషయంలో భారత ప్రభుత్వం కొన్ని నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తుంది. రష్యా, ఉక్రెయిన్ వంటి దేశాల్లో కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులు తప్పనిసరిగా ఇండియాలోనే ఇంటర్న్‌షిప్ (హౌస్‌సర్జన్) చేయాలి. ఎందుకంటే ఈ దేశాలు ఎక్కువ చలి ప్రదేశాలు. వాటితో పోల్చితే మన దేశ వాతావరణం భిన్నంగా ఉంటుంది. కాబట్టి అక్కడి ప్రజలకు, ఇక్కడ ప్రజలకు వచ్చే వ్యాధుల్లో తేడా ఉంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ నిబంధనను ప్రవేశపెట్టింది. చైనా విషయంలో కొంత మినహాయింపు ఉంది. మన పరిస్థితులు చైనాతో సరిపోతుండడంతో.. ఇంటర్న్‌షిప్ రెండు దేశాల్లో ఎక్కడైనా పూర్తి చేయవచ్చు. విద్యార్థుల ఆసక్తి మేరకు చైనా, ఇండియాలో ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం ఉంది.

## ప్రాక్టీస్:

కోర్సు పూర్తి చేసిన తర్వాత మిగిలిన మెడికల్ గ్రాడ్యుయేట్ల మాదిరిగానే ప్రాక్టీస్ ప్రారంభించవచ్చు. ఇందు కోసం మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ) స్క్రీనింగ్ టెస్ట్‌లో అర్హత సాధించాలి. దీన్ని ఫారెన్ మెడికల్ గ్రాడ్యుయేట్ ఎగ్జామినేషన్ (ఎఫ్ఎంజీఈ)గా కూడా వ్యవహరిస్తారు. ఈ పరీక్షను నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్(ఎన్‌బీఈ) నిర్వహిస్తుంది. ఏడాదికి రెండు సార్లు (మార్చి, సెప్టెంబర్) ఈ పరీక్ష జరుగుతుంది. 300 మార్కులకు ఉండే ఈ పరీక్షల్లో 150 మార్కులు సాధిస్తే అర్హత లభిస్తుంది. నేషనల్ బోర్డ్ ఆఫ్ఎగ్జామినేషన్స్ వెబ్‌సైట్: www.natboard.nic.in అంతేకాకుండా స్టేట్ లేదా సెంట్రల్ కౌన్సిల్ వద్ద డాక్టర్‌గా రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా ప్రభుత్వ, అనుబంధ విభాగాలు, పీఎస్‌యూ సంబంధిత సంస్థల ఉద్యోగాలకు అర్హత లభిస్తుంది. ఉన్నత విద్యను కూడా అభ్యసించవచ్చు. నిబంధనలమేరకు పీజీ, పీజీ డిప్లొమా, ఎండీ, ఎంఎస్ కోర్సులను కూడా చేసే అవకాశం ఉంటుంది.

## గుర్తింపు:

ఫేక్ యూనివర్సిటీల భాగోతం బయటకు వస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఎంచుకునే యూనివర్సిటీల పట్ల జాగ్రత్తలు పాటించడం తప్పనిసరి. ఆయా యూనివర్సిటీలకు..ఆఫర్ చేస్తున్న కోర్సులకు సంబంధిత అధీకృత ఏజెన్సీల గుర్తింపు ఉందా లేదా విషయాన్ని నిర్ధారించుకోవాలి. రష్యా, ఉక్రెయిన్, ఫిలిప్పీన్స్, కిర్గిజిస్థాన్,జార్జియా, బెలారస్, రుమేనియా వంటి దేశాల్లో వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్(డబ్ల్యూహెచ్ఓ) గుర్తింపు ఉన్న వర్సిటీలను మాత్రమే ఎంచుకోవాలి. చైనాలో మాత్రం.. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఎంసీఐ) గుర్తింపు ఇచ్చిన ఇన్‌స్టిట్యూట్‌లలో మాత్రమే చేరాలి.

## ఆర్థికంగా చేయూత:

విదేశాల్లో మెడిసిన్ చేయాలనుకునే విద్యార్థులకు బ్యాంకులు కూడా ఆర్థికంగా చేయూతనందిస్తున్నాయి. ఎంసీఐ, డబ్ల్యూహెచ్ఓ గుర్తింపు ఉన్న యూనివర్సిటీలలో చేరిన విద్యార్థులకు నిబంధనలను అనుసరించి విద్యా రుణం అందిస్తున్నాయి. వివిధ కోర్సులకు అయ్యే ఖర్చును అంచనా వేసి కావాల్సిన ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నాయి. దీంతో మధ్య తరగతి విద్యార్థులు సైతం విదేశాల్లో ఉన్నత కోర్సులను అభ్యసించడానికి అవకాశం ఏర్పడింది. విద్యార్థులు నెల రోజులు ముందుగానే లోన్‌కు దరఖాస్తు చేసుకుంటే ఎటువంటి టెన్షన్ ఉండదు. వీరు ఆఫర్ లెటర్, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు, సెక్యూరిటీకి సేల్ డీడ్ కాపీ, లింక్ డాక్యుమెంట్ (ముప్ఫై ఏళ్ల కిందట నుంచి), ప్రాపర్టీ ట్యాక్స్ రిసీట్, మున్సిపల్ అప్రూవల్ ప్లాన్, లే అవుట్ అయితే దాని ప్లాన్ కూడా తీసుకువెళ్లాలి. వాటితో పాటు రెసిడెన్షియల్ ప్రూఫ్‌కు ఎలక్ట్రిసిటీ బిల్, అన్ని అకడెమిక్ సర్టిఫికెట్లు తప్పనిసరి. ఈ డాక్యుమెంట్లు ఉంటే వారం రోజుల్లో లోన్ మంజూరు చేస్తారు. చైనా యూనివర్సిటీలు ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించే ఉద్దేశంతో స్కాలర్‌షిప్స్ ఇస్తున్నాయి. ప్రతి ఏడాది 100 మంది విద్యార్థుల్లో టాప్-10 విద్యార్థులకు స్కాలర్‌షిప్ అంద జేస్తున్నాయి.

## వీసా పొందాలంటే:

విదేశీ విద్యార్థుల సౌకర్యార్థం వివిధ దేశాలు ఆయా దేశాల కాన్సులేట్‌లను ఏర్పాటు చేస్తున్నాయి. విద్యార్థులు ఆ దేశ కాన్సులేట్ లేదా రాయబార కేంద్రాల ద్వారా వీసా పొందొచ్చు. ప్రధానంగా.. విద్యార్హతలు, ఆర్థిక స్థోమత, సంబంధిత దేశానికి ఏ కోర్సు చదవడానికి వెళుతున్నారు? అనే విషయాలను క్షుణ్నంగా పరిశీలిస్తారు.

## కన్సల్టెన్సీల ప్రాధాన్యం:

మెడిసిన్ అబ్రాడ్‌కు.. కన్సల్టెన్సీల ప్రమేయం తప్పనిసరి. ఇంటర్నెట్ ద్వారా విదేశీ వర్సిటీలు అందించే కోర్సులు, ఫీజులు వంటి వివరాలను తెలుసుకోవడం సులభం. ఆయా దేశాలకు వెళ్లి చదువుకోడానికి ముందుగా తెలుసుకోవాల్సిన నిబంధనలు, అనుసరించాల్సిన పద్ధతులు, కోర్సు, యూనివర్సిటీ ఎంపిక వంటి సమాచారాన్ని అందించే విషయంలో కన్సల్టెన్సీలు విద్యార్థులకు సహాయపడుతున్నాయి. విద్యార్థులు కన్సల్టెన్సీ ఎంపికలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. కొన్ని నకిలీ కన్సల్టెన్సీ సంస్థల వల్ల మోసపోయే ప్రమాదం కూడా లేకపోలేదు.

## అభ్యర్థులు తెలుసుకోవాల్సినవి:

కచ్చితంగా మెడిసిన్ చేయాలనే ఆసక్తి ఉన్నట్లయితేనే విదేశాలకు వెళ్లండి. కన్సల్టెన్సీల ద్వారా విదేశాలకు వెళ్లాలంటే.. సంబంధిత కన్సల్టెన్సీల గురించి క్షుణ్నంగా తెలుసుకోవాలి. ఆ కన్సల్టెన్సీ ద్వారా అంతకుముందు వెళ్లిన విద్యార్థుల సమాచారాన్ని సేకరించి..అందులో కనీసం ఆయిదారు మందిని సంప్రదించడం అవసరం. కన్సల్టెన్సీ ప్రతినిధులు సూచించిన వారిని మాత్రమే కాకుండా మీరే అభ్యర్థుల్ని ఎంపిక చేసుకుని మాట్లాడితే వాస్తవాలు తెలుస్తాయి. విదేశాల్లో కోర్సు పూర్తి చేసిన, ప్రస్తుతం కోర్సును చేస్తున్న విద్యార్థుల్ని కూడా సంప్రదించే ప్రయత్నం చేయాలి.

### తక్కువ ఖర్చుతో ఎంబీబీఎస్



రాష్ట్రంలో మేనేజ్‌మెంట్ కోటాలో సీటుకు చేసే వ్యయంలో నాలుగోవంతుతో విదేశాల్లో ఎంబీబీఎస్ పూర్తి చేయవచ్చు. గత కొంత కాలంగా ఈ దిశగా ఆలోచిస్తున్న విద్యార్థుల సంఖ్య ఏటేటా పెరుగుతోంది. ఎంసెట్ ద్వారా మెడిసిన్‌లో సీటు లభించని అభ్యర్థులు మెడిసిన్ కలను నిజం చేసుకోవడాని అబ్రాడ్ చక్కని ప్రత్యామ్నాయం. ప్రస్తుతం ఇక్కడి నుంచి విదేశాల్లో మెడిసిన్ చదవాలనుకుంటున్న వారిలో 60-70 శాతం మంది చైనాకు ప్రాధాన్యతనిస్తున్నారు. తర్వాతి స్థానాల్లో రష్యా, ఉక్రెయిన్ ఉన్నాయి. ఈ దేశాలు కాకుండా మిగిలిన దేశాలను ఎంచుకుంటున్న వారి సంఖ్య చాలా స్వల్పం అని చెప్పొచ్చు. భద్రతా పరంగా కూడా ఎటువంటి ఆందోళన అవసరం లేదు. ఇక్కడి నుంచి వెళ్లే విద్యార్థులను మానిటరింగ్ చేయడానికి ప్రత్యేక వ్యవస్థ ఉంటుంది. విద్యా పరంగా, ల్యాబ్ తదితర విషయాల్లో అంతర్జాతీయ ప్రమాణాలను అక్కడి యూనివర్సిటీలు పాటిస్తాయి. బ్యాంకులు కూడా ఎడ్యుకేషన్ లోన్ అందిస్తుండడం సానుకూల అంశం. కోర్సు పూర్తయిన తర్వాత ప్రాక్టీస్, ఉన్నత విద్య, ప్రభుత్వ ఉద్యోగాలు.. తదితర విషయాల్లో ఇక్కడ చదివిన విద్యార్థులతో సమానంగా అవకాశాలు ఉంటాయి.

-డాక్టర్ ఎ.సతీష్ కుమార్, ఎండీ, డాక్టర్ అబ్రాడ్

### అవకాశాల్లో తేడా ఉండదు



ఉక్రెయిన్‌లో మెడిసిన్ పూర్తి చేశాను. సిలబస్ పరంగా అక్కడికి ఇక్కడికి తేడా లేదు. మన దేశంతో పోల్చుకుంటే.. భిన్నమైన సంస్కృతి, వాతావరణం.. అంతా కొత్తగా అనిపిస్తుంది. మొదటి ఆరు నెలలు సహజంగానే హోమ్ సిక్ ఫీలింగ్ వస్తుంది. కోర్సు, ల్యాబ్, లైబ్రరీ, వసతి పరంగా సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. భారతీయులు ఇష్టపడే సంప్రదాయ ఆహారం లభిస్తుంది. సొంతంగా కూడా వంట చేసుకోవచ్చు. కోర్సు పూర్తి చేసిన తర్వాత భారత్‌లో చదువుకున్న విద్యార్థులతో సమానంగా అవకాశాలు దక్కించుకోవచ్చు. నాతో పాటు మెడిసిన్ పూర్తి చేసిన వారిలో చాలా మంది ఇక్కడ పీజీ కోర్సులు చేయడంతోపాటు ప్రభుత్వ ఉద్యోగాల్లోను స్థిరపడ్డారు. మెడిసిన్ ప్రొఫెషన్‌లో ప్రవేశించాలనుకునే వారికి కష్టపడే తత్వం, ఓపిక తప్పనిసరిగా ఉండాలి. కోర్సు చదివేటప్పుడు ఫండమెంటల్స్ మీద పట్టు సాధించాలి. మార్కెట్‌లో ఎప్పుడూ కొత్తగా డ్రగ్ వస్తూనే ఉంటుంది కాబట్టి నిరంతరం అప్‌డేట్‌గా ఉండాలి.

-డాక్టర్ ఎస్. జహంగీర్,
ఎంబీబీఎస్ డీఎన్‌బీ, యశోద హాస్పిటల్.

# సత్వర ఉపాధికి ప్యా'కింగ్' కోర్సులు

**ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రతి దేశం ఓ కుగ్రామంలా మారిపోయింది. ఓ మాదిరి పట్టణాల్లో కూడా పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయి. మన దేశంలోనే దాదాపు 7000 భారీ పరిశ్రమలు, 4,50,000 చిన్నతరహా పరిశ్రమలు ఉన్నాయి. ఆయా కంపెనీల్లో వస్తువుల తయారీ ఒకెత్తయితే.. వాటిని వినియోగదారుడిని ఆకర్షించేలా ప్యాక్ చేయడం మరో సవాలు. వస్తువు ఏదైనా చూడగానే ఆకట్టుకునే వివిధ డిజైన్ల ప్యాకింగ్ చూసి ఆ వస్తువుల అవసరం లేకపోయినా మనసు పారేసుకునే మారాజులెందరో. ఈ నేపథ్యంలో వివిధ సంస్థలందించే ప్యాకేజింగ్ కోర్సులపై ఫోకస్..**

## ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్

ప్యాకేజింగ్ ప్రమాణాలను పెంచే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వంలోని వాణిజ్య మంత్రిత్వశాఖ 1966లో ఏర్పాటు చేసిన సంస్థ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్. మన దేశం నుంచి విదేశాలకు ఎగుమతులను ప్రోత్సహించే ప్రక్రియలో నాణ్యమైన ప్యాకింగ్‌ను ప్రోత్సహించడం, కంపెనీలకు అవసరమైన ప్యాకేజింగ్ టెక్నాలజీ అందించడమే ధ్యేయంగా ఈ సంస్థ ఏర్పాటైంది. అంతేకాకుండా దేశంలోనూ, రాష్ట్రాలలోనూ ఆహార, వాణిజ్య, ఫార్మా, ఇతర రంగాల కంపెనీల ఉత్పత్తులకు పటిష్ట ప్యాకేజింగ్ రూపొందించడం.. విదేశాలకు ఎగుమతయ్యే ఆహార వస్తువులు, పదార్థాలు, రసాయనాలు, ఆభరణాలకు ప్యాకేజింగ్ చేసే నిష్ణాతులను తయారుచేయడం దీని ప్రధాన లక్ష్యం. ముంబై ప్రధాన క్యాంపస్‌గా దేశవ్యాప్తంగా ఐఐపీకి మరో 4 క్యాంపస్‌లున్నాయి. అవి. హైదరాబాద్ (సనత్‌నగర్), ఢిల్లీ, కోల్‌కతా, చెన్నై. ఈ సంస్థ ప్యాకేజింగ్ కోర్సులను ఆఫర్ చేయడంలో దేశవ్యాప్తంగా పేరుగాంచింది.

**ఆఫర్ చేస్తోన్న కోర్సులు:**

**ఫుల్‌టైం సర్టిఫికెట్ ప్రోగ్రామ్ ఇన్ ప్యాకేజింగ్**

వ్యవధి: 3 నెలలు

అర్హత: ఏదైనా డిగ్రీ/డిప్లొమా ఉత్తీర్ణత.

ఎంపిక విధానం: మొదట వచ్చినవారికి తొలి ప్రాధాన్యం



ప్రాతిపదికన ప్రవేశం కల్పిస్తారు.

కోర్సు స్వరూపం: మూడు నెలల కోర్సుల్లో ప్యాకేజింగ్ మెటీరియల్, ప్యాకేజింగ్ ఆఫ్ ఫుడ్ ప్రొడక్ట్స్, లాజిస్టిక్స్ అండ్ ఫిజికల్ డిస్ట్రిబ్యూషన్, ప్యాకేజింగ్ ప్రాసెస్, క్వాలిటీ కంట్రోల్, ప్యాకేజ్ మార్కెటింగ్, ప్యాకేజింగ్ ఎకనామిక్స్, ప్యాకేజింగ్ లాస్ అండ్ రెగ్యులేషన్స్, ప్యాకేజింగ్ మేనేజ్‌మెంట్ వంటి అంశాలపై శిక్షణనిస్తారు. అంతేకాకుండా విద్యార్థులకు అవగాహన కల్పించడానికి వివిధ పరిశ్రమలకు తీసుకెళ్తారు. ఈ కోర్సును విజయవంతంగా పూర్తిచేసుకున్న విద్యార్థులకు ఆసియన్ ప్యాకేజింగ్ ఫెడరేషన్ గుర్తింపు ఉన్న సర్టిఫికెట్‌ను ప్రదానం చేస్తారు.

**ఫుల్‌టైం పోస్టుగ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్యాకేజింగ్**

వ్యవధి: రెండేళ్లు

మొత్తం సీట్లు: హైదరాబాద్ క్యాంపస్‌లో 60, ముంబైలో 80, ఢిల్లీ-80, కోల్‌కతా-60

అర్హత: సైన్స్/ టెక్నాలజీ అండ్ ఇంజనీరింగ్/సంబంధిత సబ్జెక్టులలో ద్వితీయశ్రేణిలో గ్రాడ్యుయేషన్ (12+3) విధానంలో ఉత్తీర్ణత. ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులు అర్హులే. వీరు పర్సనల్ ఇంటర్వ్యూ నాటికి ఉత్తీర్ణులై ఉంటేనే ప్రవేశం లభిస్తుంది.

కోర్సు స్వరూపం: నాలుగు సెమిస్టర్లుగా ఉండే కోర్సులో మొదటి మూడు సెమిస్టర్లలో మ్యాథమేటిక్స్, కెమిస్ట్రీ అండ్ ఫిజిక్స్, ఎలక్ట్రికల్ టెక్నాలజీ, మెకానికల్ టెక్నాలజీ, ఇంజనీరింగ్ మెకానిజమ్స్, ప్యాకేజింగ్ టెక్నాలజీ-పరిచయం-వివిధ దశలు, ప్యాకేజింగ్ ప్రింటింగ్ టెక్నాలజీ, ఇండస్ట్రియల్ ఎలక్ట్రానిక్స్, ఫ్లూయిడ్ మెకానిక్స్ అండ్ మెషినరీ, ఇంజనీరింగ్ డ్రాయింగ్, ప్రొడక్షన్ మేనేజ్‌మెంట్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, ప్రిన్సిపల్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, మార్కెటింగ్-మెటీరియల్స్ మేనేజ్‌మెంట్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇండస్ట్రియల్/ఫీల్డ్ విజిట్స్, ప్రాజెక్ట్ వర్క్/లైబ్రరీ రిఫరెన్స్ మొదలైన అంశాలుంటాయి. చివరి సెమిస్టర్‌లో పూర్తిగా ఇండస్ట్రియల్ ట్రైనింగ్, ప్రాజెక్ట్ వర్క్ ఉంటుంది.

ఎంపిక విధానం: అకడెమిక్ రికార్డ్, ప్రవేశపరీక్ష, మౌఖిక పరీక్షల ఆధారంగా. ప్రవేశపరీక్షను ముంబై, ఢిల్లీ, హైదరాబాద్, చెన్నై, కోల్‌కతాల్లో నిర్వహిస్తారు. మౌఖిక పరీక్ష ముంబై, ఢిల్లీ, హైదరాబాద్, కోల్‌కతాల్లో ఉంటుంది.

ప్రవేశపరీక్ష విధానం: మల్టిపుల్ చాయిస్ విధానంలో జరిగే పరీక్షలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్, ఇంజనీరింగ్ సబ్జెక్టులపై గ్రాడ్యుయేషన్ స్థాయిలో ప్రశ్నలుంటాయి.

**గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్యాకేజింగ్ (డిస్టెన్స్‌లో)**

వ్యవధి: 18 నెలలు

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సైన్స్/ఇంజనీరింగ్/టెక్నాలజీ/కామర్స్/ఆర్ట్స్‌లో గ్రాడ్యుయేషన్‌తో పాటు ఏడాది పని అనుభవం లేదా గుర్తింపు పొందిన టెక్నికల్ బోర్డ్ నుంచి ఇంజనీరింగ్/టెక్నాలజీలో డిప్లొమాతో పాటు రెండేళ్ల పని అనుభవం.

ఈ కోర్సులతోపాటు ఎగ్జిక్యూటివ్స్‌కు పార్ట్‌టైం వీకెండ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్స్‌ను కూడా ఐఐపీ నిర్వహిస్తుంది. ఇవేకాకుండా వారం వ్యవధి ఉన్న ప్యాకేజింగ్ ప్రిన్సిపల్స్ అండ్ స్పెసిఫికేషన్ డెవలప్‌మెంట్, ప్లాస్టిక్స్ ఇన్‌ప్యాకేజింగ్, ప్యాకేజింగ్ ఆఫ్ ఫుడ్ ప్రొడక్ట్స్, ప్యాకేజ్ టెస్టింగ్ అండ్ ఎవల్యూషన్, ప్యాకేజింగ్ ఆఫ్ ఫార్మా ప్రొడక్ట్స్, ప్యాకేజ్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ వంటి కోర్సులను కూడా ఐఐపీ ఆఫర్ చేస్తోంది.

**ఉద్యోగావకాశాలు కల్పిస్తోన్న కంపెనీలు:**

ఐఐపీలో కోర్సులు పూర్తిచేసుకున్న విద్యార్థులకు ఏడాదికి 3 లక్షల నుంచి 5 లక్షల ప్రారంభ వేతనంతో ఉద్యోగాలు ఇవ్వడానికి వివిధ కంపెనీలు పోటీపడుతున్నాయి. వాటిలో హరిత-ఎన్‌టీఐ, నెస్లే ఇండియా లిమిటెడ్, ఆగ్రో టెక్ ఫుడ్స్ లిమిటెడ్, క్యాడ్‌బరీ ఇండియా లిమిటెడ్, క్యాస్ట్రాల్, కోకాకోలా, సిప్లా, డాబర్ ఇండియా, డాక్టర్ రెడ్డీస్, గుజరాత్ గ్లాస్ లిమిటెడ్, హిమాలయ డ్రగ్, హిందూస్థాన్ యూనిలీవర్, హిందూస్థాన్ పెట్రోలియం, ఐటీసీ, జాన్సన్ అండ్ జాన్సన్, లార్సన్ అండ్ టూబ్రో లిమిటెడ్, మాట్రిక్స్, ది పేపర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ మొదలైన కంపెనీలున్నాయి.

వెబ్‌సైట్: www.iip-in.com

## పాలిటెక్నిక్ ద్వారా..

మూడేళ్ల పాలిటెక్నిక్ డిప్లొమాలో ప్రవేశానికి నిర్వహించే 'కామన్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ ఫర్ పాలిటెక్నిక్స్ (సీప్)' ద్వారా మూడేళ్ల డిప్లొమా ఇన్ ప్యాకేజ్ టెక్నాలజీ కోర్సులో ప్రవేశం పొందొచ్చు. మన రాష్ట్రంలో హైదరాబాద్ (రామాంతపూర్)లో ఉన్న జేఎన్ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ కోర్సును అందిస్తున్నారు. మొత్తం 60 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ ఏడాదికి ప్రవేశాల ప్రక్రియ పూర్తయింది. కోర్సు పూర్తిచేసుకున్న తర్వాత విద్యార్థులందరికీ దాదాపు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ కల్పిస్తున్నారు.

**ప్యాకేజింగ్ కెరీర్:**

ఢిల్లీ మార్కెట్ నుంచి గల్లీ మార్కెట్ వరకు వివిధ వస్తువులు ఉప్పెనలా వచ్చిపడుతున్నాయి. ఈ వస్తువులు వినియోగదారులను ఆకర్షించడానికి పొందికైన, ఆకర్షణీయమైన ప్యాకింగ్ తప్పనిసరి.

ఈ నేపథ్యంలో ప్యాకేజింగ్ కోర్సులు చేసిన నిపుణుల అవసరం అంతకంతకూ పెరుగుతోంది. విదేశాల్లో సైతం వీరికి మంచి అవకాశాలున్నాయి. కోర్సు ఏదైనా.. పూర్తయ్యేనాటికి వివిధ కంపెనీలు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ కల్పిస్తున్నాయి. ప్రారంభ వేతనం కంపెనీని బట్టి నెలకు ₹ 12,000 నుంచి ₹ 25,000 వరకు ఉంటుంది.

# ప్యాకేజింగ్ నిపుణులకు ప్రత్యేక పే'ప్యాకేజీలు'

**పారిశ్రామిక రంగం మనుగడ సాగించినంత కాలం.. ప్యాకేజింగ్ పరిశ్రమకు ఢోకా ఉండదు. ఏ ఉత్పత్తైనా వినియోగదారుడికి చేరాలంటే.. ప్యాకేజింగ్ నిపుణులు లేకుండా సాధ్యంకాదు. అందుకే ఐఐపీ(ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్) క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో విద్యార్థులకు ఆరంభంలో రూ.3లక్షల నుంచి రూ.5లక్షల వరకు వేతనం లభిస్తోంది. సృజనాత్మకత, పనితీరు ఆధారంగా భారీ వేతనాలు అందుకోవచ్చు అంటున్నారు భారత ప్యాకేజింగ్ సంస్థ(ఐఐపీ) ఛైర్మన్ ఎ.వి.పి.ఎస్.చక్రవర్తి. ఆయనతో భవిత ప్రత్యేక ఇంటర్వ్యూ...**



**ప్యాకేజింగ్ ఇండస్ట్రీ భవిష్యత్తు ఏ విధంగా ఉండబోతుంది?**

ప్రస్తుతం ప్రపంచ ప్యాకేజింగ్ రంగంలో భారత్ తొలి 10 స్థానాల్లో ఉంది. 2020 నాటికి 3వ స్థానానికి చేరుకుంటుందని అంచనా. నిత్యావసర వస్తువుల నుంచి విదేశాలకు ఎగుమతి చేసే వస్తువులకు వరకు.. ఉత్పత్తి ఏదైనా దాన్ని వినియోగదారుడి వద్దకు చేర్చడానికి ప్యాకేజింగ్ తప్పనిసరి. ఒకరకంగా చెప్పాలంటే.. ప్యాకేజింగ్ మానవ జీవితంలో భాగం అయిపోయింది. టూత్‌పేస్టు నుంచి ఆహార వస్తువులు, దుస్తులు.. ఇలా అన్నింటికీ ప్యాకేజీ ఉంటుంది. ఏటా ఈ రంగం 15 శాతం వృద్ధి సాధిస్తోంది. ప్రస్తుతం డిమాండ్ మేరకు నిపుణులు అందుబాటులో లేరు.

**విద్యార్థులకు కోర్సుల్లో ఏం నేర్పుతారు?**

కంపెనీలు, పరిశ్రమలు ఏ ఉత్పత్తిని బయటకు తీసుకువచ్చినా... వాటిని వినియోగదారుడు ఇష్టపడేలా చేయడంలో ప్యాకేజింగ్‌దే కీలకపాత్ర. ప్యాకేజీ ఎంత బాగుంటుందనేదానిపైనే అమ్మకాలు ఆధారపడి ఉంటాయి. అందుకే కోర్సులో ప్యాకేజింగ్ అంటే? దాని అవసరం? అందులో దశలు? ఫార్మా కంపెనీల ఉత్పత్తులకు ఎలాంటి ప్యాకేజీ అవసరం? కెమికల్ ఉత్పత్తులకు ఎలాంటి ప్యాకేజీ చేయాలి? ఆహార పదార్థాలకు అనువైన ప్యాకేజింగ్ ఏది? ఏ మోతాదులో చేయాలి? వంటివి నేర్పుతారు. ఒకరకంగా చెప్పాలంటే.. ఏ ఉత్పత్తికి ఏ ప్యాకింగ్ చేయాలి? అనేది కోర్సుల్లో భాగంగా శిక్షణ కల్పిస్తారు. అదేవిధంగా తయారు చేసిన, ఉత్పత్తి చేసిన వస్తువు, లేదా రసాయనాలు, మందులు, ఆహారపదార్థాలు.. ఇలా వాటి కాలపరిమితి ఆధారంగా సాంకేతికంగా ఏ ప్యాకింగ్ అనువైనదో నిర్ధయించేలా శిక్షణ ఇస్తారు.

**ప్యాకేజింగ్ రంగంలో ఉద్యోగావకాశాలెలా ఉంటాయి? ప్లేస్‌మెంట్‌కు వచ్చే కంపెనీలేవి?**

కోర్సు పూర్తవకుండానే ఉద్యోగం వచ్చేది ఈ రంగంలోనే. ప్యాకేజింగ్ కోర్సులు పూర్తిచేసినవారికి వివిధ కంపెనీలతో పాటు ఇతర ఆహారపదార్థాలు, వ్యవసాయ ఉత్పత్తులు, ఫ్రూట్ ఇండస్ట్రీ వంటివి పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు ఇస్తున్నాయి. ఇక్కడ కోర్సుచేసిన వారికి ఆరంభంలో సగటున ఏడాదికి రూ.3 లక్షల నుంచి రూ.5లక్షల వరకు వేతనాలొస్తాయి. వినియోగదారుల అభిరుచులను సదరు విద్యార్థి పసిగట్టగలిగే నేర్పు, ఆకర్షణీయ ప్యాకింగ్‌తో ప్రొడక్ట్ వాల్యూ ఎలా పెంచగలరు? మారుతున్న ఆసక్తులకు అనుగుణంగా ప్యాకేజింగ్‌ను సృజనాత్మకంగా తీర్చిదిద్దగలిగే దూరదృష్టి? వంటివన్నింటినీ కంపెనీలు ప్లేస్‌మెంట్లో పరిశీలిస్తాయి.

**ఐఐపీలో చేరాలనుకునే విద్యార్థులకు మీరిచ్చే సలహా?**

ప్యాకేజింగ్ పరిశ్రమను, కెరీర్‌ను ఇష్టపడితేనే ఈ రంగంలోకి రావాలి. లేకుంటే మనుగడ కష్టం. ఈ రంగంలో స్థిరపడాలనుకుని కోర్సు చేయాలనుకుంటే.. కచ్చితంగా ఈ రంగం మూలాలు తెలుసుకోవాలి. కోర్సులో చేరాక ఉద్యోగం కచ్చితంగా లభిస్తుంది. అంతేకాదు ఇక్కడ రీసెర్చ్ చేస్తే తక్కువ వ్యవధిలోనే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చు.

భవిత
Now Bhavita Also on Sakshi TV
Every Sunday9-30am to 10am

CAT - 2012 Convenor

# ఫోకస్డ్ ప్రిపరేషన్ కోసమే.. త్వరగా షెడ్యూల్

**ఈ ఏడాది క్యాట్ షెడ్యూల్‌ను త్వరగా విడుదల చేయడానికి కారణం?**

గత సంవత్సరంతో పోల్చితే.. ఈ ఏడాది క్యాట్ షెడ్యూల్ కొంత ముందుగానే వెలువడింది. గతంలో సాంకేతికంగా తలెత్తిన సమస్యలు, సంబంధిత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని క్యాట్-2012 టెస్టింగ్ విండోను సాధ్యమైనంత త్వరగా అభ్యర్థులకు అందుబాటులోకి తేవాలనే ఉద్దేశంతోనే.. త్వరగా నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగింది. అంతేకాకుండా గతంలో.. ఫెస్టివల్ సీజన్‌లో నోటిఫికేషన్ రావడం.. అభ్యర్థుల ప్రిపరేషన్‌కు కొంత ఇబ్బందిగా ఉండేది. ఈ అంశాన్ని కూడా దృష్టిలో ఉంచుకుని త్వరగా షెడ్యూల్ ప్రకటించాల్సి వచ్చింది. దీనివల్ల అభ్యర్థులు ప్రిపరేషన్‌పై ఎక్కువ ఫోకస్ చేసే అవకాశం లభిస్తుంది.

**ఈ ఏడాది క్యాట్ దరఖాస్తులకు పెద్దగా డిమాండ్ లేదంటూ వస్తున్న వార్తల్లో వాస్తవమెంత?**

ఈ వార్తల్లో వాస్తవం లేదు. గణాంకాలను పరిగణనలోకి తీసుకుంటే.. గతేడాది ఈ సమయానికి ఎంతమంది క్యాట్ వోచర్లు కొన్నారో.. ఈ ఏడాది కూడా ఆ సంఖ్య దాదాపు అదే స్థాయిలో ఉంది. అంతకుముందు సంవత్సరంతో పోల్చితే 2011లో క్యాట్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న వారి సంఖ్య స్వల్పంగా పెరిగింది. అదే ట్రెండ్ ఈ ఏడాది కూడా కొనసాగుతుందని భావిస్తున్నాం. 13 ఐఐఎంలతోపాటు మరో 130 ఇతర బిజినెస్ స్కూల్స్‌లో అడ్మిషన్స్ కోసం జరిగే క్యాట్ దేశంలో ప్రతిష్టాత్మక పరీక్షల్లో ఒకటిగా ఉంది. రానున్న కొద్ది సంవత్సరాల్లో భారత ఆర్థిక వ్యవస్థ పుంజుకోనుంది. ఈ సంవత్సరం క్యాట్ ద్వారా ఎంబీఏలో చేరేవారు తమ కోర్సు పూర్తయ్యేసరికి ఈ ప్రగతి ఫలాలను చూస్తారు.

**గతేడాది క్యాట్‌లో పలు మార్పులు చేసినప్పటికీ.. ఇంజనీరింగ్ విద్యార్థులే ఎక్కువగా ఎంపికయ్యారు. దీనిపై మీ అభిప్రాయం?**

విద్యా నేపథ్యంతో సంబంధం లేకుండా ప్రతిభావంతులైన విద్యార్థులందరికీ అవకాశం కల్పించడమే లక్ష్యంగా గతేడాది క్యాట్‌లో మార్పులు చేయడం జరిగింది. గత కొన్నేళ్ల క్యాట్ ఫలితాలు, ఐఐఎంలలో అడుగుపెడుతున్న విద్యార్థుల బ్యాక్‌గ్రౌండ్‌ను పరిశీలిస్తే.. ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లదే హవా అనేది స్పష్టం. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ మార్పులు చేశారనడం సహేతుకం కాదు. క్వాంటిటేటివ్ ఎబిలిటీ, వెర్బల్ ఎబిలిటీలలో ప్రతిభ చూపే అభ్యర్థులందరికీ సమాన అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో నూతన ఎగ్జామ్ ప్యాట్రన్‌ను రూపొందించడం జరిగింది. ప్రత్యేకించి ఏ ఒక్క గ్రూప్ లేదా కేటగిరీ కోసం క్యాట్‌లో మార్పులు చేయలేదు. అందరికీ సమాన అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతోనే నూతన విధానాన్ని ప్రవేశ పెట్టడం జరిగింది.

## ప్రొఫైల్



**పేరు:** ఎస్ఎస్ఎస్ కుమార్

**విద్యార్హతలు:**

- బీటెక్ (ఆర్ఈసీ కాలికట్)
- ఎంబీఏ (ఎస్వీ యూనివర్సిటీ)
- ఇండియన్ స్కూల్ ఆఫ్ మైన్స్ (ఐఎస్ఎం)-ధన్‌బాద్ నుంచి 'విదేశీ వ్యవస్థాగత పెట్టుబడులు-భారత ఆర్థిక వ్యవస్థ మీద ప్రభావం' అనే అంశంపై రీసెర్చ్ చేసి డాక్టరేట్ పొందారు.

**కెరీర్:** మొదట్లో క్యాపిటల్ మార్కెట్, ఫారెక్స్ మార్కెట్లో రెండేళ్లపాటు వివిధ హోదాల్లో పనిచేశారు. ఆ తర్వాత 1998 నుంచి 2002 వరకు ఐఎస్ఎం-ధన్‌బాద్‌లో లెక్చరర్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2002-03 మధ్య నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ మేనేజ్‌మెంట్-పుణేలో ఫ్యాకల్టీగా పని చేశారు. 2003 నుంచి ఐఐఎం-కోజికోడ్ ఫ్యాకల్టీగా కొనసాగుతున్నారు. ఎకనామిక్స్, ఫైనాన్స్ అంశాలపై పలు జర్నల్స్ ప్రచురించారు.

**ప్రశ్నలు చాలా క్లిష్టంగా ఉంటున్నాయని గతంలో అభ్యర్థులు వ్యక్తం చేసిన అభ్యంతరాలపై ఏమైనా చర్యలు తీసుకున్నారా?**

ప్రతిభావంతులైన అభ్యర్థులకు అవకాశం కల్పించడమే లక్ష్యంగా క్యాట్ టెస్ట్ ప్యాట్రన్ ఉంటుంది. కాబట్టి క్యాట్‌లో అడిగే ప్రశ్నలు.. ఇతర పరీక్షలతో పోల్చితే కొంత క్లిష్టంగానే ఉంటాయి. టెస్టింగ్ సిస్టమ్ కోసం శాస్త్రీయ పద్ధతులాధారంగా ఒక అల్గారిథం రూపొందిస్తారు. దాని ఆధారంగా ఎంపిక చేసిన ప్రశ్నలను క్యాట్‌లో అడగడం జరుగుతుంది. విద్యాపరంగా, మానసికంగా అభ్యర్థి స్కిల్స్‌ను పరీక్షించడమే లక్ష్యంగా క్యాట్ పరీక్ష ప్యాట్రన్ ఉంటుంది. అమెరికన్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అసోసియేషన్ (ఏఈఆర్ఏ), అమెరికన్ సైకలాజికల్ అసోసియేషన్(ఏపీఏ), నేషనల్ కౌన్సిల్ ఆన్ మెసర్‌మెంట్ ఇన్ ఎడ్యుకేషన్(ఎన్‌సీఎంఈ) సంయుక్తంగా ఈ ఫార్మాట్‌ను రూపొందిస్తాయి. విభాగాల వారీగా ఇచ్చిన సమాధానాల ఆధారంగా (సరైన, తప్పు, వదిలివేసిన ప్రశ్నలను పరిగణనలోకి తీసుకుని) స్కోర్‌ను గణిస్తారు.

**మొదటి రోజు రాసిన వారితో పోల్చితే తర్వాత రోజు హాజరైన వారికి ప్రశ్నపత్రం సులువుగా ఉంటుందనే వాదనపై మీ అభిప్రాయం? ఏ రోజు పరీక్ష రాసినా ప్రశ్నపత్రం క్లిష్టత ఒకే విధంగా ఉంటుందా?**

ఏ రోజు పరీక్ష రాసినా.. ప్రశ్నపత్రం క్లిష్టత ఒకేవిధంగా ఉంటుంది. మొదటి రోజురాసిన వారికి సులువుగా ఉంటుందనే వాదనలో ఏమాత్రం వాస్తవం లేదు. విశ్వసనీయత, కచ్చితత్వం కొలమానంగా అంతర్జాతీయ ప్రమాణాలను అనుసరిస్తూ రూపొందించిన విధానంలో క్యాట్ పరీక్ష నిర్వహణ ఉంటుంది. వివిధ ప్రమాణాల ఆధారంగా రూపొందించిన ప్రశ్నలను ఎంపిక చేసి ఇవ్వడం జరుగుతుంది. దీనివల్ల ప్రతి అభ్యర్థికి ఒక్కో ప్రత్యేకమైన స్లాట్ వస్తుంది.

ఇక్కడ గమనించాల్సిన అంశం.. ఏ రెండు స్లాట్‌లు కూడా ఒకే విధంగా ఉండే అవకాశమే లేదు. అలాంటి పరిస్థితుల్లో మొదటిరోజు రాసిన వారితో పోల్చితే తర్వాత హాజరైన వారికి ప్రశ్నపత్రం సులువుగా ఉంటుందనే వాదన వాస్తవ దూరం. అంతేకాకుండా పరీక్ష తర్వాత ఎటువంటి సందేహాలకు తావులేని రీతితో శాస్త్రీయ పద్ధతిలో మల్టీస్కోరింగ్‌ను అనుసరించి ప్రతి టెస్ట్‌ను ప్రశ్నల క్లిష్టతస్థాయిని అనుసరించి అడ్జెస్ట్ చేస్తారు. పోస్ట్ ఈక్వేటెడ్ స్కోర్‌ను ఒక కామన్ స్కేల్ ద్వారా మూల్యాంకనం చేసి.. ప్రతి అభ్యర్థి ప్రతిభను నిష్పాక్షికంగా అంచనావేస్తారు. ప్రశ్న పత్రాల్లోను సెక్షన్ల వారీగా, పేపర్ మొత్తం మీద క్లిష్టత స్థాయి ఒకే విధంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటారు.

**క్యాట్ అంతిమ లక్ష్యంగా భావిస్తున్న కారణంగా ప్రిపరేషన్ పరంగా విద్యార్థిపై తీవ్ర ఒత్తిడి ఉంటోంది కదా!?**

ఐఐఎంలలో కోర్సు పూర్తి చేస్తే.. అందివచ్చే అవకాశాలకు ఆకాశమే హద్దు. కోర్సు పూర్తికాక ముందే ఎంఎన్‌సీలు, టాప్ కార్పొరేట్ కంపెనీలు కళ్లు చెదిరే ప్యాకేజ్‌తో మీ ముందు ఉంటాయి. కార్పొరేట్ ప్రపంచంలో ఆకర్షణీయమైన కెరీర్‌కు కేరాఫ్ ఐఐఎంలు. అలాంటి ఐఐఎంలలో ప్రవేశానికి జరిగే పరీక్ష క్యాట్. కాబట్టి ప్రిపరేషన్‌లో కొంత ఒత్తిడి ఉండడం సహజం. వేలల్లో ఉండే సీట్ల కోసం లక్షలాది మంది పోటీపడుతుంటారు. మంచి స్కోర్ సాధిస్తేనే ప్రవేశం లభిస్తుంది. ఇటువంటి పరిస్థితి ఉత్పన్నమవుతుంది. బేసిక్స్ మీద పట్టు సాధిస్తూ.. ప్రాక్టీస్‌కు ఎక్కువ ప్రాధాన్యతనిస్తూ.. సాధించగలననే ఆత్మవిశ్వాసం ఉంటే ఎలాంటి ఒత్తిడినైనా జయించవచ్చు.

**ఐఐఎంల ప్రవేశ ప్రక్రియలో క్యాట్ స్కోర్, వర్క్ ఎక్స్‌పీరియెన్స్ రెండింటిలో దేనికి అధిక ప్రాధాన్యత ఉంటుంది?**

క్యాట్ స్కోర్ ఆధారంగా అభ్యర్థులు.. దేశ వ్యాప్తంగా ఉన్న 13 క్యాంపస్‌లలో.. తమకు నచ్చిన ఇన్‌స్టిట్యూట్‌లలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రవేశ ప్రక్రియ విషయానికొస్తే.. ఒక్కో ఐఐఎం ఒక్కో పద్ధతిని అనుసరిస్తుంది. ఈ ప్రక్రియలో క్యాట్ స్కోర్‌కు ఎంత ప్రాధాన్యత ఇస్తారో.. వర్క్ ఎక్స్‌పీరియెన్స్ కూడా అంతే ప్రాధాన్యత ఉంటుంది. ఏదో ఒక అంశానికే ప్రాధాన్యత ఇవ్వడం జరగదు. క్యాట్ స్కోర్, వర్క్ ఎక్స్‌పీరియెన్స్ రెండింటికి సమ ప్రాధాన్యత లభిస్తుంది.

**క్యాట్‌లో మంచి స్కోర్ కోసం ఒకవైపు తీవ్ర ఒత్తిడి ఉంటే... అదేసమయంలో 100% పర్సంటైల్ సాధించిన అభ్యర్థులకు కూడా కొన్ని ఐఐఎంలు అడ్మిషన్ నిరాకరిస్తున్నాయి. కారణం?**

ఈ వాదనలో కొంత వాస్తవం లేకపోలేదు. ఒకే మూస అభ్యర్థులు కాకుండా.. అన్ని రకాల నేపథ్యం నుంచి వచ్చిన అభ్యర్థులు ఉండేలా కొన్ని ఇన్‌స్టిట్యూట్‌లు జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. మెరుగైన ఫలితాలు సాధించడానికి ఈ రకమైన భిన్న వాతావరణం అవసరం అని భావించడమే ఇందుకు కారణంగా పేర్కొనవచ్చు. కొన్ని ఇన్‌స్టిట్యూట్‌లు జెండర్(లింగ) వైవిధ్యతకు ప్రాధాన్యం ఇస్తుంటే.. మరికొన్ని ప్రొఫెషనల్ బ్యాక్‌గ్రౌండ్‌కు పెద్ద పీట వేస్తున్నాయి. కేవలం క్యాట్ మెరిట్ ప్రతిపాదికనే కాకుండా.. అకడెమిక్ రికార్డ్, ప్రొఫెషనల్ ఎక్స్‌పీరియెన్స్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని అడ్మిషన్ కల్పిస్తున్నాయనే విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుంచుకోవాలి.

# నేషనల్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్ -2013

నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించే ఉద్దేశంతో ప్రతి ఏటా నిర్వహించే 'నేషనల్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్-2013' కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో ఎంపికైన విద్యార్థులకు బేసిక్ సైన్సెస్, సోషల్ సైన్సెస్, కామర్స్ వంటి సబ్జెక్టులలో పీహెచ్‌డీ వరకు (నెల చొప్పున-యూజీసీ నిబంధనలకు లోబడి) స్కాలర్‌షిప్ అందజేస్తారు.

**స్కాలర్‌షిప్:**

నెలకు రూ.500. దేశవ్యాప్తంగా రెండు దశల్లో నిర్వహించే రాత పరీక్ష ద్వారా ఎంపిక చేసిన 1000 మంది విద్యార్థులకు 11వ తరగతి నుంచి పీహెచ్‌డీ వరకు స్కాలర్‌షిప్స్‌ను ప్రదానం చేస్తారు. ఇంజనీరింగ్, మెడిసిన్, మేనేజ్‌మెంట్, లా వంటి ప్రొఫెష నల్ కోర్సులకు మాత్రం పోస్ట్ గ్రాడ్యుయేషన్ (Second degree level) వరకు ఈ సౌకర్యం కల్పిస్తారు. ప్రభుత్వ నిబంధనలకనుగుణంగా రిజర్వేషన్లు వర్తిస్తాయి.

**అర్హత:**

ప్రభుత్వ/ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో పదో తరగతి చదువుతుండాలి.

**ఎంపిక విధానం:**

రెండు దశల్లో నిర్వహించే రాత పరీక్ష ద్వారా అర్హులను ఎంపిక చేస్తారు. మొదటి దశ పరీక్ష రాష్ట్ర స్థాయిలో ఉంటుంది. ఇందులో మెంటల్ ఎబిలిటీ టెస్ట్ (ఎంఏటీ), స్కాలాస్టిక్ ఎబిలిటీ టెస్ట్ (ఎస్ఏటీ) అనే రెండు భాగాలు ఉంటాయి. వీటిల్లో సంబంధిత రాష్ట్ర సిలబస్ అనుసరించి పదో తరగతి స్థాయి ప్రశ్నలు వస్తాయి. హిస్టరీ, జాగ్రఫీ, సివిక్స్, ఎకనామిక్స్, మ్యాథ్స్, సోషల్, సైన్సెస్ సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు అడుగుతారు.

మొదటి దశలో క్వాలిఫై అయిన విద్యార్థులు జాతీయ స్థాయిలో నిర్వహించే రెండో దశ రాత పరీక్షకు హాజరు కావాలి.

మొదటి దశ మాదిరిగానే ఇందులో కూడా మెంటల్ ఎబిలిటీ, స్కాలాస్టిక్ ఎబిలిటీ టెస్ట్ ఉంటా యి. సీబీఎస్ఈ సిలబస్ ఆధారంగా ప్రశ్నలు వస్తాయి.

**దరఖాస్తు విధానం:**

ఎన్‌సీఈఆర్‌టీ వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దరఖాస్తుపై విద్యార్థులు చదువుతున్న స్కూల్ ప్రిన్సిపల్ సంతకం తప్పనిసరి. దరఖాస్తును స్థానిక లైజన్ ఆఫీసర్ నుంచి కూడా పొందొచ్చు. పూర్తి చేసిన దరఖాస్తును లైజన్ ఆఫీసర్‌కే అందజేయాలి.

**దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ:** ఆగస్టు 31, 2012.
**మొదటి దశ రాత పరీక్ష తేదీ:** 18 నవంబర్, 2012.
**రెండో దశ రాత పరీక్ష తేదీ:** 12 మే, 2013.

**చిరునామా:**

డిప్యూటీ కమిషనర్
ఆఫీస్ ఆఫ్ ది డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్,
చాపెల్ రోడ్-ఆబిడ్స్,
హైదరాబాద్ -500001.

**వివరాలకు:** www.ncert.nic.in

AP Technical Educational Commissioner

# ఉద్యోగాల్లేవన్నారంటే.. విద్యార్థుల్లో స్కిల్స్ లేనట్లే!!

ప్రస్తుతం ఇంజనీరింగ్ విద్యలో తీసికట్టుగా ఉన్న నాణ్యతను రాత్రికిరాత్రే పెంచడం సాధ్యం కాదు. ఈలోగా విద్యార్థులు నష్టపోకుండా.. పాలిటెక్నిక్ కాలేజీల తరహాలో ఇంజనీరింగ్ కాలేజీల్లో కూడా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేయాలనుకుంటున్నాం. ఏఐసీటీఈ, యూజీసీ, యూనివర్సిటీలు, ఉన్నత విద్యామండలి.. ఈ నాలుగింటి మధ్య సమన్వయం సాధిస్తే ఇంజనీరింగ్ విద్యలో ఉన్నత ప్రమాణాలు సాధించొచ్చు. ఆ దిశగా ప్రయత్నాలు ప్రారంభించాం. రాష్ట్రవ్యాప్తంగా పాలిటెక్నిక్ కాలేజీల్లో ఉత్తీర్ణత కేవలం 18 శాతం మాత్రమే. దీన్ని 50 శాతం పెంచడానికి చర్యలు తీసుకుంటున్నాం. ఇంజనీరింగ్, ఫార్మసీ, మేనేజ్‌మెంట్ రంగాల్లో ఉద్యోగాలున్నా.. స్కిల్స్ లేని కారణంగా వాటిని అందుకోలేకపోతున్నారు. ఇకపై విద్యార్థులకు పూర్తిస్థాయిలో అండగా నిలవడానికి సాంకేతిక విద్యాశాఖను సమాయత్తం చేస్తున్నామంటున్నారు సీనియర్ ఐఏఎస్ అధికారి, **ఆంధ్రప్రదేశ్ సాంకేతిక విద్య కమిషనర్ అజయ్‌జైన్.** ఆయనతో సాక్షి భవిత ప్రత్యేక ఇంటర్వ్యూ...



**పాలిటెక్నిక్ విద్యలో ప్రమాణాలపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఉత్తీర్ణత కూడా తగ్గుతోంది. ప్రమాణాలు పెంచడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?**

పాలిటెక్నిక్ విద్యను సమూలంగా ప్రక్షాళన చేసేందుకు కసరత్తు మొదలుపెట్టాం. ప్రస్తుతం పాలిటెక్నిక్ కాలేజీల్లో విద్యార్థుల ఉత్తీర్ణత 18 శాతం మాత్రమే ఉంది. విద్యాప్రమాణాలు పెంచడం ద్వారా దీన్ని ఈ ఏడాది 50 శాతానికి పెంచుతాం. పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రధానంగా మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టుల్లో ఎక్కువ శాతం విద్యార్థులు ఫెయిలవుతున్నట్లు గుర్తించాం. అలాంటి విద్యార్థులకు త్వరలో అన్ని కాలేజీల్లో అదనంగా ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తాం. దాంతోపాటు సబ్జెక్టుల్లో వీక్‌గా ఉన్న ఫస్ట్‌ఇయర్ విద్యార్థులందరికీ ప్రత్యేక తరగతులు ఉంటాయి. ఆదనపు తరగతులు నిర్వహించినందుకు ఆయా కాలేజీల సిబ్బందికి తగిన ప్రోత్సాహకాలు కూడా ఇవ్వాలని నిర్ణయించాం. ప్రతిరోజూ కొన్ని పాలిటెక్నిక్ కాలేజీల్లోని ప్రిన్సిపల్స్, విద్యార్థులతోను స్వయంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నేనే మాట్లాడాలనుకుంటున్నా.

**పాలిటెక్నిక్‌ల్లో బోధనలో నాణ్యత పెంచేందుకు ప్రవేశపెట్టిన ఈ-లెస్సన్స్ కాన్సెప్ట్ విఫలమైనట్లేనా? ప్రత్యామ్నాయంగా స్టడీ మెటీరియల్ ఇచ్చే ఆలోచన ఉందా?**

ఈ-లెస్సన్స్ కాన్సెప్ట్ ఉన్నతమైంది. కానీ ఆచరణలోనే కొన్ని సమస్యలున్నాయి. ప్రధానంగా మౌలికసదుపాయాల్లేని కాలేజీల్లో ఈ-లెస్సన్స్ అమలుకు చాలా ఇబ్బందులున్నాయి. దీనివల్ల చాలాచోట్ల ఇవి అమలుకావడం లేదు. అందుకే అసలు ఇది ఎంతవరకు సాధ్యం? దీంతో ఉపయోగం ఉందా? ఈ విధానాన్ని మరింత సమర్థవంతంగా అమలుచేయాలంటే ఏంచేయాలి? వంటి అంశాలను అధ్యయనం చేయడానికి ఇటీవల ప్రత్యేక కమిటీని నియమించాం. నివేదిక వచ్చాక నిర్ణయం తీసుకుంటాం. సౌకర్యాలు లేని కాలేజీల్లోను ఈ-లెస్సన్స్ అమలు జరిగేలా పాఠాలను ప్రింటవుట్లు తీసి.. అతికించే అంశాన్ని పరిశీలిస్తున్నాం. సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులు అర్థం చేసుకుని పరీక్షల్లో రాణించేందుకు ప్రత్యేక మెటీరియల్‌ను త్వరలోనే ఉచితంగా అందించనున్నాం.

**పాలిటెక్నిక్ విద్యార్థులు ఎక్కువమందిలో ప్రాక్టికల్ నాలెడ్జ్ ఉండడం లేదని కంపెనీలు పేర్కొంటున్నాయి. చాలా కాలేజీల్లో ల్యాబ్స్ పరిస్థితి కూడా అంతంతమాత్రమే? దీనికి కారణం?**

పాలిటెక్నికల్ కోర్సులు అభ్యసించేవారిలో ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంచేందుకు గట్టి చర్యలు తీసుకుంటున్నాం. కోర్సు స్టడీలో భాగంగా 6 నెలల ఇండస్ట్రీ ఎక్స్‌పోజర్ తప్పనిసరి చేశాం. దాంతో మంచి ఫలితాలొస్తున్నాయి. ఆదేవిధంగా కంపెనీలకు కావలసిన స్కిల్స్‌పై ముందుగానే విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 25 స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్స్ నిర్వహిస్తున్నాం. త్వరలో మరో 25 పెంచాలని నిర్ణయించాం. చాలామంది పాలిటెక్నిక్ తర్వాత బీటెక్‌లో చేరుతున్నారు. ఉన్నత చదువుకు వెళ్లని వారి కోసం ప్రత్యేక జాబ్‌మేళా నిర్వహించి మేమే ఉద్యోగాలిప్పిస్తున్నాం. ఇకపై దీన్ని రాష్ట్రమంతటా విస్తరిస్తాం. ల్యాబ్‌లు లేని కాలేజీ విద్యార్థులు 6 నెలల ఇండస్ట్రీ ఎక్స్‌పోజర్‌లో మరింత రాటుదేలేలా చూస్తున్నాం. అన్ని కాలేజీల్లో సౌకర్యాలు కల్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. భవిష్యత్తులో రాష్ట్రంలోని అన్ని కాలేజీల్లో ప్లేస్‌మెంట్లు నిర్వహించేలా పరిశ్రమలతో మాట్లాడుతున్నాం.

**పాలిటెక్నిక్ కాలేజీల్లో కాలం చెల్లిన కోర్సులు, పరిశ్రమలకు ఉపయోగపడని సిలబస్ ఏళ్లతరబడి అమలవుతోంది. విద్యార్థులు నష్టపోతున్నారు కదా?**

అన్ని కాలేజీల్లో పాతకాలం నాటి కోర్సులు, సిలబస్ అమలవుతోంది. 2013 నుంచి కొత్త సిలబస్‌ను ప్రవేశపెట్టనున్నాం. దీనిప్రకారం- ప్రస్తుత పరిశ్రమ ఆవసరాలు, భవిష్యత్తు డిమాండ్‌ను కూడా దృష్టిలో ఉంచుకొని సమాజానికి, పరిశ్రమలకు, విద్యార్థులకు ఉపయోగపడే కోర్సులు, సిలబస్‌ను ప్రవేశపెడతాం. కంపెనీలను కూడా సిలబస్ రూపకల్పనలో భాగస్వామ్యం చేస్తాం. రానున్న రోజుల్లో పాలిటెక్నిక్ విద్య ప్రమాణాలు మెరుగవుతాయని కచ్చితంగా చెప్పగలను.

**రాష్ట్రవ్యాప్తంగా పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రిన్సిపల్స్, హెడ్ ఆఫ్ ద డిపార్ట్‌మెంట్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీని వల్ల బోధన నత్తనడక నడుస్తోంది కదా?**

బోధనను గాడిలో పెట్టేందుకు 869 పాలిటెక్నిక్ లెక్చరర్ పోస్టుల భర్తీకి ఇటీవలే ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. వీరు వచ్చే ఆగస్టు నాటికి విధుల్లో చేరుతారు. ఖాళీగా ఉన్న ప్రిన్సిపల్ పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలనే ఆలోచన చేసున్నాం. మొత్తం ఖాళీలను గుర్తించి ఆగస్టులోగా అర్హులందరికీ పదోన్నతులిస్తాం. ఈ ప్రక్రియ పూర్తైతే ఎక్కడా ఫ్యాకల్టీ సమస్య లేకుండా.. అన్ని కాలేజీల్లో పూర్తిస్థాయి బోధన జరిగేలా చూస్తాం.

**బీటెక్ పూర్తిచేసుకున్న వాళ్లలో 20 శాతం మంది కూడా ఉద్యోగాలకు అర్హులు కావడం లేదు.. ప్రతి 10 మంది ఇంజనీర్లలో కేవలం నలుగురికే ఇంగ్లిష్‌పై అవగాహన ఉంటోందని సర్వేలు వెల్లడిస్తున్నాయి?**

నాలుగేళ్ల కిందటివరకు ఏపీలో 300 ఇంజనీరింగ్ కాలేజీలుంటే.. ఇప్పుడు వాటి సంఖ్య 700కిపైగానే ఉంది. పెరిగిపోయిన కాలేజీల కారణంగా క్వాలిటీ దెబ్బతింది. కాలేజీల సంఖ్య అమాంతం పెరగడానికి ఏఐసీటీఈ అనుమతులే కారణం. కాలేజీలు ఎక్కువగా ఉన్నా.. కొత్తవాటికి అనుమతులివ్వడం మంచిదికాదని ఏఐసీటీఈ ఆలోచించదు. వాస్తవానికి ఏఐసీటీఈ; సాంకేతికవిద్యాశాఖ, ఉన్నతవిద్యామండలి కలిసి పనిచేస్తే ఇంజనీరింగ్‌లో ప్రమాణాలు పెంచొచ్చు. విద్యార్థులకు అవసరమైన నైపుణ్యాలు అందించడానికి పాలిటెక్నిక్ కాలేజీల తరహాలోనే ఇంజనీరింగ్ కాలేజీల్లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేయాలనుకుంటున్నాం. తద్వారా కార్పొరేట్ కంపెనీలకు అవసరమయ్యే కమ్యూనికేషన్ స్కిల్స్, లాంగ్వేజ్ స్కిల్స్ మెరుగవుతాయి.

**ఇప్పటికే ఇంజనీరింగ్ కాలేజీల్లో వేలాది సీట్లు మిగిలిపోతుంటే.. అదనంగా వేల సీట్లు మంజూరు చేస్తున్నారు.. మరోవైపు కాలేజీలు కనీస ప్రమాణాలు పాటించడంలేదు. ఈ పరిస్థితికి పరిష్కారం?**

ఏఐసీటీఈ ప్రత్యక్షంగా పరిశీలించి అనుమతులివ్వాలి. యూనివర్సిటీలు అక్రిడేషన్ ఇచ్చే విషయంలో మరింత లోతుగా పరిశీలించాలి. ఏఎఫ్‌ఆర్‌సీ కూడా తనవంతు ప్రమాణాలు పాటించాలి. ఈ మూడు వ్యవస్థలు కచ్చితంగా పనిచేస్తే.. ఇంజనీరింగ్ విద్య ప్రమాణాలు మెరుగవుతాయి. కానీ ప్రస్తుత పరిస్థితి అలా లేదు. కాలేజీలు అకడమిక్ ప్రమాణాలు మెరుగుపరచుకోకుండా.. వ్యాపారం కోసమే అన్నట్లు సీట్లు పెంచుకోవడానికి ప్రయత్నిస్తుండడంతో సమస్య తీవ్రమవుతోంది. అందుకే సాంకేతిక విద్యాశాఖ రాష్ట్రవ్యాప్తంగా అన్ని కాలేజీల్లో సౌకర్యాలపై ప్రత్యేక కమిటీ ద్వారా అధ్యయనం చేసి కాలేజీల్లో సరిపడ ఫ్యాకల్టీ ఉందా? నిబంధల ప్రకారం ల్యాబ్‌లు పనిచేస్తున్నాయా? తదితర అంశాలపై కచ్చితమైన సమాచారాన్ని సేకరించాం. కమిటీ రిపోర్ట్‌పై ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాక తగిన చర్యలు తీసుకుంటాం.

**మన దగ్గర ఫార్మసీ కాలేజీల్లో చదువు పూర్తి చేశాక.. ఉద్యోగాలు లభించడం కష్టమవుతోంది. పరిష్కారమేంటి?**

ఉద్యోగాలు దొరకడం లేదనేది వాస్తవం కాదు. దేశంలోనే ఫార్మా రంగానికి హైదరాబాద్ హబ్. అలాంటప్పుడు ఫార్మాకంపెనీలు ఇక్కడి విద్యార్థులకే ఉద్యోగాలివ్వడానికి ముందుకు వస్తున్నాయి. ప్రస్తుతం ఫార్మసీలో డిప్లొమా కోర్సుకు చాలా అవకాశాలున్నాయి. ఇటీవలే ఓ ఫార్మా కంపెనీకి 500 మంది అవసరమైతే మేమే జాబ్ మేళా నిర్వహించాం. కానీ విద్యార్థుల్లో కావలసిన స్కిల్స్ లేకపోవడం సమస్యగా మారింది. ఫార్మసీలో కెరీర్ కొనసాగించాలనుకునేవాళ్లు, ఎదగాలనుకునేవాళ్లు మంచి కాలేజీ ఏదో తెలుసుకుని చేరాలి.

**రాష్ట్రంలో చాలా ఎంబీఏ, ఎంసీఏ కాలేజీలు మూసివేత దిశగా పయనిస్తున్నాయి. కారణం?**

కారణం.. స్వయంకృతాపరాధమే..! పూర్తిస్థాయి ఫ్యాకల్టీ, ల్యాబ్‌లు లేని ఏ విద్యాసంస్థ కూడా ఎక్కువ కాలం నడవలేదు. అనుమతులు వస్తున్నాయని.. కాలేజీలు ప్రారంభిస్తే అవి దీర్ఘకాలం నిర్వహించడం సాధ్యం కాదు. ఇప్పటికైనా యూనివర్సిటీలు కళ్లు తెరవాలి. మేనేజ్‌మెంట్ విద్య అయినా, ఇంజనీరింగ్ విద్య అయినా... ముందు యూనివర్సిటీలు అన్ని జాగ్రత్తగా పరిశీలించి అక్రిడేషన్లు, ఇతర అనుమతులు ఇవ్వాలి. అన్నిరకాల ప్రమాణాలు అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత వీటిదే.

**వృత్తివిద్యా కోర్సు అభ్యసిస్తే కచ్చితంగా ఉద్యోగం లభిస్తుందనే గ్యారెంటీ లేదు.. పాలిటెక్నిక్, ఇంజనీరింగ్, ఫార్మసీ ఇతర వృత్తివిద్యా కోర్సుల విద్యార్థులకు మీ సలహా?**

మార్కెట్లో అవకాశాలెప్పుడూ ఉంటాయి. వాటిని అందిపుచ్చుకోలేనప్పుడే మార్కెట్‌లో జాబ్స్ లేవు అంటారు. ఏ బ్రాంచ్, కోర్సు చదివినా.. అందులో నిష్ణాతులుగా మారితే అవకాశాలకు కొదవుండదు. ప్రధానంగా కోర్ బ్రాంచ్‌ల్లో ఎవరికివారు పట్టు సాధించాలి. సబ్జెక్టు ఫండమెంటల్స్‌ను డెప్త్‌గా అర్థం చేసుకోవాలి. వీటికితోడు ఏ కోర్సు చదువుకున్నా.. తప్పనిసరిగా కమ్యూనికేషన్, లాంగ్వేజ్ స్కిల్స్ లేకుండా ఉద్యోగం సాధించడం అసాధ్యం. గ్రామీణప్రాంత విద్యార్థులకు ప్రతిభ ఉన్నా.. ఈ విషయంలోనే వెనుకబడిపోతున్నారు.

**ముఖ్యంగా ఇంజనీరింగ్ విద్యార్థులకు మీ సలహా?**

ఇంజనీరింగ్‌లో చేరాలనుకుంటే.. ముందు మంచి కాలేజీ ఎంచుకోవాలి. ఇక్కడ తప్పటడుగు వేస్తే కెరీర్లో చాలా నష్టపోతారు. చాలామంది విద్యార్థులు ఇప్పటికీ అవగాహన లేక ఇంజనీరింగ్‌లో అడ్మిషన్ రాగానే ఉద్యోగం ఖాయం అనే భ్రమలో ఉంటున్నారు. ఇది వాస్తవం కాదు. కాలేజీలో సౌకర్యాలున్నా, లేకున్నా.. సొంతంగా చదువుకుని నైపుణ్యాలు పెంచుకోవాలి. కేవలం బీటెక్‌తోనే సరిపెట్టుకోకుండా.. ఉన్నత చదువులు చదవడానికి ప్రయత్నించాలి. బీటెక్ తర్వాత ఎంటెక్, పీహెచ్‌డీ చేస్తే అవకాశాలు అపారం!!

సాక్షి Eamcet Mock Counselling www.sakshieducation.com

Civils Mains - GS Preparation

# 'జనరల్'గా.. జంకు లేకుండా

సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ (ప్రాథమిక) పరీక్ష ఫలితాలు వెలువడ్డాయి. దాదాపు 13 వేల మంది మెయిన్స్‌కు అర్హత సాధించారు. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ వంటి అత్యున్నత సర్వీసులను అందుకునే క్రమంలో తొలి విజయం సొంతం చేసుకున్నారు. ఇక.. ఇప్పుడే అసలైన సవాలుకు సిద్ధం కావాలి. కారణం.. ఒకటే మాట.. అది మెయిన్స్ ఎగ్జామినేషన్! వ్యూహాత్మక ప్రిపరేషన్, సబ్జెక్ట్‌లపై పట్టు వంటి సాధనాలతో పోటీని లక్షల నుంచి వేలకు తగ్గించుకున్న ప్రిలిమ్స్ విజేతలు.. అంతకుమించి అస్త్రశస్త్రాలతో మెయిన్స్ దిశగా అడుగులు వేయాలి. ఈ మెయిన్స్‌లోనే అత్యంత కీలకమైన విభాగం జనరల్ స్టడీస్. దీనికోసం అనుసరించాల్సిన వ్యూహాలపై నిపుణుల విశ్లేషణ..



సివిల్ సర్వీసెస్ మెయిన్స్ ఎగ్జామినేషన్‌లో మిగతా పేపర్లతో పోల్చితే అభ్యర్థులు ఇబ్బందిగా భావించే పేపర్లు జనరల్ స్టడీస్ పేపర్లే. కారణం.. వీటి పరిధి విస్తృతంగా ఉండటం; అంతకుమించి మార్కెట్లో మెటీరియల్ లభించడం. అంతమాత్రాన ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అనునిత్యం సమకాలీన అంశాలపై అవగాహన కలిగుంటే అవలీలగా నిర్దేశిత సిలబస్‌లో పట్టు సాధించొచ్చు.

### ఏది ముఖ్యం.. తెలుసుకుంటే తేలికే:

జనరల్ స్టడీస్ విషయంలో అంశాల పరిధి విస్తృతమైనా ఏది ముఖ్యం? అనేది తెలుసుకుంటే ప్రిపరేషన్ సులభంగా సాగుతుంది.. ఆపై అత్యధిక మార్కుల సాధనకు ఆస్కారం ఏర్పడుతుంది. ఇందుకోసం గత మూడు, నాలుగేళ్ల ప్రశ్న పత్రాలను విశ్లేషించడం లాభిస్తుంది. ఒక నిర్దిష్ట అంశానికి సంబంధించి ప్రశ్నలను అడుగుతున్న అన్ని కోణాలను పరిశీలించాలి. వాటి ద్వారా.. ఈసారి ఎలా అడగొచ్చు? ఏఏ అంశాలను స్పృశించొచ్చు? అనే అవగాహన ఏర్పడుతుంది.

### 'భారతీయ కోణం'లో..

చదివే ప్రతి అంశాన్ని భారతీయ కోణంలో దృష్టి సారించి చదవాలి. ఉదా: అంతర్జాతీయంగా ఏదైనా ఒప్పందం జరిగితే ఆ ఒప్పంద ప్రభావం భారత్‌పై ఎలా ఉంటుంది? ఆ ఒప్పందం రూపకల్పనలో భారత్ తీసుకున్న చొరవ? ఎలాంటి పాత్ర పోషించింది? భవిష్యత్తులో ఎలాంటి ప్రయోజనాలు చేకూరుతాయి? అనే కోణాల్లో చదవాలి. అయితే ఇదే సమయంలో ఆ ఒప్పందానికి సంబంధించి మూల్యాంకన చేయాల్సిన అవసరం లేదని గుర్తించాలి. మూల్యాంకన చేసుకుంటూ ప్రిపరేషన్ సాగిస్తే సమయం సరిపోదు. అంటే స్థూలంగా ఏదైనా తాజా పరిణామంపై ప్రతికూల, అనుకూల అంశాలను స్పృశిస్తే సరిపోతుంది.

### నో టెన్షన్:

సాధారణంగా జనరల్ స్టడీస్ అంటే ఆర్ట్స్, హ్యుమానిటీస్ వారికే అనుకూలం అనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. కానీ ఇది సరికాదు. 'ఎలాంటి ప్రత్యేక పరిజ్ఞానం లేని అభ్యర్థి కూడా రాయగలిగేలా' అని యూపీఎస్సీ నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధంగానే సిలబస్ పరిధి ఉంటుంది. సైన్స్ అండ్ టెక్నాలజీ, స్టాటిస్టికల్ అనాలిసిస్ వంటి సబ్జెక్ట్‌ల నుంచి అడుగుతున్న ప్రశ్నలు సైతం సమయస్ఫూర్తి, సునిశిత పరిశీలన, విశ్లేషణ సామర్థ్యం, సమయోచిత స్పందన ఉన్న సగటు అభ్యర్థి రాయగలిగే విధంగానే ఉంటున్నాయి. అంతేకాకుండా పీజీ, పీహెచ్‌డీ స్థాయి అభ్యర్థులకు అనుకూలం అనే మరో అపోహ ఉంది. ఇది కూడా అవాస్తవమే. బ్యాచిలర్ డిగ్రీతోనే సివిల్స్ సాధించిన వారెందరో. ముఖ్యంగా ఉత్తర భారతదేశంలో ఆ సంఖ్య ఎక్కువే. మన రాష్ట్రంలో ఎక్కువ మంది పీజీ తర్వాత మాత్రమే వీటిపై దృష్టి సారిస్తున్నారు కాబట్టి ఆ అపోహ ఏర్పడుతోందంటున్నారు నిపుణులు.

### టాప్-టెన్ ఎక్స్‌పెక్టెడ్ టాపిక్స్

- రాష్ట్రపతి ఎన్నికలు
- పౌర సమాజం-ఉద్యమాలు
- సోషల్ నెట్‌వర్క్ వెబ్‌సైట్స్- ప్రభావం-ప్రాధాన్యం
- శక్తి సంక్షోభం
- జీవ వైవిధ్యత
- రెండో తరం ఆర్థిక సంస్కరణలు- సంకీర్ణ ప్రభుత్వాలపై ప్రభావం
- మయన్మార్ తాజా రాజకీయ పరిణామాలు
- అందరికీ ఆరోగ్యం - ఆవశ్యకత- ప్రభుత్వ పాలసీ
- నీటి వనరుల నిర్వహణ
- అణు శక్తి, అణు శక్తి కేంద్రాల ఏర్పాటుపై నిరసనలు- కారణాలు

### ఎలా చదవాలి.. ఏది చదవాలి?

జనరల్ స్టడీస్ ప్రిపరేషన్‌లో వేధించే రెండు ప్రధాన ప్రశ్నలివి. దీనికి పరిష్కారం కూడా గత ప్రశ్న పత్రాల పరిశీలనే. ఇక.. ఎలా చదవాలి? అనే విషయానికొస్తే ఏ అంశమైనా అప్లికేషన్ (అన్వయం) దృక్పథంతో సాగాలి. అంటే సదరు అంశానికి సంబంధించి నిజ జీవితంలో, సమాజంలో దాని ప్రభావం, ఫలితాలు తెలుసుకుంటూ సాగాలి.

### నేపథ్యంపై దృష్టి:

చాలా మంది చేసే పొరపాటు.. నిర్దిష్ట అంశానికి సంబంధించి తాజా విషయ సేకరణతో సరిపుచ్చడమే. ముఖ్యంగా సమకాలీన అంశాల విషయంలో ఈ పొరపాటు ఎక్కువగా ఉంటుంది. కానీ ఆయా అంశాల నేపథ్యంపై కనీస అవగాహన ఏర్పరచుకోవాలి. ప్రశ్నలడిగే తీరును యూపీఎస్సీ ఏటేటా మార్చుతున్నందున ఈ తరహా ప్రిపరేషన్ ఎంతో ముఖ్యం. ఉదాహరణకు: ఇటీవల తాజాగా వెలుగు చూసిన విశ్వకణం (దైవకణం) విషయాన్ని తీసుకుంటే.. ఆ పరిశోధనలను ఉటంకిస్తూ.. బేసిక్ సైన్సెస్ పరిశోధనల్లో భారత్ వెనుకబడింది. దీనికి పరిష్కారం ఏంటి? అనే తరహాలో ప్రశ్న అడగొచ్చు. అదే విధంగా ఇటీవల కాలంలో ఒలింపిక్స్‌లో భారత్ ప్రదర్శన మెరుగవుతోంది? ఇదే సమయంలో సంప్రదాయక క్రీడల్లో (ఉదా: జాతీయ క్రీడ హాకీ తదితర) వెనుకబడుతున్నాం? ఎందుకు? అని అడగొచ్చు. ఇలాంటి ప్రశ్నలకు సమాధానం రాయాలంటే ఆయా అంశాల నేపథ్యంపై కనీస అవగాహన ఉంటేనే సాధ్యమవుతుంది.

### అనుసంధానం చేసుకుంటూ:

జీఎస్ ప్రిపరేషన్‌ను.. ఇతర అంశాలు, తాజా పరిణామాలతో అనుసంధానం చేసుకుంటూ సాగడం ఎంతో లాభిస్తుంది. సమయం ఆదా అవుతుంది. ఇటీవల కాలంలో హిస్టరీ మినహా అన్ని సబ్జెక్ట్‌ల ప్రశ్నలను కరెంట్ అఫైర్స్ అప్‌డేట్స్‌తో ముడిపెట్టి ప్రశ్నలు అడుగుతోంది. కాబట్టి ఆ కోణంలో తమ ప్రిపరేషన్ పరిధిని విస్తరించుకోవాలి. ముఖ్యంగా కోర్ సబ్జెక్ట్‌లుగా పేర్కొనే జాగ్రఫీ, పాలిటీ, ఎకానమీల్లో సమకాలీన అంశాలతో అనుసంధానం చేసుకుంటూ చదివే అవకాశం ఎక్కువగా ఉంటుంది. దీన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఉదాహరణకు పాలిటీకి సంబంధించి తాజా రాజ్యాంగ సవరణలు-కారణాలు, ఫలితాలు, రాజ్యాంగంలో వాటి మూలాలను రాసే విధంగా ప్రశ్నలుంటాయి. అదే విధంగా జాగ్రఫీకి సంబంధించిన అంశాలను తాజా పర్యావరణ సంబంధ పరిణామాలతో; ప్యూర్ ఎకానమీని ఎకనామిక్ జాగ్రఫీతో అనుసంధానం చేసుకోవచ్చు.

### జనరల్ ఎస్సేతోనూ:

జనరల్ స్టడీస్ ప్రిపరేషన్‌ను జనరల్ ఎస్సేకు కూడా అనుకూలించే విధంగా ఒకే సమయంలో పూర్తి చేసుకునే వీలుంది. జీఎస్ రెండు పేపర్లలో పేర్కొన్న సిలబస్ జనరల్ ఎస్సేలో పునరావృతం అవుతుంది. ఉదాహరణకు: జనరల్ స్టడీస్‌లో అడిగే అంతర్జాతీయ ఒప్పందాలు-నిర్ణయాలు; శక్తి, పర్యావరణం; ఆర్థిక అంశాలు జనరల్ ఎస్సేలో కూడా ఉంటాయి. కాబట్టి చదివేటప్పుడే ఆ కోణంలో చదవాలి.

### ఎవర్‌గ్రీన్ టాపిక్స్:

జీఎస్ విషయంలో ముఖ్యంగా మూడు విభాగాలు ఎవర్‌గ్రీన్ టాపిక్స్‌గా ఉంటున్నాయి. అవి.. శక్తి, పర్యావరణం, గ్రామీణాభివృద్ధి. అందువల్ల వీటిపై కచ్చితంగా దృష్టి పెట్టి అవసరమైన సమాచారాన్ని నిక్షిప్తం చేసుకోవాల్సిందే.

### నోట్స్ రూపకల్పలో:

విజయ సాధనలో ఎంతో ఉపకరించే సాధనం సొంత నోట్స్ రూపొందించుకోవడం. అయితే ఈ విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలి. చదివిన ప్రతి పదాన్ని, వాక్యాన్ని నోట్స్‌లో చేర్చకుండా.. సెలెక్టివ్‌గా అంశాలను ఎంచుకుని వాటిని పాయింట్ల రూపంలో నోట్స్‌లో పొందుపరచుకోవాలి. ఈ క్రమంలో ముఖ్యమైన అంశాలేంటి? అని తెలుసుకోవడానికి గత ప్రశ్న పత్రాల పరిశీలన లాభిస్తుంది. సెల్ఫ్ నోట్స్‌లో ప్రతి అంశానికి సంబంధించి నేపథ్యం రాసుకోవాలి. ఉదాహరణకు: రాష్ట్రపతి ఎన్నికలు అనే అంశాన్ని తీసుకుంటే దానికి నేపథ్యంగా ఎలక్టోరల్ కాలేజ్ అంటే ఏంటి? విధి విధానాలు? ఉంటేనే ఆ నోట్స్‌కు పరిపక్వత చేకూరుతుంది.

### కలిసొచ్చే రెండు ఆప్షనల్స్:

సివిల్స్ మెయిన్స్‌లో జాగ్రఫీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ ఆప్షనల్స్ ఎంచుకున్న అభ్యర్థులు జనరల్ స్టడీస్, జనరల్ ఎస్సే విషయంలో ముందుండేందుకు ఎంతో ఆస్కారం ఉంది. జాగ్రఫీలోని వ్యవసాయం, శక్తి, పరిశ్రమలు, రవాణా, ప్రాంతీయాభివృద్ధి, జియో-పాలిటిక్స్, పర్యావరణం వంటివి నేరుగా జనరల్ స్టడీస్ లేదా జనరల్ ఎస్సేలో ఉంటాయి. అదేవిధంగా పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పరిధిలోని రాజ్యాంగ సంస్థలు-నియామకాలు-తీరు తెన్నులు; ప్రభుత్వ పరిపాలన శైలి వంటివి కూడా జీఎస్, ఎస్సేల్లో ప్రతిబింబిస్తాయి.

### పద పరిమితికి అనుగుణంగానే:

జనరల్ స్టడీస్ విజయంలో భాగంగా అభ్యర్థులు ప్రిపరేషన్ నుంచే అలవర్చుకోవాల్సిన లక్షణం పదపరిమితికి కట్టుబడి ఉండటం. 20 పదాలు మొదలు 250 పదాల్లో రాయాల్సిన విధంగా ప్రశ్నలు ఉంటున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఒక అంశాన్ని ఎన్ని పదాల్లో అడిగితే ఎంత సమాచారంతో సమాధానం రాయాలో ముందుగానే అవగాహన తెచ్చుకోవాలి. 20 పదాల్లో సమాధానం ఆశిస్తే అంతకే పరిమితం కావాలి. అంతేతప్ప.. తెలిసిన అంశం కదా అని రాసుకుంటూ వెళితే అదనపు ప్రయోజనమేమీ ఉండదు. అదే విధంగా 250 పదాల్లో అడిగితే దానికనుగుణంగా రాసేలా సమాచారం ఉండాలి. దీనికి ప్రధాన మార్గం ప్రాక్టీస్. అంతేకాకుండా చాలామంది రెండు మార్కులకు అడిగే 20 పదాల ప్రశ్నలకు ప్రాధాన్యం ఇవ్వరు. కానీ ఈ రెండు మార్కుల ప్రశ్నలే మార్కులను పెంచేందుకు దోహదం చేస్తాయి. ఇటీవల కాలంలో రెండు మార్కుల ప్రశ్నల సంఖ్య కూడా పెరుగుతోంది. 2009లో పేపర్-1లో 20; 2010లో పేపర్-1లో 16; పేపర్-2లో 8 ప్రశ్నలు అడిగారు. సాధారణంగా ఈ ప్రశ్నలు నేరుగా ఉంటాయి. అంటే గొప్ప వ్యక్తులు; శాస్త్రవేత్తలు; ప్రధాన సంఘటనలు ఇలా. వీటికి సమాధానం కూడా నేరుగానే ఉండాలి. ఒక శాస్త్రవేత్త గురించి 2 మార్కులకు సమాధానం రాసేటప్పుడు అతని ప్రధాన ఆవిష్కరణలు, ఫలితాలకు పరిమితం కావాలి.

### ఫస్ట్-ఫైనల్ ఇలా:

తొలిసారి రాస్తున్న అభ్యర్థులు.. ప్రస్తుత సమయంలో కొత్త అంశాల జోలికి వెళ్లకుండా బాగా పట్టున్న అంశాలపై మరింత సమయం కేటాయించాలి. వాటినే పునశ్చరణ చేసుకోవాలి. చివరిసారి రాస్తున్న అభ్యర్థులు ముందుగా 'లాస్ట్ అటెంప్ట్' అనే ఆందోళన వీడాలి. ఇతరులతో పోల్చితే టైం మేనేజ్‌మెంట్, సెల్ఫ్ నోట్స్, రివిజన్ వంటి విషయాలు తమకు అనుకూలిస్తాయి అనే సానుకూల దృక్పథంతో ప్రిపరేషన్ సాగించాలి. ఓటమే గెలుపునకు నాంది అనే సూక్తినే స్ఫూర్తిగా తీసుకుంటే విజయం సాధించినట్లే.

### గత ప్రశ్న పత్రాల పరిశీలనతో



జీఎస్‌కు సంబంధించి గత మూడు, నాలుగేళ్ల ప్రశ్న పత్రాలను శాస్త్రీయంగా, క్షుణ్నంగా విశ్లేషిస్తే విజయానికి సగం చేరువైనట్లే. ఇక ప్రిపరేషన్ క్రమంలో ప్రతి అంశాన్ని లోతుగా చదవాల్సిన ఆవసరం లేదు. పేరుకు తగినట్లుగానే జనరల్‌గానే ప్రశ్నలు ఉంటాయి. చదివే సమయంలోనే విస్తృత దృక్పథంతో చదవాలి. కరెంట్ అఫైర్స్‌కు సంబంధించి ముఖ్యంగా గత ఆరు నెలల కాలంలోని ముఖ్య సంఘటనలను ఎట్టి పరిస్థితుల్లో విస్మరించకూడదు. ప్రస్తుత అభ్యర్థులు అందుబాటులోని రెండు నెలల సమయంలో తమ సామర్థ్యం మేరకు చదివే సమయంలో జనరల్ స్టడీస్‌కు 25 శాతం వెయిటేజీ ఇవ్వాలి. మిగతా సమయాన్ని సహజంగా తమకు పట్టుండే ఆప్షనల్స్‌కు కేటాయించాలి.

మల్లికార్జున్,
20వ ర్యాంక్, సివిల్స్ 2011 విజేత

### కోర్ సబ్జెక్టుల్లో పట్టు సాధిస్తూ..



ప్రస్తుత అభ్యర్థులు కోర్ సబ్జెక్టుల్లో పట్టు సాధిస్తూ వాటిని సమకాలీన పరిణామాలతో అనుసంధానం చేసుకుంటూ ప్రిపరేషన్ సాగించాలి. చదివే అంశాలను వాస్తవిక అన్వయ దృక్పథంతో చదవాలి. గత ఏడాది రెండు రకాల వాషింగ్ మెషీన్లను పేర్కొని వాటి మధ్య తేడాను రాయమని అడిగారు. ప్రస్తుతమున్న సమయంలో ప్రతి రోజు కనీసం మూడు గంటలు జనరల్ స్టడీస్‌కు కేటాయించాలి. అంతర్జాతీయ వ్యవహారాల విషయంలో 2011 సెప్టెంబర్ నుంచి చోటు చేసుకున్న మార్పులపై అవగాహన ఏర్పరచుకోవాలి. చాలామంది అభ్యర్థులు ఇష్టం లేదనో లేదా కష్టంగా ఉందనో కొన్ని అంశాలను విస్మరిస్తారు. ఇది సరి కాదు. పూర్తి స్థాయిలో పరిజ్ఞానం పొందలేకపోయినా.. సిలబస్‌లో ప్రతి అంశాన్ని స్పృశించేలా ప్రిపరేషన్ సాగించాలి. దీని వల్ల కనీస అవగాహన ఏర్పడుతుంది. ఒక్కోసారి పరీక్ష హాల్లో ఇదే చేయూతనందిస్తుంది.

ఎం. పవన్ కుమార్,
53వ ర్యాంక్, సివిల్స్-2011 విజేత

Sakshi Bhavita TVProgram on Facebook
facebook.com/sakshibhavita



# విపత్తులు, నష్టాలు, కారణాలపై అవగాహన అవసరం



సి. హరికృష్ణ
సివిల్స్ ఫ్యాకల్టీ, హైదరాబాద్

**ప్ర: సునామీ అంటే ఏంటి? సునామీ కారణాలు? సునామీ నిర్వహణకు భారత్‌లో చర్యలు ఏంటి?**

జ: సునామీ పదానికి మాతృక జపాన్. 'సు' అంటే ఓడరేవు; 'నామి' అంటే కెరటం అని అర్థం. సునామీ అంటే ఓడరేవును ముంచే సముద్ర కెరటం. ఏటా సగటున ఏదో ఒక ప్రాంతంలో రెండు సునామీలు సంభవిస్తున్నాయి. పదిహేనేళ్లకోసారి భారీ నష్టం కలిగించే సునామీ సంభవిస్తుంది. తీర ప్రాంతాల్లో జన సాంద్రత ఎక్కువగా ఉండటంతో సునామీల కారణంగా జరుగుతున్న ఆస్తి, ప్రాణ నష్టం భారీగానే ఉంటుంది. సముద్ర అడుగున భూకంపం ద్వారా జరిగే ఫలకల స్థానభ్రంశం ద్వారా జనించే నీటి తరంగం సునామీ. అయితే అగ్ని పర్వతాలు బద్ధలైనప్పుడు, గ్రహశకలాలు సముద్రంలో పడినప్పుడు కూడా సునామీ సంభవిస్తుంది. 1883 ఆగస్టు 27న ఇండోనేషియా తీరంలో క్రకటోవా అగ్ని పర్వతం బద్ధలైనప్పుడు; రెండు మిలియన్ సంవత్సరాల క్రితం చిలీ తీరంలో భారీ గ్రహశకలం పడినప్పుడు కూడా సునామీలు సంభవించాయి. ఈ కారణాల ద్వారా సముద్ర గర్భంలో అధిక సాంద్ర సముద్ర ఫలకం, అల్ప సాంద్ర ఖండ ఫలకం కిందికి జారినప్పుడు భారీ మోతాదులో నీరు స్థానభ్రంశం చెంది సునామీ సంభవిస్తుంది. రిక్టర్ స్కేల్‌పై 6.5 నుంచి 7.0 లేదా అంతకంటే తీవ్రతతో భూకంపం నమోదైనప్పుడు సునామీ సంభవిస్తుంది. 2004, డిసెంబర్ 26న సముద్ర తీరంలో 9.3 తీవ్రతతో; 2011 మార్చి 11న జపాన్‌లో 8.9 తీవ్రతతో భూకంపాలు సంభవించి భారీ నష్టం వాటిల్లింది.

పొడవైన తీర రేఖ ఉండటంతో భారత్‌కు కూడా సునామీ ముప్పు పొంచి ఉంది. 1762, 1868, 1881, 1883, 1884, 1945 లలో భారత్‌లో సునామీలు సంభవించినట్లు నిదర్శనాలు ఉన్నాయి. ఈ శతాబ్దంలో 2004, డిసెంబర్ 26న సంభవించిన సునామీ ప్రభావానికి 12, 400 మంది దుర్మరణం పాలయ్యారు. తొలుత సుమత్రాలో ప్రారంభమైన సునామీ ప్రభావం మన దేశ తీరాన్ని తాకడానికి రెండు గంటల సమయం పట్టింది. ఈ రకమైన ముప్పును ముందుగానే ఊహించడం ఎంతో ముఖ్యం. ప్రారంభం నుంచి సునామీని పసిగట్టే వ్యవస్థను ఏర్పరచినట్లయితే 2004లో సునామీ నష్టాన్ని నివారించే అవకాశం ఉండేది.

కొద్దిగా ఆలస్యమైనా భారత ప్రభుత్వం 2007లో హైదరాబాద్‌లోని Indian National Centre for Ocean Information Services (INCOIS) వద్ద సునామీ ముందస్తు హెచ్చరిక కేంద్రాన్ని నెలకొల్పింది. ప్రస్తుతం సునామీ సంభవించిన ఆరు నుంచి ఎనిమిది నిమిషాల్లోపే ఈ కేంద్రం ఆ విషయాన్ని గుర్తించగలుగుతుంది. సునామీ సమాచారాన్ని వేగంగా అందించే లక్ష్యంతో భారత వాతావరణ విభాగం.. Real Time Sesmic Monitoring Network (R TSMN)ను ఏర్పాటు చేసింది. సునామీ తరంగం జనించగల అవకాశం ఉన్న భూకంపాలను పసిగట్టే లక్ష్యంతో చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ (NIOT) బంగాళాఖాతంలో నాలుగు; అరేబియా సముద్రంలో రెండు Bottom Pressure Recorderలను ఏర్పాటు చేసింది. సునామీ తరంగ దిశను, వేగాన్ని నిర్ధారించేందుకు ఇప్పటికే 30 టైడ్ గేజ్‌లను కూడా సముద్రంలో ఏర్పాటు చేశారు. సునామీ సమగ్ర నిర్వహణ కోసం 2010 సెప్టెంబర్ 3న జాతీయ విపత్తు నిర్వహణ సంఘం మార్గదర్శకాలను విడుదల చేసింది.

**ప్ర: వర్తమాన పారిశ్రామిక అభివృద్ధి గురించి క్లుప్తంగా రాయండి?**

జ: దేశ స్థూల జాతీయోత్పత్తి వృద్ధిలో పారిశ్రామిక వృద్ధి ఎంతో కీలక పాత్ర పోషించింది. గనులు, తయారీ రంగం, విద్యుత్ రంగాల్లో ఆర్థిక సంస్కరణల తర్వాత 1991-92 నుంచి 2011-12 వరకు సగటున 6.7 శాతం వృద్ధి నమోదు కాగా.. అదే కాలంలో జీడీపీ 6.9 శాతం వృద్ధి చూపించింది. నిర్మాణ రంగాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటే ఈ కాలంలో పారిశ్రామిక రంగం ఏడు శాతం వృద్ధి చెందింది. పారిశ్రామిక రంగంలో ఉపాధి కల్పన కూడా క్రమంగా పెరిగింది. 1999-2000 మధ్య కాలంలో 64.6 మిలియన్ల మంది పారిశ్రామిక రంగంలో పని చేయగా.. 2009-10 నాటికి ఇది 100.7 మిలియన్లకు పెరిగింది. దేశంలో మొత్తం ఉపాధి కల్పనలో 1999-2000 ఆర్థిక సంవత్సరంలో 16.2 శాతం ఉన్న పారిశ్రామిక రంగం వాటా 2009-10 నాటికి 21.9 శాతానికి పెరిగింది. ముఖ్య రంగాల వారీగా పారిశ్రామిక అభివృద్ధిని పరిశీలిస్తే వస్త్ర పరిశ్రమలో 2010-11 కాలంలో ఎగుమతుల విలువ 26.82 బిలియన్ డాలర్లుగా నమోదైంది. 2009-10తో పోల్చితే 19.66 శాతం వృద్ధి సాధించింది. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) అంచనా ప్రకారం ప్రపంచ వస్త్ర ఎగుమతుల్లో భారత్ ఆరో స్థానంలో ఉంది. 35 మిలియన్ల మందిపైగా ఈ రంగంలో ఉపాధి పొందుతున్నారు. ఎరువుల ఉత్పత్తిలో చైనా, అమెరికా తర్వాత భారత్ మూడో స్థానంలో ఉంది. వినియోగంలో మాత్రం చైనా తర్వాత రెండో స్థానంలో నిలిచింది. 2008-09లో 24.91 మిలియన్ టన్నుల ఎన్‌పీకే ఎరువులు వినియోగిస్తే.. ఆ మొత్తం 2009-10లో 26.49 మిలియన్ టన్నులకు పెరిగింది. వ్యవసాయ రంగంలో దాదాపు 80 శాతం వినియోగంలో ఉన్న యూరియాను దేశీయంగానే ఉత్పత్తి చేస్తున్నాం. మిగతా మొత్తాన్ని దిగుమతి చేసుకుంటున్నాం. అదే విధంగా 90 శాతం పాస్ఫారిక్ ఎరువులను దిగుమతి చేసుకుంటున్నాం.

వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగాల్లో ఒకటి. సముద్ర ఉత్పతులు, డైరీ ఉత్పత్తులు, ధాన్యం, మాంసం, పండ్లు, కూరగాయలు, చక్కెర, నూనెలు, పానీయాలు ముఖ్యమైన ఉత్పత్తులు. 2011-12 ఆర్థిక సంవత్సరంలో 27 శాతం వృద్ధి నమోదైంది. దేశంలో దిగుబడి అనంతర నష్టం దాదాపు ₹ 44 వేల కోట్ల మేర ఉంటుందని అంచనా. సరైన రీతిలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో విధానాలను అమలు చేస్తే మరింత వృద్ధి, ఉపాధి నమోదవుతుంది.

చైనా, జపాన్, అమెరికా తర్వాత జనవరి-నవంబర్ 2011 మధ్య కాలంలో ముడి స్టీల్ ఉత్పాదనలో భారత్ నాలుగో స్థానంలో ఉంది. స్పాంజ్ ఐరన్ ఉత్పత్తిలో 2010-11 మధ్య కాలంలో దేశీయ ముడి స్టీల్ ఉత్పాదన 84 శాతం నమోదు చేసుకుంది. ఆటోమోటివ్ రంగం, హెవీ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ రంగాల్లో కూడా వృద్ధి నమోదవుతోంది. ప్యాసింజర్ వెహికిల్స్ ఉత్పాదనలో 2011 ఏప్రిల్-నవంబర్ మధ్య కాలంలో 2.9 శాతం వృద్ధి నమోదైంది.

కమర్షియల్ వెహికల్స్ ఉత్పాదనలో ఇదే కాలంలో అధికంగా 25.9 శాతం వృద్ధి సాధ్యమైంది. ఎలక్ట్రానిక్స్ హార్డ్‌వేర్ ఉత్పాదనలో 2009-10లో ₹ 1,10,720 కోట్ల విలువైన ఉత్పత్తులు నమోదు కాగా.. 2010-11లో అది ₹ 1, 21, 760 కోట్లకు పెరిగింది. 2010-11లో ఈ రంగంలో ఎగుమతులు 56 శాతం పెరిగాయి. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల వృద్ధి కూడా క్రమంగా పెరిగింది. దేశంలో దాదాపు 105.21 లక్షల యూనిట్లు ఉన్నాయి. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ), ఐటీ ఆధారిత సేవల్లో కూడా భారత్ వృద్ధి చెందింది. నాస్కామ్ అంచనాల ప్రకారం 2011-12లో ఐటీ, బీపీఓ రంగాల రెవెన్యూ 87.6 బిలియన్ డాలర్లు. ఈ రంగాల్లో ప్రత్యక్షంగా 2.8 మిలియన్ల మంది, పరోక్షంగా 8.9 మిలియన్ల మంది ఉపాధి పొందుతున్నారు. 1997-98లో జీడీపీలో దీని వాటా 1.2 శాతం ఉండగా.. 2011-12 నాటికి 7.5 శాతానికి పెరిగింది. 2010-11లో సాఫ్ట్‌వేర్ ఎగుమతుల విలువ 59 బిలియన్ డాలర్లు. కాగా.. 2011-12లో 69 బిలియన్ డాలర్లకు హెచ్చిందని అంచనా.

**ప్ర: చీడపీడల నివారణ అంటే ఏంటి? భారత్‌లో చీడపీడల నివారణ కోసం అవలంబిస్తున్న కార్యక్రమం గురించి రాయండి?**

జ: పంట దిగుబడిని ప్రభావితం చేసే అంశాల్లో ప్రధానమైంది చీడపీడలు. వీటిని నివారించలేకపోతే తీవ్రమైన పంట నష్టం సంభవిస్తుంది. పంట సమయంలో, దిగుబడి తర్వాత కూడా చీడపీడల సమస్య ఎక్కువగా ఉంటుంది. భారత వ్యవసాయంలో దిగుబడి అనంతర నిర్వహణ లోపం ద్వారా ఏటా ₹ 44 వేల కోట్ల నష్టం వాటిల్లుతున్నట్లు అంచనా. దిగుబడికి ముందు నష్టం మరింత తీవ్రంగా ఉంటుంది.

**చీడపీడల నివారణకు రెండు మార్గాలు ఉంటాయి. అవి..**

- ప్రొఫిల్లాక్సిస్ నివారణ: చీడపీడలను పంట దరి చేరనీయని మార్గాలు, క్రిమి సంహారకాల వినియోగం ఈ మార్గంలో ఉంటాయి.
- ఇమ్యునైజేషన్: సంకరీకరణ, ట్రాన్స్‌జెనిక్స్ ద్వారా చీడపీడను నిరోధించే పంటల అభివృద్ధిని చేపట్టడం.

భారత్‌లో కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని వ్యవసాయ, సహకార విభాగం చీడపీడల నివారణకు నాలుగు కార్యక్రమాలను అమలు చేస్తోంది. అవి

- సమగ్ర సస్య రక్షణ (ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్‌మెంట్ -ఐపీఎం)
- లోకస్ట్ నియంత్రణ, పరిశోధన
- సస్యరక్షణలో శిక్షణ
- క్రిమి సంహారక చట్టం అమలు

ప్రణాళిక సంఘం సిఫార్సు మేరకు ఈ నాలుగు కార్యక్రమాలను కలిపి Strengthening and Modernisation of Pest Management Approach in India అనే కార్యక్రమంగా రూపకల్పన చేశారు.

ఐపీఎం: సాధ్యమైనన్ని విభిన్న పద్ధతులను అనుసరించి చీడపీడలను నియంత్రణలో ఉంచాలనేదే ఐపీఎం లక్ష్యం. న్యూఢిల్లీ ప్రధాన కేంద్రంగా ఉన్న నేషనల్ సెంటర్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్‌మెంట్ చీడపీడల కార్యక్రమాన్ని చేపడుతోంది.

**ఇందులో ముఖ్యమైన అంశాలు:**

- ప్లాంటింగ్ మెటీరియల్ పూర్తిగా శుద్ధి చేయడం, క్వారెంటైన్ వ్యవస్థలను నిర్వహించడం.
- రైతులందరూ సమిష్టిగా పంట మార్పిడిని అవలంబించడం
- సాధ్యమైనంత తక్కువగా రసాయన క్రిమి సంహారకాలను వినియోగించడం, వాటి స్థానంలో జీవ క్రిమి సంహారకాలను వినియోగించడం.
- క్షేత్ర పారిశుద్ధ్యాన్ని నిర్వహించడం.
- దిగుబడిని సరైన రీతిలో నిల్వ చేయడం.
- క్రిమి నిరోధక పంటలను అభివృద్ధి చేయడం.

**లోకస్ట్ నియంత్రణ, పరిశోధన:**

గుజరాత్, హర్యానా, రాజస్థాన్ సరిహద్దులుగా ఉన్న పాకిస్థాన్ భూభాగంలో లోకస్ట్ అనే కీటకం బెడద చాలా తీవ్రంగా ఉంది. ఈ కీటకాలు భారీ సమూహాల్లో వచ్చి పంటను నష్టపరుస్తాయి. లోకస్ట్ దాడిని నివారించడానికి జోధ్‌పూర్‌లో లోకస్ట్ వార్నింగ్ ఆర్గనైజేషన్ ఏర్పాటైంది. రెండు లక్షల చదరపు కిలో మీటర్ల విస్తీర్ణంలోని ప్రాంతాన్ని ఈ కేంద్రం నిర్వహిస్తుంది.

**సస్యరక్షణలో శిక్షణ:**

దేశంలో 1966 వరకు సస్యరక్షణలో శిక్షణ అందుబాటులో లేదు. నిరంతర చీడపీడల నివారణ కోసం రైతులకు సేవలందించే వ్యవసాయ అధికారులకు శిక్షణ అవసరం. ఇదే ఉద్దేశంతో 1966లో హైదరాబాద్‌లో నేషనల్ ప్లాంట్ ప్రొటెక్షన్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటైంది. దీనికి ఎఫ్ఏఓ అండ్ డబ్ల్యూబీ గుర్తింపు కూడా ఉంది.

**క్రిమి సంహారక చట్టం(1968) అమలు:**

దేశంలో క్రిమి సంహారకాల ఉత్పత్తి, వినియోగం, దిగుమతిని నియంత్రించే లక్ష్యంతో ఈ చట్టం అమలవుతోంది. ఈ చట్టంలోని వివిధ అంశాల అమలుకు సెంట్రల్ ఇన్‌సెక్టిసైడ్ బోర్డ్ అనే ప్రత్యేక విభాగాన్ని కూడా ఏర్పాటు చేయడం జరిగింది.

## ఎక్స్‌పెక్టెడ్ కొశ్చన్స్

- దేశంలో వర్ధమాన శాస్త్ర, సాంకేతిక రంగ అభివృద్ధిని చర్చించండి?
- తుఫాన్ అంటే ఏంటి? తుఫాన్ ఏర్పడే విధానం? దేశంలో తుఫాన్ నిర్వహణ గురించి రాయండి?
- భారత్‌పై శీతోష్ణస్థితి మార్పు ప్రభావాలను చర్చించండి? శీతోష్ణస్థితి ప్రభావాలను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేంటి?
- దేశంలో తాగునీటి సరఫరాలో ఉన్న సమస్యలను, పరిష్కార మార్గాలను రాయండి?
- విపత్తు నిర్వహణకు ఉద్దేశించి దేశంలో అమలవుతున్న కార్యక్రమాల గురించి క్లుప్తంగా రాయండి?
- ఎరువులు ఎన్ని రకాలు? దేశంలో ఎరువుల ఉత్పత్తి, వినియోగం గురించి రాయండి?
- పంట విజ్ఞానం అంటే ఏంటి? భారత్ సాధించిన పంట విజ్ఞానం, అభివృద్ధి గురించి తెలపండి?
- దేశంలో విపత్తులు, విపత్తు ద్వారా సంభవిస్తున్న నష్టాలకు కారణాలను వివరించండి?

## టిప్స్ టు స్కోర్ మోర్

- ఈ యూనిట్‌లోని అంశాల్లో ముఖ్యమైనవి విపత్తు నిర్వహణ, శీతోష్ణస్థితి మార్పు. ఈ రెండు అంశాలు జనరల్ ఎస్సేకు కూడా ఉపయోగపడతాయి.
- దేశంలో విపత్తులు, వాటి ద్వారా సంభవిస్తున్న నష్టాలు కారణాలపై అవగాహన అవసరం.
- నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ మార్గదర్శకాలపై కచ్చిత సమాచారం ఉంచుకోవాలి.
- గ్లోబల్ వార్మింగ్, ఇంటర్‌గవర్నమెంటల్ ప్యానల్ ఆన్ క్లైమేట్ ఛేంజ్ నివేదికలోని ముఖ్యాంశాలను పునశ్చరణ చేసుకోవాలి.
- అంతర్జాతీయ స్థాయిలో 1992 నాటి ధరిత్రీ సదస్సు మొదలు క్యోటో ప్రోటోకాల్, 2011 డర్బన్ సదస్సు తదితర పర్యావరణ సంబంధ సమకాలీన అంశాలపై దృష్టి సారించాలి.
- అదేవిధంగా జాతీయ స్థాయిలో అమలవుతున్న నేషనల్ యాక్షన్ ప్లాన్ ఆన్ క్లైమేట్ ఛేంజ్ గురించి కూడా సమాచార సేకరణ చేసుకోవాలి.

# ఎస్‌బీఐ క్లర్క్.. సుస్థిర కెరీర్‌కు తొలిమెట్టు

బ్యాంకు కొలువంటే... సుస్థిరమైన కెరీర్ సొంతమైనట్లే. భవిష్యత్తుకు బంగారు బాట పడినట్లే. అందుకే సాధారణ క్లర్క్ నుంచి స్పెషలైజ్డ్ ఆఫీసర్ల వరకు ఏ కేటగిరీ అయినా.. నియామక ప్రకటన వెలువడితే చాలు.. దరఖాస్తులు వెల్లువెత్తుతాయి. ఇంటర్మీడియెట్ మొదలు ఇంజనీరింగ్, పీజీ ఉత్తీర్ణులు సైతం కొలువు ఖాయం చేసుకునేందుకు కసరత్తు చేస్తారు. ముఖ్యంగా ఇటీవల కాలంలో బ్యాంకింగ్ రంగం విస్తరిస్తుండటంతో అందుకు అవసరమైన మానవ వనరుల కోసం బ్యాంకుల్లో భారీ స్థాయిలో నియామకాలు సాగుతున్నాయి. ఈ క్రమంలో తాజాగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అసోసియేట్ బ్యాంకుల్లో 7,740 క్లర్క్ పోస్టుల భర్తీకి విడుదలైన నోటిఫికేషన్, రిక్రూట్‌మెంట్ పరీక్ష వివరాలు, విజయ వ్యూహాలపై విశ్లేషణ..



దేశంలోనే అతి పెద్ద బ్యాంకింగ్ సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.. తన వ్యాపార కార్యకలాపాల విస్తరణ దిశగా శరవేగంగా అడుగులు వేస్తోంది. ఇదే సమయంలో అందుకు తగినంత సిబ్బంది నియమించుకోవడానికి కూడా నిరంతరం నియామక నోటిఫికేషన్లు విడుదల చేస్తోంది. తాజాగా అయిదు అసోసియేట్ బ్యాంకులు స్టేట్ బ్యాంక్ ఆఫ్ బికనీర్ అండ్ జైపూర్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ మైసూర్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ పాటియాల, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ట్రావన్‌కోర్‌లలో 7,740 క్లర్క్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.

## పరీక్ష ద్వారా:

మొత్తం పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేసే క్రమంలో ముందుగా రాత పరీక్ష నిర్వహించనుంది. ఈ రాత పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో జనరల్ అవేర్‌నెస్; జనరల్ ఇంగ్లిష్; క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్; రీజనింగ్ ఎబిలిటీ; మార్కెటింగ్ ఆప్టిట్యూడ్ అండ్ కంప్యూటర్ నాలెడ్జ్ విభాగాల్లో ఉంటుంది. అందుబాటులోని ఖాళీలు, అభ్యర్థుల ప్రతిభ ఆధారంగా కటాఫ్ నిర్ణయించి తదుపరి దశ ఇంటర్వ్యూకి ఒక్కో పోస్టుకు ఇద్దరిని చొప్పున ఎంపిక చేస్తారు. కటాఫ్ మాత్రమే కాకుండా కనీస అర్హత మార్కులను కూడా బ్యాంక్ నిర్ణయిస్తుంది.

కాబట్టి పరీక్షలో అత్యంత మెరుగైన ప్రతిభ చూపితేనే తదుపరి దశకు అవకాశం లభిస్తుంది.

## ప్రిపరేషన్ ఇలా:

బ్యాంక్ పరీక్ష అంటే పోటీ అత్యంత తీవ్రంగా ఉంటుంది. రెండేళ్ల క్రితం ఎస్‌బీఐ నిర్వహించిన 20 వేల క్లర్క్ పోస్టుల పరీక్షకు పదిలక్షలకుపైగా దరఖాస్తులు రావడమే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం. కనీస అర్హత ఇంటర్మీడియెట్ మాత్రమే కావడంతో ఇంటర్మీడియెట్ నుంచి పీజీ, ఎంబీఏ, ఎంసీఏ వంటి ప్రొఫెషనల్ కోర్సుల ఉత్తీర్ణులు కూడా దరఖాస్తు చేసుకోవడమే ప్రధాన కారణం. ఈసారి కూడా పోటీ ఇదే స్థాయిలో ఉండే అవకాశాలు ఉన్నాయి. దీంతో అభ్యర్థులు అందుబాటులో ఉన్న రెండు నెలల సమయంలో కఠోరంగా శ్రమిస్తేనే విజయం సాధ్యమవుతుంది.

## వేగం.. వేగం.. అదే విజయ మంత్రం:

బ్యాంకు పరీక్షల్లో విజయ సాధనలో అత్యంత కీలక పాత్ర పోషించే అంశం వేగం. ప్రశ్నలు ఆబ్జెక్టివ్ విధానంలో ఉన్నప్పటికీ.. వాటి సాధనలో అన్వయ సామర్థ్యం అవసరం ఎంతగానో ఉంటుంది. మరోవైపు అందుబాటులోని సమయం కూడా పరిమితమే. ముఖ్యంగా క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ విభాగంలో గణిత సంబంధ ప్రశ్నలకు సమాధానం కనుక్కోవాలంటే అంచెలవారీగా (స్టెప్‌వైజ్) నిర్దిష్ట సమస్యను పరిష్కరిస్తూ సాగాలి. అదే విధంగా జనరల్ ఇంగ్లిష్ విభాగంలోని ప్యాసేజ్ ఆధారిత ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలంటే వేగంగా చదవడం; కీలక పదాలను గుర్తించడం; ప్యాసేజ్ కింద అడిగిన ప్రశ్నను చదువుతున్నప్పుడే దానికి సంబంధించిన సమాధానం ప్యాసేజ్‌లో ఎక్కడ ఉందో జ్ఞప్తికి తెచ్చుకోవడం వంటి నైపుణ్యాలు సొంతం చేసుకోవాలి. వీటన్నిటికీ ప్రధాన పరిష్కారం నిరంతర ప్రాక్టీస్. ఒక అంశాన్ని చదువుతున్నప్పుడు దానికి సంబంధించిన ప్రీవియస్ ప్రశ్నలను పరిశీలించాలి. అంతేకాకుండా ప్రతి చాప్టర్ పూర్తయ్యాక స్వీయ సమయ పరిమితి విధించుకుని సెల్ఫ్ టెస్ట్ రాయాలి. తొలి దశలో తెలిసిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి. అవి ఎంత సమయంలో పూర్తయ్యాయో గుర్తించాలి. అక్కడితో ఆగకుండా తెలియని ప్రశ్నలకు సమాధానం ఇచ్చేందుకు ఉపక్రమించాలి. ఇలా.. రెండు దశల్లో సెల్ఫ్ టెస్ట్ పూర్తి చేసుకుని నిరాటంకంగా ఎన్ని ప్రశ్నలకు సమాధానం ఇవ్వగలిగారు? ఎన్ని ప్రశ్నల్లో దోషాలు తలెత్తాయి? అని విశ్లేషించుకోవాలి. సమాధానం ఇవ్వలేని ప్రశ్నలు పరీక్ష కోణంలో ముఖ్యమైనవా? కాదా? అని పరిశీలించాలి. ఇందుకోసం గత నాలుగైదేళ్ల ప్రశ్న పత్రాలను శాస్త్రీయంగా విశ్లేషించాలి. ఆ చాప్టర్‌లోని అంశాలకు లభిస్తున్న వెయిటేజీని గుర్తించి దానికనుగుణంగా సాగాలి. వెయిటేజీ ఎక్కువగా ఉండి, కష్టంగా ఉన్న టాపిక్స్‌కు శిక్షణ తీసుకోవడానికి వెనుకాడొద్దు.

## ప్రిపరేషన్‌లోనూ టైం మేనేజ్‌మెంట్:

సాధారణంగా ప్రిపరేషన్ క్రమంలో అభ్యర్థులు ముందుగా తమకు పట్టున్న అంశాలను పూర్తి చేసి తర్వాత మిగతా వాటిపై దృష్టి మళ్లించే ఆలోచనతో ఉంటారు. కానీ ఇది సరి కాదు. దీనివల్ల ప్రిపరేషన్ చివరి దశకు వచ్చేటప్పటికి కొన్ని అంశాలు పూర్తికాని పరిస్థితి తలెత్తే ప్రమాదం ఉంది. ఇది పరీక్షలో ప్రతికూల ప్రభావం చూపుతుంది. కాబట్టి.. ప్రతి రోజు ప్రతి సబ్జెక్ట్‌ను చదివేలా టైం మేనేజ్‌మెంట్ పాటించాలి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమయాన్ని పరిగణనలోకి తీసుకుంటే ప్రతి రోజు కనీసం 8 నుంచి పది గంటలు ప్రిపరేషన్‌కు కేటాయించి.. సమయం పరంగా ప్రతి సబ్జెక్ట్‌కు సమ ప్రాధాన్యం ఇవ్వాలి. అంతేకాకుండా ప్రతి రోజు చదివిన అంశాల పునశ్చరణకు కొంత సమయం కేటాయించుకోవాలి. అదే విధంగా ప్రతివారం ఆ వారంలో చదివిన వాటిని పునశ్చరణ చేసుకోవాలి. అంతేకాని మూస ధోరణిలో చదువుకుంటూ వెళితే అవగాహన స్థాయి ఏ మేరకు ఉందో తెలుసుకోవడం కష్టమవుతుంది. ఇప్పటికే పలు బ్యాంక్ పరీక్షలు రాసిన అభ్యర్థులు వాటిలో తమకు వచ్చిన మార్కులు, ఎందులో వెనుకంజలో ఉన్నామో గమనించి, ఆ అంశాలపై మరింత దృష్టి సారించాలి. పరీక్షకు రెండు వారాల ముందు నుంచి రివిజన్‌కే కేటాయించాలి.

## మాక్ టెస్ట్‌లు:

అభ్యర్థులు గుర్తుంచుకోవాల్సిన మరో ప్రధానాంశం మాక్ టెస్ట్‌లకు హాజరు కావడం. కనీసం అయిదు మాక్ టెస్ట్‌లకైనా హాజరు కావాలి. కోచింగ్ సెంటర్లు, కాంపిటీటివ్ వెబ్ పోర్టల్స్ తదితర మార్గాల ద్వారా మాక్‌టెస్ట్‌లకు హాజరయ్యే అవకాశం అందుబాటులో ఉంది. దీన్ని వినియోగించుకోవాలి. నిర్దేశిత సమయంలో ఎన్ని ప్రశ్నలు పూర్తి చేశాం? ఎన్ని సరైన సమాధానాలిచ్చాం? అని విశ్లేషించుకోవాలి.

## హైస్కూల్ స్థాయిలోనే:

ఎస్‌బీఐ క్లర్క్ పరీక్షలో నిర్దేశించిన విభాగాల్లోని ప్రశ్నలు పదో తరగతి లేదా ఇంటర్మీడియెట్ స్థాయిలోనే ఉంటా యి. జనరల్ అవేర్‌నెస్ విభాగం ప్రశ్నలు కూడా సమాజం, పరిసరాలపై అవగాహన ఉంటే సమాధానం ఇచ్చేవిగానే ఉంటాయి. కాబట్టి అభ్యర్థులు ఆందోళన చెందక్కర్లేదు. అయితే ఆయా విభాగాలకు సంబంధించి కొన్ని మెళకువలు పాటిస్తే విజయావకాశాలు మెరుగుపరచుకోవచ్చు.

### రిఫరెన్స్ బుక్స్

- ఆబ్జెక్టివ్ అర్థమెటిక్ - ఎస్.ఎల్ గులాటీ
- న్యూమరికల్ ఆప్టిట్యూడ్ ఫర్ బ్యాంకింగ్ - దిల్లాన్ పబ్లికేషన్స్
- డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ సఫిషియన్సీ - కిరణ్ పబ్లికేషన్స్
- మార్కెటింగ్ - ఫిలిప్ కోట్లర్
- నాన్ వెర్బల్ రీజనింగ్ - ప్రభాత్ జావేద్
- అనలిటికల్ రీజనింగ్ - ఎం.కె. పాండే
- వెర్బల్ రీజనింగ్ - ఆర్.ఎస్. అగర్వాల్
- ఇంగ్లిష్ ఫర్ కాంపిటీటివ్ ఎగ్జామ్స్ - హరిమోహన్ ప్రసాద్
- ఇంగ్లిష్ ఫర్ కాంటిటీటివ్ ఎగ్జామ్స్ - ఎ.కె. కపూర్

## విభాగాల వారీగా ప్రిపరేషన్ టిప్స్

### జనరల్ అవేర్‌నెస్:

ఈ విభాగంలో రాణించాలంటే సమకాలీన అంశాలు, ఆర్థిక-సామాజిక-రాజకీయ పరిణామాలపై దృష్టి పెట్టాలి. బ్యాంక్ పరీక్ష కాబట్టి వ్యాపార రంగంలో మార్పులపై అవగాహన ఏర్పరచుకోవడం లాభిస్తుంది. ఈ క్రమంలో తాజా వాణిజ్య ఒప్పందాలు, స్టాక్ మార్కెట్ మార్పులు వంటి వాటిపై పరిజ్ఞానం అవసరం. స్టాండర్డ్ జీకే విషయానికొస్తే శాస్త్రవేత్తలు-ఆవిష్కరణలు; ఆయా రంగాలకు సంబంధించి మొదటి వ్యక్తులు (ఉదా: భారత్‌లో మొదటి మహిళా గవర్నర్ లేదా అంతరిక్షంపై కాలుమోపిన మొదటి వ్యక్తి తదితర); అతి పెద్ద- అతి చిన్న అంశాలు (ఉదా: అత్యంత ఎత్తైన పర్వతం లేదా అత్యంత పొడవైన నది తదితర) తెలుసుకోవాలి.

### జనరల్ ఇంగ్లిష్:

బ్యాంక్ పరీక్షలో అభ్యర్థులు క్లిష్టంగా భావించే విభాగం జనరల్ ఇంగ్లిష్ అనడంలో సందేహం లేదు. అయితే దీన్ని సులువుగానే అధిగమించొచ్చు. ముఖ్యంగా యాంటానిమ్స్, సినానిమ్స్, వొక్యాబులరీ, బేసిక్ గ్రామర్‌పై పట్టు సాధించాలి. వొక్యాబులరీపై అవగాహనతో పది మార్కులకు ఉండే కాంప్రహెన్షన్ ప్యాసేజ్ ఆధారిత ప్రశ్నలకు సులభంగా సమాధానం ఇవ్వొచ్చు. వొక్యాబులరీ పెంచుకోవడానికి మార్గం వేగంగా చదివే నైపుణ్యాన్ని అలవర్చుకోవడమే. ఇందుకోసం ప్రతిరోజు దినపత్రికలు వాటిలో వ్యాసాలు; వినియోగించిన పదాలు గమనించి నోట్ చేసుకోవాలి. ఇక మరో ముఖ్యమైన అంశం స్పాటింగ్ ది ఎర్రర్స్. దీనికోసం బేసిక్ గ్రామర్, సబ్జెక్ట్-వెర్బ్ సంబంధం, టెన్సెస్‌లో అవగాహన ఉండాలి. రీఎరేంజ్‌మెంట్ ఆఫ్ సెంటెన్సెస్‌లో నైపుణ్యం కోసం ఫ్రేజెస్, మీనింగ్స్, ప్రిపోజిషన్స్, ఆర్టికల్స్‌లో బాగా ప్రిపరేషన్ సాగించాలి. స్పెల్లింగ్స్‌లోనూ పట్టు సాధించాలి. దీని కోసం ప్రతిరోజు డిక్షనరీలో కొన్ని పదాలను నేర్చుకోవాలి. ఇలా పదో తరగతి స్థాయిలోని గ్రామర్ అంశాలపై అవగాహన పెంచుకుంటే ఇంగ్లిష్ సులభమే.

### రీజనింగ్:

ఎలాంటి నిర్దిష్ట సిలబస్ లేకుండా అభ్యర్థుల్లోని తులనాత్మక, విశ్లేషణాత్మక నైపుణ్యాలను పరీక్షించే విభాగం రీజనింగ్. సిరీస్, అనాలజీ, బ్లడ్ రిలేషన్స్, క్లాసిఫికేషన్స్, ఆల్ఫాబెట్స్, నంబర్స్, డైరెక్షన్స్ వంటి నాన్ వెర్బల్ రీజనింగ్‌పై అధిక దృష్టి సారిస్తున్నారు.

### మార్కెటింగ్ ఆప్టిట్యూడ్-కంప్యూటర్ అవేర్‌నెస్:

కేవలం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రిక్రూట్‌మెంట్ పరీక్షలో మాత్రమే కనిపించే విభాగం మార్కెటింగ్ ఆప్టిట్యూడ్ అండ్ కంప్యూటర్ అవేర్‌నెస్. అయితే వాస్తవానికి ఈ విభాగంలోని ప్రశ్నలు సులభంగా ఉంటున్నాయనేది నిపుణుల అభిప్రాయం. మార్కెటింగ్‌కు సంబంధించి ఆయా బ్యాంకులు, ఇతర వాణిజ్య సంస్థల కొత్త ప్రొడక్ట్‌లు, సేవలు, కొటేషన్లను ఔపోసన పట్టాలి. ఇక కంప్యూటర్ అవేర్‌నెస్‌లో రాణించాలంటే కంప్యూటర్‌కు సంబంధించి ప్రాథమిక పరిజ్ఞానం ఉంటే సరిపోతుంది. ఈ నేపథ్యంలో కంప్యూటర్లు, ఆయా ప్రోగ్రామింగ్స్‌లో వినియోగించే పదజాలంపై ప్రధానంగా దృష్టి సారించాలి.




### క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్:

గణిత శాస్త్రానికి సంబంధించిన ప్రశ్నలు అడిగే ఈ విభాగంలో రాణించాలంటే ప్రతి సంఖ్యకు వర్గాలు, ఘనాలు, కూడికలు, తీసివేతలు, గుణకారాలు, భాగహారాలు, క.సా.గు, గ.సా.భా. వంటి బేసిక్స్‌ను ఔపోసన పట్టాల్సిందే. న్యూమరికల్ ఎబిలిటీ కోసం టేబుల్స్, పై చార్ట్స్, లైన్ గ్రాఫ్స్, బార్ గ్రాఫ్స్, డేటా సఫిషియన్సీ, నంబర్ సిరీస్, పర్సంటేజ్‌లు ముఖ్యమైనవి. వాస్తవానికి ఇవన్నీ సులభమైనవి.. అదే సమయంలో ప్రాక్టీస్‌తోనే సాధ్యమయ్యేవి. కాబట్టి ఈ విభాగం విషయంలో ప్రాక్టీస్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి.

## ఎస్‌బీఐ క్లర్క్ నోటిఫికేషన్ సమాచారం:

**అర్హత:** 60 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత (ఎస్సీ/ఎస్టీ/వికలాంగులు, ఎక్స్ సర్వీస్‌మెన్‌కు అయిదు శాతం మినహాయింపు). లేదా సాధారణ శ్రేణిలో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత.

**వయోపరిమితి:** ఆగస్టు 1 నాటికి 18- 28 ఏళ్లు

**దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ విధానంలో

**ఫీజు:** జనరల్/ఓబీసీ-రూ.350; రిజర్వ్‌డ్ కేటగిరీలు- రూ. 50

**ఆన్‌లైన్ అప్లికేషన్ నమోదుకు చివరి తేదీ:** ఆగస్టు 13, 2012

**రాత పరీక్ష తేదీ:** అక్టోబర్ 7, 14 2012

**పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం

## ఖాళీల వివరాలు:

ఎస్‌బీఐకి చెందిన అయిదు అసోసియేట్ బ్యాంక్‌లలో మన రాష్ట్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్‌లో 1880 ఖాళీలు ఉన్నాయి. అత్యధికంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ట్రావెన్‌కూర్‌లో 2500 ఖాళీలున్నాయి. అభ్యర్థులు దరఖాస్తు సమయంలో తమకు ఆసక్తి ఉన్న బ్యాంకును పేర్కొనాలి. ఆ బ్యాంకు ప్రధాన కేంద్రంగా ఉన్న రాష్ట్రంలోనే పరీక్ష రాయాల్సి ఉంటుంది.

send your feedback to:
sakshieducation@gmail.com

Ask the expert



**టి. మురళీధరన్**
టి.ఎం.ఐ. నెట్‌వర్క్

# కస్టమ్స్ ఆఫీసర్ కావాలంటే ఎలా?

**ఫోరెన్సిక్ సైన్స్ కోర్సు వివరాలను తెలపండి?**
-రవి, కర్నూలు.

నేర పరిశోధనలో ఆధారాలను సేకరించడంలో ఫోరెన్సిక్ సైన్స్ కీలక పాత్ర వహిస్తోంది. సవాళ్లను ఇష్టపడే వారికి చక్కని కెరీర్ ఫోరెన్సిక్ సైన్స్. ఈ కోర్సు చేసిన వారికి ప్రభుత్వ నేర పరిశోధన సంస్థలు, సీబీఐ, ఐబీ, రీసెర్చ్ ఆర్గనైజేషన్స్‌తోపాటు ప్రైవేట్ డిటెక్టివ్ ఏజెన్సీల్లోను అవకాశాలుంటాయి. ఫోరెన్సిక్ సైన్స్‌లో.. జరిగిన సంఘటనకు సంబంధించిన ఆధారాలను సేకరించడానికి ఉపయోగించే టెక్నిక్స్,సేకరించిన వాటిని శాస్త్రీయంగా విశ్లేషించడం వంటి నేర పరిశోధనకు ఉపకరించే అంశాలు ఈ కోర్సులో ఉంటాయి. ఇందులో కూడా వివిధ విభాగాలుంటాయి. అవి.. ఫోరెన్సిక్ ఆర్కియాలజీ, ఫోరెన్సిక్ సైకాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, ఫోరెన్సిక్ లింగ్విస్టిక్స్, ఫోరెన్సిక్ సిరియాలజీ, ఫోరెన్సిక్ కంప్యూటింగ్. బృందంలో పని చేయగలగడం, వివిధ పద్ధతుల్లో సమాచారాన్ని సేకరించడం, పరిశోధనల పట్ల అభిరుచి, విశ్లేషణ సామర్థ్యం వంటి లక్షణాలు ఫోరెన్సిక్ సైన్స్ చదవాలనుకునే వారికి తప్పనిసరి. గ్రాడ్యుయేషన్, పోస్ట్‌గ్రాడ్యుయేషన్, డిప్లొమా స్థాయిల్లో ఫోరెన్సిక్ సైన్స్ కోర్సు అందుబాటులో ఉంది. మెడిసిన్, ఆంత్రోపాలజీ, సైకాలజీ చేసిన వారికి కూడా ఆయా రంగాలకు చెందిన స్పెషలైజ్డ్ కోర్సులను ఎంచుకునే అవకాశం ఉంది.

**ఆఫర్ చేస్తున్న వర్సిటీలు:**
మన రాష్ట్రంలోని ఉస్మానియా యూనివర్సిటీ-హైదరాబాద్, మాస్టర్ స్థాయిలో ఎంఎస్సీ (ఫోరెన్సిక్ సైన్స్) ను అందిస్తోంది. కెమిస్ట్రీ ఒక సబ్జెక్టుగా డిగ్రీ పూర్తి చేసిన వారు దీనికి అర్హులు. రాత పరీక్ష ఆధారంగా ప్రవేశం ఉంటుంది. వెబ్‌సైట్: www.osmania.ac.in
**అమిటీ యూనివర్సిటీ** (www.amity.edu) –నోయిడా, **పంజాబీ యూనివర్సిటీ** (www.punjabiuniversity.ac.in) పాటియాలా కూడా ఫోరెన్సిక్ సైన్స్ కోర్సులను ఆఫర్ చేస్తున్నాయి.

**బ్యాంకింగ్ స్పెషలైజేషన్‌తో ఉన్న మేనేజ్‌మెంట్ కోర్సుల వివరాలు?**
-నరేశ్, భద్రాచలం.

బ్యాంకింగ్ స్పెషలైజేషన్‌తో మేనేజ్‌మెంట్ కోర్సును చేసిన వారికి వివిధ బ్యాంకులు రిక్రూట్‌మెంట్‌లో ప్రాధాన్యత ఇస్తున్నాయి. ఒక బ్యాంక్‌ను ముందంజలో ఉంచేందుకు ఒక ఎగ్జిక్యూటివ్‌కు కావల్సిన నాలెడ్జ్, అనుసరించాల్సిన వ్యూహాలు, తదితర అంశాలను ఈ కోర్సులో బోధిస్తారు. కోర్సు పూర్తి చేసినవారికి వివిధ బ్యాంక్‌లలో ఎగ్జిక్యూటివ్, మేనేజీరియల్ స్థానాల్లో అవకాశం ఉంటుంది.

**ఆఫర్ చేస్తున్న ఇన్‌స్టిట్యూట్‌లు:**
**ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్, హైదరాబాద్.**
కోర్సు: పీజీ డిప్లొమా ఇన్ బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్
ప్రవేశం: క్యాట్/మ్యాట్/ఏటీఎంఏ/ఎక్స్‌ఏటీ/జీమ్యాట్ స్కోర్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు నిర్వహించే గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ద్వారా
వివరాలకు: www.ipeindia.org
**సింబయాసిస్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్ మేనేజ్‌మెంట్-పుణె**
కోర్సు: ఎంబీఏ(బ్యాంకింగ్ మేనేజ్‌మెంట్)
అర్హత: ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ
వివరాలకు: www.ssbm.edu.in
**అమిటీ స్కూల్ ఆఫ్ ఇన్సూరెన్స్, బ్యాంకింగ్ అండ్ అక్చూరియల్ సైన్స్-నోయిడా**
కోర్సు: ఎంబీఏ(ఇన్సూరెన్స్ అండ్ బ్యాంకింగ్)
ప్రవేశం: క్యాట్/మ్యాట్/ఇన్‌స్టిట్యూట్ నిర్వహించే రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ద్వారా
వివరాలకు: www.amity.edu/asias

**కస్టమ్స్ ఆఫీసర్ కావాలంటే ఎలా?**
- శ్రీకాంత్, కరీంనగర్.

కస్టమ్స్ ఆఫీసర్‌గా కెరీర్ ప్రారంభించడానికి రెండు మార్గాలున్నాయి. ఒకటి యూపీఎస్సీ-సివిల్ సర్వీసెస్ ఎగ్జామ్, ఎస్ఎస్‌సీ-కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ ఎగ్జామినేషన్.

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్‌ను ప్రతి ఏటా నిర్వహిస్తుంది. దీని ద్వారా ఇండి యన్ పోలీస్ సర్వీస్ (ఐపీఎస్), ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఐఏఎస్), ఇండియన్ రెవిన్యూ సర్వీస్ (ఐఆర్ఎస్)..తదితర అఖిల భారత సర్వీస్ అధికారుల భర్తీ జరుగుతుంది. ఈ సర్వీసుల్లోని ఐఆర్ఎస్ (ఐఆర్ఎస్‌లో కస్టమ్స్ అండ్ సెంట్రల్ ఎక్సైజ్, ఇన్ కమ్ ట్యాక్స్ అనే రెండు విభాగాలు ఉంటాయి)కు ఎంపికావడం ద్వారా అసిస్టెంట్ కమిషనర్ హోదాలో కస్టమ్స్ విభాగంలో కెరీర్ ప్రారంభించవచ్చు. ఎంపికైన వారికి నేషనల్ అకాడెమీ ఆఫ్ కస్టమ్స్, ఎక్సైజ్ అండ్ నార్కోటిక్స్(ఎన్ఏసీఈఎన్)-ఫరీదాబాద్‌లో శిక్షణనిస్తారు. సివిల్ సర్వీసెస్ పరీక్షను యూపీఎస్సీ ప్రతి ఏటా నిర్వహిస్తుంది. గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన వారు ఈ పరీక్షకు హాజరు కావచ్చు. ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ మూడు దశలుగా ఉండే ఈ పరీక్షకు నోటిఫికేషన్ నవంబర్/ డిసెంబర్‌లలో వెలువడుతుంది.
వివరాలకు: www.upsc.gov.in/

స్టాఫ్ సెలెక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ), నిర్వహించే కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ ఎగ్జామినేషన్ ద్వారా ఇన్‌స్పెక్టర్ హోదాలో కస్టమ్స్ విభాగంలో కెరీర్ ప్రారంభించవచ్చు. కావల్సిన అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా గ్రాడ్యుయేషన్. నిర్దేశించిన విధంగా శారీరక ప్రమాణాలు ఉండాలి. ఇందు కోసం నిర్వహించే రాత పరీక్ష.. టైర్ 1, టైర్ 2 రెండు దశలుగా ఉంటుంది. ఇందు లో క్వాలిఫై అయిన వారికి తర్వాత దశలో పర్సనల్ ఇంటర్వ్యూ/పర్సనాలిటీ టెస్ట్ నిర్వహిస్తారు. దీని ఆధారంగా నియామకం ఖరారు చేస్తారు.

వివరాలకు: http://ssc.nic.in/

**బీటెక్ (డిస్టెన్స్)ను ఆఫర్ చేస్తున్న సంస్థలేవి?**
-ప్రంజాల్, ఆదిలాబాద్.

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం.. దేశంలో ఏ యూనివర్సిటీ కూడా బీటెక్‌ను దూరవిద్యా విధానంలో ఆఫర్ చేయకూడదు. ఈ మేరకు ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) సర్క్యులర్ జారీ చేసింది. కాబట్టి రెగుల్యర్‌గా చదవడం మంచిది. అయితే కరస్పాండెన్స్ విధానంలో కొన్ని వర్సిటీలు బీటెక్‌ను అందిస్తున్నాయి. ఆ వివరాలు.

**జేఎన్‌టీయూ- హైదరాబాద్:**
కరస్పాండెన్స్-కమ్-కాంటాక్ట్ పద్ధతిలో బీటెక్ (ఈసీఈ, సివిల్, ఈఈఈ, మెకానికల్, సీఎస్ఈ) ఆఫర్ చేస్తోంది. సంబంధిత బ్రాంచ్‌లో డిప్లొమా ఉత్తీర్ణులు అర్హులు. రాత పరీక్ష ఆధారంగా ప్రవేశం కల్పిస్తారు. వెబ్‌సైట్: www.jntuh.ac.in
**ఆంధ్రా యూనివర్సిటీ:**
బీటెక్ (సివిల్, మెకానికల్, ఈఈఈ, ఈసీఈ, కెమికల్) అందిస్తుంది.
అర్హత: సంబంధిత బ్రాంచ్‌లో డిప్లొమా.
వెబ్‌సైట్: www.andhrauniversity.info
ఇగ్నో న్యూఢిల్లీ: సివిల్, మెకానికల్ బ్రాంచ్ లతో కరస్పాండెన్స్ పద్ధతిలో బీటెక్ కోర్సును ఆఫర్ చేస్తుంది.
వివరాలకు: www.ignou.ac.in

## ఇన్ఫో కార్నర్

### ఓఎన్‌జీసీలో 889 గ్రాడ్యుయేట్ ట్రైనీ పోస్టులు

ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఓఎన్‌జీసీఎల్), పలు విభాగాల్లో గ్రాడ్యుయేట్ ట్రైనీ పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది.
మొత్తం ఖాళీల సంఖ్య: 889
విభాగాల వారీగా భర్తీ చేసే ఖాళీలు:
ప్రొడక్షన్-220; డ్రిల్లింగ్-110; జియాలజీ-50; జియోఫిజిక్స్-54 (సర్ఫేస్-30, వెల్స్-24); రిజర్వాయర్-47; కెమిస్ట్రీ-60; ప్రోగ్రామింగ్-21; సిమెంటింగ్-20; మెకానికల్-60; ఎలక్ట్రికల్-40; ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్-45; ఇన్‌స్ట్రుమెంటేషన్-30; సివిల్-15; ట్రాన్స్‌పోర్ట్-11; ఫైనాన్స్ అండ్ అకౌంట్స్-34; హెచ్ఆర్-25; ఎంఎం-31; మెడికల్-7; సెక్యూరిటీ-9
అర్హత: 60 శాతం మార్కులతో సంబంధిత విభాగాల్లో ఎంఎస్సీ/బీఈ/బీటెక్/ఎంసీఏ/ఎంబీఏ/ఐసీడబ్ల్యూ/సీఏ/ఎంబీబీఎస్. నిర్దేశించిన విధంగా శారీరక ప్రమాణాలు ఉండాలి.
వయసు: 30 ఏళ్లు.
డ్రిల్లింగ్-సిమెంట్ విభాగానికి: 28 ఏళ్లు.
ఎంపిక విధానం: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా
రాత పరీక్ష తేదీ: అక్టోబర్ 7, 2012.
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: ఆగస్టు 26, 2012
వివరాలకు: www.conlineapply.com

### ఉస్మానియా యూనివర్సిటీ

దిగువ కోర్సుల్లో ప్రవేశానికి ఉస్మానియా యూనివర్సిటీ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.
**పోస్ట్ ఎమ్మెస్సీ డిప్లొమా ఇన్ రేడియోలాజికల్ ఫిజిక్స్:**
ఎంజేఎన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ, రీజినల్ కాన్సర్ సెంటర్ అండ్ ఇండో అమెరికన్ కాన్సర్ సెంటర్-హైదరాబాద్ సౌజన్యంతో ఈ కోర్సును నిర్వహిస్తోంది.
అర్హత: కనీసం 60 శాతం మార్కులతో ఎమ్మెస్సీ(ఫిజిక్స్/ న్యూక్లియర్ ఫిజిక్స్) లేదా తత్సమాన ఉత్తీర్ణత.
**ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సులు:**
ఎమ్మెస్సీ(కెమిస్ట్రీ/ ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ) కోర్సును ఉస్మానియా, పాలమూరు, మహాత్మా గాంధీ యూనివర్సిటీలు అందిస్తున్నాయి. ఎంబీఏ కోర్సును మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఆఫర్ చేస్తోంది.
దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ: ఆగస్టు 31, 2012
వివరాలకు: www.osmania.ac.in

### కాకతీయ వర్సిటీలో దూరవిద్య డిగ్రీ

దూర విద్యా విధానం ద్వారా బీఏ/బీకాం/ బీబీఎం/ బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే అర్హత పరీక్ష కోసం కాకతీయ విశ్వవిద్యాలయం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.
అర్హత: ఏ విద్యార్హత లేనప్పటికీ జూన్ 30, 2012 నాటికి 18 ఏళ్లు నిండి ఉండాలి. 2008 నుంచి 2012 వరకు నిర్వహించిన అర్హత పరీక్షలో ఉత్తీర్ణులైనవారు లేదా ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులు నేరుగా ప్రవేశం పొందొచ్చు.
దరఖాస్తులు: రూ.200 చెల్లించి అధ్యయన కేంద్రాల్లో దరఖాస్తులు పొందొచ్చు లేదా 'రిజిస్ట్రార్, ఎస్‌డీఎల్‌సీఈ, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్' పేరిట, వరంగల్‌లో చెల్లేలా ఆంధ్రాబ్యాంక్/ఎస్‌బీహెచ్/ఎస్‌బీఐలో తీసిన రూ. 250 డీడీ పంపి దరఖాస్తులు పొందొచ్చు.
ప్రవేశ పరీక్ష తేదీ: అక్టోబర్ 14, 2012
దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ: సెప్టెంబర్ 14, 2012
పూర్తి వివరాలకు వెబ్‌సైట్ www.sdlceku.co.in

### కార్పొరేషన్ బ్యాంక్‌లో స్పెషలిస్ట్ ఆఫీసర్లు

కార్పొరేషన్ బ్యాంక్, పలు విభాగాల్లో స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

| | |
|---|---|
| పర్సనల్ ఆఫీసర్ | ఖాళీలు: 10 |
| ఆఫీషియల్ లాంగ్వేజ్ ఆఫీసర్ | ఖాళీలు: 15 |
| ఐటీ (కంప్యూటర్) ఆఫీసర్ | ఖాళీలు: 50 |
| అగ్రికల్చర్ ఫీల్డ్ ఆఫీసర్ | ఖాళీలు: 175 |
| లా మేనేజర్ | ఖాళీలు: 11 |
| సివిల్ ఇంజనీర్ | ఖాళీలు: 7 |
| ఎలక్ట్రికల్ ఇంజనీర్ | ఖాళీలు: 7 |
| రిస్క్ మేనేజర్ | ఖాళీలు: 6 |
| సెక్యూరిటీ మేనేజర్ | ఖాళీలు: 13 |
| ఫారెక్స్ మేనేజర్ | ఖాళీలు: 30 |
| క్రెడిట్ మేనేజర్ | ఖాళీలు: 100 |

వివరాలకు: www.corpbank.com

### సశస్త్ర సీమా బల్

సశస్త్ర సీమా బల్(ఎస్ఎస్‌బీ), పలు విభాగాల్లో టెక్నికల్ ట్రేడ్ కేడర్, వెటర్నరీ పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది.
**సబ్ ఇన్‌స్పెక్టర్ (పయనీర్)** ఖాళీలు: 32
అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ/ డిప్లొమా ఇన్ సివిల్ ఇంజనీరింగ్. నిర్దేశించిన విధంగా శారీరక ప్రమాణాలు ఉండాలి. వయసు: 30 ఏళ్లు.
**హెడ్ కానిస్టేబుల్ (ఎలక్ట్రీషియన్-పురుషులకు మాత్రమే)**
ఖాళీలు: 28
అర్హత: మెట్రిక్యులేషన్/తత్సమానంతోపాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ సర్టిఫికెట్/తత్సమానం. రెండేళ్ల అనుభవం.నిర్దేశించిన విధంగా శారీరక ప్రమాణాలు ఉండాలి.
**హెడ్ కానిస్టేబుల్ (వర్క్ షాప్- పురుషులకు మాత్రమే)**
ఖాళీలు: 184
అర్హత: మెట్రిక్యులేషన్/తత్సమానంతోపాటు డిప్లొమా (ఆటోమొబైల్/మోటార్ మెకానికల్)/సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ సర్టిఫికెట్/తత్సమానం. రెండేళ్ల అనుభవం. నిర్దేశించిన విధంగా శారీరక ప్రమాణాలు ఉండాలి.
**హెడ్ కానిస్టేబుల్ (వెటర్నరీ)** ఖాళీలు: 68
అర్హత: ఇంటర్మీడియెట్(బయాలజీ మెయిన్ సబ్జెక్ట్‌గా). సంబంధిత విభాగంలో ఏడాది అనుభవం. నిర్దేశించిన విధంగా శారీరక ప్రమాణాలు ఉండాలి.
**కానిస్టేబుల్ (వెటర్నరీ)** ఖాళీలు: 50
అర్హత: మెట్రిక్యులేషన్. సంబంధిత విభాగంలో ఏడాది అనుభవం. నిర్దేశిత శారీరక ప్రమాణాలు ఉండాలి.
దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ: ఆగస్టు 31, 2012.
దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ (వెటర్నరీ పోస్టులకు): సెప్టెంబర్ 15, 2012.
వివరాలకు: www.ssbrectt.gov.in

ప్రతి గురువారం సాక్షితో ఉచితం 16-8-2012
Online Edition
www.sakshieducation.com/bhavitha.aspx
సాక్షి

# భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

Sakshi Bhavita TV Program on Facebook facebook.com/sakshibhavita



క్యాంపస్ ప్లేస్‌మెంట్స్.. రిక్రూట్‌మెంట్స్ ట్రెండ్.. రాష్ట్రంలో ఇంజనీరింగ్ విద్యపై.. టాటా కన్సల్టెన్సీ (టీసీఎస్) సర్వీసెస్ వైస్ ప్రెసిడెంట్, రీజనల్ హెడ్ వి.రాజన్నతో ప్రత్యేక ఇంటర్వ్యూ 4

## Inside

రాష్ట్రీయ మిలటరీ స్కూల్స్ అడ్మిషన్స్‌పై ఫోకస్ 5



సీఏ కోర్సులో కొత్త మార్పులు- సీఏతో అవకాశాలపై సమగ్ర కథనం 7



- సివిల్స్ మెయిన్స్- పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్- స్కోరింగ్ ఏరియాస్
- గ్రూప్1 మెయిన్స్- పేపర్ 5- న్యూ ప్యాట్రన్- స్ట్రాటజీ టు స్కోర్ మోర్

8, 9

ఏ టు జెడ్ ఇన్ఫర్మేషన్ అబౌట్ స్టడీ అబ్రాడ్ 10



ప్రతిష్ఠాత్మక ఎన్ఏఎస్ఐ- యంగ్‌సైంటిస్ట్ ప్లాటినం జూబ్లీ అవార్డుకు ఎంపికైన ఐఐసీటీ శాస్త్రవేత్త డాక్టర్ సూర్యప్రకాశ్ సింగ్‌తో ఇంటర్వ్యూ.. 12

Education Loans

## చదువుకొనేందుకు మార్గం

# ఎడ్యుకేషన్ లోన్స్...

2

కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైంది.. కళాశాలలు మళ్లీ తెరుచుకుంటున్నాయి. కోటి ఆశలతో కాలేజీల్లోకి అడుగుపెడుతున్న భావి తరానికి.. లక్షల్లో ఉండే ఫీజు గుదిబండగా మారుతోంది.. మరో వైపు ఫీజురీయింబర్స్‌మెంట్‌పై ప్రభుత్వ నిబంధనల ఫలితంగా వేలాది మంది విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే పరిస్థితి.. ఈ తరుణంలో విద్యార్థులకు కారుచీకట్లో కాంతిరేఖ **ఎడ్యుకేషన్ లోన్స్**... మంచి అకెడమిక్ రికార్డు.. అడ్మిషన్ కన్ఫర్మేషన్ ఉంటే చాలు... ఇట్టే లభిస్తున్న ఎడ్యుకేషన్ లోన్స్‌పై ఫోకస్..





ప్రతి ఆదివారం ఉదయం 9-30 నుంచి 10గంటల వరకు.. మీ సాక్షి టీవీలో

మీరు ఉద్యోగావకాశాల కోసం ఎదురు చూస్తున్నారా? ఏపీపీఎస్సీ గ్రూప్స్, సివిల్స్, బ్యాంక్స్ వంటి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారా? అయితే సాక్షి భవిత టీవీ ప్రోగ్రాం చూడండి

వివిధ రంగాల్లో ఉపాధి.. కెరీర్ ఎంపికలో మెలకువలు.. తాజా ఉద్యోగాల సమాచారం.. అడ్మిషన్ల వివరాలు.. విద్యా సమాచారం.. స్కాలర్‌షిప్పుల వివరాలు... ఇంకా మరెన్నో...

భవిత

కెరీర్ ఎంపికలో దిక్సూచి.. భవిత! ఇకపై మీ సాక్షి టీవీలో
ప్రతి ఆదివారం ఉదయం 9-30 నుంచి 10గం.. వరకు

Study Loans

# చదువు'కొనే'ందుకు మార్గం ఎడ్యుకేషన్ లోన్స్...

**చదువుకునే రోజులు పోయాయి. చదువుకు'కొనా'ల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయి. లక్షల్లో ఫీజులు చెల్లించాల్సిన ప్రొఫెషనల్ కోర్సులను చూసి బెంబేలెత్తుతున్న విద్యార్థులు.. అర్హతలున్నా, ఆర్థిక పరిస్థితుల కారణంగా వాటివైపే చూడలేకపోతున్నారు. మరోవైపు మన రాష్ట్రంలో దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర రెడ్డి ప్రారంభించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి ప్రస్తుతం నిబంధనలు పేరిట అనేక పరిమితులు విధిస్తున్న తరుణంలో.. ఉన్నత విద్య ఔత్సాహికులకు ఇప్పటివరకు ఉన్న ఏకైక ఆశ, అవకాశం కూడా చేజారే ప్రమాదం ఏర్పడింది. ఇలాంటి పరిస్థితుల్లో విద్యార్థులకు కాస్త ఉపశమనం కలిగించే అంశం బ్యాంకు రుణాలు. ఉన్నతవిద్యను ప్రోత్సహించే ఉద్దేశం కేంద్ర ప్రభుత్వం తీసుకున్న పలు చర్యలు, వడ్డీ రాయితీలు వంటి వాటి వల్ల ప్రస్తుతం అనేక జాతీయ బ్యాంకులు విద్యార్థులకు దేశంలో ఉన్నత చదువులు చదివేందుకు, విదేశీ విద్య చదివే విద్యార్థులకు సులభ నిబంధనలతో విద్యా రుణాలను మంజూరు చేస్తున్నాయి. వివరాలు..**



ఓవైపు ఏకీకృత ఫీజు విధానం.. మరోవైపు కేవలం నిర్దేశిత మొత్తానికి మాత్రమే రీయింబర్స్‌మెంట్ అమలు చేస్తామని.. మిగతా మొత్తాన్ని విద్యార్థులు బ్యాంక్ లోన్ రూపంలో భరించాలనే ప్రభుత్వ ఆలోచన నేపథ్యంలో విద్యార్థుల ఉన్నత విద్యాభిలాషకు ఉన్న ఒకే ఒక అవకాశం విద్యా రుణాలు.

### ఏఏ కోర్సులకు:
ఇండియన్ బ్యాంకర్స్ అసోసియేషన్, ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం ఇంటర్మీడియెట్ అర్హతతో చదివే బ్యాచిలర్ డిగ్రీ (బీటెక్, బీకాం, బీఏ, తదితర) కోర్సులకు, ఎంబీబీఎస్, అగ్రికల్చర్, ఎంబీఏ, ఎంసీఏ, ఎంటెక్ తదితర ప్రొఫెషనల్ కోర్సులు, వృత్తి విద్యా కోర్సులకు బ్యాంకులు రుణాలు అందిస్తున్నాయి. అయితే ఈ కోర్సులను ఏఐసీటీఈ, యూజీసీ, ఎంసీఐ, హెచ్‌ఆర్‌డీ, యూనివర్సిటీ గుర్తింపు ఉన్న కళాశాలల్లో ప్రవేశం లభించిన విద్యార్థులకు మాత్రమే అందిస్తాయి. అంతేకాకుండా మెరిట్ ఆధారంగా కన్వీనర్ కోటాలో సీటు పొందిన వారికే రుణాలు లభిస్తాయి. మేనేజ్‌మెంట్ కోటాలో, క్యాపిటేషన్ ఫీజులు చెల్లించి ప్రవేశం పొందిన అభ్యర్థులకు ఇవి లభించవు. అంతేకాకుండా కొన్ని బ్యాంకులు పదో తరగతి నుంచి ఇప్పటివరకు చదివిన కోర్సుల్లో నిర్దేశిత పర్సంటేజీ ఉంటేనే అర్హులని పేర్కొంటున్నాయి.

### ఎంత మొత్తం:
ఏ కోర్సులైనా గరిష్ఠంగా రూ. పది లక్షల వరకు రుణం లభిస్తుంది. ప్రభుత్వ ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్‌లలో (ఐఐటీ, ఐఐఎం తదితర) ప్రవేశం లభించిన విద్యార్థులకు ఆ మొత్తం పదిహేను లక్షల వరకు ఉండే అవకాశాలున్నాయి. గతంలో తక్కువ మొత్తంలో ఉండే రుణాల మొత్తం పెరగడానికి కారణం ప్రభుత్వం, ఇండియన్ బ్యాంకర్స్ అసోసియేషన్ సంయుక్తంగా ఉన్నత విద్య ఔత్సాహికులను ప్రోత్సహించాలని నిర్ణయించడమే. దీంతో నిబంధనలను కూడా ఆయా బ్యాంకులు సులభతరం చేశాయి. గత అయిదారేళ్ల కాలంలో విద్యా రుణాల మంజూరు సంఖ్య ఏటేటా పెరుగుతోంది.

### విదేశీ విద్యకు కూడా:
ఇటీవల కాలంలో స్టడీ అబ్రాడ్ దిశగా అడుగులు వేస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ముఖ్యంగా పీజీ స్థాయి కోర్సులు (ఎంఎస్, ఎంబీఏ వంటి) చదివే వారి సంఖ్య పెరుగుతోంది. ఇలాంటి వారికి కూడా మన బ్యాంకులు రుణాలు మంజూరు చేస్తున్నాయి. గరిష్ఠంగా రూ.15 లక్షల వరకు రుణం లభిస్తుంది. ఇలా విదేశీ విద్యకు రుణం ఆశించే విద్యార్థులు కూడా ఏ దేశంలో చదవాలనుకుంటున్నారో.. ఆ ప్రభుత్వ గుర్తింపు ఉన్న ఇన్‌స్టిట్యూట్‌లలో మాత్రమే ప్రవేశం పొందాల్సి ఉంటుంది.

### ప్రైవేట్ ఇన్‌స్టిట్యూట్‌లు కూడా:
ప్రభుత్వ గుర్తింపు పొందిన కళాశాలలు, కన్వీనర్ కోటాలో సీటు పొందిన విద్యార్థులకు మాత్రమే రుణాలు బ్యాంకులు రుణాలు ఇస్తున్నాయి. మరి ప్రఖ్యాత ప్రైవేట్ ఇన్‌స్టిట్యూట్‌లలో చేరే విద్యార్థుల పరిస్థితి ఏంటి? ఈ విషయంలోనూ కొన్ని ప్రైవేట్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థుల కోణంలో ఆలోచించాయి. తమ ఇన్‌స్టిట్యూట్‌లలో ప్రవేశం పొందిన విద్యార్థులకు ఫీజు భారం తప్పించాలనే ఉద్దేశంతో కొన్ని ప్రైవేటు బ్యాంకులతో ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. దీంతో ఆయా ఇన్‌స్టిట్యూట్‌లలో ప్రవేశం పొందిన వారికి రుణాలు అందుతాయి.

### రుణ మంజూరులో పరిగణించే అంశాలు:
విద్యార్థికి రుణం మంజూరు చేసే విషయంలో బ్యాంకులు కొన్ని విషయాలను పరిగణనలోకి తీసుకుని రుణ మొత్తాన్ని నిర్ణయిస్తాయి. అవి..
- ట్యూషన్ ఫీజు
- ఎగ్జామినేషన్/లైబ్రరీ/లేబొరేటరీ ఫీజు
- బుక్స్, యూనిఫాం, ఇన్‌స్ట్రుమెంట్స్ కొనుగోలుకయ్యే వ్యయం
- కంప్యూటర్ కొనుగోలు ఖర్చు
- కోర్సు పూర్తి చేయడానికి అవసరమైన ఇతర ఖర్చులు (ప్రాజెక్ట్ వర్క్, స్టడీ టూర్స్)

బ్యాంకు నిర్ణయించిన రుణ మొత్తాన్ని విడతలవారీగా నేరుగా కాలేజీలకే అందిస్తాయి. అయితే ప్రథమ సంవత్సరం ప్రవేశం సమయంలో విద్యార్థులు తాము అప్పటికే చెల్లించిన మొత్తానికి సంబంధించి ఆధారాలు చూపిస్తే ఆ మొత్తాన్ని మాత్రం విద్యార్థి పేరు మీద మంజూరు చేస్తాయి. ఆ తర్వాత నుంచి కోర్సు పూర్తయ్యే వరకు కాలేజీకి నేరుగా అందిస్తాయి.

### నిబంధనలు సరళం:
ఇటీవల కాలంలో బ్యాంకులు విద్యారుణాల మంజూరు విషయంలో నిబంధనలను సులభతరం చేశాయి. ముఖ్యంగా 'బ్యాంకు రుణం' అంటేనే ష్యూరిటీలు అనే ఆందోళనకు తెరదించుతున్నాయి. ఈ క్రమంలో.. స్వదేశంలో చదివే విద్యార్థులకు నాలుగు లక్షల వరకు రుణాలకు తల్లిదండ్రుల హామీ ఉంటే సరిపోతుంది. ఎలాంటి ఇతర ష్యూరిటీలు చూపించక్కర్లేదు. రూ. నాలుగు లక్షల నుంచి ఏడున్నరల లక్షల లోపైతే.. తల్లిదండ్రుల హామీ, కొల్లేటరల్ సెక్యూరిటీ, థర్డ్‌పార్టీ గ్యారంటీ చూపించాల్సి ఉంటుంది. రూ. ఏడున్నర లక్షలు దాటితే తల్లిదండ్రుల హామీ, రుణ మొత్తానికి సరిపడే ఆస్తుల హామీ చూపించాలి. దీంతోపాటు భవిష్యత్తులో విద్యార్థి సదరు రుణాన్ని తిరిగి చెల్లించగలడనే విషయానికి ఆధారంగా అతని భవిష్యత్తు ఆర్జనకు సంబంధించిన ఎసైన్‌మెంట్ పత్రం కూడా అందించాలి. ఐబీఏ రూపకల్పన చేసిన విద్యా రుణ పథకం ప్రకారం ఎలాంటి మార్జిన్ మనీ లేకుండానే రుణాలు మంజూరు చేయాలి. కానీ కొన్ని బ్యాంకులు దీన్ని అమలు చేయటంలేదు. కొంత మార్జిన్ మనీ ఉండాలని పేర్కొంటున్నాయి. విదేశీ విద్య విషయంలో మాత్రం ఐబీఏ 15 శాతం మార్జిన్ మనీని నిర్దేశించింది.

### వడ్డీ రేట్లు:
ఐబీఏ విద్యా రుణ పథకం ప్రకారం.. ఇతర రుణాలతో పోల్చితే విద్యారుణాల వడ్డీరేట్లు కొంచెం తక్కువగానే ఉంటాయి. అవి ఆయా బ్యాంకుల బేస్‌రేట్ల ఆధారంగా ఉంటాయి. ఈ వడ్డీ విషయంలోనూ ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ప్రభుత్వం చేయూతనందిస్తోంది. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ. 4.50 లక్షలు మించని విద్యార్థులకు విద్యా రుణాల వడ్డీలపై సబ్సిడీ అందిస్తోంది. ఈ సబ్సిడీ సదరు కోర్సు పూర్తయిన సంవత్సర కాలం వరకు లేదా ఉద్యోగం పొందాక ఆరు నెలల కాలం వరకు (ఏది ముందు జరిగితే అప్పటివరకు) అమల్లో ఉంటుంది.

### విద్యార్థినులకు ప్రత్యేకం:
ఉన్నత విద్య దిశగా మహిళలను ప్రోత్సహించేందుకుగాను విద్యార్థినుల విషయంలో బ్యాంకులు ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నాయి. ఇందులో ముఖ్యమైంది వడ్డీ రాయితీ. ఇది అర శాతం నుంచి ఒక శాతం మధ్యలో ఉంటుంది. అదేవిధంగా ఆంగవికలురైన విద్యార్థులకు కూడా ఇదే మొత్తాల్లో వడ్డీ రాయితీని అందిస్తున్నాయి.

### పన్నులలోనూ రాయితీలు:
విద్యా రుణాలకు చెల్లించే వడ్డీలకు ఆదాయం పన్ను చట్టం సెక్షన్ 80ఈ ప్రకారం పన్ను మినహాయింపు కూడా అమల్లో ఉంది. ఉద్యోగం చేస్తూ ఉన్నత చదువులకు రుణం తీసుకున్నా లేదా పిల్లలు, భార్య చదువు కోసం, చెల్లెలి చదువు కోసం తీసుకున్న రుణాలకు చెల్లించే వడ్డీపై ఎటువంటి పరిమితులు లేకుండా పూర్తి మినహాయింపులు పొందవచ్చు. తీసుకున్న రుణానికి వడ్డీ చెల్లించడం మొదలు పెట్టినప్పటి నుంచి గరిష్ఠంగా ఎనిమిది సంవత్సరాల వరకు ఈ మినహాయిం పులు లభిస్తాయి. చెల్లించే అసలుపై మాత్రం ఎటువంటి రాయితీలు లభించవు.

### తిరిగి చెల్లింపు... వడ్డీ:
విద్యా రుణం తీసుకున్న విద్యార్థులు ఆ రుణం తీసుకున్న తర్వాత నెల నుంచే తిరిగి చెల్లించక్కర్లేదు. సంబంధిత కోర్సు పూర్తయ్యాక... ఏడాది తర్వాత లేదా ఉద్యోగం వచ్చాక ఆరు నెలల తర్వాత ఏది ముందుగా జరిగితే అప్పటి నుంచి రుణాన్ని వాయిదాల పద్ధతిలో గరిష్ఠంగా ఐదు నుంచి ఏడేళ్ల వ్య వధిలో తిరిగి చెల్లించవచ్చు. వడ్డీ కూడా అందుబాటు రేటులోనే ఉంటోంది.

### దరఖాస్తుకు సిద్ధమేనా:
విద్యా రుణాలను ఆశించే విద్యార్థులు కోర్సు ప్రారంభానికి ముందుగానే ఆ దిశగా తమ కసరత్తు ప్రారంభించాలి. ముఖ్యంగా నిర్దేశిత డాక్యుమెంట్లతో బ్యాంకులను సంప్రదించాలి. ఆ డాక్యుమెంట్ల వివరాలు.. అవి.

### లోన్ అప్లికేషన్:
- అప్పటి వరకు పొందిన ఎడ్యుకేషన్ సర్టిఫికెట్లు
- తాజా అడ్మిషన్ కన్ఫర్మేషన్ ప్రూఫ్
- కోర్సుకయ్యే ఖర్చు మొత్తం అంచనా పత్రం
- రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోగ్రాఫ్‌లు
- గడచిన రెండేళ్ల కాలానికి తల్లిదండ్రుల ఇన్‌కం ట్యాక్స్ స్టేట్‌మెంట్
- గత ఆరు నెలల కాలానికి తల్లిదండ్రుల బ్యాంక్ అకౌంట్స్ స్టేట్‌మెంట్
- ఆస్తులు, అప్పులకు సంబంధించి సంక్షిప్త వివరణ
- తల్లిదండ్రుల ఆదాయ ధృవీకరణ
- నివాస ధృవీకరణ.
- 4 లక్షలవరకు ఎటువంటి డ్యాకుమెంట్స్ అవసరం లేదు.

### ఇబ్బందులు ఎదురైతే:
రుణ వాయిదాలను తప్పకుండా చెల్లించాలి. ఏదైనా ఇబ్బంది ఎదురైతే బ్యాంక్ మేనేజర్‌ను కలవాలి. మీ ఇబ్బందిని వివరిస్తే వాయిదాలు చెల్లింపునకు మరికొంత సమయం ఇచ్చే అవకాశం ఉంటుంది. రుణం తీసుకున్న తర్వాత ఏవైనా కారణాల వల్ల చదువు పూర్తి కాకపోయినా, చెల్లింపు ఆగిపోయినా వెంటనే బ్యాంకుకు తెలియజేయాలి. లేకపోతే రుణఖాతాను నిరర్థక ఆస్తి(ఎన్‌పీఏ)గా పరిగణిస్తారు. ఒకసారి ఎన్‌పీఏగా పరిగణిస్తే మళ్లీ ఏ బ్యాంక్‌లు రుణాలు ఇవ్వడానికి ముందుకు రావు. అందుకే అటు వంటి సమయంలో బ్యాంక్ మేనేజర్‌ను సంప్రదించటం ఉత్తమం.

### విదేశీ విద్య కోసం:
విదేశీ విద్యకు రుణం పొందాలనుకునే విద్యార్థులు వీసా మంజూరు కావడానికి అవకాశం ఉన్న తేదీకి నెల రోజుల ముందుగానే ఆ దిశగా కదలాలి. ఈ విద్యార్థులు అందించాల్సిన డాక్యుమెంట్లు..ఆఫర్ లెటర్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, సెక్యూరిటీకి సేల్ డీడ్ కాపీ, లింక్ డాక్యుమెంట్ (ముప్పైఏళ్ల కిందట నుంచి), ప్రాపర్టీ ట్యాక్స్ రిసీట్, మున్సిపల్ అప్రూవల్ ప్లాన్, లే అవుట్ అయితే దాని ప్లాన్ కూడా తీసుకువెళ్లాలి. వాటితో పాటు రెసిడెన్షియల్ ప్రూఫ్ కోసం ఎలక్ట్రిసిటీ బిల్, అన్ని అకడెమిక్ సర్టిఫికెట్లు తప్పనిసరి. ఇలా పకడ్బందీగా డాక్యుమెంటేషన్ ప్రక్రియ పూర్తి చేస్తే లోన్‌కు దరఖాస్తు చేసుకున్న వారం నుంచి పదిరోజుల్లోపే రుణం మంజూరవుతుంది.

# ఓపెన్ స్కూల్ ఒడిలో.. చదువుకోండి

**'అందరికీ విద్య, అందుబాటులో విద్య' అనే నినాదంతో వివిధ కారణాలతో మధ్యలోనే చదువు మానేసినవారిని, అసలు చదువుకోనివారిని అక్షర్యాస్యుల్ని చేసి, వారు కూడా జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగడానికి1991లో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంస్థ.. ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ. 2012-13 సంవత్సరానికి గానూ ప్రవేశాల ప్రకటన విడుదలైన నేపథ్యంలో ఓపెన్ స్కూల్ అందిస్తోన్న కోర్సులు.. అర్హతలపై విశ్లేషణ...**



### మొదట ఎస్ఎస్‌సీ.. తర్వాత ఇంటర్:

స్వతంత్య్ర ప్రతిపత్తి ఉన్న ఏపీ ఓపెన్ స్కూల్ మొదట 2008-09 సంవత్సరంలో దూరవిద్యలో ఎస్ఎస్‌సీ కోర్సును ప్రవేశపెట్టింది. ఇందుకోసం రాష్ట్రంలోని 23 జిల్లాలలో.. సుమారు 1400 స్టడీ సెంటర్స్‌ను ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో 2010-11 సంవత్సరం నుంచి ఇంటర్మీడియెట్ కోర్సును కూడా ప్రారంభించింది. ముఖ్యంగా బాలికలు, మహిళలు, గ్రామీణ యువత, వివిధ పనులు చేసే స్త్రీ, పురుషులు, ఎస్సీ, ఎస్టీలు, మైనారిటీలు మొదలైనవారిని అక్షర్యాస్యుల్ని చేయడమే లక్ష్యంగా స్కూల్ పనిచేస్తోంది.

### ఏపీ ఓపెన్ స్కూల్ అందిస్తోన్న కోర్సులు:

**ఎనిమిదో తరగతి:**

ఓపెన్ స్కూల్ ఈ ఏడాది నుంచి 8వ తరగతి కోర్సును కూడా ప్రారంభించింది.

అర్హత: చదువుకోవాలనుకునేవారు/మధ్యలో చదువుమానేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. దీంతోపాటు చదవగలిగే సామర్థ్యాన్ని కలిగిఉన్నట్లు డిక్లరేషన్ ఇవ్వాలి.

వయోపరిమితి: ఆగస్టు 31, 2012 నాటికి 14 ఏళ్లు నిండి ఉండాలి.

సబ్జెక్టులు: హిందీ, ఇంగ్లిష్, తెలుగు, ఉర్దూ భాషల్లో ఏదైనా ఒక భాషను ఎంపిక చేసుకోవాలి. మ్యాథ్స్, సైన్స్, సోషల్ తప్పనిసరిగా ఉంటాయి.

### వృత్తి విద్యా కోర్సులు:

సాధారణ అర్హతలు లేనివారికి కూడా స్వయం ఉపాధిని కల్పించి వారి జీవితాలను వెలుగుల బాట పట్టించడానికి ఓపెన్ స్కూల్ వృత్తి విద్యా కోర్సులను కూడా అందిస్తోంది. అవి..

### పదో తరగతి స్థాయి వృత్తి విద్యా కోర్సులు:

- రిటైల్ మార్కెటింగ్ అసిస్టెంట్
- స్టోర్ కీపర్
- బెడ్ సైడ్ అసిస్టెంట్/డొమెస్టిక్ నర్సింగ్
- హౌస్ కీపింగ్
- టైలరింగ్, గార్మెంట్ తయారీ
- బేకరీ అండ్ కన్‌ఫెక్షనరీ
- ఫ్యాబ్రిక్ పెయింటింగ్, ఎంబ్రాయిడరీ అండ్ రోలింగ్, మగ్గం
- ఇండియన్ డాట్ క్రాఫ్ట్స్‌మెన్
- పుట్టగొడుగుల పెంపకం-వర్మికల్చర్
- పండ్లు, కూరగాయలు నిలువ చేసే విధానాలు
- నర్సరీ అభివృద్ధి అండ్ మైక్రో ఇరిగేషన్ సిస్టమ్స్ సర్వీసింగ్
- సెల్‌ఫోన్ అమ్మకం, సర్వీసింగ్ అండ్ రిపేరింగ్
- ఎలక్ట్రికల్ వైరింగ్
- ఆటో ఎలక్ట్రీషియన్, ఇన్‌వర్టర్ టెక్నీషియన్ అండ్ బ్యాటరీస్ సర్వీసింగ్
- వెల్డింగ్ అండ్ ఫాబ్రికేషన్
- మాసన్రీ
- కార్పెంటరీ
- ప్లంబర్ అండ్ శానిటరీ వేర్ ఫిట్టర్
- ఫిట్టర్
- కంప్యూటర్ సైన్స్
- కంప్యూటర్ హార్డ్‌వేర్ టెక్నీషియన్
- అపార్ట్‌మెంట్ సెక్యూరిటీ అండ్ సర్వీసెస్
- ప్రొఫెషనల్ పెయింటింగ్ అండ్ పాలిషింగ్

### ఇంటర్మీడియెట్ స్థాయి వృత్తి విద్యా కోర్సులు:

- ఈవెంట్ మేనేజ్‌మెంట్
- అకౌంటెన్సీ, ఆడిటింగ్ అండ్ టాలీ
- ఆఫీస్ సెక్రటరీషిప్
- మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్
- ఈసీజీ అండ్ ఆడియో మెట్రిక్ టెక్నీషియన్
- డెంటల్ టెక్నీషియన్ అసిస్టెంట్
- బ్యూటీషియన్
- హోటల్ ఫ్రంట్ ఆఫీస్ ఆపరేషన్
- జెరియాట్రిక్ కేర్
- ప్రీ స్కూల్ టీచర్ ట్రైనింగ్
- కేటరింగ్ అండ్ రెస్టారెంట్ మేనేజ్‌మెంట్
- ఫ్యాషన్ అండ్ అప్పెరల్ డిజైనింగ్
- సాయిల్, ఫర్టిలైజర్, వాటర్ మేనేజ్‌మెంట్ అండ్ ప్లాంట్ ప్రొటెక్షన్
- డెయిరీ ఫామింగ్ అండ్ డెయిరీ పార్లర్ సర్వీసెస్
- పౌల్ట్రీఫామింగ్
- గోట్ అండ్ షీప్ ఫామింగ్
- బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ అండ్ మెయిన్‌టెనెన్స్
- టూ అండ్ త్రీ వీలర్ టెక్నీషియన్
- ఆడియో విజువల్ టెక్నీషియన్
- సర్వీసింగ్ అండ్ మెయిట్‌టెనెన్స్ ఆఫ్ ఎర్ కండీషనర్స్ అండ్ రిఫ్రిజిరేటర్స్ టెక్నీషియన్
- ఎలక్ట్రీషియన్ టెక్నీషియన్
- కంప్యూటర్ ఆపరేషన్స్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్
- ఫొటోగ్రఫీ అండ్ వీడియోగ్రఫీ
- ట్రావెల్ అండ్ టూరిజం సర్వీసెస్

అర్హత: చదవడం, రాయడం వచ్చిన వారెవరైనా ఈ కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చు. కొన్ని కోర్సులకు ట్రేడ్‌ను బట్టి ఐదో తరగతి/ఏడో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ఇంటర్మీడియెట్ స్థాయి వృత్తి విద్యా కోర్సులకు ఎస్ఎస్‌సీ ఉత్తీర్ణత సాధించి ఉండాలి.

వయోపరిమితి: ఆగస్టు 31 నాటికి 14 ఏళ్లు నిండి ఉండాలి.

వ్యవధి: ఎస్ఎస్‌సీ స్థాయి వృత్తి విద్యా కోర్సుల వ్యవధి మూడు నెలలు. ఇంటర్మీడియెట్ స్థాయి వృత్తి విద్యా కోర్సుల వ్యవధి ఆరు నెలలు.

రెగ్యులర్ విధానంలో జరిగే ఈ కోర్సుల బోధన ఇంగ్లిష్, తెలుగు మాధ్యమాల్లో ఉంటుంది. ముఖ్యంగా ఇంటర్నల్ అసైన్‌మెంట్, ట్యూటర్ మార్క్‌డ్ అసైన్‌మెంట్, వర్క్, డైరీలు మొదలైన వాటి ద్వారా నిరంతర మూల్యాంకనం ఉంటుంది. కరిక్యులం, శిక్షణలో భాగంగా విద్యార్థులలో జీవన నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు అభివృద్ధి చేస్తారు. దీంతోపాటు వృత్తి విద్యా నైపుణ్యాలలో సామర్థ్యత పెంపుదల కోసం 'కంపల్సరీ మినిమం స్కిల్స్ సెట్ (ఎంఎస్ఎస్)' సాధనలో శిక్షణనిస్తారు. అంతేకాకుండా విద్యార్థులకు అకడెమిక్ గైడెన్స్, కోర్సు పూర్తైన తర్వాత ఉద్యోగంలో చేరడానికి, సలహాలు అందించడానికి అకడెమిక్ గైడెన్స్, ప్లేస్‌మెంట్ సెల్ కూడా ఉంటుంది. కోర్సుల్లో నైపుణ్యం పొంది ఉత్తీర్ణులైనవారు స్వయంఉపాధిలో చక్కగా స్థిరపడొచ్చు.

### ఎస్ఎస్‌సీ

అర్హత: చదవగల పరిజ్ఞానం కలిగి ఉన్నవారెవరైనా అర్హులే.

వయోపరిమితి: ఆగస్టు 31, 2012 నాటికి 14 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ట వయోపరిమితి లేదు.

సబ్జెక్టులు: విద్యార్థులు కనీసం ఐదు సబ్జెక్టుల్లో ఉత్తీర్ణుల వ్వాలి. అవి గ్రూప్-ఏలో 1 లేదా 2 భాషలు, గ్రూప్-బిలో కనీసం రెండు సబ్జెక్టులు, గ్రూప్-సి నుంచి ఒక వృత్తి విద్యా కోర్సు కలిపి మొత్తం 5 సబ్జెక్టులను ఎంచుకోవాలి. గ్రూప్-సిలోని ఒకేషనల్ కోర్సు ఐచ్ఛికం. దీన్ని ఎంచుకోవాలనుకుంటే గ్రూప్-ఏ, గ్రూప్-బి నుంచి ఒక సబ్జెక్టును ఎంపిక చేసుకోవాలి. విద్యార్థులు ఆసక్తి, అవసరాన్ని బట్టి ఒక అదనపు సబ్జెక్టును ఆరో సబ్జెక్టుగా ప్రవేశ సమయంలో గానీ, చదువుతున్నప్పుడు మొదటి నాలుగు కాంటాక్ట్ క్లాసులోపు కానీ ఎంపిక చేసుకోవచ్చు. గ్రూప్-సి నుంచి ఏడో సబ్జెక్టును ఎంపిక చేసుకోవచ్చు. ఏదిఏమైనప్పటికీ 5 సబ్జెక్టులను మాత్రం తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది. మిగతావి ఐచ్ఛికం. గ్రూప్‌లవారీగా సబ్జెక్టులు..

గ్రూప్-ఏ: హిందీ, ఇంగ్లిష్, మరాఠీ, తెలుగు, ఉర్దూ, కన్నడం, ఒరియా, తమిళం

గ్రూప్-బి: గణితం, సైన్స్ అండ్ టెక్నాలజీ, సోషల్, ఎకనామిక్స్, బిజినెస్ స్టడీస్, గృహ విజ్ఞానం, మనోవిజ్ఞానశాస్త్రం, భారతీయ సంస్కృతి-వారసత్వం.

### ఇంటర్మీడియెట్

అర్హత: గుర్తింపు పొందిన బోర్డ్ నుంచి ఎస్ఎస్‌సీ ఉత్తీర్ణత. ఎస్ఎస్‌సీ పూర్తిచేసినవారు ఉత్తీర్ణత పొందిన రెండేళ్ల తర్వాత మాత్రమే ఇంటర్మీడియెట్ సర్టిఫికెట్ పొందడానికి అర్హులవుతారు.

వయోపరిమితి: ఆగస్టు 31, 2012 నాటికి 15 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ట వయోపరిమితి లేదు.

సబ్జెక్టులు: విద్యార్థులు 5 సబ్జెక్టులను తప్పనిసరిగా ఎంపిక చేసుకోవాలి. అవి గ్రూప్-ఏలో 1 లేదా 2 భాషలు, గ్రూప్-బిలో కనీసం రెండు సబ్జెక్టులు, గ్రూప్-సి నుంచి ఒక వృత్తి విద్యా కోర్సు కలిపి మొత్తం 5 సబ్జెక్టులను ఎంచుకోవాలి. గ్రూప్-సిలోని ఒకేషనల్ కోర్సు ఐచ్ఛికం. దీన్ని ఎంచుకోవాలనుకుంటే గ్రూప్-ఏ, గ్రూప్-బి నుంచి ఒక సబ్జెక్టును ఎంపిక చేసుకోవాలి.

అదనపు సబ్జెక్టులు: విద్యార్థులు ఆసక్తి, అవసరాన్ని బట్టి ఒక ఆదనపు సబ్జెక్టును ఆరో సబ్జెక్టుగా ప్రవేశ సమయంలో గానీ, చదువుతున్నప్పుడు మొదటి నాలుగు కాంటాక్ట్ క్లాసుల్లోపు కానీ ఎంపిక చేసుకోవచ్చు. గ్రూప్-సి నుంచి ఏడో సబ్జెక్టును ఎంపిక చేసుకోవచ్చు.

గ్రూపులవారీ సబ్జెక్టులు:

గ్రూప్-ఏ: ఇంగ్లిష్, హిందీ, తెలుగు, ఉర్దూ, అరబిక్.

గ్రూప్-బి: మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, జీవశాస్త్రం, చరిత్ర, జాగ్రఫీ, రాజనీతిశాస్త్రం, అర్థశాస్త్రం, వాణిజ్య శాస్త్రం, గణాంక శాస్త్రం, గృహ విజ్ఞానశాస్త్రం, మనోవిజ్ఞానశాస్త్రం, సామాజిక శాస్త్రం, పెయింటింగ్, మాస్ కమ్యూనికేషన్.

### నిరంతర మూల్యాంకనం:

ట్యూటర్ మార్క్‌డ్ ఎసైన్‌మెంట్ల (టీఎంఏ) ద్వారా ఎప్పటికప్పుడు విద్యార్థి ప్రగతిని తెలుసుకోవచ్చు. ప్రతి సబ్జెక్టుకి మూడు టీఎంలను పూర్తిచేసి సమర్పించాలి. లేకుంటే పబ్లిక్ పరీక్షలకు అనుమతించరు.

### గరిష్టంగా ఐదేళ్లలో కోర్సు పూర్తి చేయాలి:

ఎస్ఎస్‌సీ, ఇంటర్‌లో చేరిన విద్యార్థులు తెలుగు, హిందీ, ఇంగ్లిష్, ఉర్దూ మాధ్యమాల్లో కోర్సును పూర్తిచేయొచ్చు. ప్రవేశం పొందిన నాటి నుంచి గరిష్టంగా ఐదేళ్లలో కోర్సులను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ కాలంలో మొత్తం తొమ్మిదిసార్లు పరీక్షలు రాసుకునే అవకాశం లభిస్తుంది. ఈ ఐదేళ్ల కాలంలో కోర్సులను పూర్తిచేయలేకపోతే మళ్లీ తాజాగా ప్రవేశం పొంది సంబంధిత కోర్సును చదవొచ్చు. ఇప్పుడు ప్రవేశం పొందినవారు ఏప్రిల్/మే నెలల్లో జరిగే పబ్లిక్ పరీక్షలు రాయాలి. ఆ తర్వాత ప్రతి ఆర్నెళ్లకు జరిగే పరీక్షలకు హాజరుకావచ్చు.

### పరీక్షలు.. సర్టిఫికెట్:

ఎస్ఎస్‌సీ, ఇంటర్ పరీక్షలు ఏడాదిలో రెండుసార్లు (ఏప్రిల్/మే; అక్టోబర్/నవంబర్) జరుగుతాయి. ఎస్ఎస్‌సీ, ఇంటర్‌లో ప్రతి సబ్జెక్టు 100 మార్కులకు ఉంటుంది. పరీక్ష వ్యవధి 3 గంటలు. వృత్తి విద్యా కోర్సుల్లో 70 మార్కులు ప్రాక్టికల్స్‌కు, 30 మార్కులు థియరీకి ఉంటాయి. ఎస్ఎస్‌సీ, ఇంటర్‌లో ప్రతి సబ్జెక్టులోనూ 35 శాతం మార్కులు తెచ్చుకుంటేనే ఉత్తీర్ణులైనట్లుగా పరిగణిస్తారు.

### మార్కుల బదలాయింపు:

ఓపెన్ స్కూల్ ద్వారా అందించే కోర్సుల్లో మార్కుల బదలాయింపు సౌకర్యం కూడా ఉంది. అంతకుముందు ఏదైనా బోర్డ్ నుంచి పది, ఇంటర్‌లో కొన్ని సబ్జెక్టులు ఉత్తీర్ణులై ఉండి..ఇప్పుడు ఓపెన్ స్కూల్ ద్వారా ఆ కోర్సులను పూర్తి చేయాలనుకుంటే పాసైన 2 సబ్జెక్టుల మార్కులను ఈ కోర్సుల్లోకి బదలాయింపు చేసుకోవచ్చు. ఈ సబ్జెక్టులు ఓపెన్ స్కూల్ అందిస్తోన్న సబ్జెక్టులకు చెంది ఉండాలి.అంతేకాకుండా ఈ సబ్జెక్టులు పాసై ఐదేళ్లు మించకుండా ఉండాలి. ఇలా మార్కుల బదలాయింపు పొందాలనుకునే విద్యార్థులు అడ్మిషన్ సమయంలోనే దరఖాస్తులో సంబంధిత సబ్జెక్టుల మార్కుల వివరాలు రాసి.. ఒరిజినల్ మార్కుల సర్టిఫికెట్‌ను దరఖాస్తుతో సమర్పించాలి.

### సర్టిఫికెట్ గుర్తింపు:

ఏపీ ఓపెన్ స్కూల్‌కు రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు ఉంది. ఈ సంస్థ జారీ చేసే సర్టిఫికెట్ అటు ఉన్నత విద్యావకాశాలకు, ఇటు ఉద్యోగావకాశాలకు ఉపయోగపడుతుంది.

### దరఖాస్తు విధానం:

వెబ్‌సైట్: www.apopenschool.org

వివిధ జిల్లాల్లో ఉన్న ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్లలో ఎస్ఎస్‌సీకి ₹ 100, ఇంటర్మీడియెట్‌కి ₹ 200 చెల్లించి దరఖాస్తులు, ప్రాస్పెక్టస్ పొందొచ్చు.

పూర్తి చేసిన దరఖాస్తులు పంపడానికి చివరి తేదీ: ఆగస్టు 31, 2012

SPARK Institute of Physics
The most successful institute in A.P announces result oriented coaching for
Pol. Tech./ JL
Physics/ ECE/ Maths
Batches begin from 27th Aug.
9704531551/ 9492052969

పోటీ పరీక్షార్థులకు సమాచార స్ఫూర్తి... భవిత! ఇకపై మీ సాక్షి టీవీలో
ప్రతి ఆదివారం ఉదయం 9-30 నుంచి 10గం.. వరకు

TCS Vice President Rajanna

# ఇంజనీరింగ్.. వర్క్ హార్డ్... లెర్న్ మోర్

**క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో విద్యార్థికి జాబ్ ఆఫర్ ఇచ్చేముందు.. ఎలాంటి లక్షణాలు పరిశీలిస్తారు?**

క్యాంపస్ ప్లేస్‌మెంట్ నిర్వహించేది కచ్చితంగా జాబ్ ఆఫర్ ఇవ్వడానికే! స్కిల్స్ ఉన్న విద్యార్థులకు అవకాశం ఇవ్వడానికి వెనకడుగు వేయం. ప్లేస్‌మెంట్ ప్రక్రియలో కరిక్యులంలో లేని అంశాలేవి అడగం. ఈ విషయంలో విద్యార్థులు కంపెనీల ఎక్స్‌పెక్టేషన్స్‌కు చాలా దూరంలో ఉంటున్నారు. వాస్తవానికి క్యాంపస్ ప్లేస్‌మెంట్లో బ్రాంచ్‌తో సంబంధంలేకుండా ఇంటర్వ్యూరౌండ్‌కు ఎంపికైన అందరినీ.. మీకు ఏ సబ్జెక్టు ఇష్టం?ఆపరేటింగ్ సిస్టం అంటే ఏంటి?సాఫ్ట్‌వేర్ సిస్టం అంటే? అనే ప్రశ్నలే అడుగుతాం. కాని చాలామంది విద్యార్థులు కనీసం వీటికి కూడా సమాధానం చెప్పలేకపోతున్నారు. వాస్తవానికి విద్యార్థులకు కరిక్యులంపై పట్టుందా? లైఫ్ స్కిల్స్ ఎలా ఉన్నాయి? టీం లీడర్ లక్షణాలున్నాయా? ఎక్కడికైనా వెళ్లి పనిచేయగల సంసిద్ధత?ఆటిట్యూడ్, ఆప్టిట్యూడ్.. ఇలా పలు అంశాలను పరిగణనలోకి తీసుకుని ఎంపికచేస్తాం. గతేడాది టీసీఎస్ రాష్ట్రవ్యాప్తంగా 40 కాలేజీల్లో 5,000 మంది బీటెక్ విద్యార్థులకు జాబ్ ఆఫర్స్ కల్పించింది!

**2013లో రిక్రూట్‌మెంట్స్ ఆశాజనకంగా ఉండవని, ఉన్న ఉద్యోగులకు ప్రోత్సాహకాలు ఇవ్వడానికి కూడా కంపెనీలు సుముఖంగా లేవని సర్వేలు చెబుతున్నాయి. ఇండస్ట్రీలో వాస్తవ పరిస్థితి ఎలా ఉంది?**

నాస్కామ్ అంచనా ప్రకారం- 2012-13లో ఐటీ, మ్యాను ఫ్యాక్చర్, టూరిజం అండ్ హాస్పిటాలిటీ, హెల్త్‌కేర్, మీడియా తదితర రంగాలు కలిపి మొత్తం 16 లక్షల ఉద్యోగాలు ఇవ్వనున్నట్లు తేల్చింది. ఇందులో 4 లక్షల ఉద్యోగాలు మ్యానుఫ్యాక్చరింగ్; 2.30 లక్షల ఉద్యోగాలు ఐటీ రంగం; 2.70 లక్షల జాబ్స్ హెల్త్‌కేర్; 2.30 లక్షల ఉద్యోగాలు హాస్పిటాలిటీ రంగాలు కల్పించనున్నాయి. ఐటీ రంగం కల్పించనున్న 2.30 లక్షల ఉద్యోగాల్లో.. 15 శాతం ఉద్యోగ కల్పన ఆంధ్రప్రదేశ్ నుంచి ఉండబోతోంది. అంటే.. 34,500 ఉద్యోగాలు ఈ ఏడాది రాష్ట్రంలో అన్ని క్యాంపస్‌ల నుంచి వివిధ కంపెనీలు రిక్రూట్ చేసుకోనున్నాయి. ఈ 34,500 ఉద్యోగాల్లో 60 శాతం పోస్టులకు బీటెక్ గ్రాడ్యుయేట్స్‌ను క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ద్వారా సెలక్ట్ చేసుకోనున్నాయి. ప్రస్తుతం ఫోర్త్‌ఇయర్‌కు వచ్చిన బీటెక్ విద్యార్థుల్లో 20,000 నుంచి 25,000 మందికి ఈ ఏడాది ఉద్యోగాలు లభించే ఛాన్స్ ఉంది.

**ప్రస్తుత మన రాష్ట్రంలో ఐటీ రంగ పరిస్థితి ఎలా ఉంది?**

2011-12 ఆర్థిక సంవత్సరంలో దేశంలో ఐటీ వ్యాపారం 100 బిలియన్ డాలర్లు. వృద్ధిరేటు 15 శాతం నుంచి 16 శాతం వరకు ఉంది. ఏపీ విషయానికివస్తే.. 2010-11లో ఐటీ ఎగుమతులు మన రాష్ట్రం నుంచి 35వేల కోట్లు. కాగా, 2011-12 నాటికి రూ.40వేల కోట్లకు చేరుకుంది.

**70 శాతానికిపైగా మార్కులు సాధించిన ఇంజనీరింగ్ విద్యార్థులు సైతం ఉద్యోగాల్లేక ఖాళీగా ఉంటున్నారు. కారణం?**

దేశవ్యాప్తంగా ఇంజనీరింగ్ సీట్లు, విద్యార్థుల సంఖ్యపరంగా చూస్తే.. తమిళనాడు ప్రథమస్థానంలో ఉంది. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్‌ది రెండోస్థానం. ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్‌లను తయారుచేయడంలో ఈ రెండు రాష్ట్రాలు ముందంజలో ఉంటే.. ఉద్యోగావకాశాల కల్పన, వాటిని దక్కించుకోవడంలో మాత్రం చివరిస్థానంలో ఉన్నాయి. ఒకరకంగా చెప్పాలంటే.. ఇక్కడ ఎంప్లాయిబిలిటీ తక్కువ. ఇతర రాష్ట్రాలతో పోల్చితే కేవలం ఉద్యోగం కోసమే చదివే వాళ్లు ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువ. అధిక ఉద్యోగాలు కల్పిస్తున్న ఐటీ రంగం.. గ్లోబల్ బిజినెస్. ఈ రంగంలో ఎక్కడికైనా వెళ్లి పనిచేయగలిగే లక్షణాలు, సంసిద్ధత అవసరం. అలా అయితేనే ఉద్యోగాలు లభిస్తాయి.

**ఆసోచామ్, నాస్కామ్ నివేదికలు ఏపీలో ఇంజనీరింగ్, ఫార్మసీ, మేనేజ్‌మెంట్ విద్యా ప్రమాణాలు దిగజారుతున్నాయని స్పష్టం చేస్తున్నాయి.. వీటిని మెరుగుపర్చడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలి?**

ఏపీలో లభిస్తున్న ఉద్యోగాలకంటే.. ఇక్కడ తయారవుతున్న గ్రాడ్యుయేట్లు దేశంలోనే ఎక్కువ. కోర్సు పూర్తిచేసుకుని బయటకువచ్చే విద్యార్థికి జాబ్ గ్యారెంటీ ఉండాలంటే.. ముందు నిపుణులైన ప్రొఫెసర్లు, లెక్చరర్లు చాలా అవసరం. ఇంజనీరింగ్ విద్యా ప్రమాణాలు పెంచాలంటే.. ఇంటర్న్‌షిప్‌లు తప్పనిసరిచేయాలి. దీనివలన ప్రాక్టికల్ ఎక్స్‌పోజర్ పెరిగి.. కోర్సు పూర్తయ్యేనాటికి ఉద్యోగం సంపాదించగలనన్న ధీమా, ఆత్మవిశ్వాసం విద్యార్థిలో ఏర్పడుతుంది. ఆ దిశగా ఇప్పటికే మేం చాలా చేస్తున్నాం. మా కంపెనీల ప్రతినిధులను పంపి చాలా కాలేజీల్లో ఫ్యాకల్టీకి శిక్షణ ఇస్తున్నాం. స్టూడెంట్స్ వర్క్‌షాప్స్ నిర్వహిస్తున్నాం. సీఈవో కనెక్ట్ ప్రోగ్రామ్స్ నిర్వహిస్తున్నాం. తద్వారా కాలేజీలకు మా కంపెనీ ప్రతినిధులు వెళ్లి అవసరమైన స్కిల్స్, ప్రస్తుతం విద్యార్థులు వేటిని ఇంప్రూవ్ చేసుకోవాలి? అనే పలు విషయాలపై శిక్షణ ఇస్తున్నాం.

**ఉన్నత విద్యారంగంలో ఫ్యాకల్టీ కొరత తీరాలంటే ఏంచేయాలి?**

ముందు విద్యా ప్రమాణాలు పెంచాలి. ఎంటెక్ తర్వాత ఇంజనీరింగ్ రంగంలో పరిశోధనలు చేయాలంటే.. ముందు బీటెక్ స్థాయిలోనే మంచి విద్యార్థిని తయారుచేయాలి. మంచి విద్యార్థి తయారుకావాలంటే.. వాళ్లకి మంచి పాఠాలు చెప్పే ఫ్యాకల్టీ అవసరం. ఫ్యాకల్టీ కొరత తీరాలంటే.. డిగ్రీ స్థాయిలోనే నాణ్యమైన ప్రమాణాలు అమలు చేయాలి. కాలేజీలు, యూనివర్సిటీల్లోని ఫ్యాకల్టీకి ఎప్పటికప్పుడు పునశ్చరణ తరగతులు, మార్కెట్లోకి వస్తున్న కొత్త సవాళ్లు, పరిజ్ఞానం వీరికి తెలిసేలా చేయాలి. ఎవరికైనా నాలెడ్జ్ అప్‌డేట్ అవసరం. టీసీఎస్‌లో ప్రతీ ఉద్యోగికి ఎప్పటికప్పుడు టెక్నాలజీకి అనుగుణంగా తయారయ్యేలా క్లాస్‌లుంటాయి. ఇలాంటి విధానాన్ని కచ్చితంగా అమలుచేయాలి.

**పట్టణ విద్యార్థులతో పోల్చితే గ్రామీణప్రాంత విద్యార్థులు అవకాశాలు అందుకోవడంలో వెనుకబడిపోతున్నారు? వీరిలో స్కిల్స్ మెరుగుపరచడానికి టీసీఎస్ ఏమైనా చేస్తోందా?**

గ్రామీణప్రాంత విద్యార్థులతో పోల్చితే నగర విద్యార్థులకు లొకేషన్ అడ్వాంటేజ్ ఉంటుంది. గ్రామీణప్రాంత విద్యార్థులకు ఉద్యోగాలు లభించకపోవడానికి చాలా కారణాలున్నాయి. కమ్యూనికేషన్, లాంగ్వేజ్ స్కిల్స్ వీళ్లలో చాలా తక్కువగా ఉన్నాయి. వాస్తవానికి ఉద్యోగం సొంతం చేసుకోవడంలో ఇవే కీలకం. అందుకే గ్రామీణ ప్రాంత విద్యార్థులు బాగా చదవగలిగినా.. జాబ్స్ లభించడంలేదు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో స్కిల్స్ మెరుగుపరచడానికి ఇప్పటికే మేం చాలా ప్రయత్నాలు చేస్తున్నాం. అందుకోసం ఫినిషింగ్ స్కూల్స్ నిర్వహిస్తున్నాం. తద్వారా కంపెనీ కోరుకునే లక్షణాలు పెంపొందించే ప్రయత్నం చేస్తున్నాం. పరిశ్రమ అవసరాలకు తగ్గట్లుగా వారిని తీర్చిదిద్దుతున్నాం. విద్యార్థులు కూడా తమ వంతు ప్రయత్నం చేయాలి. ఇంగ్లిష్ పత్రికలు, టీవీ ఛానెల్స్ చూడాలి. స్కిల్స్ విషయంలో కాలేజీలు కూడా విద్యార్థులకు చేయూతనివ్వాలి.



గ్రామీణప్రాంత విద్యార్థులకు ఉద్యోగాలు లభించకపోవడానికి కమ్యూనికేషన్ స్కిల్స్, లాంగ్వేజ్ స్కిల్స్ లేకపోవడమే ప్రధాన కారణం. అమెరికాలో సీరియస్ ఎడ్యుకేషన్ సిస్టం ఉంది. అక్కడ ప్రతి విద్యార్థి పట్టుదలగా కష్టపడి చదువుతాడు. కాని మనవాళ్లలో ఇదే లోపించింది. క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ఇంటర్వ్యూకు వెళ్లేటప్పుడు అక్కడేం అడుగుతారు? ఏం చెప్పాలనే దానిపై కనీస కసరత్తు చేయడంలేదు. 2012-13 క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో ఆంధ్రప్రదేశ్ నుంచి 25,000 మంది బీటెక్ విద్యార్థులకు ఉద్యోగాలు లభించే ఛాన్స్ ఉంది. స్కిల్స్ ఉన్న విద్యార్థులకు జాబ్ ఇవ్వడానికి కంపెనీలు ఎప్పుడూ సిద్ధంగానే ఉంటాయి అంటున్నారు టాటా కన్సల్టెన్సీ (టీసీఎస్) సర్వీసెస్ వైస్‌ప్రెసిడెంట్, రీజనల్ హెడ్ వి.రాజన్న. ఆయనతో సాక్షి ప్రత్యేక ఇంటర్వ్యూ మీ కోసం...

**టీసీఎస్‌లో కొత్తగా చేరిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ పనితీరును ఏ విధంగా అంచనావేస్తారు?**

టీసీఎస్ కంపెనీలో ఏటా రెండుసార్లు పనితీరు అసెస్‌మెంట్ ఉంటుంది. ప్రతి ఆరు నెలలకోసారి ఫీడ్‌బ్యాక్ తీసుకుంటాం. కంపెనీలో ఉద్యోగి చేస్తున్న పని విధానాన్ని బట్టి అతడి పనితీరు మదింపు ఉంటుంది. ప్రధానంగా కంపెనీకి వచ్చిన ఆదాయం, సర్వీస్ డెలివరీ, కస్టమర్, ఎంప్లాయి సంతృప్తి.. ఈ సూత్రాల ఆధారంగా పనితీరును అంచనావేస్తారు. మిగిలినవాళ్లతో పోల్చితే తాజా బీటెక్ విద్యార్థులు కంపెనీలో మంచి పనితీరు కనబరుస్తారు. పైగా కొన్నిసార్లు కంపెనీకి క్రిటికల్ ప్రాజెక్టులు వస్తాయి. వీటిని సమర్థంగా నిర్వహించగలిగేది వీళ్లే. అందుకే బీటెక్ అర్హత ఉన్న వాళ్లకే అవకాశాలు బాగుంటాయి.

**టీసీఎస్‌లో జాబ్ ఆశించే విద్యార్థులకు మీ సలహా?**

బీటెక్ ప్రథమ సంవత్సరం నుంచే బాగా కష్టపడి చదవాలి. చేరినప్పటి నుంచే జాబ్ వస్తుందా? ఫోర్త్ ఇయర్ వచ్చేసరికి మార్కెట్ ఎలా ఉంటుందో? వంటి అనవసర ఆందోళనలు పెట్టుకోకూడదు. బేసిక్స్‌పై పట్టు సాధించేలా చదవాలి. క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో కంపెనీ ప్రతినిధులు ఆయా సబ్జెక్టుల్లో పట్టుందా? లేదా? అని తేల్చుతారు. ఇందులో నిరూపించుకుంటే.. సగం జాబ్ ఖాయం చేసుకున్నట్లే. ఆ తర్వాత లైఫ్‌స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్‌ను మెరుగుపరచుకోవాలి. ఇంగ్లిష్‌పై పట్టు చాలా అవసరం. టీం లీడర్ లక్షణాలు అలవరచుకోవాలి.

**బ్రాంచ్ ఎంపికలో విద్యార్థులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?**

ముందు మంచి కాలేజీ ఏదో తెలుసుకోవాలి. ఆ తర్వాత వ్యక్తిగత లక్ష్యాలు, ఇష్టాయిష్టాలు ముఖ్యం.స్నేహితులు చేరారనో, పేరెంట్స్ చెప్పారనో.. తీసుకుంటే నష్టపోయేది విద్యార్థే. వాస్తవానికి ఇంటర్ స్థాయిలోనే కనీస స్పష్టత తెచ్చుకుంటే.. కెరీర్‌కు మంచి బాటవేసుకున్నట్లే!

**విదేశాల్లో రీసెర్చ్ ఓరియెంటెడ్ విద్యావిధానం ఉంటే.. మన దేశంలో ఇప్పటికీ సంప్రదాయక విధానమే ఉంది?**

ఏ దేశంలోనైనా నాణ్యమైన, గొప్ప ప్రొఫెసర్లు తయారవ్వాలంటే.. ముందు రీసెర్చ్ విద్యను ప్రోత్సహించాలి. ఈ విషయంలో చైనా, అమెరికానే మించిపోయి ప్రపంచంలో అత్యధికమంది పీహెచ్‌డీ విద్యార్థులను ప్రోత్సహిస్తోంది. పీహెచ్‌డీ చేసే విద్యార్థులు పెరగాలంటే.. కచ్చితంగా మార్కెట్లో మంచి అవకాశాలు లభిస్తాయనే భరోసా కల్పించాలి.

**అవకాశాలు అందుకోవడంలో, మనకు విదేశీ విద్యార్థులకు వ్యత్యాసం?**

అమెరికానే తీసుకుంటే.. అక్కడ సీరియస్ ఎడ్యుకేషన్ సిస్టం ఉంది. ప్రతి విద్యార్థి పట్టుదలగా కష్టపడి చదువుతాడు. మనవాళ్లలో ఇదే లోపించింది. చివరకు ఇంటర్వ్యూలకు, క్యాంపస్ ప్లేస్‌మెంట్‌కు వెళ్లేటప్పుడు కూడా ఏం అడుగుతారు? అక్కడేం చెప్పాలి? అనేదానిపై కనీస కసరత్తు చేయడంలేదు. యూఎస్‌లో ఒక్కో విద్యార్థి కనీసం రెండు లేదా మూడు సబ్జెక్టుల్లో ఛాంపియన్‌గా ఉంటాడు. ఇదే వారికి అవకాశాలు తెచ్చిపెడుతుంది.

**బీటెక్ విద్యార్థులకు మీ సలహా?**

వర్క్ హార్డ్, లెర్న్ మోర్... ఇవి సరిగ్గా పాటిస్తే ఎవరైనా విజేతలే. ఉద్యోగం కోసమే ఇంజనీరింగ్ అనే భావన వద్దు. కాలేజీలో చేరినప్పటి నుంచే అనవసరపు ఆందోళన చెందక్కర్లేదు. అదేవిధంగా క్యాంపస్ ప్లేస్‌మెంట్స్,లేదా ఇంటర్వ్యూకి వెళ్లేటప్పుడు చేయాల్సిన మొదటిపని ప్రిపేర్‌కావడం. ఇది లేకుండా ఎక్కడికివెళ్లినా జాబ్ ఆఫర్ రావడం సాధ్యం కాదు. అన్ని బ్రాంచ్‌లకు అవకాశాలు బాగానే ఉన్నాయి!!

భవిత Now Bhavita Also on Sakshi TV
Every Sunday9-30am to 10am

IRMA- Courses

# రూరల్ మేనేజ్‌మెంట్ కోర్సులు...



**దేశానికి పట్టు కొమ్మలు గ్రామాలు. అలాంటి గ్రామ ప్రాంతాల అభివృద్ధిలో కో-ఆపరేటివ్ సొసైటీలు, అభివృద్ధి ఏజెన్సీలది కీలక పాత్ర.. వీటిల్లో ప్రొఫెషనలిజం పెంచడం ద్వారా.. గ్రామాలు మరింత ముందడుగు వేసే అవకాశం ఉంది. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని అవసరమైన కోర్సులను అందించే సంస్థ.. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ మేనేజ్‌మెంట్, ఆనంద్ (ఐఆర్‌ఎంఏ). 2012-13 విద్యా సంవత్సరానికి ఐఆర్‌ఎంఏ నోటిఫికేషన్ విడుదల చేసింది.**

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ మేనేజ్‌మెంట్(ఐఆర్‌ఎంఏ)ను 1979లో గుజరాత్‌లోని ఆనంద్‌లో స్థాపించారు. పాడి పరిశ్రమలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చిన డాక్టర్ కురియన్ మార్గదర్శకం మేరకు ఈ ఇన్‌స్టిట్యూట్ పని చేస్తుంది. ఈ ఇన్‌స్టిట్యూట్ సీనియర్ సర్వీస్ మేనేజర్స్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, ఎన్‌జీఓలు, కార్పొరేట్ సంస్థల్లో రూరల్ డెవలప్‌మెంట్ విభాగాల్లో పని చేసే అధికారులకు మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ ద్వారా శిక్షణ ఇస్తుంది.

### ఆఫర్ చేస్తున్న కోర్సులు:

**పోస్టుగ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ ఇన్ రూరల్ మేనేజ్‌మెంట్ (పీఆర్‌ఎమ్):** గ్రామీణ అభివృద్ధి సంస్థల్లో, రూరల్ కో ఆపరేటివ్ సంస్థల్లో.. ప్రొఫెషనలిజంను పెంచడానికి అవసరమైన అంశాల దృష్టిలో ఉంచుకుని సిలబస్‌ను రూపొందించారు. గ్రామీణప్రాంతాల్లో చేపట్టవలసిన చర్యలు, కార్యక్రమాలకు సంబంధించిన సవాళ్లను ఎదుర్కొనేందుకు.. సంబంధిత ఆర్గనైజేషన్స్‌లో మేనేజర్‌గా విధులు నిర్వహించడానికి కావాలసిన నైపుణ్యాలను ఈ కోర్సులో బోధిస్తారు. ఈ కోర్సు క్లాస్ రూం టీచింగ్, ఫీల్డ్ వర్క్ (ఫీల్డ్ వర్క్), డెవలప్‌మెంట్ ఇంటర్న్‌షిప్, మేనేజ్‌మెంట్ ట్రైనింగ్ అని నాలుగు విభాగాలుగా ఉంటుంది.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి 50 శాతం మార్కులతో (ఎస్సీ, ఎస్టీలకు 45 శాతం)ఏదైనా గ్రాడ్యుయేషన్ (10+2+3 విధానంలో).

కాల వ్యవధి: రెండేళ్లు

ప్రవేశ విధానం: ఇన్‌స్టిట్యూట్ నిర్వహించే రాత పరీక్ష, ఇంటర్వ్యూ, గ్రూప్ డిస్కషన్ ఆధారంగా. ప్రీవియస్ కొశ్చన్ పేపర్స్‌ను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

**ఫెలో ప్రోగ్రాం ఇన్ రూరల్ మేనేజ్‌మెంట్ (ఎఫ్‌పీఆర్‌ఎమ్):** ఇది కోర్సు బేస్డ్ డాక్టోరల్ రెసిడెన్సీ ప్రోగ్రామ్. ఈ కోర్సులో భాగంగా పలు రకాల స్పెషలైజేషన్స్‌ను ఎంచుకోవాలి. అవి.. మేనేజ్‌మెంట్, అగ్రి బిజినెస్/రూరల్ మార్కెటింగ్, నేచురల్ రీసోర్స్ మేనేజ్‌మెంట్, డెవలప్‌మెంట్ మేనేజ్‌మెంట్, మైక్రో ఫైనాన్స్ మేనేజ్‌మెంట్, గవర్నెనెస్ అండ్ లైవ్లీహుడ్స్, రూరల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అండ్ సర్వీసెస్ మేనేజ్‌మెంట్, పబ్లిక్ పాలసీ అండ్ నాన్ ప్రాఫిట్ మేనేజ్‌మెంట్.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి 55 శాతం మార్కులతోఏదైనా సబ్జెక్ట్‌లో పోస్ట్‌గ్రాడ్యుయేషన్. డిగ్రీలో 50 శాతం మార్కులు ఉండాలి. లేదా ఐఆర్‌ఎంఏ నుంచి పీజీడిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ లేదా 60 శాతం మార్కులతో ప్రొఫెషనల్ డిగ్రీ (ఇంజనీరింగ్, మెడిసిన్, అగ్రికల్చరల్, సైన్సెస్)తోపాటు మూడేళ్ల అనుభవం (ఐదేళ్ల డిగ్రీకి-సంవత్సరం).

### ఫెలోషిప్:

ఈ ప్రోగ్రామ్‌కు ఎంపికైన అభ్యర్థులకు ఫెలోషిప్ కూడా అందజేస్తారు. ప్రారంభంలో నెలకు రూ.14,000 ఫెలోషిప్ చెల్లిస్తారు. తర్వాత ఉండే క్వాలిఫైయింగ్ ఎగ్జామినేషన్‌లో ఉత్తీర్ణులైన వారికి నెలకు రూ.16,000 ఫెలోషిప్ ఉంటుంది. ఇవికాకుండా కంటిన్‌జెన్సీ నిధుల కింద సంవత్సరానికి రూ. 20,000 చొప్పున నాలుగేళ్లు ఇస్తారు.

ప్రవేశ విధానం: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు. దీంతోపాటు ఒక వ్యాసాన్ని కూడా ప్రెజెంట్ చేయాల్సి ఉంటుంది. అలాగే మేనేజ్‌మెంట్, సోషల్ వర్క్, ఎకనామిక్స్, సోషియాలజీ, సైకాలజీ, కామర్స్‌లో యూజీసీ-జేఆర్‌ఎఫ్/సీఎస్ఐఆర్ నెట్‌లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు రాత పరీక్షకు హాజరు కావల్సిన అవసరం లేదు. వీరికి ఇంటర్వ్యూ నిర్వహించి ప్రవేశం కల్పిస్తారు. ప్రీవియస్ కొశ్చన్ పేపర్స్‌ను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

### స్కాలర్‌షిప్-ప్లేస్‌మెంట్స్:

ఐఆర్‌ఎంఏ విద్యార్థులకు రతన్‌టాటా స్కాలర్‌షిప్‌తోపాటు అన్ని రకాల ప్రభుత్వ, ప్రైవేట్ స్కాలర్‌షిప్స్ అందుబాటులో ఉంటాయి. అంతేకాకుండా 15 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం స్కాలర్ షిప్ మంజూరు చేస్తుంది. ఈ ఇన్‌స్టిట్యూట్ దారిద్ర్యరేఖకు దిగువన(బీపీఎల్) ఉన్న పేద విద్యార్థులకు ట్యూషన్ ఫీజులో కొంత మినహాయింపు ఇస్తుంది. ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా-ఆనంద్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎటువంటి హామీ లేకుండా ఎడ్యుకేషన్ లోన్ అందిస్తుంది. ప్లేస్‌మెంట్ విషయంలో కూడా ఐఆర్‌ఎంఏకు మంచి ట్రాక్ రికార్డు ఉంది. ఇక్కడి అభ్యర్థులు వివిధ యూనివర్సిటీలు, కాలేజీలు, ఎన్‌ఎంసీలతోపాటు ప్రఖ్యాత ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం)లలో వివిధ హోదాల్లో స్థిర పడ్డారు.

### కెరీర్:

రూరల్ మేనేజ్‌మెంట్ కోర్సు చేసిన వారికి కేంద్ర, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థల్లో విస్తృత ఉద్యోగావకాశాలు ఉంటాయి. రూరల్ డెవలప్‌మెంట్, కమ్యూనిటీ మొబలైజేషన్, మేనేజింగ్ కలెక్టివ్స్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, ప్లానింగ్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, ప్రొడెక్షన్ మేనేజ్ మెంట్, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్, హ్యూమన్ రీసోర్స్ డెవలప్‌మెంట్, నేచురల్ రీసోర్స్ మేనేజ్‌మెంట్ విభాగాల్లో అవకాశాలు లభిస్తాయి. గ్రామీణాప్రాంతాల అభివృద్ధికోసం పని చేసే వివిధ ప్రైవేట్ సంస్థల్లో, ఎన్‌జీవోలలో ఉపాధి అవకాశాలు లభించవచ్చు. పీహెచ్‌డీ పూర్తి చేసిన వారు వివిధ యూనివర్సిటీలు, కాలేజీల్లో రూరల్ డెవలప్‌మెంట్, మేనేజ్‌మెంట్ విభాగాల్లో ఫ్యాకల్టీగా అవకాశాలను పొందవచ్చు. ఈ కోర్సు ఉత్తీర్ణులకు సంవత్సరానికి రూ.8 లక్షల వరకు వేతనం లభించవచ్చు.

### దరఖాస్తు:

వెబ్‌సైట్ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తర్వాత హార్డ్‌కాపీని ప్రింట్ అవుట్ తీసి కింది చిరునామాకు పంపాలి. లేదా వెబ్‌సైట్ నుంచి కూడా దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

అడ్మిషన్స్ ఆఫీసు, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్
మేనేజ్‌మెంట్ అండ్- ఆనంద్(ఐఆర్‌ఎంఏ)
ఆనంద్-388 001, గుజరాత్.

### ముఖ్యతేదీలు:

దరఖాస్తుల స్వీకరణకు చివరితేదీ: సెప్టెంబర్ 30, 2012
పరీక్ష తేదీ: నవంబర్ 11
రాష్ట్రంలో పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, విజయవాడ.
వివరాలకు: www.irma.ac.in

## జాబ్స్

### అలహాబాద్ బ్యాంక్

అలహాబాద్ బ్యాంక్, క్లరికల్ కేడర్(సింగిల్ విండో ఆపరేటర్) పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది.

మొత్తం పోస్టుల సంఖ్య: 1100
ఇందులో మన రాష్ట్రానికి కేటాయించినవి: 55.
వయసు: 18-28 ఏళ్లు (ఆగస్టు 1, 2012 నాటికి)
ఎంపిక విధానం: ఐబీపీఎస్-క్లరికల్ కేడర్ ఎగ్జామినేషన్ స్కోర్, ఇంటర్వ్యూ ఆధారంగా.
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభం: ఆగస్టు 8, 2012
ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ముగింపు: ఆగస్టు 23, 2012
వివరాలకు: www.allahabadbank.com

### తమిళనాడు మార్కంటైల్ బ్యాంక్ లిమిటెడ్

తమిళనాడు మార్కం టైల్ బ్యాంక్ లిమిటెడ్, పలు స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది.

- అగ్రికల్చర్ ఆఫీసర్
- చార్టెడ్ అకౌంటెంట్
- లా ఆఫీసర్

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభం: ఆగస్టు 8, 2012
ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ముగింపు: ఆగస్టు 25, 2012
వివరాలకు: http://career.tmb.in

### ఇండియన్ ఆర్మీ

ఇండియన్ ఆర్మీ,టెక్నికల్ విభాగంలో షార్ట్ సర్వీస్ కమిషన్డ్ ఆఫీసర్ పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది.

అర్హత (పురుషులు): బీటెక్/బీఈ (సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్, ఆటోమొబైల్ ఇంజనీరింగ్, ప్రొడక్షన్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్/టెలికమ్యూనికేషన్, ఆర్కిటెక్చర్/బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్/కంప్యూటర్ సైన్స్/ఎంఎస్సీ-కంప్యూటర్స్). నిర్దేశించిన విధంగా శారీరక ప్రమాణాలు ఉండాలి.
వయసు: 20-27 ఏళ్లు.
ఎంపిక విధానం: ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ ఆధారంగా.
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ: ఆగస్టు 31, 2012.
పూర్తి వివరాలకు జూలై 28-ఆగస్టు 3 ఎంప్లాయిమెంట్ న్యూస్ చూడొచ్చు.
వివరాలకు: http://joinindianarmy.nic.in

### పంజాబ్ నేషనల్ బ్యాంక్

పంజాబ్ నేషనల్ బ్యాంక్, మేనేజ్‌మెంట్ ట్రైనీస్ నియామకం కోసం నిర్వహించే పీజీ డిప్లొమా ఇన్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ ప్రోగ్రామ్‌లో ప్రవేశం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. కోర్సు తర్వాత అభ్యర్థులను మేనేజ్‌మెంట్ ట్రైనీస్‌గా రిక్రూట్ చేసుకుంటారు.

అర్హత: ఐబీపీఎస్-ప్రొబేషనరీ ఆఫీసర్స్ ఎగ్జామ్‌లో అర్హత సాధించి ఉండాలి.
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభం: ఆగస్టు 13, 2012
ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ముగింపు: ఆగస్టు 27, 2012
వివరాలకు: www.pnbindia.in

### పోస్టల్ శాఖలో ఖాళీలు

కేంద్ర పోస్టల్ శాఖ ఆంధ్ర ప్రదేశ్ రీజియన్‌లో పోస్టల్ అసిస్టెంట్, సార్టింగ్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

వివరాలు..

**పోస్టల్ అసిస్టెంట్:**
ఖాళీలు: 362 (జనరల్ 287, ఎస్‌బీసీఓ 13, ఎంఎంఎస్1, ఎక్స్ సర్వీస్‌మెన్ 43)

**సార్టింగ్ అసిస్టెంట్:** ఖాళీలు: 69

అర్హత: ఆరవై శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ లేదా తత్సమాన కోర్సులో ఉత్తీర్ణత సాధించాలి. వయస్సు 18 నుంచి 27 సంవత్సరాల మధ్యలో ఉండాలి.
ఎంపిక విధానం: ఆప్టిట్యూడ్ టెస్ట్, కంప్యూటర్ స్కిల్ టెస్ట్‌లో ప్రతిభ ఆధారంగా. కంప్యూటర్ స్కిల్ టెస్ట్‌లో టైపింగ్ నైపుణ్యాన్ని పరీక్షిస్తారు.
దరఖాస్తు విధానం: నిర్దేశిత హెడ్ పోస్ట్ ఆఫీస్‌లలో రూ. 50 చెల్లించి దరఖాస్తులు పొందొచ్చు. పూర్తి చేసిన దరఖాస్తులను పోస్ట్ ద్వారా మాత్రమే పంపించాలి.
ఫీజు: రూ. 200 పోస్ట్ ఆఫీస్‌లో చెల్లించాలి.
దరఖాస్తుల ప్రారంభం: ఆగస్టు 11, 2012
దరఖాస్తుల విక్రయం చివరి తేదీ: సెప్టెంబర్ 25, 2012
పూర్తి చేసిన దరఖాస్తులకు చివరి తేదీ: అక్టోబర్ 1, 2012
దరఖాస్తులు పంపాల్సిన చిరునామా:

డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ సెల్,
న్యూఢిల్లీ హెడ్ పోస్ట్ ఆఫీస్, న్యూఢిల్లీ - 110001
వివరాలకు: www.indiapost.gov.in

### ఏజీబీఎస్సీ గ్రాడ్యుయేట్లకు పొగాకు బోర్డులో అవకాశాలు:

గుంటూరు కేంద్రంగా ఉన్న పొగాకు బోర్డ్ ఫీల్డ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.

ఖాళీల సంఖ్య: 12
అర్హత: అగ్రికల్చర్ బీఎస్సీ ఉత్తీర్ణత
వయస్సు 30 సంవత్సరాల్లోపు
ఎంపిక విధానం: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా
దరఖాస్తు: బయోడేటాను పోస్ట్ ద్వారా అందించాలి.
చివరి తేదీ: సెప్టెంబర్ 14.
చిరునామా:

సెక్రెటరీ, టుబాకో బోర్డ్,
పోస్ట్ బాక్స్ నెం: 322,
శ్రీనివాసరావు తోట,
జి.టి. రోడ్, గుంటూరు- 522 004

# సరైన కెరీర్‌కు.. సులువైన దారి.. సీఏ



మట్టుపల్లి మోహన్
మాస్టర్ మైండ్స్, గుంటూరు.

ప్రపంచంలో ఆర్థికపరంగా, వ్యాపార, వాణిజ్య రంగంలో వేగంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా సీఏల అవసరం పెరిగింది. డిమాండ్‌కు తగ్గట్టు ఈ కోర్సును పూర్తిచేసినవారు లేరు. ఎక్కువమంది మెడిసిన్, ఇంజనీరింగ్ కోర్సులవైపు ఆసక్తి చూపిస్తున్నారు. మరికొద్ది మంది సైన్స్ కోర్సులవైపు అడుగులు వేయడంతో ఈ రంగాల్లో డిమాండ్‌కు మించి ఆయా కోర్సులు పూర్తి చేసిన వారున్నారు. వీరు లక్షలు ఖర్చుపెట్టి ఏళ్లకి ఏళ్లు శ్రమించి చివరకు నిరుద్యోగులుగా మిగులుతున్నారు. ఇందుకు ప్రత్యామ్నాయంగా సీఏ కోర్సును పూర్తి చేస్తే నెలకు లక్షలు ఆర్జించే జీతాలతోపాటు గౌరవప్రదమైన జీవితం విద్యార్థుల సొంతమవుతుంది. ఈ ఏడాది నుంచి సీఏ కోర్సులో మార్పులు చోటు చేసుకోనున్నాయి. ఈ నేపథ్యంలో సీఏ కోర్సుపై ప్రత్యేక ఫోకస్..



### స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థ ఐసీఏఐ:
ప్రతి దేశంలో ఛార్టడ్ అకౌంటెంట్లను అందించడానికి ప్రత్యేక అకౌంటింగ్ అసోసియేషన్‌లు ఉన్నాయి. ఈ సంస్థలు సీఏలుగా రూపొందడానికి కావాల్సిన అన్ని రకాల శిక్షణనందిస్తూ ఆర్థిక వ్యవహారాలలో నిష్ణాతులుగా తీర్చిదిద్దుతున్నాయి. ఆదేవిధంగా మన దేశంలో సీఏలను తయారుచేసేందుకు 1949లో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) అనే సంస్థను పార్లమెంట్ ఆమోదంతో ఏర్పాటు చేశారు.

### సీఏ కోర్సుకు అర్హత:
ఇంటర్మీడియెట్‌లో ఏ గ్రూప్ పూర్తిచేసినవారైనా సీఏ చదివేందుకు అర్హులు. సీఏలో సీపీటీ, ఐపీసీసీ, సీఏ ఫైనల్ అనే మూడు దశలు ఉంటాయి. ఈ కోర్సు మొత్తం పూర్తవడానికి ఇంటర్ తర్వాత కనీసం 4 ఏళ్లు పడుతుంది.

### సీఏ అభ్యసించేందుకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి:
సీఏ అభ్యసించే వారికి రిజిస్ట్రేషన్ తప్పనిసరి. ఈ రిజిస్ట్రేషన్‌ను పదో తరగతి ఉత్తీర్ణులైన ప్రతి విద్యార్థి చేయించుకోవచ్చు. అయితే దరఖాస్తు చేసుకునే సమయానికి, సీపీటీకి మధ్య రెండు నెలల వ్యవధి తప్పనిసరి. రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టర్డ్ అకౌంటెంట్ ఆఫ్ ఇండియా నిర్ణయించిన ఫీజును చెల్లించాలి. ప్రస్తుతానికి ఇంటర్మీడియెట్ అర్హతతో సీపీటీకి సుమారు ₹ 6000 చెల్లించాలి. ఈ మొత్తాన్ని దక్షిణ భారతదేశ విభాగం సీఏ కేంద్రం చెన్నై చిరునామాకి పంపించాల్సి ఉంటుంది. అలా రిజిస్ట్రేషన్ పొందినవారు మాత్రమే సీపీటీ పరీక్ష రాసేందుకు అర్హులు. ఐపీసీసీ రిజిస్ట్రేషన్ కోసం ₹ 9000, ఆర్టికల్‌షిప్ కోసం మరో ₹ 2000 చెల్లించాల్సి ఉంటుంది. సీఏ ఫైనల్ కోసం సుమారు ₹ 8500ల రిజిస్ట్రేషన్ ఫీజును చెల్లించాలి.

### కామన్ ప్రొఫిషియన్సీ టెస్ట్ (సీపీటీ):
ఇంటర్ పూర్తిచేసిన విద్యార్థుల కోసం ప్రతి ఏడాది జూన్, డిసెంబర్ నెలల్లో దేశవ్యాప్తంగా సీపీటీని నిర్వహిస్తారు. ఈ పరీక్ష 200 మార్కులకు ఆబ్జెక్టివ్ విధానంలో రెండు సెషన్‌లుగా ఉంటుంది. మొదటి సెషన్‌లో సెక్షన్-ఏలో ఫండమెంటల్స్ ఆఫ్ అకౌంటింగ్ 60 మార్కులకు, సెక్షన్-బీలో మర్కంటైల్ లా 40 మార్కులకు ఉంటుంది. రెండో సెషన్‌లో సెక్షన్-సీ జనరల్ ఎకనామిక్స్ 50 మార్కులకు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 50 మార్కులకు ఉంటాయి. 200 మార్కులకు జరిగే ఈ పరీక్షలో విద్యార్థులు కనీసం 50 శాతం అంటే 100 మార్కులను సాధిస్తేనే ఐపీసీసీకి అర్హులవుతారు. పరీక్ష వ్యవధి: ఒక్కో సెషన్ రెండు గంటలు.

### ఇంటిగ్రేటెడ్ ప్రొఫిషియన్సీ కాంపిటెన్సీ కోర్సు (ఐపీసీసీ):
ప్రతి ఏడాది మే, నవంబర్ నెలల్లో ఐపీసీసీ పరీక్షలు నిర్వహిస్తారు. ఐపీసీసీ రెండు గ్రూపులుగా ఉంటుంది. గ్రూప్-1లో అకౌంటింగ్ 100 మార్కులకు, లా, ఎథిక్స్ అండ్ కమ్యూనికేషన్ 100 మార్కులకు, కాస్ట్ అకౌంటింగ్ అండ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ 100 మార్కులకు, ట్యాక్సేషన్ 100 మార్కులకు ఉంటాయి. ఈ నాలుగు పేపర్లలో 400 మార్కులకు జరిగే పరీక్షలో ఒక్కొక్క సబ్జెక్టులో కనీసం 40 మార్కులు సాధించి మొత్తం మీద 50 శాతం మార్కులతో 200, ఆపై మార్కులు సాధించాలి.

గ్రూప్-2లో అడ్వాన్స్‌డ్ అకౌంటింగ్ 100 మార్కులకు, ఆడిటింగ్ అండ్ అష్యూరెన్స్ 100 మార్కులకు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్ 100 మార్కులకు ఉంటాయి. ఒక్కో పేపర్ వ్యవధి మూడు గంటలు. ఈ గ్రూప్‌లో కూడా కనీసం 40 మార్కులు ప్రతి సబ్జెక్ట్‌లో సాధించాలి. అలాగే గ్రూప్ మొత్తం మీద 50 శాతం మార్కులు అంటే 150పైన మార్కులు సాధిస్తేనే ఐపీసీసీ ఉత్తీర్ణులవుతారు.

ఐపీసీసీకి నమోదు చేసుకున్న నాటి నుంచి 9 నెలల్లో పూర్తి చేయాలి. ఆ తర్వాత వారం రోజులుపాటు నిర్వహించే ఓరియెంటేషన్ కోర్స్; ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ట్రైనింగ్‌లో నిర్వహించే వంద గంటల కోర్సులోనూ ఉత్తీర్ణత సాధించాలి.

### రెండున్నరేళ్ల ఆర్టికల్‌షిప్‌తో స్టైఫండ్ సదుపాయం:
ఐపీసీసీలో గ్రూప్-1 ఉత్తీర్ణత పొందిన విద్యార్థులు ప్రొఫెషనల్ ఛార్టడ్ అకౌంటెంట్ వద్ద రెండున్నర ఏళ్లపాటు తప్పనిసరిగా ఆర్టికల్‌షిప్ చేయాల్సి ఉంటుంది. ఇలా శిక్షణ పొందుతున్న కాలంలో ప్రతి నెలా స్టైఫండ్ పొందొచ్చు. తద్వారా సీఏ విద్యార్థి వృత్తికి కావాల్సిన నైపుణ్యాన్ని పొందడమే కాకుండా కోర్సు పూర్తికావడానికి కావాల్సిన ఆర్థిక వనరులను సమకూర్చుకునేందుకు ఈ ఆర్టికల్‌షిప్ సహాయపడుతుంది.

### సీఏ ఫైనల్:
సీఏ ఫైనల్ కూడా గ్రూప్-1, గ్రూప్-2లుగా ఉంటుంది. ఆర్టికల్‌షిప్ పూర్తైన విద్యార్థి ఈ రెండు గ్రూపులను ఒకే సమయంలో రాయొచ్చు. ప్రతి ఏడాది మే, నవంబర్ నెలల్లో సీఏ ఫైనల్ పరీక్షలు జరుగుతాయి. గ్రూప్-1లో ఫైనాన్షియల్ రిపోర్టింగ్ 100 మార్కులకు, స్ట్రాటజిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ 100 మార్కులకు, అడ్వాన్స్‌డ్ ఆడిటింగ్ అండ్ ప్రొఫెషనల్ ఎథిక్స్ 100 మార్కులకు, కార్పొరేట్ అండ్ ఎలైడ్ లాస్ 100 మార్కులకు ఉంటుంది. ఇందులో కూడా ప్రతి సబ్జెక్టులో కనీసం 40 మార్కులు సాధించడంతోపాటు గ్రూప్ మొత్తం మీద 50 శాతం మార్కులంటే 400 మార్కులకు 200 మార్కులు సాధించాలి.

గ్రూప్-2లో అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ అకౌంటింగ్ 100 మార్కులకు, ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ కంట్రోల్ అండ్ ఆడిట్ 100 మార్కులకు, డైరెక్ట్ ట్యాక్స్ లాస్ 100 మార్కులకు, ఇన్‌డైరెక్ట్ ట్యాక్స్ లాస్ 100 మార్కులకు ఉంటాయి. ఒక్కో పేపర్ పరీక్ష వ్యవధి మూడు గంటలు. ఇందులో కూడా ప్రతి సబ్జెక్టులో కనీసం 40 మార్కులు గ్రూప్ మొత్తం మీద 50 శాతం మార్కులు అంటే 400 మార్కులకు 200 మార్కులు సాధించాలి. ఇలా అయితేనే ఉత్తీర్ణులైనట్లు పరిగణిస్తారు.

### సీఏలో మరో సులభదారి అకౌంటింగ్ టెక్నీషియన్ కోర్సు:
సీఏ గట్టెక్కలేనివారి కోసం ఐసీఏఐ ప్రవేశపెట్టిన కోర్సు అకౌంటింగ్ టెక్నీషియన్. సీపీటీ పాసైన విద్యార్థి సీఏ పూర్తి చేయలేను అని అనుకుంటే ఐపీసీసీలోని గ్రూప్-1 పూర్తి చేసి, ఒక ఏడాదిపాటు సీఏ దగ్గర ఆర్టికల్ షిప్ చేస్తే అకౌంటింగ్ టెక్నీషియన్ సర్టిఫికెట్ లభిస్తుంది. పరిశ్రమలో దీనికి ప్రత్యేకమైన గుర్తింపు, అంతర్జాతీయ డిమాండ్ ఉంది. ఈ సర్టిఫికెట్‌తో ప్రభుత్వ/ప్రభుత్వేతర సంస్థలలో అకౌంటెంట్‌గా చేరి నెలకు ₹ 25,000పైన జీతం పొందొచ్చు. ఉద్యోగం చేస్తూనే ఐపీసీసీ రెండో గ్రూప్‌లో కూడా ఉత్తీర్ణత పొంది తర్వాత ఫైనల్ రాసి ఛార్టర్డ్ అకౌంటెంట్ హోదాను పొందొచ్చు.

### సీఏ శిక్షణ కాస్ట్ అకౌంటెంట్స్‌కు ప్రయోజనం:
ఛార్టర్డ్ అకౌంటెంట్స్‌లానే కాస్ట్ అకౌంటెంట్స్‌కి కూడా విస్తృత అవకాశాలున్నాయి. ఒక కంపెనీ లేదా సంస్థలో మేనేజ్‌మెంట్ తీసుకున్న నిర్ణయాల విశ్లేషణ, బడ్జెట్ రూపకల్పన, సంస్థ పరిపాలన విశ్లేషణ, మెరుగైన ఉత్పత్తికి ఏఏ చర్యలు తీసుకోవాలి? లాభాలు ఆర్జించడానికి అనుసరించాల్సిన నిర్ణయాలు వంటివి కాస్ట్ అకౌంటెంట్లు నిర్ణయించవలసిన పని. ఇలాంటి విధులను నిర్వహించడం కోసం పెద్ద పెద్ద కంపెనీలలో మేనేజ్‌మెంట్ డైరెక్టర్, ఫైనాన్స్ డైరెక్టర్, మార్కెటింగ్ మేనేజర్, సీఈఓ, సీఎఫ్ఓ వంటి ఉద్యోగాలు కాస్ట్ అకౌంటెంట్లకు అందుబాటులో ఉన్నాయి.

### సీఏలకు అన్ని రంగాలోనూ ఉజ్వల భవిష్యత్తు:
ప్రపంచంలో ఎన్ని రకాల సంస్థలైతే ఉన్నాయో అన్ని రకాల సంస్థలలోనూ అంటే సేవా రంగం, టెలికమ్యూనికేషన్, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, సాఫ్ట్‌వేర్, వివిధ పరిశ్రమలు, అనేక సంస్థలలో సీఏలకు లక్షల సంఖ్యలో ఉపాధి అవకాశాలున్నాయి. ప్రపంచీకరణ నేపథ్యంలో టైర్-3 పట్టణాల్లో కూడా రిటైల్ షాపులు, జ్యువెలరీ, వస్త్ర, సెల్‌ఫోన్ దుకాణాలు ఏర్పాటవుతున్నాయి. వీటన్నింటి రోజువారీ ఆదాయవ్యయాలు, ఉత్పత్తి ఖర్చులు, స్టేషనరీ, మానవ వనరులకు చెల్లించే వేతనాలు, ఇతర వ్యయాలు, అమ్మకాలు, కొనుగోళ్లు, కంపెనీ లాభనష్టాలు.. ఇలా ప్రతి దశలోనూ సీఏల అవసరం అనివార్యం. అంతేకాకుండా కంపెనీల చట్టం 1956 ప్రకారం ప్రతి కంపెనీ తమ ఆర్థిక నివేదికలను సీఏతో సర్టిఫై చేయించాలి. 40 లక్షల టర్నోవర్ కలిగిన ప్రతి సంస్థ తమ లెక్కలను తప్పనిసరిగా సీఏలతో ఆడిట్ చేయించాలి. ఈ నేపథ్యంలో నిపుణులైన సీఏల అవసరం భారీ స్థాయిలో ఉంది. కానీ డిమాండ్‌కు తగినవిధంగా సీఏలు అందుబాటులో లేరు. కాబట్టి సీఏ కోర్సు పూర్తిచేసినవారికి వివిధ పరిశ్రమలు, కంపెనీలు రెడ్‌కార్పెట్ స్వాగతం పలుకుతున్నాయి.

### సీఏ చేసినవారికి లభించే హోదాలు, ఉద్యోగాలు:
కంపెనీలకు మేనేజింగ్ డైరెక్టర్లుగా, ఫైనాన్స్ కంట్రోలర్, చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్, మార్కెటింగ్ మేనేజర్, ఫైనాన్స్ అకౌంట్స్, ఎగ్జిక్యూటివ్స్, ప్లాంట్ అకౌంటెంట్స్, సిస్టమ్ ఇంప్లిమెంటార్స్, టెక్నోఫంక్షనిస్టులుగా అవకాశాలు పొందొచ్చు. అంతే కాకుండా ట్రస్టీగా, అడ్మినిస్ట్రేటర్‌గా, వాల్యూయర్‌గా, మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్‌గా, ట్యాక్స్ కన్సల్టెంట్‌లుగా ఉద్యోగాలు లభిస్తాయి.

### జీతభత్యాలు:
ప్రారంభంలోనే కనీసం నెలకు ₹ 35000ల నుంచి 50,000 వరకు, ఆరు నెలల అనుభవంతో నెలకు లక్షల్లోనే జీతాలు పొందొచ్చు.

### ఐసీఏఐ చిరునామా:
ఐసీఏఐ ప్రధాన కార్యాలయం నోయిడాలో ఉంది. దక్షిణ భారతదేశంలో ఆంధ్ర ప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలన్నింటికి కలిపి చెన్నైలో ఐసీఏఐకు ఉప కేంద్రం ఉంది. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్‌లో సీఏ ఛాప్టర్‌కు అనుబంధంగా హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, నెల్లూరు, రాజమండ్రి, కాకినాడ, తిరుపతిలలో ప్రాంతీయ కార్యాలయాలున్నాయి.
వెబ్‌సైట్: http://icai.org/

### తాజా మార్పు...
### డిగ్రీ విద్యార్థులకు నేరుగా ఐపీసీసీ కోర్సు:
నిన్నటివరకు సీఏ చేయాలనుకునేవారు తప్పనిసరిగా సీపీటీ పరీక్షను రాయాల్సివచ్చేది. అయితే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) తమ చట్టంలో ఆగస్టు 1, 2012 నుంచి కొత్త మార్పులను తీసుకువచ్చి డిగ్రీ, పీజీ అర్హత పొందిన విద్యార్థులకు సీపీటీ పరీక్షను మినహాయించి నేరుగా సీఏ రెండో దశ అయిన ఐపీసీసీలో ప్రవేశాన్ని కల్పిస్తుంది. ఏదైనా విశ్వవిద్యాలయంలో రెగ్యులర్ కోర్సు ద్వారా, దూరవిద్య ద్వారా 55 శాతం మార్కులతో కామర్స్‌లో బ్యాచిలర్ డిగ్రీ/పీజీలో ఉత్తీర్ణత సాధించాలి.

ఇందులోనూ అకౌంటింగ్, ఆడిటింగ్, మర్కంటైల్ లాస్, కార్పొరేట్ లాస్, ఎకనామిక్స్, మేనేజ్‌మెంట్ (ఇన్‌క్లూడింగ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్), టాక్సేషన్ (ఇన్‌క్లూడింగ్ డైరెక్ట్ ట్యాక్స్ అండ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్స్ లాస్), కాస్టింగ్, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ లేదా మేనేజ్‌మెంట్ అకౌంటింగ్ సబ్జెక్టులలో ఏవైనా మూడు సబ్జెక్టులను చదివి ఉండాలి. ఆదేవిధంగా ఆ మూడు సబ్జెక్టులలో ఒక్కొక్కటి 100 మార్కులకు పరీక్ష నిర్వహించి ఉండాలి. ఈ సబ్జెక్టులు లేనివారు డిగ్రీ/పీజీలలో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తే నేరుగా ఐపీసీసీలోకి ప్రవేశించవచ్చు. అదేవిధంగా సీపీటీలోనూ కొన్ని మార్పులు జరిగాయి. ప్రతి సబ్జెక్టులోనూ 30 శాతం మార్కులు సాధించడంతోపాటు అన్ని సబ్జెక్టులలోనూ కలిపి 50 శాతం మార్కులు సాధించాలి.

Group-I Mains Paper-V

# సిలబస్‌లో మార్పులు.. మార్కులకు మార్గాలు



ఎ. అనిల్ కుమార్ రెడ్డి
పోటీ పరీక్షల నిపుణులు,
హైదరాబాద్

**గ్రూప్-1 మెయిన్స్ ఎగ్జామినేషన్ విషయంలో అభ్యర్థులు క్లిష్టంగా భావించే పేపర్.. ఐదో పేపర్ (డేటా ఇంటర్ ప్రిటేషన్ అండ్ ప్రాబ్లమ్ సొల్వింగ్). గణిత శాస్త్ర సంబంధమైంది కావడం; పదో తరగతి తర్వాత మ్యాథమెటిక్స్ సబ్జెక్టును అధ్యయనం చేయని అభ్యర్థులు అనవసరమైన ఆందోళనకు గురి కావడమే ఇందుకు ప్రధాన కారణాలు. అంతేకాకుండా గత ఏడాది నుంచి పేపర్-5లో కొన్ని మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో పేపర్-5లో మార్పులు; అభ్యర్థులు అనుసరించాల్సిన వ్యూహాలపై విశ్లేషణ..**



ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-1 మెయిన్స్‌లో గత ఏడాదిలో మార్పులు చేపట్టింది. ఇందులో ప్రధానమైనవి సెక్షన్-1, సెక్షన్-2లలో ఇంటర్నల్ చాయిస్‌ను ప్రవేశపెట్టడం. సెక్షన్-3లో ప్యాసేజ్ ఆధారిత ప్రశ్నలకు ప్రాధాన్యం పెంచడం.

## సెక్షన్-3 మూడు ప్యాసేజ్‌లు.. 20 ప్రశ్నలు:

మారిన సిలబస్ ప్రకారం సెక్షన్-3లో మూడు ప్యాసేజ్‌లు ఇస్తారు. ప్రతి ప్యాసేజ్‌కు సంబంధించి నాలుగు ప్రశ్నలు చొప్పున 20 ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు రెండున్నర మార్కుల చొప్పున మొత్తం 50 మార్కులు ఈ సెక్షన్‌కు కేటాయించారు. మిగతా రెండు సెక్షన్లతో పోల్చితే కాస్త సమయస్ఫూర్తి, సునిశిత పరిశీలన, విశ్లేషణ నైపుణ్యం ఉన్న అభ్యర్థులు ఎక్కువ మార్కులు పొందగలిగే విభాగమిది.
నిర్దేశిత ప్యాసేజ్‌లు దేశ స్థితిగతులు (ఉదా: పరిపాలన, ప్రభుత్వ విధానాలు, అభివృద్ధి పథకాలు; సాంఘిక సమస్యలు)కు సంబంధించినవై ఉంటాయి. అభ్యర్థులు దాన్ని చదివి.. వివరణాత్మక సమాధానాలు రాసే విధంగా ప్రశ్నలు అడగొచ్చు. లేదా కొన్ని నిర్ధారణలు, నిర్ణయాలు, తీర్మానాలు, ప్రతిపాదనలు, వాదనలు ఇచ్చి అవి ఎంతవరకు వాస్తవమో విశ్లేషించమని అడగొచ్చు.

## పట్టు ఇలా:

ముందుగా చెప్పుకున్నట్లు మిగతా సెక్షన్లకంటే ఎక్కువ మార్కుల సాధనకు ఆస్కారం ఉన్న ఈ సెక్షన్‌లో పట్టు సాధించాలంటే.. పలు సామాజిక, సమకాలీన అంశాలకు సంబంధించి ప్రసార మాధ్యమాల్లో వచ్చే వ్యాసాలను చదువుకుంటూ స్వీయ విశ్లేషణ సాగించాలి. ప్రతి వ్యాసం చదివాక అందులో వినియోగించిన పదజాలాన్ని, ఆ వ్యాసంలో పేర్కొన్న నిర్దిష్ట అభిప్రాయాలను గుర్తించాలి. ఆ అభిప్రాయానికి కారణాలను విశ్లేషించాలి. వీటన్నిటినీ సమీకృతం చేసుకుని సొంతగా సారాంశాన్ని నోట్స్ రూపంలో రాసుకోవాలి. ముఖ్యంగా ప్రస్తుతం హాట్ టాపిక్స్‌గా ఉన్న అంశాలపై దృష్టి పెట్టాలి. ఎందుకంటే ఇటీవల కాలంలో గ్రూప్-1, సివిల్స్ వంటి పరీక్షల్లో సమకాలీన అంశాలకు ప్రాధాన్యం పెరుగుతోంది. కాబట్టి ప్రస్తుతం హాట్ టాపిక్స్‌పై దృష్టి పెడితే అవి పరీక్షలో అడిగే అవకాశం లేకపోలేదు.

## పూర్తిగా చదివాకే:

ప్యాసేజ్ ఆధారిత ప్రశ్నల విషయంలో అభ్యర్థులు చేసే పొరపాటు.. ముందుగా ప్యాసేజ్ చదవకుండా.. కింద ఇచ్చిన ప్రశ్నలే చదువుతూ ఒక్కో ప్రశ్నకు సమాధానాన్ని ప్యాసేజ్‌లో అన్వేషించడం. ఈ వైఖరి సరికాదు. ప్యాసేజ్ ఆధారిత ప్రశ్నలైనప్పటికీ కొన్నిసార్లు ఇన్‌డైరెక్ట్‌గా ఉంటాయి. (ఉదాహరణకు ప్యాసేజ్‌లో సారాంశాన్ని అడగడం లేదా వ్యాసకర్త ఉద్దేశాన్ని అడగడం లేదా ప్యాసేజ్ ఏ రంగానికి చెందినదో అడగడం తదితర). అంతేకాకుండా కొన్ని ప్రశ్నలు వివరణలు, విశ్లేషణలు అవసరమైనవిగా ఉంటాయి. కాబట్టి ప్రతి ప్యాసేజ్‌ను పూర్తిగా క్షుణ్నంగా చదవాలి. ఆ ప్యాసేజ్ ఏ అంశానికి సంబంధించిందో గుర్తించాలి. అందులోని కీలక పదాలను గుర్తించాలి. దీనికోసం ప్రిపరేషన్ సమయంలోనే ప్రత్యేక ప్రాక్టీస్ చేయాలి.

## ఇంటర్నల్ చాయిస్:

ఆప్షనల్స్ విధానానికి తెరదించి కామన్ పేపర్లకు శ్రీకారం చుట్టిన క్రమంలో తొలుత పేపర్-5కు ఎలాంటి చాయిస్ ఉండేది కాదు. కానీ గత గ్రూప్-1 నుంచి సెక్షన్-1, సెక్షన్-2లకు ఇంటర్నల్ చాయిస్‌ను ప్రవేశపెట్టడమే.ఆయితే ఇదే సమయంలో అభ్యర్థులకు మరో ఇబ్బంది కూడా ఉంది. అది ప్రశ్నల ఎంపిక. ఇచ్చిన రెండు ప్రశ్నల్లో ఏది ఎంచుకోవాలి? అనే విషయంలో స్పష్టత ఏర్పరచుకోవాలి. కొన్ని ప్రశ్నలు చదవగానే బాగా తెలిసినవిగా భావించి సాధన ప్రారంభిస్తారు. కానీ తర్వాత స్టెప్స్‌వారీ సమస్య సాధన క్రమంలో ఇబ్బందికి గురవుతారు. సమయం కూడా వృథా అవుతుంది. కాబట్టి ప్రశ్నల ఎంపిక విషయంలోనే చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి. రెండు ప్రశ్నలను క్షుణ్నంగా చదవాలి. అవసరమైతే ఇందుకోసం 20 నుంచి 30 సెకన్ల సమయం కేటాయించడానికి కూడా వెనుకాడొద్దు.

## ప్రిపరేషన్ ఇలా..:

పేపర్-5 ప్రిపరేషన్ కోసం అభ్యర్థులు చాలా పకడ్బందీగా వ్యవహరించాలి. ఈ క్రమంలో సెక్షన్-1 సిలబస్‌ను పరిగణనలోకి తీసుకుంటే సగటు, నిష్పత్తి, శాతాలు అని కమిషన్ పేర్కొంది. వీటి ద్వారా దత్తాంశాన్ని మదింపు చేయడం, అన్వయించాల్సిన తీరులో ప్రశ్నలుంటాయి. కానీ గత గ్రూప్-1 మెయిన్స్ ప్రశ్న పత్రాలను విశ్లేషిస్తే ఇతర అంశాలపైనా సంసిద్ధత ఆవశ్యకంగా మారింది. ఈ క్రమంలో వ్యక్తిగత శ్రేణులు, సమూహపు శ్రేణులు, పౌనఃపున్య విభాజనాలకు సంబంధించి సగటు, మధ్యగత, బాహుళకం, వ్యాప్తి, మధ్యమ విచలనం, చతురాంశ విచలనం, క్రమ విచలనం, విస్తృతి, విచలన గుణకం, కాలం-దూరం, కాలం-పని వంటి అంశాలపై సాధన చేయాలి.

## సెక్షన్-2లో:

ఈ విభాగంలో సిలబస్‌లో బొమ్మల రూపంలో ఇచ్చిన దత్తాంశాన్ని అన్వయించాల్సి ఉంటుంది. సిలబస్‌లో కూడా ఈ నేపథ్యంలో పట్టికలు, బార్ చిత్రాలు (దిమ్మె చిత్రాలు), వృత్తరేఖా చిత్రాలు (పై చిత్రాలు), రేఖా చిత్రాలు (గ్రాఫ్స్) మొదలైన బొమ్మల రూపంలో ఇచ్చిన దత్తాంశాన్ని అన్వయించడం అని మాత్రమే ఉంది. దత్తాంశానికి సంబంధించి 1) దత్తాంశ ప్రదర్శన 2) దత్తాంశాన్ని అన్వయించడం అనేవి రెండు ముఖ్య విభాగాలు. కాబట్టి.. అన్ని రకాల చిత్రాలకు సంబంధించి దత్తాంశ ప్రదర్శన అంశంపై ప్రిపరేషన్ సాగించడం అవసరం. దత్తాంశ అన్వయంపై ఎక్కువ సమయం కేటాయించాలి. అంతేకాకుండా ఈ సెక్షన్‌లో మంచి మార్కుల సాధనకు సెక్షన్-1 కోసం అధ్యయనం చేసిన సగటు, నిష్పత్తి, శాతాలకు సంబంధించి మౌలిక సూత్రాలు ఎంతో ఉపకరిస్తాయి. అంటే ఈ రెండు సెక్షన్లు ఒకదానికొకటి కాసింత అంతర్గత సంబంధం ఉందని చెప్పొచ్చు.

## అకెడమిక్స్ ఏదైనా:

సాధారణంగా పేపర్-5 అంటే మ్యాథమెటిక్స్, ఇంజనీరింగ్ అభ్యర్థులకే అనుకూలం అనే అభిప్రాయం ఉంది. ముఖ్యంగా హ్యుమానిటీస్ అభ్యర్థుల్లో ఇది ఎక్కువే. ఆయితే ఎలాంటి అకడెమిక్ నేపథ్యం ఉన్న అభ్యర్థి అయినా.. కొన్ని ప్రాథమిక అంశాలపై పట్టుతో ఈ పేపర్-లో రాణించొచ్చు.

అవి..

- → సంఖ్యలు-సంఖ్యామానాలు
- → ప్రాథమిక గణిత పరిక్రియలు
- → కారణాంకాలు, గుణిజాలు, క.సా.గు.
- → భిన్నాల కూడికలు, తీసివేతలు, గుణకారాలు, భాగహారం, సాధారణ భిన్నం, మిశ్రమ భిన్నం.
- → సమీకరణాలు-సాధన
- → ఘాతాంకాలు-ఘాతాలు

వీటికోసం ఆరు, ఏడు తరగతుల్లోని గణిత పుస్తకాల్లోని కొన్ని అంశాలను ప్రాక్టీస్ చేయాలి. అవి..

- సంఖ్యలు-సంఖ్యామానాలు
- పూర్ణ సంఖ్యలు
- అకరణీయ సంఖ్యలు
- వ్యాపార గణితం
- బీజ గణితం
- సమీకరణాలు, అసమీకరణాలు
- వాస్తవ సంఖ్యలు
- బీజీయ సమాసాలు
- ఘాతాంకాలు, ఘాతాలు
- సమీకరణాలు, అసమీకరణాలు

## అంచెలవారీగా:

పేపర్-5 పూర్తిగా ప్రాబ్లమ్స్ ఆధారితమైంది. అదేవిధంగా ఎక్కువ మార్కులు అందించేది కూడా. కాబట్టి అభ్యర్థులు ఒక నిర్దిత సమస్యను సాధన చేసే క్రమంలో స్టెప్స్‌వారీగా పరిష్కారానికి కృషి చేయాలి. అంతేకాకుండా పరీక్షలో నిర్దిష్ట స్టెప్‌నకు అవసరమైన మేరకు వివరణ ఇవ్వాలి. దీని కోసం ఇప్పట్నుంచే ప్రాక్టీస్ చేయాలి. మాక్ టెస్టులు, ప్రాక్టీస్ టెస్టులు సాధన చేయాలి. ఆబ్జెక్టివ్ తరహా పరీక్షలకు ఉపయోగపడే షార్ట్‌కట్ మెథడ్స్‌ను డిస్క్రిప్టివ్ విధానంలో ఉండే గ్రూప్-1 మెయిన్స్‌లోనూ అమలు చేయడం సరికాదు.

## టైం మేనేజ్‌మెంట్ కీలకం:

పేపర్-5 విషయంలో అధిక మార్కుల సాధనకు ఆస్కారం కల్పించే మరో ముఖ్యాంశం సమయ పాలన. ముఖ్యంగా నాన్-మ్యాథ్స్ అభ్యర్థులు ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. తమ నైపుణ్యాలను బేరీజు వేసుకుని ఏ సెక్షన్‌కు ఎంత సమయం కేటాయించుకోవాలి? అనేదానిపై ఒక అవగాహనకు రావాలి. ప్రిపరేషన్‌కు కేటాయించే మొత్తం సమయంలో 25 నుంచి 30 శాతం సమయాన్ని పేపర్-5కు కేటాయించుకోవాలి. అదేవిధంగా.. ఈ టైం మేనేజ్‌మెంట్‌ను పరీక్ష హాల్లోనూ అమలు చేయాలి. ఉదాహరణకు ప్రశ్నపత్రం 2011 తరహాలో ఉంటుందనుకుంటే ఒక సగటు అభ్యర్థి సెక్షన్-1కి 50 నిమిషాలు; సెక్షన్-2కు 70 నిమిషాలు; సెక్షన్-3కి 60 నిమిషాలు కేటాయించుకోవచ్చు.

## ప్రస్తుత సమయంలో:

ప్రస్తుతం అభ్యర్థులకు సుమారు నెలరోజుల సమయం అందుబాటులో ఉంది. ఈ సమయంలో అన్ని భావనలను, సూత్రాలను, ముఖ్యమైన పద్ధతులను క్షుణ్నంగా రివిజన్ చేసుకోవాలి. కనీసం మూడు మాక్ టెస్టులకు హాజరై బలాలు, బలహీనతలను విశ్లేషించుకోవాలి. ఒక నిర్దిష్ట అంశాన్ని ఇప్పటి వరకు దృష్టి సారించని అభ్యర్థులు కనీసం ఆయా అంశాల ప్రాథమిక భావనల్లోనైనా దృష్టి పెట్టాలి. ఇప్పుడే ప్రిపరేషన్ మొదలు పెట్టిన అభ్యర్థులు ముఖ్యమైన పద్ధతులపై పట్టు సాధించేందుకు కృషి చేయాలి.

## గత ప్రశ్న పత్రాల విశ్లేషణ:

పేపర్-5 విషయంలో అభ్యర్థులు గత ప్రశ్న పత్రాలను విశ్లేషించాలి. ఇది ఎంతో ప్రయోజనం చేకూర్చుతుంది. ఒక నిర్దిష్ట అంశానికి సంబంధించి ప్రశ్నను ఎలా అడిగారు? అని విశ్లేషించాలి. సమయం అందుబాటులో ఉంటే వాటి ప్రాక్టీస్ చేయడం కూడా ఉపకరించే అంశమే.

### 'డూ'స్ అండ్ 'డోన్ట్స్'

- కేవలం ఒక్క సమస్య సాధనకు అధిక సమయం కేటాయించొద్దు. సమస్య బాగా క్లిష్టంగా ఉందనుకుంటే వెంటనే మరో ప్రశ్న వైపు మళ్లాలి.
- కాలిక్యులేటర్‌ను బాగా ప్రాక్టీస్ చేయాలి.
- పరీక్ష హాల్లో.. తార్కిక ఆలోచన శక్తి అవసరం ఉన్న ప్రశ్నలను చివరి 20 నిమిషాల్లో ప్రారంభించకూడదు. వాటిని వీలైనంత ముందుగా పూర్తి చేసుకోవాలి.
- సమస్య సాధనలో స్టెప్స్ అవసరమే కానీ.. అనవసరమైన స్టెప్స్ వేసి సమయం వృథా చేసుకోవద్దు.
- సమస్య సాధనలో వినియోగించే స్టెప్స్‌కు వివరణ, విశ్లేషణ అవసరమే కానీ.. సులభమైన స్టెప్స్‌కు వాటిని రాయనక్కర్లేదు.

### రిఫరెన్స్ బుక్స్

సెక్షన్-1
- Quantitative Aptitude – R.S. Agarwal
- Business Statistics for B.com – Kalyani Publishers
- Quantitative Aptitude for CAT – K. Kundan & P. Pandey

సెక్షన్-2
- Statistical Analysis, Graphs & DiagramsSpectrum book
- An Advanced Approach to Data InterpretationR.S. Agarwal

సెక్షన్-3
- Analytical Reasoning M.k.Pandey

# రెండోసారి ఉపరాష్ట్రపతిగా హమీద్ అన్సారీ



ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి
కరెంట్ అఫైర్స్ నిపుణులు

## రాష్ట్రీయం

### రాష్ట్రంలో క్రీడలకు 2శాతం రిజర్వేషన్లు

ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులకు 2 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం ఆగస్టు 9న ఉత్తర్వులు జారీ చేసింది. విద్య, ఉద్యోగాల్లో ఈ రిజర్వేషన్ వర్తిస్తుంది. 29 క్రీడాంశాల్లో రిజర్వేషన్లు వర్తింప చేస్తారు. క్రీడా పోటీ, స్థాయి గెలుపొందిన పతకాల ప్రాధాన్యత వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని రిజర్వేషన్లు అమలు చేస్తారు.

### ఐఐసీటీ శాస్త్రవేత్తకు-యంగ్ సైంటిస్ట్ అవార్డు

సీఎస్ఐఆర్-ఐఐసీటీకి చెందిన శాస్త్రవేత్త డాక్టర్ సూర్య ప్రకాశ్ సింగ్‌కు ప్రతిష్టాత్మక ఎన్ఏఎస్ఐ-యంగ్ సైంటిస్ట్ ప్లాటినం జూబ్లీ అవార్డు (2012) లభించింది. రసాయన శాస్త్ర రంగంలో విశేష కృషి చేసిన 35 ఏళ్లలోపు భారతీయ శాస్త్రవేత్తలకు ఎన్ఏఎస్ఐ (నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్, ఇండియా) ఏటా ఈఅవార్డును ప్రకటిస్తుంది. ఐఐసీటీ రసాయన శాస్త్ర విభాగంలో పనిచేస్తున్న సూర్య ప్రకాశ్ డై సెన్సిటైజ్డ్ సోలార్ సెల్స్‌కు అవసరమైన పరికరాల తయారీ, పలుచనైన ఆర్గానిక్ సోలార్ సెల్స్ రూపకల్పనలో చేసిన కృషికి గుర్తింపుగా అవార్డు వరించింది. ఐఐసీటీ శాస్త్రవేత్తకు ఈ అవార్డు రావడం ఇదే తొలిసారి.

### గొల్లభామ చీరలకు అంతర్జాతీయ ఖ్యాతి



మెదక్ జిల్లా సిద్దిపేట, దుబ్బాక ప్రాంతాల్లో చేనేతలు నేసిన గొల్లభామల చీరకు జియోగ్రాఫీ ఇండికేషన్ అఫ్లికేషన్(జీఐఏ) గుర్తింపు లభించింది. ఈ జీఐఏ జాబితా వరుస సంఖ్య 188గా నిలవడంతో ఈ చీరలకు అంతర్జాతీయ ఖ్యాతి లభించింది. 1940లో సిద్దిపేటకు చెందిన రచ్చ రాందాస్, కాంటసాయిలు కలిసి మొదట ఈ చీరను తయారు చేశారు.

### పర్యాటక రంగంలో రెండోస్థానంలో రాష్ట్రం

స్వదేశీ పర్యాటకులను ఆకర్షించడంలో 2011లో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో నిలిచింది. కేంద్ర పర్యాటక శాఖ గణాంకాల ప్రకారం 2011లో 15.31 కోట్ల మంది రాష్ట్రాన్ని సందర్శించారు. కాగా 2011లో ఉత్తరప్రదేశ్‌ను 15.54 కోట్ల మంది సందర్శించడంతో మొదటి స్థానంలో నిలిచింది. రెండోస్థానంలో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర తర్వాత స్థానాల్లో నిలిచాయి. విదేశీ పర్యాటకులను ఆకర్షించడంలో ఆంధ్రప్రదేశ్ 13వ స్థానంలో నిలిచింది. మొదటి స్థానంలో మహారాష్ట్ర(24.7 శాతం), రెండో స్థానంలో తమిళనాడు(17.3 శాతం), మూడోస్థానంలో న్యూఢిల్లీ(11.1శాతం) నిలిచాయి. 2011లో మొత్తం 1.94 కోట్ల మంది విదేశీయులు భారత్‌ను సందర్శించారు.

## జాతీయం

### కొత్త ఈసీ నసీమ్ జైదీ

ఎన్నికల కమిషనర్ (ఈసీ)గా సయ్యద్ నసీమ్ అహ్మద్ జైదీ ఆగస్టు 7న నియమితులయ్యారు. ఇదివరకు ఈసీగా పనిచేసిన వీఎస్ సంపత్ ఎన్నికల ప్రధాన కమిషనర్‌గా పదోన్నతి పొందడంతో జైదీని కొత్త ఈసీగా రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ నియమించారు. జైదీ 2017 వరకూ ఈ పదవిలో కొనసాగుతారు. జైదీ యూపీ కేడర్‌కు చెందిన 1976 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. జూలై 31న పౌర విమానయాన శాఖ కార్యదర్శిగా పదవీ విరమణ చేసిన జైదీ అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థల మండలిలో భారత్ ప్రతినిధిగా 2005- 2008 వరకూ వ్యవహరించారు. భారత విమానాశ్రయాల సంస్థ ఛైర్మన్‌గా కూడా ఆయన పనిచేశారు. ముగ్గురు సభ్యుల ఎన్నికల కమిషన్‌లో మరో ఈసీగా హెచ్ఎస్ బ్రహ్మ ఉన్నారు.

### విజయవంతమైన అగ్ని-2 క్షిపణి పరీక్ష

మధ్యంతర శ్రేణి క్షిపణి-2ను భారతసైన్యం విజయవంతంగా పరీక్షించింది. ఒడిశా తీరం సమీపంలోని వీలర్ ఐలాండ్‌లోని ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ నుంచి ఆగస్టు9న ఈ పరీక్ష నిర్వహించారు. ఉపరితలం నుంచి ఉపరితలంలోకి ప్రయోగించిన ఈ క్షిపణి 2000 కి.మీ పైగా దూరంలోని లక్ష్యాన్ని ఛేదించగలదు. 17 టన్నుల బరువుగల ఈ క్షిపణి 1000 కిలోల పేలోడ్‌ను మోసుకుపోగలదు. ఇప్పటికే సైన్యంలో చేరిన ఈక్షిపణి సైన్యానికి శిక్షణనిచ్చే కార్యక్రమంలో భాగంగా ప్రస్తుత పరీక్షను నిర్వహించారు.

### అరుణగ్రహంపై దిగిన క్యూరియాసిటీ



అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా ప్రయోగించిన 'క్యూరియాసిటీ' శోధక నౌక ఆగస్టు 6 ఉదయం 11.01 నిమిషాలకు దిగ్విజయంగా అరుణగ్రహంపై కాలు మోపింది. ఎనిమిదిన్నర నెలల్లో సుమారు 56.7 కోట్ల కిలోమీటర్ల దూరం ప్రయాణించిన క్యూరియాసిటీ ఏడు నిమిషాల ఉత్కంఠభరిత 'ఎంట్రీ డిసెంట్ అండ్ ల్యాండింగ్' ప్రక్రియను ముగించి సురక్షితంగా అంగారకుడిపైకి చేరింది. అంగారకుడిపైకి చేరిన సమాచారంతోపాటు నిమిషాల వ్యవధిలో అక్కడి ఫొటోలను పంపడం మొదలుపెట్టింది. జీవం తాలూకూ ఆనవాళ్లు ఉండే అవకాశాలపై అంచనా వేయడానికి పంపించిన క్యూరియాసిటీ మనిషి ఇప్పటివరకూ అంతరిక్షంలోకి పంపిన శోధక నౌకల్లో అతిపెద్దది. ఇది అణుశక్తితో పనిచేస్తుంది. క్యూరియాసిటీలోని ప్లూటోనియం బ్యాటరీ కనీసం పదేళ్లపాటు నిరాఘాటంగా పని చేయగలదు. నాసా ఈ ప్రాజెక్టు కోసం మొత్తం 250 కోట్ల డాలర్లు (రూ.పదివేల కోట్లపైనే) ఖర్చుపెట్టింది. దాదాపు టన్ను బరువు ఉన్న క్యూరియాసిటీ గాలే క్రేటర్(దాదాపు 154 కిలోమీటర్ల వ్యాసార్థమున్న లోయ)లో దిగింది.

### రెండోసారి ఉపరాష్ట్రపతిగా అన్సారీ



రెండోసారి ఉపరాష్ట్రపతిగా హమీద్ అన్సారీ ఆగస్టు 11న ప్రమాణ స్వీకారం చేశారు. ఆగస్టు 7న జరిగిన ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో అన్సారీ 252 ఓట్ల మెజారిటీతో ఎన్నికయ్యారు. యూపీఏ అభ్యర్థిగా పోటీ చేసిన అన్సారీ ఎన్‌డీఏ అభ్యర్థి జశ్వంత్ సింగ్‌పై విజయం సాధించారు. మొత్తం 790 మంది రాజ్యసభ, లోక్‌సభ సభ్యుల్లో మూడు ఖాళీలు పోగా 787 మందికి గానూ 736 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలైన ఓట్లలో 8 చెల్లలేదు. 47 మంది ఓటింగ్‌లో పాల్గొనలేదు. చెల్లిన 728 ఓట్లలో అన్సారీకి 490, జస్వంత్ సింగ్‌కు 238 ఓట్లు వచ్చాయి. సర్వేపల్లి రాధాకృష్ణన్ (1952 నుంచి 1962 వరకు) తర్వాత ఉపరాష్ట్రపతి పదవికి రెండుసార్లు ఎన్నికైన అభ్యర్థి అన్సారీ. 75 ఏళ్ల అన్సారీ 1961 బ్యాచ్‌కు చెందిన ఇండియన్ ఫారిన్ సర్వీస్ అధికారి. ఆస్ట్రేలియా, ఇరాన్, సౌదీ అరేబియా, అఫ్గనిస్తాన్, యూఏఈ దేశాల్లో ప్రధాన దౌత్య అధికారిగా పనిచేశారు. 1993-95 కాలంలో ఐక్యరాజ్యసమితిలో భారత శాశ్వత ప్రతినిధిగా పనిచేశారు. 2007 ఆగస్టు 11 నుంచి ఉపరాష్ట్రపతిగా ఉన్నారు.

## క్రీడలు

### రెజ్లింగ్‌లో సుశీల్ కుమార్‌కు రజతం



లండన్ ఒలింపిక్స్‌లో భారత్ రెజ్లర్ సుశీల్ కుమార్ 66 కేజీల ఫ్రీ స్టయిల్ విభాగంలో రజత పతకం సాధించాడు. దీంతో వరసగా రెండు ఒలింపిక్స్‌ల్లో రెండు వ్యక్తిగత పతకాలు సాధించిన తొలి భారతీయుడిగా గుర్తింపు పొందాడు. 2008లో బీజింగ్ ఒలింపిక్స్‌లో సుశీల్ కుమార్ కాంస్య పతకం సాధించాడు. సుశీల్ కుమార్ స్వస్థలం ఢిల్లీ.

### యోగేశ్వర్‌కు కాంస్యం

భారత్ రెజ్లర్ యోగేశ్వర్ దత్ కాంస్యం సాధించాడు. పురుషుల రెజ్లింగ్ 60 కిలోల ఫ్రీస్టయిల్ విభాగంలో ఉత్తర కొరియాకు చెందిన జోంగ్ మయాంగ్‌పై విజయంతో యోగేశ్వర్‌ను కాంస్య పతకం వరించింది. క్వాలిఫయింగ్ నుంచి రెప్‌చేజ్ వరకు యోగేశ్వర్ తన హవా కొనసాగించాడు. ప్రీ క్వార్టర్స్‌లో ఓడినా... కీలకమైన రెప్‌చేజ్‌లో మూడుబౌట్లు గెలిచి భారత్‌కు ఐదో పతకాన్ని అందించాడు. హర్యానాకు చెందిన యోగేశ్వర్ ఒలింపిక్స్‌లో పాల్గొనడం ఇది మూడోసారి.

### 100, 200 మీటర్ల రేసులో బోల్ట్ రికార్డ్

100 మీటర్ల స్ప్రింట్ రేసులో ఉసేన్ బోల్ట్ (జమైకా) 9.63 సెకన్లలో లక్ష్యాన్ని ఛేదించి చాంపియన్‌షిప్‌ను నిలబెట్టుకున్నాడు. లండన్ ఒలింపిక్స్‌లో ఆగస్టు 6న జరిగిన ఈ రేసులో బోల్ట్ రికార్డ్ సృష్టించాడు. బీజింగ్ ఒలింపిక్స్ 100 మీటర్ల రేసును 9.69 సెకన్లలో పూర్తిచేసి నెలకొల్పిన రికార్డును బోల్ట్ లండన్‌లో అధిగమించాడు. బోల్ట్‌కు స్వర్ణపతకం దక్కగా మరో జమైకన్ యోహాన్ బ్లేక్ 9.75 సెకన్లలో లక్ష్యాన్ని అధిగమించి రెండోస్థానంలో నిలిచి రజత పతకం సాధించాడు. ఆగస్టు 9న జరిగిన 200 మీ. పరుగులో, ఉసేన్ 4 × 100 మీటర్ల రిలే పరుగులోను స్వర్ణ పతకాలు సాధించాడు. మూడు స్వర్ణాలు గెలిచిన తొలి స్ప్రింటర్‌గా రికార్డు నెలకొల్పాడు.

### మేరీ కోమ్‌కు కాంస్య పతకం



భారత మహిళా బాక్సర్ మేరీ కోమ్ లండన్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించింది. ఆగస్టు 8న 51 కిలోల ఫ్లయ్ వెయిట్ సెమీ ఫైనల్స్‌లో బ్రిటన్ బాక్సర్ నికోలో ఆడమ్స్ చేతిలో మేరీకోమ్ ఓడిపోయింది. దీంతో ఆమెకు కాంస్యం దక్కింది. ఒలింపిక్స్‌లో మహిళల బాక్సింగ్ ప్రవేశ పెట్టిన తొలిసారే భారత్‌కు కాంస్య పతకం సాధించి పెట్టింది.

**అమెరికాకు ఫుట్ బాల్‌లో స్వర్ణం:**ఒలింపిక్ ఫుట్‌బాల్ స్వర్ణ పతకాన్ని అమెరికా గెలుచుకుంది. ఫైనల్స్‌లో జపాన్‌ను ఓడించింది.

**హాకీలో జర్మనీకి స్వర్ణం:** హాకీలో జర్మనీకి స్వర్ణం.

**అమెరికాకు మహిళ బాస్కెట్ బాల్:** మహిళ బాస్కెట్‌బాల్ టైటిల్‌ను అమెరికా గెలుచుకుంది. ఫైనల్స్‌లో ఫ్రాన్స్‌ను ఓడించి అమెరికా స్వర్ణం సాధించింది.

**నార్వేకి మహిళ హ్యాండ్‌బాల్:** మహిళ హ్యాండ్‌బాల్‌లో నార్వే స్వర్ణం సాధించింది. మాంటెనెగ్రోను నార్వే ఓడించింది. పురుషుల హ్యాండ్‌బాల్‌లో స్వీడన్‌ను ఓడించి ఫ్రాన్స్ స్వర్ణం సాధించింది.

**మహిళ వాలీబాల్‌లో బ్రెజిల్‌కు స్వర్ణం:** మహిళ వాలీబాల్‌లో బ్రెజిల్ స్వర్ణం సాధించింది. ఫైనల్‌లో బ్రెజిల్ అమెరికాను ఓడించింది. పురుషుల వాలీబాల్ టైటిల్‌ను రష్యా గెలుచుకుంది. ఫైనల్లో బ్రిటన్‌ను ఓడించి రష్యా విజయం సాధించింది.

### లండన్ ఒలింపిక్స్‌లో అగ్రస్థానంలో అమెరికా



ఆగస్టు 12న ముగిసిన లండన్ ఒలింపిక్స్‌లో 46 స్వర్ణపతకాలతో అమెరికా అగ్రస్థానంలో నిలిచింది. రజత, కాంస్య పతకాలతో కలిపి మొత్తం 104 పతకాలు అమెరికా సాధించింది. 38 స్వర్ణాలతో చైనా, 29 స్వర్ణాలతో బ్రిటన్ రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. భారత్ రెండు రజతం, నాలుగు కాంస్య పతకాలతో మొత్తం 6 పతకాలు సాధించి 55వ స్థానంలో నిలిచింది. ఒలింపిక్స్‌లో భారత్ అత్యధికంగా 6 పతకాలు సాధించడం ఇదే తొలిసారి. మొత్తం 204 దేశాలు ఈ క్రీడల్లో పాల్గొనగా 85 దేశాలు మాత్రమే పతకాలు సాధించాయి. భారత్ 55వ స్థానంలో నిలిచింది.

### పతకాలు సాధించిన భారత్ విజేతలు

| | | |
|---|---|---|
| విజయకుమార్ | - షూటింగ్ | - రజతం |
| సుశీల్ కుమార్ | - రెజ్లింగ్ | - రజతం |
| సైనా నెహ్వాల్ | - బ్యాడ్మింటన్ | - కాంస్యం |
| గగన్ నారంగ్ | - షూటింగ్ | - కాంస్యం |
| మేరీ కోమ్ | - బాక్సింగ్ | - కాంస్యం |
| యోగేశ్వర్ దత్ | - రెజ్లింగ్ | - కాంస్యం |

### పతకాల పట్టికలో మొదటి పది దేశాలు

| జట్టు | స్వ | ర | కాం | మొ |
|---|---|---|---|---|
| అమెరికా | 46 | 29 | 29 | 104 |
| చైనా | 38 | 27 | 22 | 87 |
| బ్రిటన్ | 29 | 17 | 19 | 65 |
| రష్యా | 24 | 25 | 33 | 82 |
| ద.కొరియా | 13 | 8 | 7 | 28 |
| జర్మనీ | 11 | 19 | 14 | 44 |
| ఫ్రాన్స్ | 11 | 11 | 12 | 34 |
| ఇటలీ | 8 | 9 | 11 | 28 |
| హంగేరి | 8 | 4 | 5 | 17 |
| ఆస్ట్రేలియా | 7 | 16 | 12 | 35 |



send your feedback to:
sakshieducation@gmail.com

Ask the expert



**టి. మురళీధరన్**
టి.ఎం.ఐ. నెట్‌వర్క్

**బీఎస్సీ(మైక్రోబయాలజీ, కెమిస్ట్రీ, బోటనీ) చేశాను. మైక్రోబయాలజీ, కెమిస్ట్రీలలో ఏ కోర్సుకు అవకాశాలుంటాయి?** - లావణ్య కుమార్, తిరుపతి.

మైక్రోబయాలజీ, కెమిస్ట్రీ రెండింటిలోను మంచి అవకాశాలుంటాయి. అయితే మైక్రోబయాలజీ అనేది స్పెషలైజ్డ్ కోర్సు కావడంతో ఈ కోర్సు చేసిన వారికి ఉద్యోగావకాశాలు ఎక్కువేనని చెప్పొచ్చు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందుతున్న రంగాల్లో మైక్రోబయాలజీ ఒకటి. మైక్రోబయాలజిస్టులు వ్యాధులు, వాటి కారణాలు, నివారణకు ఉపయోగించే ఔషధాలు వంటి అంశాలపై తమ పరిశోధనలు సాగిస్తుంటారు. మైక్రోబయాలజీలో పీజీ చేసిన తర్వాత మీకిష్టమైన అంశంలో షార్ట్‌టర్మ్ కోర్సు లేదా అందుకు సంబంధించిన శిక్షణను తీసుకోవచ్చు. పరిశోధన రంగంలోకి కూడా ప్రవేశించవచ్చు. ఈ కోర్సు చేసిన వారికి వివిధ డయాగ్నోస్టిక్ సెంటర్లు, రీసెర్చ్ లేబొరేటరీల్లో అవకాశాలుంటాయి. కెమిస్ట్రీ విషయానికొస్తే..ఇందులో అవకాశాలు కొంత పరిమితం. ఈ అంశంలో మాస్టర్/ పీహెచ్‌డీ చేసిన వారికి ఫార్మసీ కంపెనీలు, లేబొరేటరీల్లో విరివిగా అవకాశాలుంటాయి. అంతేకాకుండా విద్యా సంస్థల్లో లెక్చరర్‌గా పని చేసే అవకాశం కూడా ఉంటుంది. మన రాష్ట్రంలోని అన్ని ప్రముఖ విశ్వవిద్యాలయాలు మాస్టర్/ పీహెచ్‌డీ స్థాయిల్లో కెమిస్ట్రీని అందిస్తున్నాయి. ఆయా వర్సిటీలు నిర్వహించే పరీక్షల ఆధారంగా అడ్మిషన్ ఉంటుంది.

# బీఎస్సీ(అగ్రికల్చర్) కోర్సు వివరాలు..

**ఎంబీఏ(టెలికాం) కోర్సును ఆఫర్ చేస్తున్న ఇన్‌స్టిట్యూట్‌లను తెలపండి?** -నలీమ్, కర్నూల్.

ఇటీవల కాలంలో మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(ఎంబీఏ) కోర్సులో నూతనంగా ప్రవేశపెట్టిన స్పెషలైజేషన్స్‌లో టెలికాం మేనేజ్‌మెంట్ ఒకటి. దేశంలో ప్రస్తుతం టెలికాం రంగం శరవేగంగా విస్తరిస్తుండడంతో ఈ కోర్సు చేసిన వారికి అవకాశాల పరంగా మంచి డిమాండ్ ఉంటోంది.

**ఆఫర్ చేస్తున్న ఇన్‌స్టిట్యూట్‌లు:**

**భారతి స్కూల్ ఆఫ్ టెలీకమ్యూనికేషన్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్- ఐఐటీ, ఢిల్లీ.**
కోర్సు: ఎంబీఏ(టెలికాం సిస్టమ్స్ మేనేజ్‌మెంట్)
అర్హత: బీఈ/బీటెక్/బీఆర్క్/బీఫార్మసీ/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్/ 60 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ(ఫిజిక్స్/కెమిస్ట్రీ/మ్యాథ్స్/కామర్స్/ఎకనామిక్స్ సంబంధిత బ్రాంచ్‌లలో)
ఎంపిక: రాతపరీక్ష, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ద్వారా
వెబ్‌సైట్: http://bsttm.iitd.ac.in

**సింబయాసిస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెలికాం మేనేజ్‌మెంట్- పుణే**
కోర్సు: ఎంబీఏ-టెలికాం(సిస్టమ్స్ అండ్ ఫైనాన్స్/మార్కెటింగ్ అండ్ ఫైనాన్స్ స్పెషలైజేషన్లుగా)
అర్హత: 50 శాతం మార్కులతో ఏదైనా గ్రాడ్యుయేషన్
ప్రవేశం: రాతపరీక్ష, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ద్వారా
వెబ్‌సైట్: www.sitm.ac.in

**అమిటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెలికాం టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్-నోయిడా**
కోర్సు: ఎంబీఏ(టెలీకమ్యూనికేషన్స్)
అర్హత: బీటెక్/బీఎస్సీ(ఎలక్ట్రానిక్స్/ఐటీ)
ఎంపిక: క్యాట్/మ్యాట్/జీమ్యాట్ స్కోర్‌తోపాటు గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ఆధారంగా
వెబ్‌సైట్: www.amity.edu

**బీఎస్సీ (అగ్రికల్చర్) కోర్సు వివరాలను తెలపండి?** -ప్రవీణ్, కమర్‌పల్లి.

బీఎస్సీ (అగ్రికల్చర్)కోర్సులో... అగ్రానమీ, హార్టికల్చర్, ప్లాంట్ పాథాలజీ, ఎంటమాలజీ, అగ్రికల్చరల్ ఎకనామిక్స్, ఎక్స్‌టెన్షన్ ఎడ్యుకేషన్, జెనెటిక్స్, ప్లాంట్ బ్రీడింగ్, సాయిల్ సైన్స్, ఫుడ్ టెక్నాలజీ, యానిమల్ హజ్బెండరీలు ప్రధాన సబ్జెక్టులు. వీటి తోపాటు హ్యూమానిటీస్, అగ్రికల్చర్ ఇంజనీరింగ్ వంటి ప్రాథ మిక సబ్జెక్టుల బోధన కూడా తప్పనిసరి. కోర్సులో చేరిన విద్యార్థి... విత్తనోత్పత్తి, కొత్త పద్ధతుల ఆవిష్కరణ, చీడపీడల గుర్తింపు, నివారణ మార్గాలు కనుగొనడం, అగ్రికల్చరల్ మార్కె టింగ్, విత్తనాభివృద్ధి వంటి అంశాల్లో పూర్తిస్థాయి నైపుణ్యం సాధించేలా బోధన జరుగుతుంది. నాలుగేళ్ల పాటు 8 సెమిస్టర్ల విధానంలో సాగే ఈ కోర్సులో.. మొదటి సెమిస్టర్ మినహా యిస్తే.. మిగతాదంతా ప్రాక్టికల్ ఓరియెంటెడ్.

అందువల్ల విద్యార్థులు ఆ కోణంలో క్షేత్రస్థాయి పరిశీలనలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి.ఏజీ బీఎస్సీ ఉత్తీర్ణులకు ఇటు ప్రభుత్వ.. అటు ప్రైవేట్ రంగాల్లో పలు అవకాశాలు లభిస్తాయి. ఇటీవల ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ పరీక్షల్లో ఈ విద్యార్థులదే హవా. ప్రైవేట్ రంగంలోనూ ఉద్యోగాలు పెరుగుతున్నాయి. ర్యాలీస్, మోన్‌శాంటో, ఐటీసీ, ఆంధ్రా బ్యాంక్, ఓబీసీ, బ్యాంక్ ఆఫ్ బరోడా వంటి సంస్థలు కూడా ఏజీ బీఎస్సీ విద్యార్థులను రిక్రూట్ చేసుకుంటున్నాయి. కేవలం బ్యాచ్‌లర్ డిగ్రీకే పరిమితంగా కాకుండా... పీజీ కూడా చదివితే అవకాశాలు మరింత విస్తృతమవుతాయి. క్రాప్ ప్రొడక్షన్, ఎంటమాలజీ, ప్లాంట్ పాథాలజీ, అగ్రికల్చరల్ ఎకనామిక్స్ తదితర విభాగాల్లో పీజీ చేసిన వారికి మంచి డిమాండ్ ఉంది. స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాలనుకుంటే... ఎంబీఏ (అగ్రికల్చరల్ మేనేజ్‌మెంట్) చదవాలి. దానివల్ల సొంతంగా యూనిట్‌లు ప్రారంభించే నైపుణ్యం వస్తుంది.

## సైంటిస్ట్ స్పీక్స్

# సైన్స్‌తో అద్భుతాలు సృష్టించొచ్చు

**నాలాంటి గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన శాస్త్రవేత్తకు యంగ్ సైంటిస్ట్ అవార్డు లభించడం.. పెద్దగిఫ్ట్. నా పరిశోధనలు విజయవంతమైతే.. దేశంలో అతి చౌకగా విద్యుత్తు వెలుగులు నింపవచ్చు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా సిలబస్‌లో మార్పులు తెస్తే ఉద్యోగాలకు కొదవుండదు. పరిశోధన రంగంలో విద్యార్థులను ప్రోత్సహించడానికి ఇచ్చే అవార్డులు ఇంకా పెంచాలి అంటున్నారు హైదరాబాద్-ఐఐసీటీ శాస్త్రవేత్త డాక్టర్ సూర్యప్రకాశ్ సింగ్. ప్రతిష్ఠాత్మక ఎన్‌ఏఎస్‌ఐ-యంగ్‌సైంటిస్ట్ ప్లాటినం జూబ్లీ అవార్డు(2012)కు ఎంపికైన సందర్భంగా సూర్యప్రకాశ్‌తో ప్రత్యేక ఇంటర్వ్యూ..**



**అవార్డు రావడంపై:**
అవార్డు సాధించడానికి చాలా కష్టపడ్డా. అత్యంత క్లిష్టమైన పోటీలో విజేతగా నిలవడం నాలాంటి గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన సైంటిస్టులకు చాలా అవసరం. అవార్డుకు ఎంపికవడం భవిష్యత్తులో మరింత అంకితభావంతో పని చేయడానికి ఉపయోగపడుతుంది.

**బీఎస్సీ చదివేటప్పుడే:**
సైన్స్ అంటే చాలా ఆసక్తి. ఏదైనా విషయాన్ని శోధించి, సాధిస్తే అందులో కలిగే ఆనందం ఎందులోను లభించదు. బీఎస్సీ చదువుతున్నప్పుడు సైన్స్ పాఠాలు వినీ సైంటిస్ట్‌కావాలని దృఢంగా నిర్ణయించుకున్నా. స్నేహితులంతా ఐఐటీలో చేరుతున్నా..నేనుమాత్రం సైంటిస్టుగానే స్థిరపడాలనుకున్నా.

**వారణాసి నుంచి జపాన్... ఐఐసీటీ:**
మా స్వస్థలం వారణాసి. ప్రాథమిక విద్య అంతా బెనారస్‌లో జరిగింది. ఎంఎస్సీలో ఆర్గానిక్ కెమిస్ట్రీ , అలహాబాద్ వర్సిటీలో పీహెచ్‌డీ పూర్తి చేశాను. ఏడాదిపాటు హైదరాబాద్‌లోని ఐఐసీటీ రీసెర్చ్ అసోసియేట్‌గాను, పోస్ట్ డాక్టరేట్‌ను జపాన్‌లోని ఇన నగోయా యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ; పోసాకా యూనివర్సిటీ, జపాన్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా; 2010-11లో అక్కడి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెటీరియల్ సైన్స్‌లో రీసెర్చర్‌గా పనిచేశా. 2011లో ఐఐసీటీలో సైంటిస్ట్‌గా ఉద్యోగం వచ్చింది.

**పేదలకు చౌకైన విద్యుత్తు:**
ఆర్గానిక్ కెమిస్ట్రీలో డై సెన్సిటైజ్డ్ సోలార్ సెల్స్‌కు అవసరమైన పరికరాల తయారీ, పలుచనైన ఆర్గానిక్ సోలార్ సెల్స్ రూపకల్పనపై పరిశోధన చేస్తున్నా. నేను పనిచేస్తున్న సోలార్‌సెల్ ప్రాజెక్టు ప్రస్తుతం మార్కెట్లో సిలికాన్ సోలార్ సెల్ రూపంలో అందుబాటులో ఉంది. ఇది చాలా ఖరీదైనది. పైగా భారత్‌లో సిలికాన్ లభించడం చాలా కష్టం. ఇప్పుడు నా పరిశోధన ద్వారా సిలికాన్ అవసరం లేనివిధంగా ప్రయోగం చేస్తున్నా. ఇది విజయవంతమైతే..ప్రత్యేక సోలార్‌సెల్ ప్యానల్ టెక్నాలజీతో ప్రతి ఒక్కరికీ అతి చౌకగా విద్యుత్తు వెలుగులు పంచవచ్చు.

**జపాన్, చైనాలో అంకితభావమెక్కువ:**
నేను జపాన్‌లో ప్రొఫెసర్‌గా, రీసెర్చర్‌గా ఐదేళ్లున్నా. అక్కడి సైంటిస్టులు చాలా అంకింతభావంతో పనిచేస్తారు. ఏదైనా ఒకే ఒక్క లక్ష్యాన్ని, ప్రాజెక్టును ఎంచుకుని.. ఎన్ని సమస్యలున్నా దాన్ని పూర్తిచేసి అనుకున్న ఫలితం సాధిస్తారు. కొన్నేళ్ల నుంచి సైన్స్ అండ్ టెక్నాలజీలో భారత్ చాలా మెరుగ్గా ముందుకు సాగుతోంది. అవసరాలు, సవాళ్లకు అనుగుణంగా ఇంకా విస్తృతస్థాయిలో పరిశోధనలను ప్రోత్సహించాలి. దేశంలో ఇప్పుడున్న ల్యాబ్‌లు, పరిశోధనలు ఇంకా పెరగాలి.

**అవకాశాలు అపారం:**
సైన్స్ రంగంలో అవకాశాలకెప్పుడూ కొదవుండదు. ప్రపంచంలో ఇప్పుడు ప్రతి వస్తువు, లేదా పరికరం, యంత్రాలన్నీ కెమికల్ టెక్నాలజీ ఆధారంగానే పనిచేస్తాయి. మానవ ఆరోగ్యానికి సంబంధించిన మందుల తయారీకి మూలం.. కెమిస్ట్రీ. సైన్స్ విద్యార్థులకు ప్రస్తుతం ఫార్మా రంగం అపార అవకాశాలు కల్పిస్తోంది.

రసాయనశాస్త్రం చదివిన వాళ్లకు రీసెర్చ్ సెంటర్లు, ఫార్మారంగం, మెటలర్జికల్ పరిశ్రమల్లో కెమికల్ ఎనలిస్ట్, టెక్నికల్ రైటర్స్‌గా ఉద్యోగాలు లభిస్తాయి. సోలార్ విద్యుత్తు తయారీలో కీలకమైన ఫైమాలిక్యులర్ విభాగంలో అవకాశాలు పుష్కలం. ఈ రంగంలోకి వచ్చేవారికి సహనం తప్పనిసరి.

**పిల్లల్లో సైన్స్‌పై ఆసక్తి పెంచాలి:**
మిగిలిన రంగాలు, ఉద్యోగాల్లో ఆసక్తి లేకపోయినా కొంత కాలమైనా పనిచేయవచ్చు. సైన్స్‌లో అలాకాదు. ఇష్టంలేకుండా ఇటువైపు వస్తే సమయం, వయసు రెండూ వృథా అవుతాయి. పరిశోధనలపట్ల విద్యార్థుల్లో ఆసక్తిపెరగాలంటే.. చిన్నప్పటినుంచే వారికి సైన్స్ ప్రాధాన్యత తెలిసేలా చేయాలి. అప్పుడే వాళ్లంతటవాళ్లు సైన్స్‌ను కెరీర్‌గా ఎంచుకుంటారు. ప్రతి కాలేజీలో సైన్స్ గొప్పతనంపై సెమినార్లు, సమావేశాలు నిర్వహించాలి. పదో తరగతి స్థాయి నుంచే ఉపాధ్యాయులు సైన్స్ విలువపై విద్యార్థుల్లో ఆసక్తి పెంచి పరిశోధనల అవసరాన్ని తెలియజెప్పాలి.

**ఆసక్తే పెట్టుబడి:**
పరిశోధన రంగంలో ఆసక్తి ఉంటేనే రాణించగలం. ఒకరకంగా పరిశోధనకు ముందస్తు పెట్టుబడి ఆసక్తి. పరిశోధన ఫలితాలు వెంటనే రావు. అందుకే సహనంతో ఉన్నవాళ్లే ఇందులోకి రావాలి.పరిశోధన రంగంలోకి అడుగుపెట్టిన ఏడాది, రెండేళ్లలో చాలా మంది ఫలితాలను ఆశిస్తారు. అలా చేయడంతో చాలామంది తమను తాము శాస్త్రవేత్తలుగా నిరూపించుకోలేకపోతున్నారు.

**తీర్చిదిద్దాలి:**
కాలేజీల నుంచి చదువుకుని వచ్చే విద్యార్థులకంటే... చదువుచెప్పే కాలేజీలు చాలా ఎక్కువగా ఉన్నాయి.ఒకరకంగా చెప్పాలంటే.. విద్యార్థులు, కాలేజీల మధ్య నిష్పత్తిలో చాలా తేడా ఉంది. ఉద్యోగాలు రావడంలేదని చెప్పడమంటే సరైన విద్య అందలేదనే అర్థం. పరిశ్రమలకు ఎలాంటి విద్యార్థులు అవసరమో తెలుసుకోవడం, వారిని అలా తీర్చిదిద్దడం ఉపాధ్యాయుల బాధ్యత.

**పనిచేస్తే ఫలితమొస్తుంది:**
నాణ్యత పెరగాలంటే ముందు సైన్స్ రంగం అవసరాలు, పరిశ్రమల అవసరాలు రెండూ తెలుసుకోవాలి. విద్యార్థుల ప్రాక్టికల్ నాలెడ్జ్‌పెంచాలి. ఉపాధ్యాయులు నాలెడ్జ్ అప్‌డేట్ చేసుకోవాలి.

ప్రాథమికస్థాయి నుంచే సిలబస్‌లో మార్పులు తెస్తే ఇప్పుడున్న అధ్యాపకులు, రీసెర్చర్ల కొరత ఏదీ ఉండదు. సైన్స్‌పై ఆసక్తి పెంచడానికి ఇప్పుడిస్తున్న ప్రోత్సాహకాలను పెంచాలి. సైంటిస్టులు విజయం సాధించడానికి దగ్గర దార్లు లేవు.

సైన్స్ రంగమే కాదు.. ఏదైనా సరే పనిలో నిజాయితీగా వ్యవహరిస్తే ఎక్కడైనా విజయం సాధించవచ్చు.

నా పరిశోధనలు విశ్వవ్యాప్తంగా మానవాళికి ఉపయోగపడేలా చేయడమే నా జీవిత లక్ష్యం.

ప్రతి గురువారం సాక్షితో ఉచితం 23-8-2012
Online Edition
www.sakshieducation.com/bhavitha.aspx
సాక్షి

# భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

Sakshi Bhavita TV Program on Facebook facebook.com/sakshibhavita



యూజీసీ తీసుకున్న తాజా నిర్ణయాలు, చేపడుతున్న సంస్కరణలపై కమిషన్ సభ్యులు డాక్టర్ డి.ఎన్. రెడ్డితో ప్రత్యేక ఇంటర్వ్యూ.. 3



# ఫీజు రీయింబర్స్‌మెంట్..

ఆర్థిక ఇబ్బందులు కారణంగా రాష్ట్రంలో ఏ ఒక్క విద్యార్థి చదువు ఆగిపోకూడదనే ఉన్నతాశయంతో దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి ప్రవేశపెట్టిన పథకమే ఫీజు రీయింబర్స్‌మెంట్. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, వికలాంగులు, ఈబీసీలు.. ఇలా ప్రతి విద్యార్థికి ఈ పథకాన్ని వర్తింపజేశారు. దాంతో లక్షల మంది మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్, ఎంబీఏ, ఎంసీఏ వంటి ప్రొఫెషనల్ కోర్సులు మొదలు బీఏ, బీకాం, బీఎస్సీ వంటి సంప్రదాయ డిగ్రీ కోర్సుల్లో చేరి లబ్ధి పొందారు. మహోన్నత ఆశయంతో రూపొందిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ఇప్పుడు గందరగోళంలో పడింది. ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌కు నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు తాజా ప్రతిపాదనలు, అర్హతలు, అందుకోవాలంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమగ్ర కథనం.. !!



6,7

## పీహెచ్‌డీ

దేశ ప్రగతికి ప్రధాన సాధనాలు పరిశోధనలే. అరటిపండు జన్యు విధానం నుంచి అంతరిక్ష శాస్త్రం వరకు అన్నిటా సరికొత్త ఆవిష్కరణలకు మూలం పరిశోధనలే. దీనికి మార్గం పీహెచ్‌డీ. చాలామందికి పీహెచ్‌డీ చేయాలని ఆకాంక్ష ఉన్నా.. సరైన అవగాహన లేక అవకాశాలను చేజార్చుకుంటున్నారు. ఈ క్రమంలో పీహెచ్‌డీలో ప్రవేశం, అర్హతలు, ఫెలోషిప్‌లు, ముఖ్యమైన సంస్థల వివరాలు.. 2

## సివిల్స్ మెయిన్స్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్-2

10

కాంపిటీటివ్ గైడెన్స్:

పాలిటెక్నిక్ లెక్చరర్స్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్... 5
గ్రూప్-1 మెయిన్స్ పేపర్-3 మోడల్ కొశ్చన్ పేపర్... 8
గ్రూప్-1 మెయిన్స్ పేపర్-4 మోడల్ కొశ్చన్ పేపర్.. 9

## ఫిజికల్ ఎడ్యుకేషన్

ఫిజికల్ ఎడ్యుకేషన్.. అకెడమిక్ అంశాలతోపాటు ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్‌లో పాల్గొంచుకునే దిశగా విద్యార్థులను నడిపించే తొలి సాధనం. ప్రతి పాఠశాలలో కచ్చితంగా ఒక పిరియడ్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌కు కేటాయించాలని ప్రభుత్వం కూడా ఆదేశించింది. దీంతో ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్ట్రక్టర్లకు అవకాశాలు మెరుగవనున్నాయి. 4



ప్రతి ఆదివారం ఉదయం 9-30 నుంచి 10గంటల వరకు.. మీ సాక్షి టీవీలో

మీరు ఉద్యోగావకాశాల కోసం ఎదురు చూస్తున్నారా? ఏపీపీఎస్సీ గ్రూప్స్, సివిల్స్, బ్యాంక్స్ వంటి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారా? అయితే సాక్షి భవిత టీవీ ప్రోగ్రాం చూడండి

సాక్షి SAKSHI TV

వివిధ రంగాల్లో ఉపాధి.. కెరీర్ ఎంపికలో మెలకువలు.. తాజా ఉద్యోగాల సమాచారం.. అడ్మిషన్ల వివరాలు.. విద్యా సమాచారం.. స్కాలర్‌షిప్పుల వివరాలు... ఇంకా మరెన్నో..

భవిత

# పీహెచ్‌డీ ఎట్ పాషన్.. హార్డ్‌వర్క్.. డెడికేషన్!!

పీహెచ్‌డీ‌లో ప్రవేశానికి వీలుకల్పించే సీఎస్ఐఆర్-నెట్, గేట్‌తోపాటు ఐఐఎంలు ఆఫర్ చేసే ఫెలో ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ (పీహెచ్‌డీతో సమానం..)లో అడ్మిషన్‌కు ప్రామాణికమైన క్యాట్ నోటిఫికేషన్లు వెలువడ్డాయి. ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, ఇతర వృత్తి విద్యా కాలేజీల్లో ప్రొఫెసర్ల కొరత తీవ్రంగా ఉందని స్వయంగా కేంద్ర ప్రభుత్వమే ప్రకటించింది. కాబట్టి పీహెచ్‌డీ పూర్తిచేసినవారికి భవిష్యత్‌లో అవకాశాలు అపారం. అటు అకడెమిక్ రంగంలో అత్యున్నత స్థాయికి చేరుకోవడానికి.. ఇటు రీసెర్చ్‌లోనూ ఉత్తమంగా రాణించడానికి ఏకైక మార్గమైన పీహెచ్‌డీపై ప్రత్యేక కథనం...



పీహెచ్‌డీకి ఫుల్‌ఫామ్... డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ. ఇక్కడ ఫిలాసఫీ అనేది చాలా విస్తృత పదం.. ఫిలాసఫీ సబ్జెక్టుతో పీహెచ్‌డీకి ఎలాంటి సంబంధం లేదు. అనేక దేశాల్లో యూనివర్సిటీలు అందించే అత్యున్నత డిగ్రీ పీహెచ్‌డీ. పీహెచ్‌డీ చేయాలనుకునే వ్యక్తి 'ఒరిజినల్ ఆలోచన'తో వినూత్న అంశాన్ని చేపట్టి లోతుగా అధ్యయనం చేయాల్సి ఉంటుంది. సంబంధిత సబ్జెక్టులో అప్పటికే పరిపూర్ణ నైపుణ్యం సాధించిన ప్రొఫెసర్/గైడ్ పర్యవేక్షణలో పరిశోధన కొనసాగించాలి. పీహెచ్‌డీ గురించి సాధారణంగా ఉన్న అభిప్రాయం- ''కుటుంబాన్ని, నిద్రాహారాలను, ఇతర ఆనందాలన్నింటినీ త్యాగం చేసి, ధ్యాన నిమగ్నులైన వారిని గతంలో సన్యాసులు అనేవారు. ఇప్పుడు పీహెచ్‌డీ స్టూడెంట్స్ అంటున్నారు''. ఇష్టమైన అంశాన్ని ఎంచుకొని సరైన ప్రణాళికతో ముందుకెళ్తే.. ఇతర కోర్సుల్లానే పీహెచ్‌డీని పూర్తిచేయొచ్చు. ఉద్యోగాలు చేస్తూ పీహెచ్‌డీలో రాణించినవారెందరో.

### పీహెచ్‌డీ చేస్తే ప్రయోజనమేంటి?

- తనకిష్టమైన రంగంలో విస్తృత పరిశోధనలు చేసి మానవాళికి మేలుచేసే ఏదైనా కొత్త అంశాన్ని కనుక్కోవచ్చు.
- ఎవరూ స్పృశించని టాపిక్‌ను ఎంచుకొని లోతుగా సోధించడం ద్వారా సదరు సబ్జెక్టులో మానవ విజ్ఞానాన్ని మరింతగా పెంపొందించవచ్చు.
- పీహెచ్‌డీ పూర్తిచేస్తే.. అకడెమిక్ రంగంలో జాతీయం/అంతర్జాతీయంగా అత్యున్నత స్థాయికి చేరుకోవచ్చు.
- పీహెచ్‌డీ ద్వారా కెరీర్ పరంగా ఆర్ అండ్ డీ విభాగాల్లో ఆకర్షణీయ వేతనాలతో జాబ్స్ లభిస్తాయి.
- పీహెచ్‌డీ పూర్తైతే పేరు ముందు డాక్టర్ అని పెట్టుకోవచ్చు. అరుదైన గౌరవం, గుర్తింపు అందుకోవచ్చు.

### పీహెచ్‌డీ చేసేందుకు అర్హతలేంటి:

- పీహెచ్‌డీకి కనీస అర్హత.. సంబంధిత సబ్జెక్టులో 55శాతం మార్కులతో పోస్టు గ్రాడ్యుయేషన్(పీజీ)
- పీజీతోపాటు యూజీసీ-నెట్ స్కోర్ కూడా తప్పనిసరి.
- కొన్ని యూనివర్సిటీలు సొంతంగా పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షను నిర్వహిస్తున్నాయి. కొన్ని వర్సిటీలు గ్రాడ్యుయేట్ అప్టిట్యూడ్ టెస్ట్(గేట్), జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌ను కోరుతున్నాయి.
- ఐఐఎంలలో పీహెచ్‌డీతో సమానమైన ఫెలో ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ కోసం క్యాట్/గేట్/జీఆర్ఈ/జేఆర్ఎఫ్(యూజీసీ/సీఎస్ఐఆర్)/స్లెట్ స్కోర్ ప్రామాణికం.
- కొన్ని వర్సిటీలు 60 శాతం మార్కులతో నాలుగేళ్ల ఇంజనీరింగ్‌తోపాటు వర్క్ఎక్స్‌పీరియెన్స్ అడుగుతున్నాయి.
- ఇంజనీరింగ్ సైన్సెస్‌లో పీహెచ్‌డీని ప్రోత్సహించేందుకు యూజీసీ ఈ ఏడాది నుంచి సీఎస్ఐఆర్-నెట్ సబ్జెక్టుల్లో ఇంజనీరింగ్ సైన్సెస్‌ను చేర్చింది.
- పీహెచ్‌డీకి ఎలాంటి వయోపరిమితి లేదు.
- ఐఐఎస్సీ బెంగళూరు వంటి ఇన్‌స్టిట్యూట్‌లు ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీని ఆఫర్ చేస్తున్నాయి.
- పీహెచ్‌డీలో ఫుల్‌టైమ్, పార్ట్‌టైమ్ కూడా ఉంది.

### పీహెచ్‌డీ ఎన్నేళ్లలో పూర్తిచేయాలి:

- ఫుల్‌టైమ్ పీహెచ్‌డీ 3 ఏళ్ల నుంచి 6 ఏళ్లలో పూర్తిచేయాలి.
- పార్ట్‌టైమ్ పీహెచ్‌డీ 4 ఏళ్ల నుంచి 7ఏళ్లలో పూర్తిచేయాలి.

### పీహెచ్‌డీలో చేరేందుకు సరైన సమయం?:

- పీహెచ్‌డీ పూర్తిచేయడం అనుకున్నంత కష్టమూ కాదు.. సులభమూ కాదు. పూర్తి ఆత్మవిశ్వాసంతో ఎంచుకున్న టాపిక్‌పై నిజమైన ఆసక్తితో పనిచేస్తే నిర్ణీత సమయం లోపు డాక్టరేట్ పొందొచ్చు.
- పీహెచ్‌డీ కంప్లీట్ చేసేందుకు.. ఎక్కువ సమయం కేటాయించడంతోపాటు పూర్తి అంకితభావంతో పనిచేయాలి
- విస్తృతస్థాయిలో పరిశోధన సాగించడానికిది సరైన సమయమేనా! అనేది ముందుగా ఆలోచించుకోవాలి.
- నాలుగేళ్లపాటు పరిశోధనలు చేసేందుకు అవసరమైన ఫైనాన్షియల్ సపోర్ట్ ఏర్పాటు చేసుకోవాలి.
- ఎంచుకునే టాపిక్ స్పష్టంగా ఉండాలి. ఉదా:''స్టడీ ఆన్ ఇండియన్ ఫైనాన్షియల్ సిస్టమ్'' కంటే ''ఇంపాక్ట్ ఆఫ్ ఎఫ్‌డీఐస్ ఇన్ ఇండియా'' మరింత సూటిగా ఉంటుంది.
- చాలా వర్సిటీలు దరఖాస్తుకు ముందే గైడ్‌ను చూసుకోమంటాయి. కాబట్టి ముందే రీసెర్చ్ అంశానికి సంబంధించి సరైన గైడ్‌ను ఎంచుకోవాలి.
- విద్యార్థి ఎంచుకున్న టాపిక్ పట్ల గైడ్‌కు ఆసక్తి లేకుంటే.. పరిశోధన చాలా కష్టమవుతుంది.
- రీసెర్చ్ చేయాలనుకుంటున్న అంశంపై ఆర్టికల్స్ ప్రచురితమయ్యేట్లు చూసుకుంటే మేలు.

### పీహెచ్‌డీకి దరఖాస్తు చేయడం ఎలా?

- ఐఐటీలు, ఐఐఎంలు, సెంట్రల్, స్టేట్ యూనివర్సిటీలు, డీమ్డ్ యూనివర్సిటీలు, ఇగ్నో వంటి దూరవిద్యను అందించే యూనివర్సిటీలు, ఇతర ఇన్‌స్టిట్యూట్‌లు ప్రతి ఏటా పీహెచ్‌డీ నోటిఫికేషన్‌లు విడుదల చేస్తాయి.
- ఆయా వర్సిటీలు, ఇన్‌స్టిట్యూట్‌ల నోటిఫికేషన్లలో పేర్కొన్న మేరకు విద్యార్హతలు, ప్రవేశ పరీక్షల స్కోర్‌తో నిర్దేశిత సమయంలోపు దరఖాస్తు చేసుకోవాలి.
- కొన్ని యూనివర్సిటీలు సొంతంగా రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూలను కూడా నిర్వహిస్తున్నాయి.
- పలు వర్సిటీలు డిస్టెన్స్ విధానంలో పీహెచ్‌డీని ఆఫర్ చేస్తున్నాయి. వాటిలో చేరేముందు వాటికి ఉన్న గుర్తింపు, పరిశోధనలకు అవసరమైన ప్రోత్సాహం సౌకర్యాలు ఉన్నాయా లేదా పరిశీలించుకోవాలి.

### పీహెచ్‌డీకి రిజిస్ట్రేషన్ ఇలా:

- ఎంచుకున్న టాపిక్‌పై సమగ్ర సినాప్సిస్ రాసి, గైడ్‌తో ఫైనలైజ్ చేయించుకోవాలి.
- ఆయా యూనివర్సిటీలు, ఇన్‌స్టిట్యూట్‌ల నోటిఫికేషన్ ప్రకారం- దరఖాస్తును పూర్తి చేసి పంపించాలి. సదరు వర్సిటీ, డిపార్ట్‌మెంట్ హెడ్ టాపిక్‌కు అనుమతిస్తారు.
- దరఖాస్తు చేసిన యూనివర్సిటీ నిబంధనలను బట్టి రాత పరీక్ష / ఇంటర్వ్యూ, లేదా రెండూ ఉంటాయి.

వీటిల్లోనూ ప్రతిభ చూపితే ప్రవేశం కల్పిస్తారు. దాంతో పీహెచ్‌డీలో మీ రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది.

### పీహెచ్‌డీ- ఫైనాన్షియల్ అసిస్టెన్స్:

జేఆర్ఎఫ్(జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్) పొందిన వారు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నుంచి ఫెలోషిప్ అందుకుంటారు. కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్(సీఎస్ఐఆర్)-నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్‌లో జేఆర్ఎఫ్ అర్హత సాధించిన విద్యార్థులకు వివిధ సీఎస్ఐఆర్ కేంద్రాల్లో, యూనివర్సిటీల్లో రీసెర్చ్‌కు అవకాశం లభిస్తుంది. సీఎస్ఐఆర్ నెట్- డిసెంబర్ 2012కు నోటిఫికేషన్ వెలువడింది. కెమికల్ సైన్సెస్; ఎర్త్, అట్మాస్ఫియర్, ఓషన్ అండ్ ప్లానెట్రీ సైన్సెస్; లైఫ్ సైన్సెస్; మ్యాథమెటికల్ సైన్సెస్; ఫిజికల్ సైన్సెస్, ఇంజనీరింగ్ సైన్సెస్‌లో దీన్ని నిర్వహిస్తారు. క్యాట్ 2012, గేట్ 2013కు నోటిఫికేషన్ విడుదలైంది. వాస్తవానికి ఐఐటీల్లో ఎంటెక్‌లో ప్రవేశానికి నిర్వహించే గేట్ స్కోర్‌ను ఐఐటీల్లో పీహెచ్‌డీకి; అలాగే ఐఐఎంలలో ఎంబీ ఏలో ప్రవేశానికి నిర్వహించే క్యాట్ స్కోర్‌నే ఐఐఎంలు పీహెచ్‌డీతో సమానమైన ఫెలో ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్‌కు పరిగణనలోకి తీసుకుంటున్నాయి. ఐఐఎంలు అందిస్తున్న ఫెలోప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్‌కు ఎంపికైనవారికి పలు ఐఐఎంలు మొదటి రెండేళ్లు నెలకు రూ.21,500; మూడో సంవత్సరం రూ.22,700; థీసిస్ సబ్మిట్ చేశాక నెలకు రూ.24,500 ఇస్తారు. దాంతోపాటు కంటిన్‌జెన్సీ అలవెన్స్ కింద సంవత్సరానికి రూ.25,000; ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్, కంప్యూటర్ కొనుక్కోవడానికి కూడా చెల్లిస్తారు.

### ఫెలోషిప్‌లు అందుకోండిలా:

పీహెచ్‌డీలోకి ప్రవేశం ప్రవేశ పరీక్షతో మొదలై... ఇంటర్వ్యూతో ముగుస్తుంది. ప్రవేశ పరీక్షలు అత్యంత కీలకం. వీటిలో ప్రతిభ ఆధారంగానే ఫెలోషిప్ లభిస్తుంది. వీటి ద్వారా పీహెచ్‌డీలో ప్రవేశానికి ఇంటర్వ్యూ కాల్ లెటర్ అందుతుంది. ప్రవేశ పరీక్షలు రెండు విధాలుగా ఉంటాయి. ఒకటి.. గేట్, క్యాట్, సీఎస్ఐఆర్ నెట్, డీబీటీ బీఈటీ, ఐసీఎంఆర్-జేఆర్ఎఫ్ వంటి జాతీయ ప్రవేశ పరీక్షలు; రెండు ఆయా ఇన్‌స్టిట్యూట్‌లు. సొంతంగా నిర్వహించుకునేవి. ఫెలోషిప్‌లను అందించే ప్రవేశ పరీక్షలకు అర్హత, నోటిఫికేషన్, పరీక్ష తీరుతెన్నులు తెలుసుకుంటే.. పీహెచ్‌డీలో ప్రవేశానికి మార్గం సుగమమైనట్లే!

### సీఎస్ఐఆర్ -నెట్(నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్):

ఎప్పుడు: ఏటా రెండు సార్లు; జూన్, డిసెంబర్‌లలో..
అర్హత: కెమికల్ సైన్సెస్; ఎర్త్, ఆట్మాస్ఫియర్, ఓషన్ అండ్ ప్లానెట్రీ సైన్సెస్; లైఫ్ సైన్సెస్; మ్యాథమెటికల్ సైన్సెస్; ఫిజికల్ సైన్సెస్‌లలో 55 శాతం మార్కులతో పీజీ; ఇంజనీరింగ్ సైన్సెస్‌లో గ్రాడ్యుయేట్స్.
పరీక్ష: ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది.
ఫెలోషిప్: మొదటి రెండేళ్లు నెలకు రూ.16,000+హెచ్ఆర్ఏ స్టైపెండ్, ఏటా 20వేల కంటిన్‌జెన్సీ ఫండ్, తర్వాత సీనియర్ రీసెర్చ్ ఫెలో హోదా కల్పించి నెలకు రూ.18,000+ హెచ్ఆర్ఏ ఇస్తారు.
వెబ్‌సైట్: www.csirhrdg.res.in

### డీబీటీ-బీఈటీ(బయోటెక్నాలజీ ఎలిజిబిలిటీ టెస్ట్)

ఎప్పుడు: సంవత్సరానికి ఒకసారి
నోటిఫికేషన్:జనవరి-ఫిబ్రవరిలో; పరీక్ష ఏప్రిల్‌లో
అర్హత: బయోటెక్, సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ/ బీటెక్
ఫెలోషిప్: జేఆర్ఎఫ్ నెలకు రూ.16,000+హెచ్ఆర్ఏ, తర్వాత ఎస్ఆర్ఎఫ్ నెలకు రూ.18,000+హెచ్ఆర్ఏతో పాటు రూ. 30,000 కంటిన్‌జెన్సీ గ్రాంట్ ఉంటుంది.
వెబ్‌సైట్: http://oasis.mkcl.org/bet/.

### గ్రాడ్యుయేట్ అప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్:

ఎప్పుడు: ఏడాదికి ఒకసారి...ఆన్‌లైన్‌లో... ఆఫ్‌లైన్‌లో...
పరీక్ష: సంబంధిత సబ్జెక్టుపై ఆబ్జెక్టివ్ తరహాలో..
అర్హత: ఇంజనీరింగ్/టెక్నాలజీ/ఆర్కిటెక్చర్‌లో బ్యాచిలర్ డిగ్రీ... సైన్స్/మ్యాథమెటిక్స్/ స్టాటిస్టిక్స్‌లో పీజీ..
వెబ్‌సైట్: www.gate.iitb.ac.in/gate2013/
ఫెలోషిప్: రెండేళ్లు నెలకు 16,000 జేఆర్ఎఫ్; ఆ తర్వాత నెలకు 18,000 ఎస్ఆర్ఎఫ్; ఏడాదికి రూ.30,000 కంటిన్‌జెన్సీ ఫండ్ లభిస్తుంది.

### ఐసీఎంఆర్(ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చ్)

ఎప్పుడు: ఏటా ఒకసారి.. అర్హత: కనీసం 55 శాతం మార్కులతో ఎంఎస్సీ(లైఫ్ సైన్సెస్)/ఎంఏ(సోషల్ సైన్సెస్)...
ఫెలోషిప్: మొదటి రెండేళ్లు నెలకు రూ.16,000 స్టైపెండ్, ఏటా 20 వేల కంటిన్‌జెన్సీ ఫండ్, తర్వాత సీనియర్ రీసెర్చ్ ఫెలో హోదా కల్పించి నెలకు రూ.18,000 ఇస్తారు.
వెబ్‌సైట్: www.icmr.nic.in/jrf.htm

### ఏఏ సబ్జెక్టుల్లో

- లైఫ్ సైన్సెస్
- సోషల్ సైన్సెస్
- ఇంజనీరింగ్ సైన్సెస్
- మేనేజ్‌మెంట్
- లాంగ్వేజెస్
- ఫార్మసీ
- మ్యాథమెటిక్స్
- ఫిజికల్ సైన్సెస్
- లా.. ఇలా అనేక సబ్జెక్టుల్లో పీహెచ్‌డీ చేయొచ్చు.

### పీహెచ్‌డీకి పేరున్న ఇన్‌స్టిట్యూట్‌లు

- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీస్)
- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్స్ (ఐఐఎంస్)
- చెన్నై మ్యాథమెటికల్ ఇన్‌స్టిట్యూట్ (సీఎంఐ)
- ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్, కోల్‌కతా
- హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ)
- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, బెంగళూరు www.iisc.ernet.in
- ఐఐఎస్ఈఆర్-పుణె www.iiserpune.ac.in
- టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ (టీఐఎఫ్ఆర్) www.tifr.res.in
- జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) www.jnu.ac.in
- ఎన్‌బీఆర్‌సీ (నేషనల్ బ్రెయిన్ రీసెర్చ్ సెంటర్) www.nbrc.ac.in
- ఎన్ఐఐ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇమ్యునాలజీ) www.nii.res.in
- బీఏఆర్‌సీ-బార్క్ www.barc.ernet.in
- నేషనల్ సెంటర్ ఫర్ బయోలాజికల్ సైన్సెస్ www.ncbs.res.in
- ఏఐఐఎంఎస్ (ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఫర్ మెడికల్ సైన్సెస్) www.aiims.ac.in
- జేఎన్‌సీఏఎస్ఆర్ (జవహర్‌లాల్ నెహ్రూ సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ సైంటిఫిక్ రీసెర్చ్) www.jncasr.ac.in
- సీసీఎంబీ (సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులార్ బయాలజీ) www.ccmb.res.in
- సీడీఎఫ్‌డీ (సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నస్టిక్స్) www.cdfd.org.in
- ఐసీజీఈబీ (ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ జెనిటిక్ ఇంజనీరింగ్ అండ్ బయోటెక్నాలజీ) www.icgeb.org
- ఐజీఐబీ(ఇన్‌స్టిట్యూట్ ఫర్ జీనోమిక్స్ అండ్ ఇంటిగ్రేటివ్ బయాలజీ) www.igib.res.in
- సీఎఫ్‌టీఆర్ఐ (సెంట్రల్ ఫుడ్ టెక్నలాజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్) www.cftri.com

Dr. D.N.Reddy on UGC Latest decisions

# ఉన్నత విద్యకు.. మరిన్ని ప్రోత్సాహకాలు

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ).. దేశంలో ఉన్నత విద్యను ప్రోత్సహించడానికి.. విద్యా సంస్థల పనితీరును పర్యవేక్షించి, లోపాలను సరిదిద్ది, సరైన మార్గంలో నడిపించి.. దేశంలో విద్యాధికులకు రూపకల్పన చేయాలనే సమున్నత ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సమున్నత సంస్థ! ఈ క్రమంలో ఎన్నో ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్‌లకు రూపకల్పన చేసి ఎందరో శాస్త్రవేత్తలను అందించింది యూజీసీ.. తాజాగా తన పనితీరుకు మరింత మెరుగులు దిద్దుతోంది. ఈ క్రమంలో విద్యారంగంలో సంస్కరణల దిశగా శరవేగంగా కదులుతూ అందుకు అనుగుణంగా తీసుకుంటున్న నిర్ణయాలపై యూజీసీ సభ్యులు డాక్టర్ డి.ఎన్.రెడ్డితో ప్రత్యేక ఇంటర్వ్యూ..



'అవసరాలకు అనుగుణంగా ఉన్నత విద్యను ప్రోత్సహించడంలో చొరవచూపడం లేదు'.. యూజీసీ పనితీరు విషయంలో ప్రధానంగా వెల్లువెత్తుతున్న విమర్శ. దీనికి పరిష్కారంగా సరికొత్త విధానాలు, ఆలోచనలకు శ్రీకారం చుడుతోంది. అవి ముఖ్యంగా..

- యూనివర్సిటీలన్నిటినీ పనితీరుతో సంబంధం లేకుండా ఒకేగాటన కట్టి నిధులు కేటాయించే విధానానికి స్వస్తి పలకడం.
- విద్యార్థుల సంఖ్య, కోర్సుల నిర్వహణ, అడ్మిషన్ల తీరు ప్రామాణికంగా చేసుకుని నిధులు కేటాయించే కొత్త విధానాన్ని ప్రవేశ పెట్టడం.
- నెట్ పరీక్షల్లో ప్రమాణాలు పెంచి, ప్రత్యేక ప్రశ్నల నిధికి రూపకల్పన చేయడం.
- పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణులకు కూడా ఫెలోషిప్‌లు మంజూరు చేయాలని సంకల్పించడం.

ఇలా.. ఉన్నత విద్య ఔత్సాహికుల సంఖ్యను, వర్సిటీల్లో నాణ్యత ప్రమాణాలు పెంచే దిశగా అనేక నిర్ణయాలు తీసుకుంది. పదకొండో ప్రణాళికలో నిర్దేశించిన.. అన్ని 'జిల్లా కేంద్రాల్లో 394 మోడల్ డిగ్రీ కళాశాలలు ఏర్పాటు' కార్యాచరణలో 75 మాత్రమే పూర్తికాగా.. మిగతా వాటిని 2012లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

## 'నెట్'లో సమూల సంస్కరణలు:

నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్(నెట్) పరీక్షలో సమూల సంస్కరణలకు యూజీసీ శ్రీకారం చుట్టింది. నెట్ పరీక్షలో ప్రస్తుత ప్రమాణాలను మరింత పెంచి.. పరీక్ష విధానాన్ని పటిష్టంగా తీర్చిదిద్దాలని భావిస్తోంది. ఇందుకోసం ఇకపై అన్ని సబ్జెక్టులకు ప్రత్యేకంగా కొశ్చన్ బ్యాంక్ తయారు చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం యూజీసీ నెట్ పరీక్షకు సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు తయారు చేస్తున్న ప్రొఫెసర్లలో కొత్త వారికి చోటు కల్పించాలని నిర్ణయించింది. కొత్త ప్రొఫెసర్ల జాబితా ఇవ్వాలని బోర్డు సభ్యులందరికీ మార్గదర్శకాలు జారీ చేసింది. వీరంతా ఆగస్టు నెలాఖరు నాటికి కొశ్చన్ బ్యాంకు తయారు చేసే ప్రొఫెసర్ల జాబితాను ఇవ్వనున్నారు. ఇది అమలైతే 28 సబ్జెక్టుల్లో నిర్వహించే నెట్ పరీక్షకు ఒక్కో సబ్జెక్టుకు 1000 ప్రశ్నలతో కొశ్చన్ బ్యాంకు సిద్ధం అవుతుంది.

## పెరగనున్న ఫెలోషిప్‌లు:

యూజీసీ సరికొత్త చర్యల్లో మరో ప్రధానమైంది ఫెలోషిప్‌ల పరిధిని పెంచడం. ప్రస్తుతం 'నెట్' ఓపెన్ కేటగిరీ ఉత్తీర్ణులకు జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ (జేఆర్ఎఫ్)కు మొదటి రెండేళ్లు నెలకు రూ. 16 వేలు, ఆ తర్వాత ఏడాది నెలకు రూ. 18 వేలు సీఆర్ఎఫ్ అందిస్తుంది. అదే విధంగా ఇంజనీరింగ్‌లో 50 మందికి.. పోస్ట్ డాక్టోరల్ విభాగంలో మహిళలకు 100 ఫెలోషిప్‌లు.. ఎస్సీ, ఎస్టీలకు 100, పీజీ స్కాలర్‌షిప్స్ మరో 1,000 కొత్తగా అందించనుంది. బోధన రంగంలో ఉన్న టీచర్లకు ఇకపై 100 రీసెర్చ్ అవార్డులు, ఎమిరేట్స్ ఫెలోషిప్‌లు 200, రీసెర్చ్ సైంటిస్టులకు 100, ఇతరులకు 11 చొప్పున ఇవ్వనున్నారు. మొత్తం మూడు వేలమందికి ఫెలోషిప్‌లు ఇవ్వాలని నిర్ణయించుకోగా యూజీసీ 2200, సీఎస్ఐఆర్ 800 కేటాయించనున్నాయి.

## యూనివర్సిటీ పీహెచ్‌డీలకూ.. ఫెలోషిప్స్:

ప్రస్తుతం నెట్ అర్హత సాధించిన విద్యార్థులకు మాత్రమే యూజీసీ జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ (జేఆర్ఎఫ్) అందిస్తోంది. ఇకపై నెట్ పరీక్షలో అర్హత సాధించకున్నా.. యూనివర్సిటీ స్థాయిలో నిర్వహించే పీహెచ్‌డీ ప్రవేశ పరీక్ష పాసైన వాళ్లకు, ఎంఫిల్ ఉత్తీర్ణులకు ఫెలోషిప్‌లు ఇవ్వనుంది.

- అంతేకాకుండా యూనివర్సిటీలు నిర్వహించే పీజీ ప్రవేశ పరీక్షల్లో మంచి ర్యాంకులు సాధించే 3,000 మంది విద్యార్థులకు యూజీసీ ప్రోత్సాహకాల పథకం ఈ ఏడాది నుంచి అమలు చేయాలని నిర్ణయించింది.

## గెస్ట్ ఫ్యాకల్టీలకు.. బెస్ట్ హానరోరియం:

దేశవ్యాప్తంగా వివిధ యూనివర్సిటీల్లో అధ్యాపకులు, ఇతర ప్రొఫెసర్ల కొరత తీవ్రంగా ఉంది. దాంతో చాలాచోట్ల ప్రత్యేక అనుమతితో గెస్ట్ ఫ్యాకల్టీని నియమించుకుంటున్నారు. నెలకు, రోజుకు, గంటల ఆధారంగా రూ.5 వేల నుంచి రూ.25 వేల వరకు చెల్లిస్తున్నారు. ఇలా దేశవ్యాప్తంగా సుమారు 20 వేల మంది గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేస్తున్నట్లు అంచనా. వీరి బోధనలో మరింత నాణ్యత పెంచేలా వారిని ప్రోత్సహించేందుకు.. పనితీరు, బోధన ఆధారంగా మరో రూ.10 వేలు అదనంగా చెల్లించాలని యోచిస్తోంది. దీన్ని 12వ ప్రణాళికలో అమలు చేయనున్నారు.

## నిధుల కేటాయింపులో నూతన విధానాలు:

దేశవ్యాప్తంగా అనేక యూనివర్సిటీలకు యూజీసీ ఏటా కేటాయిస్తున్న కోట్లాది రూపాయల నిధులు సకాలంలో ఖర్చుకాక తిరిగి వెనక్కు వచ్చేస్తున్నాయి. యూనివర్సిటీలకు నిధుల కేటాయింపులో స్పష్టమైన నిబంధనలు పాటించకపోవడం.. కేవలం యూజీసీ నియమించిన ప్రత్యేక కమిటీ చేసే సిఫార్సుల ఆధారంగానే నిధులు విడుదల చేస్తుండడంపై ఎప్పటినుంచో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విధానం కారణంగా బాగా పనిచేసే యూనివర్సిటీలకు నిధులు సరిపోవడం లేదని వర్సిటీల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. దాంతో ఇకపై కమిటీ సిఫార్సులకు అనుగుణంగా నిధులు మంజూరుచేసే విధానానికి యూజీసీ స్వస్తి పలకనుంది. దానికి బదులు.. అక్రెడిటేషన్, విద్యార్థుల సంఖ్య, నిర్వహిస్తున్న కోర్సులు, పని చేస్తున్న ప్రొఫెసర్లు, విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్న తీరు, మొత్తంమీద వర్సిటీ పనితీరు వంటి పలు అంశాల ఆధారంగా వర్సిటీలకు నిధులు కేటాయించే విధానాన్ని ఈ ఏడాది నుంచి అమలు చేయాలని యూజీసీ నిర్ణయించింది.

## 'ఇన్నోవేటివ్స్'కు.. 'ఇన్‌స్పిరేషన్':

ప్రస్తుతమున్న యూనివర్సిటీల్లో వినూత్న, సృజనాత్మక కోర్సులు ప్రవేశపెట్టే వారికి.. ఇన్నోవేటివ్ యూనివర్సిటీలు స్థాపించడానికి ముందుకు వచ్చేవారికి.. ఇతర కొత్త వర్సిటీల ఏర్పాటుకు 12వ పంచవర్ష ప్రణాళికలో స్పెషల్ స్కీం పేరిట రానున్న అయిదేళ్లకు రూ.8 వేల కోట్లు కేటాయించింది. ఈ మొత్తంలో ఇన్నోవేటివ్ యూనివర్సిటీ ల ఏర్పాటుకు రూ. వంద కోట్ల నుంచి రూ. 300కోట్లు,సృజనాత్మకత, ఉపాధి కల్పించే కోర్సులను ప్రోత్సహించడానికి రూ. 3 కోట్ల నుంచి రూ.25 కోట్లు, ఇన్నోవేటివ్ ప్రోగ్రామ్స్ నిర్వహణకు రూ. ఒక కోటి నుంచి 3కోట్ల చొప్పున కేటాయించింది. ఈ కొత్త పథకం ఈ ఏడాది నుంచి అమలుకానుంది.

## డీమ్డ్ వర్సిటీలకు వర్గీకరణ:

దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లోని డీమ్డ్ యూనివర్సిటీల్లో ఎంబీబీఎస్ సీట్ల భర్తీలో అనుసరిస్తున్న విధానాలు నాసిరకంగా ఉండడంతోపాటు ప్రమాణాలను ఏ మాత్రం పాటించడంలేదనే వైనాన్ని యూజీసీ గుర్తించింది. దాంతో ప్రస్తుతమున్న విధానాన్ని సవరించి, డీమ్డ్‌వర్సిటీల్లో మెడికల్ సీట్ల భర్తీని మరింత పటిష్టం చేయడం కోసం టాండన్ కమిటీని నియమించింది. ఈ కమిటీ తన నివేదికను ఇటీవల మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖకు అందజేసింది. ఈ నివేదికలో ప్రస్తుత డీమ్డ్‌వర్సిటీలను పనితీరు ఆధారంగా ఏ, బీ, సీ, అనే మూడు కేటగిరీలుగా విభజించింది. ఇందులో సీ కేటగిరీలోకి 44 వర్సిటీలను చేరుస్తూ వీటి గుర్తింపును రద్దుచేయాలని నిర్ణయించింది. వీటిపై కొన్ని వర్సిటీలు సుప్రీం కోర్టును ఆశ్రయించాయి. ఈ కేసు తేలితే డీమ్డ్ వర్సిటీల్లో ప్రమాణాలపై యూజీసీ త్వరితగతిన నిర్ణయం తీసుకోనుంది.

### యూనివర్సిటీల వివరాలు

| | |
|---|---|
| స్టేట్ యూనివర్సిటీలు | 294 |
| సెంట్రల్ యూనివర్సిటీలు | 44 |
| ప్రైవేటు యూనివర్సిటీలు | 134 |
| దేశంలో మొత్తం డీమ్డ్ యూనివర్సిటీలు | 130 |
| డిగ్రీకాలేజీలు | 33,000 |

### విద్యా రంగం.. యూజీసీ తాజా గణాంకాలు

- దేశ జనాభాలో 12 నుంచి 22 ఏళ్ల వయోవర్గంలో ఏటా ఉన్నత విద్యలో చేరుతున్న వారి సంఖ్య 1.2 కోట్లు. (ఇది సరాసరి 17.2 శాతం).
- ఉన్నత విద్యకు వెళ్తున్న మహిళలు 15 శాతం.
- ఓబీసీలు 14 శాతం, ఎస్సీలు 11శాతం, ఎస్టీలు 7 శాతం.
- రానున్న 12వ పంచవర్ష ప్రణాళికలో ఉన్నత విద్యలో చేరే వారి సంఖ్యను 30 శాతం వరకు పెంచాలని యూజీసీ లక్ష్యంగా నిర్దేశించుకుంది.
- దేశంలో వివిధ యూనివర్సిటీల్లో చదువుతున్న మొత్తం విద్యార్థులు 30 మిలియన్ల మంది.
- దూరవిద్యా విధానం ద్వారా ఉన్నత విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల సంఖ్య 6 మిలియన్లు.
- దేశ బడ్జెట్లో ప్రాథమిక, సెకండరీ విద్యకు వెచ్చిస్తున్న నిధులు రూ.46 వేల కోట్లు.
- ఉన్నత విద్యకు దేశ బడ్జెట్లో వెచ్చిస్తున్న నిధులు రూ.18 వేల కోట్లు.
- దేశ బడ్జెట్లో మొత్తం విద్య కోసం వెచ్చిస్తున్న నిధుల శాతం 13%.

## ఒకేషనల్ ఎడ్యుకేషన్.. వెరీ ఇంపార్టెంట్:

విద్యార్థులను వృత్తి విద్య (ఒకేషనల్ ఎడ్యుకేషన్) వైపు ఆకర్షితులను చేసేందుకు ప్రత్యేక చర్యలకు శ్రీకారం చుడుతోంది. నేషనల్ ఒకేషనల్ ఎడ్యుకేషన్ క్వాలిఫికేషన్ ఫ్రేంవర్క్ పథకం కింద దేశంలోని ఒకేషనల్ డిగ్రీ కాలేజీల విద్యార్థులకు తక్షణం ఉద్యోగం సాధించే స్కిల్స్ నేర్పించడం.. 'రెడీ టు జాబ్'గా తీర్చిదిద్దడం కోసం ఈ ఏడాది నుంచి ప్రత్యేక పథకాన్ని అమలు చేయనుంది. ఈ మేరకు ఇకపై ఒక్కో కాలేజీకి ఏటా రూ.2 లక్షలు ఇవ్వనుంది.

## ఈ-లెసన్స్:

యూనివర్సిటీల్లోని సోషల్ సైన్సెస్ పీజీ కోర్సుల్లో చదువుతున్న విద్యార్థులకు మరింత నాణ్యమైన బోధన అందించడం.. ప్రొఫెసర్ల కొరత ఉన్న వర్సిటీల్లో విద్యా ప్రమాణాలు పెంచే ఉద్దేశంతో యూజీసీ ఈ-లెస్సన్స్ తయారీ పథకం ప్రవేశ పెట్టాలని నిర్ణయించింది. దీని ప్రకారం- నిపుణులైన ప్రొఫెసర్లతో మొత్తం 75 సబ్జెక్టుల్లో ఈ-లెస్సన్స్‌ను తయారు చేసి సీడీల రూపంలో ఇచ్చే పథకానికి రూ.80 కోట్లు కేటాయించాలని నిర్ణయించింది.

# స్కాలర్‌షిప్స్

## నేషనల్ స్కాలర్‌షిప్ ఫర్ పర్సన్స్ విత్ డిజేబిలిటీస్

భారత ప్రభుత్వ సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ వికలాంగ అభ్యర్థులకు స్కాలర్‌షిప్స్ అందించేందుకు ప్రకటన విడుదల చేసింది. వివరాలు..

కోర్సులు: పోస్ట్ మెట్రిక్/ పోస్ట్ సెకండరీ, టెక్నికల్, ప్రొఫెషనల్ కోర్సులు, పీజీ, పీహెచ్‌డీ.

అర్హత: ఆయా కోర్సులకు పేర్కొన్న నిర్దేశిత కనీస విద్యార్హతతోపాటు 40 శాతం అంగవైకల్యం కలిగి వారు మాత్రమే అర్హులు.

- కుటుంబ నెల ఆదాయం రూ. 15 వేలకు మించకూడదు.
- మొత్తం స్కాలర్‌షిప్‌ల సంఖ్య: 500 వీటిలో 250 విద్యార్థినులకు.

స్కాలర్‌షిప్ మొత్తం:

- ఇంజనీరింగ్, మెడిసిన్, అగ్రికల్చర్, వెటర్నరీ, ఐటీ, బయోటెక్నాలజీ, ఎడ్యుకేషన్ మేనేజ్‌మెంట్, ఆర్కిటెక్చర్, ఫిజియోథెరపీ, మ్యూజిక్ ఇతర వృత్తి విద్య కోర్సుల్లో పీహెచ్‌డీ, ఎంఫిల్, పీజీ విద్యార్థులకు: హాస్టలర్స్‌కు నెలకు రూ. 1000; డే స్కాలర్స్‌కు రూ. 700
- డిప్లొమా, సర్టిఫికెట్ స్థాయి ప్రొఫెషనల్ కోర్సులకు నెలకు: హాస్టలర్స్‌కు రూ. 700; డే స్కాలర్స్‌కు రూ.400
- స్కాలర్‌షిప్‌తోపాటు ఏడాదికి రూ. పది వేల సీలింగ్‌తో కోర్సు ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయం లభిస్తుంది.

దరఖాస్తు విధానం:

www.nhfdc.nic.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. పూర్తి చేసిన దరఖాస్తును ప్రింట్ తీసుకుని తాము చదువుతున్న కళాశాల ప్రిన్సిపల్ లేదా అధీకృత అధికారి సంతకం చేయించాలి. వాటికి నిర్దేశిత డాక్యుమెంట్లను జత చేసి పంపించాలి.

దరఖాస్తు గడువు తేదీ: ఆగస్టు 31, 2012

వెబ్‌సైట్: www.socialjustice.nic.in లేదా www.nhfdc.nic.in

పోటీ పరీక్షార్థులకు సమాచార స్ఫూర్తి... భవిత! ఇకపై మీ సాక్షి టీవీలో
ప్రతి ఆదివారం ఉదయం 9-30 నుంచి 10గం.. వరకు


# ఫిజికల్ ఎడ్యుకేషన్‌దే ఫ్యూచర్..

**మన విద్యా విధానంలో.. క్రీడలు అంతర్భాగం అని చెప్పొచ్చు. చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు వంటి ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్ ఉన్నప్పుడే.. విద్యార్థి మానసికంగా.. శారీరకంగా పరిపూర్ణ వ్యక్తిగా ఎదిగే అవకాశం ఉంటుంది.. సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు.. విద్యార్థి దశ నుంచే పెంపొందించుకోవడానికి.. ఇవి ఎంతగానో దోహదం చేస్తాయి.. ఈ క్రమంలో విద్యార్థులకు క్రీడల పరంగా, శారీరకంగా కావల్సిన శిక్షణను ఇవ్వడానికి ప్రతి పాఠశాలలో పీఈటీ/పీడీ ఉంటారు. ఒలింపిక్స్ క్రీడల్లో మన క్రీడాకారులు ఆశించిన స్థాయిలో పతకాలు సాధించలేకపోయినా..ప్రస్తుతం మన దేశంలో విద్యతో సమానంగా క్రీడలకు మరింత ప్రాధాన్యం ఇవ్వాల్సిన నేపథ్యంలో.. ఫిజికల్ ఎడ్యుకేషన్ సంబంధించిన కోర్సులు, ఆఫర్ చేస్తున్న ఇన్‌స్టిట్యూట్‌లపై ఫోకస్..**



మన రాష్ట్ర క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సాధిస్తున్న విజయాలు.. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం.. ప్రతి పాఠశాల కరిక్యులంలో క్రీడలకు తప్పనిసరిగా ఒక పీరియడ్ కేటాయించాలని ఆదేశించటం.. ఫలితంగా ఫిజికల్ ఎడ్యుకేషన్‌కు ప్రాముఖ్యం పెరిగింది. విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికి దోహదం చేసే అంశాల్లో ఒకటైన.. ఫిజికల్ ఎడ్యుకేషన్‌ను పాఠశాల, కళాశాలల స్థాయిలో నిర్వహించడానికి, క్రీడాకారుల ప్రతిభను ప్రాథమిక దశలోనే గుర్తించి.. వారిని మరింత మెరుగైన ఆటగాళ్లుగా తీర్చిదిద్దాలంటే.. ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ (పీఈటీ) / ఫిజికల్ డైరెక్టర్ తప్పనిసరి. ఫిజికల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించి పలు ఇన్‌స్టిట్యూట్‌లు వివిధ రకాల కోర్సులను ఆఫర్ చేస్తున్నాయి.

### క్లాస్ రూమ్ టు ప్రాక్టికల్:
ఫిజికల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించి అందుబాటులో ఉన్న కోర్సులను పరిశీలిస్తే.. థియరీ, ప్రాక్టికల్ సెషన్ రెండూ ఉంటాయి. మిగతా కోర్సుల మాదిరిగానే ఇందులో కూడా డిప్లొమా,బ్యాచిలర్,మాస్టర్,పీహెచ్‌డీ కోర్సులు ఉంటాయి. కొన్ని ఇన్‌స్టిట్యూట్‌లు, కోచింగ్ సెంటర్లు పలు స్పెషలైజేషన్స్‌తో సర్టిఫికెట్ కోర్సులను కూడా ఆఫర్ చేస్తున్నాయి.

### మన రాష్ట్రంలో:
మన రాష్ట్రంలో స్పోర్ట్స్ అండ్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించి డిప్లొమా స్థాయిలో డీపీఈడీ, బ్యాచిలర్ స్థాయిలో బీపీఈడీ, పీజీ స్థాయిలో ఎంపీఈడీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

- **యూజీడీపీఈడీ (అండర్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్):** ఈ కోర్సుకు ఇంటర్మీడియెట్/తత్సమానం పూర్తి చేసిన విద్యార్థులు అర్హులు. వయసు 16 ఏళ్లు నిండి ఉండాలి. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ ఆధారంగా ప్రవేశం కల్పిస్తారు. సంబంధిత నోటిఫికేషన్ మార్చి/ఏప్రిల్‌లలో వెలువడుతుంది.
- **బీపీఈడీ (బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్):** ఈ కోర్సుకు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు అర్హులు. వయసు 19 ఏళ్లు నిండి ఉండాలి. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ ఆధారంగా ప్రవేశం కల్పిస్తారు. సంబంధిత నోటిఫికేషన్ మార్చి/ఏప్రిల్‌లలో వెలువడుతుంది.
- యూజీడీపీఈడీ/బీపీఈడీ కోర్సులలో ప్రిన్సిపుల్స్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ ఫిజియాలజీ, బయో మెకానిక్స్, స్పోర్ట్స్ సైకాలజీ, హిస్టరీ ఆఫ్ స్పోర్ట్స్, లెర్నింగ్ థియరీ, ఫిజికల్ ఫిట్‌నెస్, స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్ తదితర సబ్జెక్టులను బోధిస్తారు. ప్రాక్టికల్ సెషన్‌లో గేమ్స్, ఫస్ట్ ఎయిడ్, యోగా తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారు. మన రాష్ట్రంలో దాదాపు 10 నుంచి 20 కాలేజీలు ఈ కోర్సులను ఆఫర్ చేస్తున్నాయి.
- **ఎంపీఈడీ (మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్):** బీపీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులు దీనికి అర్హులు. రాష్ట్రంలోని అన్ని ప్రముఖ యూనివర్సిటీలు ఈ కోర్సును ఆఫర్ చేస్తున్నాయి. ఆయా వర్సిటీలు నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్‌ల ఆధారంగా ప్రవేశం ఉంటుంది. సంబంధిత నోటిఫికేషన్లు ఏప్రిల్/మేలో వెలువడుతాయి. ఈ కోర్సులో రీసెర్చ్ మెథడ్ ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్ అండ్ ట్రెనింగ్ మెథడ్స్, స్పోర్ట్స్ సైకాలజీ, కౌన్సెలింగ్-గైడెన్స్, తదితర అంశాలు ఉంటాయి. నిర్దేశించిన జాబితాల్లోంచి ఏదో ఒక క్రీడాంశాన్ని ఎంచుకోవాలి.

ఎంపీఈడీ తర్వాత ఆసక్తిని బట్టి ఏదో ఒక విభాగంలో ఎంఫిల్, పీహెచ్‌డీ కోర్సులు చదివే అవకాశం ఉంది. అంతేకాకుండా పలు జాతీయ స్థాయి ఇన్‌స్టిట్యూట్‌లు/ యూనివర్సిటీలు.. స్పోర్ట్స్ కోచింగ్, ఫిట్‌నెస్ మేనేజ్‌మెంట్, స్పోర్ట్స్ మెడిసిన్ తదితర విభాగాల్లో సర్టిఫికెట్, డిప్లొమా, కోర్సులను ఆఫర్ చేస్తున్నాయి. ఈ కోర్సులను చేయడం ద్వారా కోచ్, ఫిజికల్ ట్రెనర్, స్పోర్ట్స్ అకాడెమీ డైరెక్టర్లుగా కెరీర్‌లో ఉన్నత స్థానానికి ఎదగడానికి అవకాశం ఉంటుంది.

### కెరీర్.. అవకాశాలు:
ఫిజికల్ ఎడ్యుకేషన్ కోర్సులు పూర్తి చేసిన వారికి ప్రభుత్వ. ప్రైవేట్ రంగాలలో అవకాశాలకు కొదవలేదని చెప్పొచ్చు. ఉపాధ్యాయుల భర్తీ కోసం నిర్వహించే డీఎస్సీ పరీక్షకు ఈ కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులు కూడా అర్హులే. ఇందులో విజయం సాధించడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్‌గా కెరీర్ ప్రారంభించవచ్చు. కాలేజీలు, యూనివర్సిటీలలో ఫిజికల్ డైరెక్టర్‌గా స్థిర పడొచ్చు. సంబంధిత కోర్సులను ఆఫర్ చేస్తున్న ఇన్‌స్టిట్యూట్‌లు/ కాలేజీ/యూనివర్సిటీల్లో ఫ్యాకల్టీగా కూడా పని చేయొచ్చు. పాఠశాల కరిక్యులంలో క్రీడల కోసం ప్రత్యేకంగా ఒక పీరియడ్ కేటాయించాలనే ప్రభుత్వ ఆదేశం ఫలితంగా ప్రైవేట్ రంగంలో వీరికి అవకాశాలు పెరగడం తథ్యం.

ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో నిర్వహించే వివిధ స్పోర్ట్స్ స్కూల్స్, హెల్త్ క్లబ్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్), రాష్ట్ర క్రీడా సాధికారిత సంస్థలు, అకాడెమీలలో అడ్వైజర్స్‌గా, కోచ్‌లు, ఫిజికల్ ట్రెనర్‌గా అవకాశాలు ఉంటాయి. సొంతంగా స్పోర్ట్స్ స్కూలు, అకాడెమీలు, ఫిట్‌నెస్ సెంటర్లు, హెల్త్ క్లబ్‌లు స్థాపించుకోవడం ద్వారా స్వయం ఉపాధిని పొందొచ్చు.

### పెరుగుతున్న ప్రాధాన్యం



గతంతో పోల్చితే ప్రస్తుతం ఫిజికల్ ఎడ్యుకేషన్ కోర్సులు చేసే వారికి విద్య, ఉపాధి పరంగా అవకాశాలు పెరిగాయని చెప్పొచ్చు. డీఎస్సీ ద్వారా ప్రభుత్వ టీచర్లుగా కెరీర్ ప్రారంభించవచ్చు. టీచింగ్ ఎబిలిటీ, ఇంగ్లిష్ భాషలో సామర్థ్యం ఉంటే.. కార్పొరేట్ స్కూల్స్, కాలేజీలు, ఇంజనీరింగ్ కాలేజీల్లో పీఈటీ/పీడీగా పని చేసే అవకాశం ఉంటుంది. వేతనాలు కూడా ఆకర్షణీయంగా ఉంటాయి. నెలకు రూ.18 వేల నుంచి 25 వేల వరకు సంపాదించవచ్చు. ప్రస్తుత ప్రపంచంలో మారిన లైఫ్ స్టైల్ కారణంగా.. ఫిజికల్ ఫిట్‌నెస్ ప్రాధాన్యత పెరగడం.. డాక్టర్లు కూడా ఈ అంశాన్ని ప్రముఖంగా ప్రస్తావిస్తుండడంతో.. భవిష్యత్ అంతా ఫిజికల్ ఎడ్యుకేషన్‌దేనని చెప్పొచ్చు. ఇతర రంగాలకు భిన్నమైంది ఫిజికల్ ఎడ్యుకేషన్. ఎందుకంటే ప్రొఫెషనల్ వర్క్‌లో భాగంగా.. సంబంధిత అంశాల్లో శిక్షణనివ్వడం.. యాక్టివ్‌గా పాల్గొనడం ద్వారా మీ.. ఫిట్‌నెస్‌ను మెరుగుపరుచుకోవడమే కాకుండా.. విద్యార్థులకు లబ్ధి చేకూరుతుంది. మరే ఇతర ప్రొఫెషన్‌లోను ఈ అవకాశం ఉండదు. ఇంగ్లిష్ లాంగ్వేజ్, కమ్యూనికేషన్ స్కిల్స్, టీచింగ్ ఎబిలిటీ ఉంటే ఈ ప్రొఫెషన్‌లో రాణించవచ్చు. అదే విధంగా ఏదో ఒక స్పోర్ట్స్‌లో స్పెషలైజేషన్ ఉంటే కోచ్‌గా కూడా స్థిరపడొచ్చు. నేతాజీ సుభాష్ స్పోర్ట్స్ ఇన్‌స్టిట్యూట్, నాగార్జున యూనివర్సిటీ నిర్వహించే ఆరు వారాల సమ్మర్ క్యాంపులకు హాజరుకావడం కూడా కెరీర్ పరంగా ఉపకరిస్తుంది. ఎంపీఈడీ తర్వాత ఆసక్తిని బట్టి పీహెచ్‌డీ చేసే అవకాశం కూడా ఉంది.

**పి. వెంకట్ రెడ్డి**, ప్రిన్సిపల్,
యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్,
ఉస్మానియా యూనివర్సిటీ.

### నేతాజీ సుభాష్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్:
దేశంలో స్పోర్ట్స్ ఎడ్యుకేషన్‌కు సంబంధించిన ప్రతిష్టాత్మక సంస్థ నేతాజీ సుభాష్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్-పాటియాలా. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) ఆధ్వర్యంలో ఈ సంస్థ పని చేస్తుంది.

### ఆఫర్ చేస్తున్న కోర్సులు:
- ఎంఎస్సీ ఇన్ స్పోర్ట్స్ కోచింగ్
- పోస్ట్‌గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ స్పోర్ట్స్ మెడిసిన్
- డిప్లొమా ఇన్ స్పోర్ట్స్ కోచింగ్
- డిప్లొమా ఇన్ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ మసాజ్
- సర్టిఫికెట్ కోర్స్ ఇన్ స్పోర్ట్స్ కోచింగ్

వివరాలకు: www.nsnis.org/

### జాతీయ స్థాయి ఇన్‌స్టిట్యూట్‌లు:
- **ఇందిరాగాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్సెస్**
  వివరాలకు: http://igipess.du.ac.in/
- **లక్ష్మీబాయ్ నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్-గ్వాలియర్, తిరువనంతపురం క్యాంపస్‌లు**
  వివరాలకు: www.lnipe.gov.in
- **తమిళనాడు ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ-చెన్నై**
  వెబ్‌సైట్: www.tnpesu.org
- **అలగప్ప యూనివర్సిటీ**
  వివరాలకు: www.alagappauniversity.ac.in

## స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్

ఇటీవలి కాలంలో క్రీడా రంగం కూడా అవకాశాల వేదికగా మారుతోంది. ఇందులో తాజాగా చేరిన మరో విభాగం 'స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్'. ముఖ్యంగా ఇటీవల కాలంలో వర్ధమాన క్రీడాకారులు అంతర్జాతీయంగా సంచలనాలు సృష్టిస్తుండడంతో..పాశ్చాత్య దేశాలకే పరిమితమైన 'స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్' మన దేశంలోనూ బహుళ ప్రాచుర్యం సంతరించుకుంటూ ఉపాధి అవకాశాలకు సరికొత్త ట్రాక్‌గా ఆవిర్భవించింది.

### స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్ అంటే:
వివిధ క్రీడలకు సంబంధించిన టోర్నమెంట్లను సక్రమంగా నిర్వహించడమే స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్. ఒక స్పోర్ట్స్ ఈవెంట్‌కు సంబంధించి షెడ్యూల్ రూపకల్పన మొదలు.. పర్యవేక్షణ, పాల్గొనే క్రీడాకారులు, అధికారులు, సంబంధిత వర్గాలకు తగిన సౌకర్యాలు కల్పించడం వరకు అన్నీ స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్‌లో ముఖ్య విధులు. అంతేకాకుండా టోర్నీలకు తగిన ప్రచారం కల్పించడం, మార్కెటింగ్ వ్యవహారాలను పర్యవేక్షించే బాధ్యత కూడా వీరిదే.

### అవకాశాలు:
వివిధ స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్ సంస్థల్లో స్పోర్ట్స్ మేనేజర్‌గా అవకాశాలుంటాయి. ఆయా టోర్నమెంట్ల నిర్వహణ సమయంలో పీఆర్‌ఓగా కూడా వ్యవహరించవచ్చు. అంతేకాకుండా ప్రముఖ క్రీడాకారుల వ్యవహారాలను పర్యవేక్షించే పర్సనల్ మేనేజర్, ఏజెంట్స్, పీఆర్‌ఓలుగా అవకాశాలుంటాయి. టైగర్ స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్ వంటి ప్రైవేట్ సంస్థలతోపాటు ప్రభుత్వ క్రీడా సంస్థల్లో కూడా వీరికి అవకాశాలుంటాయి. ప్రస్తుతం వివిధ క్లబ్‌లు, హోటల్స్, రిసార్టులు, స్పోర్ట్స్ సెంటర్లు కూడా స్పోర్ట్స్ మేనేజర్లను నియమించుకుంటున్నాయి. విదేశాల్లోనూ అనేక అవకాశాలు ఉంటాయి. గ్లోబల్ స్పోర్ట్స్, వరల్డ్ టెల్, ఇంటర్నేషనల్ మేనేజ్‌మెంట్ గ్రూప్ వంటి అంతర్జాతీయ సంస్థలు స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్‌లో డిప్లొమా ఉన్న వారిని రిక్రూట్ చేసుకుంటున్నాయి. ప్రపంచ ప్రఖ్యాత యూనివర్సిటీ ఆఫ్ వేల్స్, యూనివర్సిటీ ఆఫ్ బాత్ (లండన్) వంటి విద్యాసంస్థలు స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్ చేసిన వారికి ఫ్యాకల్టీలుగా అవకాశం కల్పిస్తున్నాయి. దేశంలోని ప్రఖ్యాత మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ఐఐఎం- అహ్మదాబాద్ వచ్చే విద్యా సంవత్సరం నుంచి స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్ కోర్సును ప్రవేశ పెట్టనుంది. దీన్ని బట్టి ఈ కోర్సుకు ఎంత డిమాండ్ ఉందో అర్థం చేసుకోవచ్చు.

### ఆఫర్ చేస్తున్న సంస్థలు-కోర్సులు:
**పీజీ డిప్లొమా ఇన్ స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్**
- అలగప్ప యూనివర్సిటీ -తమిళనాడు (డిస్టెన్స్ విధానంలో)
  వెబ్‌సైట్: www.alagappauniversity.ac.in
- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ వెల్ఫేర్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ - కోల్‌కతా
  వెబ్‌సైట్: www.iiswbm.edu
- లక్ష్మీబాయ్ నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్-గ్వాలియర్.
  వెబ్‌సైట్: www.lnipe.gov.in
- ఎంబీఏ(స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్): తమిళనాడు ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ-చెన్నై
  వెబ్‌సైట్: www.tnpesu.org

సాక్షి Eamcet Mock Counselling
www.sakshieducation.com

Group-I Mains Paper - III

# ప్రణాళిక-ప్రణాళికేతర వ్యయ ధోరణులు...



డా॥ తమ్మా కోటిరెడ్డి
ప్రొఫెసర్, ఐబీఎస్ హైదరాబాద్

### తిరోగమనం, వృద్ధికాలంలో కేంద్ర బ్యాంకు పరపతి విధానాన్ని వివరించండి?

పరపతి నియంత్రణ అనేది కేంద్ర బ్యాంకు ముఖ్య విధి. తిరోగమన కాలంలో ఆర్థిక వృద్ధి మందగించిన కారణంగా ఆర్థిక వ్యవస్థలో నిరాశా వాదం పెరుగుతుంది. పెట్టుబడి, ఉపాధి,ఆదాయాలు తక్కువ స్థాయిలో ఉంటాయి. తిరోగమనం ఎక్కువ కాలం కొనసాగితే దేశంలో మాంద్యం పరిస్థితులు ఏర్పడతాయి. ఈ నేపథ్యంలో కేంద్ర బ్యాంకు తన పరపతి విధానం ద్వారా ఆర్థిక వ్యవస్థ పురోగమనానికి తగిన చర్యలు చేపడుతుంది. దేశంలో ఆర్థిక స్థిరత్వం, ధరల స్థిరత్వం, పూర్ణోద్యోగిత సాధనకు కేంద్ర బ్యాంకు తన ద్రవ్య విధాన సాధనాలైన బ్యాంకు రేటు, నగదు నిల్వల నిష్పత్తి, రెపోరేటు, ఎస్ఎల్ఆర్, బహిరంగ మార్కెట్ చర్యలను వినియోగించుకుంటుంది. తిరోగమన కాలంలో విస్తరణ ద్రవ్య విధానాన్ని అవలంబించడం ద్వారా ఆర్థిక వ్యవస్థలలో ద్రవ్యత్వం పెరుగుదలకు చర్యలు తీసుకుంటుంది. ఉత్పాదక రంగాలపై పెట్టుబడులు పెంచడం ద్వారా ఆర్థిక స్థిరత్వాన్ని తీసుకురావడానికి కేంద్ర బ్యాంకు పరపతి విధానాన్ని ఉపయోగిస్తుంది.

విస్తరణ ద్రవ్య విధానం ఆర్థిక వ్యవస్థలో వృద్ధి రేటు పెరుగుదలకు దోహదపడుతుంది. అధిక వృద్ధి నమోదవుతున్న పరిస్థితుల్లో ద్రవ్యోల్బణ సమస్యలు ఏర్పడతాయి. ద్రవ్యోల్బణం కారణంగా అల్పాదాయ వర్గాల ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. మరోవైపు ఉత్పత్తి, పంపిణీలపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. ద్రవ్యోల్బణాన్ని అదుపు చేసి ధరల స్థిరత్వం, ఆర్థిక స్థిరత్వం సాధనకు కేంద్ర బ్యాంకు తన సాధనాలైన బ్యాంకు రేటు, ఎస్ఎల్ఆర్, నగదు నిల్వల నిష్పత్తి, బహిరంగ మార్కెట్ చర్యలు, రెపో రేట్లను కఠినంగా వినియోగిస్తుంది. తద్వారా దేశంలో ద్రవ్య సప్లయ్ తగ్గించడానికి చర్యలు తీసుకుంటుంది. ద్రవ్య సప్లయ్ తగ్గిన పరిస్థితుల్లో ఆర్థిక వ్యవస్థలో కొనుగోలు శక్తి, వస్తు, సేవలకు డిమాండ్ తగ్గి ద్రవ్యోల్బణం నియంత్రణలోకి వస్తుంది. కేంద్ర బ్యాంకు పరిమాణాత్మక సాధనాలతోపాటు గుణాత్మక సాధనాలను కూడా విరివిగా వినియోగించడం ద్వారా పరపతిని నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

### ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధిలో ఏర్పడుతున్న అవరోధాలను వివరించండి?

పారిశ్రామిక రంగ అభివృద్ధిలో వనరుల లభ్యతకు తగినట్లుగా ప్రగతి జరగలేదు. అయినా పారిశ్రామిక విత్త సంస్థల ఏర్పాటు, సంబంధిత విధానాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధి కోసం కృషి చేసింది. 1992 వరకు కూడా రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక రంగానికి సంబంధించి ఒక సమగ్ర విధానాన్ని రూపొందించలేదు. ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక ప్రగతికి మూలాధారం తొలుత ఇక్కడ స్థాపించిన ప్రభుత్వ రంగ సంస్థలే. సంస్కరణల ముందు కాలంతో పోల్చితే సంస్కరణల తర్వాత కాలంలో పారిశ్రామికాభివృద్ధి మందగించింది. సంస్కరణల అమలు కాలంలో రాష్ట్ర ప్రభుత్వం టార్గెట్ 2005 పేరుతో నూతన పారిశ్రామిక విధానాన్ని రూపొందించింది. సహకార చట్టంలో భారీ మార్పులను ఈ విధానంలో ప్రవేశ పెట్టారు. పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సాహక విధానం 2005-10 నాణ్యతతోకూడిన మౌలిక సౌకర్యాలను పరిశ్రమలకు కల్పించాలి. తద్వారా ప్రపంచ నాణ్యత ప్రమాణాలకు ఆంధ్రప్రదేశ్‌ను వేదికగా మార్చాలనే ఉద్దేశంతో ఈ విధానాన్ని రూపొందించారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా, భారీ పరిశ్రమల కోసం 'పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సాహక విధానం 2010-15'ను ప్రభుత్వం ప్రకటించింది.

సంస్కరణల కాలంలో అమలు చేసిన పారిశ్రామిక సంస్కరణల వల్ల తీవ్రమైన పోటీ పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో చిన్నతరహా పరిశ్రమలు ఆ పోటీని తట్టుకోలేక రుగ్మతకు గురయ్యాయి. పారిశ్రామిక సంస్కరణలు ఆ రంగంపై విస్తరణ ప్రభావాలను చూపలేదు. దాంతో రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తిలో తగ్గిన వ్యవసాయ రంగం వాటాను పారిశ్రామిక రంగం భర్తీ చేయలేకపోయింది. పారిశ్రామిక సంస్థలు దీర్ఘకాలిక వ్యవస్థాపరమైన సమస్యలను ఎదుర్కొలేక పోవడంతో పారిశ్రామిక వృద్ధి ఆశించినంతగా జరగలేదు. ప్రైవేటీకరణ ప్రక్రియను.. పరిశ్రమల మధ్య పోటీతత్వాన్ని పెంపొందించడానికి సాంకేతికాభివృద్ధిని సాధించడానికి ఉద్దేశించినప్పటికీ..రాష్ట్రంలోని పరిశ్రమలు సంస్కరణల ధాటికి నిలదొక్కులేకపోయాయి. రాష్ట్రంలోని భారీ పరిశ్రమలు ఎక్కువగా ప్రభుత్వ రంగంలోనే ఉండడం.. ప్రభుత్వ రంగ సంస్థల సంస్కరణలు, ఉపసంహరణ విధానాల కారణంగా రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధిలో ఒడిదుడుకులు ఏర్పడ్డాయి. దీనికితోడు మౌలిక సౌకర్యాలు కొరత కారణంగా ప్రైవేట్, విదేశీ పెట్టుబడులను పారిశ్రామిక రంగం ఆకర్షించలేకపోతుంది. ఉత్పాదక శక్తిని అల్పంగా వినియోగించుకోవడం, యాజమాన్య నిర్వహణలో అవకతవకలు, రాజకీయ జోక్యం, లోపభూయిష్టమైన యంత్రాంగం వల్ల కూడా ప్రభుత్వ రంగ సంస్థలు సమర్థంగా పని చేయలేకపోతున్నాయి.

తయారీ రంగంలో వృద్ధి క్షీణించడంతో పారిశ్రామిక రంగ వృద్ధిలో ఒడిదుడుకులు ఏర్పడుతున్నాయి. పెరుగుతున్న పారిశ్రామిక రుగ్మత పెట్టుబడుల పెరుగుదలకు అవరోధంగా మారింది. రాష్ట్రంలో నమోదైన చిన్నతరహా పరిశ్రమలు రుగ్మతకు గురై అనేక సంస్థాపూర్వక సమస్యలు ఎదుర్కొంటున్నాయి. పారిశ్రామిక రంగం విస్తరణలో ప్రాంతీయ అసమానతలు కూడా సమగ్ర పారిశ్రామికాభివృద్ధికి అడ్డంకిగా మారాయి.

### రాష్ట్ర ప్రభుత్వ మూలధన వ్యయంలోని వివిధ అంశాలను పేర్కొని, ప్రణాళిక-ప్రణాళికేతర వ్యయ ధోరణులను వివరించండి?

ఆర్థికాభివృద్ధి నేపథ్యంలో ఉత్పాదక సంపద, ఆస్తులను సృష్టించడానికి ప్రభుత్వం చేసే వ్యయాన్ని మూలధన వ్యయం అంటారు. దీర్ఘకాల భారీ ప్రాజెక్టులు, పరిశ్రమల ఏర్పాటుపై ఈ వ్యయం చేయడం వల్ల ఆర్థికాభివృద్ధి రేటు వేగం పుంజుకుంటుంది. మూలధన వ్యయాన్ని సాధారణ సేవలు, సాంఘిక సేవలు, ఆర్థిక సేవలపై వినియోగిస్తారు.

సాధారణ సేవలపై వ్యయం 6 శాతం వరకు ఉంటుంది. గత దశాబ్దన్నర కాలంలో సాంఘిక సేవలపై వ్యయం సుమారు 14 శాతానికి చేరుకుంది. ఆర్థిక సేవలైన విద్యుచ్ఛక్తి ప్రాజెక్టుల నిర్మాణం, నీటిపారుదల, గ్రామీణాభివృద్ధిపై మూలధన వ్యయం క్రమంగా పెరుగుతుంది. మొత్తం మూలధన వ్యయంలో ఆర్థిక సేవలపై చేసే వ్యయం సుమారు 80 శాతం వరకు ఉంటుంది. 2012-13 బడ్జెట్‌లో మూలధన వ్యయంలో భాగంగా నీటిపారుదల, వరదల నివారణకు ప్రాధాన్యమిస్తూ రూ.13935 కోట్లు, తర్వాత రవాణ రంగానికి రూ.2791 కోట్లు కేటాయించారు. 1995-96లో మొత్తం మూలధన వ్యయం రూ.2422 కోట్ల నుంచి 2012-13 బడ్జెట్‌లో రూ.19972.80 కోట్లకు పెరిగింది.

1987-88 తర్వాత బడ్జెట్ విశ్లేషణలో ప్రభుత్వ వ్యయాన్ని ప్రణాళిక వ్యయం, ప్రణాళికేతర వ్యయంగా వర్గీకరించారు. గత దశాబ్దన్నర కాలంగా ప్రణాళికా వ్యయంలో పెట్టుబడి వ్యయం కంటే రెవెన్యూ వ్యయం ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తుంది. ప్రాజెక్ట్, పరిశ్రమల పెట్టుబడి కంటే వాటి నిర్వహణపైనే ప్రభుత్వం ఎక్కువగా వ్యయం చేస్తుంది. ప్రణాళికా వ్యయాన్ని రెవెన్యూ ఖాతాలోనూ, మూలధన ఖాతాలోనూ చూపిస్తారు. 1998-99లో మొత్తం వ్యయంలో ప్రణాళికా వ్యయం రూ.6747 కోట్లు (25.33 శాతం) కాగా 2012-13 బడ్జెట్‌లో ఇది రూ.54030 కోట్లకు (37.04 శాతం) చేరుకుంది. మరోవైపు మొత్తం వ్యయంలో ప్రణాళికేతర వ్యయం మూడొంతులుగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వ రుణాలపై వడ్డీ చెల్లింపులు పెరగడంతో ప్రణాళికేతర వ్యయం, రెవెన్యూ పద్దు చెల్లింపులు పెరుగుతూ ఉన్నాయి.

ప్రణాళికేతర వ్యయాన్ని కూడా రెవెన్యూ ఖాతా, మూలధన ఖాతా రెండింటిలోను చూపిస్తారు. 1998-99లో ప్రణాళికేతర వ్యయం రూ.19887 కోట్లు (74.66 శాతం). 2012-13 బడ్జెట్‌లో ఇది రూ.91824 కోట్లకు (62.9 శాతం)చేరుకుంది. రాష్ట్ర ప్రభుత్వం మొత్తం వ్యయంలో ప్రణాళికా వ్యయం, పైన పేర్కొన్న కాలంలో 25 నుంచి 37 శాతానికి పెరిగింది. కాగా ప్రణాళికేతర వ్యయం 74 నుంచి 62 శాతానికి తగ్గింది.

## మాదిరి ప్రశ్నాపత్రం

1. భారతదేశంలో ఆదాయ అసమానతలకు గల కారణాలను పేర్కొని పెరుగుతున్న జాతీయాదాయం సామాజిక శ్రేయస్సుకు దారితీసిందా లేదా అనే అంశాన్ని పరిశీలించండి?
   లేదా
   జాతీయాదాయంలోని వివిధ భావనలను తెలిపి జాతీయాదాయ లెక్కింపు ప్రాధాన్యతను వివరించండి?
2. 11వ ప్రణాళికలో వనరుల కేటాయింపు విధానాన్ని తెలిపి ఈ ప్రణాళిక విజయాలను విమర్శనాత్మకంగా పరిశీలించండి?
   లేదా
   సంస్కరణల కాలంలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల పాత్రల్లోని మార్పులను వివరించండి?
3. ప్రపంచీకరణ ప్రభావం పేదరిక నిర్మూలనకు ఎంత వరకు దోహదపడిందో వివరించండి?
   లేదా
   ఆర్థికాభివృద్ధిపై నిరుద్యోగం ప్రభావాన్ని వివరించండి?
4. తిరోగమనం, అధిక వృద్ధి కాలాలలో కేంద్ర బ్యాంకు పరపతి విధానం, ప్రాధాన్యం తెలపండి?
   లేదా
   సంస్కరణల కాలంలో బ్యాంకింగేతర ఆర్థిక సంస్థల పురోగతిని వివరించండి?
5. ప్రభుత్వ వ్యయ ధోరణులను వివరించండి?
   లేదా
   భారతదేశ ప్రభుత్వ రుణ మార్గాలను తెలిపి అధిక రుణ ప్రభావం ఆర్థికవ్యవస్థపై ఏ విధంగా ఉంటుందో వివరించండి?
6. ఆంధ్ర-తెలంగాణా ప్రాంతాల్లో స్వాతంత్ర్యానికి ముందు కౌలుదారీ విధానాలను వివరించండి?
   లేదా
   భూ సంస్కరణలకు సంబంధించిన శాసనాలను తెలిపి, అవి ఆచరణలో ఎంత వరకు విజయం సాధించాయో వివరించండి?
7. వ్యవసాయ రంగంలో సాంకేతిక విజ్ఞానం ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ పేదరిక నిర్మూలనకు ఎంత వరకు దోహదపడిందో వివరించండి?
   లేదా
   ఆంధ్రప్రదేశ్ అవతరణ తర్వాత సంభవించిన నిర్మాణాత్మక మార్పులను వివరించండి?
8. ఆదాయం, ఉపాధి పరంగా ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల్లో వివిధ రంగాల్లోని మార్పులను పరిశీలించండి?
   లేదా
   ఆంధ్రప్రదేశ్‌లో వివిధ దశాబ్దాలలో జనాభా తీరుతెన్నులను పరిశీలించి ఇటీవలి కాలంలో జనాభా వృద్ధి రేటు తగ్గుదలకు ఏ కారకాలు దోహదపడ్డాయో వివరించండి?
9. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మూలధన వ్యయంలోని వివిధ అంశాలను తెలిపి ప్రణాళిక, ప్రణాళికేతర వ్యయ ధోరణులను వివరించండి?
   లేదా
   ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పన్నుల స్వరూపాన్ని వివరించండి?
10. ప్రణాళిక అమల్లో భాగంగా ప్రభుత్వ రంగ పెట్టుబడి ఆధారాలు, వాటి ధోరణులను తెలపండి?
    లేదా
    లక్ష్యాల సాధనలో ప్రణాళికలు విజయం సాధించాయని మీరు భావిస్తున్నారా-వ్యాఖ్యానించండి?
11. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిలో ఏర్పడుతున్న అవరోధాలను వివరించండి?
    లేదా
    రాష్ట్రంలో ఫ్యాక్టరీ రంగ ప్రగతిని వివరించి వాటి అభివృద్ధికి చర్యలు సూచించండి?
12. రాష్ట్రంలో పంటల తీరు స్వరూపాన్ని వివరించి పంటల తీరు మెరుగుదలకు చర్యలు సూచించండి?
    లేదా
    1) వ్యవసాయ వ్యయాలు, ధరల కమిషన్ విధులు?
    2) మద్దతు ధరల ధోరణులు?
13. రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో ఆదాయ అసమానతలకు గల కారణాలను వివరించండి?
    లేదా
    ప్రాంతీయ సమతౌల్య అభివృద్ధిలో భాగంగా సామాజిక రంగ అభివృద్ధికి ప్రభుత్వం తీసుకున్న చర్యలు వివరించండి?
14. గ్రామీణ రుణగ్రస్తత, సంస్థాపరమైన పరపతి ఆధారాల మధ్య సంబంధాన్ని పరిశీలించండి?
    లేదా
    సహకార సంస్థలు ఎదుర్కొంటున్న సవాళ్లను తెలిపి వాటి అభివృద్ధికి చర్యలు సూచించండి?
15. రాష్ట్రంలో రవాణా రంగం ఎదుర్కొంటున్న సమస్యలను వివరించండి?
    లేదా
    1) ఐటీ ప్రోత్సాహక విధానం?
    2) బ్యాంకింగ్-సమాచార రంగ ప్రగతి?

# నిత్యం కరువు సంభవించే ప్రాంతాలు..



సి. హరికృష్ణ
సివిల్స్ ఫ్యాకల్టీ, హైదరాబాద్

**కరువు అంటే ఏంటి? భారత్‌లోని కరువు పీడిత ప్రాంతాలు ఏవి? కరువు నివారణకు భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమాల గురించి వివరించండి?**

జ: దీర్ఘకాలంపాటు ఒక ప్రాంతంలో వర్షపాతం లేక తీవ్ర నీటి కొరత పరిస్థితులు ఏర్పడటమే కరువు. వాతావరణ విభాగం ప్రకారం సాధారణ వర్షపాతంలో 75 శాతం తక్కువ వర్షం సంభవించిన ప్రాంతం కరువు పీడిత ప్రాంతం. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ ప్రకారం వ్యవసాయానికి, మానవులకు, ఇతర జీవులకు, పారిశ్రామిక, సామాన్య అవసరాలకు నీటి లభ్యత లేకపోవడం కరువు. ఏడాదికి సగటున 75 సెంటీ మీటర్లకంటే తక్కువ వర్షపాతం గల ప్రాంతాలను కరువు పీడిత ప్రాంతాలుగా గుర్తిస్తారు.

**కరువు ప్రధానంగా మూడు రకాలు. అవి..**

**వాతావరణ (మెటీయరలాజికల్) కరువు:** ఒక ప్రాంతంలోని సగటు అవపాతం కంటే తక్కువ వర్షపాతం నమోదైన పరిస్థితే వాతావరణ కరువు. సగటు వర్షపాతానికి 20 నుంచి 59 శాతం తక్కువైనప్పుడు కరువు, 60 శాతం కంటే తక్కువ సంభవించినప్పుడు తీవ్ర కరువు సంభవిస్తాయి.

**జల సంబంధ (హైడ్రలాజికల్) కరువు:** ఉపరితల నీరు బాగా తగ్గి, వాగులు, సరస్సులు, రిజర్వాయర్‌లు ఎండిపోయిన పరిస్థితిలో జలసంబంధ కరువు సంభవిస్తుంది.

**వ్యవసాయ (అగ్రికల్చరల్) కరువు:** పంట అభివృద్ధి సమయంలో నేలలో తేమ తగ్గి, వాతావరణ ఉష్ణోగ్రత పెరిగి, దిగుబడి క్షీణించడం కారణంగా ఏర్పడే కరువు.

దేశంలో 2/3వ వంతు ఉపరితల ప్రాంతంలో వంద సెంటీ మీటర్లకంటే తక్కువ వర్షపాతం నమోదవుతోంది. 141 మిలియన్ హెక్టార్ల వ్యవసాయ భూమిలో 68 శాతం ప్రాంతం కరువుకు గురయ్యే ప్రమాదం ఉన్నట్లు తేలింది. ఇందులో 50 శాతం ప్రాంతం నిరంతర కరువు పీడిత ప్రాంతంగా గుర్తించారు. దేశంలో నిత్యం కరువు సంభవించే ప్రాంతాలు..

- పశ్చిమ కనుమల నుంచి తూర్పునకు 80 కిలో మీటర్ల దూరంలో గల కృష్ణానది తీర ప్రాంతాలు.
- అహ్మదాబాద్, జలంధర్, కాన్పూర్ పరిసర ప్రాంతాల్లోని ఇసుక నేలలు, ఎడారి ప్రాంతాలు.
- తమిళనాడులోని కోయంబత్తూరు, తిరునల్వేలి ప్రాంతాలు.
- ఒడిశాలోని కలహండి ప్రాంతం.
- పశ్చిమబెంగాల్‌లోని పురూలియా, మీర్జాపూర్ పీఠభూములు.
- ఆంధ్రప్రదేశ్‌లోని తెలంగాణ, రాయలసీమ ప్రాంతాలు.
- గుజరాత్‌లోని కచ్, సౌరాష్ట్ర ప్రాంతాలు.
- రాజస్థాన్‌లోని థార్ ఎడారి ప్రాంతం.

కరువు పీడిత ప్రాంతాల సమస్యలను అధిగమించడానికి, కరువు పరిస్థితుల నివారణకు Drought Prone Areas Programme (DPAP) ను కేంద్ర ప్రభుత్వం 1973-74లో ప్రారంభించింది. ఎడారి ప్రాంత అభివృద్ధికి ఏడు రాష్ట్రాల్లోని 36 జిల్లాల్లో 1977-78లో డైరెక్ట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (డీడీపీ)ను ప్రభుత్వం ప్రారంభించింది. కరువు పీడిత ప్రాంతాల్లో బీడు భూముల అభివృద్ధి కోసం 1989-90లో ప్రత్యేక ఇంటిగ్రేటెడ్ వేస్ట్‌ల్యాండ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఐడబ్ల్యూడీపీ)ని కేంద్రం ప్రారంభించింది. డీపీఏపీ, డీడీపీలు అమలు కాని ప్రాంతాల్లో ఐడబ్ల్యూడీపీని అమలు చేశారు. ఏప్రిల్ 1, 1995 నుంచి మూడు కార్యక్రమాలు వాటర్‌షెడ్ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా అమలవుతున్నాయి. 2008లో ప్రణాళిక సంఘం విడుదల చేసిన సరికొత్త మార్గదర్శకాల ఆధారంగా ఫిబ్రవరి 26, 2009న ఇంటిగ్రేటెడ్ వాటర్‌షెడ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రాంకు రూపకల్పన జరిగింది. పై మూడు పథకాలు ప్రస్తుతం ఈ ప్రోగ్రాం పరిధిలోనే అమలవుతున్నాయి.

**వాటర్‌షెడ్ అంటే ఏంటి? వాటర్‌షెడ్ సాధారణ అభివృద్ధి ప్రక్రియను వివరించండి? సుస్థిర అభివృద్ధికి వాటర్‌షెడ్ ఏ విధంగా సరైన దృక్పథమో తెలియజేయండి?**

జ: ఒక నది లేదా వాగుకు సంబంధించిన క్యాచ్‌మెంట్ ప్రాంతం వాటర్‌షెడ్. ఇది జీవ హైడ్రలాజికల్ ప్రమాణం. ఒక నది లేదా వాగులోకి వచ్చి చేరే నీటి ప్రవాహ ప్రాంతం. ఒక వాటర్‌షెడ్ ప్రాంతంలోని నీరు, నేల, వృక్షజాలం, జంతువులు వంటి సహజ వనరుల పరిరక్షణ, పునరుద్ధరణ యుక్తతను వినియోగించడాన్ని వాటర్‌షెడ్ అభివృద్ధి పథకం అంటారు. పర్యావరణం, సహజ వనరుల మధ్య, మానవులు, ఇతర జీవుల మధ్య సమతుల్యతను అభివృద్ధి చేయడంలో వాటర్‌షెడ్ నిర్వహణ కీలక పాత్ర పోషిస్తుంది. జిల్లా గ్రామీణాభివృద్ధి ఏజెన్సీల అనుమతితో ప్రాజెక్ట్ ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీ (పీఐఏ)ల ఆధ్వర్యంలో మూడు దశల్లో వాటర్‌షెడ్ కొనసాగుతుంది.

**ప్రారంభదశ:** నేల సహజ గుణం, నేల ఉపయోగం, ప్రాంత సామాజిక-ఆర్థిక స్థితిగతులు, ప్రజల మనోభావాలు, పరిరక్షణ సమస్యలను అధ్యయనం చేసి వాటర్‌షెడ్ ప్రాంతాన్ని ఎంపిక చేయాలి. ఈ దశలో వాటర్‌షెడ్ అభివృద్ధి చేయదలచిన ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తారు. గ్రామస్థాయిలో వాటర్‌షెడ్ కమిటీలను, స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేస్తారు. వివిధ సర్వేల ద్వారా సేకరించిన సమాచారం ఆధారంగా అభివృద్ధి ప్రణాళికను పీఐఏలలోని వాటర్‌షెడ్ డెవలప్‌మెంట్ టీం నిర్వహిస్తుంది.

**అభివృద్ధి దశ:** ఇది ముఖ్యమైన దశ. ట్రీట్‌మెంట్ దశ అని కూడా అంటారు. క్యాచ్‌మెంట్ ప్రాంతంలో అభివృద్ధి పనులు నిర్వహిస్తారు. రుతుపవనాలకు ముందు చెరువులు, వాగులు, బావుల్లో పూడికతీత నిర్వహించాలి. నీటి నిల్వకు చెక్ డ్యాంలను, ఇంకుడు బావులను, చెరువులను, కొలనులను నిర్మిస్తారు. భూగర్భ జల వనరుల లభ్యత ఆధారంగా బోరు బావులను కూడా ఏర్పాటు చేస్తారు. పశుగ్రాసం, వంట చెరకు, కలప, హార్టికల్చర్ అభివృద్ధి కోసం నర్సరీలను ఏర్పాటు చేస్తారు. పశువుల మేతకు అవసరమైన మైదాన ప్రాంతాన్ని కూడా అభివృద్ధి చేస్తారు. స్వయం సహాయక బృందాల నిర్వహణలో సెరీకల్చర్, ఎపికల్చర్, కోళ్ల పెంపకం, పశు సంపద నిర్వహణ కోసం ప్రత్యేక వెటర్నరీ విభాగాలను అభివృద్ధి చేస్తారు. నీటి లభ్యత ఆధారంగా కొలనుల్లో, చెరువుల్లో చేపల పెంపకం కార్యక్రమాన్ని చేపడతారు. ఈ రకమైన వాటర్‌షెడ్ విధానం జీవ ఇంధనాలు, వాయు శక్తి, సౌర శక్తి వంటి పునర్వినియోగ వనరుల అభివృద్ధికి అనుకూలం.

**ముగింపు దశ:** మూడు, నాలుగేళ్లపాటు సాగే వాటర్‌షెడ్ అభివృద్ధి ద్వారా ఆ ప్రాంతంలో మెరుగైన సామాజిక-ఆర్థిక స్థితిగతులను అంచనా వేస్తారు. ఇది ఒకట్రెండు సంవత్సరాలపాటు కొనసాగుతుంది. ఆ తర్వాత గ్రామస్థాయి వాటర్‌షెడ్ కమిటీలు, స్వయం సహాయక బృందాల నిర్వహణలో సుస్థిర అభివృద్ధి వినియోగం కొనసాగుతుంది.

వాటర్‌షెడ్ విధానం ద్వారా ఒక ప్రాంతంలోని పర్యావరణ పరిస్థితులు మెరుగవుతాయి. ప్రజల జీవనశైలిలో ప్రగతిశీల మార్పులు తీసుకొచ్చే ఏ ప్రభుత్వ కార్యక్రమమైనా కేవలం ఆర్థిక ప్రయోజనాలు అందించకుండా పర్యావరణాన్ని పెంపొందించాలి. వాటర్‌షెడ్ దృక్పథం ఇదే సూత్రంపై ఆధారపడి ఉంటుంది. వాటర్‌షెడ్ ద్వారా భూగర్భ జలవనరులు అభివృద్ధి చెందుతాయి. వంట చెరకు, పశుగ్రాసం లభ్యత పెరుగుతుంది. నేల క్రమక్షయాన్ని అరికట్టవచ్చు. అదనంగా వరద నియంత్రణ, వన్య జీవుల జీవ వైవిధ్య సంరక్షణ, పాడి పరిశ్రమ అభివృద్ధి, గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక ప్రగతి, పర్యావరణ సమతుల్యత, తాగునీటి లభ్యత, దారిద్ర్య నిర్మూలన వంటివి సాధ్యమవుతాయి.

**భారత్‌పై శీతోష్ణస్థితి మార్పు ప్రభావాలు ఏంటి? శీతోష్ణస్థితి సవాళ్లను ఎదుర్కోవడానికి భారత్ తీసుకున్న చర్యలు ఏంటి?**

జ: శీతోష్ణస్థితి మార్పు ద్వారా తీవ్రస్థాయి ప్రభావాలకు గురవుతున్న దేశాల్లో ముఖ్యమైంది భారత్. దేశ పర్యావరణ, సామాజిక-ఆర్థిక స్థితిగతులపై ప్రభావం ఉంటుందని 2010లో Indian Netwo-rk for Climate Change Assesment (INCAA) నివేదిక పేర్కొంది. వ్యవసాయ రంగం ప్రధానంగా వర్షాధార వ్యవసాయంపై తీవ్ర ప్రభావం ఉంటుందని 2007లో Intergovernmental Panel on Climate Change (IPCC) స్పష్టం చేసింది. రుతుపవనాలు ఆలస్యం కావడం, రెండు వర్షాల మధ్య అంతరం పెరగడం, పంటకాలంలో విపరీత ఉష్ణోగ్రతలు వంటి ప్రభావాలు ఇప్పటికే స్పష్టంగా కనిపిస్తున్నాయి. రబీ ఉష్ణోగ్రతలు పెరగడం ద్వారా గోధుమ దిగుబడిపై ప్రభావం పడింది. పొడవైన తీర రేఖ ఉండటంతో సముద్ర మట్టం పెరిగినప్పుడు, గుజరాత్, అండమాన్ అండ్ నికోబార్, గోవా తీరం ముంపునకు గురయ్యే ప్రమాదముంది. ఇప్పటికే తీర ప్రాంతాల్లో లవణీయత పెరిగింది. శీతోష్ణస్థితి మార్పు ద్వారా తుఫాన్ తీవ్రత పెరగనుంది. వీటికి తోడు తాగునీటి కొరత, మలేరియా-ఫైలేరియా వంటి వ్యాధుల అధిక వ్యాప్తి ఇతర ప్రభావాలుగా ఉంటున్నాయి. ఒక డిగ్రీ ఉష్ణోగ్రత పెరిగితే గోధుమ ఉత్పత్తిలో ఆరు మిలియన్ టన్నుల ఉత్పత్తి తగ్గుతుందని అధ్యయనాల్లో తేలింది.

అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చితే.. గ్రీన్‌హౌస్ ఉద్గారాల విడుదల సగటులో భారత్ చివరి స్థానం(122)లో ఉంది. 2008 నాటికి కార్బన్ డై ఆక్సైడ్ ఉద్గారాల సగటు 1.52 టన్నులు. అమెరికా ఉద్గారాల సగటు 19 టన్నులు. 2030-31 నాటికి దేశ ఉద్గారాల సగటు 2.77 నుంచి 5 టన్నుల వరకు ఉండొచ్చని అంచనా. శీతోష్ణస్థితి మార్పు ప్రభావాలను సమర్థంగా ఎదుర్కోవడంతోపాటు ఆహార, శక్తి రంగాల్లో భద్రత సాధించే లక్ష్యంతో 2008లో భారత ప్రభుత్వం National Action Plan on Climate Change (NAPCC) ప్రణాళికను విడుదల చేసింది.

ఇందులో భాగంగానే జాతీయ స్థాయిలో ఎనిమిది మిషన్‌లను ఏర్పాటు చేసింది. శక్తి భద్రతను పెంచడానికి జాతీయ సౌర మిషన్, నేషనల్ మిషన్ ఆన్ ఎన్‌హాన్స్‌డ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ వంటి కార్యక్రమాలను రూపొందించింది. వ్యవసాయానికి, తాగునీరు, ఆవాసాలు, హిమాలయాల ఆవరణల వ్యవస్థల భద్రతకు ఉద్దేశించి మరో ఆరు మిషన్లకు రూపకల్పన చేసింది. 2020 నాటికి.. 2005 వరకు ఉన్న ఉద్గారాలను 20 నుంచి 25 శాతానికి స్వచ్ఛందంగా తగ్గించనున్నట్లు కూడా భారత్ 2009లోనే ప్రకటించింది. జాతీయ స్థాయిలోనే కాకుండా, రాష్ట్ర స్థాయిలో కూడా కొన్ని ప్రణాళికలు అమల్లో ఉన్నాయి. 2011లో డర్బన్ సదస్సులో భారత్ కీలక పాత్ర వహించి 'డర్బన్ ప్లాట్‌ఫాం'ను ఖరారు చేయడంలో తోడ్పడింది. దీని ప్రకారం 2015 నాటికి అందరికీ ఆమోదయోగ్యంగా ఉండే ఒప్పందం ఏర్పరచుకుని 2020 నాటికి అమల్లోకి వస్తుంది.

## పేపర్-4 (సైన్స్ & టెక్నాలజీ) మోడల్ పేపర్

### సెక్షన్-1

1. ఎ) దేశ సైన్స్ విధానంలోని మానవ వనరుల అభివృది వ్యూహాన్ని చర్చించండి? (లేదా)
   బి) I. జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ అంటే?
   II. జాతీయ ఆహార భద్రత మిషన్ అంటే?
2. ఎ) భారత అంతరిక్ష రంగంలో పీఎస్ఎల్‌వీ ప్రాధాన్యతను వివరించండి? (లేదా)
   బి) I. మేఘ- ట్రాపిక్స్ ఏంటి?
   II. రీశాట్-1 అంటే ఏంటి?
3. ఎ) గ్రామీణాభివృద్ధిలో ఐటీ పాత్ర చర్చించండి?/
   బి) I. కమ్యూనికేషన్లలో కంప్యూటర్ల పాత్ర?
   II. బ్రాడ్‌క్యాస్టింగ్‌లో కంప్యూటర్ల పాత్ర?
4. ఎ) భారత్‌లో అణుశక్తి వినియోగం గురించి రాయండి? (లేదా)
   బి) I. శక్తి భద్రతలో పునర్వినియోగ శక్తి వనరుల పాత్ర?
   II. పునర్వినియోగ శక్తి వనరుల ఉత్పాదన?
5. ఎ) I. సునామీ అంటే ఏంటి? కారణాలు ఏంటి?
   II. దేశంలో సునామీ నిర్వహణ గురించి రాయండి? (లేదా)
   బి) భారత్‌లో వర్తమాన శాస్త్ర సాంకేతిక అభివృద్ధి గురించి రాయండి?

### సెక్షన్-2

6. ఎ) I. జీవ సాంకేతిక విజ్ఞానం ఉపయోగాలు?
   II.దేశంలో జీవ సాంకేతిక విజ్ఞానం అభివృద్ధి?/
   బి) I. రీకాంబినెంట్ టీకా అంటే ఏంటి?
   II. రీకాంబినెంట్ టీకా ఉత్పత్తి విధానాన్ని వివరించండి?
7. ఎ) I. వన్య జీవులు ఎదుర్కొంటున్న ప్రమాదాలు ఏంటి? వాటి సంరక్షణకు తీసుకుంటున్న చర్యలు ఏంటి? (లేదా)
   బి) I. వ్యవసాయ ఆవిర్భావ నిదర్శనాలు ఏంటి?
   II. వ్యవసాయ ఆవిర్భావ కేంద్రాలు ఏంటి?
8. ఎ) మూలకాల పరిశోధన వల్ల ప్రయోజనాలు? దేశంలో ఈ పరిశోధన గురించి రాయండి?
   బి) ఇంధన భద్రతలో జీవ ఇంధనాల పాత్రను చర్చించండి?
9. ఎ) చికున్‌గున్యా వ్యాధి కారకం, ఇన్ఫెక్షన్ విధానాలు, లక్షణాలు,నివారణ చర్యల గురించి రాయండి? (లేదా)
   బి) దేశంలో బర్డ్‌ఫ్లూ వ్యాప్తి గురించి రాయండి? బర్డ్‌ఫ్లూ వ్యాపిస్తే తీసుకోవాల్సిన చర్యలు?
10. ఎ) I. ఆధునిక టీకా అంటే ఏంటి?
    II. హెపటైటిస్ టీకా ఉత్పత్తి విధానాన్ని వివరించండి? (లేదా)
    బి) నిర్ధారణ (డయాగ్నసిస్)లో ఇమ్యునలాజికల్ పద్ధతుల గురించి రాయండి?

### సెక్షన్-3

11. ఎ) పర్యావరణవాదం అంటే ఏంటి? సమకాలీన పర్యావరణ వాదం గురించి రాయండి? (లేదా)
    బి) పర్యావరణ విభాగాలు, వాటి లక్షణాలు?
12. ఎ) I.'డ్యాం'ల రకాలు ఉదాహరణలతో రాయండి?
    II. 'డ్యాం'ల ద్వారా కలిగే ప్రయోజనాలు, సంభవించే నష్టాలు గురించి రాయండి? (లేదా)
    బి) I. దేశంలో కరువు పీడిత ప్రాంతాలు ఏంటి?
    II.కరువు నిర్వహణకు ప్రభుత్వ కార్యక్రమాలు?
13. ఎ) I. ఆహార శృంఖలం అంటే ఏంటి?
    II. ఉదాహరణలతో ఆహార శృంఖలాల రకాలు తెలియజేయండి?
    III. ఆవరణ వ్యవస్థలో ఆహార శృంఖలాల ప్రాధాన్యత ఏంటి? (లేదా)
    బి) I. జీవ వైవిధ్య హాట్‌స్పాట్ భావన ఎలా అభివృద్ధి చెందిందో వివరించండి?
    II. భారత్‌లో గుర్తించిన జీవ వైవిధ్య హాట్‌స్పాట్‌ల గురించి రాయండి?
14. ఎ) శబ్ద కాలుష్య కారకాలు, ప్రభావాలు, నివారణ చర్యల గురించి రాయండి? (లేదా)
    బి) I. ఘన వ్యర్థ పదార్థాల విడుదలకు కారణాలు, వాటి ప్రభావాలు ఏంటి?
    II. ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ, రీసైక్లింగ్ పాత్రను చర్చించండి?
15. ఎ) I. వాటర్‌షెడ్ అభివృద్ధిని వివరించండి?
    II. సుస్థిర అభివృద్ధికి వాటర్‌షెడ్ ఏవిధంగా సరైన దృక్పథమో వివరించండి? (లేదా)
    బి) మానవ ఆరోగ్య నిర్వహణలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ద్వారా చేకూరే ప్రయోజనాలు ఏంటి?

భవిత
Now Bhavita Also on Sakshi TV
Every Sunday9-30am to 10am

Civils Mains Public Administration Paper-II

# సిద్ధాంతాలు, సమకాలీన అంశాల సమన్వయంతో..



డా॥బి.జె.బి.కృపాదానం
సీనియర్ సివిల్స్ ఫ్యాకల్టీ
ఆర్.సి. రెడ్డి స్టడీ సర్కిల్

**సివిల్ సర్వీసెస్ మెయిన్స్ ఎగ్జామినేషన్‌కు ఆప్షనల్‌గా పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌ను ఎంచుకున్న అభ్యర్థులు కాస్త సులభంగా భావించేది పేపర్-2. కారణం.. ఇది పూర్తిగా భారత పరిపాలనకు సంబంధించింది కావడమే. అంతేకాకుండా సమకాలీన అంశాల ప్రస్తావన కూడా ఎక్కువగా ఉండటమే. ఇలా సులభంగా భావిస్తూనే.. అభ్యర్థులు పొరపాట్లు చేసే ప్రమాదం ఉంది. కాబట్టి సులువుగా ఉండే విభాగంలో పొరపాట్లు లేకుండా పకడ్బందీగా ప్రిపరేషన్ సాగించడానికి.. మరిన్ని మార్కుల సాధనకు సూచనలు..**

పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ ఆప్షనల్ పేపర్-2లో అడిగే ప్రశ్నలు అధిక శాతం ప్రస్తుతం సమకాలీనంగా సాగుతున్న పాలన ఆధారంగానే ఉంటాయి. అంతేకాకుండా మరోవైపు భారత రాజనీతి శాస్త్రంతో ముడిపడి ఉంటాయి.

ఉదాహరణకు: రాష్ట్రపతి, మంత్రిమండలి, కేంద్ర సచివాలయం, గవర్నర్, రాష్ట్ర మంత్రి మండలి, సచివాలయం; సుప్రీంకోర్టు, హైకోర్టులు, పార్లమెంట్ పనితీరు విధానం, కేంద్ర ఎన్నికల సంఘం తదితర రాజ్యాంగబద్ధ సంస్థలు.

పేపర్-2కి ప్రత్యేకంగా పుస్తకాలు లభించవు. అంతేకాకుండా యూపీఎస్సీ తాను నిర్దేశించిన సిలబస్‌కే కట్టుబడి ప్రశ్నలు అడగాలనే నిబంధన కూడా లేదు. దీంతో ఈ పేపర్‌లో అడిగే ప్రశ్నలు సమకాలీన అంశాలపై దృష్టి పెట్టాల్సినవిగా ఉంటాయి. కాబట్టి అభ్యర్థులు సిలబస్‌లో పేర్కొన్న చాప్టర్లను చదివేటప్పుడే వాటికి సంబంధించి సమకాలీనంగా చోటుచేసుకుంటున్న పరిణామాలను అనుసంధానం చేసుకోవాలి. అంతేకాకుండా ప్రతి సబ్జెక్ట్‌కు సంబంధించి కొన్ని నిర్దిష్ట పదజాలం (జార్గాన్స్) ఉంటుంది. వాటిపై అవగాహన ఏర్పరచుకోవాలి. సమాధానంలో సందర్భాను సారం ప్రస్తావించాలి. అప్పుడే ఎగ్జామినర్‌కు సదరు అభ్యర్థికి సబ్జెక్ట్‌పై అవగాహన ఉందనే ఆలోచన కలుగుతుంది.

## పేపర్-1 సిద్ధాంతాలను అన్వయించుకుంటూ:

పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ ఆప్షనల్‌లోని పేపర్-1లో సిలబస్ ఆసాంతం ప్రభుత్వ పాలనకు సంబంధించి సిద్ధాంతపరమైన అంశాలతో కూడి ఉంటుంది. ఈ క్రమంలో పేపర్-2కి ప్రిపరేషన్ సాగించే సమయంలో ఆయా అంశాలకు సంబంధించి పేపర్-1లో ఉండే మూల సిద్ధాంతాలను బేరీజు వేసుకుంటూ సాగాలి. పరీక్షలో రాసిచ్చే సమాధానాల్లో కూడా ఇవి ప్రతిబింబించేలా వ్యవహరించాలి.

ఉదాహరణకు: రాష్ట్రపతి అధికారాలు, విధులను చదివేటప్పుడు రాష్ట్రపతి వ్యవస్థ కార్యనిర్వాహక వర్గమని, అది ప్రజాస్వామ్య ప్రభుత్వంలోని మూడు ప్రధానాంగాల్లో ఒకటని.. దానిని ఒకవైపు శాసన శాఖ, మరోవైపు న్యాయశాఖ నియంత్రిస్తాయిఅనే సిద్ధాంతపర భావాలను గుర్తించాలి.

## సిలబస్ సులభం.. మార్కులు కష్టం:

అధికశాతం మంది అభ్యర్థులు పేపర్-2ను సులభంగా భావిస్తారు. ప్రశ్నలు నేరుగా ఉంటాయని, మంచి మార్కులకు ఆస్కారం ఉంటుందని భావిస్తారు. కానీ వాస్తవానికి పేపర్-1తో పోల్చితే పేపర్-2లో మార్కుల సాధనే కష్టం. దీనికి కారణం కూడా అభ్యర్థుల ఆలోచనా దృక్పథమే.

ఉదాహరణకు: చాలా మంది అభ్యర్థులు భారతదేశ పాలన అంటే కేవలం రాజకీయ వ్యవస్థ అనే అపోహతో ఉంటారు. ఇదే క్రమంలో రాసిచ్చే సమాధానాలను కూడా సాదాసీదాగా, వార్తాపత్రికల్లో ప్రచురితమయ్యే వ్యాసాల మాదిరిగా రాస్తారు. కానీ ఇది సరికాదు.

ప్రతి ప్రశ్నకు ఒక సిద్ధాంత పరమైన భావన ఉంటుంది. సదరు ప్రశ్నకు సమాధానం ఇచ్చేటప్పుడు దాన్ని ప్రస్తావిస్తూ సమాధానం రాయాలి. అలాకాకుండా నేరుగా సమాధానం ఇవ్వకూడదు.

ఉదాహరణకు: ఉదారవాదం, ప్రైవేటీకరణలు ప్రభుత్వ రంగ సంస్థల ప్రాధాన్యతను తగ్గించలేవు? అనే ప్రశ్నకు సమాధానం ఇచ్చేటప్పుడు.. అధికశాతం మంది అభ్యర్థులు ఉదారవాదం, ప్రైవేటీకరణ భావాలను వివరించి, ప్రభుత్వ రంగ సంస్థల ప్రాధాన్యత ఎందుకు తగ్గదు.. అనే కోణంలో వివరణ ఇస్తారు.

కానీ ఈ ప్రశ్నకు సమాధానం ఇవ్వాల్సిన తీరు ఇది కాదు. ఈ ప్రశ్నకు సమాధానంలో.. ప్రభుత్వ రంగ సంస్థల ఏర్పాటు ఉద్దేశం ఏంటి? ఉదారవాదం, ప్రైవేటీకరణ నేపథ్యంలో కూడా భారత్ వంటి వర్ధమాన దేశాల్లో ఆ సంస్థల ఆవసరమేంటి? అవి ఏ విధంగా ఓ వైపు ప్రజావసరాలను తీరుస్తూ, మరోవైపు మార్కెట్ శక్తుల లాభాపేక్షను నియంత్రిస్తాయి? ఆ ప్రభుత్వ రంగ సంస్థలు పరోక్షంగా ఉపాధి కూడా కల్పిస్తాయి.. అనే అంశాల ప్రస్తావన తప్పనిసరిగా ఉండాలి. అప్పుడే ఆ సమాధానానికి పరిపూర్ణత చేకూరుతుంది. అంటే.. ఒకవైపు విషయ పరిజ్ఞానాన్ని, మరోవైపు నేపథ్యాన్ని. ఆ విషయంపై సమయస్ఫూర్తిని మేళవిస్తూ సమాధానం రాయాలి.

## అన్నీ ముఖ్యమే:

ప్రస్తుతం యూపీఎస్సీ ప్రశ్నల తీరులో మార్పులను పరిశీలిస్తే.. ప్రాధాన్య, అప్రాధాన్య చాప్టర్లనే భావనకు దూరంగా ఉండాలి. కారణం ఇటీవల కాలంలో స్వల్ప సమాధాన ప్రశ్నల సంఖ్య పెరుగుతోంది. దీంతో ఈ పేపర్‌లోని మొత్తం 14 చాప్టర్లలోని అన్ని అంశాలను స్పృశించే తీరులో ప్రశ్నలు ఉంటున్నాయి. కాబట్టి ప్రతి అభ్యర్థి అన్ని చాప్టర్లపైనా దృష్టి సారించాల్సిందే.

అయితే మొదటి పేపర్-1, పేపర్-2లో ఒకేమాదిరిగా ఉన్న చాప్టర్లు కొన్ని ఉన్నాయి. అవి..

- పేపర్-1లోని 4వ చాప్టర్ -పేపర్-2లోని 3వ చాప్టర్.
- పేపర్-1లోని 9వ చాప్టర్-పేపర్-2లోని 8వ చాప్టర్.
- పేపర్-1లోని 11వ చాప్టర్-పేపర్-2లోని పదో చాప్టర్.
- పేపర్-1లోని 12వ చాప్టర్-పేపర్-2లోని 9వ చాప్టర్.

ఇప్పటికే పేపర్-1లో పైన పేర్కొన్న చాప్టర్లలో పూర్తి స్థాయిలో పట్టు సాధించిన అభ్యర్థులు.. పేపర్-2లో అదే మాదిరిగా ఉన్న చాప్టర్లకు తక్కువ ప్రాధాన్యం ఇచ్చినా పర్వాలేదు.

ఇవి కాకుండా.. పేపర్-2లో మంచి మార్కుల కోసం ఎక్కువ దృష్టి సారించాల్సిన చాప్టర్లు

- చాప్టర్-1 (భారత పాలన పరిణామం)
- చాప్టర్-4 (కేంద్ర ప్రభుత్వం, పాలన)
- చాప్టర్-5 (ప్రణాళికలు-ప్రాధాన్యత)
- చాప్టర్-6 (రాష్ట్ర ప్రభుత్వం - పాలన)
- చాప్టర్-7 (స్వాతంత్ర్యానంతరం జిల్లా పాలన)
- చాప్టర్-11 (గ్రామీణాభివృద్ధి)
- చాప్టర్-12 (పట్టణ స్థానిక ప్రభుత్వం)
- చాప్టర్-13 (శాంతి భద్రతల పాలన - నిర్వహణ)
- చాప్టర్-14 (భారత పాలనలో ప్రధానాంశాలు)

## ప్రస్తుత సమయంలో ఇలా:

వాస్తవానికి పేపర్-2ని సులభంగా భావించినప్పటికీ పేపర్-1తో పోల్చితే సిలబస్ పరిధి విస్తృతమే. అంతేకాకుండా అధిక శాతం అంశాలు సమకాలీన సంబంధంగా ఉంటాయి. వీటికి సమాచారం ప్రామాణిక గ్రంథాల్లో లభించదు. దీంతో అభ్యర్థులు చేసే పొరపాటు మార్కెట్లో లభిస్తున్న అన్ని రకాల మెటీరియల్స్‌ను సేకరించడం. ఇది సరి కాదు. అన్నిటిలోనూ సమాచార సారాంశం ఒకటే ఉంటుంది. కానీ విశ్లేషణ నాణ్యతలో భేదాలు ఉంటాయి. కాబట్టి విశ్లేషణాత్మకంగా ఉంటూ విలువైన సమాచారాన్ని అందించే మెటీరియల్‌ను ఎంచుకోవాలి. ఇందుకోసం అవసరమైతే కోచింగ్ నిపుణులు, అప్పటికే విజయం సాధించిన అభ్యర్థుల సలహాలు స్వీకరించాలి. ప్రస్తుతం సమయం తక్కువగా ఉంది కాబట్టి.. ఈ సమయంలో ఆయా అంశాలు చదువుతూ సొంత నోట్స్ రూపొందించుకోవడం ఆహ్వానించదగిన పరిణామం కాదు. దీనికి బదులు ప్రతి చాప్టర్ పూర్తవగానే దానికి సంబంధించి సెల్ఫ్‌టెస్ట్ రాసుకోవాలి.

## శాస్త్రీయ దృక్పథంతో అంశాల ఎంపిక:

సిలబస్ విస్తృతం.. అందుబాటులోని సమయం పరిమితం. దీంతో అభ్యర్థుల్లో ఆందోళన సహజం. కానీ కొద్దిపాటి శాస్త్రీయ దృక్పథాన్ని అనుసరిస్తూ ఈ సమస్యను అధిగమించొచ్చు. పరీక్షలో మెరుగైన ప్రదర్శనకు పునాదులు వేసుకోవచ్చు. ఈ క్రమంలో ముందుగా యూపీఎస్సీ గత రెండేళ్లలో అడిగిన ప్రశ్నలను పరిశీలించాలి. వాటిపై తక్కువ స్థాయిలో దృష్టి పెట్టి మిగతావాటికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. యూపీఎస్సీ ప్రశ్న పత్రాలను విశ్లేషిస్తే గత రెండేళ్లలో ఇచ్చిన ప్రశ్నలను ఇవ్వడం అనేది సాధారణ పరిస్థితుల్లో జరగదు.

తర్వాత ప్రస్తుతం వివాదాస్పదంగా ఉన్న అంశాలపై దృష్టి పెట్టాలి. ఉదాహరణకు.. తాజాగా బొగ్గు స్కాం నేపథ్యంలో కాగ్ (కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్); రాష్ట్రపతి ఎన్నిక, ధరల పెంపు సమయంలో ప్రభుత్వంలోని మిత్రపక్షాల ప్రభుత్వ వ్యతిరేక ధోరణి నేపథ్యంలో సంకీర్ణ వ్యవస్థ; పౌర సమాజం చొరవతో రూపొందిన లోక్‌పాల్ వ్యవస్థ వంటివి. ఈసారి ఈ మూడింటింలోంచి ఒక ప్రశ్న కచ్చితంగా అడిగే అవకాశం ఉంది.

అకడెమిక్‌గా టెక్నికల్ నేపథ్యం ఉన్న అభ్యర్థులు కూడా కంగారుపడకుండా సులభంగా ఈ పేపర్‌లో రాణించొచ్చు. కారణం పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అంటేనే ఒక శాస్త్రం. దీన్ని అర్థం చేసుకోవడం, శాస్త్రీయంగా జవాబులు ఇవ్వడం సులభమే.

## రిఫరెన్స్ రీడింగ్స్:

అభ్యర్థులు ప్రామాణిక గ్రంథాలతోపాటు ఇతర మార్గాల ద్వారా కూడా సమాచార సేకరణ.. (ముఖ్యంగా సమకాలీన అంశాలపై అవగాహన కోసం) చేయాలి. ఇందుకోసం ప్రముఖ దినపత్రికలు; యోజన; కురుక్షేత్ర; ఎకనామిక్స్ అండ్ పొలిటికల్ వీక్లీ; సెమినార్ వంటి మ్యాగజీన్లను తప్పనిసరిగా చదవాలి. ప్రస్తుత సమస్యలపై లోక్‌సభ టీవీ, ఇతర టీవీ ఛానళ్లలో.. మేధావులు, రాజకీయ నాయకుల సమక్షంలో నిర్వహించే చర్చావేదికలు; ఆకాశవాణి రేడియోలో ప్రతిరోజు రాత్రి 9.15 గంటలకు ప్రసారమయ్యే ఆరోజు ప్రధానాంశంపై చర్చలను అనుసరించాలి.

## Important Questions:

1) Kautilya's administration maxims are relevant to modern Indian administration?
2) The British India continued the legacy of Mughul rule?
3) Rippon sowed the seeds of modern local self government of india?
4) Globalisation is posing challenges to the value premises of our constitution?
5) Bureaucracy strengthened the democratic values in India- Analyse?
6) It is time to windup the public sector undertakings given their poor performance record. Examine?
7) India is experiencing Judicialised administration. Examine?
8) Planning commission is dead. Long live planning. Comment?
9) Liberalisation requires indicative rather than directive planning. Do you agree?
10) The DPC is a paper Tiger. Critically Examine?
11) It is a good policy option to mer ge Finance commission with the planning commission and to give the later a constitutional status. Discuss?
12) With the increasing role played by the regional parties, the Chief Ministers have become the king makers at the national level. Discuss?
13) With the multiplicity of functional departments, the collectors of fice is losing its significance. Discuss?
14) District administration plays a key role in democratic decentralization. Examine?
15) Capacity building is more than training. Discuss?
16) The promotion and the pay should be linked to productivity. Do you agree?
17) 'Civil Service neutrality is not tenable'. Critically examine?
18) Do you think that C&AG is exceeding its jurisdiction while commenting on the 2G spectrum allocation and recently the allocation of coal blocks to private parties?
19) Most of the recommendations of second administrative reforms commission are yet to be implemented. Comment?
20) Natural rural health mission is making a significant impact on the well being of rural poor. Elaborate?
21) Population, traf fic congestion, housing and transportation problems are major hurdles to urban development. Elaborate?
22) The investigating agencies like C.B.I. and C.I.D. are to be given autonomy to ensure their effective functioning. Discuss?
23) The out dated police Act of 1861 is to be replaced with an Act that reflects the needs of 21st century?
24) 'Regulatory commissions are to be strengthened'. Comment?
25) National Human Rights Commission can play a more ef fective role if it is given constitutional status with necessary infrastructure and resources. Examine?

# 2012 మిస్ వరల్డ్ వెన్ జియా యూ



ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి
కరెంట్ అఫైర్స్ నిపుణులు

## అంతర్జాతీయం

### అమెరికా హైపర్ సోనిక్ విమాన పరీక్ష విఫలం

అమెరికా ప్రయోగించిన 'ఎక్స్-51ఏ వేవ్ రైడర్' అనే మానవ రహిత విమాన పరీక్ష విఫలమైంది. గంటకు 6,900 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేందుకు ఉద్దేశించిన ఈ విమాన పరీక్షను ఆగస్టు 14న నిర్వహించింది. స్కామ్ జెట్ ఇంజిన్‌తో నడిచే వేవ్ రైడర్ నియంత్రణ కోల్పోయి పసిఫిక్ మహాసముద్రంలో కూలింది.

### మిస్ వరల్డ్ వెన్ జియా యూ



చైనాకు చెందిన వెన్‌జియా యూ (23) 2012 ప్రపంచ సుందరిగా ఎంపిక య్యారు. ఆగస్టు 18న ఓర్డోస్ (చైనా)లో జరిగిన పోటీలో వెన్‌జియా యూ విజేతగా నిలిచి ప్రపంచ సుందరి కిరీటాన్ని దక్కించుకుంది. మొదటి రన్నరప్‌గా సోఫీ మౌల్డ్స్(వేల్స్), రెండో రన్నరప్‌గా జెస్సికా కహావటి (ఆస్ట్రేలియా) నిలిచారు. భారత్‌కు చెందిన వాన్యా మిశ్రాకు ఆరో స్థానం దక్కింది. చైనాకు ఈ టైటిల్ రావడం ఇది రెండో సారి. 2007లో ఆ దేశానికి చెందిన జాంగ్ జిలిన్ మిస్ వరల్డ్ కిరీటం దక్కించుకుంది.

## అవార్డులు

### పట్నాయక్‌కు డామైన్ డట్టోన్ అవార్డు

ప్రతిష్ఠాత్మక డామైన్-డట్టోన్ అవార్డు-2012 ఒడిశా రాష్ట్ర లెప్రసీ అధికారి డా. పి.బి.కె.పట్నాయక్‌కు లభించింది. కుష్టు వ్యాధి నిర్మూలనకు చేసిన కృషికి గాను ఆయనకు ఈ అవార్డు దక్కింది. గతంలో ఈ పురస్కారం లభించిన వారిలో మదర్ థెరిస్సా, బాబా ఆమ్టే తదితరులు ఉన్నారు. ఈ అవార్డును డామైన్-డట్టోన్ సొసైటీ ఫర్ లెప్రసీ ఎయిడ్ అందజేస్తుంది. దీన్ని 1944లో అమెరికా సైన్యానికి చెందిన మెడికల్ కోర్ ప్రారంభించింది. కుష్టు వ్యాధి నివారణకు విశేష కృషి చేసిన వారికి ఈ అవార్డును బహూకరిస్తారు.

### మెహతాకు రాజీవ్ సద్భావన అవార్డు

జైపూర్ కేంద్రంగా పని చేసే భగవాన్ మహావీర్ వికలాంగ్ సేవా సమితి వ్యవస్థాపకుడు డీఆర్ మెహతా ఈ ఏడాది రాజీవ్‌గాంధీ జాతీయ సద్భావన అవార్డుకు ఎంపికయ్యారు. ఆసియా, ఆఫ్రికా, దక్షిణ అమెరికాల్లోని 26 దేశాల పేద ప్రజలకు ఈ సంస్థ ఉచితంగా సేవలు అందిస్తుంది. న్యూఢిల్లీలో ఆగస్టు 19న జరిగిన కార్యక్రమంలో ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ మెహతాకు ఈ పురస్కారాన్ని అందజేశారు.

## జాతీయం

### మన్మోహన్ రికార్డు



భారతదేశ 66వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ ఆగస్టు 15న ఎర్రకోటపై వరుసగా తొమ్మిదోసారి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. తద్వారా జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీల తర్వాత ఎర్రకోటపై ఎక్కువ సార్లు త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించిన ప్రధానమంత్రిగా రికార్డు సృష్టించారు. తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ 17 సార్లు, ఇందిరాగాంధీ 16 సార్లు ఎర్రకోటపై జెండాను ఆవిష్కరించారు. మన్మోహన్ 2004 ఆగస్టు 15న తొలి సారిగా ఎర్రకోటపై జెండా ఎగరవేశారు. మన్మోహన్ కంటే ముందు ఆ పదవిలో ఉన్న బీజేపీ నేత వాజ్‌పేయి ఆరు సార్లు జాతీయ పతాకావిష్కరణ చేశారు.

### 2012-13 లో 6.7 శాతం వృద్ధి



2012-13లో స్థూల దేశీయోత్పత్తి వృద్ధిరేటు 6.7 శాతంగా ఉండగలదని సి. రంగరాజన్ నేతృత్వంలోని ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి(పీఎంఈఏసీ) రూపొందించిన ఆర్థిక వ్యవస్థ అంచనాల నివేదిక అంచనా వేసింది. ఈ నివేదికను పీఎంఈఏసీ ఆగస్టు 17న ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌కు సమర్పించింది. వ్యవసాయ వృద్ధిరేటు 0.5 శాతంగా (2011-12లో 2.8 శాతం), తయారీ రంగ వృద్ధి రేటు 4.5 శాతంగా (2011-12లో 2.5 శాతం), మైనింగ్ రంగంలో వృద్ధి 5.3 శాతంగా (2011-12లో 3.4 శాతం), సేవల రంగంలో వృద్ధి 8.9 శాతంగా(2011-12లో 3.4 శాతం) నమోదయ్యే అవకాశం ఉన్నట్లు నివేదిక పేర్కొంది. వాణిజ్య లోటు 18,110 కోట్ల డాలర్లుగా ఉండవచ్చని అంచనా వేసింది. దేశీయ పొదుపు రేటు 31.7 శాతంగా ఉంటుందని పేర్కొంది. అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితి ప్రభావం నుంచి మన ఆర్థిక వ్యవస్థ బయటపడి మళ్లీ పుంజుకోవాలంటే మౌలిక రంగంలో పెట్టుబడులను మరింత పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించింది.

### ఆర్థిక శాఖ ముఖ్య సలహాదారుగా రాజన్

కేంద్ర ఆర్థిక శాఖ ముఖ్య సలహాదారుగా (సీఈఏ) రఘురాం జి.రాజన్ ఆగస్టు 11న నియమితులయ్యారు. ప్రస్తుతం ఈయన చికాగో విశ్వవిద్యాలయానికి చెందిన బూత్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. రాజన్ గతంలో ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌కు గౌరవ ఆర్థిక సలహాదారుగా, అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్)లో ఆర్థిక వేత్తగా పని చేశారు.

### భారత్‌కు ఎంబ్రాయెర్ 145



గగన తల నిఘాను మరింత పటిష్ఠం చేసేందుకు ఉద్దేశించిన ఎంబ్రాయెర్ 145 నిఘా విమానాన్ని భారత్ సమకూర్చుకుంది. దీనికి ఎంబ్రాయెర్ 145 ఏఈడబ్ల్యూసీ (ఎయిర్ బోర్న్ ఎర్లీ వార్నింగ్ అండ్ కంట్రోల్ ఎయిర్ క్రాఫ్ట్)గా పేరు పెట్టారు. బ్రెజిల్ కంపెనీ ఎంబ్రాయెర్ తయారు చేసిన ఈ విమానంలో భారత్ తొలిసారిగా స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన యాక్టివ్ ఎలక్ట్రానిక్ స్కాన్డ్ అర్రే(ఏఈఎస్ఏ) రాడార్‌ను అమర్చారు. ఆగస్టు 17న బ్రెజిల్‌లోని శావ్ జోస్ డాస్ కాంపోస్‌లో జరిగిన కార్యక్రమంలో భారత రక్షణ శాఖ ఉన్నతాధికారులకు బ్రెజిల్ కంపెనీ ఈ విమానాన్ని అప్పగించింది. 2014 నాటికి ఇటువంటి మూడు విమానాలతోపాటు ఇతరత్రా సాంకేతిక సహకారం అందించాలని బ్రెజిల్ కంపెనీతో భారత్ కుదుర్చుకున్న 210 మిలియన్ డాలర్ల ఒప్పందంలో భాగంగా తొలి విమానం మన దేశానికి అందింది. ఇది శత్రు క్షిపణులు, యుద్ధ విమానాలను అన్ని వైపుల నుంచీ పసిగట్టగలదు.

### కేంద్ర మంత్రి విలాస్‌రావ్ దేశ్‌ముఖ్ మృతి



కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి విలాస్‌రావ్ దేశ్‌ముఖ్ (67) ఆగస్టు 14న చెన్నైలో కాలేయ వ్యాధితో మరణించారు. 1980లో తొలిసారి లాతూర్ స్థానం నుంచి మహారాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికయ్యారు. ఆయన రెండు స్లారు (1999-2003, 2004-08 మధ్య కాలంలో) మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా పని చేశారు. 2009 నుంచి కేంద్రమంత్రిగా కొనసాగుతున్నారు.

### చిత్రకారుడు కాపు రాజయ్య మృతి



ప్రముఖ చిత్రకారుడు కళారత్న కాపు రాజయ్య (83) ఆగస్టు 20న మెదక్ జిల్లా సిద్దిపేటలో మరణించారు. డ్రాయింగ్ టీచర్‌గా ఎందరికో తర్ఫీదునిచ్చిన రాజయ్య అంతర్జాతీయ ఖ్యాతి గడించారు. 1990లో ఆయన కల్లుగీత కార్మికుల జీవితంపై రూపొందించిన చిత్రానికి జాతీయ అవార్డు లభించింది. 1990లో కేంద్ర అకాడెమీ పురస్కారం 2000లో రాష్ట్ర ప్రభుత్వ హంస పురస్కారంతో పాటు అనేక సత్కారాలు ఆయన పొందారు.

## క్రీడలు

### అంతర్జాతీయ క్రికెట్ నుంచి వైదొలగిన లక్ష్మణ్



హైదరాబాద్‌కు చెందిన క్రికెట్ క్రీడాకారుడు వీవీఎస్ లక్ష్మణ్ (37) అంతర్జాతీయ క్రికెట్ నుంచి వైదొలుగుతున్నట్లు ఆగస్టు 19న ప్రకటించాడు. 1996లో టెస్ట్ కెరీర్ ప్రారంభించిన లక్ష్మణ్ 1998లో వన్డేలలో అరంగేట్రం చేశాడు. ఇప్పటి వరకు 134 టెస్టులు ఆడి 17 సెంచరీలతో 8781 పరుగులు, 81 వన్డేల్లో ఆరు సెంచరీలతో 2338 పరుగులు చేశాడు. 2001లో కోల్‌కతా టెస్ట్‌లో ఆస్ట్రేలియాపై సాధించిన 281 పరుగులు.. భారత బ్యాట్స్‌మెన్ టెస్టుల్లో చేసిన మూడో అత్యుత్తమ వ్యక్తిగత స్కోర్. లక్ష్మణ్‌కు 2001లో అర్జున, 2011లో పద్మశ్రీ అవార్డులు లభించాయి. 2002లో విజ్డెన్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్‌గా నిలిచాడు.

### 2012 క్రీడా బహుమతులు



2012 సంవత్సరానికి రాజీవ్ ఖేల్‌రత్న, అర్జున అవార్డులను కేంద్ర ప్రభుత్వం ఆగస్టు 19న ప్రకటించింది. ఇద్దరు క్రీడాకారులకు సంయుక్తంగా రాజీవ్ ఖేల్ రత్న, 25 మందికి అర్జున అవార్డులు దక్కాయి. ఖేల్ రత్న లభించిన వారికి మెడల్‌తోపాటు రూ.7.5 లక్షలు, అర్జున అవార్డు కింద మొమెంటో రూ. 5 లక్షల నగదు బహూకరిస్తారు.

**రాజీవ్ ఖేల్‌రత్న:**
విజయ్ కుమార్ (షూటింగ్), యోగేశ్వర్ దత్(రెజ్లింగ్). వీరిద్దరూ ఇటీవల ముగిసిన లండన్ ఒలింపిక్స్‌లో పతకాలు సాధించారు.

**అర్జున అవార్డులు:**
దీపిక, బొంబేలా దేవి (ఆర్చరీ), సుధా సింగ్, కవితా రౌత్ (అథ్లెటిక్స్), అశ్విని పొన్నప్ప, పారుపల్లి కశ్యప్ (బ్యాడ్మింటన్), ఆదిత్య మెహతా (బిలియర్డ్స్), వికాస్ కృషన్ (బాక్సింగ్), యువరాజ్ సింగ్ (క్రికెట్), సర్దార్ సింగ్ (హాకీ), యష్‌పాల్ సోలంకీ (జూడో), అనూప్ కుమార్ (కబడ్డీ), సమీర్ సుహాగ్ (పోలో), అన్నురాజ్ సింగ్, ఓంకార్ సింగ్, జైదీప్ కర్మాకర్ (షూటింగ్), దీపికా పల్లికల్ (స్క్వాష్), సందీప్ సెజ్వాల్ (స్విమ్మింగ్), సోనియా చాను (వెయిట్‌లిఫ్టింగ్), నర్సింగ్ యాదవ్, రాజిందర్ కుమార్, గీతా పోగట్ (రెజ్లింగ్), బిమల్‌జిత్ సింగ్ (వుషు), దీపా మల్లిక్ (అథ్లెటిక్స్-పారాలింపిక్స్), రామ్‌కరణ్ సింగ్ (అథ్లెటిక్స్-పారాలింపిక్స్).

### ఫెదరర్‌కు సిన్సినాటి టైటిల్

ఏటీపీ సిన్సినాటి మాస్టర్స్ టెన్నిస్ పురుషుల సింగిల్స్ టైటిల్‌ను రోజర్ ఫెదరర్ (స్విట్జర్లాండ్)గెలుచుకున్నాడు. ఆగస్టు 20న సిన్సినాటి (అమెరికా)లో జరిగిన ఫైనల్లో నొవాక్ జకోవిచ్‌ను ఓడించాడు. తద్వారా ఓపెన్ శకంలో ఐదుసార్లు సిన్సినాటి మాస్టర్స్ టైటిల్‌ను నెగ్గిన తొలి ప్లేయర్‌గా రికార్డు నెలకొల్పాడు. అంతేకాకుండా అత్యధికంగా 21 మాస్టర్స్ టైటిల్స్‌తో రాఫెల్ నాదల్ పేరిట ఉన్న రికార్డును ఫెదరర్ సమం చేశాడు. మహిళా సింగిల్స్ టైటిల్‌ను చైనాకు చెందిన లీనా గెలుచుకుంది. పురుషుల డబుల్స్‌లో భారత్‌కు చెందిన మహేష్ భూపతి, రోహన్ బోపన్నలను ఓడించి రాబర్ట్ లిండ్ స్టెడ్ (స్వీడన్), హోరియా టెకావు (రొమేనియా) టైటిల్ సాధించారు.

### టెస్టుల్లో నెంబర్ వన్ దక్షిణాఫ్రికా



ఇంగ్లండ్-దక్షిణాఫ్రికాల మధ్య జరుగుతున్న టెస్ట్ సిరీస్‌ను గెలుచుకోవడం ద్వారా.. దక్షిణాఫ్రికా జట్టు టెస్టుల్లో ప్రపంచ నెంబర్ వన్ స్థానాన్ని దక్కించుకుంది. గతేడాది భారత్ నుంచి టాప్ ర్యాంకును ఇంగ్లండ్ సాధించింది.

### దీపిక పల్లికల్ రికార్డు

భారత క్రీడాకారిణి దీపిక పల్లికల్ ఆస్ట్రేలియా స్క్వాష్ ఓపెన్‌లో సెమీ ఫైనల్స్‌కు ప్రవేశించింది. తద్వారా ఈ టోర్నమెంట్‌లో సెమీస్‌కు చేరుకున్న తొలి భారత క్రీడాకారిణిగా పల్లికల్ రికార్డు సృష్టించింది. సెమీఫైనల్స్‌లో ఇంగ్లండ్‌కు చెందిన తారా మస్సార్ చేతిలో ఓడిపోయింది.



send your feedback to: sakshieducation@gmail.com

Ask the expert



Q A

టి. మురళీధరన్
టి.ఎం.ఐ. నెట్‌వర్క్

# సీడీఎస్ పరీక్ష వివరాలను తెలపండి?

**డిప్లొమా స్థాయిలో లేబర్ లా, పేటెంట్ 'లా' లో డిప్లొమా కోర్సులను ఆఫర్ చేస్తున్న ఇన్‌స్టిట్యూట్‌లేవి?**

-రవికాంత్, పద్మారావునగర్.

**డిప్లొమా ఇన్ లేబర్ లా కోర్సును ఆఫర్ చేస్తున్న ఇన్‌స్టిట్యూట్‌లు:**

- ది లా ఇన్‌స్టిట్యూట్-న్యూఢిల్లీ, డిప్లొమా ఇన్ లేబర్ అండ్ లేబర్ వెల్ఫేర్ కోర్సును ఆఫర్ చేస్తుంది.
  అర్హత: డిగ్రీ ఇన్ లా లేదా ఎంఏ (సోషల్ సైన్సెస్).
  వివరాలకు: www.ilidelhi.org
- యూనివర్సిటీ ఆఫ్ పుణే, డిప్లొమా ఇన్ లేబర్ అండ్ లేబర్ వెల్ఫేర్ కోర్సును ఆఫర్ చేస్తుంది.
  అర్హత: ఏదైనా డిగ్రీ
  వివరాలకు: www.unipune.ac.in

**పేటెంట్ 'లా' లో డిప్లొమా కోర్సులను ఆఫర్ చేస్తున్న ఇన్‌స్టిట్యూట్‌లు:**

- నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా- హైదరాబాద్.
  కోర్సు: పీజీ డిప్లొమా ఇన్ పేటెంట్ లా (కాంటాక్ట్ కమ్ వెబ్‌బేస్డ్ లెర్నింగ్)
  వెబ్‌సైట్: www.nalsarpro.org
- ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ స్టడీస్-ఎన్ఎంఐఎంఎస్ డీమ్డ్ వర్సిటీ, ముంబై.
  కోర్సు: పీజీడీ- పేటెంట్ అండ్ ప్రాక్టీస్
  ప్రవేశం: అకడెమిక్ అర్హతలు, అనుభవం ఆధారంగా
  వివరాలకు: www.iips.ac.in
- అకాడెమీ ఆఫ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ స్టడీస్-ముంబై
  కోర్సు: పీజీడీ -పేటెంట్ మేనేజ్‌మెంట్
  ప్రవేశం: ఇంటర్వ్యూ ఆధారంగా.
  వివరాలకు: www.aips.ac.in

**సీబీఐలో సబ్-ఇన్‌స్పెక్టర్ పోస్టులను ఏ విధంగా భర్తీ చేస్తారు?**

-చరణ్, కొత్తపేట.

సీబీఐలో సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టుల భర్తీ కోసం స్టాఫ్ సెలెక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ).. కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తుంది. **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా గ్రాడ్యుయేషన్. వయసు: 20-27 ఏళ్లు. నిబంధనలకనుగుణంగా వయో సడలింపు ఉంటుంది. నిర్దేశించిన విధంగా శారీరక ప్రమాణాలు ఉండాలి. అవి.. ఎత్తు-165 సెం.మీ.(పురుషులు), ఛాతీ కనీసం 76 సెం.మీ. విస్తీర్ణం ఉండాలి. ఊపిరి పీల్చక ముందు, పీల్చిన తర్వాత ఛాతీలో వ్యత్యాసం 5 సెం.మీ. తప్పనిసరి. మహిళలు ఎత్తు-150 సెం.మీ. ఎత్తుకు తగ్గ బరువు తప్పనిసరి. నిర్దేశించిన అభ్యర్థులకు శారీరక ప్రమాణాల్లో కూడా మినహాయింపు ఉంటుంది.

**ఎంపిక విధానం:** రెండు దశలుగా ఉంటుంది. మొదటి దశలోని రాత పరీక్షను.. టైర్ 1, టైర్ 2 రెండు పేపర్లుగా ఆబ్జెక్టివ్ మల్టిపుల్ చాయిస్ పద్ధతిలో ఇంగ్లిష్, హిందీ భాషల్లో నిర్వహిస్తారు. టైర్ 1లో జనరల్ ఇంటెలిజెన్స్, జనరల్ అవేర్‌నెస్, న్యూమరికల్ ఆప్టిట్యూడ్, ఇంగ్లిష్ కాంప్రెహెన్షన్ అంశాలు ఉంటాయి. ఈ దశ క్వాలిఫై ఆయిన వారికి మాత్రమే టైర్ 2కు హాజరయ్యే అవకాశం ఉంటుంది. ఇందులో అర్థమెటిక్ ఎబిలిటీస్, ఇంగ్లిష్ కాంప్రెహెన్షన్ విభాగాలు ఉంటాయి. ఇందులో అర్హత సాధిస్తే పర్సనల్ ఇంటర్వ్యూ/ పర్సనాలిటీ టెస్ట్ నిర్వహించి చివరగా నియామకం ఖరారు చేస్తారు.

వివరాలకు: http://ssc.nic.in

**సీడీఎస్ పరీక్ష వివరాలను తెలపండి?**

-విఘ్నేష్, వరంగల్.

ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్.. త్రివిధ దళాల్లో కెరీర్ ప్రారంభంలోనే కమిషన్డ్ ర్యాంక్ ఆఫీసర్‌గా అడుగుపెట్టేందుకు అవకాశం కల్పిస్తుంది.. కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ (సీడీఎస్ఈ). యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహించే ఈ పరీక్ష ద్వారా మిలటరీ, ఎయిర్‌ఫోర్స్, నేవల్, ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడెమీల్లో ప్రవేశం లభిస్తుంది. అర్హత: ఇండియన్ మిలటరీ అకాడెమీ, ఆఫీసర్ ట్రైనింగ్ అకాడెమీ పోస్టులకు ఏదైనా డిగ్రీ. నావల్ అకాడెమీకి ఇంజనీరింగ్ డిగ్రీ. ఎయిర్ ఫోర్స్ అకాడెమీకి ఏదైనా డిగ్రీ (ఇంటర్మీడియెట్‌లో మ్యాథమెటిక్స్,ఫిజిక్స్ చదివి ఉండాలి). సీడీఎస్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి.. ఆ తర్వాత సర్వీస్ సెలక్షన్ బోర్డ్ ఇంటర్వ్యూ. పర్సనల్ ఇంటర్వ్యూలో కూడా ఎంపికైన వారికి ముందుగా త్రివిధ దళాలకు చెందిన ట్రైనింగ్ అకాడెమీల్లో శిక్షణనిస్తారు. ఆర్మీ కోసం ఇండియన్ మిలిటరీ అకాడెమీ (డెహ్రాడూన్), నేవీ కోసం ఇండియన్ నేవల్ అకాడెమీ (కేరళ), ఎయిర్ ఫోర్స్ కోసం ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అకాడెమీకి చెందిన వివిధ ప్రాంతాల్లో., పురుషులు, మహిళల షార్ట్ సర్వీస్ కమిషన్ కోసం ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడెమీ (చెన్నై)లలో శిక్షణనిస్తారు. శిక్షణ పూర్తయ్యాక ఆయా దళాల్లో కమిషన్డ్ ర్యాంక్ అధికారి హోదాలో నియామకం ఖరారు చేస్తారు.

సీడీఎస్ రాత పరీక్ష రెండు విధాలుగా ఉంటుంది. మిలటరీ, నేవల్, ఎయిర్ ఫోర్స్ అకాడెమీ ఔత్సాహికులకు ఒక విధంగా.. ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడెమీ (ఓటీఏ) ఔత్సాహికులకు మరో విధంగా ఉంటుంది. మిలటరీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ రాత పరీక్షలో ఇంగ్లిష్, జనరల్ నాలెడ్జ్, ఎలిమెంటరీ మ్యాథమెటిక్స్ అంశాల నుంచి..ఓటీఏ పరీక్షలో ఇంగ్లిష్, జనరల్ నాలెడ్జ్ విభాగాల నుంచి ప్రశ్నలు వస్తాయి. ఆబ్జెక్టివ్ పద్ధతిలో నిర్వహించే ఈ పరీక్షల్లో ఆయా సబ్జెక్టు ల్లో పదో తరగతి స్థాయిలోనే ప్రశ్నలడుగుతారు. సీడీఎస్ఈ నోటిఫికేషన్ ప్రతి ఏడాది సాధారణంగా రెండు సార్లు ఆగస్టు, మార్చి నెలలో వెలువడుతుంది. ఆగస్టు నోటిఫికేషన్‌కు ఫిబ్రవరిలో, మార్చి నోటిఫికేషన్‌కు ఆగస్టులో రాత పరీక్ష నిర్వహిస్తారు.

వివరాలకు: www.upsc.gov.in

**ఎంటెక్ (బయోటెక్నాలజీ) కోర్సును ఆఫర్ చేస్తున్న ఇన్‌స్టిట్యూట్‌లేవి?**

-స్టీవెన్, నల్గొండ.

బయోటెక్నాలజీ గ్రాడ్యుయేట్లకు ఫార్మాస్యూటికల్ కంపెనీల్లో, కెమికల్, అగ్రికల్చరల్ సంబంధిత పరిశ్రమల్లో, బయోప్రాసెసింగ్ ఇండస్ట్రీలతోపాటు రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ లేబొరేటరీల్లో ఉద్యోగావకాశాలు ఉంటాయి. ఇందులో మాస్టర్ డిగ్రీ చేయడం ద్వారా మరిన్ని అవకాశాలను సొంతం చేసుకోవచ్చు. ప్రతి ఏడాది నిర్వహించే గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇంజనీరింగ్(గేట్).. పరీక్షలో క్వాలిఫై కావడం ద్వారా ఎంటెక్ (బయోటెక్నాలజీ) కోర్సు చేయొచ్చు. గేట్ స్కోర్ ఆధారంగా దేశంలోని అన్ని ప్రముఖ ఇన్‌స్టిట్యూట్‌లు/వర్సిటీలు ఎంటెక్‌లో ప్రవేశం కల్పిస్తాయి.

**ఈ కోర్సును ఆఫర్ చేస్తున్న కొన్ని వర్సిటీలు:**

- ఐఐటీ-ఖరగ్‌పూర్
  వివరాలకు: www.iit-kgp.ac.in
- ఐఐటీ-గౌహతి వివరాలకు: www.iitg.ac.in
- వెల్లూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ-వెల్లూర్
  వివరాలకు: www.vit.ac.in

## ఎడ్యూ ఇన్ఫో

### ఎల్ఐసీ గోల్డెన్ జూబ్లీ స్కాలర్‌షిప్

లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ).. సామాజిక బాధ్యతలో భాగంగా ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించడానికి ప్రతి ఏటా గోల్డెన్ జూబ్లీ స్కాలర్‌షిప్స్‌ను అందజేస్తుంది. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులను ప్రోత్సహించి వారికి మెరుగైన అవకాశాలను కల్పించడానికి ఎల్ఐసీ ప్రతి ఏటా ఈ స్కాలర్‌షిప్స్‌ను ప్రదానం చేస్తుంది. ఈ క్రమంలో 2012 సంవత్సరానికి గోల్డెన్ జూబ్లీ స్కాలర్‌షిప్ కోసం నోటిఫికేషన్ వెలువడింది.

ప్రభుత్వ/ప్రభుత్వ గుర్తింపు పొందిన కాలేజీలు/ ఇన్‌స్టిట్యూట్‌లు/ యూనివర్సిటీలలో టెక్నికల్, ఒకేషనల్, గ్రాడ్యుయేషన్, ప్రొఫెషనల్, డిప్లొమా కోర్సులు చదివే విద్యార్థులకు ఈ స్కాలర్‌షిప్స్ అందజేస్తారు. కోర్సు పూర్తయ్యే వరకు స్కాలర్‌షిప్ చెల్లిస్తారు.

**అర్హత:** 2011-12 విద్యా సంవత్సరంలో 60 శాతం మార్కులు/తత్సమాన గ్రేడ్‌తో 12వ తరగతి/తత్సమానం ఉత్తీర్ణులై ఉండాలి. మెడిసిన్, ఇంజనీరింగ్, ఏదైనా గ్రాడ్యుయేషన్, డిప్లొమా/తత్సమానం, నేషనల్ కౌన్సిల్ ఫర్ ఒకేషనల్ ట్రైనింగ్(ఎన్‌సీవీటీ) గుర్తింపు పొందిన ఇన్‌స్టిట్యూట్‌ల నుంచి ఒకేషనల్ కోర్సులలో..ఏదో ఒక కోర్సు చదువుతూ ఉండాలి. ఈ విద్యా సంవత్సరం నుంచి 60 శాతం మార్కులతో 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు కూడా ఈ స్కాలర్‌షిప్‌నకు అర్హులు. తల్లిదండ్రులు/సంరక్షకుని వార్షికాదాయం రూ.లక్షలోపు ఉండాలి.

**స్కాలర్‌షిప్ విలువ:** సంవత్సరానికి రూ.10 వేలు. దీన్ని నెలకు రూ.1000 చొప్పున 10 నెలలపాటు లబ్ధిదారుల బ్యాంక్ అకౌంట్లోకి ట్రాన్స్‌ఫర్ చేస్తారు. నిబంధనలకు లోబడి రెన్యువల్ ఉంటుంది. అవి.. ప్రొఫెషనల్ కోర్సుల్లో 55 శాతం మార్కులు, సాధారణ డిగ్రీ/తత్సమాన, మిగతా కోర్సుల్లో 50 శాతం మార్కులు తప్పకుండా సాధించాలి. హాజరు పరంగా కూడా మంచి రికార్డు ఉండాలి. లేకుంటే స్కాలర్‌షిప్ రెన్యువల్ చేయరు.

**ఎంపిక విధానం:** మెరిట్, ఫ్యామిలీ బ్యాగ్రౌండ్, వార్షికాదాయం తదితర అంశాలాధారంగా ఎంపిక ఉంటుంది. దరఖాస్తుదారుల్లో అతి తక్కువ ఆదాయం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇస్తారు.

**దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

**దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ:** ఆగస్టు 31, 2012.

వివరాలకు: www.licindia.in

### విక్టోరియా ఇండియా పీహెచ్‌డీ స్కాలర్‌షిప్

ఆస్ట్రేలియాలోని విక్టోరియా రాష్ట్ర ప్రభుత్వం.. ప్రతిభావంతులైన భారతీయ విద్యార్థులను ప్రోత్సహించడానికి విక్టోరియా ఇండియా పీహెచ్‌డీ స్కాలర్‌షిప్‌ను ప్రకటించింది. విక్టోరియా ప్రభుత్వం, ఆస్ట్రేలియా ఇండియా ఇన్‌స్టిట్యూట్‌లు సంయుక్తంగా ఈ స్కాలర్‌షిప్‌ను ఆఫర్ చేస్తున్నాయి. దీని ద్వారా విక్టోరియా రాష్ట్రంలో నిర్దేశించిన యూనివర్సిటీలలో భారతీయ విద్యార్థులకు పీహెచ్‌డీ చేసే అవకాశం ఉంటుంది. స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన విద్యార్థులకు ట్యూషన్ ఫీజు నుంచి మినహాయింపు లభిస్తుంది. అంతేకాకుండా నివాసం, ప్రయాణం, తదితర ఖర్చుల నిమిత్తం ఒక్కో విద్యార్థికి మూడేళ్లపాటు 90,000 ఆస్ట్రేలియన్ డాలర్లను చెల్లిస్తారు.

డయాబెటిస్ ప్రివెన్షన్, ఇన్వెస్టర్ ప్రొటెక్షన్ రెగ్యులేషన్ ఇన్ ది ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇండస్ట్రీ, నోవల్ మీన్స్ ఆఫ్ డ్రగ్ డెలివరీ, ఆప్టికల్ బ్రాడ్‌బాండ్ టెక్నాలజీస్, ట్రీట్‌మెంట్ ఆఫ్ లైవ్‌స్టాక్ డిసీజెస్ వంటి స్పెషలైజేషన్స్ అందుబాటులో ఉంటాయి.

**అర్హత:** భారతీయ పౌరులై ఉండాలి. పీహెచ్‌డీ వర్క్‌లో ఎక్కువ భాగం విక్టోరియాలో పూర్తి చేయాలి. ఆస్ట్రేలియన్ డాక్టోరేట్ డిగ్రీకి సమానమైన అర్హత కలిగి ఉండకూడదు. అకడెమిక్‌గా ఉన్నత స్థాయిలో ప్రతిభ చూపించాలి. భారత్-విక్టోరియా రెండు ప్రాంతాలకు ఉపయోగకరమైన అంశాలను ఎంపిక చేసుకోవాలి. ఎంపిక చేసుకున్న అంశంపై పీహెచ్‌డీ ప్రపోజల్స్ పంపించాలి. షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులను సెలక్షన్ కమిటీ ఎంపిక చేస్తుంది. ఎంపికైన అభ్యర్థులకు పీహెచ్‌డీ కాలంలో విక్టోరియా ప్రభుత్వం 90,000 ఆస్ట్రేలియన్ డాలర్లను అందజేస్తుంది.

దరఖాస్తులు: ఆగస్టు30, 2012నుంచి ప్రారంభమవుతాయి

దరఖాస్తులు స్వీకరణకు చివరి తేదీ: అక్టోబర్ 31,2012.

**అభ్యర్థులు ఎంచుకోవాల్సిన యూనివర్సిటీలు:**

- డీకిన్ యూనివర్సిటీ
- లాట్రోబ్ యూనివర్సిటీ
- మొనాష్ యూనివర్సిటీ
- ర్మిట్ యూనివర్సిటీ
- స్విన్‌బుర్న్ యూనివర్సిటీ
- యూనివర్సిటీ ఆఫ్ మెల్‌బోర్న్
- యూనివర్సిటీ ఆఫ్ బల్లార్ట్
- విక్టోరియా యూనివర్సిటీ
- ఆస్ట్రేలియన్ కేథలిక్ యూనివర్సిటీ

వివరాలకు: www.aii.unimelb.edu.au

### పశు సంవర్ధక శాఖలో ఖాళీలు

ఆంధ్రప్రదేశ్ పశు సంవర్థక శాఖ, వెటర్నరీ అసిస్టెంట్ పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది.

మొత్తం ఖాళీల సంఖ్య: 609 (క్లాస్-ఎ: 558, క్లాస్-బి: 21)

జోన్ల వారీగా ఖాళీల వివరాలు: జోన్-1: 71 (క్లాస్-ఎ: 70, క్లాస్-బి: 1), జోన్-2: 89 (క్లాస్-ఎ: 86, క్లాస్-బి: 3), జోన్-3: 371 (క్లాస్-ఎ: 70, క్లాస్-బి: 301), జోన్-4: 120 (క్లాస్-ఎ: 115, క్లాస్-బి: 5), జోన్-5: 104 (క్లాస్-ఎ: 99, క్లాస్-బి: 5), జోన్-6: 154 (క్లాస్-ఎ: 148, క్లాస్-బి: 6).

**అర్హత:** క్లాస్-ఎ: డిగ్రీ (యానిమల్ హజ్బెండరీ).

క్లాస్-బి: వెటర్నరీ సైన్స్ ఇన్ మైక్రోబయాలజీ/ పారాసైటాలజీ/ఎపిడిమాలజీ/వైరాలజీ/ఇమ్యునాలజీ/పాథాలజీ/బయోటెక్నాలజీలో పీజీ.

వయసు: 18 నుంచి 36 ఏళ్లు.

దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ: ఆగస్టు 20, 2012.

వివరాలకు: http://ahfd.ap.nic.in/

### విజయా బ్యాంక్

విజయా బ్యాంక్, క్లరికల్ కేడర్ పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది.

మొత్తం పోస్టుల సంఖ్య: 800

అర్హత: 50 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్/ తత్సమానం లేదా ఏదైనా డిగ్రీ.

వయసు: 18 నుంచి 28 ఏళ్లు.

ఎంపిక విధానం: ఐబీపీఎస్ కామన్ రిటెన్ ఎగ్జామ్ స్కోర్, ఇంటర్వ్యూ ఆధారంగా.

దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభం: ఆగస్టు 16, 2012.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ముగింపు: సెప్టెంబర్ 5, 2012.

వివరాలకు:
http://ibpsreg.sifyitest.com/vijayabkcl_aug12

ప్రతి గురువారం సాక్షితో ఉచితం 30-8-2012
Online Edition
www.sakshieducation.com/bhavitha.aspx
సాక్షి

# భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

Sakshi Bhavita TV Program on Facebook facebook.com/sakshibhavita

## ఏ టు జెడ్ అబౌట్ ఎంసెట్ ఇంజనీరింగ్ వెబ్ కౌన్సెలింగ్



5

INSIDE!

## BANK INTERVIEWS

### వ్యక్తిత్వం, గుణ గణాలకే పెద్దపీట



తాజాగా వివిధ బ్యాంకులు వివిధ విభాగాల్లో దాదాపు 3500 పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్లు విడుదల చేశాయి. ఐబీపీఎస్ కామన్ రిటెన్ ఎగ్జామ్‌లో అర్హత సాధిస్తే ఈ ఉద్యోగాలకు సంబంధించి తొలి దశను విజయవంతంగా చేధించినట్టే. మలి దశ ఇంటర్వ్యూను అధిగమిస్తే..సమున్నతమైన కెరీర్ మీ సొంతం.. ఈ నేపథ్యంలో.. ఇంటర్వ్యూ దశలో రాణించడానికి పాటించాల్సిన వ్యూహాలు.

4

# GATE 2013

The Graduate Aptitude Test in Engineering

దేశంలో ప్రతిష్టాత్మక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సీ)-బెంగళూరు, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్)లు సహా ఏ ఇన్‌స్టిట్యూట్‌లోనైనా.. గేట్ స్కోర్‌తో ఎంటెక్/పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశంతోపాటు.. పీఎస్‌యూలు ఎంట్రీలెవల్ రిక్రూట్‌మెంట్స్‌కు గేట్ స్కోర్‌ను ప్రాతిపదికగా తీసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో గేట్-2013 నోటిఫికేషన్.. వివరాలు.. ప్రిపరేషన్ ప్లాన్..

2

సీఎస్ఐఆర్- నెట్ సమాచారం.. ప్రిపరేషన్ వ్యూహాలు. 3

జూనియర్ ఇంటర్మీడియెట్ అకడెమిక్ గైడెన్స్.. మ్యాథమెటిక్స్, బయాలజీ 6,7

గ్రూప్-1 మెయిన్స్ జనరల్ ఎస్సే, పేపర్-2 ప్రశ్నలు-సమాధానాలు, మోడల్ పేపర్ 8,9

ఫార్మసీ కౌన్సిల్ ప్రెసిడెంట్ బి. సురేశ్‌తో ఇంటర్వ్యూ.. 11



ప్రతి ఆదివారం ఉదయం 9-30 నుంచి 10గంటల వరకు.. మీ సాక్షి టీవీలో

మీరు ఉద్యోగావకాశాల కోసం ఎదురు చూస్తున్నారా? ఏపీపీఎస్సీ గ్రూప్స్, సివిల్స్, బ్యాంక్స్ వంటి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారా? అయితే సాక్షి భవిత టీవీ ప్రోగ్రాం చూడండి

సాక్షి SAKSHI TV

వివిధ రంగాల్లో ఉపాధి.. కెరీర్ ఎంపికలో మెలకువలు.. తాజా ఉద్యోగాల సమాచారం.. అడ్మిషన్ల వివరాలు.. విద్యా సమాచారం.. స్కాలర్‌షిప్పుల వివరాలు... ఇంకా మరెన్నో...

భవిత

కెరీర్ ఎంపికలో దిక్సూచి.. భవిత! ఇకపై మీ సాక్షి టీవీలో
ప్రతి ఆదివారం ఉదయం 9-30 నుంచి 10గం.. వరకు



# విద్యతోపాటు ఉద్యోగావకాశాలకు 'గేట్'వే



శ్రీనివాస్ రెడ్డి
డైరెక్టర్, వాణి ఇన్‌స్టిట్యూషన్స్

**గేట్.. గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్.. ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్‌ల నుంచి ఇంజనీరింగ్‌లో మాస్టర్స్ చేయడానికి మార్గం.. కెరీర్‌లో ఉన్నత శిఖరాలను చేరుకోవడానికి మొదటి మెట్టు.. గతంలో గేట్ స్కోర్‌తో పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు మాత్రమే వీలుండేది.. కానీ ప్రస్తుతం.. పబ్లిక్ సెక్టార్ కంపెనీలు తమ సంస్థల్లో ఎంట్రీ లెవల్ నియామకాల కోసం 'గేట్' స్కోర్‌నే ప్రామాణికంగా తీసుకుంటున్నాయి.. డిగ్రీ పట్టా.. ఉద్యోగం.. ఈ రెండు లక్ష్యాలను.. ఒకే ఒక్క పరీక్షతో ఛేదించే అవకాశాన్ని కల్పిస్తున్న గేట్-2013 నోటిఫికేషన్ వెలువడింది.**

ఇటీవలి కాలంలో గేట్ స్కోర్ ప్రతిపాదికగా పీయూసీలు ఎంట్రీ లెవల్ రిక్రూట్‌మెంట్స్ చేపడుతుండడంతో.. విద్యతోపాటు ఉద్యోగావకాశాలకు గేట్'వే'గా మారింది. ఐఐఎస్సీ, ఏడు ఐఐటీలు కలిసి సంయుక్తంగా గేట్‌ను నిర్వహిస్తున్నాయి. గేట్-2013కు ఐఐటీ-బాంబే ఆర్గనైజింగ్ ఇన్‌స్టిట్యూట్‌గా వ్యవహరిస్తుంది.

### అర్హత:

ఇంజనీరింగ్/టెక్నాలజీ/ఆర్కిటెక్చర్(10+2తర్వాత నాలుగేళ్లు)లలో బ్యాచిలర్ డిగ్రీ. లేదా మ్యాథ్స్/సైన్స్/ స్టాటిస్టిక్స్/కంప్యూటర్ అప్లికేషన్ లేదా తత్సమాన విభాగంలో మాస్టర్ డిగ్రీ/చివరి సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. లేదా నిర్దేశించిన విధంగా ఇంజనీరింగ్/టెక్నాలజీ విభాగంలో ఇంటిగ్రేటెడ్ మాస్టర్ డిగ్రీ లేదా ఏఎంఐఈ వంటి ప్రొఫెషనల్ ఇన్‌స్టిట్యూట్ నుంచి బీఈ/బీటెక్ పూర్తి చేసి ఉండాలి.

### తాజా మార్పులు:

గతంలో మాదిరిగానే ఈ ఏడాది కూడా ప్రీ-ఫైనల్ ఇయర్ విద్యార్థులకు పరీక్ష రాసేందుకు అవకాశం లేదు.

- ఆన్‌లైన్‌కు ప్రాధాన్యత పెరిగింది. గతంలో కేవలం ఐదు పేపర్లను మాత్రమే ఆన్‌లైన్‌లో నిర్వహిస్తే.. ప్రస్తుతం ఏఈ, ఏజీ, ఏఆర్, బీటీ,సీఈ, సీహెచ్, సీవై, జీజీ, ఎంఏ, ఎంఎన్, ఎంటీ, పీహెచ్, టీఎఫ్, ఎక్స్‌ఈ, ఎక్స్‌ఎల్ మొత్తం 15 పేపర్లకు ఆన్‌లైన్ ఎగ్జామ్ ఉంటుంది.
- గేట్ స్కోర్ కాలిక్యులేషన్‌కు నూతన ఫార్ములాను అనుసరిస్తారు.
- పరీక్ష రోజు ర్యాండమ్‌గా అభ్యర్థుల బయోఇన్ఫర్మేటిక్ ఇన్ఫర్మేషన్(ఫోటో, ఫింగర్ ప్రింట్) సేకరిస్తారు.

### ఎగ్జామ్ ప్యాట్రన్:

మొత్తం 21 పేపర్లలో గేట్ పరీక్షను నిర్వహిస్తారు. అభ్యర్థి బ్రాంచ్‌కనుగుణంగా ఏదో ఒక సబ్జెక్టులో మాత్రమే పరీక్షకు హాజరు కావాలి. ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహించే పరీక్షలో మూడు గంటల్లో సమాధానాలను గుర్తించాలి. ఆన్‌లైన్.. మినహా మిగతా పేపర్లకు మాత్రం బ్లాక్ బాల్ పాయింట్ పెన్నుతో ఓఆర్‌ఎస్(ఆప్టికల్ రెస్పాన్స్ షీట్)లో సమాధానాలను గుర్తించాలి. 65 ప్రశ్నలు ఉంటాయి. కేటాయించిన మార్కులు 100. ఇందులో సంబంధిత సిలబస్‌తోపాటు జనరల్ ఆప్టిట్యూడ్(జీఏ) విభాగం నుంచి కూడా ప్రశ్నలు అడుగుతారు. జీఏ నుంచి ఉండే 10 ప్రశ్నల్లో.. లాంగ్వేజ్, అనలిటికల్ స్కిల్స్‌పై ప్రశ్నలు వస్తాయి. వీటికి 15 మార్కులు కేటాయించారు. మిగతా ప్రశ్నలు సంబంధిత బ్రాంచ్ సిలబస్ నుంచి వస్తాయి.

### నాలుగు రకాల ప్రశ్నలు:

మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు, కామన్ డేటా, లింక్‌డ్ ప్రశ్నలు, న్యూమరికల్ ఆన్సర్ అనే నాలుగు రకాల ప్రశ్నలు ఉంటాయి. 1-25 వరకు ఉన్న ప్రశ్నలకు 1 మార్కు, 26-55 వరకు ఉన్న ప్రశ్నలకు 2 మార్కుల చొప్పున కేటాయించారు. 56-65 వరకు జనరల్ ఆప్టిట్యూడ్ ప్రశ్నలు ఉంటాయి. 56-60 ఉన్న ప్రశ్నలకు 1 మార్కు, 61-65 ఉన్న ప్రశ్నలకు 2 మార్కులు చొప్పున కేటాయించారు. 48-51 కామన్ డేటా ప్రశ్నలు, 52-55 వరకు లింక్‌డ్ ప్రశ్నలు ఎదురవుతాయి. నెగిటివ్ మార్కింగ్ కూడా ఉంటుంది.

### రివ్యూ 2012

గేట్ 2012కు దేశ వ్యాప్తంగా 7 లక్షల మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వీరిలో 6 లక్షలపై చిలుకు విద్యార్థులు పరీక్షకు హాజరైతే.. లక్ష మందికి పైగా క్వాలిఫై అయ్యారు. ఐఐటీ-మద్రాస్ జోన్ నుంచి 17 వేల మంది అర్హత సాధించారు.

బ్రాంచ్‌ల వారీగా 2012 కటాఫ్‌లను పరిశీలిస్తే..

| బ్రాంచ్ | కటాఫ్ |
|---|---|
| సీఎస్‌ఈ అండ్ ఐటీ | 25 |
| ఈసీఈ | 26.11 |
| ఈఈఈ | 26.11 |
| కెమికల్ | 26.9 |
| సివిల్ | 25 |
| మెకానికల్ | 30.81 |
| ఏరోస్పేస్ | 30.80 |

### ప్రాధాన్యత:

ఐఐటీ, ఐఐఎస్సీ, నిట్, సహా అన్ని ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్‌లలో పీజీ, నిర్దేశించిన కోర్సుల్లో ప్రవేశానికి గేట్ స్కోర్ ప్రామాణికం. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ (ఎంహెచ్‌ఆర్‌డీ) సహాయంతో నడిచే ఇన్‌స్టిట్యూట్స్‌లో ఇంజనీరింగ్/ టెక్నాలజీ/ ఆర్కిటెక్చర్, సంబంధిత సైన్స్ సబ్జెక్టుల్లో, మాస్టర్స్, పీహెచ్‌డీల్లో చేరిన విద్యార్థులు స్కాలర్‌షిప్స్/ఫెలోషిప్‌లు అందుకోవడానికి గేట్ స్కోర్ ప్రామాణికం. ఐఐటీ, ఐఐఎస్సీలలో ఎంటెక్ విద్యార్థులకు నెలకు రూ. 8 వేల స్కాలర్‌షిప్ వస్తుంది. పీహెచ్‌డీలో చేరేందుకు కూడా గేట్ స్కోర్ ఉపయోగపడుతుంది. గేట్ స్కోర్‌తో ఏ కాలేజీలో ఎంటెక్ కోర్సులో చేరినా యూజీసీ నెలకు రూ. 5వేల స్కాలర్‌షిప్‌ను అందజేస్తుంది.

### రిక్రూట్‌మెంట్‌కు కూడా:

ప్రతిష్టాత్మక సంస్థ ఆధ్వర్యంలో.. పారదర్శకతతో కూడిన నిర్వహణ కావడంతో పలు పబ్లిక్ సెక్టార్ కంపెనీలు ఎంట్రీ లెవల్ రిక్రూట్‌మెంట్ కోసం గేట్ స్కోర్‌ను ప్రామాణికంగా తీసుకుంటున్నాయి. బార్క్, భారత అణుశక్తి శాఖలోని కొన్ని విభాగాలు, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్‌లు.. గేట్ స్కోర్ ఆధారంగానే ఎంట్రీ లెవల్ ఉద్యోగులను భర్తీ చేసుకుంటున్నాయి. రిక్రూట్‌మెంట్స్ కోసం ఆయా సంస్థలకు వేర్వేరుగా దరఖాస్తు చేసుకోవాలి. గేట్ స్కోరును ప్రామాణికంగా తీసుకున్నప్పటికీ.. పూర్తి స్థాయిలో ఆ స్కోరు ఆధారంగానే అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇవ్వడం లేదు. అధిక శాతం వెయిటేజీ మాత్రం ఇస్తున్నాయి. దాదాపు 75 శాతం వెయిటేజీని గేట్ స్కోరుకు ఇచ్చి మిగతా 25 శాతం వెయిటేజీని ఇంటర్వ్యూ/గ్రూప్ డిస్కషన్‌లకు కేటాయిస్తున్నాయి. నోటిఫికేషన్ సమయంలో ఆ వివరాలను వెబ్‌సైట్‌లో పేర్కొంటాయి.

### భవిష్యత్తు అద్భుతం



గేట్ ద్వారా ఇంజనీరింగ్‌లో పీజీ చేస్తే భవిష్యత్తు అద్భుతం. ప్రస్తుతం పీజీ, పీహెచ్‌డీ చదివిన ఇంజనీరింగ్ విద్యార్థుల అవసరం చాలా ఉంది. బీటెక్ తర్వాత ఉద్యోగాలు వస్తుండడంతో ఇంజనీరింగ్‌లో ఉన్నత విద్య వైపు దృష్టి సారిస్తున్న వారి సంఖ్య చాలా తక్కువ. పీజీ చదివే విద్యార్థులు కేవలం మార్కుల కోసమే కాకుండా పరిశోధనాత్మక దృక్పథం, దీక్షతో చదివితే కెరీర్లో అత్యున్నత స్థాయికి ఎదగవచ్చు. గేట్‌కు ప్రిపేరవుతున్న విద్యార్థులు క్రమశిక్షణతో, సబ్జెక్టుపై పట్టుతో కాన్సెప్ట్యువల్‌గా చదివితే మంచి ర్యాంకు సాధించవచ్చు. పీజీ స్థాయి నుంచే పరిశోధనలపై విద్యార్థులు దృష్టి సారిస్తే ఇంజనీరింగ్‌లో ఉపయోగకరమైన ఆవిష్కరణలు చేయవచ్చు.

ప్రొఫెసర్ వి.ఎస్.రావు, డైరెక్టర్,
బిట్స్ పిలానీ, హైదరాబాద్ క్యాంపస్

### ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్ పెంచుకోవాలి

ఇంజనీరింగ్‌లో నాలుగేళ్లు ప్రణాళికా బద్ధంగా చదివితే గేట్‌లో సులభంగానే విజయం సాధించవచ్చు. సబ్జెక్ట్ పరంగా టెక్నికల్ నాలెడ్జ్‌ను పరీక్షించే విధంగా ప్రశ్నలు వస్తాయి. రెగ్యులర్‌గా క్లాసులకు హాజరవుతూ.. లెక్చరర్స్‌ను ఫాలో అవుతూంటే.. ఎటువంటి కోచింగ్ అవసరం లేకుండా గేట్‌లో మంచి స్కోర్ చేయవచ్చు. సబ్జెక్ట్‌పై పూర్తి పట్టు సాధించడం ద్వారానే ఇది సాధ్యం. చాలా మంది విద్యార్థులు మార్కెట్లో లభించే పుస్తకాల్లోని బిట్స్‌ను ఆబ్జెక్టివ్‌గా ప్రిపేర్ అవుతుంటారు. అలాకాకుండా కాన్సెప్ట్, ఫార్ములా ఆధారంగా ప్రాబ్లమ్ సాల్వ్ చేసే స్కిల్ పెంచుకోవాలి. వీలైనంత ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి. గతంలో కేవలం ఎంటెక్ కోర్సుల్లో ప్రవేశం కోసమే గేట్ స్కోర్‌ను ఉపయోగించుకునేవారు. ప్రస్తుతం పీయూసీలతోపాటు పలు కంపెనీలు గేట్ స్కోర్ ప్రతిపాదికన రిక్రూట్ చేసుకుంటున్నాయి. కాబట్టి ఉద్యోగ సాధనలో కూడా ఈ స్కోర్ కీలకమనే అంశాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రిపేర్ కావాలి.

నరేష్ గద్దపాటి,
ఎంటెక్ (కెమికల్), ఐఐటీ-రూర్కీ.

## ప్రిపరేషన్

గేట్ పరీక్ష ప్రధానంగా సంబంధిత బ్రాంచ్‌లో అభ్యర్థిలోని ప్రాథమిక పరిజ్ఞానాన్ని పరీక్షిస్తుంది. సబ్జెక్ట్‌లోని బేసిక్స్, ఫండమెంటల్స్‌పై అవగాహన స్థాయిని తెలుసుకునే విధంగా ప్రశ్నలు వస్తాయి. కాబట్టి అంశాలవారీగా, సబ్జెక్టులవారీగా, ముఖ్యమైన నిర్వచనాలు, ఫార్ములాలపై పట్టు సాధించాలి. ప్రతి ప్రాబ్లమ్‌ను కాన్సెప్ట్, ఫార్ములాను ఆధారం చేసుకొని సాధన చేయాలి. వీలైనంత ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి. దీనివల్ల సమయం ఆదా అవుతుంది. స్వీయ విశ్లేషణ సాధ్యపడుతుంది.

- బేసిక్ ఇంజనీరింగ్ సబ్జెక్టులపై పట్టు సాధించాక.. మిగతా సబ్జెక్టుల ప్రిపరేషన్‌ను ఒక ప్రణాళిక ప్రకారం పూర్తిచేసుకోవాలి. ప్రశ్నలు డెరివేషన్స్, అప్లికేషన్స్ పద్ధతిలో ఉంటాయి. కాబట్టి బట్టీ తరహా విధానాలు ఏ మాత్రం ఉపకరించవని గుర్తుంచుకోవాలి.
- తర్వాత ప్రీవియస్ పేపర్లను సాధించాలి. మాక్ టెస్ట్‌లు, అందుబాటులో ఉన్న అన్ని రకాల నమూనా పరీక్షలకు హాజరు కావాలి. దీని వల్ల ఎగ్జామ్ ప్యాట్రన్, ఏ విధమైన ప్రశ్నలు అడుగుతున్నారు.. అనే దానిపై అవగాహన వస్తుంది. అంతేకాకుండా ప్రిపరేషన్ పరంగా మన బలాలు- బలహీనతలు తెలుస్తాయి.
- మాక్ టెస్ట్‌లకు హాజరు కావడం ద్వారా టైమ్ మేనేజ్‌మెంట్ కూడా అలవడుతుంది. ఎంత సమయంలో ఎన్ని ప్రశ్నలకు సమాధానం చేయగలుగుతున్నారో తెలుస్తుంది. తద్వారా మరింత వేగంగా సమాధానం ఇచ్చే విధంగా ప్రిపరేషన్ సాగించవచ్చు.

### రిఫరెన్స్ బుక్స్:

**Electrical Engineering**

- Electronic Measurements: A.K. SAHANI
- Digital Electronics: 1. JAIN; 2. MORRIS MANO
- Power Electronics: 1. RASHID; 2. SINGH, K.B. KHANCHANDNI
- Electrical Machine: 1. NAGRA TH & KOTARI; 2. P.S. BIMBRA

**ECE:**

- Network Theory: 1. V AN V ALKENBURG; 2. HYTE KIMBERLY
- Electronic Devices and Circuits: 1. L. BOYLESTAD; 2. SEDRA AND SMITH
- Electromagnetic field Theory: 1. HA YTE (EEE); 2. KRAUS (ECE)
- Control System: 1. I.J. NAGRA TH & GOPAL; 2. B.C.KUO
- Signals and Systems: 1. OPPENHEIM; 2. SCHUM SERIES
- Digital Electronics: 1. JAIN; 2. MORRIS MANO
- Communication Systems: 1. SAMEN HAIKIS; 2. SCHAMS SERIES
- Micro Processor 8085: GOANKAR

**Computer Engineering / (IT)**

- Programming: Kanithkar
- Data Structure: Allenweiss
- Algorithms: Sahni
- Formal Languages: Ullman (TOC)
- Compiler Design: Ravi Sethi
- Soft ware Engineering: Pressman
- Computer Networks : Tannen Baum

**Mechanical Engineering / (IT)**

1. Engineering Mechanics: Timoshenko & Young; 2. Theory of Machines: Ghosh and Mallik, S.S.Rattan; 3. Vibrations: M.P. Groover; 4. Design of Machines: J.E. Shigley, V.B. Bhandari; 5. Fluid Mechanics: K.Subramanya, A.K.Jain; 6. Heat Transfer: R.C.Sachdeva

### గేట్-2013 సమాచారం:

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

ముఖ్య తేదీలు:

- ఆన్‌లైన్‌లో దరఖాస్తు ప్రారంభం: సెప్టెంబర్ 1, 2012
- ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబర్ 30, 2012
- ప్రింట్ అవుట్‌ను పంపేందుకు చివరి తేదీ: అక్టోబర్ 8, 2012

పరీక్ష తేదీలు:

- ఆన్‌లైన్ పేపర్లు: జనవరి 20, 2013
- ఆఫ్‌లైన్ పేపర్లు: ఫిబ్రవరి 10, 2013
- ఫలితాల వెల్లడి: మార్చి 15, 2013

వివరాలకు: www.gate.iitb.ac.in

CSIR - UGC NET - Dec. 2012

# భావి శాస్త్రవేత్తలకు.. సీఎస్ఐఆర్ - నెట్



జె.వి. చంద్రమోహన్
డైరెక్టర్, ఎరుడైట్ విద్యా సంస్థలు,
హైదరాబాద్

**పరిశోధనలే ప్రగతికి సోపానాలు. పరిశోధకులుగా లేదా యూనివర్సిటీల్లో బోధకులుగా స్థిరపడాలంటే పీహెచ్‌డీ తప్పనిసరి. సీఎస్ఐఆర్ - నెట్‌లో జేఆర్ఎఫ్ అవకాశం దక్కితే దేశంలో పేరున్న ఐఐటీలు/ఎన్ఐటీలు/ యూనివర్సిటీలు/ లేబొరేటరీల్లో పరిశోధనలతోపాటు నెలకు రూ.16,000 స్టైఫండ్‌గా పొందొచ్చు. నెట్ లెక్చరర్‌షిప్‌నకు అర్హత సాధిస్తే డిగ్రీ కళాశాలల్లో లెక్చరర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈసారి నిర్వహించనున్న 'నెట్'లో కొన్ని మార్పులు, చేర్పులు జరిగాయి. ఈ నేపథ్యంలో సీఎస్ఐఆర్-నెట్ పరీక్ష విధానంపై ఫోకస్...**

కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్) ఏడాదికి రెండుసార్లు జాయింట్ సీఎస్ఐఆర్-యూజీసీ నెట్‌ను నిర్వహిస్తుంది. అటు దేశవ్యాప్తంగా ఉన్న వివిధ యూనివర్సిటీలు, కళాశాలల్లో లెక్చరర్‌గా అడుగుపెట్టాలన్నా... ఇటు దేశంలో ఐఐటీలు, వివిధ ఆర్ అండ్ డీ ఇన్‌స్టిట్యూషన్స్‌లో పీహెచ్‌డీ చేస్తూ ప్రతి నెలా జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ పొందాలన్నా నెట్‌లో ఉత్తీర్ణత తప్పనిసరి.

### పరీక్షాంశాలు:

మొత్తం ఆరు అంశాల్లో పరీక్ష నిర్వహిస్తారు. అవి.. కెమికల్ సైన్సెస్, ఎర్త్ సైన్సెస్, లైఫ్ సైన్సెస్, మ్యాథమెటికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్, ఇంజనీరింగ్ సైన్సెస్. అభ్యర్థి పీజీలో చదివిన సబ్జెక్టులకు సంబంధించిన అంశంపై పరీక్ష రాసుకోవచ్చు.

### విభాగాలు-సబ్జెక్టులు:

- **కెమికల్ సైన్సెస్:** ఎనలిటికల్ కెమిస్ట్రీ; ఇనార్గానిక్ కెమిస్ట్రీ; ఆర్గానిక్ కెమిస్ట్రీ; ఫిజికల్ కెమిస్ట్రీ మొదలైనవి.
- **ఎర్త్ సైన్సెస్:** జియాలజీ; జియోఫిజిక్స్; మెటియరాలజీ; ఓషనోగ్రఫీ; ఫిజికల్ జియోగ్రఫీ మొదలైనవి.
- **లైఫ్ సైన్సెస్:** బయో కెమిస్ట్రీ; బయో డైవర్సిటీ అండ్ టాక్సానమీ; బయో టెక్నాలజీ; బోటనీ;జెనెటిక్స్; మైక్రో బయాలజీ; ఫిజియాలజీ; జువాలజీ మొదలైనవి.
- **మ్యాథమెటికల్ సైన్సెస్:** అప్లైడ్ మ్యాథమెటిక్స్; ప్యూర్ మ్యాథమెటిక్స్; స్టాటిస్టిక్స్ మొదలైనవి.
- **ఫిజికల్ సైన్సెస్:** అటామిక్ అండ్ మాలిక్యులర్ ఫిజిక్స్; క్లాసికల్ డైనమిక్స్; కండెన్స్‌డ్ మేటర్ ఫిజిక్స్; ఎలక్ట్రో మ్యాగ్నటిక్స్; ఎక్స్‌పెరిమెంటల్ డిజైన్; ఎలక్ట్రానిక్స్; న్యూక్లియర్ అండ్ పార్టికల్ ఫిజిక్స్; క్వాంటం ఫిజిక్స్; థర్మో డైనమిక్స్ మొదలైనవి.
- **ఇంజనీరింగ్ సైన్సెస్:** ఏరోస్పేస్; సివిల్; కెమికల్; కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ; ఈసీఈ; ఎలక్ట్రికల్; ఇన్‌స్ట్రుమెంటేషన్; మెకానికల్; మైనింగ్; మెటలర్జికల్ ఇంజనీరింగ్ మొదలైనవి.

**అర్హత:** నాలుగేళ్ల బీఎస్ ప్రోగ్రామ్/బీఈ/బీటెక్/బీఫార్మ్/ఎంబీబీఎస్/ఇంటిగ్రేటెడ్ బీఎస్-ఎంఎస్/ఎమ్మెస్సీలో జనరల్, ఓబీసీ విద్యార్థులు 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత. ఎస్సీ, ఎస్టీలు, శారీరక వికలాంగులకు 50 శాతం. చివరి సంవత్సరం పరీక్షలు రాయనున్న విద్యార్థులూ అర్హులే.

**వయసు:** జేఆర్ఎఫ్ కోసం: జూలై 1, 2012 నాటికి 28 ఏళ్లు మించరాదు. ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, వికలాంగులు, మహిళలకు వయోపరిమితిలో ఐదేళ్లు సడలింపు ఉంటుంది.

**లెక్చరర్‌షిప్ కోసం:** ఎలాంటి వయోపరిమితి లేదు.

### తాజా మార్పు.. ఇంజనీరింగ్ సైన్సెస్:

ఈ ఏడాది డిసెంబర్‌లో జరగనున్న సీఎస్ఐఆర్-నెట్‌కు సంబంధించి కొన్ని మార్పులు జరిగాయి. ఇంతకు ముందు వరకు కెమికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్, మ్యాథమెటికల్ సైన్సెస్, లైఫ్ సైన్సెస్, ఎర్త్ సైన్సెస్‌లలో మాత్రమే పరీక్ష నిర్వహిస్తుండగా.. తాజాగా ఇంజనీరింగ్ సైన్సెస్‌ను కూడా చేర్చారు.

### సిలబస్‌లోనూ మార్పులు.. చేర్పులు:

సీఎస్ఐఆర్-నెట్ పరీక్షలో అందరికీ కామన్ పేపర్ అయిన పార్ట్-ఎకు సంబంధించిన సిలబస్ మారింది. ఇంతకు ముందు జనరల్ సైన్స్, క్వాంటిటేటివ్ రీజనింగ్ అండ్ ఎనాలిసిస్, రీసెర్చ్ ఆప్టిట్యూడ్ ఉండగా.. ఈసారిలాజికల్ రీజనింగ్, గ్రాఫికల్ ఎనాలిసిస్, ఎనలిటికల్ అండ్ న్యూమరికల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ కంపారిజన్, సిరీస్ ఫార్మేషన్, పజిల్స్‌పై జనరల్ ఆప్టిట్యూడ్‌ని పరీక్షించేలా ప్రశ్నలుంటాయి. అయితే ప్రశ్నల సంఖ్యలో.. మార్కుల విధానంలో ఎలాంటి మార్పు లేదు. పార్ట్-ఏలో మొత్తం 20 ప్రశ్నలలో 15 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. ఒక్కో ప్రశ్నకు రెండు మార్కులు.

### లైఫ్ సైన్సెస్‌లో బీటెక్ విద్యార్థులకు అవకాశం:

లైఫ్ సైన్సెస్‌లో కేవలం ఎంఎస్సీ విద్యార్థులే కాకుండా బీటెక్ బయో టెక్నాలజీ/బయో ఇన్ఫర్మేటిక్స్/బయో మెడికల్ ఇంజనీరింగ్/బీఫార్మసీ/బీఎస్సీ (అగ్రికల్చర్) విద్యార్థులు కూడా పోటీపడొచ్చు.

### పరీక్ష విధానం:

మొత్తం 200 మార్కులు. అన్నీ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలే ఉంటాయి. వ్యవధి 3 గంటలు. ఇంజనీరింగ్ సైన్సెస్ మినహా మిగిలిన అన్ని సబ్జెక్టులకు ప్రశ్నపత్రం హిందీ, ఇంగ్లిష్ మాధ్యమాల్లో ఉంటుంది. ప్రశ్నపత్రంలో మూడు భాగాలుంటాయి. అవి...

**పార్ట్-ఎ:** ఈ విభాగం అందరికీ కామన్. ఇందులో లాజికల్ రీజనింగ్, గ్రాఫికల్ అనాలిసిస్, ఎనలిటికల్ అండ్ న్యూమరికల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ కంపారిజన్స్, సిరీస్ ఫార్మేషన్, పజిల్స్ వంటి అంశాల్లో విద్యార్థి జనరల్ ఆప్టిట్యూడ్‌ను పరీక్షించేలా ప్రశ్నలుంటాయి. ఈ విభాగం నుంచి అడిగే 20 ప్రశ్నల్లో ఏవైనా 15 ప్రశ్నలకు సమాధానం రాయాలి. ఒక్కో ప్రశ్నకు రెండు మార్కులు.



**పార్ట్-బి:** అభ్యర్థి ఎంచుకున్న సబ్జెక్టుపై ఉంటుంది. ఆయా సబ్జెక్టులలో అభ్యర్థికున్న పరిజ్ఞానాన్ని ప్రశ్నించే విధంగా ప్రశ్నలుంటాయి. సిలబస్‌లోని అన్ని టాపిక్‌లకు సంబంధించిన ప్రశ్నలు ఈ విభాగంలో వస్తాయి. అయితే అభ్యర్థి ఎంచుకున్న సబ్జెక్టును బట్టి ప్రశ్నల సంఖ్య మారుతుంది.

**కెమికల్ సైన్సెస్; ఎర్త్ సైన్సెస్; లైఫ్ సైన్సెస్:** అభ్యర్థి ఎంచుకున్న సబ్జెక్టుని బట్టి ఈ విభాగాలలో ఒక్కోదానిలో మొత్తం 50 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలుంటాయి. ఏవైనా 35 ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలి. ఒక్కో ప్రశ్నకు రెండు మార్కులు. పార్ట్-బి మొత్తం మార్కులు 70.

**మ్యాథమెటికల్ సైన్సెస్:** ఇందులో 40 ప్రశ్నలుంటాయి. ఇందులో ఏవైనా 25 ప్రశ్నలకు సమాధానాలు గుర్తిస్తే సరిపోతుంది. ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు. మొత్తం మార్కులు 75.

**ఫిజికల్ సైన్సెస్; ఇంజనీరింగ్ సైన్సెస్:** ఇందులో మొత్తం 25 ప్రశ్నలుంటాయి. అభ్యర్థి ఏవైనా 20 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. ఒక్కో ప్రశ్నకు 3.5 మార్కులు. మొత్తం మార్కులు 70.

**పార్ట్-సి:** అభ్యర్థి ఎంచుకున్న సబ్జెక్టుపై ప్రశ్నలుంటాయి. ఆయా సబ్జెక్టులలో అభ్యర్థి పరిజ్ఞానాన్ని పరీక్షించే విధంగా, సమస్య పూరకమైన ప్రశ్నలు ఎక్కువ ఉంటాయి. పార్ట్-సిలో కూడా అభ్యర్థి ఎంచుకున్న సబ్జెక్టును బట్టి ప్రశ్నల సంఖ్యలో మార్పులుంటాయి.

**కెమికల్ సైన్సెస్; లైఫ్ సైన్సెస్:** ఇందులో మొత్తం 75 ప్రశ్నలుంటాయి. ఏవైనా 25 ప్రశ్నలకు సమాధానాలు గుర్తిస్తే సరిపోతుంది. ఒక్కో ప్రశ్నకు 4 మార్కులు.

**ఎర్త్ సైన్సెస్:** ఇందులో మొత్తం 40 ప్రశ్నలుంటాయి. వీటిల్లో ఏవైనా పది ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలి. ఒక్కో ప్రశ్నకు 10 మార్కులు.

**మ్యాథమెటికల్ సైన్సెస్:** ఇందులో మొత్తం 60 ప్రశ్నలుంటాయి. ఏవైనా 20 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. ఒక్కో ప్రశ్నకు 4.75 మార్కులు.

**ఫిజికల్ సైన్సెస్:** ఇందులో మొత్తం 30 ప్రశ్నలుంటాయి. ఏవైనా 20 ప్రశ్నలకు సమాధానాలు ఇస్తే సరిపోతుంది. ఒక్కో ప్రశ్నకు 5 మార్కులు.

**ఇంజనీరింగ్ సైన్సెస్:** మొత్తం 70 ప్రశ్నలుంటాయి. ఇందులో ఏవైనా 20 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. ఒక్కో ప్రశ్నకు 5 మార్కులు.

### ఫెలోషిప్:

మొదటి రెండేళ్లు నెలకు ₹16,000 చెల్లిస్తారు. ఏడాదికి ఒకసారి కాంటిన్‌జెన్సీ గ్రాంట్‌గా ₹20,000 చెల్లిస్తారు. ఆ తర్వాత ప్రతిభ ఆధారంగా మూడో సంవత్సరంలో సీనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ (ఎస్ఆర్ఎఫ్) హోదా కల్పించి నెలకు ₹18,000 చెల్లిస్తారు. గరిష్టంగా ఐదేళ్ల వరకు ఫెలోషిప్ లభిస్తుంది.

### మరో చక్కని అవకాశం డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ ఫెలోషిప్:

సీఎస్ఐఆర్ నెట్ పరీక్షలో మంచి మెరిట్ మార్కులు సాధించిన విద్యార్థులకు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ ప్రత్యేక ఫెలోషిప్‌ను అందిస్తున్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించడంతోపాటు పరిశోధనలు చేసే విద్యార్థులను ప్రోత్సహించడం ఈ ఫెలోషిప్ ఉద్దేశం. దీనిద్వారా మొదటి రెండేళ్లు నెలకు ₹20000 స్టైఫండ్ ఇస్తారు.

విద్యార్థి ప్రతిభను బట్టి గరిష్టంగా ఐదేళ్ల వరకు ఈ ఫెలోషిప్‌ను అందిస్తారు. మూడో ఏడాది నుంచి నెలకు ₹24000 ఇవ్వడంతోపాటు ఏడాదికి ₹70,000 కాంటిన్‌జెన్సీ గ్రాంట్ కూడా చెల్లిస్తారు.

**దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. నిర్దేశిత ఇండియన్ బ్యాంక్ బ్రాంచ్‌లలో జనరల్ అభ్యర్థులు ₹400,ఓబీసీలు(నాన్ క్రీమీలేయర్) ₹200, ఎస్సీ, ఎస్టీ, వికలాంగులు ₹100 చెల్లించి ఇన్ఫర్మేషన్ బులెటిన్, దరఖాస్తు పొందొచ్చు.

**రాష్ట్రంలో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, గుంటూరు

### ముఖ్య తేదీలు:

ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రారంభం: ఆగస్టు 21, 2012
ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: సెప్టెంబర్ 19, 2012
ప్రింటవుట్ దరఖాస్తులను పంపడానికి చివరి తేదీ: సెప్టెంబర్ 24, 2012
పరీక్ష తేదీ: డిసెంబర్ 23, 2012 (ఆదివారం)
వెబ్‌సైట్: www.csirhrdg.res.in

### ఉత్తీర్ణత శాతం చాలా తక్కువ.. ఎందుకు?

మనరాష్ట్రం నుంచి ఏటా దాదాపు 30,000 మంది సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ రాస్తున్నారు. ఈ ఏడాది నుంచి కొత్తగా ఇంజనీరింగ్ సైన్సెస్‌ను కూడా చేర్చడంతో ఆ సంఖ్య పెరిగే అవకాశాలున్నాయి. అత్యధికంగా కెమికల్ సైన్సెస్ విభాగాన్ని ఎంచుకుంటున్నారు. ఉత్తీర్ణత శాతం మాత్రం 2 శాతం మించడం లేదు. జాతీయస్థాయిలో రాసినవారిలో 4 శాతం మంది మాత్రమే ఉత్తీర్ణులవుతున్నారు. దీనికి కారణం ఎక్కువ మంది విద్యార్థులకు సబ్జెక్టుపై పట్టు లేకపోవడమే. ఇంతకుముందు మన రాష్ట్రంలో బీఎస్సీ (ఆనర్స్) కోర్సు ఉండేది. తర్వాత కాలంలో ఈ కోర్సును తొలగించారు. బీఎస్సీ ఆనర్స్‌లో ఏ సబ్జెక్టునైతే ఎంచుకుంటామో ఆ సబ్జెక్టుకు చెందిన పేపర్లు ఎక్కువగా ఉంటాయి. దానివల్ల ఆ సబ్జెక్టును విస్తృతంగా చదవాల్సి ఉంటుంది. దాంతో విద్యార్థులకు సబ్జెక్టుపై అసాధారణ పట్టు లభిస్తుంది. సాధారణ బీఎస్సీ డిగ్రీలో మూడు సబ్జెక్టులు చదవాల్సి రావడం వల్ల ఒకే సబ్జెక్టుపై విద్యార్థులు దృష్టి సారించలేకపోతున్నారు. బీఎస్సీ ఆనర్స్‌ను మళ్లీ ప్రవేశపెడితే పరిశోధనలు చేయాలనుకునే విద్యార్థులకు మేలు కలుగుతుంది. డిగ్రీలో మొదటి ఏడాది నుంచే సబ్జెక్టు ఓరియెంటేషన్‌తో చదవడంతోపాటు ప్రాక్టికల్స్‌కు పెద్దపీట వేయాలి. పీజీలోనూ ఇదేవిధంగా చేస్తే సీఐఎస్ఆర్-నెట్‌లో సులువుగా విజయం సాధించొచ్చు.

### ప్రిపరేషన్ ప్లాన్

పార్ట్-ఎ అందరికీ కామన్‌గా ఉంటుంది. ఇందులో అత్యధిక మార్కులు సాధించాలంటే.. బేసిక్ మ్యాథమెటిక్స్, అర్థమెటిక్స్, స్టాటిస్టిక్స్, ప్రాబబిలిటీ, మెన్సురేషన్, జామెట్రీ, బేసిక్ న్యూమరికల్ ఆప్టిట్యూడ్, వెర్బల్, నాన్ వెర్బల్, గ్రాఫ్స్ ఆధారిత ప్రశ్నలు ఉంటాయి. ఇవన్నీ కూడా సైన్స్ ఓరియెంటేషన్‌తో సమస్యసాధన పూరకంగా ఉంటాయి. టాటా మెక్‌గ్రాహిల్, ఆర్ఎస్ అగర్వాల్ బుక్స్ కొంతవరకు ఉపయోగపడతాయి. కోచింగ్ ఇన్‌స్టిట్యూట్స్‌లో సొంతంగా తయారుచేసిన మెటీరియల్ అందిస్తారు.

విద్యార్థి ఎంచుకున్న సబ్జెక్ట్ ఆధారంగా ప్రశ్నలు అడిగే పార్ట్-బి, పార్ట్-సి లలో అత్యధిక మార్కులు సాధించాలంటే ఆయా సబ్జెక్టుల్లో వచ్చిన ఇంటర్నేషనల్ ఎడిషన్స్‌తోపాటు సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్స్ రాసిన పుస్తకాలను చదవాలి. వీటితోపాటు డిగ్రీ, పీజీ ప్రామాణిక పాఠ్యపుస్తకాలను అధ్యయనం చేస్తే అత్యధిక మార్కులు సాధించొచ్చు.

పోటీ పరీక్షార్థులకు సమాచార స్ఫూర్తి... భవిత! ఇకపై మీ సాక్షి టీవీలో
ప్రతి ఆదివారం ఉదయం 9-30 నుంచి 10గం.. వరకు

Bank Interview Guidance

# వ్యక్తిత్వం, గుణగణాలకే పెద్దపీట

**ప్రస్తుత జాబ్ మార్కెట్‌లో.. బ్యాంకింగ్ రంగానిదే హవా.. గత కొంత కాలంగా విస్తరిస్తున్న సేవలు.. పెరుగుతున్న అవసరాలకనుగుణంగా సిబ్బంది నియామకం కోసం బ్యాంకులు వివిధ విభాగాల్లో వేల పోస్టులను భర్తీ చేస్తున్నాయి. ఇటీవలి కాలంలో పలు బ్యాంకులు దాదాపు 3500 పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్లు విడుదల చేశాయి. ఐబీపీఎస్ కామన్ రిటెన్ ఎగ్జామ్‌లో అర్హత సాధిస్తే ఈ ఉద్యోగాలకు సంబంధించి తొలి దశను విజయవంతంగా ఛేదించినట్టే. మలి దశ ఇంటర్వ్యూను అధిగమిస్తే.. సమున్నతమైన కెరీర్ సొంతమవుతుంది.. ఈ నేపథ్యంలో.. ఇంటర్వ్యూ దశలో రాణించడానికి పాటించాల్సిన వ్యూహాలు..**



ఇంటర్వ్యూను ఉద్యోగం సాధించే చక్కటి వేదికగా భావించాలి. అప్పుడే ఆత్మవిశ్వాసంతో ఇంటర్వ్యూ చేయవచ్చు. ఇంటర్వ్యూ బోర్డులో సాధారణంగా సైకాలజిస్ట్‌తో కలిపి నలుగురు సభ్యులు ఉంటారు. ఈ సైకాలజిస్ట్ మీ కదలికలను నిరంతరం పరిశీలిస్తుంటారు. బ్యాంకింగ్ రంగంపై మీ ఆసక్తి.. ఇందులోకి రావడానికి కారణం..ఈ రంగానికి సరితూగుతారా? లేదా? అనే లక్షణాలకు ఇంటర్వ్యూలో ప్రాధాన్యతనిస్తారు. అదే విధంగా మీ వ్యక్తిత్వాన్ని కూడా అంచనా వేస్తారు.

### ఎటువంటి ప్రశ్నలు:

ఇంటర్వ్యూ సమయం 15-20 నిమిషాలు ఉంటుంది. అన్ని బ్యాంకుల ఇంటర్వ్యూల్లో అభ్యర్థిలోని ఎమోషనల్ కోషియెంట్‌ను పరిశీలిస్తారు. జాబ్‌కు సరిపడ స్కిల్స్ ఉన్నాయా? వ్యక్తిగత నేపథ్యం? కరెంట్ అఫైర్స్? బ్యాంకింగ్ రంగంపై మీకు ఉన్న అవగాహనను పరీక్షించే ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు అందించిన రెజ్యుమే ఆధారంగా కూడా ప్రశ్నలడిగే అవకాశాలున్నాయి. ఈ క్రమంలో.. మీ గురించి చెప్పండి? బ్యాంకింగ్ రంగాన్ని కెరీర్‌గా ఎంచుకోవడానికి కారణం? వ్యక్తిగత, అకడెమిక్ నేపథ్యం? బ్యాంకింగ్ ఆపరేషన్స్-పదజాలంపై ప్రశ్నలు? బలాలు, బలహీనతలకు సంబంధించిన ప్రశ్నలు? రాబోయే పదేళ్లలో కెరీర్‌ను ఏ విధంగా ప్లాన్ చేసుకోవాలనుకుంటున్నారు? ఇటీవలి కాలంలో జాతీయంగా, అంతర్జాతీయంగా చోటు చేసుకున్న సంఘటనలపై ప్రశ్నలు ఎదురవుతాయి. జాబ్ ప్రొఫైల్, ఉద్యోగ అనుభవం ఉన్నవారిని, రంగం మారుతున్న వారిని సంబంధిత రంగాలకి సంబంధించి ప్రశ్నలు అడిగే అవకాశముంది.

రిక్రూట్‌మెంట్ విధానం బ్యాంకు, పోస్టును బట్టి వేర్వేరుగా ఉంటుంది. క్లరికల్ కేడర్ పోస్టులను మాత్రం ఐబీపీఎస్ స్కోర్, ఇంటర్వ్యూ ద్వారా భర్తీ చేస్తారు. పీఓ/మేనేజ్‌మెంట్ ట్రైనీ/స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల రిక్రూట్‌మెంట్ మాత్రం ఐబీపీఎస్ స్కోర్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ఉంటుంది. స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టులకు నిర్వహించే ఇంటర్వ్యూలో పోస్టును బట్టి ప్రొఫెషనల్/టెక్నికల్ నాలెడ్జ్‌ను కూడా పరీక్షిస్తారు.

### ఉదాహరణలతో:

ఇంటర్వ్యూలో అభ్యర్థులు అన్ని ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలని.. అన్నీ తెలిసి ఉండాలని ఏ బోర్డు సభ్యుడూ ఆశించరు. అభ్యర్థి తనకు తెలిసిన విషయాలను ఆర్గనైజ్ చేసుకొని సమాధానం చెప్పాలి. విమర్శనాత్మక ధోరణి కాకుండా సమాధానం 'బ్యాలెన్స్‌డ్'గా ఉండాలి. సమాధానాలకు ఒకట్రెండు ఉదాహరణలు జోడిస్తే పోటీలో మీరొక అడుగు ముందుకేసినట్లే. అభ్యర్థిలోని సహనాన్ని పరీక్షించడానికి కొన్నిసార్లు ఉద్దేశపూర్వకంగానే విసిగించే ప్రశ్నలు అడిగే అవకాశాముంటుంది. అలాంటి ప్రశ్నలు ఎదురైనప్పుడు సహనం కోల్పోకుండా స్పందించడం ఎంతో ప్రధానం. ముఖ్యంగా అభ్యర్థులు కరెంట్ అఫైర్స్‌లో పొరపాటు చేస్తుంటారు. కాబట్టి ఈ అంశంపై దృష్టి పెట్టాలి. ఇంటర్వ్యూ తేదీకి ముందు ఏడాది కాలంలో రాష్ట్రంలో, దేశం, ప్రపంచంలో చోటు చేసుకున్న సంఘటనలపై అవగాహన కలిగి ఉండాలి. అదేవిధంగా అభ్యర్థులు తమ స్వస్థలానికి ఉన్న ప్రాధాన్యత, ఇటీవల అక్కడ సంభవించిన ప్రధాన సంఘటనలను తెలుసుకోవాలి. బ్యాంకింగ్ రంగంలో వాడే పదాలు.. సీఆర్ఆర్, ఆర్ఆర్ఆర్, రూపాయి విలువలో హెచ్చుతగ్గులు, ఎస్ఎల్ఆర్, వడ్డీ రేట్ల హెచ్చుతగ్గులు, అకౌంట్స్, బ్యాంకింగ్ ఆపరేషన్స్ గురించి అవగాహన పెంచుకోవాలి. ఏ బ్యాంకులో ఇంటర్వ్యూకు వెళుతున్నారో.. ఆ బ్యాంకు ప్రొఫైల్ తెలుసుకోవాలి. భారత ఆర్థిక వ్యవస్థ, ఆర్థిక వ్యవస్థలో బ్యాంకింగ్ రంగం పాత్ర, ద్రవ్యపరపతి విధానం, బ్యాంకులందించే సేవల గురించి కూడా అవగాహన పెంచుకోవాలి. ఇంటర్వ్యూ రోజు.. ఆ రోజు న్యూస్ పేపర్లలో వచ్చిన వార్తల నుంచి కచ్చితంగా ప్రశ్నలు వస్తాయి. కాబట్టి దీనిపై విధిగా దృష్టి సారించాలి.

### స్కిల్స్‌కే పెద్ద పీట:

అభ్యర్థి గుణగణాలను, వ్యక్తిత్వాన్ని పరీక్షించేందుకే పెద్ద పీట వేస్తారు. కమ్యూనికేషన్ స్కిల్స్, ఇతరులతో ప్రవర్తించే తీరు, క్లిష్ట పరిస్థితుల్లో అభ్యర్థి స్పందన, ఆప్టిట్యూడ్, నిరంతరం కొత్త విషయాలను నేర్చుకోవాలనే తపన, సందర్భానుసారంగా సమయస్ఫూర్తిగా వ్యవహరించడం, జట్టుతో కలిసి పనిచేయడం, ఆలోచనలో స్పష్టత, ఉన్నత స్థానాలను నిర్వహించే సామర్థ్యం వంటి అంశాలను క్షుణ్నంగా పరిశీలిస్తారు. వీటిపైనే విజయం ఆధారపడి ఉంటుంది. హాబీస్ కూడా కీలక పాత్ర పోషిస్తాయి. వీటి ఆధారంగా మీ వ్యక్తిత్వంపై ఒక అంచనాకు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి ఈ విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలి.

### ఫిజికల్ అపీయరెన్స్:

ఫిజికల్ అపీరియెన్స్ కూడా కీలక పాత్ర పోషిస్తుంది. 'ఫస్ట్ ఇంప్రెషన్ ఈజ్ బెస్ట్ ఇంప్రెషన్'.. అభ్యర్థులు కచ్చితంగా గుర్తుంచుకోవాల్సిన విషయం. కాబట్టి ఇంటర్వ్యూ రోజు అభ్యర్థి తనను తాను ప్రెజెంట్ చేసుకునే క్రమంలో దుస్తుల దగ్గర్నుండి పాదరక్షల వరకు పలు అంశాల్లో జాగ్రత్తలు తీసుకోవాలి. ఫ్యాషనబుల్ కాకుండా హుందాగా ఉండేలా ఫార్మల్ దుస్తులను మాత్రమే ధరించాలి. పురుష అభ్యర్థులైతే విధిగా ఇన్‌షర్ట్ చేయడంతోపాటు ఫార్మల్ షూస్ వేసుకోవాలి. మహిళా అభ్యర్థులైతే సల్వార్ కమీజ్ లేదా చీరను ధరించాలి. ప్రొబేషనరీ/స్పెషలిస్ట్ ఆఫీసర్ ఉద్యోగానికి వెళ్తుంటే మాత్రం కనీసం టై అవసరం.

### గ్రామర్ కాదు ప్రధానం:

ఇంటర్వ్యూ పూర్తిగా ఇంగ్లిష్ భాషలోనే ఉంటుంది. సమాధానాలను ఇచ్చే క్రమంలో ఇంగ్లిష్ నుంచి ఇతర భాష/మాతృ భాషలోకి ఏ విధంగా మారకూడదు. ఇంటర్వ్యూలో ముఖ్యంగా కమ్యూనికేషన్ స్కిల్స్‌ను టెస్ట్ చేస్తారు. సమాధానాన్ని ఎంత స్పష్టంగా, సూటిగా, ఆత్మవిశ్వాసంతో ప్రజెంట్ చేస్తున్నారనే అంశానికి మాత్రమే ప్రాధాన్యత ఇస్తారు. కాబట్టి గ్రామర్ ఎర్రర్స్‌ను పట్టించుకోకుండా సమాధానాన్ని సూటిగా చెప్పాలి. ఇంటర్వ్యూ చివర్లో స్థానిక భాష/మాతృ భాషలో మీ సామర్థ్యాన్ని పరీక్షించడానికి ఒకటి, రెండు ప్రశ్నలు వేస్తారు. వాటికి బోర్డు అనుమతితో సంబంధిత భాషలోనే సమాధానం చెప్పాలి.

### ఇంటర్వ్యూ గదిలో:

బోర్డ్ గదిలోకి వెళ్లేముందు ఒకసారి తలుపు తట్టి లోపలికి రావచ్చా అని అడిగి లోపలికి వెళ్లాలి. లోపలికి వెళ్లిన తర్వాత వారిని గ్రీట్ చేసి, వారు కూర్చోమనేవరకు ఎదురు చూసి, తర్వాత నిర్దేశించిన స్థానంలో కూర్చోవాలి. అలా కూర్చునేటప్పుడు మరీ బిగదీసుకుని కాకుండా ప్లీజింగ్‌గా కనిపిస్తూ కూర్చోవాలి. ఇంటర్వ్యూ బోర్డు సభ్యులకు సమాధానాలిచ్చేటప్పుడు వారి కళ్ల వైపు చూస్తూ మాట్లాడాలి. ఏ సభ్యుడి ప్రశ్నకు సమాధానం ఇస్తే వారి వంకే చూడాలి. ఇంటర్వ్యూ ముగిశాక బయటకు వచ్చే ముందు మరొకసారి బోర్డుకి కృతజ్ఞతలు చెప్పి బయటకు రావాలి.

### ప్రతి కదలికను పరిశీలిస్తారు



ఇంటర్వ్యూ దాదాపు 15 నుంచి 25 నిమిషాలు ఉంటుంది. ఇంటర్వ్యూ ప్యానల్‌లో నలుగురు సభ్యులు ఉంటారు. రెజ్యుమే ఆధారంగా ప్రశ్నలు అడుగుతారు. మొత్తం ఇంగ్లిష్‌లోనే ఉంటుంది. ఇంటర్వ్యూ హాల్‌లోకి ప్రవేశించినప్పటి నుంచి.. పూర్తయ్యే వరకు పూర్తిగా ఆత్మవిశ్వాసంతో ఉండాలి. బోర్డు సభ్యులు మన ప్రతి కదలికను క్షుణ్నంగా పరిశీలిస్తుంటారు. కాబట్టి సమయస్ఫూర్తిగా వ్యవహరించాలి. మొదట మన ప్రొఫైల్‌కు సంబంధించిన ప్రశ్నలు, తర్వాత ఈ రంగాన్ని కెరీర్‌గా ఎంచుకోవడానికి కారణం? ప్రీవియస్ జాబ్ ఎక్స్‌పీరియెన్స్ ఉంటే దానికి సంబంధించిన సమాచారం తెలుసుకుంటారు. కరెంట్ అఫైర్స్‌పై కూడా ప్రశ్నలు వేస్తారు. చాలా మంది అభ్యర్థులు ఈ అంశంలోనే సరిగా సమాధానాలు చెప్పలేకపోతున్నారు. కాబట్టి ఈ అంశంపై దృష్టి సారించాలి. ఇంటర్వ్యూ రోజు న్యూస్ పేపర్లలో వచ్చిన వార్తల నుంచి కచ్చితంగా ప్రశ్నలు వస్తాయి. బ్యాంకింగ్ ఆపరేషన్స్‌పై అవగాహనను కూడా పరిశీలిస్తారు. బ్యాంకింగ్ రేట్లు..రెపో రేట్లు, ఎస్ఎల్ఆర్, సీఆర్ఆర్ తరహా అంశాలను క్షుణ్నంగా తెలుసుకోవాలి. ఎటువంటి తడబాటు లేకుండా సూటిగా, స్పష్టంగా సమాధానాలు చెప్పాలి. డ్రెస్సింగ్ సెన్స్ కూడా ముఖ్యం. ఏదైనా ప్రశ్నకు సమాధానం తెలియకపోతే..తెలియదు, రాదు, గుర్తులేదు తరహాలో కాకుండా "Actually I have an idea about this topic but unfortunately unable to recollect at present" అని సమాధానం ఇవ్వాలి.

రాము సిద్దోజు, ఎస్‌బీహెచ్-పులిచర్ల

| డోన్ట్స్ | డూస్ |
|---|---|
| ▪ వాచ్ వైపు చూసుకోవడం. | ▪ ప్యానల్ సభ్యులందరి వైపు చూస్తూ విష్ చేయాలి. |
| ▪ జుట్టుపై చేయి పెట్టుకోవడం. | ▪ ప్రశాంతంగా ఉండాలి. |
| ▪ శబ్దం చేసే షూస్ ధరించడం. | ▪ ఆ రోజు పేపర్ క్షుణ్నంగా చదవడం అవసరం. |
| ▪ టేబుల్‌పై చేతులు పెట్టడం. | |
| ▪ శరీరాన్ని కదిలించడం. | |
| ▪ బిగ్గరగా నవ్వడం. | |
| ▪ వేరే ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నట్టు చెప్పడం. | |

### సూటిగా, సరళంగా, స్పష్టంగా



బ్యాంకుల్లో రిక్రూట్‌మెంట్ కోసం నిర్వహించే ఇంటర్వ్యూ ఏ విధంగా ఉంటుంది? ఎలాంటి ప్రశ్నలు అడుగుతారు? సక్సెస్ సాధించటం కష్టమా? ఇటువంటి సందేహాలు సాధారణంగా ఆశావహుల్లో మెదులుతుంటాయి. ఇక్కడ గమనించాల్సిన అంశం.. బ్యాంకింగ్ రంగం ఇతర రంగాలకు భిన్నమైంది కాదు. ఇతర రంగాల్లోని ఇంటర్వ్యూ ప్రక్రియనే ఇక్కడ అనుసరిస్తారు. క్లరికల్ కేడర్ పోస్టుల్లో నేర్చుకునే లక్షణాలు ఉన్న అభ్యర్థికి పెద్ద పీట వేస్తారు. పీఓ/స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టులకు మాత్రం నిర్వహణ సామర్థ్యాన్ని ప్రధానంగా పరిశీలిస్తారు. ఇంటర్వ్యూలో గ్రామర్‌కు పెద్ద ప్రాధాన్యం ఉండదు. సూటిగా, సరళంగా, స్పష్టంగా ఏ విధంగా సమాధానాన్ని ప్రెజెంట్ చేస్తున్నారనే అంశాన్ని పరిశీలిస్తారు. వ్యక్తిగత నేపథ్యం, కెరీర్ ప్లానింగ్, బ్యాంకింగ్ పదజాలం-ఆపరేషన్స్‌తోపాటు కరెంట్ అఫైర్స్, జీకే అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. కరెంట్ అఫైర్స్, జీకేపై ఎక్కువ దృష్టి సారించాలి.

మనోజ్ సేథీ, టైమ్ ఇన్‌స్టిట్యూట్, హైదరాబాద్.

### తాజా నోటిఫికేషన్లు

**విజయా బ్యాంక్**
ప్రొబేషనరీ క్లరికల్ కేడర్
పోస్టుల సంఖ్య: 800
కటాఫ్ స్కోర్: జనరల్-156, ఎస్సీ-146, ఎస్టీ-136, ఓబీసీ- 151, పీడబ్ల్యూడీ-105.
వివరాలకు: http://ibpsreg.sifyitest.com/vijayabkcl_aug12/

**అలహాబాద్ బ్యాంక్**
క్లరికల్ కేడర్(సింగిల్ విండో ఆపరేటర్)
పోస్టుల సంఖ్య: 1100
కటాఫ్ స్కోర్: 120 రిజర్వ్‌డ్-105
వివరాలకు: www.allahabadbank.com

**ఇండియన్ బ్యాంక్**
మొత్తం ఖాళీలు: 215
కటాఫ్ స్కోర్:
లీగల్ ఆఫీసర్: 121 (రిజర్వ్‌డ్-113)
కంప్యూటర్/ఐటీ ఆఫీసర్: 134 (రిజర్వ్‌డ్-125)
రూరల్ డెవలప్‌మెంట్/అసిస్టెంట్ మేనేజర్ (అగ్రికల్చరల్): 112 (రిజర్వ్‌డ్-104)
రాజ్‌భాష అధికారి/హిందీ ఆఫీసర్/అసిస్టెంట్ మేనేజర్ (ఓఎల్): 96 (రిజర్వ్‌డ్-90)
వివరాలకు: www.indianbank.in

**కర్ణాటక బ్యాంక్**
క్లరికల్ కేడర్ - పోస్టుల సంఖ్య: 1000
కటాఫ్ స్కోర్: 120
వివరాలకు:
http://ibpsreg.sifyitest.com/krtkcl_aug12

**కార్పొరేషన్ బ్యాంక్**
పోస్టుల సంఖ్య: 431
కటాఫ్ స్కోర్:
పర్సనల్ ఆఫీసర్: జనరల్-124, రిజర్వ్‌డ్-114.
ఐటీ ఆఫీసర్: జనరల్-128, రిజర్వ్‌డ్-120.
అగ్రికల్చరల్ ఫీల్డ్ ఆఫీసర్:
జనరల్-112, రిజర్వ్‌డ్-104.
ఆఫీషియల్ లాంగ్వేజ్ ఆఫీసర్:
జనరల్-96, రిజర్వ్‌డ్-90.
లా మేనేజర్: జనరల్-121 రిజర్వ్‌డ్-113
వివరాలకు: www.corpbank.com

EAMCET - 2012 Web Counselling

# ఎంసెట్ వెబ్ కౌన్సెలింగ్... విధి విధానాలు

రాష్ట్రంలో లక్షలాదిమంది విద్యార్థులు ఎంతో ఉత్కంఠగా ఎదురు చూస్తున్న ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ ప్రారంభమైంది. వివిధ దశలతో కూడిన వెబ్ కౌన్సెలింగ్‌లో రిజిస్ట్రేషన్ నుంచి సీట్ అలాట్‌మెంట్ వరకు ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా జాగ్రత్తగా ఆప్షన్స్ ఇవ్వాలి. ఈ నేపథ్యంలో వెబ్ కౌన్సెలింగ్‌లో దశలు.. జాగ్రత్తలు..



### 1 రిజిస్ట్రేషన్:

కౌన్సెలింగ్‌కు రాష్ట్రవ్యాప్తంగా 53 సహాయక కేంద్రాలను ఏర్పాటు చేశారు. దగ్గరలోని ఏదైనా హెల్ప్‌లైన్ సెంటర్‌కు వెళ్లి సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరు కావాలి. తర్వాత ర్యాంకుల వారీగా ప్రాధాన్య క్రమంలో విద్యార్థులను పిలుస్తారు. అక్కడ ఉండే అధికారికి మీ ఎంసెట్ ర్యాంకు కార్డు ఇవ్వాలి. మీ ర్యాంకును పిలిచిన వెంటనే రిజిస్ట్రేషన్- కౌన్సెలింగ్ ఫీజు చెల్లించి రశీదు తీసుకుని మీ సెల్‌ఫోన్ నంబర్‌ను నమోదు చేయించుకోవాలి. కంప్యూటర్ ఆపరేటర్ నుంచి 'రిజిస్ట్రేషన్, వెరిఫికేషన్ ఫారమ్' తీసుకోండి. అందులో ఫోన్‌నెంబర్ సరిగా నమోదు అయిందో లేదో చూడండి. లాగ్‌ఇన్ ఐడీ నెంబర్ కలిగిన స్క్రాచ్ కార్డ్ మీకు ఇస్తారు. కళాశాలల ఎంపిక కోసం ఆప్షన్లను నమోదు చేయడానికి తప్పనిసరిగా ఇది మీకు కావాలి. అనంతరం మీ హాల్ టికెట్ నెంబరు, ర్యాంకును రిజిస్టర్‌లో రాసి సంతకం చేయాలి. దాంతో మీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది.

### 2 సర్టిఫికెట్ల వెరిఫికేషన్:

మీకు అందజేసిన రిజిస్ట్రేషన్, వెరిఫికేషన్ ఫారమ్‌లోని మీ వివరాలను సరి చూసుకోవాలి. పేరు, లోకల్ ఏరియా, మేల్/ఫిమేల్, కేటగిరీ, మైనారిటీ, ప్రత్యేక రిజర్వేషన్ కేటగిరీ, పుట్టిన తేదీ, ఫోన్ నెంబర్, స్క్రాచ్ కార్డ్ నెంబర్, ఫీజు రీయింబర్స్‌మెంట్ అర్హత ఉందో? లేదో వంటి వివరాలు సరిగా ఉన్నయో లేదో చెక్ చేసుకుని.. తప్పులుంటే వెరిఫికేషన్ ఆఫీసర్ వద్ద వెంటనే సరిదిద్దించుకోవాలి. అక్కడ ఇద్దరు అధికారులుంటారు. వారిలో ఒక అధికారి ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థుల కుల ధ్రువీకరణ పత్రాలను చూస్తారు. ఆ తర్వాత వేరొక అధికారి ర్యాంకు కార్డు, హాల్ టికెట్, మార్కుల మెమో, స్టడీ సర్టిఫికెట్, ఆదాయ సర్టిఫికెట్‌లను పరిశీలిస్తారు. ఓసీ కేటగిరీ అభ్యర్థులు మాత్రం నేరుగా సర్టిఫికెట్ వెరిఫికేషన్ అధికారి దగ్గరకు వెళ్లాలి. ఇదంతా పూర్తయ్యాక మీ నుంచి తీసుకున్న మొత్తం సర్టిఫికెట్లకు సంబంధించి ఓ రశీదు ఇస్తారు. తర్వాత బ్రాంచ్, కాలేజీకి సంబంధించిన సూచనల కోసం బ్రీఫింగ్ హాల్‌కు వెళ్లాలి.

### 3 ఆప్షన్స్ ఇవ్వడంలో ప్రాధాన్యాలపై సూచనలు:

ఇన్ఫర్మేషన్ బుక్‌లెట్‌లో పేర్కొన్న కాలేజీలు, అవి ఆఫర్ చేసే బ్రాంచ్‌లతోపాటు ఇతర సమాచారం పరిశీలించాలి. ఇది మీరు కాలేజీలను ప్రాధాన్య క్రమంలో ఎంచుకోవడానికి తోడ్పడుతుంది. ఆప్షన్స్ ఇవ్వడం అంటే.. మీరు చేరాలనుకుంటున్న కాలేజీ, బ్రాంచ్‌లను ప్రాధాన్య క్రమంలో పేర్కొనడమే. కీలకమైన కాలేజీల కోడ్ పట్టిక, ఆయా కాలేజీలు ఆఫర్ చేస్తున్న బ్రాంచ్‌ల కోడ్స్, మాన్యువల్ ఆప్షన్ ఫారమ్‌ను బ్రీఫింగ్ అధికారి నుంచి తీసుకోవాలి. ఆయన ఆప్షన్లు ఇచ్చే ప్రక్రియను, మాన్యువల్ ఆప్షన్ ఫారమ్‌ను నింపే విధానాన్ని వివరిస్తారు.

### 4 ఆప్షన్లు ఇచ్చే ప్రక్రియపై కసరత్తు:

ఎంచుకోవాలనుకునే బ్రాంచ్ కోడ్, జిల్లా కోడ్, కాలేజ్ కోడ్‌ను మాన్యువల్ ఆప్షన్ ఫారంలో మీ ప్రాధమ్యాలవారీగా రాయాలి. మొదటి ప్రాధమ్యంగా జేఎన్‌టీయూ కళాశాలలో సీఎస్ఈ కోర్సులో చేరాలి అని భావిస్తే ఆ కాలేజీకి ఎదురుగా ఉన్న సీఎస్ఈ బ్రాంచ్ కింద ఉన్న బాక్స్‌లో (1) అని సూచించాలి. రెండో ఆప్షన్‌గా మెకానికల్ ఇంజనీరింగ్‌లో చేరాలనుకుంటే... ఆప్షన్ నెంబర్‌ను (2)గా పేర్కొనాలి. తద్వారా సీఎస్ఈ బ్రాంచ్‌లో ఖాళీ లేకుంటే.. సీటు అలాట్‌మెంట్ కోసం మెకానికల్ బ్రాంచ్‌ను పరిగణనలోకి తీసుకుంటారు. ఆప్షన్ల సంఖ్య క్రమంలో ఆయా కాలేజీలు, కోర్సుల్లో ఖాళీలు, లోకల్ ఏరియా, కులం, ర్యాంక్, మేల్/ఫిమేల్ అంశాలపై సీట్ ఎలాట్‌మెంట్ ఉంటుంది. కాబట్టి అభ్యర్థి తాను చేరదల్చుకున్న కళాశాలలకు వీలైనన్ని ఎక్కువ ఆప్షన్లను ఇచ్చుకోవాలి. ఒకే కాలేజీకి సంబంధించిన కోర్సులను ఒకే క్రమంలో కాకుండా వివిధ క్రమ సంఖ్యల వద్ద ఎంచుకోవచ్చు. మాన్యువల్ ఆప్షన్ ఫారాన్ని దగ్గర ఉంచుకుని అత్యంత ప్రాధాన్యత ఉన్న కళాశాలల ఆప్షన్లను ముందు క్రమంలో పేర్కొనాలి.

### 5 ఇంటర్నెట్ ద్వారా ఆప్షన్లు ఇచ్చే ప్రక్రియ:

ఇంటర్నెట్ ద్వారా మీ ఆప్షన్లు ఎంచుకునే విధానం ఇక్కడ ఉంటుంది. హెల్ప్‌లైన్ సెంటర్, లేదా ఇంటర్నెట్ కేఫ్, లేదా ఇంట్లోనే ఇంటర్నెట్ ద్వారా ఆప్షన్లు ఇవ్వొచ్చు. విద్యార్థి తాను చేరాలనుకునే కాలేజీ, బ్రాంచ్ ఆప్షన్ వంటి వివరాలతో నింపిన మాన్యువల్ ఫారంను చూసుకుంటూ.. ఇంటర్నెట్ ద్వారా కంప్యూటర్ స్క్రీన్‌పై ఆప్షన్స్ ఎంటర్ చేయాలి.

#### ఆప్షన్స్‌ను స్క్రీన్‌పై ఎలా ఎంటర్ చేయాలి?

ఇంటర్నెట్‌లో http://apeamcet.nic.in వెబ్‌సైట్ ఓపెన్ చేయాలి. హోంపేజీలో... వెబ్ కౌన్సెలింగ్, క్యాండిడేట్స్ రిజిస్ట్రేషన్ ఫర్ వెబ్ కౌన్సెలింగ్, క్యాండిడేట్స్ లాగిన్ తదితర సమాచారం ఉంటుంది. 'క్యాండిడేట్స్ లాగిన్'ను ఎంచుకొని ఆప్షన్లు ఇవ్వడానికి ముందు 'క్యాండిడేట్స్ రిజిస్ట్రేషన్'పై క్లిక్ చేసి రిజిస్ట్రేషన్ నంబర్, ఎంసెట్ హాల్‌టికెట్ నంబర్, ఎంసెట్ ర్యాంక్, పుట్టిన తేదీ వివరాలను నమోదు చేయాలి. తర్వాత 'జనరేట్ పాస్‌వర్డ్'పై క్లిక్ చేయాలి. అలాగే ఎంటర్ పాస్‌వర్డ్ బాక్సులో కనీసం 8 క్యారెక్టర్ల పాస్‌వర్డ్ ఎంటర్ చేయాలి. ఆ 8 క్యారెక్టర్లలో కనీసం ఒకటైనా కచ్చితంగా అంకె అయి ఉండాలి. ఉదాహరణకు EAMCET12, ALEKHY A9. అదే పాస్‌వర్డ్‌ను రీఎంటర్ పాస్‌వర్డ్‌లో ఇంకోసారి ఎంటర్ చేయాలి. తర్వాత మొబైల్ నెంబర్, ఈమెయిల్ ఐడీ ఎంటర్ చేయాలి. అనంతరం 'సేవ్ పాస్‌వర్డ్'పై క్లిక్ చేయాలి. రిజిస్ట్రేషన్ పూర్తయ్యాక 'లాగ్ అవుట్'పై క్లిక్ చేయాలి. దీంతో 'క్యాండిడేట్స్ రిజిస్ట్రేషన్' ప్రక్రియ పూర్తవుతుంది. ఆ తర్వాత హోంపేజీకి వెళ్లి 'క్యాండిడేట్స్ లాగిన్' ఆప్షన్స్‌ను క్లిక్ చేయాలి.

#### ఆప్షన్లు ఇలా:

'క్యాండిడేట్స్ లాగిన్' అనేదానిలో స్క్రాచ్ కార్డ్ మీద ఉన్న లాగిన్ ఐడీ నెంబర్, ఎంసెట్ హాల్ టికెట్ నంబర్, పాస్‌వర్డ్, పుట్టిన తేదీ వివరాలు నమోదుచేసి 'సైన్‌ఇన్' మీద క్లిక్ చేయాలి. ఇదయ్యాక కంప్యూటర్‌పై డిస్‌ప్లే అయ్యే సూచనలను, డిక్లరేషన్ పరిశీలించి 'చెక్‌బాక్స్'పై క్లిక్ చేసి కన్ఫర్మ్ చేయాలి. తర్వాత 'ఆప్షన్ ఎంట్రీ ఫారం' లేదా 'హెల్ప్ స్క్రీన్' మీద క్లిక్ చేస్తే మెనూ ఐటమ్స్ స్క్రీన్‌పై కనిపిస్తాయి. వీటిని చదివాక 'Click here to Enter Options' బటన్‌ను క్లిక్ చేస్తే... వివిధ జిల్లాల 'చెక్ బాక్సెస్' స్క్రీన్ మీద కనిపిస్తాయి. ఆప్షన్స్ ఎంచుకునే స్క్రీన్ కనిపించడం కోసం 'Display Option Entry form' మీద క్లిక్ చేయాలి. 'ఆప్షన్ ఎంట్రీ' పూర్తయ్యాక 'సేవ్ ఆప్షన్స్'పై క్లిక్ చేయాలి. ఆప్షన్స్ ఇచ్చిన ప్రతిసారి 'సేవ్ ఆప్షన్'ను క్లిక్ చేస్తుండాలి. ఇచ్చిన ఆప్షన్స్‌ను 'వ్యూ అండ్ ప్రింట్ ఆప్షన్'ను క్లిక్ చేసి చూసుకోవచ్చు. తర్వాత 'సేవ్ అండ్ లాగ్ అవుట్' మీద క్లిక్ చేస్తే.. ఆ సమయం వరకూ చేర్చిన ఆప్షన్ల వివరాలు సేవ్ అయి స్క్రీన్‌పై వస్తాయి. విద్యార్థి ఇచ్చిన ఆప్షన్లను ఎన్నిసార్లయినా మార్చుకోవచ్చు. గడువు చివరి రోజున అభ్యర్థి ఇచ్చిన ఆప్షన్స్‌ను ఫ్రీజ్ చేస్తారు. వీటిని మార్చాలనుకుంటే.. నిర్ణీత తేదీలోగా ఒకసారి మాత్రమే మార్చుకోవచ్చు.

### 6 సీట్ అలాట్‌మెంట్:

నిర్దేశించిన తేదీన విద్యార్థి మెరిట్, కేటగిరీ, సెక్స్, లోకల్ ఏరియా మొదలైనవాటి ఆధారంగా సీట్ల కేటాయింపు జరుగుతుంది. ఇదే ఫైనల్ అలాట్‌మెంట్. దీన్ని డౌన్‌లోడ్ చేసుకోవాలి. మొదటి విడత కౌన్సెలింగ్‌లో సీట్ రాకపోతే రెండో విడత కౌన్సెలింగ్‌కు హాజరుకావచ్చు. మొదటిసారి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేసుకున్నట్లయితే రెండోవిడత కౌన్సెలింగ్‌కు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ అవసరం లేదు. లేదంటే సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాలి. సీటు వచ్చినా దాంతో మీరు సంతృప్తి చెందకపోతే..రెండో విడత కౌన్సెలింగ్‌లో పాల్గొనొచ్చు.

### 7 ఫీజుల చెల్లింపు:

సీట్ల కేటాయింపు జరిగాక ఫీజు చెల్లించేందుకు చలాన్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఈ చలాన్ ద్వారా ఫీజును ఆంధ్రాబ్యాంక్/ఇండియన్ బ్యాంక్ ఏ శాఖలోనైనా చెల్లించి రసీదు పొందాలి.

### 8 కళాశాలలో చేరడం:

ఫీజు చెల్లించాక నిర్దేశిత గడువు తేదీలోగా సీట్ అలాట్‌మెంట్ ఆర్డరు, ఫీజు రశీదు చూపించి మీకు కేటాయించిన కాలేజీలో జాయినింగ్ రిపోర్ట్ ఇవ్వాలి. లేకపోతే సీటు రద్దవుతుంది. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హులైన వారు సీట్ అలాట్‌మెంట్ ఆర్డర్‌తో కాలేజీలో చేరాచ్చు.

#### ముఖ్య తేదీలు:

**సర్టిఫికెట్ల వెరిఫికేషన్:**

ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 6 వరకు
ఆగస్టు 30-45001-60,000 ర్యాంకు వరకు
ఆగస్టు 31-60,001-80,000 ర్యాంకు వరకు
సెప్టెంబర్ 1-80,001-1,00,000 ర్యాంకు వరకు
సెప్టెంబర్ 2-1,00,001-120000 ర్యాంకు వరకు
సెప్టెంబర్ 3-120001-140000 ర్యాంకు వరకు
సెప్టెంబర్ 4-140001-160000 ర్యాంకు వరకు
సెప్టెంబర్ 5-160001-180000 ర్యాంకు వరకు
సెప్టెంబర్ 6-180001- చివరి ర్యాంకు వరకు

**ఆప్షన్ల ఎంట్రీ:**

ఆగస్టు 30, 31 (1 నుంచి 40,000 ర్యాంకు వరకు)
సెప్టెంబర్ 1, 2 (40,001 నుంచి 75,000)
సెప్టెంబర్ 3, 4 (75001 నుంచి 105000)
సెప్టెంబర్ 5, 6 (105001 నుంచి 155000)
సెప్టెంబర్ 7, 8 (155001 నుంచి చివరి ర్యాంకు వరకు)

**ఆప్షన్ల మార్పు:**

సెప్టెంబర్ 9, 10 తేదీల్లో

**సీట్ ఎలాట్‌మెంట్:**

సెప్టెంబర్ 12, 2012

సందేహాల నివృత్తికి టోల్ ఫ్రీ నెంబర్: 1800-425-8368
వెబ్‌సైట్: www.apeamcet.nic.in

### ఫీజులు.. ఫీజు రీయింబర్స్‌మెంట్ విధివిధానాలు

గందరగోళం.. అయోమయం నడుమ ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం వృత్తి విద్యా కళాశాలలకు ఫీజులు నిర్ధారించింది. ప్రస్తుత విద్యా సంవత్సరానికి మాత్రమే ఈ ఫీజులు ఉంటాయని ప్రభుత్వం నోటిఫై చేసింది. నిర్ధారించిన ఫీజులన్నీ క్షేత్రస్థాయి తనిఖీలకు లోబడి ఉంటాయని షరతులు విధించింది. ఫీజు కనిష్టంగా ₹ 35000 ఉండగా, గరిష్టంగా ₹ 1,05,000 గా ఉంది.

వేతన వ్యయ నివేదికలు సమర్పించిన 67 కళాశాలలకు విభిన్న ఫీజులను అడ్మిషన్లు, ఫీజుల నియంత్రణ కమిటీ ప్రతిపాదించగా ప్రభుత్వం వాటిని యథాతథంగా ఆమోదించింది. ఈ 67 కళాశాలల్లో కళాశాలను బట్టి గరిష్టంగా 1,05,000 ఉండగా, కనిష్టంగా ₹ 51800గా ఉంది. ఈ 67 కళాశాలలు కాకుండా హామీ పత్రాలు ఇచ్చిన మిగిలిన 578 కళాశాలలకు ₹ 35,000 ఫీజుగా ప్రభుత్వం నోటిఫై చేసింది. ఎలాంటి హామీ పత్రాలు, అఫిడవిట్లు సమర్పించని కళాశాలలకు ₹ 35,000 ఫీజు మాత్రమే వర్తిస్తుందని హైకోర్టు తేల్చిచెప్పింది. ఆగస్టు 29వ తేదీలోగా ఈ కళాశాలలు అఫిడవిట్లు సమర్పిస్తే ₹ 50,200 ఫీజును ఖరారు చేయాలని స్పష్టం చేసింది.

**తనిఖీలకు లోబడి ఫీజులు:**

ఫీజుల ఖరారు జీవోలో ప్రభుత్వం షరతులు విధించింది. టాస్క్‌ఫోర్స్ తనిఖీలకు లోబడి ఫీజులు వర్తిస్తాయని జీవోలో పేర్కొంది. టాస్క్‌ఫోర్స్ కమిటీల తనిఖీల అనంతరం సరైన ప్రమాణాలు లేని కళాశాలలకు, వ్యయ నివేదికల్లో పేర్కొన్నంత ఖర్చు లేదని తేలిన కళాశాలలకు ఫీజులు తగ్గే అవకాశం ఉంది.

**రీయింబర్స్‌మెంట్‌పై ఉత్కంఠ:**

ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులతో మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులకే ఎక్కువ నష్టం జరగనుంది. మెరిట్ ర్యాంకులు సాధించిన విద్యార్థులు సాధారణంగా యూనివర్సిటీల క్యాంపస్ ఇంజనీరింగ్ కళాశాలలను ఎంచుకుంటారు. ఇవి భర్తీ అయితే ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో టాప్-20 కళాశాలల్లో చేరడానికి ఆసక్తి చూపుతారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ₹ 35000 ఫీజు మాత్రమే చెల్లించాలనే ఆలోచనలో ఉండటంతో మిగిలిన భారాన్ని విద్యార్థులే మోయాల్సిన పరిస్థితి తలెత్తింది. ₹ ప్రభుత్వం ₹ 35000 ఇస్తే కనిష్టంగా ₹ 16000, గరిష్టంగా ₹ 70,000 విద్యార్థులు భరించాల్సి వస్తుంది. .

భవిత Now Bhavita Also on Sakshi TV
Every Sunday9-30am to 10am



# మ్యాథమెటిక్స్‌లో... మంచి మార్కుల కోసం...

**ఎంపీసీ.. ఇంటర్మీడియెట్ విద్యార్థుల్లో సగం మంది ఎంచుకునే గ్రూప్. కారణం.. భవిష్యత్తులో ఇంజనీరింగ్, సైన్సెస్‌లో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలను అందుకునే క్రమంలో తొలి అడుగు కావడమే. ఇదే కారణంగా కొందరు విద్యార్థులు స్వతహాగా వ్యక్తిగత ఆసక్తితో ఈ గ్రూప్‌ను ఎంచుకుంటే.. మరికొందరు విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆకాంక్ష మేరకు అడుగు పెడతారు. ఏ కారణంతో కాలుమోపినా అడుగులు తడబడకుండా చూసుకోవాలి. ఎంచుకున్న గ్రూప్‌లో అందలాలు అందుకునేలా యత్నించాలి. ఇందుకోసం తొలిరోజు నుంచే శ్రమించాలి. ఈ క్రమంలో మ్యాథమెటిక్స్‌లో రాణించేందుకు, అల్జీబ్రా గుండె గాబరా అనే అందోళన నుంచి ఆసక్తి పెంచుకుంటే అంతా సులభమే అనే స్థాయికి చేరుకునేందుకు సూచనలు..**



'మ్యాథమెటిక్స్.. మదర్ ఆఫ్ ఆల్ సైన్సెస్'... ఆసాంతం సూత్రాలు, సిద్ధాంతాలతో మమేకమై ఉండే మ్యాథమెటిక్స్‌లో... మెరుగైన ప్రదర్శన దిశగా విద్యార్థులంతా... గుర్తుంచుకోవాల్సిన మొదటి సిద్ధాంతం. భవిష్యత్తు విజయాలకు తొలి సాధనం. అందుకే.. ఎంపీసీలో సొంత అభిరుచితో చేరినా.. ఇతరుల సలహాలు, సూచనలతో చేరినా ఈ సూక్తిని అనుసరిస్తే అవకాశాలను మెరుగుపరుచుకోచ్చు.

## సరిగా వింటే.. సగం సక్సెస్:

'అధ్యాపకులు బోధించే అంశాన్ని ఏకాగ్రతతో వింటే ఆ అంశంలో సగం పట్టు లభించినట్లే'. విద్యార్థులకు ఒక అంశంపై అవగాహన ఏర్పడే విషయంలో శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహించిన పలు సర్వేల్లో తేలిన సత్యం. కాబట్టి క్లాస్ రూంలో లెక్చరర్ చెప్పేటప్పుడే ఏకాగ్రతతో వినాలి. ఇంటికివెళ్లాక చదువుకుందాంలే అనే ధోరణి ఏ మాత్రం సరి కాదు. అంతేకాకుండా నిర్దిష్ట అంశాన్ని బోధించేటప్పుడే టెక్స్ట్‌బుక్‌లో దానికి సంబంధించిన ముఖ్యాంశాలను అండర్‌లైన్ చేసుకోవడం, ముఖ్యమైన ఫార్ములాలను రన్నింగ్ నోట్స్‌లో పొందుపర్చుకోవడం, లెక్చరర్ చెప్పే షార్ట్‌కట్ మెథడ్స్‌ను నోట్ చేసుకోవడం వంటి చిట్కాలు పాటించాలి. వాస్తవానికి షార్ట్‌కట్ మెథడ్స్ తొలుత కష్టంగా అనిపిస్తాయి. దానికంటే సంప్రదాయ పద్ధతిలో స్టెప్స్‌వారీ విధానంలో సమస్యను సాధించడమే సులభం అనిపిస్తుంది. కానీ కొద్దిగా సమయం కేటాయిస్తే.. షార్ట్‌కట్ మెథడ్స్‌పై అవగాహన ఏర్పడుతుంది. భవిష్యత్తులో కాంపిటీటివ్ పరీక్షల దృక్కోణంలో ఇది లాభదాయకంగా ఉంటుంది.

## కాన్సెప్ట్స్‌పై పట్టు సాధించాలంటే:

మ్యాథమెటిక్స్‌లో మంచి మార్కులకు ఉపకరించే మరో సాధనం కాన్సెప్ట్స్. వీటిపై పట్టు పెరిగేకొద్దీ.. అంతేస్థాయిలో సబ్జెక్ట్‌లో నైపుణ్యాలు సొంతమవుతాయి. దీనికోసం చేయాల్సిందలా.. ఒక సూత్రం ఆధారంగా రూపొందిన ప్రాబ్లమ్‌ను.. విద్యార్థి పలు రకాలుగా పరిష్కరించేందుకు కృషి చేయాలి. ఆ క్రమంలో సదరు సమస్యలో అంతర్లీనంగా ఉన్న భావనలు, అన్వయ పద్ధతులపై అవగాహన ఏర్పడుతుంది. ఇలా ప్రతి ఫార్ములాకు ఈ తరహా ప్రిపరేషన్ సాగిస్తే ఎలాంటి క్లిష్టమైన సమస్యనైనా సులువుగా సాధించే నైపుణ్యం అలవడుతుంది. అంతేకాకుండా ప్రతి సబ్జెక్ట్‌కు వర్క్ నోట్స్ కేటాయించాలి. అందులో ప్రతి టాపిక్‌కు మూడు నుంచి అయిదు పేజీలు ఉండేలా చూసుకోవాలి. సదరు టాపిక్ చదువుతున్నప్పుడే ముఖ్యాంశాలను ఆ నోట్స్‌లో రాసుకోవాలి.

## లెర్నింగ్ స్కిల్స్ .. :

మ్యాథమెటిక్స్‌లో లెర్నింగ్ స్కిల్స్ పెరగాలంటే ప్రాక్టీస్‌తోనే సాధ్యం. ఇతర సబ్జెక్టుల మాదిరిగా పుస్తకం లేదా క్లాస్ నోట్స్‌లోని అంశాలను చదువుతూ సాగితే ప్రయోజనం శూన్యం. కచ్చితంగా పేపర్, పెన్ను చేతిలో పెట్టుకుని ప్రాక్టీస్ చేయాల్సిందే. ఈ ప్రాక్టీస్ కూడా మూస ధోరణిలో కాకుండా శాస్త్రీయంగా ఉండాలి. ఈ క్రమంలో ప్రతి సమస్యను అంచెలవారీ (స్టెప్స్)గా సాధించాలి.

తొలుత ప్రతి చాప్టర్‌కు సంబంధించి బోర్డ్ సిలబస్, అందులోని కాన్సెప్ట్స్‌పై పరిపూర్ణ అవగాహన ఏర్పరచుకోవాలి. అదే చాప్టర్‌లోని ఎక్సర్‌సైజ్ యూనిట్లలో ఇచ్చిన సమస్యలను పరిష్కరించాలి. అంతేకాకుండా ప్రతి చాప్టర్‌కు ముందుగా ఉండే సినాప్సిస్‌ను కచ్చితంగా చదివి అవగాహన ఏర్పరచుకోవాలి.

అప్లికేషన్ మెథడ్ విషయంలో విద్యార్థులు తమ భవిష్యత్తు లక్ష్యం ఆధారంగా వ్యూహాన్ని అనుసరించాలి. ఉదాహరణకు ఒక విద్యార్థికి 'ఎంసెట్' మాత్రమే లక్ష్యమైతే అప్లికేషన్స్‌కు కాసింత తక్కువ ప్రాధాన్యమిచ్చినా సరిపోతుంది. కానీ ఐఐటీ-జేఈఈ వంటి జాతీయ స్థాయి పరీక్షలు లక్ష్యంగా పెట్టుకున్న విద్యార్థులు మాత్రం అప్లికేషన్స్ విషయంలో లోతైన అవగాహన ఏర్పరచుకోవాలి. ఈ క్రమంలో ప్రిపరేషన్ సమయంలోనే ముందుగా.. ఈ జాతీయ స్థాయి పరీక్షల్లో అడిగే ప్రశ్నల శైలికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. కారణం.. ఆ ప్రశ్నలు ఒకటి లేదా అంతకంటే ఎక్కువ కాన్సెప్ట్‌ల కలయికతో ఉంటాయి. వీటిని సాధిస్తే రాష్ట్ర స్థాయిలో ఎంసెట్‌కు ప్రిపరేషన్ సులభం అవుతుంది. అదే విధంగా అకడెమిక్‌గా కూడా కచ్చితత్వం లభిస్తుంది.

లెర్నింగ్‌తోపాటు విద్యార్థులు అలవర్చుకోవాల్సిన లక్షణం కొశ్చనింగ్ నేచర్ (ప్రశ్నించే తత్వం). చాలామంది విద్యార్థులు తమకు సందేహాలున్నా సహచరులు అవహేళన చేస్తారనో? లేదా స్టేజ్ ఫియర్ వంటి కారణాలతో విస్మరిస్తారు. దీన్ని అధిగమించాలి. లెక్చరర్ ఒక అంశాన్ని ఒక పద్ధతిలో బోధిస్తున్నప్పుడు; మరో పద్ధతి గురించి అడగొచ్చు. ఇక.. మరుసటి రోజు క్లాస్‌రూంలో బోధించనున్న అధ్యాయాన్ని లేదా అంశాన్ని ముందురోజు ఒకసారి చదివితే క్లాస్‌రూంలో మిగతావారికంటే ముందంజలో ఉండే ఆస్కారం లభిస్తుంది.

## అకడెమిక్+ కాంపిటీటివ్:

భవిష్యత్తులో పోటీ పరీక్షలను లక్ష్యంగా పెట్టుకున్న విద్యార్థులు మొదటి సంవత్సరం నుంచే ఆ దిశగా అడుగులు వేయాలి. రెండిటిని అనుసంధానం చేసుకుంటూ ప్రిపరేషన్ సాగించాలి. ఒక నిర్దిష్ట సమస్యను సాధించేటప్పుడు అకడెమిక్ కోణంలో అంచెలవారీ వ్యూహాన్ని అనుసరించాలి. అదే సమయంలో కాంపిటీటివ్ పరీక్షల కోణంలో ఆ సమస్యలో సమ్మిళితమైన కాన్సెప్ట్స్, అప్లికేషన్ మెథడ్స్‌ను గుర్తించాలి. సదరు సమస్య పరిష్కారం పూర్తి కాగానే ముఖ్యమైన కాన్సెప్ట్స్‌ను, అప్లికేషన్స్‌ను నోట్స్‌లో పాయింట్ల రూపంలో పొందుపర్చుకోవాలి.

## మారింది సిలబస్.. మారాలి దృక్పథం:

జాతీయ స్థాయిలో ఒకే ఉమ్మడి ప్రవేశ పరీక్ష అనే ప్రతిపాదన నేపథ్యంలో.. ఆ పరీక్షలకు మన విద్యార్థులను సంసిద్ధులను చేసే విధంగా ఇంటర్మీడియెట్ బోర్డ్ ఈ విద్యా సంవత్సరం (2012-13) నుంచి కొత్త సిలబస్‌కు శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా మ్యాథమెటిక్స్ విషయంలో మార్పులు ఎక్కువగానే ఉన్నాయి. రెండో సంవత్సరంలోని మాట్రిసెస్ అండ్ డిటర్మినెంట్స్‌ను మొదటి సంవత్సరంలో (మ్యాథ్స్-1ఎ) చేర్చడం.. అంతేకాకుండా అప్లికేషన్ ఓరియెంటెడ్ మెథడ్స్‌కు ప్రాధాన్యం ఇస్తూ సిలబస్ రూపకల్పన జరిగింది. అదేవిధంగా ప్రతి చాప్టర్‌లోనూ అప్లికేషన్ ఓరియెంటెడ్ ప్రాబ్లమ్స్‌కు ప్రాధాన్యమిచ్చారు. మరోవైపు మ్యాథ్స్-1బిలో కూడా మార్పులు చోటు చేసుకున్నాయి. ముఖ్యంగా ఐఐటీ-జేఈఈ, ఏఐఈఈఈ వంటి పరీక్షల్లో ఎంతో ప్రాధాన్యం ఉండే లాగ్రెంజ్ మీన్ వాల్యూ సిద్ధాంతం, రోల్స్ సిద్ధాంతాలను పొందుపరిచారు. దీంతోపాటు ఇప్పటికే ఉన్న సెట్స్, సీక్వెన్సెస్ అండ్ సిరీస్, మ్యాథమెటిక్ రీజనింగ్‌లలోనూ కొన్ని అదనపు అంశాలు చేర్చుతూ.. అప్లికేషన్ ఓరియెంటెడ్‌గా తీర్చిదిద్దారు. వాస్తవానికి ఈ తరహా సిలబస్ వల్ల విద్యార్థులు క్లాస్ రూం లెర్నింగ్‌లోనే సగం సబ్జెక్ట్‌ను నేర్చుకునే వీలుంటుంది.

## సమయ పాలనకు సముచిత ప్రాధాన్యం:

మ్యాథమెటిక్స్ విషయంలో విద్యార్థులు సమయ పాలన (టైం మేనేజ్‌మెంట్)కు సముచిత ప్రాధాన్యం ఇవ్వాల్సిందే. ప్రస్తుతం అన్ని కళాశాలల్లో కనీసం మూడు గంటల క్లాస్ రూం టీచింగ్ విధానం సాగుతోంది. విద్యార్థులు దీంతో సరిపెట్టుకోకుండా సొంతంగా మరో రెండు గంటలు కేటాయించుకోవాలి. అదే విధంగా ఆయా అంశాలకు.. అకడెమిక్‌గా, కాంపిటీటివ్‌గా కల్పిస్తున్న వెయిటేజీని పరిగణనలోకి తీసుకుని దానికనుగుణంగా ఆయా టాపిక్స్‌ను ప్రాధాన్యతా క్రమంలో చదవాలి. అవి..

▪ట్రిగ్నోమెట్రీ ▪ట్రిగ్నోమెట్రీ ఈక్వేషన్స్ ▪హైపర్‌బోలిక్ ఫంక్షన్ ▪ప్రాపర్టీస్ ఆఫ్ ట్రయాంగిల్స్ ▪కోఆర్డినేట్ సిస్టమ్ ఆఫ్ 2డి, 3డి ▪లాజిక్స్ ఆఫ్ 2డి ▪స్ట్రెయిట్ లైన్స్ ▪పెయిర్స్ ఆఫ్ స్ట్రెయిట్ లైన్స్ ▪ఫంక్షన్స్ (గ్రాఫ్స్) ▪ఇన్వర్స్ ట్రిగ్నోమెట్రిక్ ఫంక్షన్ ▪లిమిట్స్ ▪కంటిన్యూటీ ▪డిఫరెన్షియబిలిటీ, డిఫరెన్షియేషన్ టెక్నిక్స్ ▪అప్లికేషన్స్ ఆఫ్ డిఫరెన్షియేషన్స్ ▪వెక్టార్స్ 3డి.

వీటన్నిటికీ డిసెంబర్ చివరికి లేదా జనవరి మొదటి వారానికి పూర్తి చేసుకునేలా ప్రణాళిక రూపొందించుకోవాలి. ఆ తర్వాత పూర్తి సమయాన్ని రివిజన్‌కు కేటాయించాలి. సాధారణంగా మార్చిలో వార్షిక పరీక్షలు ఉంటాయి కాబట్టి ఫిబ్రవరి నెలలో ప్రీ-ఫైనల్ పరీక్షలు రాయడానికి ప్రాధాన్యం ఇవ్వాలి.

కనీసం మూడు ప్రీ-ఫైనల్ పరీక్షలకు హాజరై.. వాటిలో తమ ప్రదర్శనను విశ్లేషించుకోవాలి. బలహీనంగా ఉన్న చాప్టర్లపై మరోసారి దృష్టి కేంద్రీకరించాలి.

## టాపిక్స్‌వారీగా ప్రిపరేషన్ టిప్స్

### అల్జీబ్రా:

ఈ విభాగంలో అధికశాతం లాజిక్ ఓరియెంటెడ్‌గా ఉంటాయి. (ఉదా:పెర్ముటేషన్స్ అండ్ కాంబినేషన్స్, ప్రాబబిలిటీ, లోకేషన్ ఆఫ్ రూట్స్ ఆఫ్ క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, జామెట్రికల్ అప్లికేషన్స్ ఆఫ్ కాంప్లెక్స్ నెంబర్స్, వెక్టార్స్, 3డి-జామెట్రీ). వీటికి సంబంధించి సమస్యలను సాధించే క్రమంలో ఫార్ములాలకంటే కాన్సెప్ట్స్‌కు ప్రాధాన్యమివ్వాలి.

### ట్రిగ్నోమెట్రీ:

వాస్తవానికి ఈ విభాగాన్ని విద్యార్థులు చాలాక్లిష్టంగా భావిస్తారు. కారణం ఇందులో విస్తృత సంఖ్యలో ఉండే ఫార్ములాలే. అయితే ఆ ఫార్ములా వెనుక భావనలను అర్థం చేసుకుని, సమస్యలో అన్వయిస్తే సులభంగానే ఉంటాయి. ఈ విభాగం నుంచి డైరెక్ట్ కొశ్చన్స్ సంఖ్య తక్కువే. కానీ ఇందులోని కాన్సెప్ట్స్‌పై అవగాహన కోఆర్డినేట్ జామెట్రీ, కాలిక్యులస్‌లకు ఎంతగానో ఉపయోగపడతాయి. కాబట్టి ట్రిగ్నోమెట్రీలో ఎంత ఎక్కువ ప్రాక్టీస్ చేస్తే.. అంత ఎక్కువ ప్రయోజనం అని గుర్తించాలి.

### కోఆర్డినేట్ జామెట్రీ:

ట్రిగ్నోమెట్రీ కంటే కాసింత సులభంగా ఉండే విభాగమిది. ఇందులోనూ ఫార్ములాలు, కాన్సెప్ట్‌ల సంఖ్య అధికమే. ముఖ్యంగా కోనిక్ సెక్షన్స్‌గా పేర్కొనే సర్కిల్స్, పారాబోలా, ఎలిప్స్, హైపర్‌బోలాలోని ఈక్వేషన్స్ ఆఫ్ టాంజెంట్ అండ్ నార్మల్ టు ఎ కర్వ్ (Equations of a tangent and normal to a curve)లో కాన్సెప్ట్స్ ఎక్కువగా ఉంటాయి. అంతేకాకుండా లోకస్, దాని సంబంధ అంశాలపై ఎక్కువ అవగాహన పొందితే అది కోఆర్డినేట్ జామెట్రీని సులభతరం చేస్తుంది.

### కాలిక్యులస్:

విశ్లేషణాత్మక నైపుణ్యాలు అవసరమైన కాన్సెప్ట్ ఆధారిత అంశాలుండే విభాగం కాలిక్యులస్. ఈ విభాగానికి ఫంక్షన్స్ వెన్నెముక వంటివి. కాబట్టి వీటిపై కచ్చితంగా అవగాహన పొందాల్సిందే. అన్ని ప్రమేయాల ధర్మాలపై (ఉదా: ట్రిగ్నోమెట్రిక్, అల్జీబ్రిక్, ఇన్వర్స్ ట్రిగ్నోమెట్రిక్, లాగార్థమిక్, ఎక్స్‌పొనెన్షియల్, సిగ్నమ్ తదితర). ఈ విభాగంలోని ప్రశ్నలకు గ్రాఫ్స్, స్కెచ్‌లు ఎంతో అవసరమవుతాయి. కాబట్టి వీటిపై ఎక్కువ దృష్టి సారించాలి.

## ఆసక్తే.. ఆలంబన



ఇష్టంతో చేరినా.. ఇతరుల ప్రోద్బలంతో చేరినా... పదో తరగతి వరకు ఉన్న సిలబస్ శైలికి.. ఇంటర్మీడియెట్ సిలబస్ శైలికి మధ్య తేడాతో చాలామంది విద్యార్థులు మ్యాథ్స్ మహా టఫ్ అనుకుంటారు. మహా టఫ్ అనే ఆందోళన నుంచి మార్కులకు మంచి సాధనం మ్యాథ్స్ అనే ఆలోచన స్థాయి చేరుకోవడానికి ప్రతి విద్యార్థి ముందుగా అలవర్చుకోవాల్సింది 'ఆసక్తి'. ఈ ఆసక్తి పెరగాలంటే లక్ష్యం కళ్లముందు కదులుతుండాలి. ఫార్ములాలు, కాన్సెప్ట్స్, షార్ట్‌కట్ మెథడ్స్‌ను ఒక క్రమ పద్ధతిలో సొంత నోట్స్‌లో అమర్చుకోవడం.. ప్రతి చాప్టర్ పూర్తవగానే వాటి ఆధారంగా రివిజన్ చేసుకోవడం, ప్రతి వారం చివర ఆ వారంలో నేర్చుకున్న అంశాలను రివిజన్ చేసుకోవడం వంటి నిరంతర ప్రిపరేషన్ ప్లాన్‌ను పాటించాలి. అంతేకాకుండా క్లాస్ రూంలో ఏమైనా సందేహాలు వస్తే లెక్చరర్‌ను అడగడానికి ఏ మాత్రం సందేహించొద్దు. లెక్చరర్ బోధించేటప్పుడే ఏకాగ్రతతో వింటేనే ఒక అంశం తనకు అర్థమైందా? లేదా? అనే విషయం తెలుస్తుంది.

-ఎం.ఎన్.రావు, శ్రీచైతన్య విద్యా సంస్థలు

# దైనందిన జీవితంతో అన్వయించుకుంటూ...

భవిష్యత్తులో మెడికల్ కోర్సుల్లో చేరి వైద్య వృత్తిలో అడుగుపెట్టడమే లక్ష్యంగా పెట్టుకున్న విద్యార్థులకు తొలి మెట్టు బైపీసీ. ఈ గ్రూప్‌లో ప్రధానమైన సబ్జెక్ట్ బయాలజీ. త్వరలో.. దేశ వ్యాప్తంగా ఉన్న వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశానికి జాతీయ స్థాయిలో ఒకే పరీక్ష (నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్-నీట్ యూజీ)ను నిర్వహించడానికి కూడా రంగం సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో విద్యార్థులు మొదటి సంవత్సరం నుంచే బయాలజీపై పట్టు సాధించేందుకు కృషి చేయాలి. ఇందుకోసం సలహాలు..



వాస్తవానికి బైపీసీ గ్రూప్‌లో చేరే విద్యార్థులంతా ఎంబీబీఎస్ లక్ష్యంగా అడుగుపెట్టేవారే. తల్లిదండ్రులు, ఇతరుల సలహాలు, సూచనలతో ఈ గ్రూప్ ఎంచుకునే వారి సంఖ్య తక్కువే. అయితే ఇష్టం లేకున్నా ఈ గ్రూప్‌లో చేరిన విద్యార్థులు తమ భవిష్యత్తును సుస్థిరం చేసుకునేందుకు కృషి చేయాలి. బలవంతంగా బరిలో దిగినా.. తాము బలోపేతం అయ్యేందుకు కృషి చేయాలి. ఈ క్రమంలో ముందుగా సబ్జెక్ట్‌పై ఆసక్తి పెంచుకునే దిశగా కృషి చేయాలి. మన దైనందిన జీవితంలో గోచరించే బయాలజీ సంబంధ పరిణామాలు (పరిసరాలు, మొక్కలు, జంతువులు తదితర) ప్రత్యక్షంగా పరిశీలిస్తే.. క్రమేణా ఆసక్తి పెరుగుతుంది.

### క్లాస్ రూం పాత్ర కీలకం:

బయాలజీ సబ్జెక్ట్‌లో అవగాహన విషయంలో క్లాస్‌రూం పాత్ర ఎంతో కీలకమని చెప్పొచ్చు. ఇంటర్మీడియెట్ స్థాయిలో 50 మంది విద్యార్థులుండే తరగతి గదిలో 80 శాతం మంది విద్యార్థులకు.. లెక్చరర్ చెప్పే అంశంలో 90 శాతం చేరుతుంది. అదే 60 నుంచి 80 మంది వరకు విద్యార్థులుండే తరగతి గదిలో 50 శాతం మంది విద్యార్థులకు మాత్రమే 90 శాతం పాఠ్యాంశం చేరుకుంటుంది.

### దైనందిన జీవితంతో అన్వయించుకుంటూ:

ఇక క్లాస్ రూంలో చెప్పిన పాఠ్యాంశాన్ని దైనందిన జీవితంతో అన్వయించుకుంటే సబ్జెక్ట్ మరింత సులభంగా అవగతం అవుతుంది. ఉదాహరణకు మొక్కల్లో కిరణజన్య సంయోగ క్రియ; జీవుల పెరుగుదల పరిణామ క్రమాలను పరిశీలించడం వంటి ప్రయోగాలు చేయాలి. ఇలా బయాలజీలోని చాలా అంశాలను దైనందిన జీవితంతో అన్వయించుకుంటూ చదివే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా ప్రాక్టికల్స్ ఉండని ప్రథమ సంవత్సరం విద్యార్థులు ఇలాంటి చిట్కాల వల్ల ప్రత్యక్ష పరిజ్ఞానం పొందొచ్చు.

### బోర్ ఫీలవకుండా:

పదో తరగతి వరకు సైన్సెస్‌లో సరిగా దృష్టి సారించని విద్యార్థులకు ఇంటర్మీడియెట్ స్థాయిలో బయాలజీ కొంత క్లిష్టంగానే ఉంటుందని చెప్పొచ్చు. అంతేకాకుండా బొమ్మలు, గ్రాఫ్‌లతో కూడిన ఈ సబ్జెక్ట్‌ను కొంత బోర్‌గా కూడా భావించే అవకాశం ఉంది. కానీ దాన్ని విడనాడాలి. భవిష్యత్తు లక్ష్యాన్ని గుర్తుకుతెచ్చుకోవాలి. దీంతో ఆసక్తి ఏర్పడుతుంది. తద్వారా ఏకాగ్రతతో పాఠం వినే నైపుణ్యం అలవడుతుంది. క్లాస్‌రూంలో విన్నదే ముఖ్యమని భావించాలి. డయాగ్రమ్స్ విషయంలో విజువలైజేషన్ దృక్పథంతో సాగాలి. తరగతి విరామ సమయంలో అప్పటి వరకు చెప్పిన అంశాలను ఒక్కసారి పునశ్చరణ చేసుకోవాలి. ముఖ్యంగా డయాగ్రమ్స్ విషయంలో.. లెక్చరర్ సదరు డయాగ్రమ్‌ను ఏ క్రమంలో ఆకృతినిచ్చారు? అందులోని ముఖ్య భాగాలేంటి? వాటి ఉపయోగాలేంటి? అనే అంశాలను పునశ్చరణ చేసుకోవాలి. అంతేకాకుండా వాటిని వెంటనే నోట్స్‌లో పొందుపర్చుకోవాలి.

### బేసిక్స్‌పై పట్టు కోసం:

బయాలజీలో బేసిక్స్‌పై పట్టు సాధించాలంటే క్లాస్‌రూంలో అడుగుపెట్టే ముందే ఆ దిశగా కృషి చేయాలి. పదో తరగతి వరకు బయలాజికల్ సైన్సెస్‌పై దృష్టి సారించకపోయినా.. ఈ దశలో అది తప్పనిసరి. ప్రథమ సంవత్సరంలో అడుగు పెట్టే విద్యార్థులు పదో తరగతి పుస్తకాలను ఒకసారి పునశ్చరణ చేసుకోవడం ఉపకరిస్తుంది. ఇలా బేసిక్స్‌పై పట్టు సాధిస్తే బయాలజీ భారం తొలగించుకోవచ్చు.

### తులనాత్మక అధ్యయనం:

బయాలజీలో విద్యార్థులకు లభించే మరో అనుకూల అంశం తులనాత్మక అధ్యయనం. జీవశాస్త్రంలోని చాలా పాఠ్యాంశాలు.. జంతు, వృక్ష శాస్త్రాలకు పోలికతో ఉంటాయి. (ఉదా: కణ శాస్త్రం, కణజీవ శాస్త్రం, బాహ్య-అంతర నిర్మాణం, జీవ శాస్త్రం, జీవ సాంకేతిక శాస్త్రం, ప్రాథమిక శరీర ధర్మ శాస్త్రం, జన్యు మార్పిడులు తదితరాలు). జంతుశాస్త్రంలోని ఒక అంశాన్ని చదివేటప్పుడు.. వృక్ష శాస్త్రంలో దానికి సరితూగే అంశాన్ని బేరీజు వేసుకుంటూ చదివితే సులభంగానూ, ఆసక్తిగానూ ఉంటుంది.

### పదాల మధ్య తేడాను గుర్తించాలి:

ఈ సబ్జెక్ట్ విషయంలో విద్యార్థులు అప్రమత్తంగా వ్యవహరించాల్సిన మరో అంశం.. పదాల మధ్య తేడాను గుర్తించాలి. చాలా పదాలు ఒకే మాదిరిగా ఉంటాయి. దీంతో విద్యార్థులు సమాధానం ఇచ్చే సమయంలో కన్‌ఫ్యూజ్ అవుతారు. తెలియకుండానే తప్పు సమాధానం ఇస్తారు.
ఉదాహరణకు: కణ శాస్త్రం, కణ జీవ శాస్త్రం రెండూ వేర్వేరు అంశాలు. కానీ చాలా మంది హడావుడిలోనో, లేదా కన్‌ఫ్యూజన్‌కు గురయ్యో ఒకదానికి మరొక దాని సమాధానం ఇస్తారు.

### అదే విధంగా

- Eugenics: అనువంశిక సూత్రాలను అన్వయించి మానవ సంక్షేమాన్ని పెంచడం
- Euphenics: వ్యాధి లక్షణాలను బట్టి కొన్ని అనువంశిక వ్యాధులకు చికిత్స చేయడం.
- చాలామంది ఈ రెండు పదాల మధ్య ఉన్న రెండు అక్షరాల తేడాను గమనించక పొరపాటు చేస్తారు.
- కాబట్టి ఆయా పదాల మధ్య సునిశిత పరిశీలన చేయాలి. పాఠం వింటున్నప్పుడే ఒక అంశానికి చెందిన భేదాలు, పోలికలు ఏంటో గుర్తించాలి.

### ఆందోళన వద్దు:

సాధారణంగా బయాలజీ పుస్తకాలు వందల పేజీలతో విద్యార్థులను ఆందోళన చెందించేవిగా ఉంటాయి. కానీ ఈ సమస్యను సులభంగానే అధిగమించొచ్చు. ప్రస్తుతం మారిన సిలబస్ ప్రకారం రూపొందిన పుస్తకాల్లో ప్రతి పాఠ్యాంశంలోని ముఖ్యమైన నిర్వచనాలు, సాంకేతిక పదాలు, డెరివేషన్స్‌ను హైలైట్ చేస్తూ ముద్రించడం జరిగింది. వీటిని చదువుతూనే సొంత నోట్స్ రూపొందించుకోవాలి. కేవలం నిర్దేశిత పాఠ్యపుస్తకాలకే పరిమితం కావాలి. మార్కెట్లో లభించే పలు పుస్తకాల అవసరం ఇప్పుడే ఏర్పడదు. ప్రస్తుత విద్యార్థులు అకాడెమీ బుక్స్ చదివితే సరిపోతుంది. అంతేకాకుండా అకడెమిక్, కాంపిటీటివ్ పరీక్షల గత అయిదేళ్ల ప్రశ్న పత్రాలను పరిశీలించాలి. బోర్డ్ పరీక్షల దృక్కోణంలో ప్రశ్న పత్రాలను విశ్లేషిస్తూ.. వాటిలో ఆయా అంశాలకు లభిస్తున్న వెయిటేజీ ఆధారంగా అతి స్వల్ప సమాధాన ప్రశ్నలు, స్వల్ప సమాధాన ప్రశ్నలు, వ్యాసరూప సమాధాన ప్రశ్నలను గుర్తించి చదవాలి. ఎంట్రన్స్ టెస్ట్‌ల దృక్పథంలో.. అన్ని సూక్ష్మ అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి. ఇక.. కాన్సెప్ట్ ఆధారిత ప్రిపరేషన్ క్రమంలో ఒకే ప్రశ్నను రకరకాలుగా రూపొందించుకోవడం, చదివేటప్పుడే ఎందుకు? ఏమిటి? (ఉదా: అభికేంద్ర బలం, అపకేంద్ర బలం తేడా?) అని ప్రశ్నించుకుంటూ సాగడం వంటి వ్యూహాలు అనుసరించాలి. అయితే ఈ సబ్జెక్ట్‌కు సంబంధించి కాన్సెప్ట్ ఆధారిత సమాధానాల ఆవశ్యకత కొంత తక్కువే. ఎంట్రన్స్ టెస్ట్‌లలోని ఎసర్షన్ అండ్ రీజన్ తరహా వాటికి మాత్రం అవసరం.

### రెండింటి సమన్వయం:

ఇకపై జాతీయ స్థాయిలో ఎంబీబీఎస్‌లో ప్రవేశానికి ఒకే పరీక్ష జరగనుంది. దీంతో లక్షల మందితో పోటీ పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో ప్రథమ సంవత్సరం నుంచే ఈ దిశగా అడుగులు వేయాలి. ఆయా పాఠ్యాంశాలను అకడెమిక్ కోణంలో చదువుతూనే బహుళైచ్ఛిక ప్రశ్నలను పోటీ పరీక్షల కోసం ప్రాక్టీస్ చేయాలి. దీనికోసం ప్రత్యేకంగా సమయం కేటాయించుకోవాలి.

### క్రిటికల్ థింకింగ్ ఎంతో ముఖ్యం:

బయాలజీకి సంబంధించి క్రిటికల్ థింకింగ్ ఎంతో ముఖ్యమైందిగా పేర్కొనొచ్చు. ఈ లక్షణం అలవడాలన్నా ఎందుకు? ఏమిటి? అని ప్రశ్నించుకునే సహజ లక్షణం అవసరం.

**ఉదాహరణకు ఎయిమ్స్‌లో అడిగిన ప్రశ్నను గమనిస్తే..**

People living at high altitude like Simla and Peaks of mountains have rosy cheaks? what is the reason?

1) low temperature
2) consumption of apples
3) mountain goat meat eating
4) high RBC count

ఈ ప్రశ్నకు సమాధానం 4. కానీ చాలామంది పొరపాటులో దాన్ని గుర్తించలేకపోయారు. దీనికి కారణం క్రిటికల్ థింకింగ్ కాసింత లోపించడమే.

### డ్రాయింగ్స్‌కు అధిక ప్రాధాన్యం:

బైపీసీ తీసుకున్న విద్యార్థులు అధిక ప్రాధాన్యం ఇవ్వాల్సిన విభాగం డ్రాయింగ్స్. బోర్డ్ పరీక్షల్లో బోటనీ, జువాలజీ ఒక్కో సబ్జెక్ట్ నుంచి కనీసం పదిమార్కులకు డ్రాయింగ్ సంబంధిత ప్రశ్నలు ఉంటాయి. నేరుగా సంబంధిత డ్రాయింగ్ వేయండి? అని అడగొచ్చు. మరోవైపు పోటీ పరీక్షల్లోనూ డ్రాయింగ్ ఆధార ప్రశ్నలు ఉంటాయి. ఏదైనా ఒక బొమ్మ ఇచ్చి అందులోని భాగాలను గుర్తించమని అడగొచ్చు. కాబట్టి డ్రాయింగ్ ప్రాక్టీస్ చేయాలి. ఈ క్రమంలో ముందుగా ఒక చిత్రాన్ని పెన్సిల్‌తో అవుట్‌లైన్స్ వేసుకోవాలి. దాన్ని పుస్తకంలోని వాస్తవ చిత్రంతో సరిచూసుకుని ఇతర భాగాలను రూపొందించాలి. ప్రతి డ్రాయింగ్‌ను కనీసం మూడుసార్లు ప్రాక్టీస్ చేయాలి. దీనికోసం ప్రత్యేకంగా సమయం కేటాయించాలి. అంతేకాకుండా థియరీ పాఠాలను చదువుతున్న సమయంలో నిరాసక్తత కలిగినప్పుడు ఆ సమయాన్ని కూడా డ్రాయింగ్ ప్రాక్టీస్‌కు కేటాయిస్తే బోరింగ్ మూడ్ నుంచి బయటపడతారు.

### టైం మేనేజ్‌మెంట్:

బయాలజీ విషయంలో సమయ పాలన కచ్చితంగా పాటించాలి. సాధారణంగా క్లాస్ రూం టీచింగ్ సమయాన్ని మినహాయిస్తే సగటున ప్రతి ఆరు గంటల సమయం అందుబాటులో ఉంటుంది. ఈ సమయాన్ని ఒక రోజు జువాలజీ, మరోరోజు బోటనీకి కేటాయించుకోవాలి. పాఠ్యాంశంలోని అనవసరమైన వాటిని విస్మరించాలి. ఇవేంటో తెలియాలంటే గత కొన్నేళ్ల ప్రశ్న పత్రాలను పరిశీలించాలి. డిసెంబర్ నాటికి సిలబస్ పూర్తి చేసుకునే స్టడీ ప్లాన్ రూపొందించుకోవాలి. జనవరి, ఫిబ్రవరి నెలల్లో ప్రీ-ఫైనల్ పరీక్షలు రాయాలి. స్టడీ ప్లాన్‌ను అమలు చేసే క్రమంలో ముందుగా వెరీ షార్ట్ ఆన్సర్ కొశ్చన్స్‌పై దృష్టి పెట్టాలి. ఇక షార్ట్ ఆన్సర్ కొశ్చన్స్, లాంగ్ ఆన్సర్ కొశ్చన్స్‌ను పటాలతో సహా ప్రాక్టీస్ చేయడం లాభిస్తుంది. అంతేకాకుండా బయాలజీలో అధ్యాయాలవారీగా ముఖ్యమైన వాటిని గుర్తించి వాటిని అకడెమిక్ సంవత్సరం మొదటి భాగంలోనే పూర్తి చేసుకునేలా టైం ప్లాన్ రూపొందించుకోవాలి. ఇలా అన్ని రకాలుగా పకడ్బందీ వ్యూహాలతో అడుగులు వేస్తే ప్రథమ సంవత్సరం తొలి రోజునుంచే విజయం దిశగా పయనించొచ్చు.

### ముఖ్యమైన పాఠ్యాంశాలు:

స్వరూప శాస్త్రం, కణ జీవశాస్త్రం, అంతర్‌నిర్మాణ శాస్త్రం, వృక్షరాజ్యం, సూక్ష్మజీవ శాస్త్రం; బయాలజీ అండ్ హ్యూమన్ వెల్‌ఫేర్; వృక్ష శరీరధర్మ శాస్త్రం-నత్రజని జీవక్రియలు; జంతు సహచర్యాలు. ఫెరిటీమా; టీనోపోరా; హెమికార్డేటా; బొద్దింకలో రక్తప్రసరణ; ప్రత్యుత్పత్తి వ్యవస్థలు; మానవ శరీర ధర్మశాస్త్రం; ప్రత్యుత్పత్తి; ఆరోగ్యం; వ్యాధులు; రిప్రొడక్టివ్ హెల్త్; మానవ మెదడు; చెవి; కన్ను; జన్యుశాస్త్రంలో ప్లీయెక్ట్రాపి; పాలిజీనిక్; అనువంశికత; థెలసీమియా; డౌన్స్ సిండ్రోమ్ మొదలైనవి; మానవ జీవ పరిణామం; యానిమల్ హజ్బెండరీ; ఎన్విరాన్‌మెంటల్ టిష్యూస్.

### అభిరుచిని పెంచుకోవాలి



బైపీసీ గ్రూప్‌ను ఎంచుకున్న విద్యార్థులు ముఖ్యంగా బయాలజీ విషయంలో అభిరుచిని పెంచుకోవాలి. తొలిరోజు నుంచే అకడెమిక్, కాంపిటీటివ్ పోటీ పరీక్షల కోణంలో ప్రిపరేషన్ సాగిస్తే బయాలజీలో సులభంగానే పట్టు సాధించొచ్చు. ముఖ్యంగా పోటీ పరీక్షల్లో బయాలజీ ప్రాధాన్యం ఎక్కువ. కాబట్టి ఈ సబ్జెక్ట్‌పై టైం మేనేజ్‌మెంట్ పరంగా కూడా అధిక ప్రాధాన్యమివ్వాలి. అంతేకాకుండా ఈ సబ్జెక్ట్‌లోని సాంకేతిక పదాలపై అవగాహన ఏర్పరచుకోవాలి. చాలామంది విద్యార్థులు వీటికి తగినంత ప్రాధాన్యం ఇవ్వరు. దీని వల్ల ఆబ్జెక్టివ్ టైప్ పరీక్షల్లో నష్టపోతారు. ముఖ్యమైన పదాలను అబ్రివేషన్స్, యాంక్రానిమ్స్ రూపంలో పొందుపర్చుకోవాలి. ఇది రివిజన్ సమయంలో ఉపకరిస్తుంది.

కె. జగన్ మోహన్‌రావు,
వైస్ ఛైర్మన్, నారాయణ విద్యా సంస్థలు

Civils / Group-1 Mains General Essay

# దైవ కణం.. విశ్వ సృష్టికి మూలాధారం..



సి. హరికృష్ణ
సివిల్స్ ఫ్యాకల్టీ, హైదరాబాద్

**ఈ సంవత్సరం విశ్వవ్యాప్తంగా.. శాస్త్ర, సాంకేతిక విభాగంలో చరిత్ర సృష్టించిన అంశం దైవకణాన్ని గుర్తించడం. ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలకు చెందిన వందలాది శాస్త్రవేత్తలు పాల్పంచుకుని ఎన్నో ఏళ్లు శ్రమించిన తర్వాత సొంతమైన ఈ విజయాన్ని.. విశ్వసృష్టి మూలాధారాల అన్వేషణలో తొలి మైలురాయిగా భావించొచ్చు. ఇక పోటీ పరీక్షల దృక్కోణంలో పరిశీలిస్తే.. ఇంత ప్రాధాన్యమున్న అంశాన్ని ఇటు గ్రూప్స్-1 మెయిన్స్, అటు సివిల్స్ మెయిన్స్‌లో అడిగే అవకాశాలు ఎక్కువే. ఈ నేపథ్యంలో దైవకణం పరిశోధనపై ప్రత్యేక వ్యాసం..**

మూల విజ్ఞాన రంగంలో మనిషి సాధించిన అతి ముఖ్యమైన విజయం.. హిగ్స్ బోసన్ కణం ఉనికిని గుర్తించడం. మౌలిక భౌతిక శాస్త్రంలో మనిషి అధిగమించిన ప్రధాన మైలురాయి ఇది. అయితే ఇది ప్రారంభం మాత్రమే. విశ్వ సృష్టికి మూలాధారంగా భావిస్తున్న ఈ దైవకణం కోసం సాగించే అన్వేషణలో ప్రస్తుత విజయాన్ని ఒక గొప్ప స్ఫూర్తిగా భావించవచ్చు.

## హిగ్స్ నేతృత్వంలో కొత్త సిద్ధాంతం:

విశ్వం రెండు ప్రమాణాలతో తయారై ఉంటుంది. అవి పదార్థం, శక్తి. పదార్థానికి మూలం పరమాణువు. ప్రాచీన భారత దేశంలోని షట్‌దర్శనాల్లో ఒకటైన వైశేషికలో పరమాణు సిద్ధాంతాన్ని చర్చించడం జరిగింది. పూర్వం పరమాణువు విభజించే వీలు లేదు అనే భావన ఉండేది. తర్వాతి కాలంలో అది విభజనీయమేనని, అందులోనూ మూడు ప్రాథమిక కణాలు (ప్రోటాన్లు, ఎలక్ట్రాన్లు, న్యూట్రాన్లు) ఉంటాయని గుర్తించారు.

వీటి ఉనికి కారణమేంటి? వీటికి ద్రవ్యరాశి ఏ విధంగా ఉంది? అనే ప్రశ్నలకు సమాధానంగా 1960లలో ఇంగ్లండ్‌లోని ఎడిన్‌బర్గ్ విశ్వవిద్యాలయ భౌతిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ పీటర్ హిగ్స్, మరో అయిదుగురు మూడు బృందాలుగా పనిచేస్తూ పార్టికల్ ఫిజిక్స్‌లో ఒక కొత్త సిద్ధాంతాన్ని స్వతంత్రంగా ప్రతిపాదించారు. ఈ సిద్ధాంతం ప్రకారం ప్రాథమిక కణాలు ఒక శక్తి క్షేత్రంలో మరో ముఖ్యమైన కణంతో ప్రభావితమై ఉండటం ద్వారానే ద్రవ్యరాశి ఏర్పడుతుంది. ఈ సిద్ధాంతం వల్ల ప్రాథమిక కణాలను వివరించే ఒక ప్రామాణిక నమూనా ఆవిష్కృతమైంది. దీని ప్రకారం 14 బిలియన్ సంవత్సరాల క్రితం బిగ్‌బ్యాంగ్ (ఒక మహా విస్ఫోటం) సంభవించి విశ్వం ఆవిర్భవించింది. ఆ సమయంలో ఏర్పడిన పదార్థంలో 12 ఉప పరమాణు కణాలు, ఆరు బల వాహకాలు (Force Camers) ఉంటాయి. వీటిలో ఒకటి.. పరమాణు కణాలు, పరమాణువులకు, పదార్థానికి, తద్వారా యావత్ విశ్వానికి ద్రవ్యరాశిని ఇస్తుంది. కాబట్టి దీనికి ప్రసిద్ధ నోబెల్ గ్రహీత, భౌతిక శాస్త్రవేత్త లియోన్ లిడెర్‌మెన్ దైవకణంగా పిలిచారు. పీటర్ హిగ్స్ పేరు కలిసేలా దీనికి హిగ్స్ కణం (Higgs Particle) అని పేరు పెట్టారు.

## హిగ్స్-బోసన్ పేరు ఇలా:

భారత శాస్త్రవేత్త సత్యేంద్రనాథ్ బోస్ 1920లలో క్వాంటం మెకానిక్స్‌పై పరిశోధనలు చేసి ఒక బ్రిటిష్ పత్రికకు పంపిన ప్రతిపాదన తిరస్కారానికి గురైంది. ఆ తర్వాత ఆయన తన అధ్యయనాన్ని ఆల్బర్ట్ ఐన్‌స్టీన్‌కు పంపారు. బోస్ అధ్యయనం ప్రాధాన్యతను గుర్తించిన ఐన్‌స్టీన్ పత్రికలో ప్రచురితమయ్యేలా చేశారు. బోస్ పరిశోధన ద్వారా 'బోస్-ఐన్‌స్టీన్ కండిన్సేట్' భావన ఆవిర్భవించింది.

బోస్ పరిశోధన కణ భౌతిక శాస్త్ర (Particle Physics)లో కొత్త అధ్యయనానికి కారణమైంది. బోస్, ఐన్‌స్టీన్ పరిశోధనల ఆధారంగానే పీటర్ హిగ్స్, తదితరులు పరిశోధనలు నిర్వహించారు. కాబట్టి ఈ దైవకణానికి హిగ్స్-బోసన్ అని పేరు పెట్టారు.

ఈ హిగ్స్-బోసన్ కణం ఉనికిని గుర్తించి నిర్ధారించే లక్ష్యంతో జెనీవాలోని ఐరోపా అణు పరిశోధన కేంద్రం (సెర్న్) పరిశోధనలను సాగిస్తోంది. ఈ ఏడాది జూలై 4వ తేదీన ఈ కేంద్రం నిర్వహణ పరిధిలోని లార్జ్ హేడ్రన్ కొల్లైడర్ (LHC) అనే అత్యాధునిక ఆటమ్ స్మాషర్‌లో నిర్వహించిన పరిశోధనలో హిగ్స్-బోసన్ లక్షణాలకు చేరువగా ఉన్న కణాన్ని గుర్తించినట్లు శాస్త్రవేత్తలు వెల్లడించారు.

## మూడు దశాబ్దాల క్రితమే మొదలైన అన్వేషణ:

హిగ్స్-బోసన్ అన్వేషణ 1980లలో ప్రారంభమైంది. తొలుత షికాగోలోని టెవట్రాన్ కొల్లైడర్ వద్ద ఈ అన్వేషణ ప్రారంభమైంది. తర్వాత సెర్న్ వద్ద అటువంటి పరికరంలోనే పరిశోధన కొనసాగింది.

2010లో సెర్న్ వద్ద LHC ఏర్పాటవడంతో సరికొత్త పరిశోధనలు ప్రారంభమయ్యాయి. LHC అనేది 27 కిలోమీటర్ల పొడవైన భారీ గొట్టంలో ఏర్పాటైన పరిశోధన కేంద్రం. దీన్ని స్విట్జర్లాండ్-ఫ్రాన్స్ సరిహద్దు వద్ద వంద మీటర్ల లోతులో ఒక సొరంగంలో ఏర్పాటు చేశారు. మూడు బిలియన్ యూరోలతో నిర్మితమైన ఈ పరిశోధన కేంద్రం ప్రపంచంలోనే అతిపెద్ద పార్టికల్ యాక్సిలరేటర్. (కణాల వేగాన్ని ప్రేరేపించే వేగత్వరణి వంటిది) LHCలో రెండు ప్రోటాన్ల కిరణాలను వ్యతిరేక దిశలో ఒక దానికొకటి ఢీ కొట్టించడం ద్వారా ప్రతి సెకనుకు కొన్ని మిలియన్ల కణ తాడనాలు సంభవించి, బిగ్‌బ్యాంగ్ ప్రారంభ సెకన్‌లోని బిలియన్ వంతు కాలం నాటి పరిస్థితులను సృష్టిస్తారు. అదే సమయంలోనే హిగ్స్-బోసన్ క్షేత్రం ఏర్పడే అవకాశం ఉంది. ప్రోటాన్లను అత్యధికంగా 14 TeV (టెరా ఎలక్ట్రాన్ వోల్ట్స్) వేగానికి ప్రేరేపించే సామర్థ్యం LHCకి ఉన్నప్పటికీ.. అది ప్రస్తుతం 7TeV వద్ద పని చేస్తోంది.

2011 డిసెంబర్ నాటికి 7TeV వద్ద 400 ట్రిలియన్ ప్రోటాన్-ప్రోటాన్ తాడనాలను నిర్వహించిన పరిశోధనల నుంచి సమాచారాన్ని సేకరించడం జరిగింది. ఈ రకమైన తాడనాల వద్ద మాత్రమే 125 గిగా ఎలక్ట్రాన్ వోల్ట్స్ ద్రవ్యరాశి గల హిగ్స్-బోసన్ కణం ఏర్పడుతుంది. అయితే హిగ్స్-బోసన్‌ను కనిపెట్టడానికి శాస్త్రవేత్తలు ఒక కచ్చితత్వ లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. దాన్ని సిగ్మా-5గా పేర్కొంటారు. దీని అర్థం 3.5 మిలియన్లలో ఒక వంతు తప్పుదొర్లే అవకాశం. LHC నుంచి సేకరించే సమాచారాన్ని కంప్యూటర్ల సహాయంతో సిగ్మా-5 కచ్చితత్వ స్థాయికి సరిపడే గణాంకాలను సేకరిస్తారు. డిసెంబర్ 2011లో శాస్త్రవేత్తలు సిగ్మా-3 కచ్చితత్వానికి సరిపడే గణాంకాలను సేకరించారు. సిగ్మా-3 అంటే 750లో ఒక వంతు తప్పుదొర్లే అవకాశం ఉన్నట్లు.



ఏప్రిల్ 5 నుంచి జూన్ 18 వరకు 8Gev శక్తి వద్ద నిర్వహించిన 500 ట్రిలియన్ ప్రోటాన్-ప్రోటాన్ తాడనాల వల్ల సేకరించిన సమాచారం విశ్లేషణ ద్వారా లభించిన గణాంకాల్లో కొత్త కణాన్ని సిగ్మా-5 కచ్చితత్వ స్థాయిలో సెర్న్ శాస్త్రవేత్తలు గుర్తించారు.

## రెండు బృందాల ఆధ్వర్యంలో:

ఈ కణంపై సెర్న్‌కు చెందిన రెండు శాస్త్రవేత్తల బృందాలు స్వతంత్రంగా పనిచేశాయి. ఇందులో ఒకటి ATLAS (A Toroidal LHC Apparatus - ఎ టరాయిడల్ ఎల్‌హెచ్‌సీ అపారటస్) కాగా.. మరోటి CMS (Compact Muon Solenoid - కాంపాక్ట్ మ్యూయన్ సొలినాయిడ్). సీఎంఎస్ బృందం సిగ్మా-5 స్థాయి వద్ద ద్రవ్యరాశి కలిగిన కొత్త కణాన్ని 0.6 GeV దోషంతో గుర్తించగా.. ATLAS బృందం 125.3 GeV ద్రవ్యరాశి కలిగిన కొత్త కణాన్ని 0.6 GeV దోషంతో గుర్తించింది.

ప్రపంచ వ్యాప్తంగా భౌతిక శాస్త్రవేత్తలు ఆశ్చర్యచకితులయ్యే విధంగా సిగ్మా-5 కచ్చితత్వ స్థాయిలో కొత్త కణాన్ని సెర్న్ శాస్త్రవేత్తలు గుర్తించగలిగారు. ఈ ఆవిష్కారానికి మూలాధారమైన శాస్త్రవేత్త పీటర్ హిగ్స్ కూడా ఈ కొత్త కణం ప్రకటన సమయంలో ఉన్నారు. 'నా జీవిత కాలంలో ఇది సాధ్యమవుతుందని ఊహించలేదు' అని ఆయన పేర్కొన్నారు. ఎల్‌హెచ్‌సీలో గుర్తించిన ఈ కొత్త కణం హిగ్స్-బోసన్‌కు దాదాపు అనుగుణంగానే ఉంది. అయితే నిర్దిష్టంగా తేల్చేందుకు మరింత గణాంక సమాచారం సెర్న్‌కు అవసరముంటుంది.

## వచ్చే ఏడాది మరింత సమాచారం:

మార్చి 2013లో ఎల్‌హెచ్‌సీ ద్వారా ప్రస్తుతం లభించిన సమాచారంకంటే మూడింతల ఎక్కువ సమాచారం లభించనుంది. అప్పుడు లభించే సమాచారం ఆధారంగా కొత్త కణాన్ని హిగ్స్-బోసన్‌గా కూడా ప్రకటించే అవకాశాలున్నాయి.

2013 మార్చి-2015 మార్చి వరకు నిర్వహణ నిమిత్తం ఎల్‌హెచ్‌సీని మూసి వేస్తారు. ఆ కాలంలో శాస్త్రవేత్తలు అధిక శక్తి కోసం దీని రీవైరింగ్ చేస్తారు. ప్రస్తుతం ఉన్న 7, 8 TeV స్థాయి నుంచి గరిష్ఠ శక్తి 14 TeV వద్ద పనిచేసే స్థాయికి దీన్ని అభివృద్ధి చేస్తారు.

2015 మార్చి తర్వాత 13.8 TeV శక్తి వద్దకు దీనిలో పరిశోధనలు చేయడం జరుగుతుంది. ఇలాంటి శక్తి వద్ద 125 GeV ద్రవ్యరాశి కలిగిన హిగ్స్-బోసన్ కంటే అధిక ద్రవ్యరాశి (2000 GeV) కలిగిన కొత్త కణాలను గుర్తించడం సాధ్యమవుతుంది.

## భవిష్యత్తులో మరిన్ని విషయాలు:

సమీప భవిష్యత్తులో ఎల్‌హెచ్‌సీ ద్వారా సేకరించే సమాచారం, అందే గణాంకాలు, వాటి ఫలితాలు భౌతిక శాస్త్ర పరిశోధనలో ఎన్నో కొత్త విషయాలను తెరపైకి తీసుకురానున్నాయి. ఇప్పటి వరకు పదార్థ ఉనికికి కారణం అవుతున్నట్లుగా భావిస్తున్న 'నిర్దిష్ట నమూనా'ను ధ్రువీకరించడంతోపాటు ప్రాథమిక, ఉప పరమాణు కణాలను మరింత అర్థం చేసుకోవడంలో ఈ పరిశోధన తోడ్పడుతుంది. కృష్ణ పదార్థం, కృష్ణ శక్తి, సమాంతర విశ్వాలు వంటి అంశాలను ఇది వివరించదు. విశ్వంలో ప్రతి కణానికి కనిపించని, అధిక ద్రవ్యరాశి, గురుత్వాకర్షణ శక్తి ఉన్న సమాంతర కణాలను వివరించే సూపర్ సిమెట్రీ సిద్ధాంతం కూడా హిగ్స్-బోసన్ ద్వారా ప్రభావితం కానుంది.

కాబట్టి హిగ్స్-బోసన్ నిర్ధారణ కేవలం ప్రారంభం మాత్రమే. విశ్వంపై మరింత అవగాహన పొందే విషయంలో ఇది ఒక ముందడుగు అవుతుంది.

### దైవకణ పరిశోధన.. కొన్ని విశేషాలు

- తొలుత 1964లో పీటర్ హిగ్స్‌తోపాటు ఆరుగురు శాస్త్రవేత్తల బృందం దైవకణానికి సంబంధించి పరమాణు ప్రతిపాదన చేసింది.
- ఎల్‌హెచ్‌సీలో అత్యంత శీతల ఉష్ణోగ్రత ఉంటుంది (మైనస్ 271 డిగ్రీలు).
- ఈ సొరంగంలో న్యూట్రినో సెకనుకు 11 వేల రెట్ల వేగంతో ప్రయాణిస్తుంది.
- సెర్న్ హార్డ్‌వేర్ పరికరాల్లో ముఖ్యమైంది ఎనిమిది వేల టన్నుల బరువున్న అయస్కాంతం.
- పరిశోధనల్లో పాల్గొన్న మొత్తం శాస్త్రవేత్తలు 12,000.
- పరిశోధనకు చేసిన ఖర్చు- 21 వేల కోట్లు.
- దైవకణం ఉనికి దొరికింది అని ప్రకటించిన వ్యక్తి సెర్న్ డైరెక్టర్ జనరల్ రాల్ఫ్ హ్యూమెర్

### 'ప్రాజెక్ట్‌కు భారత్ చారిత్రక పిత'

హిగ్స్-బోసన్ ప్రాజెక్ట్‌లో భారత ముద్ర కూడా ఉంది. ఈ పరిశోధనలో భారత శాస్త్రవేత్తలు, పరిశోధన కేంద్రాలు, సంస్థలు పాల్పంచుకున్నాయి. సెర్న్ నిర్వహించిన ఈ ప్రయోగంలో వంద మందికిపైగా భారత శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. ఈ పరిశోధనలో పాల్పంచుకున్న రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్స్..

- భువనేశ్వర్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిజిక్స్
- ముంబైలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్
- కోల్‌కతాలోని సాహా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూక్లియర్ ఫిజిక్స్
- అలహాబాద్‌లోని హరిశ్చంద్ర రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్
- ఇండోర్‌లోని రాజారామన్న సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ
- ఇండోర్‌లోని ఇండో-జర్మన్ టూల్ రూమ్

శాస్త్రవేత్తలు ఈ పరిశోధనలో పాల్గొన్నారు. ఇవన్నీ అణుశక్తి విభాగంలోని ఎయిడెడ్ సంస్థలు. అదేవిధంగా కోల్‌కతాలోని వేరియబుల్ ఎనర్జీ సైక్లోట్రాన్, జమ్ము, గౌహతి, రాజస్థాన్, అలీగఢ్ ముస్లిం విశ్వ విద్యాలయాలు, కోల్‌కతాలోని బోస్ ఇన్‌స్టిట్యూట్, ఐఐటీ-ముంబై కూడా ఈ పరిశోధనలో పాల్పంచుకున్నాయి. భారత పాత్రను కొనియాడుతూ సెర్న్ ప్రతినిధి గువాలో గియుబెలినో **'ఈ ప్రాజెక్ట్‌కు భారత్ చారిత్రక పిత'** అని వ్యాఖ్యానించారు. కోల్‌కతాలోని ఎస్ఐఎన్‌పీ శాస్త్రవేత్తలు కాంపాక్ట్ మ్యూయన్ సొలినాయిడ్‌ను రూపొందించారు. అంతేకాకుండా లక్షలాది ఎలక్ట్రాన్ చిప్‌లను చండీగఢ్‌లోనే తయారు చేశారు. అదేవిధంగా ఎల్‌హెచ్‌సీ ఉన్న సొరంగానికి హైడ్రాలిక్ స్టాండ్లను భారత్‌లోనే తయారు చేయడం విశేషం. భారత శాస్త్ర, సాంకేతిక విభాగం, అణుశక్తి విభాగం కూడా సెర్న్‌తో కలిసి పని చేశాయి.

ఎల్‌హెచ్‌సీలోని ముఖ్యమైన విడి భాగాలను రాజారామన్న సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ రూపొందించగా.. ఇండో-జర్మన్ టూల్‌రూం.. ఎల్‌హెచ్‌సీని నిర్దిష్ట ప్రదేశంలో అమర్చడానికి ఉపయోగించే జాక్‌లను తయారు చేసింది.

# భారత యూనియన్‌లో నిజాం రాజ్యం విలీనం..



కె. యాకూబ్ బాష
డెరైక్టర్ - జీసీ స్టడీ సర్కిల్, గుంటూరు.

**శివాజీ ఉత్థానానికి దోహద పడిన పరిస్థితులను తెలపండి?**

జ: ఒకవైపు అఖండమైన మొఘల్ సామ్రాజ్యం, మరోవైపు బలిష్ఠమైన దక్కన్ రాజ్యాలు, వీటి ప్రభావాన్ని తట్టుకొని శివాజీ మరాఠాల స్వతంత్ర్య రాజ్యంగా స్వరాజ్యాన్ని నిర్మించడం మధ్యయుగ భారతదేశ చరిత్రలో ఒక అపూర్వ ఘట్టం. ఈ స్వరాజ్య నిర్మాణానికి శివాజీకి అనేక పరిస్థితులు తోడ్పడ్డాయి. అవి..

**భౌగోళిక పరిస్థితులు:**

మరాఠ ప్రాంతం ఉత్తరాన వింధ్య- సాత్పురా పర్వతాలు, తూర్పున దక్కన్ పీఠభూమి, పశ్చిమాన సహ్యాద్రి పర్వతాలతో పరివేష్టితమై ఉంది. చుట్టూ ఉన్న కారడవులు, కొండలు, లోయలు ఈ ప్రాంతాన్ని విదేశీ దండయాత్రలకు అననుకూలతను కలిగించాయి. స్థానికుల గెరిల్లా యుద్ధ పద్ధతికి అనుకూలతను కలిగి శత్రు సైన్యాన్ని సులభంగా మట్టుపెట్టే అవకాశం కలిగించాయి. చీలి ఉన్న పర్వత శ్రేణులు సహజ రక్షణ కవచంగా ఉండడమే కాక తక్కువ ఖర్చుతో శత్రు దుర్భేద్య కోటల నిర్మాణానికి అనువుగా ఉన్నాయి. మరాఠా ప్రాంతమంతా రాతిమయం, నిస్సారవంతం. జీవనోపాధి అతి కష్టం. ఇదే మరాఠీల్లో కష్టించే గుణానికి దారితీసింది. ఆర్థిక అసమానతలు లేకపోవడం, అభివృద్ధికి దూరంగా మిగిలిన ప్రాంతంతో వేరుగా ఏకాంతంగా ఉండడం మరాఠాల్లో ఐక్యతకు అవకాశం ఏర్పడింది. అందుకే జదునాథ్ సర్కార్ 'ప్రకృతి మరాఠాల్లో స్వయం సమృద్ధినీ, ముక్కుసూటితనాన్ని, సామాజిక సమానత్వాన్ని కలిగించి తద్వారా మనిషిని మనిషిగా గుర్తించి గౌరవించే గుణాన్ని రూపొందించింది' అని పేర్కొన్నారు.

**మత సాంస్కృతిక పరిస్థితులు:**

ఒక వైపు భక్తి ఉద్యమం, మరోవైపు మొఘల్ వ్యతిరేక ఉద్యమాలతో మరాఠీ భాషా సంస్కృతుల్లో గొప్ప మార్పు సంభవించి శివాజీ ప్రాబల్యానికి దోహదపడింది. భక్తి ఉద్యమకారులు జ్ఞానేశ్వర్, నామ్‌దేవ్ ఏకనాథ్, తుకారాం, రాందాస్ తదితరులు పండరీపురం కేంద్రంగా భక్తి ఉద్యమాన్ని ప్రచారం చేశారు. అసమానతలు, మూఢనమ్మకాలను నిరసించారు. ఈ చర్యలు స్వరాజ్య నిర్మాణానికి అవసరమైన భావ సంపదను అందించాయి. భక్తి కవుల వల్ల మరాఠి భాషగా మారి ప్రజలను సాంస్కృతికంగా ఐక్యం చేయడంలో దోహదపడింది. సమర్థ రామదాసు తన మహారాష్ట్ర ధర్మ ప్రచారం ద్వారా మరాఠీలకు ఒక రాజకీయ దృక్పథాన్ని కలిగించడమే కాక శివాజీకి స్వరాజ్య నిర్మాణంలో ఉత్ప్రేరకంగా పనిచేశాడు.

**రాజకీయ పరిస్థితులు:**

మరాఠీలు బీజాపూర్ , గోల్కొండ, అహ్మద్‌నగర్ రాజ్యాల్లో పలు సైనిక పాలనా పదవులలో నియమితులయ్యారు. దీని వల్ల పాలనలో అనుభవం సాధించారు. మాలిక్ అంబర్ ద్వారా గెరిల్లా యుద్ధ విద్యను నేర్చుకున్నారు. మొఘలులు బలిష్ఠమైన దక్కన్ రాజ్యాలను అంతం చేసి స్వరాజ్య నిర్మాణానికి అడ్డంకులను తొలగించడం కూడా లాభించింది.

**శివాజీ నాయకత్వం:**

ఈ పరిస్థితులన్నింటి సమన్వయంతో స్వరాజ్య నిర్మాణం అనే బృహత్ కార్యాన్ని పూర్తి చేయగల సమర్థ నాయకత్వాన్ని శివాజీ అందించాడు. ఒక చిన్న జాగీర్దారుగా జీవితాన్ని ప్రారంభించి మొఘలులు, ఆదిల్షాహీలతో నిరంతరం పోరాడుతూ ఆ ప్రాంతాలను ఆక్రమించుకుంటూ స్వరాజ్యాన్ని ఒక పటిష్ఠ హిందూ రాజ్యంగా తీర్చి దిద్దాడు.

**నిజాం రాజ్యం భారత యూనియన్‌లో విలీనమయ్యేందుకు కారణమైన సంఘటనలు వివరించండి?**

జ: 1947 నాటి నిజాం రాజ్యంలో తెలంగాణా, మరట్వాడా, కన్నడ ప్రాంతాలు అంతర్భాగాలుగా ఉండేవి. 1947-48 మధ్య జరిగిన సంఘటనలు నిజాం రాజ్యం భారత యూనియన్‌లో విలీనమయ్యేందుకు దోహదపడ్డాయి.

**నిజాం స్వతంత్ర ప్రకటన:**

1947 జూన్ 3 నాటి మౌంట్ బాటన్ ప్రణాళిక ప్రకారం స్వదేశీ సంస్థానాలు పాకిస్థాన్‌లో లేదా భారత యూనియన్‌లో చేరవచ్చు. వీటికి అంగీకరించని నాటి నిజాం.. నిజాం రాజ్యం స్వతంత్రంగా ఉంటుందని ప్రకటించారు.

**విలీనోద్యమం ప్రారంభం:** 1947 మే 7న హైదరాబాద్‌ను సందర్శించిన జాతీయ నాయకుడు జయప్రకాశ్ నారాయణ నిజాం భారత యూనియన్‌లో చేరాలని పిలుపునిచ్చారు. అందుకు నిజాం జయప్రకాశ్ నారాయణను తన రాజ్యం నుంచి బహిష్కరించారు. దాంతో హైదరాబాద్ రాష్ట్ర కాంగ్రెస్ విలీనోద్యమాన్ని ప్రారంభించింది. రామానంద తీర్థ 21వేల మందితో సత్యాగ్రహం నిర్వహించారు. విలీనోద్యమ నిర్వహణకు బొంబాయి, షోలాపూర్‌లలో ప్రాంతీయ కార్యాలయాలు ఏర్పడ్డాయి.

నిజాం అణచివేత చర్యలకు తోడు రజాకార్ల దాడులూ మొదలయ్యాయి. నిజాం అణచివేతలను లెక్క చేయకుండా రామానంద తీర్థ, కె.వి. రంగారెడ్డి, మర్రి చెన్నారెడ్డి , జె.వి. నర్సింగరావు మొదలైన వారు ఆగస్టు 7న విమోచన దినోత్సవంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. భారత స్వాతంత్ర్య దినోత్సవంపై నిజాం విధించిన నిషేధాజ్ఞలు ఉల్లంఘించి రామానంద తీర్థ తనకు నెహ్రూ స్వయంగా బహూకరించిన జాతీయ పతాకాన్ని హైదరాబాద్‌లోని సుల్తాన్ బజార్‌లో ఎగురవేశారు.

**యథాతథ ఒప్పందం:** దీని కాల పరిమితి ఏడాది. తాత్కాలిక శాంతి కోసం నిజాం భారత్ యూనియన్‌తో 1947 నవంబరు 29న యథాతథ ఒప్పందం చేసుకున్నారు. దీని ప్రకారం గతంలో బ్రిటిష్‌కున్న రక్షణ, విదేశీ వ్యవహారాలు వంటివి యూనియన్‌కు చెందుతాయి. యూనియన్ తరఫున హైదరాబాద్‌లో ఏజెంట్ జనరల్‌ను నియమిస్తారు.

**ఉల్లంఘన:** నిజాం యథాతథ ఒప్పందాన్ని పలుసార్లు ఉల్లంఘించారు. భారత కరెన్సీ నిజాం రాజ్యంలో చెల్లదని ప్రకటించారు. ఏజెంట్ జనరల్ కె. ఎం. మున్షీకి తగిన గౌరవ మర్యాదలు కల్పించకుండా అవమానించారు. అక్రమ ఆయుధాల సేకరణకు ప్రయత్నించారు. పాకిస్థాన్ ఆర్థిక మంత్రి హైదరాబాద్‌ను, నిజాం ప్రధాని అలీ పాకిస్థాన్‌ను సందర్శించారు. రజాకార్లు భారత యూనియన్‌పై జీహాద్‌ను ప్రకటించి కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. 1948 మార్చి 31న ఖాసీం రిజ్వీ ఛలో ఢిల్లీ అనే నినాదంతో ఎర్రకోటపై అసఫ్‌జాహీ పతాకాన్ని ఎగురవేస్తానని ప్రకటించారు. తమ వ్యతిరేక వార్తలు రాసిన షోయబుల్లాఖాన్‌ను హత్య చేశారు. రజాకార్ల సంస్థను నిషేధించమన్న భారత్ అభ్యర్థనను తిరస్కరించారు. పాకిస్థాన్ సలహాపై యూఎన్‌వోకు అప్పీల్ చేసేందుకు మొయిన్ నవాబ్‌జంగ్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 10, 1948న ఒక బృందాన్ని పంపించారు.

**పోలీసు చర్య:** ఈ పరిస్థితుల్లో ఏజెంట్ జనరల్ నివేదికను అనుసరించి భారత ప్రభుత్వం జనరల్ జె.ఎన్. చౌదరీ ఆధ్వర్యంలో సెప్టెంబరు 13న పోలీస్ చర్యను ప్రారంభించింది. సెప్టెంబరు 17 నాటికి నిజాం సేనలు ఓడిపోయి జనరల్ ఇద్రూస్‌కు లొంగిపోయారు. ఖాసీం రిజ్వీ, ప్రధాని లాయక్ అలీ పాకిస్థాన్‌కు పారిపోయారు. ఎం.కె. వెల్లోడి అనే సివిల్ సర్వీస్ అధికారి హైదరాబాద్ సీఎంగా నియమితులయ్యారు. దీంతో భారతదేశ గర్భంలోని పుండు తొలగిపోయింది అని వల్లభాయ్ పటేల్ ప్రకటించారు. 1952లో ఎన్నికల ద్వారా బూర్గుల రామకృష్ణారావు సీఎంగా ఎంపికయ్యారు. నిజాం 1956 వరకు రాజ ప్రముఖ్‌గా కొనసాగాను. ఈ విధంగా దేశంలోనే అతిపెద్ద సంస్థానం హైదరాబాద్ భారత యూనియన్‌లో విలీనమైంది.

**నిజాం రాజ్యానికి సాలార్‌జంగ్ చేసిన సేవలు తెలపండి?**

జ: సాలార్ జంగ్ అసలుపేరు నవాబ్ తురబ్ అలీఖాన్. 1853 నుంచి 1883 వరకు 'సాలార్‌జంగ్' బిరుదుతో నాసిర్ ఉద్దౌలా, అఫ్జల్ ఉద్దౌలా, మీర్ మహబూబ్ అలీఖాన్ అనే నిజాంల వద్ద దివాన్‌గా పనిచేశారు. నిజాం పాలనా వ్యవస్థలను మధ్యయుగపు పోకడల నుంచి విముక్తి చేసేందుకు పలు సంస్కరణలు ప్రవేశపెట్టారు.

**సాలార్‌జంగ్ సంస్కరణలు:**

ఆర్థిక సంస్కరణలు: తాను రాజ్యానికి వచ్చేనాటికి నిజాం రాజ్యం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకొని దివాళ తీసే పరిస్థితుల్లో ఉంది. ఓవైపు బ్రిటిషర్లకు రూ. లక్షల బకాయిలు, మరోవైపు ప్రభుత్వ రోజువారీ ఖర్చులకు రోహిల్లాల దగ్గర నిజాం నగలు తాకట్టులో ఉన్నాయి. ఈ పరిస్థితులను చక్కదిద్దేందుకు పలు కఠిన చర్యలు తీసుకున్నారు. సైన్య సహకార ఒప్పందంపై సంతకం చేసినందున అనేక సైనికోద్యోగాలను రద్దు చేశారు. రైత్వారీ విధానం ప్రవేశపెట్టి శిస్తు వసూలుకు రెవెన్యూ ఉద్యోగులను నియమించారు. 1857 తిరుగుబాటులో బ్రిటిషర్లకు మద్దతివ్వడం, రూ. 50 లక్షల రుణమాఫీని పొందడంతోపాటు వారికిచ్చిన ధారాశివ్, రాయచూర్ జిల్లాలను వెనక్కి తీసుకొచ్చారు. హైదరాబాద్‌లో కేంద్ర టంకశాలను ఏర్పాటు చేసి, హాలిసిక్కా అనే వెండి నాణేన్ని ప్రవేశపెట్టారు. హైదరాబాద్-వాడి రైలు మార్గం ద్వారా నిజాం సంస్థానాల్ని మిగిలిన దేశంతో అనుసంధానించి వ్యాపార, వాణిజ్య వృద్ధికి కృషి చేశారు.

రెవెన్యూ సంస్కరణలు: 1865లో జిలాబందీ అనే రెవెన్యూ విభాగాన్ని ప్రవేశపెట్టారు. నిజాం రాజ్యాన్ని 14 జిల్లాలుగా విభజించి జిల్లాకు అవల్ తాలూకాదార్లను, వారి కింద దుయం తాలూకాదార్లు, సోయం తాలుకాదార్లను నియమించారు. 14 జిల్లాలను 5 డివిజన్లుగా విభజించి సదర్ తాలూకాదార్‌ను డివిజన్ అధికారిగా నియమించారు.

**పోలీసు సంస్కరణలు:** రెవెన్యూ శాఖలో భాగంగా ఉన్న పోలీసు శాఖను విడదీసి మహరామా ఎ-కొత్వాలి అనే పోలీసు శాఖను ఏర్పాటు చేశారు. నిజామత్ అనే ప్రత్యేక పోలీసు దళాన్ని ఏర్పాటు చేసి పోలీసు వ్యవస్థను పునర్వ్యవస్థీకరించారు. జిల్లా నుంచి కింది స్థాయి వరకు మూడంచెల అధికారులను నియమించారు. జిల్లాస్థాయిలో ముహతామిన్, తర్వాతి విభాగంలో అమీన్ కింది స్థాయిలో చౌకీదార్లను నియమించారు.

**న్యాయ సంస్కరణలు:** క్రమానుగత శ్రేణిలో సివిల్, క్రిమినల్ న్యాయస్థానాలు ఏర్పాటు చేశాడు. బుజుంగ్, దివానీ, ఖుర్ది, ఫౌజ్‌దారీ అదాల్‌లత్‌లను స్థాపించాడు. మీర్ ఆదిల్, మీర్ యున్సిఫ్‌లను జిల్లా స్థాయి జడ్జీలుగా నియమించాడు. మహాకామా-ఎ-సదర్ పేరుతో హైకోర్టు, మజ్లిస్-ఎ-మురాఫా పేరుతో సుప్రీం కోర్టును ఏర్పాటు చేశారు.

## పేపర్-2 మోడల్ పేపర్

### సెక్షన్-1

1. ఎ) భారతదేశంలో వర్ణజాతి లేదా కుల వ్యవస్థ క్రమ పరిణామం గురించి రాయండి? (లేదా)
   బి) మహాయాన మత అవతరణకు కారణాలను తెలుపుతూ ఇది గాంధార, మధుర, ఇతర శిల్ప కళా శైలులకు ఏ విధంగా దోహద పడిందో తెలపండి?
2. ఎ) శివాజీ ఉత్థానానికి దోహదపడిన పరిస్థితులను గురించి తెలపండి? (లేదా)
   బి) విజయనగర రాజులు వాస్తు శిల్ప కళలు, సాహిత్యానికి చేసిన సేవను మదింపు చేయండి?
3. ఎ) 1857 తిరుగుబాటు ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం అనే వ్యాఖ్యను విమర్శనాత్మకంగా చర్చించండి? (లేదా)
   బి) జాతీయోద్యమ ఆవిర్భావ కారణాలు తెలపండి?
4. ఎ) భారతదేశంలోని 19, 20 శతాబ్దాల్లో జరిగిన కుల ఉద్యమాల స్వభావాన్ని తెలపండి? (లేదా)
   బి) సామాజిక, మత సంస్కరణోద్యమాలు సాధించిన విజయాలు, వైఫల్యాలను బేరీజు వేయండి?
5. ఎ) మతతత్వ వాద ఆవిర్భావం, అది అభివృద్ధి చెందిన విధాన్ని చర్చించండి? (లేదా)
   బి) జాతీయవాద సాహిత్యాన్ని గురించి వివరించండి?

### సెక్షన్-2

6. ఎ) ఇక్ష్వాకులు ఆంధ్ర సంస్కృతికి చేసిన సేవ ఎటువంటిది? (లేదా)
   బి) 'తెలుగు సాహిత్యంలో వేంగి చాళుక్యులకు ఒక ప్రత్యేక స్థానముంది' చర్చించండి?
7. ఎ) 1000-1565 మధ్యకాలంలో ఆంధ్రదేశంలోని సామాజిక, మత పరిస్థితులను గురించి చర్చించండి? (లేదా)
   బి) 'తెలుగు సాహిత్యంలో మొల్లకు ఒక ప్రత్యేక స్థానముంది' నిరూపించండి?
8. ఎ) ఆంధ్రలో సామాజిక, సాంస్కృతిక చైతన్యానికి దోహదపడిన పరిస్థితులను వివరిస్తూ ఈ ఉద్యమంలో కందుకూరి వీరేశలింగం పాత్రను వివరించండి? (లేదా)
   బి) ఆంధ్రలో సహాయ నిరాకరణోద్యమం జరిగిన తీరును వివరించండి?
9. ఎ) నిజాం రాజ్యానికి సాలార్‌జంగ్ చేసిన సేవను తెలపండి? (లేదా)
   బి) తెలంగాణలో 1938లో జరిగిన వందేమాతర ఉద్యమాన్ని గురించి రాయండి?
10. ఎ) నిజాం రాజ్యం భారత్ యూనియన్‌లో విలీనమయ్యేందుకు దోహదపడిన సంఘటనలు గురించి రాయండి? (లేదా)
   బి) తెలంగాణ సాయుధ పోరాటానికి కారణాలు, అది సాధించిన ఫలితాలను గురించి రాయండి?

### సెక్షన్-3

11. ఎ) ప్రాథమిక హక్కులు, ఆదేశ సూత్రాల మధ్య గల సంబంధాన్ని విమర్శనాత్మకంగా రాయండి? (లేదా)
   బి) రాజ్యాంగ పరిణామ క్రమం గురించి వివరించండి?
12. ఎ) 'గవర్నర్ కేంద్ర ప్రభుత్వ ఏజెంట్ కాదు, రాజ్యాంగ పరిరక్షకుడు' అని వ్యాఖ్యానించండి? (లేదా)
   బి) 'రాజ్యాంగబద్ధ సంస్థల కంటే రాజ్యాంగేతర సంస్థలకే ఎక్కువ అధికారాలు, విధులు ఉన్నాయి', ఆర్థిక సంఘం, ప్రణాళికా సంఘాలను దృష్టిలో ఉంచుకొని దీనిని విమర్శనాత్మకంగా పరిశీలించండి?
13. ఎ) 'జనలోక్‌పాల్ అవినీతి నిర్మూలనకు ఏకైక పరిష్కారమా' చర్చించండి? (లేదా)
   బి) దత్త శాసనం వల్ల చేకూరే లాభాలు, నష్టాలను తెలపండి?
14. ఎ) సవరణకు అవకాశం లేని రాజ్యాంగం నియంతృత్వం వంటిది' వ్యాఖ్యానించండి? (లేదా)
   బి) పంచాయతీరాజ్ సంస్థల పనితీరు ఆశించినట్లు లేకపోవడంలో ప్రభుత్వాల పాత్ర?
15. ఎ) ఎస్సీ, ఎస్టీలపై అత్యాచారాల నివారణ చట్టం అమలును విమర్శనాత్మకంగా పరిశీలించండి? (లేదా)
   బి) మహిళల అభివృద్ధి కోసం రాజ్యాంగం కల్పించిన రక్షణలు, అవి అమలవుతున్న తీరును మదించండి?

భవిత Now Bhavita Also on Sakshi TV
Every Sunday9-30am to 10am



# ఫోర్బ్స్ జాబితాలో మెర్కెల్‌కు మొదటి స్థానం



ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి
కరెంట్ అఫైర్స్ నిపుణులు

## క్రీడలు

### క్రీడా అవార్డులు

**ద్రోణాచార్య అవార్డులు:** క్రీడా రంగంలో కోచ్‌లకు ఇచ్చే ప్రతిష్టాత్మక ద్రోణాచార్య అవార్డుకు 2012 సంవత్సరానికి ఆరుగురు కోచ్‌లు ఎంపికయ్యారు. అస్లాం షేర్‌ఖాన్ నేతృత్వంలోని కమిటీ వీరిని ఎంపిక చేసింది. వివరాలు.. యశ్వీర్ సింగ్ (రెజ్లింగ్); వీరేంద్ర పూనియా (అథ్లెటిక్స్); సునీల్ దేవాస్(కబడ్డీ); హరీందర్ సింగ్ (హాకీ); సత్యపాల్ (పారా అథ్లెటిక్స్); ఫెర్నాండెజ్ (క్యూబా,బాక్సింగ్); విదేశీ కోచ్‌కు ఈ అవార్డు దక్కడం ఇదే ప్రథమం

**ధ్యాన్‌చంద్ అవార్డులు:** ఈ అవార్డులు నలుగురు మాజీ క్రీడాకారులకు దక్కాయి. వివరాలు.. జగ్ రాజ్ సింగ్ మాన్(అథ్లెటిక్స్); గుణ్ దీప్ కుమార్ (హాకీ); వినోద్ కుమార్(రెజ్లింగ్); సుఖ్‌బీర్ సింగ్ టోకాస్ (పారా స్పోర్ట్స్)

**లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డు:** జె.ఎస్. భాటియా (అథ్లెటిక్స్), భవానీ ముఖర్జీ (టేబుల్ టెన్నిస్) ఈ అవార్డుకు ఎంపికయ్యారు.

**రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కార్:** క్రీడలను ప్రోత్సహించినందుకుగాను ఇచ్చే ఈ అవార్డు స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా, రైల్వే స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డ్, సర్వీసెస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డ్, ఎయిర్ ఇండియా స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డుకు దక్కింది.

### భారత్‌కు అండర్ -19 ప్రపంచకప్




అండర్-19 క్రికెట్ ప్రపంచకప్‌ను భారత్ గెలుచుకుంది. టౌన్స్‌విల్లే(ఆస్ట్రేలియా)లో ఆగస్టు 26న జరిగిన ఫైనల్స్‌లో ఆస్ట్రేలియాను 6 వికెట్ల తేడాతో ఓడించింది. ఈ టోర్నమెంట్‌ను భారత్ మూడోసారి గెలుచుకుంది (2000, 2008లలో కూడా విజేతగా నిలిచింది). భారత జట్టు కెప్టెన్ ఉన్ముక్త్ చంద్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా, ఆస్ట్రేలియా కెప్టెన్ బసిస్తో 'మ్యాన్ ఆఫ్ ది సిరీస్' గా ఎంపికయ్యారు.

### లాన్స్‌పై జీవితకాల నిషేధం

ప్రఖ్యాత సైక్లిస్ట్ లాన్స్ ఆర్మ్‌స్ట్రాంగ్‌పై అమెరికా యాంటీ డోపింగ్ ఏజెన్సీ(యూఎస్ఏడీఏ) జీవితకాల నిషేధం విధించింది. దీంతో 1998 నుంచి ఇప్పటి వరకు సాధించిన అన్ని విజయాలు రద్దవుతాయి. యూఎస్ఏడీఏ తనపై చేస్తున్న ఆరోపణలపై పోరాడకూడదని ఆర్మ్‌స్ట్రాంగ్ నిర్ణయం తీసుకోవడంతో నిషేధం అనివార్యమైంది. 1996లో వృషణాల క్యాన్సర్ బారిన పడ్డాడు. బతకడం అసాధ్యమనుకున్న దశ నుంచి పలు శస్త్ర చికిత్సలతో కోలుకున్నాడు. తిరిగి సైక్లింగ్ సాధన ఆరంభించి.. 1999 నుంచి 2005 వరకు వరుసగా ఏడు టూర్‌డి ఫ్రాన్స్ టైటిళ్లు గెలుచుకున్నాడు. ఈ విజయంతో ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ రోగులందరిలో ధైర్యాన్ని నింపాడు.

## జాతీయం

### లక్ష్య-1 పరీక్ష విజయవంతం



పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన తేలిక పాటి అతి చిన్న పైలట్ రహిత విమానం 'లక్ష్య-1' పరీక్ష విజయవంతమైంది. దీన్ని ఆగస్టు 23న ఒడిశాలోని బాలసోర్ జిల్లా చాందిపూర్ ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ నుంచి ప్రయోగించారు. ఆరు అడుగుల పొడవు ఉండే ఈ విమానం 30-35 నిమిషాల వరకు ప్రయాణిస్తుంది. వైమానిక దళ పైలట్లతో పాటు సాధారణ పైలట్ల శిక్షణ కోసం రూపొందించిన 'లక్ష్య-1'ను నేలపై నుంచి రిమోట్ సాయంతో నియంత్రించవచ్చు. బెంగళూరులోని ఏరోనాటిక్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ దీన్ని రూపొందించింది.

### రాజ్యసభ ఉపాధ్యక్షుడిగా కురియన్



రాజ్యసభ ఉపాధ్యక్షుడిగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పి.జె. కురియన్ ఆగస్టు 21న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా ఉన్న కె. రహ్మాన్ ఖాన్ పదవీ కాలం ఏప్రిల్‌లో ముగియడంతో కురియన్ ఎన్నిక అనివార్యమైంది.

### క్యాట్ చైర్మన్‌గా జస్టిస్ ఆలం

కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ (క్యాట్) చైర్మన్‌గా జస్టిస్ సయ్యద్ రఫత్ ఆలం ఆగస్టు 8న బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈయన అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వహించారు.

### పృథ్వి-2 పరీక్ష విజయవంతం



పృథ్వి -2 బాలిస్టిక్ క్షిపణి పరీక్షను ఒడిశాలోని బాలాసోర్‌లోని ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ నుంచి ఆగస్టు 25న విజయవంతంగా నిర్వహించారు. అణ్వస్త్ర సామర్థ్యంగల ఈ క్షిపణి ఉపరితలం నుంచి ఉపరితలంలో 350 కి.మీ. దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదు. 500 కిలోల సంప్రదాయ అణ్వాస్త్రాలను మోసుకుపోగలదు. 9 మీటర్ల పొడవు, 1 మీటరు వ్యాసం గల ఈ క్షిపణిలో ఘన ఇంధనాన్ని ఉపయోగిస్తారు. దీన్ని ఇప్పటికే సైన్యంలో ప్రవేశపెట్టారు.

### కోస్టల్ రాడార్ల క్లస్టర్లు ప్రారంభం



కోస్తా తీరంలో నిఘాను పెంచేందుకు ఉద్దేశించిన కోస్టల్ రాడార్లకు చెందిన మహారాష్ట్ర క్లస్టర్‌ను రక్షణమంత్రి ఎ.కె. ఆంటోని ముంబైలో ఆగస్టు 25న ప్రారంభించారు. ఈ రాడార్లలో 10 నాటికల్ మైళ్ల దూరం వరకు పరిశీలించగల కెమెరాలను ఏర్పాటు చేశారు. ఇందులో నైట్ విజన్, ఆటోమేటిక్, ఐడెంటిఫికేషన్ సిస్టమ్, థెర్మల్ సెన్సార్లు ఉంటాయి. కోస్టల్ రాడార్ల ఏర్పాటు ప్రాజెక్ట్ కింద మొదటి దశలో రూ.600 కోట్ల ఖర్చుతో కోస్తా తీరంలో 46 స్టాటిక్ సోనార్లు ఏర్పాటు చేస్తారు.

## అంతర్జాతీయం

### ఫోర్బ్స్ జాబితాలో మెర్కెల్‌కు మొదటి స్థానం



2012 సంవత్సరానికి ప్రపంచంలో శక్తివంతులైన మహిళల జాబితాను ఫోర్బ్స్ పత్రిక ఆగస్టు 22న విడుదల చేసింది. 100 మంది మహిళలతో కూడిన జాబితాలో జర్మనీ ఛాన్స్‌లర్ ఏంజెలా మెర్కెల్‌కు మొదటి స్థానం దక్కింది. గతేడాది ఆమె రెండోస్థానంలో ఉన్నారు. ద్వితీయస్థానంలో అమెరికా విదేశాంగ మంత్రి హిల్లరీ క్లింటన్, తృతీయ స్థానంలో బ్రెజిల్ అధ్యక్షురాలు దిల్మా రౌసెఫ్ నిలిచారు. అమెరికా అధ్యక్షుడు ఒబామా భార్య మిషెల్‌కు ఏడోస్థానం దక్కింది. ఈ జాబితాలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ ఆరోస్థానంలో నిలిచారు. గత సంవత్సరం ఈ జాబితాలో ఆమెకు ఏడోస్థానం దక్కింది. భారత్‌కు చెందిన ఇంద్ర నూయి(పెప్సీ కంపెనీ చైర్మన్) 12వ స్థానం, పద్మశ్రీ వారియర్ (సిస్కో సిస్టమ్స్ సీటీవో) 58వ స్థానం, చందా కొచ్చర్ (ఐసీఐసీఐ సీఈవో)59వ స్థానం, కిరణ్ మజుందార్‌షా(బయోకాన్ అధిపతి) 80వ స్థానంలో ఉన్నారు.

### పాలపుంతను పోలిన జంట గెలాక్సీలు

అంతరిక్షంలో మన పాలపుంతను పోలిన జంట గెలాక్సీలను ఖగోళ శాస్త్రవేత్తలు తొలిసారిగా కనుగొన్నారు. పాలపుంత తరహా వర్తులాకారపు గెలాక్సీలు విశాల విశ్వంలో సర్వసాధారణంగా కనిపించేవే అయినా, తాజాగా గుర్తించిన జంట గెలాక్సీల్లో మన పాలపుంత మాదిరి పోలికలు చాలా కనిపించాయి. ఈ జంట గెలాక్సీల్లోనూ పాలపుంత మాదిరిగానే ఉపగ్రహ కక్ష్యలూ, మగెలానిక్ మేఘాలూ ఉన్నాయి. పాలపుంతలో కనిపించే అతి అరుదైన మగెలానిక్ మేఘాలు తాజాగా గుర్తించిన జంట గెలాక్సీల్లోనూ కనిపిస్తున్నాయని వెస్టర్న్ ఆస్ట్రేలియా వర్సిటీకి చెందిన ఖగోళ శాస్త్రవేత్త డాక్టర్ ఆరోన్ రాబోథమ్ చెప్పారు.

### డబ్ల్యూటీవోలో చేరిన రష్యా




ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యూటీవో)లో రష్యా ఆగస్టు 22న చేరింది. 18 సంవత్సరాల చర్చల తర్వాత డబ్ల్యూటీవోలో రష్యా సభ్యత్వం పొందింది. గత జూలైలో రష్యా ఉభయ సభలు డబ్ల్యూటీవోలో చేరికకు ఆమోదం తెలిపాయి. అంతర్జాతీయ వాణిజ్యంలో సమతూకం సాధించేందుకు దిగుమతి సుంకాలు, సబ్సిడీలపై డబ్ల్యూటీవో ఆంక్షలు విధిస్తుంది. డబ్ల్యూటీవో చేరిక వల్ల తయారీ రంగం, వ్యవసాయ రంగం దెబ్బతింటాయని రష్యా ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

### ఇథియోపియా ప్రధాని జెనావీ మృతి

ఇథియోపియా ప్రధాన మంత్రి మెలెస్ జెనావీ(57) అనారోగ్యంతో ఆగస్టు 21న మరణించారు. జెనావీ 1995 నుంచి ఇథియోపియా ప్రధానిగా ఉన్నారు. 1991లో నియంత కల్నల్ మెంగిస్తూ హైలే మారియమ్ పాలన ముగియడంతో మెలెస్‌కు చెందిన ఇథియోపియన్ పీపుల్స్ రెవల్యూషనరీ డెమోక్రటిక్ ఫ్రంట్ అధికారంలోకి వచ్చింది. జెనావీ 1995, 2000, 2005, 2010 ఎన్నికల్లో విజయం సాధించారు.

## వార్తల్లో వ్యక్తులు

### మంత్రిగా జానారెడ్డి రికార్డు

ఆంధ్రప్రదేశ్‌లో సుదీర్ఘ కాలం మంత్రిగా కొనసాగి రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి కె. జానారెడ్డి రికార్డు నెలకొల్పారు. ఆగస్టు 24 నాటికి ఆయన మంత్రిగా 14 సంవత్సరాలు 11 నెలలు పదవీ కాలాన్ని చేసుకున్నారు. దీంతో 14 సంవత్సరాల 10 నెలల 28 రోజులు మంత్రిగా పని చేసిన కాసు బ్రహ్మానంద రెడ్డి రికార్డును అధిగమించారు. బ్రహ్మానంద రెడ్డి ముఖ్యమంత్రిగా కూడా పని చేశారు. జానారెడ్డి ఎన్టీఆర్ హయాంలో ఆపద్ధర్మంతో కలిపి మూడు పర్యాయాలు..1983, 1984, 1985లలో(6 ఏళ్ల రెండు రోజులు) మంత్రిగా పని చేశారు. తర్వాత 1992 కోట్ల విజయభాస్కర్ రెడ్డి మంత్రి వర్గంలో నాలుగో దఫా రెండేళ్ల రెండు నెలల నాలుగు రోజుల పాటు మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 2004 నుంచి మంత్రిగా కొనసాగుతున్నారు.

### నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ మృతి



చంద్రుడిపై కాలు మోపిన తొలి మానవునిగా చరిత్రకెక్కిన నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్(82) ఆగస్టు 25న అమెరికాలోని సిన్‌సిటీలో మరణించారు. 1969 జూలై 20న అపోలో 11 వ్యోమనౌక ద్వారా ఆర్మ్‌స్ట్రాంగ్ చంద్రునిపై అడుగుపెట్టారు. ఈయనతో పాటు చంద్రమండల యాత్రకు వెళ్లిన బృందంలో ఎడ్విన్ ఆల్డ్రిన్, మైకేల్ కాలిన్స్ ఉన్నారు. ఆర్మ్‌స్ట్రాంగ్, ఎడ్విన్ ఆల్డ్రిన్‌లు మూడు గంటలపాటు చంద్రుడిపై గడిపారు. నమూనాలు సేకరించి ఫోటోలు తీసారు. ఆర్మ్‌స్ట్రాంగ్ 1930 ఆగస్టు 5న అమెరికాలోని ఒహాయో రాష్ట్రంలో జన్మించారు.

### గంగాధర్‌కు సాహిత్య అకాడమీ అవార్డు

తెలుగు చిన్న కథల రచయిత వేంపల్లి గంగాధర్‌కు కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార్ అవార్డు లభించింది. ఆయన రాసిన 'మొలకల పున్నమి'కి ఈ పురస్కారం దక్కింది.

### గుంటూరు రైతుకు శాంసంగ్ అవార్డు

గుంటూరు జిల్లా రూపెనగుంట్లకు చెందిన తొండెపి గురవయ్య ప్రతిష్టాత్మక 'శాంసంగ్ ఇన్నోవేషన్ కోషంట్' అవార్డును సొంతం చేసుకున్నారు. వ్యవసాయ రంగంలో రైతులకు శ్రమ తగ్గించి, సమయాన్ని ఆదా చేసే 'హెర్బిస్ప్రేయర్'ను కనుగొన్నందుకు ఈ అవార్డు దక్కింది. నిర్వాహకులు ప్రకటించిన మొత్తం మూడు అవార్డుల్లో గురవయ్య రెండో స్థానం పొంది రూ.3 లక్షల ప్రైజ్‌మనీ, ధ్రువీకరణ పత్రం సాధించారు. కాగా ప్రథమ బహుమతిని (5 లక్షలు) అహ్మదాబాద్‌కు చెందిన యువ ఇంజనీర్ లియో మావ్‌లీ సొంతం చేసుకున్నారు. రక్తం గడ్డకట్టేందుకు ఉపకరించే 'ఆక్సియోస్టాట్'ను ఈయన రూపొందించారు. జీబీటీఎస్‌గా పిలిచే జియో థెర్మల్ ఏసీలను కనుగొన్న ముంబైకి చెందిన అరుణ్ షెనోయ్ మూడో ప్రైజ్(2 లక్షలు)ను సొంతం చేసుకున్నారు. వినూత్న ఆలోచనలతో నూతన ప్రయోగాలకు శ్రీకారం చుట్టే విభిన్న రంగాలవారికి ఏటా ఇచ్చే ఈ అవార్డులకు దేశవ్యాప్తంగా భారీ పోటీ ఉంటుంది. గురవయ్య కనుగొన్న ఈ 'హెర్బిస్ప్రేయర్' పరికరం వల్ల తక్కువ సమయంలో, కూలీల అవసరం లేకుండా ట్రాక్టర్‌కు అమర్చుకుని రైతులు విత్తనాలను జల్లుకోవచ్చు.



send your feedback to: sakshieducation@gmail.com

Ask the expert

# ఎంబీఏ(ఐటీ) కోర్సును ఆఫర్ చేస్తున్న ఐఐఎంలు?



QA

టి. మురళీధరన్
టి.ఎం.ఐ. నెట్‌వర్క్

**బీటెక్ (సీఎస్) పూర్తి చేశాను. గేమింగ్‌లో కెరీర్‌ను ప్రారంభించాలనుకుంటున్నాను. సంబంధిత వివరాలను తెలపండి?**

– వీఆర్‌కే.రెడ్డి, నల్గొండ

ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో గేమింగ్ రంగానికి మంచి డిమాండ్ ఉంది. కంప్యూటర్, మొబైల్స్, ఇంటర్నెట్ తదితర గాడ్జెట్స్ ఫలితంగా గేమింగ్‌కు ప్రాధాన్యత పెరిగింది. ఈ క్రమంలో నూతన గేమ్స్ డెవలప్, సంబంధిత రంగాల్లో డిమాండ్‌కు సరిపడ మానవ వనరులు అందుబాటులో లేవు. దీంతో ఈ రంగాన్ని కెరీర్‌గా ఎంచుకోవాలనుకునే వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతుంది. సృజనాత్మకత, టెక్నాలజీతో ప్రయోగాలు చేయాలనుకునే వారికి ఈ రంగం సూట్ అవుతుంది. ఒక గేమ్‌ను రూపొందించే క్రమంలో.. స్టోరీ రాయడం, డిజైనింగ్, ప్రోగ్రామింగ్, యానిమేషన్ అండ్ టెస్టింగ్ వంటి పలు దశలు ఉంటాయి. గేమ్ డిజైనర్, ప్రోగామర్స్, ఆర్టిస్ట్స్, నెట్ వర్క్ ప్రోగ్రామర్, స్క్రిప్ట్ రైటర్, ఆడియో/సౌండ్ ఇంజనీర్, గేమ్ టెస్టర్, గేమ్ మేనేజ్‌మెంట్ వంటి ఉద్యోగావకాశాలు లభిస్తాయి. గేమింగ్‌కు సంబంధించి సర్టిఫికెట్ నుంచి పీజీ డిప్లొమా వరకు కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఈ కోర్సులను పూర్తి చేసి గేమింగ్‌లో కెరీర్‌ను ప్రారంభించవచ్చు.

**ఆఫర్ చేస్తున్న ఇన్‌స్టిట్యూట్‌లు:**

- ఐకాట్ డిజైన్ అండ్ మీడియా కాలేజ్- హైదరాబాద్
  వివరాలకు: www.icat.ac.in
- ఎరీనా యానిమేషన్-హైదరాబాద్
  వివరాలకు: www.arena-multimedia.com
- పికాసో యానిమేషన్ కాలేజ్-హైదరాబాద్
  వివరాలకు: www.picasso.co.in
- ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ-తమిళనాడు
  వివరాలకు: www.srmuniv.ac.in

**ఎంబీఏ(ఐటీ)ని ఆఫర్ చేస్తున్న ఐఐఎం లేవి?**

– చంద్ర, మహబూబ్‌నగర్

ప్రస్తుతం జాబ్ మార్కెట్‌లో ఎంబీఏ(ఐటీ) డిగ్రీకి మంచి డిమాండ్ ఉంది. ఈ కోర్సు పూర్తి చేసిన వారికి మైక్రో సాఫ్ట్, టీసీఎస్, ఇన్ఫోసిస్, ఐబీఎం వంటి టాప్ ఎంఎన్‌సీలలో.. ప్రాజెక్ట్ మేనేజర్, సిస్టమ్ డిజైనర్/ఆర్కిటెక్ట్, డేటా అనాలిస్ట్, అప్లికేషన్ సపోర్ట్ అనలిస్ట్, సొల్యూషన్ ఆర్కిటెక్ట్, ప్రాసెస్ మేనేజర్ వంటి అవకాశాలు ఉంటాయి. పలు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం)లు ఎంబీఏ(ఐటీ)/తత్సమాన కోర్సులను ఆఫర్ చేస్తున్నాయి. క్యాట్ స్కోర్, జీడీ/రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ప్రవేశం ఉంటుంది.

**ఆఫర్ చేస్తున్న ఇన్‌స్టిట్యూట్‌లు:**

- ఐఐఎం-అహ్మదాబాద్
  కోర్సు: పీజీపీ (కంప్యూటర్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్)
  వివరాలకు: www.iimahd.ernet.in
- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్-బెంగళూరు
  కోర్సు: పీజీపీ ఇన్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజ్ మేనేజ్‌మెంట్
  వివరాలకు: www.iimb.ac.in
- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్- కోజికోడ్
  వివరాలకు: www.iimk.ac.in
- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్-కోల్‌కతా
  కోర్సు: పీజీపీ ఇన్ కంప్యూటర్ ఎయిడెడ్ మేనేజ్‌మెంట్
  వివరాలకు: www.iimcal.ac.in
- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్-లక్నో
  వివరాలకు: www.iiml.ac.in

**క్యాడ్, కామ్ కోర్సులను ఆఫర్ చేస్తున్న ఇన్‌స్టిట్యూట్ లేవి?**

– రాజు, ఉప్పల్

గతంలో బిల్డింగ్‌లు, కాంప్లెక్స్‌లు, మెషిన్స్ డిజైన్‌ను డ్రాయింగ్ బోర్డుపై రూపొందించేవారు. ప్రస్తుతం టెక్నాలజీ అందుబాటులోకి రావడంతో ఈ పనులను ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో కంప్యూటర్‌పై డిజైన్ చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రాచుర్యంలోకి వచ్చిన కోర్సులు.. కంప్యూటర్ ఎయిడెడ్ డిజైన్(క్యాడ్)/కంప్యూటర్ ఎయిడెడ్ మ్యాను ఫ్యాక్చరింగ్ (క్యామ్). ఆర్కిటెక్చర్, మెకానికల్, సివిల్ ఇంజనీరింగ్, ఆటోమొబైల్ రంగాల్లో ఈ కోర్సులు చేసిన వారికి అవకాశాలు ఉంటాయి.

**సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్-హైదరాబాద్,** పోస్ట్‌గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ క్యాడ్/క్యామ్ ఫర్ టూల్ ఇంజనీరింగ్(పీజీడీసీటీఈ), మాస్టర్ సర్టిఫికెట్ ఇన్ క్యాడ్/కామ్, మెకానికల్ క్యాడ్/కామ్, అడ్వాన్స్‌డ్ క్యాడ్/కామ్ కోర్సులను ఆఫర్ చేస్తుంది.
వివరాలకు: citdindia.org

**సికింద్రాబాద్‌లోని క్యాడ్ సెంటర్** ఆటోక్యాడ్ 2డీ, ప్రోఈ అండ్ అనాలసిస్ వంటి క్యాడ్/కామ్ సాఫ్ట్‌వేర్ కోర్సులను అందిస్తుంది. వివరాలకు:www.caddcentre.ws

**స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్(ఎస్‌బీటీఈటీ)**కు అనుబంధంగా ఉన్న జైత్ర ఇంజనీరింగ్ సర్వీసెస్ ప్రొఫెషనల్ ఆటోక్యాడ్ ట్రైనింగ్ కోర్సును ఆఫర్ చేస్తుంది. వివరాలకు: www.jytra.com

**క్యూ క్యాడ్ ఇంజనీరింగ్ క్యాడ్ సర్వీసెస్-హైదరాబాద్,** క్యాడ్/ కామ్ / సీఏఈ/ జీఐఎస్ కోర్సుల్లో ప్రాజెక్ట్ ఓరియెంటెడ్ ట్రైనింగ్‌ను అందజేస్తుంది.
వివరాలకు: htpp://qcadd.com

**ఎంబీఏ(అగ్రి బిజినెస్)ను అందిస్తున్న సంస్థలేవి?**

– కుమార్, తిరుపూరు

వ్యవసాయ, సంబంధిత ఉత్పత్తుల మార్కెటింగ్, ప్రొడక్షన్, ట్రేడింగ్ విభాగాల్లో పనిచేయడానికి ఎంబీఏ(అగ్రి బిజినెస్) చేసిన అభ్యర్థులు అవసరం. ఇందులో అగ్రికల్చర్ ఫైనాన్స్/బ్యాంకింగ్, ట్రేడ్ పాలసీ, అగ్రో ప్రాసెసింగ్, మార్కెటింగ్, లాజిస్టిక్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ మేనేజ్‌మెంట్ తదితర స్పెషలైజేషన్స్ ఉంటాయి. ఈ కోర్సు పూర్తి చేస్తే వ్యవసాయ, అనుబంధ పరిశ్రమలు, పెస్టిసైడ్స్, ఫెర్టిలైజర్స్ సంబంధి పరిశ్రమల్లో మార్కెటింగ్ మేనేజర్, ఫ్లోర్ మిల్ మేనేజర్, రీసెర్చ్ అనలిస్ట్, అగ్రికల్చర్ లోన్ ఆఫీసర్, మీట్ మార్కెటింగ్ మేనేజర్ వంటి వివిధ హోదాల్లో స్థిరపడొచ్చు.

**ఆఫర్ చేసున్న ఇన్‌స్టిట్యూట్‌లు:**

- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్-హైదరాబాద్.
  వివరాలకు: www.manage.gov.in
- సింబయాసిస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ -పుణే వివరాలకు: www.siib.ac.in
- అన్నామలై యూనివర్సిటీ – తమిళనాడు
  వివరాలకు: htpp://annamalaiuniversity.ac.in
- యూనివర్సిటీ ఆఫ్ కేరళ – త్రిసూర్
  వివరాలకు: www.kau.edu

**ఆస్క్ అజ్... ask us...**

ఇంజనీరింగ్ బ్రాంచ్‌లు, కాలేజీ ఎంపిక, బ్రాంచ్ సెలక్షన్, కెరీర్ స్కోప్, సాఫ్ట్ స్కిల్స్, ప్లేస్‌మెంట్స్‌పై
మీ సందేహాలకు
టీసీఎస్ వైస్ ప్రెసిడెంట్ వి. రాజన్న
సమాధానాలిస్తారు.
మీ సందేహాలను పంపించండి...
sakshieducation@gmail.com

## సక్సెస్ స్పీక్స్

# న్యూరోసర్జన్ అవుతా!!



**గ్రామీణ ప్రాంత విద్యార్థులు వైద్యవిద్యలో రాణించడం అంత సులువేం కాదు. పోటీ తీవ్రంగా ఉండే జాతీయస్థాయి వైద్యప్రవేశ పరీక్షలో సీటు సాధించాలంటే.. కఠోర శ్రమ అవసరం. దాంతోపాటు కాన్సెప్ట్యువల్‌గా చదవాలి. చిన్నప్పటినుంచి వైద్యవృత్తిలో ప్రవేశించాలనేది నా కోరిక. భవిష్యత్తులో న్యూరాలజిస్ట్‌గా పేరు తెచ్చుకోవడమే ధ్యేయం అంటున్నారు కామిరెడ్డి అనూష. అత్యంత కష్టంగా భావించే ఎయిమ్స్ ప్రవేశ పరీక్షలో దక్షిణభారతదేశం నుంచి ఎంపికైన ఇద్దరు విద్యార్థుల్లో ఈమె ఒకరు. అనూషతో సాక్షి భవిత సక్సెస్ టాక్...**

మాది వరంగల్ జిల్లా. టెన్త్‌వరకు అక్కడే చదివాను. ప్లస్‌టూ హైదరాబాద్‌లో పూర్తి చేశాను. నాన్న ఈఎన్‌టీ స్పెషలిస్ట్. అమ్మ గైనకాలజిస్ట్. చిన్నప్పటి నుంచీ వీరి ప్రోత్సాహం ఉండేది. దీని వల్ల కఠినమైన పరీక్షల్లో కూడా ఇబ్బందిపడకుండా అనుకున్న విజయాలు సాధించగలిగాను.

**లక్ష్యం సాధించా:**

వైద్యవిద్యనందించడంలో ఎయిమ్స్ దేశంలోనే ప్రతిష్టాత్మక సంస్థ. ఇక్కడ ఎంబీబీఎస్ చేస్తే భవిష్యత్తు అద్భుతంగా ఉంటుంది. అందుకే ఎలాగైనా ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నా. ప్రణాళికాబద్ధంగా ప్రిపేర్ కావడంతో మంచి మార్కులు వచ్చాయి. ఎయిమ్స్ ఈ ఏడాది నుంచి ఢిల్లీ క్యాంపస్‌కు అనుబంధంగా పాట్నా, భువనేశ్వర్, రుషికేష్, రాయపూర్‌లో కొత్త క్యాంపస్‌లు ప్రారంభిస్తోంది. వీటిలో ఏదో ఒక క్యాంపస్‌లో సీటు వచ్చే అవకాశం ఉంది. ఎయిమ్స్‌లో సీటు సాధించాలనే లక్ష్యం నెరవేరినందుకు సంతోషంగా ఉంది.

**అందుకే మెడిసిన్:**

వైద్యవిద్య ద్వారా పది మందికి ఉపయోగపడవచ్చు. ఇంట్లో అమ్మానాన్న కూడా వైద్యులే. దాంతో స్వతహాగానే నాక్కూడా ఆసక్తి ఏర్పడింది.

ఇంట్లో ప్రోత్సాహంతో మెడిసిన్‌ను కెరీర్‌గా ఎంచుకోవాలని నిర్ణయించుకున్నా. పదో తరగతి తర్వాత సైన్స్ అంటే ఆసక్తి పెరిగింది. పైగా ఇందులో ఎప్పటికప్పుడు కొత్త విషయాలు నేర్చుకోవచ్చు. బయాలజీ ఇష్టమైన సబ్జెక్టు. ప్లస్‌టూ (మార్కులు 979) తర్వాత ఎంసెట్‌కు బాగా ప్రిపేర్ కావడంతో 23వ ర్యాంకు వచ్చింది.

**పలు ప్రవేశ పరీక్షలు రాశా:**

జాతీయస్థాయి మెడిసిన్ ప్రవేశ పరీక్షలు అంటే ఆసక్తి. వీటివల్ల పోటీ ప్రపంచంలో మనం ఎక్కడున్నామో, మన స్థాయి ఏంటో తెలుస్తుంది. ఎంసెట్‌తోపాటు జాతీయ స్థాయిలో నిర్వహించే జిప్‌మర్, బీహెచ్‌యూ, ఎయి మ్స్ వంటి పరీక్షలు రాశాను. ప్రస్తుతం ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్‌లో చేరాను. ఎయిమ్స్‌లో సీటు ఏ క్యాంపస్‌లో వస్తుంది? అనే దాన్నిబట్టి చేరాలా? వద్దా? నిర్ణయించుకుంటాను.

**సీట్లు తక్కువ.. అందుకే బాగా కష్టపడ్డా:**

ఎయిమ్స్‌లో మెడిసిన్ సీట్లు చాలా తక్కువ. అసాధారణంగా కష్టపడితేనేగాని సీటు లభించదు. అందుకే రోజుకు 6 నుంచి 8 గంటలకుపైగా చదివాను. ఎంసెట్ పూర్తయ్యాక దృష్టంతా ఈ పరీక్షపైనే పెట్టాను. ప్రధానంగా పాత ప్రశ్నపత్రాలను ఫాలో అవడంతో పరీక్ష విధానంపై అవగాహన వచ్చింది. పైగా ఈ ఏడాది పరీక్ష పాత సిలబస్ ప్రకారం నిర్వహించడం కలిసి వచ్చింది. వచ్చే సంవత్సరం నుంచి కొత్త సిలబస్‌తో నీట్ ఉంటుంది. దాంతో ఈసారి ఎలాగైనా సీటు సాధించాలనుకుని ప్రిపేరయ్యా. సబ్జెక్టులను కాన్సెప్ట్యువల్‌గా ప్రిపేర్ కావడంతో రివిజన్ కొంచెం సులువైంది. ఫిజిక్స్ సబ్జెక్టుపై బాగా దృష్టిసారించా. జీకే చాలా కష్టంగా ఉండడంతో కొన్ని అటెంప్ట్ చేయలేకపోయా. నెగెటివ్ మార్కింగ్ ఉండడంతో తెలిసిన ప్రశ్నలకే సమాధానాలు రాశాను. తెలియని ప్రశ్నలను వదిలేశా.

**ఇలా ప్రిపేరైతే మేలు:**

సైన్స్ సబ్జెక్టులను అర్థం చేసుకుని కాన్సెప్ట్యువల్‌గా చదివితే పట్టు దొరుకుతుంది. దీంతో ఎలాంటి ప్రవేశపరీక్షల్లోనైనా రాణించడానికి అవకాశం ఉంటుంది. ఎంసెట్, ఎయిమ్స్ ప్రవేశపరీక్షల్లో చాలా తేడా ఉంటుంది. ఎయిమ్స్ పరీక్షకు బాగా ప్రిపేరైతేనే సీటు ఆశించాలి. పైగా ఇక్కడ నెగటివ్ మార్కింగ్, సీట్లు తక్కువ, సిలబస్ పరిధి చాలా ఎక్కువ. కాబట్టి ఎంసెట్‌తో దీన్ని పోల్చలేం. కాకపోతే సబ్జెక్టును బట్టీ పట్టకుండా అర్థం చేసుకుని చదివితే విజయం ఎవరికైనా దక్కుతుంది. పోటీ ఎక్కువగా ఉండే ఈ పరీక్షల్లో సబ్జెక్టు సందేహాలు ఏ చిన్నవి వచ్చినా వదలకుండా చదవాలి. ప్రతి విషయాన్ని బాగా విశ్లేషించుకోవాలి. ఎయిమ్స్ లాంటి పరీక్షలకు పాత ప్రశ్నపత్రాలను ఫాలో అవడం చాలా ముఖ్యం. కానీ చాలామంది విద్యార్థులు ఈ విషయంలో నిర్లక్ష్యంగా ఉంటారు. అలాగే జీకే పార్ట్ కొంచెం కఠినంగానే ఉంటుంది. కరెంట్ అఫైర్స్ అవసరం లేదనుకుంటే స్కోరింగ్‌లో వెనుకబడిపోతారు.

**న్యూరోసర్జన్ అవుతా:**

న్యూరోసర్జన్ కోర్సు, సబ్జెక్టు అంటే ఆసక్తి ఉంది. ఎంబీబీఎస్ పూర్తయ్యాక పీజీ చేసి న్యూరోసర్జన్ కావాలనేదే నా కోరిక. ఎయిమ్స్, జిప్‌మర్‌లో ఎంబీబీఎస్ చేసిన విద్యార్థులకే పీజీ సీట్లలో ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. బయట విద్యార్థులకు అవకాశాలు తక్కువ. అయినాసరే జిప్‌మర్ పాండిచ్చేరి, లేదా చండీగఢ్‌లో పీజీ చేస్తా.